బమ్మెర పోతనామాత్య ప్రణీత

# శ్రీమహాభాగవతము

సరళ వ్యాఖ్యానసహితం

## ఎనిమిదవ సంపుటము

**11, 12 స్కంధములు**


వ్యాఖ్యాత

డా॥ గల్లా చలపతి

ప్రధాన సంపాదకులు

డా॥ సముద్రాల లక్ష్మణయ్య



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2021

**Bammera Potanamatya Praneeta**
**SRI MAHABHAGAVATAMU, with Commentary**
**Volume - VIII (Skandhas - 11 & 12)**

*Author :* **Potana Mahakavi**

*Commentary by*
**Dr. Galla Chalapathi**

*Edited by*
**Dr. Samudrala Lakshmanaiah**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No. 1244


*First Edition* : 2017
*Revised Edition* : 2021


*Copies* :


*Published by*
**Dr. K.S.Jawahar Reddy, I.A.S.,**
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.


*D.T.P.*
Publications Division
T.T.D., Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507









# తొలిపలుకు

సనాతన ధర్మప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు పూర్వంనుంచి విశేషమైన సేవలందిస్తున్నది. హైందవ ధర్మానికి మూలాధారాలైన వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, రామాయణ, భారత, భాగవతాది ధార్మిక గ్రంథాలు విరివిగా ప్రచురిస్తూ ప్రజాబాహుళ్యానికి అందజేస్తున్నది. ఇదివరకే మతద్వయ వ్యాఖ్యానంతో వాల్మీకి రామాయణాన్ని, మతత్రయ వ్యాఖ్యానంతో వ్యాసభాగవతాన్ని అందించింది. అలాగే శ్రీవేదవ్యాసప్రణీత శ్రీమన్మహాభారత మూలాన్ని సంస్కృత ఆంధ్ర లిపులలో 18 సంపుటాలలో అందించింది. ప్రస్తుతం తాత్పర్యసహితంగా అష్టాదశ పురాణాల తెలుగుసేత మహాయజ్ఞం కొనసాగుతూ ఉంది. వీటిలో ఇప్పటికే 4 పురాణాలు పాఠకలోకానికి అందాయి.

ఈ ధార్మిక ప్రచార మహోద్యమంలో భాగంగా తి.తి.దేవస్థానాలు కవిత్రయ మహాభారతం తరహాలో బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతాన్ని సరళవ్యాఖ్యాన సహితంగా తెలుగు ప్రజలకు అందించాలని సంకల్పించి ఈ బృహత్ సాహితీయజ్ఞాన్ని చేపట్టింది. మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారి ప్రధాన సంపాదకత్వ పర్యవేక్షణలో సుప్రసిద్ధులైన 33మంది పండితులచేత 12 స్కంధాల బమ్మెర పోతన భాగవతానికి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 8 సంపుటాలుగా వెలువరించింది. పోతన శ్రీమహాభాగవతానికి తెలుగులో సమగ్రంగా వెలువడిన ఏకైక వ్యాఖ్యానం ఇది. ఈ శ్రీమహాభాగవత పురాణం 8 సంపుటాలను 2017వ సంవత్సరంలో ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన సీతారామ కల్యాణ మహోత్సవం సందర్భంగా నాటి ఉభయ తెలుగు రాష్ట్రాల రాజ్యపాలకులు (గవర్నర్) గౌ॥ శ్రీ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ గారు ఆవిష్కరించి తెలుగుజాతికి కానుకగా సమర్పించారు.

పాఠకులందరికీ అందుబాటులో ఉండేటట్లుగా చాలా తగ్గింపు ధరకే ఈ భాగవతాన్ని తి.తి.దేవస్థానాలు అందించింది. పాఠకుల విశేషాదరణకు పాత్రమైన పోతన శ్రీమహాభాగవతం తొలిముద్రణ ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి.

పాఠకుల అక్కర తీర్చేందుకు మళ్ళీ పోతన భాగవత పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది. కాగా తొలిముద్రణలో దొరలిన దొసగులను పరిశీలించి సవరించుటకు గాను గతంలో భాగవత స్కంధాలను పరిశీలించిన సంపాదకమండలి సభ్యులు లబ్ధప్రతిష్ఠులు అయిన

**మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

**ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ**

**డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**

**డా॥ కె.వి.సుందరాచార్యులు**
**డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**
**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**
**డా॥ ధూళిపాళ రామకృష్ణ శర్మ** గారలకు ఈ బాధ్యతలు అప్పగించింది.

ఈ పండిత మండలి మరోమారు పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు చేసిన తరువాత 8 సంపుటాల బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతమును భక్తులైన పాఠకులకు అందజేస్తున్నాము. రసజ్ఞులైన పాఠకులు యథాపూర్వం మా యీ ప్రయత్నాన్ని ఆదరించగలరనీ, పాఠకులందరికీ ఆ దేవదేవుని ఆశీస్సులందగలవనీ ఆశిస్తున్నాము.

*సదా శ్రీవారి సేవలో*

**కార్యనిర్వహణాధికారి**
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

# సరళవ్యాఖ్యాన సహిత
# బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం
# ద్వితీయముద్రణ పూర్వాపరాలు

**భా**రతదేశం వేదభూమి, పుణ్యభూమి, కర్మభూమి. ఈ భూమిపై ఎందరో దేవతలు, మహర్షులు, మహాత్ములు అవతరించారు. యావత్ ప్రపంచానికి ఆదర్శమైన ధర్మాలను బోధించారు. ఆచరించి చూపించారు. ఆదర్శప్రాయులైనారు. వైదిక వాఙ్మయంలో వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు విశిష్టమైనవి. ధర్మప్రచారంలోనూ, ధర్మప్రబోధంలోనూ వాటి పాత్ర చాలా ప్రముఖమైనది.

తి.తి.దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా వైదికసాహిత్య మణిహారాలైన వేద పురాణేతిహాసాలను పాఠకలోకానికి అందించడం ద్వారా ఆసేతు హిమాచలం ధర్మప్రచారం చేయవచ్చునన్న సంకల్పంతో వేదాలు, రామాయణం, భారత భాగవతాది మహోన్నత గ్రంథాలను ముద్రిస్తున్నది.

ఇందులో భాగంగా వాల్మీకి రామాయణం, వేదవ్యాస ప్రణీత భారత భాగవతాలతోపాటు తొట్టతొలుత తెలుగు ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రమైన బమ్మెర పోతన ప్రణీత శ్రీమహాభాగవతాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి నేతృత్వంలో 1987లో తాత్పర్య సహితంగా ముద్రించింది. కవిత్రయవిరచిత శ్రీమదాంధ్ర మహాభారతాన్ని 15 సంపుటాలలో సమగ్ర వ్యాఖ్యానంతో 2005లో అందించిన తి.తి.దేవస్థానాలు, పోతన భాగవతాన్ని కూడా కవిత్రయ భారతం తరహాలో అందించాలని సంకల్పించింది. బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవత వ్యాఖ్యాన బృహత్ యజ్ఞంలో సుప్రసిద్ధులైన 33 మంది పండితులు ఋత్విక్కుల పాత్రను పోషించారు. ఈ భాగవత వ్యాఖ్యాన యజ్ఞం నిర్వహణకు గాను నాటి తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ కె.వి.రమణాచారి ఐ.ఏ.ఎస్., ఆమోద ముద్రవేయగా 2015లో డా॥ డి. సాంబశివరావు ఐ.ఏ.ఎస్., గారి కార్యనిర్వాహకత్వంలో నాటి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోల భాస్కర్ ఐ.ఏ.ఎస్. గారు భాగవత వ్యాఖ్యాన మహాయజ్ఞం పూర్తికావించడంలో ప్రత్యేకశ్రద్ధ చూపుతూ విశేషంగా శ్రమించారు. 2007లో ప్రారంభమైన ఈ భాగవత వ్యాఖ్యాన బృహత్ యజ్ఞం 2017లో మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారి ప్రధాన సంపాదకత్వంలో సంపూర్తి అయి 12 స్కంధాల శ్రీమహాభాగవతం 8 సంపుటాలలో సరళవ్యాఖ్యానంతో తొలిముద్రణను సంతరించుకుంది.

2017లో ఆంధ్రుల అయోధ్యగా పేరొందిన ఒంటిమిట్టలో వెలిసిన శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవంలో భాగంగా నాటి ఉభయ తెలుగు రాష్ట్రాల రాజ్యపాలకులు (గవర్నర్) అయిన గౌ॥ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ గారి చేతులమీదుగా అది ఆవిష్కృతమై పాఠకలోకానికి అందింది.

పాఠకుల విశేషాదరణకు పాత్రమైన బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం తొలిముద్రణ ప్రతులన్నీ అనతికాలంలోనే పూర్తిగా చెల్లిపోయాయి. పాఠకుల ఆసక్తిని గ్రహించి మళ్ళీ భాగవత పునర్ముద్రణ ఆవశ్యకతను దేవస్థానం గుర్తించింది.

ఈలోపు నిరంతర సాహితీ పరిశోధకులు, వృత్తిరీత్యా ఇంజనీరు అయిన శ్రీ పుత్తా పుల్లారెడ్డిగారు భాగవత తొలిముద్రణను నిశితంగా పరిశీలించి అందులోని సవరణలను విశేషంగా నాటి తి.తి.దే. ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారికి సమర్పించారు. 2019లో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి వారి సూచనల మేరకు నాటి ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా॥ తాళ్లూరి ఆంజనేయులు అదివరకు భాగవతవ్యాఖ్యానాన్ని పరిశీలించిన సంపాదకమండలి సభ్యులైన

**మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య**
**ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ**
**డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**
**డా॥ కె.వి.సుందరాచార్యులు**
**డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**
**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**
**డా॥ ధూళిపాళ రామకృష్ణ శర్మ** గారలకు మరోమారు పరిశీలించి శ్రీ పుత్తాపుల్లారెడ్డిగారి సవరణలతో సరిచూడమని బాధ్యతలు అప్పగించారు. శ్రీ పుల్లారెడ్డి గారి సవరణలలో అవసరమైన వాటిని సంపాదకమండలి వారు స్వీకరిస్తూ, తక్కిన అన్వయ దోషాలు, భాషాదోషాలు, భావదోషాలు, ముద్రారాక్షసాలను, శైలీభేదాలను కూడా వీలైనంతవరకు గుర్తించి సవరించారు. సంశోధిత ప్రతిని రూపొందించారు.

సంపాదకమండలి సూచించిన సవరణలను ప్రచురణల విభాగం ఉపసంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్యులు వారి సంయోజకత్వంలో కార్యాలయపండితులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, డా॥ ముదివేడు ప్రభాకరరావు, విద్వాన్ కట్టా నరసింహులు, డా॥ అంబటిపూడి నాగభూషణం గారలు విశేషంగా శ్రమించి, సవరించి, మలిముద్రణకు సంశోధిత ప్రతిని సిద్ధం చేశారు.

సరళవ్యాఖ్యాన సహిత బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం ద్వితీయ ముద్రణను వేగవంతం చేసి ప్రజాబాహుళ్యానికి అందించడంలో విశేషంగా కృషిచేసిన నాటి తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులు డా॥ డి.సాంబశివరావు ఐ.ఏ.ఎస్., శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ ఐ.ఏ.ఎస్. గార్లకు, ప్రస్తుత శ్రీకార్యనిర్వహణాధికారులు డా॥ కె.ఎస్.జవహర్ రెడ్డి ఐ.ఏ.ఎస్. గారికి, నాటి సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ పోల భాస్కర్ ఐ.ఏ.ఎస్., శ్రీ కె.ఎస్.శ్రీనివాసరాజు ఐ.ఏ.ఎస్., శ్రీ బి.లక్ష్మీకాంతం ఐ.ఏ.ఎస్., శ్రీ బసంత్ కుమార్ ఐ.ఏ.ఎస్., గారలకు, ప్రస్తుత అదనపు కార్యనిర్వహణాధికారులు శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్. గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

శ్రీమహాభాగవతం ద్వితీయముద్రణలో నాటినుండి నేటివరకు తమ అమూల్య సహకారాలందించిన ఉన్నతాధికారులకు, అధికార ప్రముఖులకు, అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

వృత్తిరీత్యా ఇంజనీరు, ప్రవృత్తిరీత్యా నిరంతర సాహితీ కృషీవలులు, సాహితీ పరిశోధకులు అయిన శ్రీ పుత్తాపుల్లారెడ్డి గారు తి.తి.దే. భాగవత ప్రథమ ముద్రణను ఆమూలాగ్రం పరిశీలించి విశేషంగా సవరణలను సూచించి పరోక్షంగా భాగవత సంశోధిత ప్రతి రూపొందించడానికి కారకులైనారు. వారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

సరళవ్యాఖ్యాన సహిత బమ్మెరపోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవతం పునర్ముద్రణలో అవసరమైన సహకారమందించిన సంపాదక మండలి సభ్యులకు, భాగవత ప్రధాన సంపాదకులు, తి.తి.దే. పురాణ ఇతిహాస ప్రాజెక్టు విశ్రాంత ప్రత్యేకాధికారి మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారికి, నాటి ప్రచురణలవిభాగ ప్రత్యేకాధికారి డా॥ తాళ్లూరి ఆంజనేయులు గారికి కృతజ్ఞతలు. భాగవత సంశోధిత ప్రతి పునఃపరిశీలనలో సహకరించిన సంపాదకమండలి సభ్యులు ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ, డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, డా॥ కె.వి.సుందరాచార్యులు, డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డా॥ ధూళిపాళ రామకృష్ణ శర్మ గారలకు ప్రత్యేక ధన్యవాదాలు.

భాగవత పునర్ముద్రణ విషయంలో అడుగడుగునా చేదోడు వాదోడుగా ఉంటూ పూర్తి సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగ ఉపసంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్యులు గారికి, శుద్ధ ప్రతిని సిద్ధం చేయడంలో విశేషంగా కృషిచేసిన కార్యాలయపండితులు శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, డా॥ ముదివేడు ప్రభాకరరావు, విద్వాన్ కట్టా నరసింహులు, డా॥ అంబటిపూడి నాగభూషణం గారలకు, కార్యాలయ సిబ్బందికి, కార్యాలయ డి.టి.పి. ఆపరేటర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు

ఈ బృహద్గ్రంథ ముద్రణలో ఎంతగానో సహకరిస్తున్న దేవస్థానం ముద్రణాలయాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.

భగవంతుని దివ్యలీలావిశేషాలను, భగవద్భక్తుల చరిత్రలను తెలిపే వ్యాసభాగవతాన్ని తెలుగువారికి అందించడం పోతనామాత్యుడు తనకు కలిగిన పుణ్యవిశేషంగా భావించాడు. అంతటి శ్రీమహాభాగవతం తెలుగువారికి లభించిన అమృత ఫలం. ఆ భాగవత ఫలరసాన్ని పాఠకులు ఈ వాఖ్యానంద్వారా ఆస్వాదిస్తారనీ, భాగవత సందేశాన్ని పారాయణ శ్రవణాలద్వారా గ్రహించి మోక్షగాములౌతారని ఆశిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో..*

**పి. రామరాజు**

ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం

# ముందుమాట

**భా**రతీయ సనాతన వాఙ్మయంలో అద్భుతమైన ఆధ్యాత్మిక గ్రంథాలు చాలా ఉన్నాయి. అందులో అమూల్యమైన రత్నాల్లాగా శ్రీమద్రామాయణ, శ్రీ మహాభారత, శ్రీమద్భాగవత గ్రంథాలు సంస్కృత వాఙ్మయ ప్రపంచంలో ప్రకాశిస్తున్నాయి.

వాటిల్లో శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆదికవి వాల్మీకి మహర్షి ప్రణీతం. కాగా ఇక మిగిలిన భారత భాగవత గ్రంథాలు రెండూ కృష్ణద్వైపాయనుడైన శ్రీవ్యాసమహర్షి రచించినవి.

తి.తి.దేవస్థానం ధార్మిక సాహిత్య ప్రచురణలో భాగంగా ఇప్పటికే సంస్కృత శ్రీమద్రామాయణ కావ్యాన్నీ, తెలుగు కవిత్రయ మహాభారత కావ్యాన్నీ సవ్యాఖ్యానంగా ప్రచురించింది.

అదేవరుసలో పోతన మహాకవి రచించిన తెలుగు భాగవతకావ్యాన్ని కూడా తెలుగువారికి అందించాలన్న సదాశయంతో ప్రముఖ పండితులు డా॥ కరుణశ్రీ గారి ప్రధాన సంపాదకత్వంలో సరళమైన తాత్పర్యంతో పోతన భాగవతగ్రంథాన్ని ఐదుసంపుటాలుగా దేవస్థానం అందించింది. ఈ గ్రంథం పాఠకుల విశేషాదరణకు పాత్రమై పలు ముద్రణలను పొందింది.

ఆ తర్వాత కొందరు పండితుల సలహామేరకు, పాఠకుల అభ్యర్థనలమేరకు, 'కవిత్రయ భారతం' మాదిరిగానే పోతన మహాకవి భాగవతాన్ని కూడా అందరికీ సులభంగా అర్థం అయ్యేట్లు సరళమైనశైలిలో వ్యాఖ్యానాన్ని అందించాలనే లక్ష్యంతో దేవస్థానం ఆ కార్యక్రమాన్ని చేపట్టింది.

ప్రస్తుతం బమ్మెర పోతనగారి భాగవత గ్రంథం, ముప్పైమూడు మంది పండితులు సరళవ్యాఖ్యానాన్ని అందించగా ప్రముఖ సాహితీవేత్తలు డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారి ప్రధానసంపాదకత్వంలో తయారయ్యింది. ఈ వ్యాఖ్యానగ్రంథం తయారీలో కృషిచేసిన దేవస్థానం ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి మరియు పోతన భాగవత వ్యాఖ్యాన పర్యవేక్షకులు, సమన్వయకర్త శ్రీ ప్రయాగ రామకృష్ణ గారికీ, వారి సహాయకులు, ఉపసంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్య గారికీ, ఈ పోతన భాగవత వ్యాఖ్యానగ్రంథ ప్రధాన సంపాదకులు డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారికీ, వ్యాఖ్యాతలకూ, సంపాదకమండలి సభ్యులకూ, సహాయసహకారాలందించినవారికీ, కన్సల్టెంట్లందరికీ, ఈ గ్రంథాన్ని చక్కగా ముద్రింపజేసిన తి.తి.దేవస్థానం ప్రెస్సు వారందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. పోతన పద్యాలకు వ్యాఖ్యానాలనదగిన చక్కనైన బాపుగారి రేఖాచిత్రాలను ఈ గ్రంథ సంపుటాల్లో అక్కడక్కడా పొందుపరుచుటకు అనుమతించిన శ్రీ బాపుగారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఈ సరళవ్యాఖ్యాన గ్రంథం ఎనిమిది సంపుటాలుగా, ఆ యా పుటల్లో అక్కడక్కడ ప్రముఖ చిత్రకారులు బాపుగారి బొమ్మల మెరుపులతో సర్వాంగసుందరంగా, శ్రీ హేమలంబి నామసంవత్సరం తెలుగు ఉగాదినాడు తెలుగువారందరికి శ్రీ తిరుమలేశుడు అనుగ్రహిస్తున్న ప్రసాదంగా స్వీకరించగలరని ఆకాంక్షిస్తూ...

*సదా శ్రీవారి సేవలో...*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీరస్తు

# బమ్మెర పోతనామాత్య ప్రణీత శ్రీమహాభాగవత ప్రాజెక్టు పుట్టుపూర్వోత్తరాలు

**వేదకల్పవృక్షవిగళితమై శుక**
**ముఖసుధాద్రవమున మొనసియున్న,**
**భాగవతపురాణఫలరసాస్వాదన**
**పదవి గనుడు రసికభావవిదులు.**

అని భాగవత రచనకు ఉపక్రమించిన సహజకవి పోతనామాత్యుడు భాగవతప్రాశస్త్యాన్ని ఉగ్గడించాడు.

వాల్మీకి విరచితమైన ఆదికావ్యం రామాయణం. "వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా" అన్నట్లు వేదానికి మారురూపంగా అది ప్రసిద్ధి పొందింది. వ్యాసవిరచితమహాభారతాన్ని పంచమవేదంగా (భారతం పంచమో వేదః) భావిస్తారు. సనాతనధర్మానికి అనల్పమైన వ్యాప్తిని గావించిన ఈ మూడుగ్రంథాలు భారతీయ సాహిత్యంలో సాటిలేని మేటిరచనలుగా ప్రసిద్ధి పొందాయి.

తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారంకోసం ఆధ్యాత్మికగ్రంథాలను పెద్ద ఎత్తున ప్రచురిస్తోంది. దేశంలో మరే ఇతరదేవస్థానం కూడా ధర్మప్రచారంకోసం గ్రంథముద్రణను ఇంత పెద్ద ఎత్తున చెయ్యడం లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. వేదార్థాలను ప్రతిపాదించే వాఙ్మయాన్ని వివిధ భాషల్లో ప్రచురించి ప్రచారం చేయడం తిరుమల తిరుపతి దేవస్థానం తన బాధ్యతగా స్వీకరించింది. అనేకభాషల్లో దేవస్థానం ద్వారా వెలువడుతున్న ధార్మికగ్రంథాలలో రామాయణ, భారత, భాగవతాలు మిక్కిలి ప్రధానమైనవని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

1982లో జరిగిన భక్తకవి పోతన పంచశతాబ్ది జయంతి ఉత్సవాలలో పోతన భాగవతాన్ని తాత్పర్యంతో ముద్రించాలని దేవస్థానం సంకల్పించింది. **కరుణశ్రీ జంధ్యాలపాపయ్యశాస్త్రి** గారి నేతృత్వంలో 15 మంది పండితులు పోతనభాగవతానికి తాత్పర్యాన్ని సమకూర్చారు. తొలిసారిగా 1987లో తాత్పర్యసహిత పోతన భాగవతాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం పాఠకలోకానికి అందించింది.

కవిత్రయవిరచితమహాభారతానికి ప్రసిద్ధపండితులచేత ప్రతిపదార్థతాత్పర్యవిశేషవివరణలు వ్రాయించి ప్రచురించాలన్న సంకల్పం 1983లో తిరుమల తిరుపతి దేవస్థానానికి కలిగింది. ముప్ఫైమంది పండితులు ఈ పద్ధతిలో భారతానికి వ్యాఖ్యానం రచించారు. 2005వ సంవత్సరంలో మహాభారతం సంపూర్ణంగా సవ్యాఖ్యానంగా వెలువడింది.

ప్రతిపదార్థ, తాత్పర్య, విశేషవ్యాఖ్యానాలతో కవిత్రయభారతం, తాత్పర్యసహితభాగవతం తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలలో అగ్రశ్రేణికి చెందినవిగా రూపొంది అతివిస్తృతమైన ప్రజాదరణకు పాత్రమైనాయి. వేలకొలది ప్రతులు భక్తులకు, పాఠకులకు అందుతున్నాయి.

1981లో డా॥ పన్నాల రాధాకృష్ణశర్మగారి నేతృత్వంలో వ్యాసవిరచితసంస్కృతభాగవతాన్ని ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాలను సమన్వయించే మూడువ్యాఖ్యానాలతో పరిష్కరించి ప్రచురించాలని దేవస్థానం నిర్ణయించింది. ఆ నిర్ణయం మేరకు భాగవతం ప్రాజెక్టు ఏర్పాటైంది. **డా॥ రాధాకృష్ణశర్మ, డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ, డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గార్ల నేతృత్వంలో శ్రీధరీయం (అద్వైతం), వీరరాఘవీయం (విశిష్టాద్వైతం), విజయధ్వజీయం (ద్వైతం) అన్న మూడువ్యాఖ్యానాలతో సమగ్రంగా 14 బృహత్ సంపుటాలుగా 2006 నాటికి భాగవతం సిద్ధమయింది.

ఈ పరిష్కరణ కార్యక్రమం ముగియగానే పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారి **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** నాటి తితిదే శ్రీకార్యనిర్వహణాధికారి **శ్రీ ఎ.పి.వి.ఎన్. శర్మ** ఐ.ఏ.ఎస్., గారి వద్దకు వెళ్ళి వ్యాసభాగవత పరిష్కరణ పూర్తి అయిందని విన్నవించారు. అప్పుడు కార్యనిర్వహణాధికారిగారు ఎంతో సంతోషించి "పోతన భాగవతాన్ని తాత్పర్యంతో మాత్రమే ముద్రించగలిగాం. తెలుగు ప్రజలందరికీ ఎంతో ప్రియమైన భాగవతాన్ని కూడా అర్థ తాత్పర్య వివరణలతో సిద్ధం చేస్తే బాగుంటుంది. ఇందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చెయ్యండి" అని నిర్దేశించారు.

ఈ బృహత్కార్యక్రమం భాగవతప్రాజెక్టుద్వారా కాకుండా కవిత్రయ మహాభారతానికి వ్యాఖ్యానం సమకూర్చడంలో అనుభవం గడించిన సప్తగిరి సంపాదక కార్యాలయం ద్వారానే నిర్వహించడం సముచితంగా ఉంటుందని తెలుపుతూ **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** వ్యాఖ్యాన రచనకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి కార్యనిర్వహణాధికారివారికి పంపగా వారు ఆమోదించారు.

**డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారి ప్రతిపాదనలో సారాంశం**

- వ్యాఖ్య సామాన్యులకు కూడా అర్థమయ్యే తీరులో ఉండాలి.
- శిష్టవ్యావహారికభాషను ప్రయోగించాలి.
- వ్యాకరణాదివిశేషాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉండరాదు.
- ఆధ్యాత్మిక అంశాలను పరిమితంగా విశేషాంశాలలో చెప్పవచ్చు.
- కార్యనిర్వహణాధికారి వారి అధ్యక్షతన తితిదే ప్రజాసంబంధాధికారి, సప్తగిరి ప్రధాన సంపాదకులు, తితిదే స్థానిక పండితులతో ఒక సంఘాన్ని ఏర్పాటుచేసి వ్యాఖ్యాతలను, సంపాదకమండలిని ఎన్నుకోవాలి.

- వ్యాఖ్యాత లందరితో తిరుపతిలో ఒక కార్యశాలను నిర్వహించి అందరి వ్యాఖ్యానం ఒకే విధంగా ఉండేలా చూడాలి.
- ఇంతకు మునుపు తితిదే ముద్రించిన తాత్పర్యసహిత భాగవతానికి తాత్పర్యం వ్రాసిన పండితులలో సమర్థులైనవారిని ఈ కార్యక్రమంలో వినియోగించుకోవచ్చు.

2007లో కార్యనిర్వహణాధికారి **డా॥ కె.వి.రమణాచారి** ఐ.ఏ.ఎస్., గారి ఆమోదంమేరకు నాటి సప్తగిరి సంపాదకులు **డా॥ సి.శైలకుమార్**, భాగవత ప్రాజెక్టు ప్రధానసంపాదకులుగా **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు** గారిని నియమించారు. ఆ తరువాత ఈ బృహత్కార్యాచరణకు సలహాలు, సూచనలు చేసేందుకు కవిత్రయభారత వ్యాఖ్యాననిర్వహణలాగే తొమ్మిదిమందితో కూడిన సలహామండలిని ఏర్పాటు చేశారు. దీనికి తితిదే కార్యనిర్వహణాధికారి గౌరవ సంపాదకులుగా వ్యవహరించారు.

**సలహామండలి**

| | | |
|---|---|---|
| **శ్రీ కార్యనిర్వహణాధికారి** | – | **గౌరవ సంపాదకులు** |
| **శ్రీ ముదివర్తి కొండమాచార్యులు, తిరుపతి** | – | **ప్రధాన సంపాదకులు** |
| **డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి** | – | **సభ్యులు** |
| **డా॥ దేవళ్ళ చిన్నికృష్ణయ్య, మద్రాసు** | – | **సభ్యులు** |
| **డా॥ శలాక రఘునాథశర్మ, రాజమండ్రి** | – | **సభ్యులు** |
| **ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి** | – | **పదవీ నిమిత్త సభ్యులు** |
| **సప్తగిరి సంపాదకుడు** | – | **సి. శైలకుమార్, కన్వీనర్** |
| **తితిదే ప్రజాసంబంధాధికారి** | – | **విశేష ఆహ్వానితులు** |
| **తితిదే ప్రెస్ మేనేజర్** | – | **విశేష ఆహ్వానితులు** |

ఈ సంపాదక మండలిలోని పండితవర్గమైన **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, డా॥ సముద్రాల లక్ష్మణయ్య, డా॥ దేవళ్ళ చిన్నికృష్ణయ్య, డా॥ శలాక రఘునాథశర్మ** గార్లతో ప్రధాన సంపాదకమండలిని నెలకొల్పారు. ఆ తరువాత కారణాంతరాలవల్ల **డా॥ దేవళ్ళ చిన్నికృష్ణయ్య** గారి స్థానంలో **డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య** గారు సంపాదక మండలి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ ప్రధాన సంపాదక మండలివారు భాగవత

వ్యాఖ్యాన రచనకు ముప్పైమంది పండితులను ఎంపికచేసి ఒక్కొక్కరికి 300 - 350 పద్యగద్యాలకు వ్యాఖ్యాన రచనా బాధ్యతలను అప్పగించారు.

ఆ తరువాత అనుకున్నంత వేగంగా ఈ కార్యక్రమం ముందుకు సాగలేదు.

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలను, సవ్యాఖ్యాన భాగవతాన్ని త్వరితగతిన వ్యాప్తిలోకి తేవాలన్న ఉద్దేశ్యంతో 2011లో ద్రవిడ విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపకులపతి **ఆచార్య రవ్వా శ్రీహరి**గారిని ప్రచురణల విభాగానికి ఎడిటర్-ఇన్-చీఫ్‌గా నియమిస్తూ వీరికి సహాయకులుగా **డా॥ నొస్సం నరసింహాచార్య, శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి** గార్లను ప్రచురణల విభాగానికి ఉపసంపాదకులుగా, **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం** గార్లు కన్సల్టెంట్‌లుగా నియమితులయ్యారు.

అప్పటిదాకా మందకొడిగా సాగుతున్న ప్రచురణ కార్యక్రమంతోపాటు వ్యాఖ్యాన రచనా కార్యక్రమం కూడా **ఆచార్య రవ్వా శ్రీహరి** గారి సారథ్యంలో వేగాన్ని పుంజుకున్నది. వ్యాఖ్యాన రచయితలతో నిరంతరం ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ రాయలేమని తెలిపిన వారి భాగాలను వేరే పండితులకు అప్పగిస్తూ 2013నాటికి దాదాపు పండితులందరినుండి భాగవత వ్యాఖ్యానాలను తెప్పించారు. వెనువెంటనే డి.టి.పి. వగైరా పనులుకూడా ముమ్మరంగా సాగాయి. పుటల సంఖ్య ఆధారంగా 12 స్కంధాల భాగవతాన్ని 8 సంపుటాలుగా ముద్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**ఆచార్య రవ్వా శ్రీహరి**గారి తదనంతరం 2014లో ఎడిటర్-ఇన్-చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన పురాణ ఇతిహాస ప్రాజక్టు ప్రత్యేకాధికారి **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేశారు. వ్యాఖ్యాన రచనలను పరిష్కరించడానికి, అక్షర దోషాలను తొలగించడానికి మరి కొందరు పండితులు అవసరం కావడంతో అప్పటికే భాగవతం కన్సల్టెంటుగా ఉన్న **డా॥ గల్లా చలపతి** గారితోపాటుగా **డా॥ ముదివేడు ప్రభాకరరావు, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, శ్రీ కట్టా నరసింహులు** గార్లు భాగవతం ప్రాజెక్టు కన్సల్టెంట్‌లుగా నియమితులయ్యారు. భాగవత స్కంధాలను సంపాదకమండలి పరిష్కరణ స్థాయికి వీరు తీసుకువచ్చారు. 2015 ఏప్రిల్ 15వ తేదీన తితిదే కార్యనిర్వహణాధికారి **డా॥ డి.సాంబశివరావు** ఐ.ఏ.ఎస్., మరియు సంయుక్త కార్యనిర్వహణాధికారి (తిరుపతి) **శ్రీ పోల భాస్కర్** ఐ.ఏ.ఎస్., గార్ల ఆధ్వర్యంలో

**విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు**

**డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

**డా॥ శలాక రఘునాథశర్మ**

**డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య**గార్లతో కూడిన పోతనభాగవత సంపాదకమండలి తొలి సమావేశం జరిగింది. త్వరితగతిన పరిష్కరణ పూర్తిచేసేందుకు గాను అనుసరించాల్సిన ప్రణాళికను ఈ సమావేశంలో సిద్ధం

చేశారు. ఆ తరువాత **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గారి సంయోజకత్వంలో జరిగిన సంపాదక మండలి సమావేశాలలో మూడుస్కంధాల పరిష్కరణ పూర్తిచేసి ముద్రణార్హమైన ప్రతిని సిద్ధం చేశారు. అనివార్యకారణాలవల్ల సంపాదకమండలిలో కొందరు సభ్యులు తదుపరి సమావేశాలకు హాజరు కాలేకపోయారు.

2016లో ప్రచురణల విభాగానికి **శ్రీ ప్రయాగ రామకృష్ణ**గారు ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. కార్యనిర్వహణాధికారి గారి అమోదం మేరకు వీరు భాగవత పరిష్కరణ కార్యక్రమం త్వరితగతిన పూర్తికావడానికి అంతకు మునుపున్న సంపాదకమండలి స్థానంలో

**డా॥ సముద్రాల లక్ష్మణయ్య (ప్రధాన సంపాదకులు)**

**శ్రీ గరిమెళ్ళ అచ్యుత సత్య శేషగిరి సోమయాజి శర్మ**

**డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి**

**డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి**

**డా॥ ధూళిపాళ రామకృష్ణ**

**డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య**

**డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి**

**డా॥ కె.వి. సుందరాచార్యులు**

**డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ**గార్లతో కొత్త సంపాదకమండలిని ఏర్పాటుచేశారు. అప్పటినుంచి వ్యాఖ్యాన పరిష్కరణ కార్యక్రమం వేగవంతం అయింది. కాగా 2017 ఉగాదినాటికి సవ్యాఖ్యాన భాగవతం ముద్రించబడి ప్రజలకు అందుబాటులోకి రావాలన్న తితిదే సంకల్పాన్ని అనుసరించి పరిష్కరణ కార్యక్రమాన్ని మరింత త్వరగా పూర్తి చేసేందుకుగాను కార్యనిర్వహణాధికారి వారి ఆమోదంమేరకు

**డా॥ నిట్టల సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి**

**డా॥ మరడాన శ్రీనివాసరావు**

**డా॥ గల్లా చలపతి** గార్లకు సంపాదకమండలిలో స్థానం కల్పించారు. 2016 సెప్టెంబరునుండి పండితులందరితో ప్రతినెలా దాదాపు 20 రోజులపాటు తిరుపతి శ్వేత సమావేశ మందిరంలో సమావేశాలు ఏర్పాటుచేసి పండితులందరి ఆమోదంమేరకు పరిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించి శుద్ధప్రతిని ముద్రణకు పంపేందుకు సిద్ధం చేశారు. ఇలా అనుకున్న సమయానికి శ్రీమహాభాగవతాన్ని ప్రకటించగలిగినందుకు సంతోషిస్తున్నాము.

సామాన్య పాఠకులను దృష్టిలో ఉంచుకుని వ్యాఖ్యానం సరళంగా ఉండాలన్న కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారిగార్ల సూచనలమేరకు వ్యాఖ్యాన రచనలో విస్తృతంగా విశేషాలను వ్రాసిన పండితుల రచనల్లోంచి సంపాదకమండలి సూచనల ప్రకారం అవసరమైన మేరకు మాత్రమే విశేషాలను స్వీకరించడమయింది.

**కృతజ్ఞతలు**

ఈ ప్రణాళిక ఫలప్రదం కావడానికి ఆధికారికమైన ఆమోదాన్ని అందజేసిన తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులకు మరియు పాలకమండలి సభ్యులందరికీ కృతజ్ఞతలు.

లోగడ తితిదేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉండి భాగవత ప్రాజెక్టు ప్రారంభానికి కారకులైన **శ్రీ ఎ.పి.వి.ఎన్.శర్మ** ఐ.ఏ.ఎస్., గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. అదే పరంపరలో తితిదే కార్యనిర్వహణాధికారులుగా బాధ్యతలు నిర్వహించి భాగవత ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారాన్ని అందించిన **డా॥ కె.వి.రమణాచార్య** ఐ.ఏ.ఎస్., **శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావు** ఐ.ఏ.ఎస్., **శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం** ఐ.ఏ.ఎస్., **శ్రీ ఎమ్.జి.గోపాల్** ఐ.ఏ.ఎస్., గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు.

పోతనభాగవతం ముద్రణదశకు చేరుకునేందుకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చిన సలహామండలి సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

సవ్యాఖ్యాన భాగవత ప్రచురణలో ఆసక్తిని కనబరుస్తూ అన్నివిధాలా అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందజేసిన గౌరవ శ్రీ కార్యనిర్వహణాధికారి **డా॥ డి.సాంబశివరావు** ఐ.ఏ.ఎస్., గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారి **శ్రీ పోల భాస్కర్** ఐ.ఏ.ఎస్., గారికి మా హృదయపూర్వక నమోవాకాలు.

భాగవత వ్యాఖ్యాన రచనకు అవసరమైన పండితులను ఎన్నుకొని వారికి వ్యాఖ్యాన బాధ్యతలను అప్పగించడంలో కృషిచేసిన నాటి సప్తగిరి ప్రధాన సంపాదకులు **డా॥ సి.శైలకుమార్** గారికి, సంపాదకులు **డా॥ కె.రాధారమణ** (ప్రస్తుత ప్రధాన సంపాదకులు) గార్లకు కృతజ్ఞతలు.

వ్యాఖ్యాతలందరినుండి వ్యాఖ్యాన భాగాలను రప్పించడంలో శ్రమించి, విశేష కృషిచేసిన నాటి ప్రచురణల విభాగం అధికారి **ఆచార్య రవ్వా శ్రీహరి** గారికి, పరిష్కరణ కార్యక్రమాన్ని వేగవంతంచేసిన తదుపరి అధికారి **డా॥ సముద్రాల లక్ష్మణయ్య** గారికి, కృతజ్ఞతాపూర్వక నమస్కృతులు.

పోతన భాగవత పరిష్కరణలో తమ అమూల్య సహాయసహకారాలనందించి శుద్ధప్రతిని తయారు చేయడంలో సహకరించిన **పోతన భాగవత సంపాదకమండలి సభ్యులందరికీ** పేరుపేరునా ధన్యవాదాలు.

ఈ కార్యక్రమంలో చేదోడువాదోడుగా ఉంటూ అన్నివిధాలా సంపూర్ణ సహాయ సహకారాలందించిన ప్రచురణల విభాగ ఉపసంపాదకులు **డా॥ నొస్సం నరసింహాచార్య** గారికి, పరిష్కరణ, అక్షరదోష సవరణల్లో సహకరించిన కార్యాలయ పండితులు **విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు, శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, డా॥ గల్లా చలపతి, డా॥ ముదివేడు ప్రభాకరరావు, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, శ్రీ కట్టా నరసింహులు**గార్లకు, ప్రచురణల విభాగంలో కొంతకాలం ఉపసంపాదకురాలుగా పనిచేసి భాగవత పరిశీలనా కార్యక్రమంలో సహకరించిన **శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి** గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు.

సవ్యాఖ్యాన పోతన భాగవత ముద్రణకు సంబంధించిన దస్త్రాలను నడపడంలోను, సంపాదకమండలి సమావేశాలను ఏర్పాటు చేయడంలోను సహకరించిన **ప్రచురణల విభాగ కార్యాలయ సిబ్బందికి** నా ధన్యవాదాలు.

సవ్యాఖ్యాన పోతన భాగవతం ఎనిమిది సంపుటాలలో చివరన ముద్రించిన అకారాదిక్రమ పద్యగద్య సూచికను తయారు చేయడంలో సహకరించిన **శ్రీ వాడపల్లి శేషతల్పశాయి** (ఆంధ్రభారతి.కామ్) గారికి మా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాలను అందంగా డి.టి.పి. చేసి చక్కటి వర్ణచిత్రాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో సహకరించిన ప్రచురణల విభాగ కార్యాలయ డి.టి.పి. సిబ్బంది **శ్రీమతి ఎమ్.సుబ్బరత్నమ్మ, శ్రీమతి జె.కరుణ, కుమారి ఎమ్.మానస, శ్రీ ఎమ్.రెడ్డిప్రసాద్** గార్లకు ధన్యవాదాలు.

ఈ గ్రంథంలో ప్రసిద్ధ చిత్రకారులు బాపుగారి అద్భుత వర్ణచిత్రాలను ముద్రించేందుకు అనుమతించిన బాపుగారి కుటుంబసభ్యులకు మా ప్రత్యేకధన్యవాదాలు.

తక్కువ వ్యవధిలో గ్రంథ ముద్రణను పూర్తిచేసి పాఠకులకు అందించేందుకు తోడ్పడిన టిటిడి ముద్రణాలయ ఉపకార్యనిర్వహణాధికారి **శ్రీమతి ఎమ్.గౌతమి** గారికీ, వారి సిబ్బందికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు.

*సదా శ్రీవారి సేవలో...*

**ప్రయాగ రామకృష్ణ**
కన్వీనర్
ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# సంపాదక మండలి

అధ్యక్షులు

**డా॥ డి.సాంబశివరావు**, ఐ.ఏ.ఎస్,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి

పర్యవేక్షకులు

**శ్రీ పోల భాస్కర్**, ఐ.ఏ.ఎస్,

సంయుక్త కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి

ప్రధాన సంపాదకులు : **డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

## సభ్యులు

డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డా॥ ధూళిపాళ రామకృష్ణ

డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య

డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ

డా॥ నిట్టల సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి

డా॥ మరడాన శ్రీనివాసరావు

డా॥ గల్లా చలపతి

కన్వీనర్ : ప్రయాగ రామకృష్ణ, ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం

కో - కన్వీనర్ : డా॥ నొస్సం నరసింహాచార్య, ఉపసంపాదకులు, ప్రచురణల విభాగం

బమ్మెర పోతనామాత్య ప్రణీత

# శ్రీమహాభాగవతము

| వ్యాఖ్యాతలు | స్కంధాలు |
|---|---|
| 1) డా॥ కేసాప్రగడ సత్యనారాయణ | ప్రథమస్కంధము (1-275) |
| 2) డా॥ మల్లెల గురవయ్య | ప్రథమస్కంధము (276-529) |
| 3) డా॥ సముద్రాల లక్ష్మణయ్య | ద్వితీయస్కంధము (1-288) |
| 4) డా॥ కడిమిళ్ళ వరప్రసాద్ | తృతీయస్కంధము (1-388) |
| 5) డా॥ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి | తృతీయస్కంధము (389-717) |
| 6) డా॥ గల్లా చలపతి | తృతీయస్కంధము (718-887) |
| 7) డా॥ కసిరెడ్డి వెంకటపతిరెడ్డి | తృతీయస్కంధము (888-1055) |
| 8) డా॥ దావులూరి కృష్ణకుమారి | చతుర్థస్కంధము (1-322) |
| 9) డా॥ ఆర్. అనంతపద్మనాభరావు | చతుర్థస్కంధము (323-636) |
| 10) డా॥ శలాక రఘునాథశర్మ | చతుర్థస్కంధము (637-977) |
| 11) డా॥ కె. సర్వోత్తమరావు | పంచమస్కంధము |
| | ప్రథమాశ్వాసము (1-183) |
| | ద్వితీయాశ్వాసము (1-167) |
| 12) డా॥ జోస్యుల సూర్యప్రకాశరావు | షష్ఠస్కంధము (1-251) |
| 13) డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణ | షష్ఠస్కంధము (252-346) |
| 14) డా॥ ఆకురాతి పున్నారావు | షష్ఠస్కంధము (347-440) |
| 15) శ్రీ కోట వేంకట లక్ష్మీనరసింహం | షష్ఠస్కంధము (441-530) |
| 16) డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | సప్తమస్కంధము (1-186) |

| | |
|---|---|
| 17) డా॥ ఆకురాతి పున్నారావు | సప్తమస్కంధము (187-482) |
| 18) డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద | అష్టమస్కంధము (1-391) |
| 19) శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | అష్టమస్కంధము (392-744) |
| 20) డా॥ డి. మీరాస్వామి | నవమస్కంధము (1-364) |
| 21) శ్రీ కోట వేంకట లక్ష్మీనరసింహం | నవమస్కంధము (365-737) |
| 22) డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య | దశమస్కంధము పూర్వభాగము (1-288) |
| 23) డా॥ ఎ.ఎస్. గోపాలరావు | దశమస్కంధము పూర్వభాగము (289-610) |
| 24) శ్రీ ప్రభల సుబ్రహ్మణ్యశర్మ | దశమస్కంధము పూర్వభాగము (611-912) |
| 25) డా॥ పి. నరసింహారెడ్డి | దశమస్కంధము పూర్వభాగము (913-1188) |
| 26) విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు | దశమస్కంధము పూర్వభాగము (1189-1485) |
| 27) డా॥ పి.ఆర్. హరినాథ్ | దశమస్కంధము పూర్వభాగము (1486-1792) |
| 28) డా॥ నాగళ్ళ గురుప్రసాదరావు | దశమస్కంధము ఉత్తరభాగము (1-245) |
| 29) డా॥ ఎన్.వి.ఎస్. రామారావు | దశమస్కంధము ఉత్తరభాగము (246-537) |
| 30) డా॥ కె. మలయవాసిని | దశమస్కంధము ఉత్తరభాగము (538-764) |
| 31) డా॥ కె.జె. కృష్ణమూర్తి | దశమస్కంధము ఉత్తరభాగము (765-1033) |
| 32) డా॥ సంగనభట్ల నరసయ్య | దశమస్కంధము ఉత్తరభాగము (1034-1343) |
| 33) డా॥ గల్లా చలపతి | ఏకాదశస్కంధము (1-127) |
| | ద్వాదశస్కంధము (1-54) |

**పోతన భాగవతప్రాజెక్టు కన్సల్టెంట్స్**

శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం = ¡ = డా॥ గల్లా చలపతి = ¡ = డా॥ ముదివేడు ప్రభాకరరావు

శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు = ¡ = శ్రీ కట్టా నరసింహులు

# సంకేతాక్షర సూచి

| | | | | | |
|---|---|---|---|---|---|
| క. | – | కందం | య. | – | యగణం |
| ఆ. | – | ఆటవెలది | మ. | – | మగణం |
| తే. | – | తేటగీతి | త. | – | తగణం |
| సీ. | – | సీసపద్యం | ర. | – | రగణం |
| ఉ. | – | ఉత్పలమాల | జ. | – | జగణం |
| చ. | – | చంపకమాల | భ. | – | భగణం |
| మత్త. | – | మత్తకోకిల | న. | – | నగణం |
| మ. | – | మత్తేభవిక్రీడితం | స. | – | సగణం |
| శా. | – | శార్దూలవిక్రీడితం | ల. | – | లఘువు |
| శ్లో. | – | శ్లోకం | గ. | – | గురువు |
| వ. | – | వచనం | వ. | – | వగణం |
| అలం. | – | అలంకారం | | | |

| | | |
|---|---|---|
| అవ. | – | అవతారిక |
| తా. | – | తాత్పర్యం |
| ప్రతి. | – | ప్రతిపదార్థం |
| విశే. | – | విశేషార్థం |
| ప్ర.ఆ. | – | ప్రథమాశ్వాసం |
| ద్వి.ఆ. | – | ద్వితీయాశ్వాసం |
| క్రీ.శ. | – | క్రీస్తుశకం |
| సం. | – | సంవత్సరం |
| మొ. | – | మొదలైన |
| ... | – | తరువాతి పద్యం / వచనంతో అన్వయం |

# ఏకాదశస్కంధ ప్రాశస్త్యం

**పో**తన భాగవతంలోని పదకొండవ స్కంధంలో శిథిలభాగాలను పూరించిన పుణ్యాత్ముడు వెలిగందల నారయ సంస్కృత భాగవతంతో పోల్చి చూసినపుడు ఈ స్కంధం చాలా సంగ్రహంగా ఉంది. మూలగ్రంథంలో ముప్పై ఒక్క అధ్యాయాలు 1323 శ్లోకాల్లో ఈ స్కంధం ఉండగా పోతన భాగవతంలో కేవలం 123 పద్యగద్యాలు మాత్రమే ఉన్నాయి. పెద్ద పెద్ద వచనాలు ఉండడంవల్ల స్కంధసారమంతా వీటిలో వచ్చేసింది.

విశ్వామిత్ర, వశిష్ఠ, నారదాది మహర్షులు శ్రీకృష్ణుని దర్శనానికిరావడం, నారదమహర్షి వసుదేవునికి ప్రాచీనమైన విదేహ, ఋషభసంవాదంను తెల్పడం బ్రహ్మ మొదలైన దేవతలు శ్రీకృష్ణునికి వైకుంఠానికి రమ్మని పిలవడం శ్రీకృష్ణుడు దుర్నిమ్మిత్తాలు చూసి యాదవులందరినీ ద్వారకనుండి ప్రభాస తీర్థానికి పంపడం కృష్ణుడు ఉద్ధవునికి పరమార్థాన్ని ఉపదేశించడం అవధూత యదు సంవాదం శ్రీకృష్ణబలరాములు వైకుంఠధామానికి వెళ్ళడం ఈ స్కంధంలోని ప్రధాన విషయాలు.

**24 ప్రకృతులు**

శ్రీకృష్ణుడు ఉద్ధవునికి ప్రకృతిలోని 24 గురువులను గూర్చి చెప్పాడు. యదువు అనే మహారాజు ఒకసారి శివవేషంలో ఉన్న ఒక అవధూతను దర్శించాడు. ఆ అవధూత అతనికి 24 మంది గురువులను గురించి ఇలా చెప్పాడు. 1. భూమి 2. గాలి 3. ఆకాశం 4. నీరు 5. అగ్ని 6. సూర్యుడు 7. చంద్రుడు 8. పావురం 9. కొండచిలువ 10. సముద్రం 11. మిడుత 12. తుమ్మెద 13. ఏనుగు 14. తేనె తీసేవాడు 15. లేడి 16. చేప 17. పింగళ అనే వేశ్య 18. లకుముకి పిట్ట 19. చంటిబిడ్డ 20. కన్నెపిల్ల 21. బాణం వే(చే)సేవాడు 22. పాము 23. సాలెపురుగు 24. పేశకృత్తు ఈ 24మంది అవధూతకు ప్రకృతి గురువులు.

1. దైవవశంతో భూతాలు బాధలు పెట్టినా విధికృతాలని సహనంతో ఉండడం భూమివలన నేర్చుకోవాలి.
2. జీవుల దేహాలలో ఉండి వాటిగుణాలతో అంటకుండా ఉండడాన్ని గాలిని చూసి నేర్చుకోవాలి.
3. భూమి, నీరు, నిప్పు, గాలి వీటితో కలిసివుండి కూడా వాటి సాంగత్యం లేకపోవడాన్ని ఆకాశాన్ని చూసి నేర్చుకోవాలి.
4. ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండటం, తీయగా ఉండటం, శుచిగా ఉండటం, జనాల్ని పవిత్రుల్ని చేయడం జలాన్ని చూసి నేర్చుకోవాలి.
5. తేజస్సుతో ఉండడం అన్ని పదార్థాలనూ భుజించినా, నిర్మలంగా ఉండటం, పాపాలను భస్మంచేయడం, సకలభూతాలలో భగవంతునిలా సమంగా ప్రకాశించడం అగ్నిని చూసి నేర్చుకోవాలి.
6. విషయాలను గ్రహించినా విడిచిపెట్టడం, నీటిని తీసుకొని విడిచిపెట్టే సూర్యుణ్ణి చూసి నేర్చుకోవాలి.
7. వృద్ధి, క్షయాలు శరీరానికే కాని, ఆత్మకు లేవనే విషయాన్ని చంద్రుణ్ణి చూసి నేర్చుకోవాలి.

8. భార్యా, బిడ్డలపై వ్యామోహాన్ని విడిచిపెట్టాలని పావురాన్ని చూసి నేర్చుకోవాలి.
9. రుచిగా ఉన్నా, లేకున్నా రసవంతమైనా లేదా నీరసమైనా ఎక్కువగాకాని, తక్కువగాకాని, లభించిన ఆహారంతో జీవించడం, భోజనం లభించకపోతే ఉపవాసం ఉండడం కొండచిలువను చూసి నేర్చుకోవాలి.
10. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఉత్సాహం కాని, కోపం కాని లేకుండా గంభీరమైన హృదయంతో విషయాసక్తి లేకుండా ఉండటాన్ని తరంగాలులేని సముద్రాన్ని చూసి నేర్చుకోవాలి.
11. శక్తికి తగ్గ పనిచేయడం, స్త్రీలను చూసి మోహంలో పడకుండా ఉండడం మంటలోపడే మిడుతను చూసి నేర్చుకోవాలి.
12. అనేక శాస్త్రాల్లోని సారాన్ని మాత్రమే గ్రహించడం పూలలోని తేనెను గ్రహించే తుమ్మెదను చూసి నేర్చుకోవాలి.
13. స్త్రీ బొమ్మను చూసినా వ్యామోహంలో పడక విముఖుడుగా ఉండటం ఆడేనుగు సాంగత్యంతో చావు తెచ్చుకొనే ఏనుగును చూసి నేర్చుకోవాలి.
14. కావలసిన వస్తువులను సంపాదించుకోవడం తేనెపట్టునుండి తేనెను పిండేవాణ్ణి చూసి నేర్చుకోవాలి.
15. గ్రామ్యగీతాలువిని మోహంలో పడకుండా ఉండడం, బోయవానివలలో పడే లేడిని చూసి నేర్చుకోవాలి.
16. గాలానికి చిక్కే చేపను చూసి జిహ్వాచాపల్యాన్ని విడవాలి.
17. ధనం పట్ల ఆశవిడిచి ఆత్మసుఖం పొందేవాడే భర్త అని తలచి నిరంతరం శ్రీవిష్ణువునే ధ్యానం చేయడం పింగళ అనే వేశ్య చరిత్రనుబట్టి తెలుసుకోవాలి.
18. మాంసాహారం విడిచిపెట్టి సౌఖ్యం పొందడం లకుముకి పిట్టను చూసి నేర్చుకోవాలి.
19. ఏ చింతా లేకుండా ఆత్మారాముడై ఉండడం చంటిబిడ్డను చూసి నేర్చుకోవాలి.
20. గాజులు తీసి ధాన్యాన్ని దంచే అమ్మాయిని చూసి నిశ్శబ్దంగా ఉండడం నేర్చుకోవాలి.
21. లక్ష్యంమీద చూపును కేంద్రీకరించడం విలుకానిని చూసి నేర్చుకోవాలి.
22. చీమలు పెట్టిన పుట్టల్లో నివసిస్తూ స్వేచ్ఛగా తిరిగే పామును చూసి ఇంటిపట్ల ధ్యాసలేక ఎక్కడైనా ఉండడం నేర్చుకోవాలి.
23. ఈశ్వరుడే జగత్తును సృష్టించి లయం చేస్తాడు అనే విషయాన్ని సాలెపురుగును చూసి నేర్చుకోవాలి.
24. ఎక్కడ కుట్టాలో అక్కడే కుట్టే కందిరీగను చూసి గురి తప్పిపోకుండా ఉండడం నేర్చుకోవాలి.

ఈ 24 మంది గురువులవల్ల పొందిన జ్ఞానం అవధూత యయాతి కొడుకైన యదువునకు ఉపదేశించాడు. సాధకునికి జగత్తే గురువు. శ్రీకృష్ణపరమాత్మ జగద్గురువు. ఇది ఏకాదశస్కంధంలోని ఉపదేశం.

## వివిధ యుగాలలో భగవంతుని స్వరూపాలు

1. కృతయుగంలో విష్ణుమూర్తి తెల్లనిరంగుతో ఉంటాడు. నాలుగు భుజాలు ఉంటాయి. జడలు, నారచీరలు, నల్లజింకచర్మం, జందెం, జపమాల, దండం, కమండలం ధరిస్తాడు.

1. హంసుడు 2. సువర్ణుడు 3. వైకుంఠుడు 4. ధర్ముడు 5. అమలుడు 6. యోగీశ్వరుడు 7. ఈశ్వరుడు 8. పురుషుడు 9. అవ్యక్తుడు అను దివ్యనామాలతో కీర్తింపబడతాడు.

2. త్రేతాయుగంలో ఎర్రని రంగుతో ఉంటాడు. నాలుగు చేతులతో మూడు వడ్డాణాలతో ఉంటాడు. హిరణ్యకేశుడు. వేదత్రయీస్వరూపుడై స్రుక్కు, స్రువము మొదలగు యజ్ఞసాధనాలు ధరిస్తాడు.

1. విష్ణువు 2. యజ్ఞుడు 3. పృశ్నిగర్భుడు 4. సర్వదేవుడు 5. ఉరుక్రముడు 6. వృషాకపి 7. జయంతుడు 8. ఉరుగాయుడు అనే నామాలతో కీర్తింపబడతాడు.

3. ద్వాపరయుగంలో నీలమేఘము వంటి రంగుగల వాఁడైయుంటాడు. పీతాంబరం ధరించి రెండు చేతులతో ఉంటాడు. దివ్యాయుధాలు ధరించి శ్రీవత్సం (పుట్టుమచ్చ), కౌస్తుభమణిహారం వల్ల మాలిక మొదలగువాటితో ప్రకాశిస్తూ మహారాజలక్షణాలతో ఉంటాడు.

1. జనార్దనుడు 2. వాసుదేవుడు 3. సంకర్షణుడు 4. ప్రద్యుమ్నుడు 5. అనిరుద్ధుడు 6. నారాయణుడు 7. విశ్వరూపుడు 8. సర్వభూతాత్ముడు మొదలగు నామాలతో కీర్తింపబడతాడు.

4. కలియుగంలో నల్లనిరంగుతో ఉంటాడు.

1. పుండరీకాక్షుడు 2. యజ్ఞుడు 3. హరి 4. రాముడు 5. నారాయణుడు 6. నృసింహుడు 7. కంసారి 8. నలినోదరుడు మొదలగు నామాలతో బ్రహ్మాదులచే గీర్తింపబడతాడు.

భగవద్భక్తుడు ఆయా స్వరూపాలు గల శ్రీవిష్ణువును ఆయా నామాలతో కీర్తించాలి.

## పోతన - శ్రీనాథులు - ప్రయోగపరిశీలనం

పోతన – శ్రీనాథుడు బావ–మరుదులని ప్రాచీన కాలంనుండి పరంపరగా వినవస్తున్నది. ఇది సంస్కృతంలో బాణమయూరుల సంబంధం వంటిది. ఈ బాంధవ్యం మొట్టమొదట శంకించినవారు శ్రీ చాగంటి శేషయ్యగారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు జనశ్రుతి అంగీకరిస్తున్నారు. పోతన – శ్రీనాథులు బంధువులైనా కాకపోయినా సమకాలికులు – సవయస్కులునగు మహాకవులు. ఉద్దండ పండితులు.

సీ. **'పన్నగపతిసార్వభౌమభాషితమహా, భాష్య విద్యాసమభ్యాసబలము'** అను దగ్గుపల్లి దుగ్గన వచనాన్నిబట్టి శ్రీనాథుఁడు భాష్యాంతవైయాకరుణుఁడని తెలుస్తున్నది.

వ. **శబ్దశాస్త్రంబుమర్యాద నచ్చువడి హల్లు గలిగి మహాభాష్యరూపావతారవృత్తివృద్ధిగుణసమృద్ధంబై. (9స్క–230)**

**వ. శబ్దశాస్త్రవేది హృదయంబు బాగున విశ్వప్రకాశాభిరామంబై (10-1-765)**

అను భాగవతవచనాలలో శ్రీపతంజలి మహర్షి రచించిన వ్యాకరణమహాభాష్యాన్ని, ధర్మకీర్తి రూపావతారాన్ని, వామన జయాదిత్యుల కాశికావృత్తిని, మహేశ్వర పండితుని విశ్వప్రకాశ నిఘంటువును తాను పఠించినట్లు పోతనయే భంగ్యంతరముగా చెప్పుకొన్నాడు. కొందఱు శ్రీనాథుఁడు లాక్షణికుఁడని, పోతన లాక్షణికుఁడు కాఁడని విమర్శిస్తున్నారు. అది పొరపాటు. పోతనకు శ్రీనాథుడు సమస్కంధుడు కాబట్టి ప్రధానమల్ల న్యాయంగా భాగవతప్రయోగములకు ఉజ్జీగా శ్రీనాథుని ప్రయోగాలనే చూపుతున్నాను.

## శబ్ద విశేషములు

**1. ఏడ**

ఇది గ్రామ్యపదమని కేతన చెప్పాడు. కాని నన్నయ భట్టే 'ఏనేడ? నింద్రాదులేడ' (భార-అరణ్య-2-47) అని ప్రయోగించాడు

తే.గీ. కన్య నీవేడ? రణరంగ గమనమేడ? (భాగ-10-2-153)

చ. మఱవ మతేడకుం జనుటమాని (భీమఖం-2-156)

సీ. ఏడఁబోయెనొ కదా! మేడలో మాంజిష్ఠి (కాశీ-4-108)

**2. కైవారము**

ఇది సంస్కృత శబ్దం గాదు. దేశ్యం కాని పోతన - శ్రీనాథు లిరువురు దీనిని విడిగానేకాక సంస్కృత సమాసంలో బిగించారు.

**వ. ఆంధ్రకవితా గౌరవజన మనోహరి నన్నయసూరిం గైవారంబు సేసి (1స్క-12)**

తే.గీ. వందిమాగధ సూత కైవారరవము (10స్క-2-671)

సీ. కాంతి సంపదనే కైవార మొనరింప (భీమఖం-1-89)

సీ. భారతీదేవి కైవార వాక్యంబులు (కాశీ-6-57)

**3. తండము**

ఇది కూడ దేశ్యపదం. సంస్కృత సమాసంలో వాడారు.

స్రగ్ధర. దండిం గోదండకాండోద్ధతరథహయ వేదండ తండంబుతోడన్ (6స్క-272)

తే.గీ. విమల డిండీర ఖండతండములతోడ (భీమ-4-175)

**4. తామరపాకు**

ఉ. తా వడఁకెం బురూరవుఁడు తామరపాకు జలంబు కైవడిన్ (9స్క-390)

క. ప్రజ తామరపాకు నీటి పగిదిఁ దలంకెన్. (కాశీ-6-179)

**5. పునీతకము**

ఇది అపాణినీయముగాని అసాధువు గాదు.

తథా పునీతా తనుభిః పదై స్తవ. (8-38-31) అని సంస్కృత భాగవతము.

చ. కోరి పునీతులఁ జేయువారలన్. (3-556; 561; 574; 4-931)

వ. పుష్పంధయవిరుతి పునీతత హరిదుపఘ్నంబులగు. (భీమ-1-110)

**6. ప్రమోషించు**

మోసగించు, దొంగిలించు. సూర్యరాయ నిఘంటువు పోతన ప్రయోగాన్నే ఉదాహరించినది.

దండ. ఏవేళఁ దల్లిన్ ప్రమోషించు...విత్త మెల్లం బ్రమోషించి. (భోగినీ దండకము)

వ. ఒక్క ముఖంబునఁ బురుషులం బ్రమోషింపను. (కాశీ-6-73)

**7. ముష్టాముష్టి**

పాణినీయము ననుసరించి 'ముష్టీముష్టి' అని ఉండాలి.

శా. ముష్టాముష్టి నహర్నిశంబు జయ సమ్మోహంబునం బోరుచో. (10-2-66)

శా. ముష్టాముష్టి రణంబు సేసిరి యసమ్మోహ ప్రకారంబులన్. (హరవి-7-86) ముగ్ధబోధవ్యాకరణము దీనిని సాధించినది.

క. భీమాసురవీరుల ముష్టాముష్టిరణచ్ఛట చ్ఛటాశబ్దంబు. (అరణ్య-3-395) అని నన్నయగారు యతిస్థానంలో ప్రయోగించారు.

శ్రీనాథుఁడు వాడిన 'హేవాకము' మొదలగువానిని పోతన వాడలేదు. పోతనవాడిన 'హల్లోహలము' మొదలగు శబ్దములను శ్రీనాథుఁడు వాడలేదు.

**8. హల్లోహలము**

సంభ్రమము, తొట్రుపాటు...అని సూర్యరాయాంధ్ర నిఘంటువు.

**క. ఉల్లసిత కుచభరంబుల, నల్లాడెడి నడుముతోడ నలరుల దండన్**
**భిల్లి యొకతె హరికిచ్చెను, హల్లోహలకలిత యగుచు నంగన కంటే! (10-1-794)**

శబ్దరత్నాకరానుబంధంలో శ్రీనిడుదవోలు వెంకటరావుగారు 5 కవి ప్రయోగా లిచ్చారు. వీరందఱు పోతనకు తరువాతివారే. నాకు తెలిసినంతవఱకు సంస్కృతాంధ్రభాషలలో హల్లోహల శబ్దమును వాడిన మొట్టమొదటి కవి పోతన. పోతన ననుసరించి సంస్కృత కవులు కూడ వాడినారు.

'ఉల్లోల జలధికల్లోల హల్లోహల...' నీలకంఠదీక్షితుల నీలకంఠ విజయచంపువు. 'దిశతు వః కల్యాణ హల్లోహలమ్' – నారాయణభట్టాత్రి శ్రీపాదసప్తతి.

సముద్రోత్థ కల్లోలహల్లోహలాభే – కేరళవర్మ లలితాంబాదండకము.

## వ్యాకరణ విశేషములు

**ముప్రత్యయములేని శబ్దములు**

లలితాయుధ చిహ్నలు (4–438) ఉత్పల లుదయించె (11–87)

నీ కంఠకోణ చిహ్న (భీమ–4–72) బీభత్స వొడమ (కాశీ–6–41)

**వైరిసమాసాలు**

విరటజాగర్భంబులు (1–183)

దాక్షిణ్యబలిమి (శృం.నై. 2–80); అనేక బారువుల్. (శృం.నై. 7–11);

కొను – 'క' ఆదేశము

చుట్టుక యుండు (5–2–121) నాటుకయుండు (5–2–147) చీకిలించుక యుండు (కాశీ–3–196)

కుషష్ఠికి ముందు నగాగమము లేకుండుట

వైవస్వత మనువుకు (2స్క–142) పురుషవ్రాతముకైన (2–201)

నిషధేంద్రు బచ్చుకున్ (శృం.నై–6–115) పసపుకిచ్చిరి (శృం.నై. 7–12)

తోడ – తోడుత

ప్రాణము తోడుత నున్నవాఁడవే? (10స్క–1–1756)

శివభక్తిపరాయణుఁ డర్థి తోడుతన్ (హరవి–2–54)

## సంధులు

1. **క్త్వార్థ సంధి**

చ. ఎఱింగెఱింగి నా వలువది (9స్క–515) కాయము కోసిచ్చె (10–2–724)

ఉ. దుర్భాషణముల్ వినీ వినని భంగి (శృం.నై–6–33)

2. **తత్సమ సంధి**

నీతేలా తప్పెను (10–2–788) నిర్వాణమూర్తైన (10–2–1049)

ధూళయ్యె (భీమ–4–143); సీమటు (భీమ–5–77); భూతలఁది (శివరాత్రి–5–52)

**3. ద్రుతద్విత్వ సంధి**

సర్వమున్నతని (7స్క-142) గోష్ఠిన్నెఱింగిన (8స్క-596)

సుతు నిన్నుద్యుక్త శాంతాత్మునిన్. (శివరాత్రి 1-1) చెప్పినన్నిద్ధరణీ (శివరాత్రి 4-66)

## ఛందో విశేషములు

**1. రేఫ సంయుక్తమునకు ముందు లఘువులు**

క. స్తుతి మకరంద ప్రహృష్ట శ్రుతి జాతమధు (3స్క-291)

ఇక్కడ 'ద' గురువు. 'శ్రు' ముందున్న 'ష్ట' లఘువు.

తే.గీ. పృథివిప్రాణ తపోహృదింద్రియములనఁగ (3-369) 'వి' లఘువు.

మ. ఫాలాక్ష బ్రహ్మాదులున్ (12స్క-36) 'క్ష' లఘువు.

ఇట్టివానిని శ్రీనాథుఁడు కూడ వాడినాఁడు.

సీ. పాతాళ శ్రీకాల భైరవస్వామికి (భీమ-4-27) 'ళ' లఘువు.

ఉ. వివిధామరముఖ్య ప్రతిష్ఠితంబులై (భీమ-4-31) 'ఖ్య' లఘువు.

శా. స్రగ్వాసో ఘటికాకమండలు బ్రుసీ (భీమ-4-182) 'లు' లఘువు.

**2. అఖండయతులు**

శా. ర క్షైకారంభకు భక్తపాలన కళా - సంరంభకున్ (1స్క-1)

సీ. కన్నుల కఖిలార్థ లాభంబు - కలుగుచుండు (10-1-1702)

సీ. భక్తిఁ బ్రదక్షిణం - బాచరించి. (భీమ-3-190)

తే.గీ. కాశియణిమాదిసిద్ధుల - కాటపట్టు. (కాశీ-2-50)

**ర-అ యతులు**

మ. మా అట కాసారముఁ బోలె నెమ్మొగముదా - రంజిల్లు (5-1-38)

ఆ.వె. రాచబిడ్డఁ డయిన - అవ్వ మేలె (10-1-321)

క. రజ్జుపరంపరలఁ గ్రమ్మ-అన్ సుతుఁ గట్టన్ (10-1-383)

భాగవతంలో యతిస్థానంలో ర-అ సాంకర్య మెక్కువగా లేదు.

శా. అంతుల్ మానుము కుక్కుటాధమ దరి-ద్రక్షుద్ర (శ్రీనాథుని చాటువు)

ఉ. అంతులు మీఁదు మిక్కిలిగ - ఆగతనంబున (భీమ-4-96)

**ర-ల యతులు**

క. లక్షేక్షురసాబ్ధి సుట్టి - రా విలసిల్లున్. (5స్క-1-61)

క. రంభంబునఁ దిరుగుఁడనిన - లజ్జించి వెసన్ (11-67)

క. లీలా మకరాంక చంద్ర-రేఖాంకుర (శృ.నై 1-112)

(లేఖాంకుర - అని యప్పకవి సవరణ)

శా. లీలాహాస్యకళా ప్రసంగములను - ద్రేకించి (కాశీ-6-210)

(ఉల్లేఖించి యని పరిష్కర్తల సవరణ)

సీ. రాజకుమారుఁడే - లంగఁ గలడు

ఇది శ్రీనాథుని సునందన చరిత్రలోనిదని రంగరాట్ఛందము.

**త-స్న యతి**

సీ. తరుణికి మంగళ - స్నానంబు (భాగ-8-269)

తే.గీ. స్నానమహిమంబు భక్తితా - త్పర్యగరిమ (కాశీ-7-115)

ఉ. స్నానముఁ జేసి ధౌతపరి - ధానముఁ గట్టి (హరవి-2-37)

స్నానశబ్దంలో 'త' కారం కూడ ఉన్నదని కూచిమంచి వేంకటరాయఁడు చెప్పినాడు. 'స్నానము - ప్రకృతి; తానము - వికృతి' యగుటచే నిది తద్భవవ్యాజయతి యని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చెప్పారు.

**న-ణ ప్రాసము**

ఉ. పూని మనంబునుం దనువు భూతములున్ మఱి యింద్రియంబులున్

బ్రాణములున్ వివేకగతి...(6స్క-216). ఇది యాదేశణకారము.

సీ. లంకారాజ్య మునకు నెవ్వఁడు విభీ-షణుని నిలిపె. (10-2-68)

సీ. చాణూర ముష్టిక - ధేనుప్రలంబక (11-7)

ఇవి సిద్ధ ణ కారములు.

క. ప్రాణాపానవ్యానో, దాన సమానములు (కాశీ-5-296) ఆదేశణకారం

తే.గీ. అణఁచునది దంభ ముజ్జగిం-చునది యీర్ష్య (కాశీ-7-120) సిద్ధణకారం

**ర-ఱ ప్రాసము**

క. తెఱఁగొప్ప నఖిల విశ్వముఁ
బురుషోత్తము మాయచేతఁ బుట్టం బెరుఁగున్ (3స్క-343)

భాగవతంలో నిట్టి పద్యా లెక్కువగా ఉన్నాయి.

ఉ. జోఱున - వాఱెడు - తాఱని - చారులు (హరవి-2-32)

తే.గీ. తరుణి విజ్ఞాన మీసూక్ష్మ - మెఱిఁగికొనుము (కాశీ-3-69)

సీ. వ ర ష ధారల చేత - నుఱియకుండ (కాశీ-7-40)

**శ-స ప్రాసము**

సీ. నాసాననాంగదృగ్ - భ్రూశిరోజ (2స్క-158)

శా. ఆశాపాశము - రాశిప్రావృత - గాసింబొందిరి - ఆశంబాయఁగ (8-575)

శా. సంసారభ్రమ - వంశంబీపరి - మాంసాహారము - హింసాక్లేశము (హరవి-2-112)

సీ. కాశీపురక్షేత్ర - వాసమ్ములేకయే (కాశీ-3-69)

మచ్చునకు కొన్ని ఉదాహరణాలు మాత్రమే చూపాను. పోతన సాహిత్యం శ్రీనాథుని సాహిత్యము వలెనే ప్రమాణమని సిద్ధాంతము.

**సర్వలఘుసీసము**

**నవ వికచ సరసిరుహ నయనయుగ! నిజచరణ**
**గగనచరనది జనిత! నిగమనినుత!**
**జలధిసుత కుచకలశ లలిత మృగమద రుచిర**
**పరిమళిత నిజహృదయ! ధరణిభరణ!**
**ద్రుహిణముఖ సురనికర విహిత నుతికలితగుణ**
**కటిఘటిత రుచిరతర కనకవసన!**
**భుజగరిపు వరగమన! రజతగిరిపతివినుత!**
**సతతజపరత! నియమసరణి చరిత!**

**తే. తిమికమఠకిటినృహరిముదితబలి నిహి,**
**త పద పరశుధర దశవదన విదళన!**

**మురదమన కలికలుష సుముదపహరణ!,**
**కరివరద! మునినరసుర గరుడవినుత! (11స్క -72)**

తంజనగరము తేవప్పెరుమాళ్లయ్యగారి ప్రతిలో "ఈ సీసపద్యము పెద్దపాదములలోఁ బ్రతిపాదమునందును దొమ్మిదేసి నలములు గలిగి - లక్షణ సమన్వయములు గాక యున్నవి. తేటగీతి యు నట్లేయున్నది. ప్రతులయం దిట్లే యుండుటంబట్టి దిద్ద వీలుపడదయ్యెను" - అని చెప్పబడినది.

సీసపద్యంలో ప్రతిపాదంలో 6 ఇంద్రగణాలు 2 సూర్యగణాలు ఉంటాయి. అనగా మొదటి ఖండములో 4 ఇంద్రగణాలు రెండవఖండంలో 2 ఇంద్రగణాలు 2 సూర్యగణాలుండును. 'నల-నగ-సల-భ-ర-త' లింద్రగణాలు. 'నల'ము; సూర్యగణాలలో 'న' గణము సర్వలఘువులు గలవి. పైపద్యంలో లయ కుదురుటకై 'నల'ములకు బదులుగా 5 లఘువులు గల 'నలల' ములు గలవు. లాక్షణికు లందఱు సర్వలఘుసీసమునకు లక్షణమిట్లే చెప్పినారు.

సీ. **మృగమదము తిలకమును నగుమొగము చెలువమును**
**కనకవన ననరహరి గరుడ గమన - అప్పకవి (4-531)**

సీ. **కరివరద పరమకృప ధరణిధర సురవినుత**
**కనకవన ననరహరి గరుడ గమన - అప్పకవి (4-531)**

సీ. **గిఱికొనెడు కలువలును దఱచునలి నములొదవఁ**
**బఱపుగల చెఱువుబలె మెఱయు కొలన - చిత్రకవి పెద్దన (ల.సా.సం-2-9)**

**దీనికి విలక్షణముగా శ్రీకోవూరి పట్టాభిరామశర్మగా ఏకాదశ స్కంధములో-**

సీ. **దశరథ వరసుత ప్రశమిత మునిభయ**
**దశముఖ విదళన కుశల సదయ (1031)**

అని నలముల తోనే సర్వలఘుసీసం రచించారు. రెండు విధాలుగాను పద్యాలు రచించవచ్చు.

**కూచిమంచి తిమ్మకవి రాజశేఖర విలాసములో -**

సీ. **తరుణశశి భరణసువి తరణభయ హరణకర**
**యరుణసర సిరుహనిభ చరణ యుగళ (రాజశే-1-17)**

అని 5 లఘువులుగల ఇంద్రగణాలతో సీసం రచించి మరల నచ్చతెనుఁగు రామాయణములో -

సీ. **తొలిపలు కుఁగొనలుఁ దెలియుత పసిబలి**
**వెలుఁగులకు దొరకు చెలవు లగని (అచ్చ-రామా. అరణ్య-114)**

**గణపవరపు వెంకటకవి ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసములు -**

**సీ. నిఖిలసు రదనుజ నికర మథితజల**
**నిధిభవ ఘుమఘుమల నినద మనఁగ. (ప్ర.వే.వి-75)**

**సీ. తనువును దనువును బెనఁగొన నెనసిన**
**మినమిన మనునును చనుమొ నలును (ప్ర.వే.వి-221)**

**సీ. నిగమకవి పవిహరణ నిఖిలవిప దపహరణ**
**సతతచతు రవిహరణ నుతవి తరణ. (ప్ర.వే.వి-366)**

అని రెండు విధాలుగా పద్యాలు రచించాడు.

కాబట్టి భాగవత – సర్వలఘు సీసము సలక్షణమైనదే.

పోతనభాగవతములో సర్వలఘుకందాలు ఎక్కువగా రచించినాడు. ఈసర్వలఘుసీసం పోతన రచించినదో నారయ రచించినదో నిశ్చయంగా చెప్పలేము. సాధారణంగా లక్ష్యం ముందుపుట్టి లక్షణం తరువాత పుట్టును. అనంతుని లక్షణమునుబట్టి భాగవత పద్యము పుట్టినదో, లేక భాగవతపద్యమును బట్టి అనంతుడు లక్షణం వ్రాసినాడో పరిశీలింపవలసిన యంశము. అనంతామాత్యుడు పోతనామాత్యుడు సమకాలికులే.

భాగవతంలోని 11వ స్కంధం వెలిగందల నారయపేరుతో ఉంది.

ఇది శ్రీపరమేశ్వర కరుణాకవిత విచిత్ర కేసన మంత్రి పుత్త్ర సహజపాండిత్య పోతనామాత్యప్రియ శిష్య వెలిగందలనారాయణాఖ్య ప్రణీతంబైన శ్రీమహాభాగవతంబను మహాపురాణంబునందు... ఏకాదశస్కంధము సంపూర్ణము.

కాని ప్రాచీన తాళపత్రప్రతులలో కొన్నిటియందు పోతన గద్యమేగలదు. అకాడమీ ప్రతిలో నిట్లు చెప్పబడింది–

చ.1.నెం.1191. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తువారిది. సంపూర్ణప్రతి. ఇందు ఏకాదశ – ద్వాదశస్కంధాలు కూడ పోతన పేరుతో ఉన్నాయి. దశమస్కంధం పూర్వభాగం చివర సౌమ్యనామసంవత్సర ఆషాఢ శుద్ధ విదియ గురువారం (క్రీ.శ. 25-6-1789) అని కలదు.

నారయ పోతన పద్యములనే యధాతథముగ కొన్ని తావులలో వాడు కొనినాఁడు.

**క. ఉరు సంసార పయోనిధి, తరణంబులుఁ బాపపుంజ తరణంబులు శ్రీ**
**కరణంబులు ముక్తి సమాచారణంబులు బాలకృష్ణ సంస్మరణంబుల్ (10-1-246)**

**క. తరణంబులు భవజలధికి, హరణంబుల దురితల తలకాగమములకా**
**భారణంబు లార్త జనులకు, శరణంబులు నీ పదాబ్జ సంస్మరణంబుల్ (11-15)**

**క. ధారణయే క్రియనిలుచను, ధారణ కేరూప మెద్ది ధారణ యనఁగా (2స్క-13)**

**క. చిత్తంబేక్రియ నిలుచును, జిత్తజగురుపాదపద్మసేవ (11స్క-27)**

క. ధ్యానంబే క్రియ నిలుచును, ధ్యానంబేరీతిఁదగునుద్దాచరిత్రా! (11-104)

క. వర్ణాశ్రమ ధర్మంబుల, నిర్ణయ కర్మములఁజెడక (11-106)

క. మునినాథ! యీ కథాస్థితి, వినిపింపుము వినఁగనాకు వేడుకపుట్టెన్. (8స్క-20)

క. విజితేంద్రియ! వినఁగ నాకు వేడుక పుట్టెన్ (11స్క-49)

క. దేహము నిత్యముగాదని
మోహము దెగఁ గోసి సిద్ధమునివర్తనుఁడై
గేహము వెలువడి నరుఁడు
త్సాహముతోఁ జెందు ముక్తిసంపదననఘా! (1స్క-315;11స్క-102)

స్కంధాంత పద్యాలు కూడ పోతన రచించినవే.

చ. నగుమొగమున్ సుమధ్యమును నల్లని మేనునులచ్చికాటప
ట్టగునురమున్ మహాభుజములంచితకుండలకర్ణముల్ మదే
భగతియునీలవేణియుఁ గృపారసదృష్టియుఁగల్గువెన్నుఁడి
మ్ముగఁబొడసూపుఁగా తఁగను మూసిన యప్పుడు విచ్చినప్పుడున్. (9స్క-732; 11స్క-124)

క. రాజీవ సదృశలోచన!
రాజీవభవాదిదేవరాజివినుత! వి
భ్రాజితకీర్తిలతావృత
రాజీవ భవాండ భాంధ! రఘుకులతిలకా! (7-180)

క. రాజీవసదృశనయన! వి
రాజిత సుగుణా! విదేహరాజ వినుత! వి
భ్రాజితకీర్తసుధావృత
రాజీవ భవాండ భాండ! రఘుకులతిలకా! (11స్క-125)

పోతన పద్యంలోని 'లోచన' అనుదానిని 'నయన' అని; 'రాజీవ భవాది దేవరాజివినుత' యనుదానిని 'విరాజితసుగుణా! విదేహ రాజవినుత!' అని, 'లతావృత' అను దానిని 'సుధావృత' అనీ నారయమార్చి వాడుకొన్నాడు.

మాలిని

ధరణి దుషితృరంతా! ధర్మమార్గానుగంతా!
నిరుపమనయకాంతా! నిర్జరారాతిహంతా!
గురుబుధ శుభవార్తా! కుంభినీ చక్రభర్తా
సురభయపరిహర్తా! సూరిచేతో విహర్తా!! (9స్క-481;11స్క-126)

'కాంతా' అనుదానిని 'వంతా' అనీ, 'కుంభినీ చక్రభర్తా' అను దానిని 'కోసల క్షోణిభర్తా' అనీ నారయ మార్చాడు.

హరిభట్టుకూడ భాగవతమునందలి 6-11-12 స్కంధాలను అనువదించినాడు. రెండు గ్రంథాల్లో పద్యాలు కొంచెం పాఠభేదాలతో సమానంగా ఉన్నాయి. ఈ పద్యాలను బట్టి పోతన జీర్ణస్కంధాల్లో కొన్ని పదాలు, పాదాలు శిథిలమయ్యాయనియు, హరిభట్టు, నారయ ఎవరి ప్రతుల్ని బట్టివారు విడివిడిగా పద్యాలు పూరించారనీ స్పష్టమవుతున్నది.

ఈ విషయాన్నే శేషాద్రిరమణకవులిట్లు చెప్పినారు–

"ఏకాదశ – ద్వాదశస్కంధాలను హరిభట్టారకుఁడు కూడ తెనిగించాడు. ఈతఁడు వరాహపురాణం, మత్స్యపురాణం పద్యకావ్యాలుగ వ్రాశాడు. లాక్షణికుఁడు. ఏకాదశ ద్వాదశస్కంధాలు ఈతనివి నారయస్కంధాలలోని పద్యాలతో చాలవరకు పోలుచున్నవి. దీనిని బట్టి పరిశీలిస్తే పోతన జీర్ణభాగవతాన్ని ఈ ఇరువురు పూర్తిచేసి ఉంటారని తోస్తుంది. హరిభట్టు నారాయణకవి మూలగ్రంథంలోని జీర్ణభాగాల నెటుల పూర్తి చేసిందీ ఈ క్రింది పద్యాల వలన తెలిసికోవచ్చు.

**మ.** **విదితుండై సకలామరుల్ గొలువ నుర్వీభారమున్ మాన్పి, దు**
**ర్మద సంయుక్త వసుంధరాధిపతులన్ మర్దించి, కంసాదులం**
**దుదిముట్టన్ వధియించి, కృష్ణుఁ డతిసంతుష్టాత్ముఁడై యున్నచో**
**యదుసైన్యంబులు భూమి మోవఁగ నసహ్యం బయ్యె నత్యుగ్రమై.** **(11-6)- నారయకవి**

**మ.** **విదితుండై సకలామరుల్ వొగడ నుర్వీభారమున్ మాన్పి, దు**
**ర్మద సంయుక్త వసుంధరాధిపతులన్ మర్దించి, కంసాదులం**
**దుదిముట్టన్ వధియించి, కృష్ణుఁ డతిసంతుష్టాత్ముఁడై యున్నచో**
**యదుసైన్యంబులు భూమిలోన నవిషహ్యం బయ్యె నత్యుగ్రమై.** **– హరిభట్టు**

**తే.** **భక్తులగు యాదవేంద్రులఁ బరఁగఁజూచి,**
**యన్యపరిభవ మెఱుఁగ రీ యదువు లనుచు**
**వీరిఁ బరిమార్ప నేఁ దక్క వేఱొకండు**
**దైవ మిఁక లేదు త్రిభువనాంతరమునందు.** **(11-7) –నారయకవి**

**తే.** **మత్సమర్పిత భక్తిచే మలయుఁగాన**
**యన్యపరిభవ మెఱుఁగ దీయదుబలంబు**
**వీరిఁ బరిమార్ప నేఁ దక్క వేఱె మఱొక**
**దైవ మోపునె త్రిభువనాంతరమునందు.** **– హరిభట్టు**

"ఈ విధముగ పోలికలు గల పద్యములు హరిభట్టార గ్రంథము నుండియు, నారయగ్రంథమునుండియుఁ బెక్కింటి నేర్పఱుప వచ్చును. ఈ పోలికలవలనఁ బోతరాజు జీర్ణస్కంధము లిరువురు నెవరికి వారు పూర్తి చేయుటచే నిట్టి సమాన రచనములు, స్వల్ప వ్యత్యాసములు వచ్చియుండు ననిస్ఫురించును" (వావిళ్ల ప్రతి పీఠిక – 85 పుట)

ఇటి పద్యములను శ్రీ చాగంటి శేషయ్యగారు గుర్తించిరి – 'వాలాయము' (11–22); 'వినుము స్వాయంభువుండు' (11–34); 'దారలయందు' (11–96) మొదలగునవి.

దీనినిబట్టి 11 స్కంధంలో పోతన కవిత ఎక్కువగా ఉందని తెలుస్తున్నది. "మహనీయ గుణగరిష్ఠులగు నమ్ముని శ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండయిన సూతుండిట్లనియె నట్లు పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుండు"– ఈ స్కంధాధి వాక్యాలు పోతన గారివే కదా!

కాఁబట్టి భాగవత మంతయుఁబోతన మహాకవి రచించినదే.

**శ్లో. సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

అన్ని ధర్మాలను విడిచిపెట్టి నన్నే శరణుపొందు. నేను నిన్ను సర్వపాపాలనుండి విముక్తుని చేస్తాను. శోకింపకుమని శ్రీకృష్ణుఁడుద్ధవునికీ స్కంధంలో అభయమిచ్చాడు.

***శ్రీమత్పరమేశ్వరార్పణ మస్తు***

ఇట్లు
సకలసుకవిబుధజనవిధేయుడు
**గరిమెళ్ళ సోమయాజులు శర్మ**

తిరుపతి,
9–2–2017

# ద్వాదశస్కంధ ప్రాశస్త్యం

**భా**గవతంలో ద్వాదశస్కంధం చాలావరకు శిథిలమైంది. ఆ శిథిలభాగాలను యథాశక్తిగా కొంతవరకు పూరించి ఆంధ్రభాగవతానికి ఒక స్వరూపాన్ని కూర్చిన పుణ్యాత్ముడు వెలిగందల నారయ. సంస్కృత భాగవతంతో పోల్చి చూస్తే ఈ స్కంధం మిక్కిలి సంగ్రహంగా ఉంది. మూలంలో పదమూడు అధ్యాయాలు ఐదువందల అరవైతొమ్మిది శ్లోకాలు ఉండగా తెలుగులో యాభైఒక్క పద్యగద్యాలు మాత్రమే ఉన్నాయి.

1. కలియుగ రాజవృత్తాంతం 2. కలియుగ ధర్మాలు 3. కల్కిమూర్తి అవతారం 4. కృతయుగం వచ్చే సమయం 5. భూమిగీతం 6. కలిదోషాలను నివారించేందుకు ఉపాయం 7. యుగధర్మ నిరూపణం 8. కలియుగంలో శ్రీహరినామ కీర్తన మాహాత్మ్యం 9. చతుర్విధ ప్రళయాలు 10. శుకుడు పరమార్థాన్ని ఉపదేశించి పరీక్షిత్తు భయం పోగొట్టుట 11. పరీక్షిత్తు శరీరాన్ని విడిచిపెట్టుట 12. పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు సర్పయాగం చేయుట 13. శ్రీ వ్యాసమహర్షి వేదాలను శాఖలుగా విభజించుట 14. అథర్వవేద విభాగం 15. పురాణ లక్షణాలు 16. మార్కండేయుడు తపస్సుచేసి నరనారాయణుల్ని స్తుతించుట 17. మార్కండేయుడు భగవన్మాయవల్ల ఏర్పడిన మహాప్రళయాన్ని దర్శించుట 18. మార్కండేయుడు వటపత్రశాయి శ్రీకృష్ణుణ్ణి చూచుట 19. మార్కండేయునికి శంకరుడు వరాలిచ్చుట 20. భగవత్స్వరూప వర్ణనం 21. సూర్యవ్యూహవర్ణనం 22. భాగవత విషయానుక్రమణిక 23. అష్టాదశపురాణ శ్లోకసంఖ్య 24. భాగవతమాహాత్మ్యం ఇందులోని ప్రధాన విషయాలు.

### భాగవతం - ప్రాచీన భారత చరిత్ర

బ్రహ్మాండపురాణం, వాయుపురాణం, మత్స్యపురాణం, భవిష్యోత్తరపురాణం ప్రాచీన రాజవంశాలను గూర్చి చెప్పాయి. భాగవతంలో భవిష్యద్రాజుల చరిత్ర ఆనుపూర్విగా ఉంది.

**1. బృహద్రథవంశం**

1. బృహద్రథుడు → 2. పురంజయుడు → 3. శునకుడు → 4. ప్రద్యోతనుడు → 5. విశాఖుడు → 6. నందివర్ధనుడు. వీరి రాజ్యకాలం నూట ముప్పై ఎనిమిది సంవత్సరాలు.

**2. శిశునాగవంశం**

1. శిశునాగుడు → 2. కాకవర్ణుడు → 3. క్షేమవర్ముడు → 4. క్షేత్రజ్ఞుడు → 5. విధిసారుడు → 6. అజాతశత్రుడు → 7. దర్భకుడు → 8. అజయుడు → 9. నందివర్ధనుడు → 10. మహానంది. వీరి రాజ్యకాలం మూడువందల అరవై సంవత్సరాలు.

**3. నందవంశం**

1. మహానంది → 2. మహాపద్మపతి → 3. సుమాల్యుడు మొదలగు ఎనిమిదిమంది కుమారులు. వీరి రాజ్యకాలం వందసంవత్సరాలు.

**4. మౌర్యవంశం**

**నవనందులు -** 1. చంద్రగుప్తుడు → 2. వారిసారుడు → 3. అశోకవర్ధనుడు → 4. సుయశస్సు → 5. సంయుతుడు → 6. శాలిశూకుడు → 7. సోమశర్ముడు → 8. శతధన్వుడు → 9. బృహద్రథుడు. వీరి రాజ్యకాలం నూట ముప్పైఏడు సంవత్సరాలు.

**5. శుంగవంశం**

1. శుంగుడు → 2. అగ్నిమిత్రుడు → 3. సుజ్యేష్ఠుడు → 4. వసుమిత్రుడు → 5. భద్రకుడు → 6. పుళిందుడు → 7. ఘోషుడు → 8. వజ్రమిత్రుడు → 9. భాగవతుడు → 10. దేవహూతి వీరి రాజ్యకాలం నూటపన్నెండు సంవత్సరాలు.

**6. కణ్వవంశం**

1. కణ్వామాత్యుడు / వసుదేవుడు → 2. భూమిత్రుడు → 3. నారాయణుడు. ఈ వంశీయుల రాజ్యకాలం మూడువందల నలబై ఐదు సంవత్సరాలు.

**7. ఆంధ్రవంశం**

1. సుశర్ముడు → 2. ఆంధ్రుడు / వృషలుడు → 3. వాని తమ్ముడు కృష్ణుడు → 4. శాతకర్ణుడు → 5. పౌర్ణమాసుడు → 6. లంబోదరుడు → 7. శిబిలకుడు → 8. మేఘస్వాతి → 9. దండమానుడు → 10. అరిష్టకర్మ (హాలేయుడు) → 11. తిలకుడు → 12. పురీషసేతుడు → 13. సునందనుడు → 14. వృకుడు → 15. జటాపుడు → 16. శివస్వాతి → 17. అరిందముడు → 18. గోమతి → 19. పురమంతుడు → 20. దేవశీర్షుడు → 21. శివస్కందుడు → 22. యజ్ఞశీలుడు → 23. శ్రుతస్కందుడు → 24. యజ్ఞశత్రుడు → 25. విజయుడు → 26. చంద్రబీజుడు → 27. సులోమధి…వీరి రాజ్యకాలం నాలుగువందల యాభై ఆరు సంవత్సరాలు.

**8. ఆభీరాది వంశాలు**

1. ఆభీరులు ఏడుగురు → 2. గర్దభులు పదిమంది → 3. కంకవంశజులు పదహారుగురు → 4. యవనులు ఎనిమిదిమంది → 5. బర్బరులు పద్నాలుగురు → 6. మురుండులు పదమూడుమంది → 7. మౌనులు పద్నాలుగురు  వీరి రాజ్యకాలం వెయ్యి తొమ్మిదివందల తొమ్మిది సంవత్సరాలు.

**9. మౌలివంశం**

మౌలివంశజులు పదకొండుగురు వీరి రాజ్యకాలం మూడువందల సంవత్సరాలు.

**యవనవంశం**

1. భూతనందుడు → 2. యవభంగిరుడు → 3. శిశునందుడు → 4. వాని తమ్ముడు యశోనందుడు → 5. ప్రవీరకుడు వీరి రాజ్యకాలం నూట ఆరు సంవత్సరాలు. ఇది భాగవతంలోని రాజవంశక్రమం. ప్రాచీన పురాణాలను అనుసరించి నవీన చారిత్రికులు రాజవంశాలను ఈ విధంగా నిర్మించారు.

| | రాజవంశం | రాజుల సంఖ్య | సంవత్సరాలు |
|---|---|---|---|
| 1. | బృహద్రథవంశం | 22 | 1006 |
| 2. | చాలక (ప్రద్యోత) వంశం | 5 | 138 |
| 3. | శిశునాగవంశం | 10 | 360 |
| 4. | నందవంశం | 9 | 100 |
| 5. | మౌర్యవంశం | 12 | 316 |
| 6. | శుంగవంశం | 10 | 300 |
| 7. | కణ్వవంశం | 4 | 85 |
| 8. | ఆంధ్రవంశం | 32 | 506 |
| 9. | గుప్తవంశం | 7 | 245 |

ఉపరిచరవసువు పుత్రుడు బృహద్రథుడు మగధరాజ్యం పాలించాడు. బృహద్రథుని కొడుకు జరాసంధుడు. జరాసంధుని కొడుకు సహదేవుడు. ఈ సహదేవుడు పాండవపక్షంలో ఉండి కురుక్షేత్రయుద్ధంలో పద్నాలుగో రోజు ద్రోణాచార్యుని చేతిలో మరణించాడు. ఈ విషయాలు భాగవతంలోని నవమస్కంధంలో, భారతంలోని ద్రోణపర్వంలో చెప్పబడ్డాయి. సహదేవుని కొడుకు మార్జారి. మర్జారి నుండి ఇరవై ఇద్దరు రాజులు వేయి సంవత్సరాలు రాజ్యంచేశారు. ఈ రాజవంశాల చరిత్రలు వారి రాజ్యకాలాలు పురాణాలలో చెప్పబడ్డాయి.

**వ. కృష్ణుం డెంతకాలంబు భూమి యందుఁ బ్రవర్తించె, నంతకాలంబును గలి సమాక్రాంతంబు గాదు; మఘానక్షత్రంబందు సప్తర్షులు నే ఘస్రంబునఁ జరియింతు రా ఘస్రంబునఁ గలి ప్రవేశించి వేయునిన్నూఱు వర్షంబు లయి యుండు (12-13)**

శ్రీకృష్ణనిర్యాణం నాడే కలియుగం ఆరంభమైంది. పరీక్షిత్తుకు పట్టాభిషేకం అయ్యేనాటికి సప్తర్షిమండలం మఘానక్షత్రంలో ఉండింది. సప్తర్షిమండలం ఒక్కొక్క నక్షత్రంలో నూరు సంవత్సరాలుంటుంది. కలియుగారంభానికి ముప్పైఆరు సంవత్సరాలముందు (క్రీ.పూ. 3139) మహాభారతయుద్ధం జరిగింది. క్రీ.పూ. 3102 సంవత్సరంలో కలియుగం ఆరంభమైంది. పంచాగగణనం అనుసరించి ఈ 2016 – 17లో కలియుగాబ్దం 5117 జరుగుతున్నది. (3102+2015= 5117). 5100 సంవత్సరాలక్రితం పురాణాలు రచించబడ్డాయి.

## కలియుగం - హరినామస్మరణం

కలియుగం పాపభూయిష్ఠమైంది. ధనవంతుడే రాజ్యం పాలిస్తాడు. ధర్మం నశిస్తుంది. అధర్మం పెరుగుతుంది.

**క. దినదినమును ధర్మంబులు, ననయము ధర నడఁగిపోవు నాశ్చర్యముగా**
**విను వర్ణచతుష్కములో, నెనయఁగ ధనవంతుఁడైన నేలు ధరిత్రిన్. (12-9)**

ఇటువంటి కలియుగంలో శ్రీహరినామస్మరణం ఒక్కటే మోక్షోపాయం.

**క. బలవంతుఁ డైనవాఁడే, కులహీనుండైన దొడ్డగుణవంతుఁ డగుం**
**గలిమియు బలిమియుఁ గలిగిన, నిల లోపల రా జతండె; యేమన వచ్చున్? (12-10)**

**క. గజతురగాదిశ్రీలను, నిజ మని నమ్మంగ రాదు;నిత్యమును హరిన్**
**గజిబిజి లేక తలంచిన, సుజనులకును నతని యందుఁ జొరఁగా వచ్చున్. (12-7)**

**వ. "ఈ కలియుగంబున నొక్క ముహూర్తమాత్రం బయిన నారాయణ పరాయణులై మనంబున శ్రీనృసింహవాసుదేవ సంకర్షణాది నామంబుల నచంచలభక్తిం దలంచువారలకుఁ గ్రతుశతఫలంబు గలుగు" (12-20)**

కాబట్టి మనస్సులో ఎల్లప్పుడూ హరిని స్మరింపుమని శుకమహర్షి పరీక్షిత్తుకు ఉపదేశించాడు.

**ద్వాదశాదిత్యులు**

భారతీయజ్యోతిషశాస్త్రాన్ని అనుసరించి ఖగోళంలో పన్నెండుగురు సూర్యులున్నారు. ఒక్కొక్కమాసంలో ఒక్కొక్క సూర్యుడు ఉదయిస్తాడు. వారి పేర్లివి.

1. చైత్రం - ధాత 2. వైశాఖం - అర్యముడు 3. జ్యేష్ఠం - మిత్రుడు 4. ఆషాఢం - వరుణుడు 5. శ్రావణం - ఇంద్రుడు 6. భాద్రపదం - వివస్వంతుడు 7. ఆశ్వయుజం - త్వష్ట 8. కార్తికం - విష్ణువు 9. మార్గశీర్షం - అంశుడు 10. పుష్యం - భగుడు 11. మాఘం - పూషుడు 12. ఫాల్గునం - పర్జన్యుడు (క్రతువు)

| అష్టాదశపురాణాలు | - | శ్లోకసంఖ్య |
|---|---|---|
| 1. బ్రహ్మపురాణం | - | 10,000 |
| 2. పాద్మపురాణం | - | 55,000 |
| 3. విష్ణుపురాణం | - | 23,000 |
| 4. శివపురాణం | - | 24,000 |
| 5. భాగవతపురాణం | - | 18,000 |
| 6. నారదపురాణం | - | 25,000 |
| 7. మార్కండేయపురాణం | - | 9,000 |
| 8. అగ్నిపురాణం | - | 15,400 |
| 9. భవిష్యోత్తరం | - | 14,500 |
| 10. బ్రహ్మవైవర్తం | - | 18,000 |

| | | |
|---|---|---|
| 11. లింగపురాణం | - | 11,000 |
| 12. వరాహపురాణం | - | 24,000 |
| 13. స్కాందపురాణం | - | 81,100 |
| 14. వామనపురాణం | - | 10,000 |
| 15. కూర్మపురాణం | - | 17,000 |
| 16. మత్స్యపురాణం | - | 14,000 |
| 17. గరుడపురాణం | - | 19,000 |
| 18. బ్రహ్మాండపురాణం | - | 12,000 |
| శ్లోక సంఖ్య | - | 4,00,000 |

ద్వాదశస్కంధాన్ని వెలిగందల నారయ రచించినట్లు ముద్రితప్రతుల్లో స్కంధాంత గద్యంలో ఉంది.

**"ఇది శ్రీ పరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారాయణ నామధేయ ప్రణీతంబైన... ద్వాదశస్కంధము"**

కాని కొన్ని తాళపత్రప్రతుల్లో పోతనామాత్యుని గద్యమే ఉంది. ఎకాడెమీ ప్రతి పీఠికలో ఇలా చెప్పబడింది.

1. ప.నెం.1628. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు వారిది. రాయలసీమ ప్రతి ద్వాదశస్కంధాంత గద్యం పోతన పేరుతో ఉంది. చిట్టచివర స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశకవర్షంబులు 1740 అగు నేటి బహుధాన్యనామ సంవత్సర మార్గశిర బహుళవిదియ ఇందువాసరం వరకు (క్రీ.శ.14-2-1818) కొట్టపాటి భాస్కరయ్య వ్రాసిన భాగవతం ద్వాదశస్కంధాలు.

2. జి.4.3456. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు వారిది. దూపాటి వెంకటరమణాచార్యులుగారు తెలంగాణము (బమ్మెరప్రాంతము) నుండి సేకరించి పంపినది. ద్వాదశ స్కంధాంత గద్యము పోతనామాత్యుని పేరుతో ఉంది.

నారయ స్కంధాంతంలో పోతన పద్యాలే వాడుకొన్నాడు.

**క. జనకసుతాహృచ్చోరా!, జనకవచోలబ్ధవిపినశైలవిహారా!**
**జనకామితమందారా!, జననాదికనిత్యదుఃఖచయసంచారా! (9స్క-735; 12స్క-52)**

నాల్గోపాదాన్ని జననాదిక నిత్యదుఃఖచయసంహార అని నారయ మార్చినాడు.

**మాలిని. జగదవనవిహారీ! శత్రులోకప్రహారీ! సుగుణవనవిహారీ; సుందరీమానహారీ!**
**విగతకలుషపోషీ! వీరవర్యాభిలాషీ! స్వగురుహృదయతోషీ! సర్వదా సత్యభాషీ! (9స్క-736; 12స్క-53)**

మహనీయగుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు...అను స్కంధారంభ వచనం పోతనగారిదే కదా!

హరిభట్టుకూడా ద్వాదశస్కంధం పూరించాడు. ఈ రెండు గ్రంథాల్లో నరవర (12-3); నరవర తొంటిభూపతుల (12-14); ఈ జగంబేలు (12-17); ఉత్తమశ్లోకుడన (12-19); ఏను మృతుండనౌదునని (12-25); మృతియును జీవనంబు (12-27) అను పద్యాలు సమానంగా ఉన్నాయి. ఈ పద్యాలు పోతనవే.

**మ. అని యీరీతి నుతించి భాగవత మాద్యంతంబు సూతుండు సె**
**ప్పిన సంతుష్టమనస్కులై విని మునుల్ ప్రేమంబునం బద్మనా**
**భునిఁ జిత్తంబున నిల్పి తద్గుణములన్ భూషించుచున్ ధన్యులై**
**చని రాత్మీయనికేతనంబులకు నుత్సాహంబు వర్ధిల్లఁగన్. (12-51)**

ఈ భాగవతంలోని చివరి పద్యంకూడా పోతన రచించిందే.

**సాధనులై యక్షభటుల్ పురిన్ వెడలి రుత్సాహంబు సంధిల్లఁగన్. (4-323)**

**సంసరణాంభోధిఁ దరింపవయ్య పరమోత్సాహంబు దీపింపఁగన్. (4-631)**

అని పోతన చతుర్థస్కంధంలోకూడా రెండు పద్యాలను ఇట్లే ముగించాడు.

**చేయించెన్ మూఁడు తురంగమేధములు దేవేంద్రప్రభావంబునన్. (1-176)**

**యేపారంగ మఖంబు సేసితిరి దేవేంద్రప్రభావంబునన్. (7-471)**

ఈ విధంగా తన పద్యాలను తానే అనుకరించడం పోతన పద్ధతి. గంగన, సింగన, నారయలు శిథిలభాగాలకు అతుకులువేస్తూ పూరించారు. పన్నెండు స్కంధాల భాగవతం పోతన రచించిందే.

## బమ్మెరపోతన సకలాంధ్ర లక్షణ చక్రవర్తి

**సీ. అఖిలవేదాంతవిద్యారహస్యవిదుండు, సహజపాండిత్యవిశారదుండు**
**మత్తక్షితీశాధమస్తోత్రవిముఖుండు, శంభుపదాబ్జపూజారతుండు**
**పటుతరకవితావిభాసితప్రముఖుండు, సకలాంధ్రలక్షణచక్రవర్తి**
**రఘుకులేశనిదేశరచితమహాభాగ, వతపురాణుఁడు పుణ్యవర్ధనుండు**

**తే.గీ. బుధ జనహితుండు బమ్మెరపోత సుకవి, యెన్న రేఫ ఱకారంబు లెఱుఁగఁ డనుచు**
**నజ్ఞు లొకకొంద ఱాడుదు రామహాత్ము, కవిత కెందును లోపంబు కలుగ దధిప!**

– కూచిమంచి తిమ్మకవి... సర్వలక్షణ సారసంగ్రహము.

## పోతన - లాక్షణికులు

పోతన భాగవతాన్ని లాక్షణికులు ప్రమాణంగా ఉదాహరింపలేదని కొందరు విమర్శకులు భావించారు. అది సత్యంకాదు. వెల్లంకి తాతంభట్టు మొదలుకొని ఎందరో లాక్షణికులు పోతన ప్రయోగాలను ప్రమాణంగా స్వీకరించారు.

**1. వెల్లంకి తాతంభట్టు (1425-1500)**

తాతంభట్టు తన కవిచింతామణిలో నారాయణశతకాన్ని భోగినీదండకాన్ని ప్రమాణంగా చూపించాడు.

**ఆ.వె. భేద్య భేదకముల భేద్యంబు చెల్లదు, వరవిభక్తిలింగవచనములకు**
**నొండు భేదకమున నుండును బ్రథమయు, జయము రక్షకుండు శౌరి కనఁగ**

**లక్ష్యము**

**మ. నెఱయన్ నిర్మలమైన నీస్తుతి కథానీకంబు పద్యంబులో**
**నొఱగుల్ మిక్కిలి గల్గెనేని యవియున్ యోగ్యంబె చర్చింపఁగాఁ**
**గుఱుకుం డైనను వంకఁ బోయినఁ గదున్ గుజ్జైనఁ బేదెత్తినన్**
**జెఱకుంగోలకుఁ దీఁపె కాని కలదే చేఁదెందు నారాయణా - నారాయణశతకము-4**

**ఆ.వె. కాలవాచకముల కడనున్న సప్తమి, ప్రథమ యగును రాత్రి పవ్వళించె**
**వానకాలమెంత వానికిఁ బోరాదు, రేయి పోయి పగలు వ్రేత వచ్చె.**

భోగినీదండకం - ఏల రేళ్ళుం బగళ్ళున్ విచారించ

పోతన రేలుం బగలుం నిమేషంబులు (10-1-1233) అని భాగవతదండకంలో కూడా ప్రయోగించాడు. వెల్లంకి తాతంభట్టు 'సంక్షేప భాగవతము' రచించాడు.

**2. అప్పకవి (1656)**

అప్పకవి సహజపాండిత్యుని సంస్మరించి (1-28) భాగవతము సలక్షణమైనదని చెప్పి రేఫ-శకటరేఫ (ర-ఱ) సాంకర్యముండటంవల్ల పూర్వలాక్షణికులు ఉదహరించలేదని తాను మాత్రం ఆకాశం నిత్యమైనందుకు భాగవతం ద్వితీయస్కంధంలో

**ఉ. సర్వఫలప్రదాతయును, సర్వశరణ్యుఁడు, సర్వశక్తుఁడున్**
**సర్వజగత్ప్రసిద్ధుఁడును, సర్వగతుం డగు చక్రపాణి యీ**
**సర్వశరీరులున్ విగతసంగతిఁ జెంది విశీర్యమాణులై**
**పర్వినచో నభంబుగతి బ్రహ్మము దాఁ జెడకుండు నెప్పుడున్. (2-210) అప్పకవి (4-69)**

అనే పద్యాన్ని ఉదాహరించాడు.

**3. అహోబలపండితుడు (17వ శతాబ్దం)**

ఇతడు రచించిన కవిశిరోభూషణం సుప్రసిద్ధ వ్యాకరణ గ్రంథం.

**శ్లో. కావ్యే బమ్మెరపోతరాజసుకవే రాంధ్రే కృతీశః స్వయం...**

భాగవతంలో – అలవైకుంఠపురంబులో నగరిలో అనే పద్యాన్ని శ్రీ విష్ణుమూర్తి స్వయంగా పూరించాడని అహోబలుడు చెప్పాడు.

1. 'అస్యస్తేత్యుదీరితః' ఇత్యాద్యనుసారేణ 'కలఁడు కలండనెడి వాఁడు కలఁడో లేఁడో (భాగ–8–86)

2. ఆకర్ణింపుదురు పెద్ద లతిహర్షమునన్ (8–21) ఇత్యాదే
'ఆకర్ణింతురు మహాత్ము లతిహర్షమునన్' ఇత్యాది పాఠ ఏవ సాధుః

3. కలఁగకుఁడీ వధూజనులు (భాగ–10–1–912; అహో–299 పుట)

4. చాలుఁ బదివేలువచ్చె (10–2–881; అహో–423 పుట)
మొదలగు పద్యాలను అహోబల పండితుడు ఉదాహరించాడు.

**4. కూచిమంచి తిమ్మకవి (1740)**

కూచి మంచి తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహంలో రేఫ–శకటరేఫ (ర–ఱ) ప్రకరణంలో భాగవతంనుండి చాలా పద్యాలను ఉదాహరించాడు.

1. పురుటాలు – ఇకార వికల్పసంధి

**క. పురుటాలికిఁ బది దినములు (8స్క–516)**

2. అలకములు

**సీ. నిటలాలకము లంట నివురు జుంజుమ్మని (8స్క–104)** అను పద్యాలను కూడా ప్రమాణంగా చూపినాడు.
అలకలు – అలకములు అను రెండు రూపాలు ఉంటాయి.

**5. మండ లక్ష్మీనృసింహకవి (1800)**

లక్ష్మీనృసింహకవి త్రిలింగశబ్దానుశాసనంలో

**సూ. నిందాయాం గిః (86)**

**సూ. ఆమ్రేడితపద స్యాదివర్ణస్య నిందార్థే గిరాదేశః స్యాత్**

సురలు – గిరలు; తిన్నె – గిన్నె; ఇల్లు – గిల్లు

శ్రీమద్భాగవతే

**క. ఈ స్తంభంబునఁ జూపఁ గలవె? చక్రిన్ గిక్రిన్ (7స్క–279)**

ఇతి పోతరాజు ప్రయోగాచ్చ (త్రిలింగ – పుట. 80)

అని భాగవతప్రయోగమే ఉదాహరించాడు. దీనినే చిన్నయసూరి బాలవ్యాకరణంలో

**సూ. నిందయం దామ్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వదీర్ఘములకు గిగీ లగు (బాల-ప్రకీర్ణక-22)**

కుంభకర్ణుఁడు - గింభకర్ణుఁడు; రావణుఁడు - గీవణుఁడు అని విస్తరించి సూత్రించాడు.

ఈ గిగ్యాదేశాన్ని భాగవతంలో పోతన ఎక్కువగా వాడినాడు.

**మ. హరియంచున్ గిరియంచు నేల చెడ (7స్క-146)**

ఇక్కడ హరి= సింహము; కిరి= పంది అని ధ్వని.

**మ. వలదీదానము గీనముం బనుపు మీ వర్ణిన్ వదాన్యోత్తమా (8-586)**

**శా. రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే (8-592)**

**క. రాజ్యము గీజ్యమ్ము ముక్తిరతునకు నేలా (9-507)**

**6. కూచిమంచి వెంకటరాయుడు (19శ)**

ఇతడు సుకవి మనోరంజనం అనే గొప్ప లక్షణ గ్రంథాన్ని రచించాడు. పోతన ప్రయోగాలను ఎన్నింటినో ప్రమాణంగా తీసుకున్నాడు. రేఫ - శకటరేఫ (ర-ఱ) ప్రకరణంలో కూచిమంచి తిమ్మకవి ఉదహరించిన పద్యాలనే కాక ఇతర పద్యాలను కూడా పేర్కొన్నాడు.

**1. బిందుప్రాసం**

నకారంతో హల్లున్ను బిందువు పక్కన ఉన్న హల్లున్ను ప్రాస అవుతుంది. ఆంధ్రలక్షణ చక్రవర్తి బమ్మెరపోతనగారి దశమస్కంధం

**ఉ. కిన్కలు ముద్దుపల్కులును... జంకెలు.... కొంకక.... అంకిలి (భాగ-10-2-265)**

**2. అఖండయతి ప్రకరణం**

శ్రీనాథాది మహాకవి ప్రయోగాలు 40, అరవై ఆరు లక్ష్యాలు వ్రాశాం. పోతనగారి భాగవతంనుండి కూడా కొన్ని ప్రయోగాలు చూపుతున్నాం.

**శా. లోకర - క్షైకారంభకు భక్తపాలనకళా సంరంభకున్. (1-1)**

**మ. పు - ట్టదు నేత్రంబులు నెట్టిగావు నిజజూ - టార్ధేందుఁడున్ (8-245)**

**శా. కాం - తాకారంబు జగన్నిమజ్జనము గ-న్నన్ (8-304)**

**ఉ. లో - కైక శరణ్య! యోయభయ - కారణ! (10-1-680)**

**సీ. కన్నుల - కఖిలార్థలాభంబు - గలుగుచుండు (10-1-1706)**

భారత - భాగవత - రామాయణాది మహాకావ్యలక్షణములు డెబ్బైనాల్గు పేర్కొన్నాం.

**3. ప్రాణపదము హల్లుకు - పోతరాజుగారి భాగవతము**

క. ప్రాణంబులు నిమిషభంగు - రములని మగువా! (8-185)

**7. చిన్నయసూరి (1806-1862)**

చిన్నయసూరి 1. ఆంధ్రనిఘంటువు 2. సూత్రాంధ్ర 3. బాలవ్యాకరణాలలో భాగవతాన్ని ప్రమాణంగా చూపించాడు.

**I. ఆంధ్ర నిఘంటువు**

**1. ఇఱుము :** వి.క. (ఇఱుంబు) - మూల, మఱుఁగు చోటు.

**క. తన కడుపున నొక యిఱుమున**
**గొనకొని జగములను నిముడుకొను పెనుముదుకండు (8-496)**

**2. ఉబ్బతిలు :** అ.క్రి. (ఉబ్బు). ఉబుకు

**మ. బ్రహ్మాండక కటాహముబ్బతిలి తీంద్రంబై (8-625)**

**3. ఎగువ :** అ.క్రి. బాధింప

**ఉ. నమ్మిన ముగ్ధలన్ రహితనాథుల నక్కట! నేఁడు రెండు మూఁ**
**దమ్ముల యేటుకాఁ డెగువ నడ్డము రాఁదగదే కృపానిధీ! (10-1-1056) (రెండూ మూఁడమ్ముల= 5 బాణముల)**

**4. కటారము :** కటారి (బాఁకు)

**క. గదల నడచియుఁ గటారంబులఁ బొడిచియు (10-2-418)**

**5. గొద్దేఱు :** క్రి. విఱ. వ్యర్థముగా

**క. గొద్దేటి ప్రమంది రాలన (8-217)**

**6. తిగుచు :** స.క్రి. తిగియు, తివ్వు= లాగు, ఆకర్షించు. దగ్గఱగా లాగుకొని చేరఁదీయు.

**తే.గీ. ఇషువుఁ దొడుగుట దిగుచుట యేయుటెల్ల. (10-2-177)**

**7. తొగల సంగడికాఁడు :** వి. చంద్రుఁడు

**సీ. ముందర వెలుఁగొందు ముక్తాలలామంబు**
**తొగల సంగడి కాని తునుక కాఁగ. (10-1-297)**

**8. దుడుకడుచు :** అ.క్రి. మునుఁగు

క. **దుడుకని మహిమాబ్ధి నజుఁడు దుడు కడిచె నృపా (10-1-546)**

**9.** **నఱుకు :** స.క్రి. నర్కు, నఱకు, ఖండించు.

వ. **వాజుల కుఱికియు, వాలంబుల నఱికియు. (6-370)**

**10.** **నిజపట్టు :** క్రి. నిజముగాఁ దలఁచు

చ. **తెలియఁగఁ గోరి యేఁ బలికితిన్ మదిలో నిజపట్ట నేటికిన్ (10-2-63)**

**11.** **నెట్టెము :** వి. నెట్టము, శిరస్త్రాణము, గుండ్రపాగ.

వ. **కవచంబులు నెట్టెంబులుఁ బెట్టుకొని. (8స్క-208)**

**12.** **నెర :** **విణ :** మిక్కిలి, పూర్ణముగా

క. **నెర నమ్మి వస్త్రమాల్యా**
**భరణంబు లలంకరించు పామరజనులున్. (3-468)**

**13.** **పదురు :** అఱుపు. కూఁత.

మ. **కమనీయంబగు వేఁటకాని పదు రాకర్ణించి. (10-1-1462)**
**(పలు కాకర్ణించి - అని ముద్రిత పాఠములు)**

**14.** **పల్లించు :** స.క్రి. రథవాహనాదుల నెక్కుటకు సిద్ధపఱపించు.

మ. **ఏ పరివారంబును జీరఁ దభ్రగపతిం బల్లింపఁడు. (8-96)**

**(పన్నింపఁడు - అని ముద్రితపాఠములు)**

**II. సూత్రాంధ్ర వ్యాకరణం**

సూ. **క్వాపి భేదకస్య కోః ప్రథమాన్యతరస్యామ్ । (కారక-27)**

మ. **కృశమధ్యల్ పదివేవు రంగనలతోఁ గ్రీడింప. (భాగ-9-704)**
**అత్ర సర్వనామ్నా సహ, విశేషణానాం చ ప్రథమా ॥**

**III. బాలవ్యాకరణం**

సూ. **శేషషష్ఠికి యొక్కయు నగు. (బాల-కారక-15)**

కు వర్ణకంబును గొన్నియెడల సంబంధంబునం దగు.

శా. **నాకుం దమ్ముఁడు మీకు నెచ్చెలి. (భాగ-7-30)**

**సూ. జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగానగు. (బాల-కారక-22)**

రాముఁడు వాలి నొక్క కోలం గూలనేసె-కోలతో నని యర్థము.

**క. లీలన్ రామవిభుం డొక, కోలన్ గూలంగ నేసె. (భాగ-9-273)**

**సూ. ఆగమచకారంబునకు నెఱసున్న మీఁది దానికి దుక్కు పరం బగునపుడు పకారంబు విభాష నగు. (బాల-క్రియా-90)**

ఆకర్ణింపుదురు - దంపుదురు - చింపుదురు. పత్వంబు రాని పక్షంబున వక్ష్యమాణ తాదేశంబు. ఆకర్ణింతురు - దంతురు - చింతురు.

**క. ఆకర్ణింపుదురు పెద్ద లతిహర్షముతోన్. (8స్క-21)**

'ఆకర్ణింపుదురు' - అను రూపం అహోబలపతి అంగీకరింపలేదు. చిన్నయసూరి అంగీకరించినాఁడు. వ్యాకరణ విషయంలో సూరిగారిదే తుది తీర్పు.

**8. బహుజనపల్లి సీతారామాచార్యులు (1885)**

భారత ప్రయోగాలను సాధించడంకోసం పరవస్తువారు బాలవ్యాకరణం రచిస్తే భాగవతప్రయోగాలను సాధించడానికి బహుజనపల్లివారు ప్రౌఢవ్యాకరణం సంతరించారు.

1. ఇప్రత్యయాంతావ్యయంబునకు సంధియుఁ జూపట్టెడి. (ప్రౌఢ-సంధి-2)

**చ. ఎఱింగెఱింగి నా వలువది యేల కట్టుకొనవచ్చును దానవి! (భాగ-9-515)**

2. కొన్నియెడలఁ బ్రామాణిక ప్రయోగంబుల ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి. (సంధి-3)

**ఉ. సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునం దుల్లము సేర్చి (భాగ-7-142)**

3. కొన్నియెడల ద్వంద్వంబునం బదంబుమీఁది చతపలకు సదవలు గానంబడవు. (సంధి-6) 'రాకపోకలు' (భాగ-10స్క)

**క. భుజములు తలకడవ రాకపోకలఁ జీరున్. (భాగ-1-370)**

4. హలవసానంబులు పరంబులగునపు డేమి శబ్దముయొక్క మికారమునకు లోపంబు వైకల్పికంబు. (సంధి-16)

**క. శవముక్రియనుండెడిదే? (భాగ-9-408)**

5. రోశబ్దంబొండు సంబోధనంబున స్త్రీవాచకంబునకుఁ బరంబుగనగు; అది హ్రస్వాంతంబును నయ్యెడి (శబ్ద-14)

**చ. రమణిరొ! భృత్యులందు నపరాధము గల్గిన. (భాగ-4-788)**

6. సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యుఁ గ్రియల మీఁది యమ్మాదు లేకవచనాంతంబులగు. (శబ్ద-44)

**ఆ.వె. మన యశోద చిన్నిమగవానిఁ గనెనఁట**
**చూచి వత్తమమ్మ! సుదతులార! (భాగ-10-1-184)**

7. నిన్ను నన్నుఁ దన్ను - వీని యందలి ద్విత్వంబునకేనియు ద్విత్వయుక్తనువర్ణంబున కేనియు మిమ్ము మమ్ముఁ దమ్ము వీని యందలి ద్విత్వంబునకు లోపంబు వైకల్పికంబు. (శబ్ద-73)

**ఉ. నిన్ నమ్మిన వారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ శాంకరీ! (10-1-1751)**

8. నామపునర్గ్రహణంబున భిన్నంబు నభిన్నంబు నయి తచ్ఛబ్దార్థంబు తత్పర్యాయంబగు. (శబ్ద-75)

**ఉ. వాఁడె సురాసురులెల్ల నడ్డమై । వచ్చిననైన రాక్షసవివాహమునం గొనిపోవు. (10-1-1734)**

9. నామ తదేతత్కిమర్థంబులకుం బునర్గ్రహణంబునఁ బ్రథమాద్యంతమయి పూర్వపరంబులుగ నాత్మార్థం బభిహితంబగు. (శబ్ద-77)

**ఉ. తా వచ్చె సుదర్శనాయుధుఁడు (భాగ-10-1-1734)**

**క. కర్మములు మేలు నిచ్చును, గర్మంబులు కీడు నిచ్చుఁ గర్తలు దనకున్**
**గర్మములు బ్రహ్మకైనను, గర్మతుఁడై పరులఁ దడవఁగా నేమిటికిన్. (10-1-132)**

10. ఆత్మార్థం బొకానొకచో నామాస్మదర్థాభిధాయియు నగు (శబ్ద-78)

**క. తన తొంటి కర్మరాశికి (10-1-30) తన= ప్రాణియొక్క**

11. ఒకశబ్దం బొక్కచో నల్పార్థకం బగు. (శబ్ద-84)

**మ. ఒక మున్నూఱు గదల్చి తెచ్చిన లలాటోగ్రాక్షు చాపంబు (9-262)**

12. ఏఁ డే రే దేవి శబ్దంబు లర్థ విశేషంబునం దీకారాంతంబులగు (శబ్ద-87)

**శా. వారేరీ సిరి మూట గట్టుకొని పోవం జాలిరే? (భాగ-8-500)**

13. ఒకానొకచోఁ దోడకుఁ దోడుత నని రూపాంతరంబును గలదు. అయినను దానికివలె దీని కితరకార్యంబు కలుగదు. (కారక-8)

**చ. పగతురచేతిలోఁ బడక ప్రాణముతోడుత నున్నవాఁడవే? (10-1-1756)**

14. వలన కాదేశంబులగు ద్వితీయాసప్తములమీఁదియుండికి లోపంబు బహుళంబుగానగు. (కారక-11)

**క. విచ్చేయు మదితిగర్భముఁ జెచ్చెర వెలువడు మహాత్మ! (8-504)**
గర్భమున్= గర్భమునుండి. సప్తమి మీది యుండికి -

**సీ. రక్తంబు వదనగహ్వరమున వఱదవాఱ. (10-1-1363)**

(వదనగహ్వరమున= వదన గహ్వరమునుండి)

15. కొన్ని యెడల విశేషణోభయపదంబులు త్రికక్రియాజన్యవిశేషణఘటితంబులు సందర్భయోగ్య పదవ్యవహితంబులగు. (సమాస-18)

**తే.గీ. నెఱులు గల మరు నీలంపు టురుల సిరుల, నరులు గొనఁజాలి నరులను మరులు గొలుపు**
**నిరుల గెలిచిన తుమ్మెద గఱులఁ దెగడు, కురుల నులిదీర్చి విరులిడి కొప్పు వెట్టి (10-2-242)**

(ఈ పద్యం ప్రాసనియమం పాటించిన తేటగీతి. మొదటి మూఁడు పాదాల్లో బ్రాసయతులున్నాయి.)

16. అట్లు పోలె బలె వలె శబ్దంబు వివార్థకంబులు (సమాస-38)

**క. జ్ఞానులచే మౌనులచే, దానులచే యోగసంవిధానులచేతన్**
**బూనిన బద్ధుం డగునే?, శ్రీనాథుఁడు భక్తియుతులచేతం బోలెన్. (10-1-390)**

17. అట్టి పోని బోఁటి వంటి శబ్దంబులు తదర్థకంబులు. (సమాస-43)

**మ. నీయట్టిపుణ్యాత్మకుల్ గలరే? (10-1-1736)**

(నీయంత పుణ్యాత్మకుల్ - అని ముద్రిత ప్రతుల పాఠం. నీ యట్టి పుణ్యాత్మకుల్ - అని ఎకాడమీ ప్రతిపాఠము సాధువు)

18. మతుబర్థంబునం జెంచునకుఁ దవర్ణంబు పరంబగుచో నిత్యంబగు. (తద్ధిత-4)

**క. చెంచితలన్ బింఛపత్రచేలాంచితలన్ (10-1-793)**

19. కొన్ని యెడలం ద్వరితార్థ సూచకంబయి భావిని భూతంబు చూపట్టెడి. (క్రియా-7)

**ఉ. తా వచ్చె సుదర్శనాయుధుఁడు (భాగ-10-1-1734)**

(సమ్మతితో హరికిచ్చి చెప్ప నీ బమ్మెరపోతరా జొకఁడు (భాగ-1-13) అను ప్రయోగం కూడ ఇట్టిదే.)

20. వ్యతిరేకక్రియ యర్థత్రయ బోధకంబగు (క్రియా-8)

**అర్థత్రయము= వర్తమాన - భూత - భవిష్యదర్థములు.**

వర్తమానంబునకు - పాఱఁడు (7-194)= పాఱుచున్నవాఁడు గాఁడు.

భూతమునకు - ఱెక్కలు రావు పిల్లలకు (7-63)= రావు= వచ్చినవి కావు.

భవిష్యత్తునకు - వాసుదేవుఁడున్ రాఁడను (10-1-1727) : రాఁగలవాఁడు కాఁడు.

21. ప్రార్థనంబునం దున్ ప్రత్యయాంతక్రియల మీఁదఁ గదకదవు పూర్వకంబు లన్నాదులను ప్రయుక్తంబులగు. (క్రియా-9)

**ఉ. సుకీర్తిమై మనఁగదన్న (10-1-150)**

**ఉ. తుది యెప్పుడు మద్విరహాంబురాశికిన్, జెప్పఁగదమ్మ! (10-1-1130)**

**క. నీపాదకమలసేవయు, నీపాదార్చకుల తోడి నెయ్యమును నితాం**
**తాపారభూతదయయును, దాపసమందార! నాకు దయసేయఁగదే! (10-1-1269)**

22. తఱచుగం గ్రియల మీఁది కదకదవుల కన్నాదులు పర్యాయంబున నను ప్రయుక్తంబులగు (క్రియా-29)

**ఆ.వె. అలసితివి గదన్న! యాఁకొంటివి గదన్న! (10-1-256)**

**ఉ. దయాంబురాశివి గదమ్మ! (10-1-1742)**

23. న్యూనవచోవాక్యంబు లధ్యాహార్యంబు లగు. (వాక్య-13)

**క. కర్మములు మేలు నిచ్చును (10-1-32). కర్మములు= కర్మములే యని యిక్కడ నేవార్థ మధ్యాహార్యము**

**9. చర్ల సూర్యనారాయణశాస్త్రి (20 శ.)**

వీరు రచించిన 'నారాయణీయాంధ్రవ్యాకరణము' గొప్ప గ్రంథము. సూర్యనారాయణశాస్త్రిగారి పుత్త్రులగు చర్లగణపతి శాస్త్రిగారు 'గణపతసూత్రవివరణ' మను పేరుతో దీనికిఁ బెద్ద వ్యాఖ్యానము రచించిరి.

1. ఉదంతక్రియాజన్య విశేషణముల కచ్చు పరంబగుచో నిత్యముగను హల్లు పరంబగుచోఁ గ్వాచిత్కముగను ద్రుతంబునకు లోపంబు గలుగదు. (సంధి-41)

**సీ. మాటి మాటికి వ్రేలు మడఁచి యూరించుచు**
**నూరుఁగాయలఁదినుచుండు (భాగ-10-1-496)**

2. అన్ని శబ్దములకు నాలు శబ్దముతోడఁ గర్మధారయంబు గలుగునెడల నువిద! మొదటి వాని కుత్వరేఫమ్ము లే, నొక్కచోట రేఫ మొకఁడె వచ్చు.

**సూ. టుగాగమంబు లాఁతిచో సహితం బగు. (సంధి-51)**

**క. పురుడీ చోటికి నిందిర, పురు దంబిక గాక యొరులు పురుడే యనుచున్**
**బురుటాలికిఁ బదిదినములు, పురుడు ప్రవర్తించి రెలమిఁ బుణ్యపుగరితల్. (భాగ-8-516)**

3. పదంబుల నడుమ నలడాదికంబు నుత్వంబునకు లుక్కు వికల్పము (సంధి-151)

**శా. వల్దంచున్ జెప్పిన మానఁ డంగమునఁ బుత్త్రాకారతన్ (7స్క-187)**

4. సువర్ణం బొక్కచో సుదంతేరములకంటెను గానంబడియెడి (అవ్య-169)

**ఉ. తండ్రివి తల్లివిం బతివి దైవమవున్ సఖివిన్ గురుండవున్ (1-252)**

5. నెఱసున్నమీఁది యాగమచకారంబునకు దువర్ణకంబు పరమగుచోఁ బకారము విభాషనగు (క్రియా-299)

**క. ఆకర్ణింపుదురు పెద్ద లతిహర్షమునన్ (8-21)**

6. సుందరి! తద్ధర్మార్థము, నందు దుకారమ్ము పరమునందున్న యెడన్
డిందును జుమ్మి చువర్ణము, బిందువుపయి దూకుఁ దత్త్వవిధి చేయఁదగున్ (క్రియా-358)

**సీ. ఏరాజు రాజ్యమందేని వసించుదు**
**రారాజు దలపోయ నవని మీఁద (భాగ-10-1-123) - ఇచ్చట లోపతకారాలు రాలేదు.**

7. ప్రామాణిక ప్రయోగంబులం గొన్ని యెడల ననుప్రయుక్తమైన
కొను ధాతువుయొక్క క్త్వార్థరూపము 'కొని' యను దానికి 'క' అను నాదేశము కనుపట్టుచున్నది. (వాక్య-13)

**క. లక్షపరీమాణముగల క్రిమిగుండమందు నాటుక యుండున్ (5-149)**

**10. ప్రబంధమణిభూషణము**

ఇది 867 పద్యములు గల చక్కని ప్రాచీనసంకలనప్రబంధం. సంకలనకర్త పేరు తెలియదు. దీనిలో వీరభద్రవిజయంనుండి, భాగవతంనుండి పెక్కుపద్యాలు గైకొనఁబడ్డాయి. భూషణకారుఁడు గ్రహించిన భాగవతపద్యాలివి-

ఉ. వాలిన భక్తి మ్రొక్కెద...(భాగ-1-2; ప్ర.భూ-8)

ఉ. ఆదర మొప్ప మ్రొక్కిదుదు...(భాగ-1-5; ప్ర.భూ-4)

ఉ. క్షోణితలంబు నెన్నుదురు...(భాగ-1-6; ప్ర.భూ-28)

క. చలచలనై పిదపిదనై...(భాగ-8-493; ప్ర.భూ-338)

సీ. పొలఁతుల వాలుచూపులయంద...(భాగ-9-335; ప్ర.భూ-361)

ఆ.వె. పొదుపుఁగొండ మీఁదఁబొడుచుట...(భాగ-10-1-802; ప్ర.భూ-216)

ఆ.వె. శంభుకంట నొకటి జలరాశి నొక్కటి...(భాగ-10-1-804; ప్ర.భూ-214)

సీ. విటసేనపై దండు వెడలెడి వలఱేని...(భాగ-10-1-968; ప్ర.భూ-635)

మ. లలనా! యేటికిఁ దెల్లవాఱె...(భాగ-10-1-1129; ప్ర.భూ-810)

సీ. పౌలోమి తన చాలు పాన్పుపై...(భాగ-10-1-1303; ప్ర.భూ-832)

ఆ.వె. వరుణపురము కంటె...(భాగ-10-1-1591; ప్ర.భూ-50)

క. ఆకసముతోడి చూలన...(భాగ-10-1-1593; ప్ర.భూ-51)

శా. సాధుద్వారకవాటకుడ్య...(భాగ-10-1-1595; ప్ర.భూ-52)

ఉ. ఆయతవజ్రనీలమణి...(భాగ-10-1-1597; ప్ర.భూ-53)

క. బ్రహ్మత్వము లఘు వగునని...(భాగ-10-1-1602; ప్ర.భూ-74)

క. తిరుగరు పలుకర్థులకును...(భాగ-10-1-1704; ప్ర.భూ-79)

క. పులుల పగిదిఁ గంఠీరవ...(భాగ-10-1-1608; ప్ర.భూ-96)

ఆ.వె. కృష్ణ! వాసుదేవ! కేశవ! పరమాత్మ!...(భాగ-10-2-477; ప్ర.భూ-332)

**11. ప్రబంధ రత్నావళి**

ఇది శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు సంకలనం చేసింది. దీనిలో 4 భాగవత పద్యాలు గలవు.

సీ. విటసేనపై దండు వెడలెడి వలతేని... (భాగ-10-1-966; ప్ర.ర.600)

ఉ. ధన్యవిభూతిశోభితుఁడు...(భాగ-10-1276(2); ప్ర.ర.248)

క. తరుణుఁ డగు శీతకరునిన్...(భాగ-10-1-1288; ప్ర.ర.30)

ఆ.వె. భూమినిండి మింటఁ బూర్ణమై...(భాగ-10-1-1291; ప్ర.ర.53)

శ్రీ మదాంధ్ర మహాభాగవతంలోని పద్యాలను 1. దంతిని యప్పకవి 'లక్షణసార సంగ్రహము'లో; కేలూరి యాంజనేయకవి 'సుకవి కర్ణామృతము'లో; ఓరుఁగంటి రామయకవి 'కవితాలక్షణసారము'లో నుదాహరించినట్లు డా॥ మోడేకుర్తి వేంకటసత్యనారాయణగారు చెబుతున్నారు.

(ఆంధ్రచ్ఛందోవికాసము పుట 326. Andhra - University 1990)

ఈ 3 గ్రంథములు నింతవరకు ముద్రితం కాలేదు.

ఇట్లే శబ్దరత్నాకరకారులు, సూర్యరాయాంధ్ర నిఘంటుకర్తలు, ఆంధ్రవ్యాకరణ సంహితా సర్వస్వకర్తలు - వజ్ఝలవారు, ముక్తలక్షణ కౌముదీకర్తలు - వంతరాం రామకృష్ణరావుగారు పోతన గ్రంథాలను ప్రమాణంగా స్వీకరించారు. వెల్లంకివారు మొదలుకొని వజ్ఝలవారి వరకు గల సర్వలాక్షణికులూ పరిగ్రహించిన పోతన సాహిత్యం పరమ ప్రమాణమని సిద్ధాంతం.

పోతన కవితా సరస్వతి ఆర్షవాణి. ఆంధ్రమహాభాగవతం స్వతః ప్రమాణం.

అష్టాదశ (18) మహాపురాణాలలో శ్రీమద్భాగవతపురాణం నదులలో గంగ వంటిది. దేవతలలో బ్రహ్మ వంటిది. నక్షత్రాలలో చంద్రుని వంటిది. సముద్రాలలో పాలసముద్రం వంటిది. పర్వతాలలో మేరుపర్వతం వంటిది. గ్రహాలలో సూర్యుని వంటిది. రాక్షసులలో ప్రహ్లాదుని వంటిది. మణులలో పద్మరాగం వంటిది. చెట్లలో మంచి

గంధపుచెట్టు వంటిది. ఋషులలో నారదుని వంటిది. ఆవులలో కామధేనువు వంటిది. సూక్ష్మభూతాలలో జీవుని వంటిది. జయింపరాని ఇంద్రియాలలో మనస్సు వంటిది. రుద్రులలో శివుని వంటిది. బ్రహ్మర్షులలో భృగువు వంటిది. సిద్ధులలో కపిలమహర్షి వంటిది. గుఱ్ఱాలలో నుచ్చైశ్శ్రవం వంటిది. పాములలో వాసుకి వంటిది. మృగాలలో సింహం వంటిది. ఆశ్రమాలలో గృహస్థాశ్రమం వంటిది. అక్షరాలలో ఓంకారము వంటిది. ఆయుధాలలో ధనుస్సు వంటిది. యజ్ఞాలలో జపయజ్ఞం వంటిది. వ్రతాలలో అహింస వంటిది. యోగాలలో ఆత్మయోగం వంటిది. ఓషధులలో యవధాన్యం వంటిది. సంభాషణాలలో సత్యం వంటిది. ఋతువులలో వసంతం వంటిది. మాసాలలో మార్గశీర్షం వంటిది. యుగాలలో కృతయుగం వంటిది.

ఇట్టి భాగవత పురాణాన్ని భక్తితో నిత్యం పఠిస్తే శ్రీవిష్ణుసాయుజ్యం లభిస్తుంది. ఇటువంటి మహాపురాణాన్ని పరీక్షిత్తుకు ఉపదేశించిన శ్రీశుకమహర్షికి నమస్కారం.

'కలౌ సంస్మరణా న్ముక్తిః' 'కలౌ వేంకటనాయకః' ఈ కలియుగంలో భగవంతుని స్మరించినంతనే జనులు ముక్తి పొందుదురు. కలియుగంలో శ్రీవేంకటేశ్వర స్వామియే ప్రత్యక్షదైవం.

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారు సవ్యాఖ్యానంగా నందించిన పోతన మహాభాగవత పురాణాన్ని భక్తిశ్రద్ధలతో నిత్యం పఠించి పాఠకులు పవిత్రులై శ్రీ వేంకటేశ్వరస్వామి కృపాకటాక్ష వీక్షణాలకు పాత్రు లగుదురు గాక!

ఆంధ్రభాగవత సాహిత్యాన్ని గూర్చి నాలుగుమాటలు వ్రాసేందుకు అనుగ్రహించిన శ్రీ శ్రీనివాసుని మాటిమాటికి ధ్యానిస్తూ, అనేక వందనము అర్పించుచున్నాను. ఈ పీఠికలోని దోషసందోహాన్ని విడిచిపెట్టి గుణలేశమున్నచో నీరక్షీర వివేకన్యాయమున గ్రహించి నన్ను మన్నింపవలెనని పండితహంసులను వేడుకొనుచు ఇంతటితో ముగిస్తున్నాను.

**ఆ.వె. వేదకల్పవృక్ష విగళితమై శుక**
**ముఖసుధాద్రవమున మొనసి యున్న**
**భాగవతపురాణ ఫలరసాస్వాదన**
**పదవిఁ గనుఁడు రసిక భావవిదులు!**

**శ్లో. శ్రియఃకాంతాయ కల్యాణనిధయే నిధయే உర్థినామ్ ।**
**శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

*శ్రీమత్పరమేశ్వరార్పణ మస్తు*

ఇట్లు
సకలసుకవిబుధజనవిధేయుఁడు
**గరిమెళ్ళ సోమయాజులు శర్మ**

విజయవాడ,
04-02-2017

# ఏకాదశస్కంధం - కథాసారం

భగవన్నామస్మరణ చేయడం (జపించడం) ఒకటే మార్గం అని చెబుతూ జన్మకు కారణమైన కర్మ అనే రోగంనుండి విముక్తికోసం శ్రీమన్నారాయణుడి కథలను శుక యోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు వినిపించాడు. ఆ విషయాన్ని సూతమహర్షి మునిశ్రేష్ఠులకు చెబుతూ ఇలా కొనసాగించాడు.

శ్రీకృష్ణుడు పూతనను, శకటాసుర, తృణావర్త, వత్సాసుర, చాణూర, ముష్టిక, ధేనుకాసుర, ప్రలంబకాసుర, అఘాసుర, శిశుపాల, దంతవక్త్ర, కంస, పౌండ్రకాదులను సంహరించాడు. కౌరవ సేనల్ని అణచివేసి, ధర్మరాజుకు పట్టాభిషేకం చేశాడు. ధర్మరాజు రాజ్యపాలన చేస్తుంటే సంతోషించాడు. తన భక్తులైన యాదవుల్ని పరిశీలనగా చూసి, నేను తప్ప మూడు లోకాల్లో ఏ దైవమూ వీళ్ళని సంహరించలేదు అని తలంచాడు. బ్రాహ్మణశాపం కారణంగా యాదవుల్ని నశింపజేశాడు.

శ్రీహరి పాదకమలాల్ని సేవించే యాదవులకు బ్రాహ్మణశాపం ఎలా కలిగింది? అని పరీక్షిన్మహారాజు ప్రశ్నించాడు. అప్పుడారాజుకు శుకయోగీంద్రుడిలా చెప్పాడు.

సాటిలేని అందగాడైన శ్రీకృష్ణుడు యాదవుల్ని నశింపజేద్దామనుకుంటూండగా విశ్వామిత్ర, అసిత, దుర్వాస, భృగు, అంగిరస, కశ్యప, వామదేవ, వాలఖిల్య, అత్రి, వసిష్ఠ, నారదాది మునివర్యులు ద్వారకానగరానికి విచ్చేశారు, దుర్జనులను శిక్షిస్తూ మంచివారికి సంతోషం కలిగిస్తూ, కోటిమన్మథుల సౌందర్యంతో ప్రకాశిస్తూ దయాసముద్రుడైన శ్రీకృష్ణుణ్ణి ఆ ఋషులు చూశారు. కృష్ణుడు వారిని అర్ఘ్య పాద్యాదులతో పూజించి, బంగారు గద్దెలపై సుఖాసీనుల్ని చేశాడు.

**క. జనములు నిను సేవింపని, దినములు వ్యర్థంబు లగుచుఁ దిరుగుచు నుండుం**
**దనువులు నిలుకడగావఁట, వనములలో నున్ననైన వనరుహనాభా!**

**క. తరణంబులు భవజలధికి, హరణంబులు దురితలతల కాగమముల కా**
**భరణంబు, లార్తజనులకు శరణంబులు, నీదు దివ్యచరణంబు లిలన్.**

అంటూ స్తుతించిన మునులపై దయావీక్షణాలు ప్రసరింప చేసిన కృష్ణపరమాత్మ నా ధ్యాననామస్మరణాలు, జన్మ మరణాలను పోగొడతాయి అంటూ మీరాకకు ప్రయోజన మేమిటని అడిగాడు. మీ పాదపద్మాలను దర్శించడం కన్న మరే విశేషం లేదు అని చెప్పి వారు ద్వారకానగరం దగ్గరలోని 'పిండారక' మనే పవిత్రతీర్థానికి వెళ్ళారు.

అక్కడ యాదవులు గుంపుగా వచ్చి, సాంబుణ్ణి స్త్రీ వేషంతో అందంగా అలంకరించి, కపటంతో కేరింతలు కొడుతూ, మీరు సర్వజ్ఞులు కదా అని సాగిలబడి నమస్కరిస్తూ బరువైన ఈ స్త్రీగర్భంలో ఉన్నది మగబిడ్డా? ఆడబిడ్డా? ఆలోచించి చెప్పండి, అని ఆ మునుల్ని అడిగారు. మాలాంటివారిని ఎగతాళి చేస్తారా? అంటూ మునులు కోపంతో యదువంశాన్ని నిర్మూలించే రోకలి పుడుతుంది అనివారిని శపించారు. భయంతో వణుకుతూ యాదవులు సాంబుడి పొట్ట చుట్టూ చుట్టిన వస్త్రం ముడి విప్పారు. ఒక రోకలి నేలమీద పడింది. దాన్ని శ్రీకృష్ణుడి ముందుపెట్టి జరిగిందంతా చెప్పారు. యతినిందవల్ల యదువంశం నాశనమై తీరుతుంది అంటూ కృష్ణుడు వారిని మందలించాడు. సముద్రతీరంలో పర్వతపుశిలపై దాన్ని రుద్దుతూ పొడిచేసి 'సముద్రజలాల్లో కలిపిరండి' అన్నాడు.

వారు కృష్ణుడు చెప్పినట్లుగా చేశారు. చివరకు ఒక ఇనుపముక్క మిగిలింది. దానిని పట్టించుకోకుండా సముద్రంలో పడేశారు. దాన్ని ఒక చేప మింగింది. వలవేసి బోయ వాడొకడు ఆ చేపను పట్టాడు. దాని కడుపులోని ఆ ఇనుపముక్కను తన బాణం చివర అలుగుగా చేసుకున్నాడు. అని శుకమహర్షి చెప్పాడు. వసుదేవుడు పరమాత్మను పుత్రునిగా పొందిన విధాన్ని గూర్చి పరీక్షిన్మహారాజు ప్రశ్నించాడు. ఆ ముని ఇలా చెప్పాడు, ఓరాజా! ఒకసారి నారద మహర్షి ద్వారకకు విచ్చేసి శ్రీకృష్ణుణ్ణి సందర్శించాడు. వసుదేవు డాయనను శాస్త్రోక్తంగా పూజించి, నీ దర్శనంచేత కృతార్థుణ్ణయ్యాను. అచ్యుత, అనంత, గోవింద అను నామాల స్మరణంచేత ఏకాగ్రతను సాధించిన మీలాంటి పుణ్యపురుషుల సమాగమంచేత ప్రజలు సుఖాన్ని పొందుతారు, దైవమాయ చేత గోవిందుణ్ణి పుత్రుడిగా కోరుకున్నాను. ముక్తిమార్గాన్ని తెలుసుకోలేక సంసారంలో చిక్కుకున్నాను. హరికథామృతాన్ని ప్రవహింప చెయ్యి. దాంతో సుఖం కలుగుతుంది అన్నాడు. వాసుదేవుడి కథల ప్రస్తావన, సంభాషణలో చోటు చేసుకున్నందుకు,

క. **అతిపాపకర్ములైనను, సతతము నారాయణాఖ్యశబ్దము మదిలో**
**వితతంబుగఁ బఠియించిన, చతురులఁ గొనియాడఁ గమలసంభవువశమే?**

అని నారదుడు వసుదేవుణ్ణి మెచ్చుకున్నాడు. హరిగుణాలను వినుమని, పరమేశ్వరునిపై భక్తిని కలిగించే విదేహార్షభసంవాదాన్ని చెప్పడం మొదలుపెట్టాడు.

వసుదేవా! స్వాయంభువ మనువుకు ప్రియవ్రతుడు, అతడికి ఆగ్నీధ్రుడు, అతడికి నాభి జన్మించారు. బలిచక్రవర్తి మైత్రిని సంపాదించిన నాభి, శత్రురాజ్యాలను స్వాధీనం చేసుకొని భూమిని పాలించాడు. అతడికి హరిదాసుడైన ఋషభుడు పుట్టాడు, అతడికి నూరుగురు కుమారులు కలిగారు, వారిలో మొదటివాడు భరతుడు, అతడు శ్రీమన్నారాయణుని భక్తుడై; గొప్పతపస్సు చేసి మూడు జన్మలలో బంధాలన్నిటినుండీ విముక్తుడై వాసుదేవ పదాన్ని పొందాడు. అతడు పాలించిన ఈ భూఖండం భారతవర్షంగా వ్యవహరించబడుతోంది. అతని తరువాతి తొమ్మిదిమంది నవఖండాధిపతులయ్యారు. వారి తర్వాత ఎనభై ఒక్కమంది నిత్య కర్మానుష్ఠానపరులై బ్రాహ్మణత్వాన్ని పొందారు. ఇక మిగిలిన – కవి, హరి, అంతరిక్ష, ప్రబుద్ధ, పిప్పలాయన, అవిర్హోత్ర, ద్రమిళ, చమస, కరభాజనులు తొమ్మిదిమంది బ్రహ్మవేత్తలు. మూడులోకాల్ని పరమాత్మ స్వరూపంగా చూస్తూ, ముక్తులై, అన్నిలోకాల్లో స్వేచ్ఛగా సంచరించే వారు. వారొకనాడు యజ్ఞాన్ని ముగిస్తున్న విదేహరాజువద్దకు చేరుకున్నారు. వారిని యథావిధిగా స్వాగతించిన ఆ రాజు అల్పులైన మానవులు సంసారాన్ని ఎలా దాటగలరో సెలవీయండి అని అడిగాడు. అప్పుడు వారిలో కవి అనే ముని,

సీ. **సంతతంబును గృష్ణ సంకీర్తనంబులు వీనుల కింపుగ వినఁగవలయు**
**హర్షంబుతోడుత హరినామకథనంబు పాటలనాటలఁ బరఁగవలయు**
**నారాయణుని దివ్యనామాక్షరంబులు హృద్వీథి సతతంబునెన్న వలయుఁ**
**గంజాక్షులీలలు కాంతారములనైన భక్తియుక్తంబుగాఁ బాడవలయు**

తే. **వెఱ్ఱిమాడ్కిని లీలతో విశ్వమయుని, నొడువుచును లోకబాహ్యత నొందవలయు**
**నింతయును విష్ణుమయమని యెఱుఁగ వలయు, భేద మొనరింపవలవదు మేదినీశ!**

మనస్సు, వాక్కు, శరీరాలతో చేసిన పనులన్నింటినీ శ్రీహరికి సమర్పించాలి, కోరికలను తగ్గించుకొని, శ్రీహరిని ధ్యానించే వాడికి కైవల్యం సులువుగా లభిస్తుంది. అని ఉపదేశించాడు.

తరువాత విదేహుడు ఏది భాగవతధర్మం? భాగవతులనుగుర్తించే దెలా? అని ప్రశ్నించాడు. దానికి 'హరి' అనే ముని "ప్రాణులన్నిటి రూపంలో ఉన్నవాడే తన మనస్సులో ఉన్న నారాయణుడని నమ్మేవాడు భాగవతుడు. భక్తి అనే తాడుతో బంధించబడ్డ వాసుదేవుడి పాదపద్మాలను ధ్యానిస్తూ ఆనందపరవశు డయ్యేవాడు భాగవతులలో ఉత్తముడు" అని చెప్పాడు. అప్పుడు విదేహుడు "గజేంద్రుని అనుగ్రహించిన శ్రీహరిగుణాలను నాకు వినాలని ఉంది" అన్నాడు. దానికి అంతరిక్షుడు అనే ఋషి – "వ్యక్తం కాని, గుణాలేవీ లేని పరబ్రహ్మం నుండి వ్యత్యాసంగా కలిగిన జ్ఞానాన్ని విష్ణుమాయ అంటారు. సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలున్న ఆ మాయ ఈ ప్రపంచం యొక్క సృష్టి స్థితి లయాలకు కారణమౌతోంది" అని వివరించాడు. తరువాత విదేహుడు 'అజ్ఞానులైన మానవులు కనరాని మాయను అణచివేసుకొని హరి పదాన్ని చేరేదెలాగో అర్థమయ్యేటట్లు చెప్పండి' అన్నాడు. దానికి ప్రబుద్ధుడు అనే ముని,

**క. హరిదాసుల మిత్రత్వము, మురరిపు కథలెన్నుకొనుచు మోదము తోడన్**
**భరితాశ్రుపులకితుండై, పురుషుఁడు హరిమాయగెల్చు భూపవరేణ్యా!**

అని తేటతెల్లం చేశాడు. అటుపై విదేహుడు సకలలోకనాయకుడైన నారాయణుడనబడే పరమాత్మ ప్రభావాన్ని వినిపించుమన్నాడు. దానికి సమాధానంగా పిప్పలాయనుడు అనే ముని నారాయణుడు (పరమాత్మ) ప్రపంచం యొక్క సృష్టి, స్థితి,లయాలకు కారణం; సత్త్వ రజ స్తమో గుణాలు మూడూ మహత్తు, అహంకారం చైతన్యంతో కలిస్తే జీవపదార్థమౌతుంది. పరమాత్మయే జీవ రూపంలో శరీరేంద్రియాలలో ప్రవేశించి వెలుగొందుతాడు. ఇదే సత్, అసత్ గా ఎన్నబడుతుంది; వీటికి అతీతమైన వస్తువును పరమాత్మగా తెలుసుకొని బ్రహ్మాదులు స్తుతిస్తారు. అని వివరించాడు; ఏ పనులు చేస్తే మానవుడు పుణ్యాత్ము డౌతాడు? పాపాల నుండి విముక్తుడై శ్రీమహావిష్ణువు పాదపద్మాలను చేరుకుంటాడు? అనే వసుదేవుడి ప్రశ్నకు, అవిర్హోత్రుడు, మోక్షంకోసం నారాయణుడిని వేదం చెప్పినట్లు సేవించాలి. మనస్సును భక్తిభావంతో నింపుకొని షోడశోపచారాలతో ఆరాధిస్తే విష్ణువును చేరుకోవచ్చు అని చెప్పాడు. తరువాత భగవంతుడు చేసిన పనులను లీలలను గూర్చి వసుదేవుడు ప్రశ్నించగా ద్రమిళుడనే ముని ఇలా చెప్పాడు.

**క. తారల నెన్నఁగ వచ్చును; భూరేణుల లెక్కవెట్టఁ బోలును ధాత్రిన్;**
**నారాయణగుణకథనము, లారయ వర్ణింపలేరు హరబ్రహ్మాదుల్.**

తనచేత సృష్టించ బడ్డ పంచభూతాలతో శరీరాన్ని నిర్మించి, తన అంశతో ఆ శరీరంలో ప్రవేశించి, సాకారుడై, నారాయణుడనే ఋషీశ్వరుడుగా భగవంతుడు ప్రకాశించాడు. ఆ నారాయణుడు తన పది ఇంద్రియాలతో పాలించబడే శరీరాలు ధరించి; సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలతో, ప్రపంచ సృష్టి, రక్షణ, లయాలను చేసే బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు అనే పేర్లతో త్రిగుణాత్మకుడుగా చెప్పబడుతున్నాడు. ఆయన చరిత్రను చెపుతాను విను. దక్ష ప్రజాపతికూతుర్ని పెళ్ళాడిన యముడు బదరికాశ్రమంలో నారాయణఋషిని పుత్రుడిగా పొందాడు. ఆ ఋషి ఎంతో నిష్ఠతో అక్కడ తపస్సు చేస్తుండగా భయపడ్డ ఇంద్రుడు, మన్మథుణ్ణి, దేవవేశ్యలను

అతడి వద్దకు పంపాడు. చలించని ఆ ఋషి మిమ్మల్ని ఇంద్రుడు పంపించాడు. 'మీ కిక్కడ విహరించాలని ఉంటే తిరగండి' అన్నాడు. ఆ మాటలకు సిగ్గుపడి వాళ్ళు ఆయనను మా తప్పును మన్నించమంటూ స్తుతించారు. వాళ్ళకు ఆశ్చర్యం కలిగేటట్లు ఆ నారాయణ మునీశ్వరుడు తన రోమాలనుండి మూడుకోట్లమంది కన్యల సముదాయాన్ని పుట్టించాడు. వాళ్ళలో ఒకతె అయిన ఊర్వశిని వారు ఇంద్రుడి సభకు తీసుకువెళ్ళి జరిగిన విషయం చెప్పగా ఇంద్రుడు మిన్నకున్నాడు. ఆ పరమేశ్వరుడు లీలగా మత్స్య, కూర్మ, వరాహాది అనేక అవతారాలు గ్రహించాడు. ఆ అవతారాలనుగూర్చి తెలుసుకొని స్తుతించడం ఆదిశేషుడికి, బ్రహ్మకుకూడా సాధ్యంకాదు అన్నాడు.

తరువాత మనోవాక్కాయాలతో హరిని పూజించక, విపరీతంగా ప్రవర్తించే జడులకు ఏగతి కలుగుతుంది? అని వసుదేవుడు అడిగాడు. అప్పుడు, చమసుడు – ఇల్లు, పొలం, కొడుకులు, డబ్బు, ధాన్యం మొదలైన వాటిమీద వ్యామోహంతో, ఉన్నవారికి మోక్షమార్గాలు కంటికి కనపడవనీ, హరి భక్తి లేనివాడు దుర్గతుల పాలౌతారనీ అన్నాడు.

ఆ పైన వసుదేవుడు ఏ యుగంలో విష్ణువు ఎలా ఉంటాడు? మునులచేత, దేవతాగణాలచేత మునుపు ఎలా స్తుతించబడ్డాడు అని ప్రశ్నించాడు. అప్పుడు కరభాజనుడనే ముని ఇలా చెప్పాడు. 'ఓ రాజా! శ్రీమహావిష్ణువు కృతయుగంలో తెల్లనిమేనిచ్ఛాయతో, నాలుగు చేతులతో ఉంటాడు. జడలు, నారబట్టలు, జింకతోలు ఉత్తరీయం, జపమాల, దండకమండలాలు ధరిస్తాడు. హంస, సువర్ణ, వైకుంఠ, ధర్మ, అమల, యోగీశ్వర, ఈశ్వర, పురుష, అవ్యక్త, పరమాత్మ అనే దివ్యనామాలతో ప్రశంసించబడతాడు.

త్రేతాయుగంలో ఎరుపురంగు కలవాడై, నాలుగు చేతులతో, మూడు మొల నూళ్ళతో, బంగారురంగు జుట్టుతో, మూడు వేదాల ఆకృతులు ధరించి, స్రుక్కు, స్రువం లాంటి హోమ సాధనాలను ధరిస్తాడు, విష్ణు, యజ్ఞ, పృశ్నిగర్భ, సర్వదేవ, ఉరుక్రమ, వృషాకపి, జయంత, ఉరుగాయుడు అనే పేర్లతో స్తుతించబడతాడు.

ద్వాపరయుగంలో నీలిరంగుకలవాడై, పీతాంబర ధారియై, రెండు చేతులతో, దివ్యాయుధాలు ధరించి, శ్రీవత్సం, కౌస్తుభం, వనమాలలతో, ప్రకాశిస్తూ మహారాజలక్షణాలను కలిగి ఉంటాడు. జనార్దన, వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న; అనిరుద్ధ, నారాయణ, విశ్వరూప, సర్వ భూతాత్మక అనే పేర్లతో సన్నుతించబడతాడు.

కలియుగంలో నల్లనివాడుగా, కృష్ణుడనే పేరుతో యజ్ఞాలతో, సంకీర్తనలతో సేవించబడతాడు. హరి, రామ, నారాయణ, నృసింహ, కంసారి, నలినోదర అనే పేర్లతో కీర్తించబడతాడు.

ఈ ప్రకారంగా విదేహరాజుకు ఋషభకుమారులు, మోక్షాన్ని కలిగించే ధర్మాలను, భగవద్భక్తిని ఉపదేశించి అంతర్ధానమయ్యారు. ఆ మిథిలాధిపతి జ్ఞానయోగంతో మోక్షం పొందాడు అని నారదుడు వసుదేవుడికి చెప్పాడు. ఆ కథనాలను విని, ఆశ్చర్యచకితులైన దేవకీవసుదేవులు కృష్ణుణ్ణి పరమాత్మగా భావించారు. ఆ తరువాత భక్తరక్షకుడైన శ్రీహరిచరిత్ర ఎలా కొనసాగింది? అని అడిగిన పరీక్షిన్మహారాజుకు శుకయోగీంద్రుడు హరికథను ఇలా చెప్పాడు.

బ్రహ్మాదిదేవతలు ద్వారకానగరానికి వచ్చి, **'అఖిలలోకేశా! కృష్ణా! భూభారం తొలగించడానికి నీవు అవతరించి, నూట ఇరవై అయిదు సంవత్సరాలయింది. వైకుంఠానికి విచ్చేయమని శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించారు.** యాదవుల మధ్య వైరం కల్పించి, వాళ్ళను హతం చేయించి, భూభారాన్ని తగ్గించి వస్తానని వాళ్ళకు శ్రీకృష్ణుడు వీడ్కోలు పలికాడు.

తరువాత అపశకునాలు కనబడుతున్నందున యాదవుల్ని ప్రభాసతీర్థానికి వెళ్ళండని ఆజ్ఞాపించాడు. వాళ్ళు తొందరపడుతూ ప్రభాసతీర్థానికి వెళ్ళారు.

తరువాత జ్ఞానియైన ఉద్ధవుడు 'శ్రీహరీ! నీవే మాకు దిక్కు అని' శ్రీకృష్ణుణ్ణి స్తుతించాడు. అతడి మీద ప్రేమతో కృష్ణుడు అవధూత యదుసంవాదాన్ని ఇలా వివరించాడు. ఒకరోజు ఎక్కడినుండో ఒక యోగి యదుమహారాజు వద్దకు వచ్చాడు. నిర్మలమైన విజ్ఞానంలో నేర్పరులైన ఇరవైనాలుగు మంది గురువులవల్ల నేను విజ్ఞాని నయ్యాను అన్నాడు. అప్పుడు యదుమహారాజు–

శరీరం కలవాడు లోభం, మోహం మొదలైన వాటిని విడిచిపెట్టి జనార్దనుణ్ణి ఎలా చేరుకోవచ్చో తెలుప మన్నాడు, దానికి సమాధానంగా ఆ అవధూత –

"పెద్ద అడవిలో ఒక పావురం భార్యా పిల్లలతో సుఖంగా గడుపుతూ ఉండేది, ఒకప్పుడు వేటగాడు పన్నిన వలలో భార్యా పిల్లలు చిక్కుకున్నారు. వాటి మీద మోహంతో ఆ పావురం తానుకూడా ఆ వలలో పడి మరణించింది. కాబట్టి, మోహతీవ్రత తగదు. ఎల్లప్పుడూ హరిని ధ్యానిస్తూ భూమినుండి సహనం, వాయువునుండి పరోపకారం, ఆకాశం నుండి కాలం కల్పించిన గుణాలతో సంబంధం లేకుండా ఉండటం, జలం నుండి ఎప్పుడూ శుచిగా ఉండటం, అగ్ని నుండి స్వచ్ఛత, సూర్య చంద్రులనుండి, హెచ్చుట, తగ్గుట, సమస్థితి, పట్టు విడుపులు, పావురం నుండి భార్యా బిడ్డలపై ప్రేమ, కొండ చిలువనుండి స్వేచ్ఛగా సంచరించటం, దొరికిన ఆహారాన్ని స్వీకరించడం; సముద్రం నుండి ఉత్సాహరోషములు, మిడుత నుండి శక్తికి తగిన పనిచెయ్యడం, తుమ్మెదనుండి సారాన్ని మాత్రమే గ్రహించడం, ఏనుగు నుండి స్త్రీవిముఖత, తేనె టీగనుండి పోగుచేసేగుణం, లేడి నుండి విచారపరుడవటం, చేపనుండి జిహ్వాచాపల్యం విడవడం, పింగళ (వేశ్య) నుండి లభించిదానితో తృప్తి పడడం, లకుముకి పిట్టనుండి మోహాన్ని విడవడం, బాలుడినుండి చింత లేకుండా ఉండటం, కన్యనుండి సాంగత్యాన్ని విడచిపెట్టడం, బాణాలు చేసేవాడినుండి గురిపై దృష్టి, పామునుండి ఇతరుల ఇంట్లో నివసించడం, సాలెపురుగు నుండి సంసారం విడిచిపెట్టడం, కందిరీగ నుండి లక్ష్య మేదో తెలుసుకుని విడువకుండా ఉండటం అనే గుణాలను తెలుసుకున్నానన్నాడు. వాటిని తెలియటంతో పాటు కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను జయించి, ప్రాణాయామంతో ముసలితనం, మరణం లేకుండా చేసుకొని, సత్కర్మలను ఆచరిస్తూ, అడవుల్లో సంచరిస్తూ, మితాహారియై, సుఖదుఃఖాలను సమానంగా భావిస్తూ, ఆత్మనిష్ఠుడైన యోగి నాలో కలుస్తాడు, అని ఉద్ధవుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించి ఇంకా యదుమహారాజుతో అవధూత చెప్పిన విషయాలను ఇలా తెలిపాడు.

మిథిలానగరంలో పింగళ అనే వేశ్య ఉంది. ఆమె డబ్బుమీద ఆశతో తన భర్తను వంచించి డబ్బిచ్చేవాణ్ణి ఒకణ్ణి చేరదీసింది; వాణ్ణి తన ఇంటికి తీసుకెళ్ళి రాత్రంతా నిద్రలేకుండా గడిపింది, అలా ధనికులకోసం పట్టణంలో, బజారులలో తిరుగుతూ నిద్రలేక నీరసించింది. చివరికి తనని ఆత్మ సుఖం కలిగించేవాడే సుఖపెట్టేవాడే భర్త అనుకొంది; శ్రీమన్నారాయణుని చింతిస్తే మోక్షం ప్రసాదిస్తాడని తలచింది. సంపదలను విడిచి వాసుదేవుడి పాదపద్మాలపై మనస్సును లగ్నంచేసి మోక్షం పొందింది.

కనకావతీపురంలో ఒక బ్రాహ్మణకన్య రత్నకంకణాలను ధరించి బంధువులకు చక్కని భోజనం పెట్టడానికి ధాన్యం దంచుతోంది. రోకటి పోటులకు కంకణాలు చేసే చప్పుడుకు అసహ్యపడి ఒక్క కంకణం ఉంచుకొని

మిగిలిన వాటిని తీసేసింది. అలా భగవంతుడొక్కడి మీదే మనస్సుంచిన వాళ్ళు ముక్తులౌతారు అన్నాడు. అప్పుడు ఉద్ధవుడు దేవా! నీ రూపం ఎలా కనిపిస్తుంది? అని అడిగాడు. దానికి కృష్ణుడు, శుకుడు, సనకుడు మొదలైన యోగులు, అంబరీష, విభీషణ, రుక్మాంగదాది భాగవతులు విశేషమైన భక్తితో నాకు గంధపుష్పాదులు సమర్పిస్తూ, ఎప్పుడూ ధ్యానిస్తూ తెలుసుకున్నారు; నేను బలరాముడితో కలిసి మధురకు వెళ్ళినప్పుడు గోపికలు నా ఎడబాటును భరించలేక భక్తియోగంతో నన్ను ధ్యానించి ముక్తిపొందారు. భాగవత శ్రేష్ఠులు ఇతరధర్మాలను మాని నన్ను దర్శిస్తారు. యుద్ధరంగంలో విషాదాన్ని పొందిన అర్జునుడికి ఉపదేశించిన గీతను చెపుతాను; నిరంతరం ఏమరుపాటులేకుండా నన్ను తలచేవాడు నాకు ప్రియుడు. నేను కూడా అతడిని విడువకుండా వెంట ఉంటాను, నారదాది మునులు భక్తిభావంతో నా రూపాన్ని పొందారు అందరికీ ఒకే విధమైన పూజా విధానాన్ని చెప్పి, 'ఉద్ధవా! నీవిలా యోగనిష్ఠతో బదరికాశ్రమం చేరుకుని, కలియుగం పూర్తయ్యేవరకు ఉండు,' అన్నాడు. అతడలాగే ఆనందంతో బదరికాశ్రమానికి వెళ్ళాడు.

తరువాత కథ ఏమయ్యిందో చెప్పమన్న పరీక్షిత్తుకు శుకమహర్షి ఇలా చెప్పసాగాడు, దుష్ట సంహారం, శిష్ట రక్షణ చేసి బలరాముడితో కలిసి కృష్ణుడు ద్వారక నుండి వెళ్ళాడు. మద్యపానంచేసి యాదవులు పోట్లాడుకోవడం మొదలు పెట్టి యుద్ధం చేసుకుంటూ చనిపోయారు, బలరాముడు యోగమార్గంతో ఆదిశేషుడిలో కలిశాడు. కృష్ణుడు ఒక పొదిరింటి చాటున విశ్రాంతి తీసుకుంటూండగా బోయవాడొకడు కదలుతున్న కృష్ణుడికాలును చూచి లేడి చెవి అనుకొని గురిచూసి బాణం వదిలాడు. హాహా కారాలు చేస్తున్న కృష్ణుడి దగ్గరకొచ్చి అపరాధం చేశాను, పాపాత్ముణ్ణి అని కన్నీరు కారుస్తుంటే కృష్ణుడు, చేసిన కర్మల ఫలితాన్ని ఎంతవారైనా అనుభవించాల్సిందే, అన్నాడు. బోయవాడు పవిత్రమైన మనస్సుతో ప్రాయోపవేశం చేసి ప్రాణాలు వదిలి వైకుంఠానికి వెళ్ళాడు, అప్పుడు దారుకుడు చేతులు జోడించి.

**తే. నిన్నుఁజూడని కన్నులు నిష్ఫలములు, నిన్నునొడువని జిహ్వ దా నీరసంబు**
**నిన్నుఁగానని దినములు నింద్యములగుఁ గన్నులను జూచి మమ్మును గారవింపు.**

అన్నాడు. కృష్ణుడతడితో ఈ వృత్తాంతం అక్రూర విదురులకు చెప్పు; స్త్రీలు, బాలురు, గురువులు, వృద్ధుల్ని హస్తినాపురానికి తీసుకొని వెళ్ళమని అర్జునుడితోచెప్పు వెళ్ళు అన్నాడు. అతడు వెళ్ళాక ద్వారకానగరం నీట మునిగింది; నారదాది మునులు, బ్రహ్మాదిదేవతలు జయ జయ ధ్వానాలు చేస్తూంటే కృష్ణపరమాత్మ వైకుంఠానికి వెళ్ళాడు. ఆ నారాయణుడి విగ్రహం సముద్ర ప్రాంతం జగన్నాథుడి రూపంతో ఉంది అని శుక యోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు చెప్పాడు.

**చ. నగుమొగమున్ సుమధ్యమును నల్లనిమేనును లచ్చికాటప**
**ట్టగు నురమున్ మహాభుజము లంచితకుండలకర్ణముల్ మదే**
**భగతియు నీలవేణియుఁగృపారసదృష్టియుఁ గల్గువెన్నుఁ డి**
**మ్ముగఁ బొడసూపుఁగాతఁ గనుమూసినయప్పుడు విచ్చినప్పుడున్.**

అంటూ కృతిభర్తను కీర్తిస్తూ కవి ఆశ్వాసాంత గద్యంతో ఈ ఏకాదశ స్కంధాన్ని ముగించాడు.

**– డా॥ ధూళిపాళ రామకృష్ణ**

# ద్వాదశస్కంధం - కథాసారం

పరీక్షిన్మహారాజు భవిష్యత్తులో జరుగబోయే కార్యాలను తెలుపవలసిందని శుకమహర్షిని కోరాడు. సూతమహర్షి ఆ విషయాన్ని శౌనకాదిమునులకు ఇలా వివరించాడు.

శుక యోగీంద్రుడు భావికాలగతులను చెపుతాను, విను అని కొనసాగించాడు. అంటూ – బృహద్రథుడి కుమారుడు పురంజయుడు అతడిని సంహరించి శునకుడనే మంత్రి తానే రాజ్యాన్ని పాలించాడు. శునకుడికి ప్రద్యోతనుడు, అతడికి విశాఖరూపుడు, అతడికి నందివర్ధనుడు కలిగారు. ఈ ఐదుగురు నూటముప్పై ఎనిమిది సంవత్సరాలు భూమిని పాలించారు. తరువాత శిశునాగుడు, అతడికి కాకవర్ణుడు, అతడికి క్షేమవర్ముడు, అతడికి క్షేత్రజ్ఞుడు, అతడికి విధిసారుడు, విధిసారుడికి అజాతశత్రువు, అతడికి దర్భకుడు, అతడికి అజయుడు, అజయుడికి నందివర్ధనుడు, అతడికి మహానంది కలిగారు. వీళ్ళు పదిమంది కలియుగంలో మూడువందల అరవై సంవత్సరాలు పాలించారు. మహానందికి శూద్రస్త్రీవల్ల మహాపద్ముడు పుట్టాడు. అతడితో క్షత్రియ వంశం ముగిసి పోయింది. మహాపద్ముడి కుమారులు ఎనిమిదిమంది నూరు సంవత్సరాలు పాలించారు. తరువాత తొమ్మిదిమంది నందులు రాజులయ్యారు, వారి నొక బ్రాహ్మణుడు నిర్మూలించాడు. నందులు లేనపుడు మౌర్యులు పాలించారు. ఆ బ్రాహ్మణుడు చంద్రగుప్తుణ్ణి రాజుగా చేశాడు, అతడికి పారిసారుడు, అతడికి అశోకవర్ధనుడు, అతడికి సుయశస్సు, వాడికి సంయుతుడు, అతడికి శాలిశూకుడు, అతనికి సోమశర్మ, సోమశర్మకు శతధన్వుడు, అతడికి బృహద్రథుడు పుట్టారు. మౌర్యులతో కలిపి ఈ పదిమంది నూటముప్పై ఏడు సంవత్సరాలు పాలన సాగించారు. బృహద్రథుడి సేనాపతి శుంగవంశీయుడైన పుష్యమిత్రుడు, అతణ్ణి చంపి రాజయ్యాడు, వాడికి అగ్నిమిత్రుడు, అతడికి సుజ్యేష్ఠుడు, వాడికి వసుమిత్రుడు, అతడికి భద్రకుడు, అతడికి పుళిందుడు, వాడికి ఘోషుడు, వాడికి వజ్రమిత్రుడు, వజ్రమిత్రుడికి భాగవతుడు, భాగవతుడికి దేవభూతి కలిగారు. ఈ పదిమంది శుంగులు నూటపన్నెండు సంవత్సరాలు రాజ్యమేలారు, కణ్వుడిమంత్రి వసుదేవుడు శుంగవంశీయుడైన దేవభూతిని చంపి రాజయ్యాడు. వాడికి భూమిత్రుడు, అతడికి నారాయణుడు కలిగారు. ఈ కణ్వవంశీయులు మూడువందల నలభై ఐదు సంవత్సరాలు భూమి నేలినారు. అని చెబుతూ, పరీక్షిన్మహారాజుతో–

**క. గజతురగాదిశ్రీలను, నిజమని నమ్మంగరాదు, నిత్యమును హరిన్**
**గజిబిజి లేక తలంచిన, సుజనులకును నతనియందుఁ జొరఁగా వచ్చున్.**

అని ఉపదేశించాడు. కణ్వవంశీయుడైన సుశర్మకు భృత్యుడు. ఆంధ్రుడైన వృషలుడు సుశర్మను చంపి భూమినేలాడు, అతని తరువాత వాడి తమ్ముడు కృష్ణుడు రాజయ్యాడు. తరువాత శాంతికర్ణుడు, పౌర్ణమాసుడు, లంబోదరుడు, సిబిలకుడు, మేఘస్వాతి, దండమానుడు, అరిష్టకర్మ, తిలకుడు, పురీషసేతుడు, సునందనుడు, వృకుడు, జటాపుడు, శివస్వాతి, అరిందముడు, గోమతి, పురీమంతుడు, దేవశీర్షుడు, శివస్కందుడు, యజ్ఞశీలుడు, శ్రుతిస్కందుడు, యజ్ఞశ్రుతుడు, విజయుడు, చంద్రబీజుడు, సులోమిధి అనేరాజులు పితృక్రమంగా పొంది నాలుగు వందల ఏభై సంవత్సరాలు రాజ్యపాలన చేశారు.

ఆ తరువాత ఆభీర, గర్దభ, కంక, యవన, బర్బర, గురుండ, మౌన వంశీయులు క్రమంగా ఒకవెయ్యి తొమ్మిది వందల తొమ్మిది సంవత్సరాలు పాలించారు. తరువాత మౌనులు, కైకిలులు, భూతనందుడు, నవభంగిరుడు, శివనందుడు, యశోనందుడు, ప్రవీరకుడు పాలించారు. తరువాత వారి కుమారులు బాహ్లిక, కోసలదేశాల నేలారు, వైదూర్యపతులు నిషధదేశపాలకులయ్యారు. మగధరాజు పురంజయుడు పులింద, యదువంశీయ, మద్రదేశీయులకు ధర్మోపదేశం చేసి శ్రీమన్నారాయణుడి మీద భక్తి కలిగేటట్లు చేశాడు.

**క. దినదినమును ధర్మంబులు, ననయము ధరనడఁగిపోవు నాశ్చర్యముగా**
**విను వర్ణచతుష్కములో; నెనయగ ధనవంతుఁడైన నేలు ధరిత్రిన్,**

ఇలా ధర్మమార్గం బలహీనమైనప్పుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ నిమిత్తం శంబల గ్రామంలో విష్ణు యశుడనే విప్రుడికి పరమాత్మ 'కల్కి' పేరున అవతరిస్తాడు. ఆయన అధర్మాన్ని అణచిన ఆవేళ నిఖిల జనులూ ధన్యులవుతారు. తరువాత చంద్ర, సూర్య, శుక్ర, గురువులు ఒక రాశిలో చేరినప్పుడు కృతయుగం ఆరంభం అవుతుంది. రాజా! నీ పుట్టుక నుండి నందుడి పట్టాభిషేకం వరకూ ఒక వేయి నూటపదిహేను సంవత్సరాలు, పిమ్మట నారాయణుడు దుష్టులైన రాజులందరినీ ధ్వంసం చేసి, ధర్మాన్ని నిలిపి వైకుంఠానికి చేరుకుంటాడు. అని చెప్పిన శుక యోగీంద్రుణ్ణి, ఓ మునీశ్వరా! చంద్ర, సూర్య గ్రహ సంచారం, కాలగమనాన్ని గూర్చి తెలుపమని పరీక్షిన్మహారాజు కోరాడు. దానికి సమాధానంగా శుకమహర్షి – శ్రీ కృష్ణ నిర్యాణం రోజునే కలిప్రవేశించటం లాంటి విషయాలను వివరించాడు.

**క. ధర్మము సత్యముఁగీర్తియు నిర్మలదయ విష్ణుభక్తి నిరుపమ ఘన స**
**త్కర్మ మహింసావ్రతమును నర్మిలి గలవారె పుణ్యు లవనీనాథా!**

కలియుగంలో క్షణకాలమైనా నారాయణ పరాయణులై మనస్సులో శ్రీనృసింహ, వాసుదేవ, సంకర్షణాది నామాలను అచంచల భక్తితో తలచేవాళ్ళకు నూరు యాగాలు చేసిన ఫలం కలుగుతుంది. కాబట్టి, "ఓ రాజశేఖరా! నీ మనస్సులో హరిని ఎల్లప్పుడూ తలుస్తూ ఉండు. కృతార్థుడ వౌతావు" అని ఉపదేశించాడు. తరువాత 'సృష్టికి ప్రళయ మెలా కలుగుతుంది' అని పరీక్షిన్మహారాజు అడుగగా 'నిత్య, నైమిత్తిక, ప్రాకృతిక, ఆత్యంతికాలనే ప్రళయాలు నాలుగురకాలు. ఆ సమయాలలో ఏర్పడే నారాయణుడి లీలావతారాలను గూర్చి బ్రహ్మ మహేశ్వరాదులైనా చెప్పలేరు, నాకు తెలిసినంత చెప్పాను. సంసార సముద్రాన్ని దాటటానికి 'హరికథ' అనే నావ సహాయపడుతుంది. కాని మరొకటి సహాయపడ దన్నాడు.

**ఉ. ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబు లోపలన్**
**మానుము; సంభవంబు గల మానవకోట్లకుఁ జావు నిత్యమౌఁ;**
**గాన హరిందలంపు; మికఁగల్గదు జన్మము నీకు ధాత్రిపై**
**మానవనాథ! పొందెదవు మాధవలోకనివాససౌఖ్యముల్,**

అని హితవు పలికాడు, 'తక్షకుడు నిన్ను కాటు వేయలేదు. శ్రీహరిని ధ్యానించు' అని చెప్పి వెళ్ళి పోయాడు, తక్షకుడు బ్రాహ్మణుడి రూపంలో పరీక్షిత్తును కాటువేయడానికి వస్తూ, దోవలో పామువిషాన్ని నిర్వీర్యం చెయ్యగల కాశ్యపుడనే విప్రుణ్ణి చూసి, లెక్కలేనంత డబ్బిచ్చి, అతణ్ణి సంతృప్తిపరచి, పరీక్షిత్తు దగ్గరకు రాకుండా చేశాడు. పరీక్షిత్తు దగ్గరుండే వాళ్ళ కొకపండు ఇచ్చి వెళ్ళిపోయాడు. వాళ్ళు ఆ పండును రాజుకిచ్చారు. రాజు దానిని

ఆస్వాదిస్తూండగా పురుగురూపంలో బయటపడి మహాభయంకరమైన పాముంరూపంతో తక్షకుడు రాజును కాటువేశాడు, ఆ క్షణంలోనే విషాగ్నిచేత రాజు భస్మమయ్యాడు. పరీక్షిన్మహారాజు కుమారుడు జనమేజయుడు కోపగించి సర్పయాగం చేశాడు. తక్షకుడు రాకుండా ఇంద్రుడి వద్ద ఉండటం తెలిసి 'సహేంద్రతక్షకాయానుబ్రూహి' అంటూ అతడు ఇంద్రుడు సహా స్థానభ్రంశమై పడేటట్లు చేశాడు. అప్పుడు ఆంగీరసుడు వచ్చి జనమేజయుణ్ణి ఎన్నో రకాలుగా కీర్తించి, క్రోధాన్ని విడిచి పెట్టమన్నాడు. జనమేజయుడప్పుడు. సర్పయాగం మానేశాడు. పరనింద చెయ్యకుండా, శత్రుత్వాన్ని విడిచిపెట్టి, భగవంతుడి పాదపద్మాల మీద భక్తికలిగి ఉండేవాడు హరిపదాన్ని చేరుకుంటాడు. అని ఎంతో సంతోషంతో సూతమహర్షి శౌనకుడికి తెలియ జేశాడు.

వేదాలను సమగ్రంగా అధ్యయనం చెయ్యలేనివారికి సహాయపడటానికి ద్వాపర యుగారంభంలో భగవంతుడు సత్యవతీపరాశరులకు వ్యాసుడనే పేరుతో కుమారుడుగా అవతరించాడు. వేదాన్ని ఋగ్యజు స్సామాథర్వణాలని నాలుగు భాగాలుగా విభజించి, పైల, వైశంపాయన, జైమిని, సుమంతులనే శిష్యులకు వాటిని క్రమంగా ఉపదేశించాడు అని వేదాల పుట్టుకను, ప్రచారక్రమాన్ని చెప్పాడు. నా తండ్రి, వ్యాసునిశిష్యుడు అయిన రోమహర్షణుడినుండి త్రయ్యారుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు అనే ఆరుగురు పురాణాలను గ్రహించారు; బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, భవిష్యోత్తర, నారదీయ, మార్కండేయ, అగ్ని, బ్రహ్మవైవర్త, లింగ, వరాహ, స్కాంద, వామన, కూర్మ, మత్స్య, బ్రహ్మాండ, గరుడ అనేవి పద్దెనిమినిది మహాపురాణాలు; ఇంకా ఉప పురాణాలూ ఉన్నాయి అన్నాడు. తరువాత శౌనకాదులు 'తప్పులు చేసేవాళ్ళు, పాప బుద్ధికలవాళ్ళు ఎలా సంసారసముద్రాన్ని దాటుతారు?' అని అడిగారు, అప్పుడు సూతమహర్షి – వెనుకటి యుగాలలో తపోబలంతో గొప్పవాళ్ళైన మునుల మహిమను చెప్తే సంతోషించి మార్కండేయుడు మనస్సులో శ్రీహరిని నిలుపుకొని చిరకాలం జీవించాడు. లోకాలు ప్రళయకాలంలో జలమయమై చీకటితో నిండిపోయినప్పుడు, ఏకాకిగా తిరుగుతూ వటపత్రశాయి అయిన బాలుడి హృదయంలో ప్రవేశించి అనేక వేల సంవత్సరాలు తిరిగి, మళ్ళీ మఱ్ఱి ఆకుమీద పడుకున్న ఆ బాలుణ్ణి చూశాడు. అని చెప్పాడు. అప్పుడు శౌనకాదులు ఆ మునికి అంత మహిమ ఎలాకలిగింది? అని అడిగారు, సూతమహర్షి వారి కిలా చెప్పాడు.

బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, నిష్ఠతో హరిని స్మరిస్తున్న మృకండుడు అనే మునికి హరిహరులు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నారు. గుణగణాలచే గొప్పవాడైన కుమారుడు కావాలన్నాడు, వారనుగ్రహించి అంతర్ధానమయ్యారు. ఆ మునికి మార్కండేయుడు పుట్టాడు, నియమనిష్ఠాగరిష్ఠుడైన అతణ్ణి యముడు పాశాలతో కట్టగా, మృత్యువును ధిక్కరించి అతడు పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఇంద్రుడు భయపడి అతడికి తపోభంగం కలిగించటానికి దేవతాస్త్రీలను పంపించాడు అగ్నిహోత్రుడిలా ఉండి తపస్సు చేస్తున్న ఆ మునిని వీణావేణువినోద గానాలతో అలరించి గెలువలేకపోయినవాళ్ళు ఇంద్రుడి దగ్గరకు వెళ్ళిపోయారు. అప్పుడు ప్రసన్నుడైన శ్రీహరి ప్రత్యక్షం కాగా "దేవా! నీ దివ్యనామస్మరణవల్ల ఈ శరీరంతోనే అనేక యుగాలు బ్రతికేటట్లు చెయ్య"మని అడిగితే ఆయన కరుణించి ఆ వరం ఇచ్చాడు.

అనేక కాలాలపాటు అనంతమైన వటపత్రశాయి ఉదరంలో తిరిగి, అతడిపాద పద్మస్మరణ చేత వెలుపలికి వచ్చి ఆయనను మార్కండేయుడు కౌగిలించుకో బోయాడు. మాయతో ఆ స్వామి అంతర్ధానమయ్యాడు, ముని

తన ఆశ్రమానికి చేరుకొని తపస్సు చేశాడు. ఆ సమయంలో పార్వతి శివుడితో ఈ మునిని చూశారా? ఒక్క మాట పలికితే బాగుంటుంది. ఈ మహర్షి తీరెలాంటిదో వినాలనిపిస్తోంది అంది.

శంకరుడు ఆమెతో కలసి ఆకాశంనుండి భూమి మీదకు దిగి, ఏకాగ్రతతో ఉన్న ఆ ముని హృదయంలో యోగమాయవల్ల ప్రవేశించి తన స్వరూపాన్ని కనబరిచాడు. మార్కండేయుడు శివుణ్ణి స్తుతించి, ఆయన ఆనతితో నారాయణపాదపద్మధ్యానం, మృత్యువుపై జయాన్ని ప్రసాదించుమన్నాడు. శివు'డట్లే అగుగాక!' అని అంతర్ధానమయ్యాడు. దుర్జనులతో కలువకుండా ఎల్లప్పుడూ నారాయణ, గోవిందాది నామస్మరణం చేసే పుణ్యపురుషుడు వైకుంఠంలో నివసిస్తాడు అన్నాడు. 'అటుపై సూర్యుడు చైత్రమాసం మొదలుకొని ఏ యే మాసంలో ఏ యే పేరుతో ప్రవర్తిస్తాడో చెప్పమని శౌనకాదులు అడిగారు, శ్రీమన్నారాయణ స్వరూపుడైన సూర్యుడు ఒకే స్వరూపమే కలవాడైనా అతణ్ణి కాల, దేశ, క్రియాది గుణాలనుబట్టి ఋషులు అనేక క్రమాలలో అభివర్ణించి భావిస్తున్నారు. ఆ స్వరూపాలన్నిటినీ వాసుదేవమయంగా తెలుసుకోండి.' అని నైమిశారణ్య వాసులైన శౌనకాది ఋషులకు చెబుతూ, సూతమహర్షి భాగవతం, పురాణాలన్నింటిలో రత్నంలాంటిది. దానిని విన్నవారు, చదివేవారు, వ్రాసేవారు ఆయురారోగ్య ఐశ్వర్యాలను పొందటమే కాకుండా విష్ణుసాయుజ్యాన్ని పొందుతారు.

**శ్రీరమణీరమణకథా పారాయణ చిత్తునకును బలికిఁ బరీక్షి**
**ద్భూరమణున కెఱిఁగించెను, సారమతిన్ శుకుఁడు ద్వాదశ స్కంధములన్.**

అని శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు భాగవతాన్ని ఉపదేశించిన విధాన్ని తెలిపాడు. ఆపైన నాలుగులక్షల శ్లోకాలతో అలరారే పద్దెనిమిది పురాణాలలో భాగవత ప్రాముఖ్యాన్ని వివరించాడు, తరువాత

**క. సకలాగమార్థపారగుఁ డకలంకగుణాభిరాముఁడంచిత బృందా**
**రకవంద్య పాదయుగుఁడగు, శుకయోగికి వందనంబు సొరిది నొనర్తున్.**

అని శుకయోగీంద్రుణ్ణి ప్రస్తుతించి

**సీ. సకలగుణాతీతు సర్వజ్ఞు సర్వేశు నఖిలలోకాధారు, నాదిదేవుఁ**
**బరమదయారసోద్భాసితుం ద్రిదశాభివందితపాదాబ్జు వనధిశయను**
**నాశ్రితమందారు నాద్యంత శూన్యుని వేదాంత వేద్యుని విశ్వమయునిఁ**
**గౌస్తుభ శ్రీవత్స కమనీయవక్షుని శంఖచక్రగదాసి శార్ఙ్గ ధరుని**

**తే. శోభనాకారుఁ బీతాంబరాభిరాము, రత్నరాజిత మకుట విభ్రాజమానుఁ**
**బుండరీకాక్షు మహనీయ పుణ్యదేహుఁ దలఁతు నుతియింతు దేవకీతనయు నెపుడు.**

అని శ్రీ కృష్ణస్వామిని నుతించాడు. తరువాత సూతునివలన భాగవతాన్నంతా విన్న మునులు సంతోషించినవారై, కృష్ణుణ్ణి ప్రేమతో మనస్సులో నిలుపుకొని తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు; కృతిభర్తను కీర్తిస్తూ బమ్మెర పోతనామాత్య కవీంద్రుడు ద్వాదశస్కంధాన్ని ముగించాడు.

**– డా॥ ధూళిపాళ రామకృష్ణ**

# విషయసూచిక

## ఏకాదశస్కంధము


| విషయము | | పుట |
|---|---|---|
| పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రు నడిగెడు ప్రశ్న | ... | 1 |
| విశ్వామిత్ర వసిష్ఠ నారదాది మహర్షులు శ్రీకృష్ణ సందర్శనంబునకు వచ్చుట | ... | 5 |
| వసుదేవునకు నారదుండు పురాతనంబగు విదేహర్షభ సంవాదంబుఁ దెలుపుట | ... | 13 |
| బ్రహ్మాదిదేవతలు శ్రీకృష్ణుని వైకుంఠమునకుఁ బిలువ వచ్చుట | ... | 48 |
| కృష్ణుండు దుర్నిమిత్తములం గని యాదవుల నెల్ల ద్వారకనుండి ప్రభాస తీర్థమునకుఁ బంపుట | ... | 49 |
| కృష్ణుం డుద్ధవునకుఁ బరమార్థోపదేశము సేయుట | ... | 51 |
| అవధూత – యదు సంవాదము | ... | 55 |
| శ్రీ కృష్ణ బలరాములు వైకుంఠమున కరుగుట | ... | 78 |


## ద్వాదశస్కంధము


| | | |
|---|---|---|
| శుకయోగి పరీక్షిత్తునకు భావికాలగతులఁ జెప్పుట | ... | 88 |
| యుగధర్మప్రాకృతాది ప్రళయచతుష్టయ వివేచనము | ... | 107 |
| పరీక్షిత్తు తక్షకునిచే దష్టుండై మృతి నొంద నతని పుత్త్రుఁడు సర్పయాగము సేయుట | ... | 116 |
| శ్రీవేదవ్యాసుండు వేదములను, బురాణములను లోకమందుఁ బ్రవర్తింపఁజేయుట | ... | 120 |
| మార్కండేయోపాఖ్యానము | ... | 128 |
| చైత్రాదిమాసంబుల సంచరించెడు ద్వాదశాదిత్యుల క్రమంబును దెలుపుట | ... | 137 |


❊ ❊ ❊

# ఏకాదశస్కంధము



శ్రీరస్తు

# శ్రీమహాభాగవతము

## ఏకాదశస్కంధము

### a=పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రు నడిగెడు ప్రశ్న a

**శ్రీ సీతాపతి! లంకే, శాసురసంహారచతుర! శాశ్వత! నుత వా**
**ణీసత్యధిభూభవవృ, త్రాసురరిపుదేవజాల! రామనృపాలా!** **1**

**ప్రతిపదార్థం :** శ్రీ సీతాపతి= సంపదతో కూడిన సీతావిభుడా; లంకా= లంకానగరానికి; ఈశ= ప్రభువైన; అసుర= (రాక్షసుని) రావణుని; సంహార= సంహరించుట (వధించుట) లో; చతుర= నేర్పుగలవాడా!; శాశ్వత= సుస్థిరుడా!; నుత= నుతింపబడిన; వాణీసతీ+అధిభూ= సరస్వతీదేవిభర్త అయిన బ్రహ్మ; భవ= ఈశ్వరుడు; వృత్ర+అసుర= వృత్రుడనే రాక్షసునికి; రిపు= శత్రువైన ఇంద్రుడు; దేవజాల= దేవతల సమూహం కలవాడా!; రామనృపాలా= శ్రీరాముడనే పేరుగల రాజా!

**తాత్పర్యం :** శ్రీ జానకీనాయకా! లంకకు ప్రభువైన రావణుణ్ణి వధించడంలో నేర్పు చూపినవాడా! సుస్థిరుడా! సరస్వతీదేవి భర్త అయిన బ్రహ్మదేవుడు, శివుడు, వృత్రాసురుని శత్రువైన ఇంద్రుడు, దేవతలసమూహం స్తుతించిన లేదా వాళ్ల స్తుతికి పాత్రమైన ఓ రామభూపాలా!

**వ. మహనీయగుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుండైన సూతుం డిట్లనియె; నట్లు ప్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రుం గని శుకయోగీంద్రుం 'డయ్యా! జన్మకర్మవ్యాధి విమోచనంబునకుఁ గారణంబగు దివ్యౌషధంబు గావున శ్రీమన్నారాయణకథామృతంబుఁ గ్రోలు' మని యిట్లనియె.** **2**

**ప్రతి :** మహనీయ= గొప్పవైన; గుణ= గుణాలచేత; గరిష్ఠులు+అగు= మిక్కిలి గొప్పవారైన; ఆ+మునిశ్రేష్ఠులకున్= (శౌనకాది) మునివర్యులకు; నిఖిల= సమస్త; పురాణ= పురాణాల; వ్యాఖ్యాన= వివరణాత్మకమైన; వైఖరీ= రీతులతో; సమేతుండు+ఐన= కూడినవాడైన అనగా వివరించగలవాడైన; సూతుండు= సూతుడనే పేరుగల ముని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు. అట్లు= ఆ విధంగా; ప్రాయోపవిష్టుండు+ఐన= ప్రాయోపవేశం చేస్తున్న; పరీక్షిత్+నర+ఇంద్రున్= పరీక్షిత్తు అనే పేరుగల మహారాజును; కని= చూచి; శుకయోగి+ఇంద్రుండు= యోగిశ్రేష్ఠుడైన శుకుడు; అయ్యా= ఓ రాజా!; జన్మ= పుట్టుకకు కారణమైన; కర్మ= చేసేపని అనబడే; వ్యాధి= రోగం; విమోచనంబునకున్= తొలగడానికి; కారణంబు+అగు= హేతువైన; దివ్య+ఔషధంబు= దివ్యమైన మందు; కావునన్= కాబట్టి; శ్రీమన్నారాయణ= శ్రీమన్నారాయణునికి చెందిన; కథా+అమృతంబున్= కథ అనే అమృతాన్ని; క్రోలుము+అని= తాగుమని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఉత్తమగుణాలు ఉండడంచేత ఎంతో గొప్పవారైన శౌనకాది మునిశ్రేష్ఠులతో పురాణాలన్నిటిని వివరణాత్మకంగా చెప్పగల సూతమహర్షి ఇలా అన్నాడు. అలా ప్రాయోపవేశదీక్షను పూనిన పరీక్షిత్తు అనే మహారాజును చూచి శుకమునివర్యుడు

"అయ్యా!' పుట్టుకకు కారణమైన కర్మ అనే రోగం తొలగిపోవడానికి కారణమైన దివ్యమైన మందు కాబట్టి శ్రీమన్నారాయణునికి సంబంధించిన కథలనే అమృతం తాగు" మని ఇలా అన్నాడు.

**మ. బలవత్సైన్యముతోడఁ గృష్ణుఁడు మహాబాహాబలోపేతుఁడై**
**కలనన్ రాక్షసవీరవర్యుల వడిన్ ఖండించి, భూభార ము**
**జ్జ్వలమై యుండఁగ ద్యూతకేళికతనం జావంగఁ గౌరవ్య స**
**ద్బలముం బాండవసైన్యము న్నడఁచె భూభాగంబు గంపింపఁగన్. 3**

**ప్రతి :** కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; బలవత్+సైన్యముతోడన్= బలమైన సేనతో; మహా= గొప్ప; బాహాబల+ఉపేతుఁడు+ఐ= భుజబలంతో కూడినవాడై; కలనన్= యుద్ధంలో; రాక్షస వీరవర్యులన్= గొప్పవారైన రాక్షసవీరులను; వడిన్= శీఘ్రంగా; ఖండించి= వధించి; భూభారము= భూమి బరువు; ఉజ్జ్వలము+ఐ= ప్రకాశవంతమై (అధర్మపరులు నిండి ఉండడంచేత ఎక్కువై); ఉండన్+కన్= ఉండగా; ద్యూతకేళికతనన్= జూదం అనే క్రీడ కారణంగా; కౌరవ్య= కౌరవులకు సంబంధించిన; సత్+బలమున్= మహాసైన్యం; పాండవ= పాండవులకు సంబంధించిన; సైన్యమున్= సేనను; భూభాగంబు= భూమండలం; కంపింపన్+కన్= చలించే విధంగా; చావన్+కన్= మరణించగా; అడఁచెన్= నశింపజేశాడు.

**తా :** శ్రీకృష్ణుడు గొప్ప భుజబలం కలవాడై బలవంతమైన సేనతో గొప్ప రాక్షసవీరులందరిని యుద్ధంలో అనతికాలంలోనే సంహరించాడు. భూభారం ఇంకా ఎక్కువగా ఉండడంచేత జూదం అనే క్రీడ కారణంగా యుద్ధంలో కౌరవ పాండవసేనలను భూమండలం కంపించే విధంగా సంహరింపజేసి నిర్మూలించాడు.

**వ. అంత. 4**

**ప్రతి :** అంతన్= అప్పుడు...

**క. మునివరులు సంతసిల్లిరి, యనయము నందాదులకును హర్షం బయ్యెం;**
**దన నిజభక్తులు యాదవ, ఘనవీరసమూహ మపుడు గడు నొప్పెసఁగెన్. 5**

**ప్రతి :** మునివరులు= మునిశ్రేష్ఠులు; సంతసిల్లిరి= సంతోషించారు; నంద+ఆదులకును= నందుడు మొదలైనవారికి; అనయము= మిక్కిలి; హర్షంబు+అయ్యెన్= సంతోషం కలిగింది; తన= తనయొక్క (శ్రీకృష్ణునియొక్క); నిజభక్తులు= సహజమైన భక్తిగలవారు; యాదవ= యాదవులైన; ఘన= గొప్ప; వీరసమూహము= పరాక్రమవంతులగుంపు; అపుడు= ఆ సందర్భంలో; కడున్= మిక్కిలి; ఒప్పు+ఎసఁగెన్= ఎంతో ఒప్పింది (సంతసించింది).

**తా :** (ఈ విధంగా భూభారం నశించిందని) మహర్షులు సంతోషించారు. నందుడు మొదలైనవారు కూడా ఆనందించారు. కృష్ణ భక్తులైన యాదవ వీరులు ఆనందంతో విజృంభించారు.

**మ. విదితుండై సకలామరుల్ గొలువ నుర్వీభారమున్ మాన్పి, దు**
**ర్మద సంయుక్త వసుంధరాధిపతులన్ మర్దించి, కంసాదులం**
**దుదిముట్టన్ వధియించి, కృష్ణుఁ డతిసంతుష్టాత్ముఁడై యున్నచో**
**యదుసైన్యంబులు భూమి మోవఁగ నసహ్యం బయ్యె నత్యుగ్రమై. 6**

**ప్రతి :** కృష్ణుఁడు= శ్రీకృష్ణుడు; విదితుండు+ఐ= తెలియబడినవాడై (ప్రసిద్ధుడై); సకల+అమరుల్= దేవతలందరూ; కొలువన్= సేవిస్తూ ఉండగా; ఉర్వీభారమున్= భూభారాన్ని; మాన్పి= పోగొట్టి; దుర్మద= చెడ్డదైనగర్వంతో; సంయుక్త= కూడిన; వసుంధరా+ అధిపతులన్= భూపాలకులను; మర్దించి= అణచి; కంస+ఆదులన్= కంసుడు మొదలైనవాళ్లను; తుదిముట్టన్= అంతరించే విధంగా; వధియించి= సంహరించి; అతి= మిక్కిలి; సంతుష్ట+ఆత్ముఁడు+ఐ= సంతోషంతో కూడిన మనస్సు కలవాడై; ఉన్నచోన్= ఉండగా; యదుసైన్యంబులు= యాదవసేనలు; భూమి మోవన్+కన్= నేల దద్దరిల్లగా; అతి+ఉగ్రము+ఐ= మిక్కిలి భయంకరమై; అసహ్యంబు+అయ్యెన్= దుస్సహమైనాయి.

**తా :** దేవతలందరిచేత సేవింపబడుతూ ప్రసిద్ధుడైన శ్రీకృష్ణుడు దుర్మదాంధులైన భూపాలకులను అణచివేసి, కంసుడు మొదలైన వాళ్లను సమూలంగా సంహరించి, భూభారం తగ్గించి ఎంతో సంతోషంతో ఉండగా యాదవసేనలు విజృంభించి, నేల దద్దరిల్లేటట్లు అతి భయంకరంగా దుస్సహంగా నడిచాయి (దీనివల్ల భూభారం అధికమైంది).

**సీ.** **ఈ రీతి శ్రీకృష్ణుఁడేపారఁబూతనా శకట తృణావర్త సాల్వ వత్స**
**చాణూర ముష్టిక ధేను ప్రలంబక దైత్యాఘ శిశుపాల దంతవక్త్ర**
**కంస పౌండ్రాదిక ఖండనం బొనరించి యటమీఁదఁ గురుబలం బణఁచి మఱియు**
**ధర్మజు నభిషిక్తుఁ దనరఁగాఁ జేసిన నతఁడు భూపాలనం బమరఁ జూచి**

**తే.** **భక్తులగు యాదవేంద్రులఁ బరఁగఁ జూచి, యన్యపరిభవ మెఱుఁగ రీ యదువు లనుచు**
**వీరిఁ బరిమార్ప నేఁదక్క వేఱొకండు, దైవ మిఁక లేదు త్రిభువనాంతరమునందు. 7**

**ప్రతి :** ఈ రీతిన్= ఈవిధంగా; శ్రీకృష్ణుఁడు; ఏపు+ఆరన్= అతిశయంతో; పూతనా= పూతన అనే పేరుగల రాక్షసిని; శకట= శకటాసురుణ్ణి; తృణావర్త= తృణావర్తుడనే రాక్షసుణ్ణి; సాల్వ= సాల్వుణ్ణి; వత్స= వత్సాసురుణ్ణి; చాణూర= చాణూరుణ్ణి; ముష్టిక= ముష్టికుణ్ణి; ధేను= ధేనుకాసురుణ్ణి; ప్రలంబకదైత్య= ప్రలంబకాసురుణ్ణి; అఘ= అఘాసురుడు; శిశుపాల= శిశుపాలుడు; దంతవక్త్ర= దంతవక్త్రుడు; కంస= కంసుడు; పౌండ్ర+ఆదిక= పౌండ్రుడు మొదలైనవారి; ఖండనంబు= సంహారం; ఒనరించి= చేసి; అటమీఁదన్= ఆపైన; కురుబలంబు+అణఁచి= కురుసైన్యాన్ని మట్టుబెట్టి; మఱియున్= ఇంకా; ధర్మజున్= ధర్మరాజును; తనరన్+కాన్= అతిశయం కలిగేటట్లు; అభిషిక్తున్+చేసినన్= (చక్రవర్తిగా) అభిషేకించగా; అతఁడు= ఆ ధర్మరాజు; భూపాలనంబు= భూమిపాలన (రాజ్యపరిపాలన); అమరన్= చక్కగా (నిర్వర్తిస్తుండగా); భక్తులు+అగు= భక్తులైన; యాదవ+ఇంద్రులన్= యదుశ్రేష్ఠులను; పరఁగన్+చూచి= పరిశీలనగా గమనించి; ఈ యదువులు= ఈ యాదవులు; అన్య= ఇతరులచే; పరిభవము+ఎఱుఁగరు= పరాభవాన్ని పొందరు; అనుచున్= అనుకొంటూ; వీరిన్+పరిమార్పన్= వీళ్లను సంహరించడానికి; నేను+తక్క= నేను తప్ప; త్రిభువన+అంతరమునందున్= మూడులోకాలలో; వేఱు+ఒకండు దైవము= వేరేదైవం (వేరొకదేవత); ఇఁక+లేదు= మరిలేదు.

**తా :** శ్రీకృష్ణుడీవిధంగా పూతన, శకటాసురుడు, తృణావర్తుడు, సాల్వుడు, వత్సాసురుడు, చాణూరుడు, ముష్టికుడు, ధేనుకాసురుడు, ప్రలంబకాసురుడు, అఘాసురుడు, శిశుపాల, దంతవక్త్ర, కంస, పౌండ్రకాదులను సంహరించి, ఆపైన కురుబలాన్ని అణచివేసి, ధర్మరాజును చక్రవర్తిగా అభిషేకించాడు. ధర్మరాజు రాజ్యపాలన చేస్తుండగా చూచి తన భక్తులైన యాదవేంద్రులను పరిశీలనగా చూచి "వీళ్లు ఇతరుల వల్ల పరాభవం (అవమానం) ఎరుగరు. వీళ్లను సంహరించడానికి నేను తప్ప ముల్లోకాలలోనూ మరొక దైవం లేదు" అని భావించాడు.

**వ. అని వితర్కించి జగదీశ్వరుం 'దత్యున్నతవేణుకావనంబు వాయువశంబున నొరసికొన ననలం బుద్భవంబయి దహించుచందంబున యదుబలంబుల కన్యోన్యవైరానుబంధంబులు గల్పించి హతం బొన ర్చెద' నని విప్రశాపంబు మూలకారణంబుగాఁ దలంచి యదుబలంబుల నడంచె నని పలికిన మునివరునకు రాజేంద్రుం డిట్లనియె. 8**

**ప్రతి :** అని= యాదవులను పరిమార్చే మరొక దైవం లేదని; వితర్కించి= బాగా ఆలోచించి; జగత్+ఈశ్వరుండు= లోకనాయకుడైన శ్రీకృష్ణుడు; అతి+ఉన్నత= ఎంతో గొప్పదైన; వేణుకావనంబు= వెదురుగుబురు; వాయువశంబునన్= గాలివల్ల; ఒరసికొనన్= ఒక వెదురుబొంగు మరొక బొంగుతో రాసుకోగా; అనలంబు= అగ్ని; ఉద్భవంబు+అయి= పుట్టి; దహించు చందంబునన్= కాల్చేవిధంగా; యదుబలంబులకున్= యాదవసేనలకు; అన్యోన్య= పరస్పర; వైర+ అనుబంధములు= శత్రుత్వాలు; కల్పించి= కలిగించి; హతంబు+ఒనర్చెదన్+అని= హతమారుస్తానని; విప్రశాపంబు= బ్రాహ్మణశాపం; మూలకారణంబు+కాన్= మూలమైన హేతువుగా; తలంచి= ఎంచి; యదుబలంబులన్= యాదవసేనలను, అడంచెన్+అని= అణచినాడని; పలికినన్= చెప్పగా; రాజ+ఇంద్రుండు= రాజశ్రేష్ఠుడైన పరీక్షిత్తు; మునివరునకున్= మునిశ్రేష్ఠుడైన శుకునితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అని ఆలోచించాడు. ఎంతో పెద్దదైన వెదురుగుబురును (పొదను) లోపలి బొంగులు ఒకదానిని మరొకటి రాసుకోవడంవల్ల పుట్టిన అగ్ని దహించే విధంగా యాదవసేనలలో పరస్పర శత్రుత్వాలు కలిగించి ఆ సేనలను నాశనం చేస్తానని నిశ్చయించాడు. దానికి బ్రాహ్మణశాపాన్ని మూలకారణంగా తలచాడు. అనుకొన్నవిధంగా యాదవులను నశింపజేశాడని చెప్పిన శుకమహర్షితో రాజశ్రేష్ఠుడైన పరీక్షిత్తు ఇలా అన్నాడు.

**క. 'హరిపాదకమల సేవా, పరులగు యాదవుల కెట్లు బ్రాహ్మణశాప**
**స్ఫురణంబు సంభవించెనొ, యరయఁగ సంయమివరేణ్య! యానతి యీవే ! 9**

**ప్రతి :** సంయమివరేణ్య= మునివర్యా!; అరయన్+కన్= ఆలోచించి చూడగా; హరి= శ్రీకృష్ణుని; పాదకమల= కమలాలవంటి పాదాలను; సేవాపరులు+అగు= సేవించడంలో ఆసక్తిగలవారైన; యాదవులకున్; ఎట్లు= ఏవిధంగా; బ్రాహ్మణ= విప్రుల; శాపస్ఫురణంబు= శాపప్రసక్తి; సంభవించెను+ఒ= పుట్టిందో (కలిగిందో); ఆనతి+ఈవు+ఏ= తెలియజెప్పవా.

**తా :** ఓ మునిసత్తమా! ఆలోచించి చూస్తే శ్రీహరి పాదకమలాలను ఆసక్తితో సేవించే యాదవులకు బ్రాహ్మణశాపం ఎలా కలిగిందో తెలియజేయండి.

**క. అనిన జనపాలునకు ని, ట్లని సంయమికులవరేణ్యుఁ డతిమోదముతో**
**విను మని చెప్పఁగఁ దొడఁగెను, ఘనతరగంభీరవాక్ప్రకాశస్ఫురణన్. 10**

**ప్రతి :** అనిన= అలా అడిగిన; జనపాలునకున్= రాజుకు; అతిమోదముతోన్= మిక్కిలి సంతోషంతో; సంయమివరేణ్యుఁ డు= మునిశ్రేష్ఠుడు; ఘనతర= గొప్పవైన; గంభీర= గంభీరాలైన; వాక్+ప్రకాశ+స్ఫురణన్= వాక్ప్రవాహస్ఫూర్తితో; వినుము+అని= వినుమని; ఇట్లు+అని= ఇలాగని; చెప్పన్+కన్= చెప్పడం; తొడఁగెను= ఆరంభించెను.

**తా :** అలా అడిగిన రాజుతో మునిశ్రేష్ఠుడైన శుకుడు గొప్పవైన, గంభీరాలైన వాక్ప్రవాహస్ఫూర్తితో విను అని ఇలా చెప్పడం ఆరంభించాడు.

## a =విశ్వామిత్ర వసిష్ఠ నారదాది మహర్షులు శ్రీకృష్ణ సందర్శనంబునకు వచ్చుట a

**వ. నిరుపమసుందరం బయిన శరీరంబు ధరియించి సమస్తకర్మతత్పరుండై పరమేశ్వరుండు యదువుల నడంగింపఁ దలఁచుసమయంబున జటావల్కలకమండలుధారులును, రుద్రాక్షభూతిభూషణముద్రా ముద్రితులును, కృష్ణాజినాంబరులును నగు విశ్వామిత్రాసిత దుర్వాసోభృగ్వంగిరఃకశ్యప వామదేవవాలఖిల్యాత్రి వసిష్ఠ నారదాది మునివరులు స్వేచ్ఛావిహారంబున ద్వారకానగరంబున కరుదెంచి యందు. 11**

**ప్రతి :** పరమ+ఈశ్వరుండు= మిక్కిలి గొప్ప ప్రభువైన శ్రీకృష్ణుడు; నిరుపమ= సాటిలేని; సుందరంబు+అయిన= అందంగా ఉన్న; శరీరంబున్= మేనును; ధరియించి= తాల్చి; సమస్త= అన్ని; కర్మ= పనులు (చేయడంలో); తత్పరుండు+ఐ= ఆసక్తి కలవాడై; యదువులన్= యాదవులను; అడంగింపన్= నశింపజేయడానికి; తలఁచు= ఆలోచించే; సమయంబునన్= సమయంలో; జటా= జడలు; వల్కల= నారబట్టలు; కమండలు= కమండలాలు; ధారులును= ధరించినవారూ; రుద్రాక్ష= రుద్రాక్షలు; భూతి= విభూతి; భూషణ= అలంకరణల; ముద్రా= చిన్నెలచే; ముద్రితులును= చిహ్నితులైనవారూ (అలంకరించుకొన్నవారూ); కృష్ణ= నల్లని; అజిన= జింకచర్మం; అంబరులును= వస్త్రాలుగా ధరించినవారూ; అగు= అయిన; విశ్వామిత్ర= విశ్వామిత్రుడు; అసిత= అసితుడు; దుర్వాస= దుర్వాసుడు; భృగు= భృగుమహర్షి; అంగిరః= అంగిరసుడు; కశ్యప= కశ్యపుడు; వామదేవ= వామదేవుడు; వాలఖిల్య= వాలఖిల్యులు; అత్రి= అత్రిమహర్షి; వసిష్ఠ= వసిష్ఠుడు; నారద+ఆది= నారదుడు మొదలైన; మునివరులు= మునిశ్రేష్ఠులు; స్వ+ఇచ్ఛా= తమకిష్టమైన; విహారంబునన్= సంచారంతో; ద్వారకా నగరంబునకున్= ద్వారకా నగరానికి; అరుదెంచి= వచ్చి; అందున్= ఆ ద్వారకానగరంలో...

**తా :** సాటిలేని అందమైన శరీరం ధరించి, అన్ని పనులూ చేయడంలో ఆసక్తి కలవాడైన శ్రీకృష్ణుడు యాదవులను నశింపజేయాలనే ఆలోచనలో ఉండిన సమయాన జటావల్కలాలు, కమండలాలు ధరించి; రుద్రాక్షలు, విభూతి అలంకారాలుగా నల్లజింకల చర్మాలు వస్త్రాలుగా ధరించి విశ్వామిత్రుడు, అసితుడు, దుర్వాసుడు, భృగువు, అంగిరసుడు, కశ్యపుడు, వామదేవుడు, వాలఖిల్యులు; అత్రి, వసిష్ఠుడు, నారదుడు మొదలైన మునిశ్రేష్ఠులు స్వేచ్ఛావిహారం చేస్తూ ద్వారకానగరానికి వచ్చారు. ఆ ద్వారకానగరంలో

**విశే :** వాలఖిల్యులు నిత్య బ్రహ్మచారులు, ఊర్ధ్వరేతస్కులు. అంగుష్ఠప్రమాణదేహులు. ఎప్పుడూ తలకిందులుగా తపస్సుచేస్తూనే ఉంటారు. వీళ్లను బ్రహ్మపుత్రులుగా పురాణాలు పేర్కొంటున్నాయి. వీళ్లు అరవైవేలమంది. వీళ్లకూడా మహర్షులతో కలసి ద్వారకకు వచ్చారు.

**సీ. ఘనుని శ్రీకృష్ణునిఁ గౌస్తుభాభరణునిఁ గర్ణకుండలయుగ్మఘనకపోలుఁ**
**బుండరీకాక్షు నంభోధరశ్యామునిఁ గలితనానారత్న ఘనకిరీటు**
**నాజానుబాహు నిరర్గళాయుధహస్తు శ్రీకరపీతకౌశేయవాసు**
**రుక్మిణీనయనసరోజదివాకరు బ్రహ్మాదిసురసేవ్యపాదపద్ము**

**తే. దుష్టనిగ్రహ శిష్టసంతోషకరణుఁ, గోటిమన్మథలావణ్యకోమలాంగు**
**నార్తజనరక్షణైకవిఖ్యాతచరితుఁ, గనిరి కరుణాసముద్రుని ఘనులు మునులు. 12**

**ప్రతి :** ఘనులు= గొప్పవారైన; మునులు= మహర్షులు; కౌస్తుభ+ఆభరణునిన్= కౌస్తుభమణి అనే భూషణం కలవాడిని; కర్ణకుండల= చెవిపోగుల; యుగ్మ= జంటచే; ఘన= గొప్పవైన (అందమైన); కపోలున్= చెక్కిళ్లు కలవాడిని; పుండరీక+ అక్షున్= తెల్లతామరలవంటి కన్నులు కలవాడిని; అంభోధర= మేఘంవలె; శ్యామునిన్= నల్లనైనవాడిని; కలిత= ఒప్పుతున్న; నానారత్న= అనేక రత్నాలుగల; ఘన= గొప్ప; కిరీటున్= కిరీటం కలవాడిని; ఆజానుబాహున్= మోకాళ్లదాకా చేతులు కలవాడిని; నిరర్గళ= అడ్డులేనిదైన; ఆయుధ= ఆయుధాల్ని; హస్తున్= చేతుల్లో కలవాడిని; శ్రీకర= శుభకరమైన; పీత= పసుపువన్నెగల; కౌశేయవాసున్= పట్టువస్త్రం ధరించినవాడిని; రుక్మిణీ= రుక్మిణీదేవి యొక్క; నయనసరోజ= కన్నులనే పద్మాలకు; దివాకరున్= సూర్యుడైనవాడిని; బ్రహ్మ+ఆది= బ్రహ్మదేవుడు మొదలుగా గల; సుర= దేవతలచే; సేవ్య= సేవింపదగిన; పాదపద్మున్= తామరలవంటి పాదాలు కలవాడిని; దుష్టనిగ్రహ= దుర్జనులను శిక్షించి; శిష్ట= సుజనులకు; సంతోష కరణున్= సంతోషం కలిగించేవాడిని; కోటి మన్మథ= కోటి మన్మథుల; లావణ్య= కాంతివిశేషంకల; కోమల= మృదువైన; అంగున్= శరీరం కలవాడిని; ఆర్తజన= దీనులైన జనాన్ని; రక్షణ+ఏక= కాపాడడమే ప్రధానంగా; విఖ్యాత= ప్రసిద్ధికెక్కిన; చరితున్= నడవడి కలవాడిని; కరుణా= దయకు; సముద్రునిన్= సముద్రం వంటి వాడిని; శ్రీకృష్ణునిన్= శ్రీకృష్ణపరమాత్మను; కనిరి= చూశారు.

**తా :** గొప్పవాడూ, కౌస్తుభమణిని ఆభరణంగా కలవాడూ, చెవిపోగులజంటతో అందమైనచెంపలు కలవాడూ, తెల్లతామరలవంటి కండ్లుకలవాడూ, మేఘంవలె నల్లనివాడూ, అనేకరత్నాలు పొదిగిన కిరీటం ధరించినవాడూ, ఆజానుబాహుడూ, అడ్డులేని (చక్రాది) ఆయుధాలు చేతులలో ధరించినవాడూ, శుభకరమైన పసుపు పచ్చని పట్టువస్త్రం కట్టుకొన్నవాడూ, రుక్మిణీదేవి నయన పద్మాలకు సూర్యునివంటివాడూ, బ్రహ్మాదిదేవతలచేత సేవించదగిన చరణ కమలాలు కలవాడూ, కోటిమన్మథుల కాంతులతో ఒప్పే కోమలమైన శరీరం కలవాడూ, దీనజనరక్షణతో ప్రసిద్ధమైన నడవడి కలవాడూ, దయకు సముద్రం వంటివాడూ అయిన శ్రీకృష్ణుణ్ణి ఆ ఘనులైన మునులు దర్శించారు.

**విశే :** కౌస్తుభం శ్రీమహావిష్ణువు తన వక్షఃస్థలం మీద అలంకరించుకొన్న మణి. ఈ మణి క్షీరసాగరమథన సందర్భంలో ఉద్భవించింది.

**క. వచ్చిన మునిసంఘములకు, విచ్చలవిడి నర్ఘ్యపాద్యవిధు లొనరింపన్**
**మెచ్చగు కనకాసనముల, నచ్చుగఁ గూర్చుండి వనరుహాక్షునితోడన్. 13**

**ప్రతి :** వచ్చిన= (ద్వారకకు) విచ్చేసిన; మునిసంఘములకున్= మహర్షిసమూహాలకు; విచ్చలవిడిన్= అధికంగా; అర్ఘ్యపాద్యవిధులు= అర్ఘ్యం పాద్యం సమర్పించడమనే క్రియలు; ఒనరింపన్= చేయగా; మెచ్చు+అగు= అందమైన; కనక+ఆసనములన్= బంగారుగద్దెలపై; అచ్చుగన్= చక్కగా; కూర్చుండి= ఆసీనులై; వనరుహ+అక్షునితోడన్= పద్మాక్షుడైన శ్రీకృష్ణునితో...

**తా :** ద్వారకకు విచ్చేసిన మునులకు అర్ఘ్యం, పాద్యం మొదలైన మర్యాదలు చేసిన తరువాత వారు బంగారు గద్దెలపై కూర్చొని, పద్మనేత్రుడైన శ్రీకృష్ణునితో...

**విశే :** అర్ఘ్యమంటే పూజాద్రవ్యం మరియు చేతులు కడుక్కోవడానికి సమర్పించే జలం, పాద్యం అంటే కాళ్లు కడుగుకోవడానికి ఇచ్చే జలం. పూజార్హులైన వాళ్లు వచ్చినపుడు వాళ్ల కాళ్లు నీళ్లతో కడిగి చేతులకు నీళ్లిచ్చి, పూలతో పూజించడం సంప్రదాయం. ఇదే అర్ఘ్యపాద్యవిధి.

**క. జనములు నిను సేవింపని, దినములు వ్యర్థంబు లగుచుఁ దిరుగుచు నుండుం**
**దనువులు నిలుకడ గావఁట, వనములలో నున్ననైన వనరుహనాభా! 14**

**ప్రతి :** వనరుహనాభా= పద్మం బొడ్డులో కలవాడా!; జనములు= జనులు; వనములలోన్= అడవులలో; ఉన్నన్+ఐనన్= ఉన్నప్పటికి; నినున్= నిన్ను; సేవింపని= కొలవని; దినములు= రోజులు; వ్యర్థంబులు+అగుచున్= నిరుపయోగాలు అవుతూ; తిరుగుచున్+ఉండున్= కదచిపోతూ ఉంటాయి; తనువులు= శరీరాలు; నిలుకడ= స్థిరం; కావు+అఁట= కావట.

**తా :** పద్మనాభా! జనులు అడవులలో ఉన్నప్పటికి నిన్ను కొలవని రోజులు వృథాగా గడచిపోతూ ఉంటాయి. శరీరాలు స్థిరమైనవి కావు కదా!

**క. తరణంబులు భవజలధికి, హరణంబులు దురితలతల కాగమముల కా**
**భరణంబు లార్తజనులకు, శరణంబులు, నీదు దివ్యచరణంబు లిలన్. 15**

**ప్రతి :** ఓ శ్రీకృష్ణా! ఇలన్= భూమియందు; నీదు దివ్యచరణంబులు= పరమ పవిత్రమైన నీ పాదాలు; భవజలధికిన్= సంసారమనే సముద్రానికి; తరణంబులు= (దాటించగల) తెప్పలు; దురితలతలకున్= పాపాలనే తీగలకు; హరణంబులు= హరించేవి (నశింపజేసేవి); ఆగమములకున్= వేదాలకు; ఆభరణంబులు= అలంకారాలు; ఆర్తజనులకున్= పీడిత జనానికి; శరణంబులు= దిక్కైనవి.

**తా :** శ్రీకృష్ణా! భూమిపై పరమపవిత్రమైన నీ పాదాలు సంసారసముద్రాన్ని దాటించే తెప్పలు. పాపాలనే తీగలను హరించేవి. వేదాలకు అలంకారాలు. పీడితజనానికి దిక్కైనవి.

**మత్త. ఒక్క వేళను సూక్ష్మరూపము నొందు దీ వణుమాత్రమై**
**యొక్క వేళను స్థూలరూపము నొందు దంతయు నీవయై**
**పెక్కురూపులు దాల్తు నీ దగుపెంపు మాకు నుతింపఁగా**
**నక్కజం బగుచున్న దేమన? నంబుజాక్ష! రమాపతీ! 16**

**ప్రతి :** అంబుజ+అక్ష= పద్మములవంటి కనులు గలవాడా; రమాపతీ= లక్ష్మీవల్లభా; ఈవు= నీవు; ఒక్కవేళను= ఒక సమయంలో; అణుమాత్రము+ఐ= అణువంత చిన్నవాడివై; సూక్ష్మరూపమున్= చిన్నరూపాన్ని; ఒందుదు(వు)= పొందుతావు; ఒక్కవేళను= మరొక సమయంలో; అంతయున్= సృష్టియావత్తూ; నీవు+అ+ఐ= నీవే అయి; స్థూలరూపమున్= పెద్ద రూపాన్ని; ఒందుదు(వు)= పొందుతావు; పెక్కురూపులు= (ఇలా) అనేక రూపాల్ని; తాల్తు(వు)= ధరిస్తావు; మాకున్= మాబోంట్లకు; నుతింపన్+కాన్= స్తోత్రం చేయడానికి; నీది+అగు= నీకు సంబంధించిన; పెంపు= ఆధిక్యత; అక్కజంబు+అగుచున్నది= ఆశ్చర్యం కలిగిస్తున్నది; ఏమి+అనన్= ఏమనగలం.

**తా :** పద్మలోచనా! లక్ష్మీవల్లభా! ఒక సమయంలో చాలా చిన్నరూపాన్ని పొందుతావు. మరొక సమయంలో సృష్టి అంతా నీవే అయి పెద్ద రూపాన్ని ధరిస్తావు. ఇలా అనేక రూపాలను ధరిస్తున్న నీ ఆధిక్యతను స్తోత్రం చేయడానికి మాకు అలవి గాక ఆశ్చర్యం కలుగుతోంది.

**క. శ్రీనాయక! నీ నామము, నానాభవరోగకర్మనాశమునకు వి**
**న్నాణం బగు నౌషధ మిది, కానరు దుష్టాత్ము లకట కంజదళాక్షా! 17**

**ప్రతి :** శ్రీనాయక= లక్ష్మీపతీ; కంజదళ+అక్షా= తామరరేకులను పోలిన కనులు గలవాడా! నానా= అనేక; భవ= జన్మలును; రోగ= వ్యాధులకు కారణమైన; కర్మ= కర్మలను; నాశమునకున్= నశింపజేయడానికి; నీ నామము= నీ నామ (జపమే); విన్నాణంబు+ అగున్= సమర్థమైనటువంటి; ఔషధము= మందు; అకట= అయ్యో!; దుష్ట+ఆత్ములు= చెడుతలంపు కలవాళ్లు; ఇది కానరు= ఈ విషయం తెలుసుకోలేరు.

**తా :** లక్ష్మీపతీ! పద్మలోచనా! నీ నామం అనేక జన్మలు అనే వ్యాధులకు కారణమైన కర్మలను సమర్థంగా నశింపజేసే మందు. అయ్యో! చెడుతలంపు కలవాళ్లు దీనిని తెలుసుకోలేక పోతున్నారు గదా!

**విశే :** ప్రారబ్ధకర్మ, సంచితకర్మ, ఆగామికర్మ అని కర్మలు మూడు రకాలు. కర్మ ఎలాంటిదైనా దాని ఫలితం తప్పక అనుభవించవలసి ఉంటుంది. శ్రీపతి నామస్తుతి కర్మబంధాలనుండి విముక్తిని ప్రసాదిస్తుంది.

**వ. అని యనేకవిధంబులం బ్రస్తుతించిన మునివరులం గరుణాకటాక్ష వీక్షణంబుల నిరీక్షించి, పుండరీకాక్షుం డిట్లనియె; 'మదీయధ్యాననామస్మరణంబులు భవరోగహరణంబులును, బ్రహ్మరుద్రాదికశరణంబులును, మంగళకరణంబులును నగు' ననియును, 'నా రూపంబులైన మేదినీసురుల పరితాపంబులఁ బరిహరించు పురుషుల నైశ్వర్యసమేతులంగాఁజేయుదు' ననియును, యోగీశ్వరేశ్వరుం డయిన యీశ్వరుం డానతిచ్చి యనంతరంబ 'మీర లిచ్చటికి వచ్చిన ప్రయోజనం బేమి?' యనిన వారలు 'భవదీయపాదారవింద సందర్శనార్థంబుకంటె మిక్కిలి విశేషం బొండెద్ది?' యని వాసుదేవవదనచంద్రామృతంబు నిజనేత్ర చకోరంబులం గ్రోలి యథేచ్ఛావిహారులై ద్వారకానగరంబున కనతిదూరంబున నుండు పిండారకంబను నొక్క పుణ్యతీర్థంబున కరిగి; రంత.** **18**

**ప్రతి :** అని= అంటూ; అనేక విధంబులన్= ఎన్నో రకాలుగా; ప్రస్తుతించినన్= స్తోత్రంచేసిన; మునివరులన్= (నారదాది) మునిశ్రేష్ఠులను; కరుణా= దయతో కూడిన; కటాక్ష= కడకంటి; వీక్షణంబులన్= చూపులతో; నిరీక్షించి= చూచి; పుండరీక+ అక్షుండు= తెల్ల తామరలవంటి కనులు గలవాడు (శ్రీకృష్ణుడు); ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; మదీయ= నాయొక్క; ధ్యాన= ధ్యానం; నామస్మరణంబులు= నామస్మరణాలు; భవరోగ హరణంబులును= పుట్టుక అనే వ్యాధిని హరించేవిగాను; బ్రహ్మరుద్ర+ఆదిన్= బ్రహ్మ, శివుడు మొదలైనవారికి; శరణంబులును= కాపాడునవి; అగున్= అవుతాయి; అనియును= అని చెపుతూ; నా రూపంబులు+ఐన= నా రూపాలైన; మేదినీసురుల= బ్రాహ్మణుల (భూసురుల); పరితాపంబులన్= బాధలను; పరిహరించు= రూపుమాపే; పురుషులన్= వ్యక్తులను; ఐశ్వర్యసమేతులన్+కాన్= ఐశ్వర్యంతో కూడినవారుగా; చేయుదున్= చేస్తాను; అనియును= అనిచెపుతూ; యోగి+ఈశ్వర+ఈశ్వరుండు+అయిన= యోగీశ్వరులకే ప్రభువైన; ఈశ్వరుండు= ప్రభువు (కృష్ణుడు); ఆనతిచ్చి= సెలవిచ్చి; అనంతరంబు+అ= తరువాత; మీరలు= మీరు; ఇచ్చటికిన్= ఇక్కడికి (ద్వారకానగరానికి); వచ్చిన= రావడానికి గల; ప్రయోజనంబు+ఏమి= కార్యమేమిటి? అనినన్= అని అడుగగా; వారలు= ఆ నారదాది మునులు; భవదీయ= మీయొక్క; పాద+అరవింద= పాదపద్మాలను; సందర్శన+అర్థంబుకంటెన్= విశేషంగా దర్శించడంకన్నా; విశేషంబు+ఒండు+ఎద్ది= మరొక విశేషం ఏముంటుంది; అని= అనిచెప్పి; వాసుదేవ= వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుని; వదన చంద్ర+అమృతంబు= ముఖమనే చంద్రుని నుండి స్రవించే అమృతాన్ని; నిజనేత్ర చకోరంబులన్= తమ కన్నులనెడి చకోరాలతో; క్రోలి= తాగి; యథా+ఇచ్ఛా+విహారులు+ఐ= ఇష్టానుసారం విహరించేవాళ్లై; ద్వారకానగరంబునకున్= ద్వారకానగరానికి; న+అతిదూరంబునన్= పెద్దదూరంకాని (దగ్గరలోనే); ఉండు=

ఉన్నట్టి; పిండారకంబు+అను= పిండారకము= అనే పేరుగల; ఒక్క= ఒకానొక; పుణ్యతీర్థంబునకున్= పవిత్ర తీర్థానికి; అరిగిరి= వెళ్లారు; అంతన్= తరువాత...

**తా :** ఇలా ఎన్నో విధాలుగా స్తోత్రం చేసిన (నారదాది) మునిశ్రేష్ఠులను దయగల కడకంటి చూపులతో చూచి శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "నా ధ్యానం, నా నామస్మరణం, జన్మ నెత్తడం అనే రోగాన్ని హరిస్తాయి. బ్రహ్మ, శివుడు మొదలైనవారికి శరణమవుతాయి. శుభాలను కలిగిస్తాయి. నా రూపాలైన బ్రాహ్మణుల బాధలను తొలగించే వారిని నేను ఐశ్వర్యవంతులను చేస్తాను' అని యోగీశ్వరులకే ప్రభువైన శ్రీకృష్ణుడు సెలవిచ్చి తరువాత 'మీరు ఇక్కడికి ఎందుకొచ్చారు' అని అడిగాడు. దానికి ఆ మునులు 'మీ పాదపద్మాలను దర్శించడంకంటె మరొక విశేషం ఏముటుంది?' అన్నారు. వాసుదేవుని ముఖచంద్రామృతాన్ని తమకండ్లు అనే చకోరాలతో తాగి తమ ఇష్టానుసారం విహరించేవాళ్లై ద్వారకానగరానికి సమీపంలోగల పిండారకమనే పవిత్రతీర్థానికి వెళ్లారు. ఆ తరువాత...

**క. దర్పించి యాదవులు తమ, నేర్పునఁ గౌమరారు సాంబు నెలఁతుకరూపం**
**బేర్పడ శృంగారించియుఁ, గర్పూరసుగంధిపోల్కిఁ గావించి యొగిన్. 19**

**ప్రతి :** యాదవులు; దర్పించి= పొగరెక్కి; తమనేర్పునన్= తమ చతురతతో; కౌమరు+ఆరు= యౌవనంలో ఉన్న; సాంబున్= సాంబుడు అనే పేరుగల యాదవుణ్ణి; శృంగారించియున్= అందంగా అలంకరించి; నెలఁతుక రూపంబు+ఏర్పడన్= స్త్రీ ఆకారంతో కనిపించేటట్లు; కర్పూర సుగంధిపోల్కిన్= కప్పురపుతావి గల కలికివలె; ఒగిన్= నేర్పుగా; కావించి= తయారుచేసి...

**తా :** (నారదాదులు పిండారక తీర్థానికి వెళ్లిన తరువాత) యాదవులు పొగరెక్కి తమనేర్పుతో సాంబుణ్ణి అందంగా అలంకరించి, కప్పురపుతావిగల స్త్రీవలె కనిపించేటట్లు తయారుచేసి,

**విశే :** సాంబుడు జాంబవతి శ్రీకృష్ణుల కొడుకు. యాదవవంశాన్ని నిర్మూలించిన ముసలానికి జన్మనిచ్చిందితడే.

**ఉ. మూఁకలు గూడి యాదవులు ముందటఁ బెట్టుక యార్చి నవ్వుచుం**
**బోకలఁ బోవుచున్ మునిసమూహము కొయ్యన సాఁగి మ్రొక్కుచుం**
**'బ్రాకటమైన యీ సుదతిభారపు గర్భమునందుఁ బుత్త్రుఁడో**
**యేకతమందు బాలికయొ యేర్పడఁ జెప్పుఁ' డటన్న నుగ్రులై. 20**

**ప్రతి :** యాదవులు; మూఁకలు+కూడి= గుంపుగాచేరి; ముందటన్+పెట్టుక= (స్త్రీ వేషంలో ఉన్న సాంబుని) ముందుంచుకొని; ఆర్చి= పెద్దగా అరస్తూ; నవ్వుచున్= నవ్వుతూ; పోకలన్+పోవుచున్= కపటవర్తనంతో కేరింతలు కొడుతూ; ముని సమూహమునకున్= మునులసమూహానికి; ఒయ్యనన్= నేర్పుగా; సాఁగి మ్రొక్కుచున్= సాగిలబడి నమస్కరిస్తూ; ప్రాకటము+ఐన= స్పష్టంగా కనిపిస్తున్న; ఈ సుదతి= ఈ స్త్రీ; భారము+గర్భము+అందున్= బరువైన గర్భంలో; ఏకతము+అందున్= (మీ) ఆలోచన ప్రకారం; పుత్త్రుఁడో= మగపిల్లవాడో; బాలికయొ= ఆడపిల్లో; ఏర్పడన్+చెప్పుఁడు= తేల్చి చెప్పండి; అటు+అన్నన్= అని అడుగగా; ఉగ్రులు+ఐ= కోపపడిన వాళ్లై...

**తా :** కొందరు యాదవులు గుంపుగా చేరి పెద్దగా నవ్వుతూ, అరుస్తూ, కేరింతలు కొడుతూ స్త్రీ వేషంలో ఉండిన సాంబుని ముందుంచుకొని వెళ్లారు. మునులసమూహానికి సాగిలబడి నమస్కరించారు. స్పష్టంగా కనపడుతున్న బరువైన గర్భంగల ఈ స్త్రీ కడుపులో ఉన్నది మగపిల్లవాడా లేక ఆడపిల్లా ఆలోచించి తేల్చి చెప్పుమని మునులను అడిగారు. అలా అడగగానే (మునులు) విపరీతంగా కోప్పడి

**క. యదుడింభకులను గనుఁగొని, 'మదయుతులై వచ్చి' రనుచు మదిలో రోషం**
**బొదవఁ గనుఁగొనల నిప్పులు, సెదరఁగ 'హాస్యంబు సనునె చేయఁగ' ననుచున్. 21**

**ప్రతి :** యదుడింభకులను= యాదవబాలకులను; కనుఁగొని= చూచి; మదయుతుల్= కొవ్వుపట్టినవారై; వచ్చిరి+అనుచున్= వచ్చారనుకొంటూ; మదిలోన్= మనస్సులో; రోషంబు+ఒదవన్= కోపం కలుగగా; కనుఁగొనలన్= కండ్లచివర్లలో; నిప్పులు+చెదరన్+కన్= నిప్పులు ఎగిసి పడుతుండగా; హాస్యంబు= ఎగతాళి; చేయన్+కన్+చనునె= చేయతగునా; అనుచున్= అంటూ...

**తా :** అలా వచ్చిన యాదవ బాలకులను చూచి వీళ్లు కొవ్వెక్కి వచ్చినారని భావించారు మునులు. కోపంతో కనుల చివర నిప్పులు వ్యాపించగా మమ్మల్ని ఎగతాళి చేయవచ్చా? అంటూ

**క. 'వాలాయము యదుకుల ని, ర్మూలకరం బైనయట్టి ముసలం బొక టీ**
**బాలిక కుదయించును బొం, డాలస్యము లే' దటంచు నటఁ బల్కుటయున్. 22**

**ప్రతి :** యదుకుల= యాదవవంశ; నిర్మూలనకరంబు+ఐన+అట్టి= నాశనానికి కారణమైనట్టి; ముసలంబు+ఒకటి= ఒకరోకలి; ఈ బాలికకున్= ఈ అమ్మాయికి; వాలాయము= అనివార్యంగా (తప్పకుండా); ఉదయించును+పొండు= పుడుతుంది వెళ్లండి; ఆలస్యము లేదు+అటంచున్= ఆలస్యంకాదని; అటన్+పల్కుటయున్= అక్కడ చెప్పగా...

**తా :** యదువంశాన్ని నిర్మూలించగల ఒక రోకలి ఈ అమ్మాయికి తప్పకుండా పుడుతుంది. ఆలస్యం లేదు. ఇక వెళ్లండి అని చెప్పగా

**వ. మదోద్రేకులైన యాదవబాలకులు మునిశాపభీతులై వడవడ వడంకుచు సాంబకుక్షినిబద్ధ చేల గ్రంథివిమోచనంబు సేయు సమయంబున ముసలం బొక్కటి భూతలపతితం బయిన విస్మయంబు నొంది దానిం గొని చని దేవకీనందను సన్నిధానంబునం బెట్టి యెఱింగించిన నతం డాత్మకల్పితమాయారూపం బగుట యెఱింగియు, నెఱుంగని తెఱంగున వారలం జూచి యిట్లనియె. 23**

**ప్రతి :** మద+ఉద్రేకులు+ఐన= దర్పాతిశయం కలవారైన; యాదవబాలకులు; మునిశాపభీతులు+ఐ= మునులు ఇచ్చిన శాపానికి భయపడినవారై; వడవడ వడంకుచున్= వడవడ వణుకుతూ; సాంబకుక్షి= సాంబుని పొట్టచుట్టూ, నిబద్ధ= కట్టిన (చుట్టిన); చేలగ్రంథి= వస్త్రపుముడి; విమోచనంబు+చేయు+సమయంబునన్= విప్పదీసే సమయంలో; ముసలంబు+ ఒక్కటి= ఒకరోకలి; భూతలపతితంబు+అయినన్= భూమిమీద పడగా; విస్మయంబున్+ఒంది= ఆశ్చర్యం పొంది; దానిన్+కొని+చని= దానిని (ఆ రోకలిని) తీసుకొనివెళ్లి; దేవకీనందను= దేవకీదేవికుమారుడైన శ్రీకృష్ణుని; సన్నిధానంబునన్+ పెట్టి= సమీపంలో (ముందర) ఉంచి; ఎఱింగించినన్= (దాని విషయం) తెలుపగా; అతండు= శ్రీకృష్ణుడు; ఆత్మకల్పిత= తనచేత కల్పింపబడిన; మాయారూపంబు+అగుటన్= మాయారూపం కావడం; ఎఱింగియున్= తెలిసికూడా; ఎఱుంగని తెఱంగునన్= తెలియని విధంగా; వారలన్+చూచి= ఆ యాదవ బాలకులను చూచి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** దర్పంతో అతిశయించిన యాదవబాలకులు మునులు ఇచ్చిన శాపం విని భయపడి వడవడ వణకుతూ సాంబుని పొట్టచుట్టూ చుట్టిన వస్త్రం ముడి విప్పారు. అప్పుడు ఆ వస్త్రం నుండి ఒక రోకలి నేలమీద పడింది. యాదవ బాలకులకు

ఆశ్చర్యం కలిగింది. దానిని తీసుకొనివెళ్లి శ్రీకృష్ణుని ముందుపెట్టి జరిగినదంతా చెప్పారు. అదంతా తాను కల్పించిన మాయవల్లనే జరిగిందని తెలిసికూడా తెలియని వాడిలాగా శ్రీకృష్ణుడు వాళ్లను చూచి ఇలా అన్నాడు.

**క. 'మది సెడి కన్నులు గానక, మదయుతులై మునులఁ గల్లమాటలఁ జెనయం**
**గదిసి కులక్షయకారణ, విదితం బగు శాప మొందు వెఱ్ఱులుఁ గలరే? 24**

**ప్రతి :** మది+చెడి= బుద్ధి వక్రించి; కన్నులు+కానక= కండ్లు కనపడక; మదయుతులు+ఐ= పొగరెక్కిన వారై; కల్లమాటలన్= తప్పుడు (అబద్ధపు) పలుకులతో; మునులన్= మహర్షులను; చెనయన్+కదిసి= పరిహాసం చేయడానికి ప్రయత్నించి; కులక్షయ కారణవిదితంబు+అగు= కులనాశనానికి మూలకారణంగా తెలిసేదైన; శాపము+ఒందు= శాపం పొందే; వెఱ్ఱులున్+కలరే?= అవివేకులు ఉంటారా? (ఉండరు)

**తా :** బుద్ధి వక్రించి కండ్లు కనపడక పొగరెక్కి తప్పుడు మాటలతో ఆ మహర్షులను పరిహాసం చేసే ప్రయత్నం చేసి, కులనాశనానికి మూలకారణమైన శాపం పొందే అవివేకులు ఉంటారా? (ఉండరు)

**క. ధరణీసురశాపమునకు, హరిహరబ్రహ్మాదులైన నడ్డము గలరే?**
**నరు లనఁగ నెంతవారలు, గర మరుదుగఁ బూర్వజన్మకర్మముఁ ద్రోవన్? 25**

**ప్రతి :** ధరణీసుర శాపమునకున్= బ్రాహ్మణశాపానికి; హరి= విష్ణువు; హర= శివుడు; బ్రహ్మ+ఆదులు+ఐనన్= బ్రహ్మ మొదలైనవాళ్లైనా; అడ్డము+కలరే= అడ్డుకోగలరా? కరము+అరుదుగన్= ఎంతో వింతగా; పూర్వజన్మకర్మమున్= గతజన్మలో చేసుకొన్న కర్మఫలాన్ని; త్రోవన్= తోసివేయడానికి (పోగొట్టుకోడానికి); నరులు+అనన్+కన్= మానవమాత్రులనగా; ఎంతవారలు= ఎంతటివాళ్లు?

**తా :** బ్రాహ్మణశాపాన్ని విష్ణువు, శివుడు, బ్రహ్మ మొదలైన వారైనా అడ్డుకోగలరా? ఇక మానవమాత్రులు ఎంతటివాళ్లు? పూర్వజన్మ కర్మఫలాన్ని అనుభవించకుండా తోసి పారెయ్యడానికి సాధ్యం కాదు గదా!

**వ. అది గావున యతినిందాపరత్వంబున యదువంశనాశం బగు; సందియంబు లే' దని పరమేశ్వరుండు వారలం జూచి 'సముద్రతీరంబున నొక్క మహాపర్వతం బున్నది; యందు నుండు నత్యుచ్ఛ్రయ విశాలభీషణం బగు పాషాణంబున మీ భుజాబలంబుచేత నీ ముసలంబు దివిచి దీని చూర్ణంబు సింధుకబంధంబులఁ గలిపి రండు; పొండ' ని జగద్విభుండైన కృష్ణుం డాన తిచ్చిన, వారు నట్లచేసి తత్కీలితం బయిన లోహఖండంబును సరకుగొనక సాగరంబునఁ బడవైచిన నొక్క ఝషంబు గ్రసించిన, దాని నొక్క లుబ్ధకుండు జాలమార్గంబునఁ బట్టికొని, తదుదర గతంబయిన లోహఖండంబు దెచ్చి బాణాగ్రంబున ముల్కిగా నొనర్చె' నని తత్కథావృత్తాంతంబు సెప్పిన బాదరాయణిం గనుంగొని రాజేంద్రుం డిట్లనియె. 26**

**ప్రతి :** అది+కావునన్= అలా అయినందువల్ల; యతినిందా పరత్వంబునన్= యతులను తూలనాడడంవల్ల; యదువంశనాశనంబు+అగున్= యాదవవంశ నిర్మూలనం అవుతుంది; సందియంబులేదు= ఇందులో సందేహం లేదు; అని; పరమ+ఈశ్వరుండు= శ్రీకృష్ణుడు; వారలన్+చూచి= ఆ యాదవబాలకులను చూచి; సముద్రతీరంబునన్= సముద్రపు ఒడ్డున; ఒక్క= ఒక; మహాపర్వతంబు+ఉంది= పెద్ద కొండ ఉంది; అందున్+ఉండు= అందులో ఉండే; అతి+ఉచ్ఛ్రయ=

ఎంతోపొడవైన; విశాలభీషణంబు+అగు= ఎంతో విశాలమైనది, భయంకరమైనది అయిన; పాషాణంబునన్= బండపైన; మీ భుజాబలంబుచేతన్= మీ బాహుబలంతో; ఈ ముసలంబున్= ఈ రోకలిని; తివిచి= పొడిగాచేసి; దీనిచూర్ణంబున్= ఈ రోకలి పొడిని; సింధుకబంధంబులన్= సముద్రపు నీళ్లలో; కలిపిరండు= కలిపిరండి; పొండు+అని= వెళ్లండి అని; జగత్+విభుండు+ఐన= విశ్వపతి అయిన; కృష్ణుండు+ఆనతిచ్చినన్= శ్రీకృష్ణుడు ఆనతియ్యగా; వారు= యాదవబాలకులు; అట్లచేసి= అలాగే రోకలిని పొడి చేసి; తత్+కీలితంబు+అయిన= (ఆరోకలిని) పొడిచేయగా దానికంటుకొని మిగిలి ఉండిన; లోహఖండంబును= ఇనుపముక్కను; సరకు+కొనక= పట్టించుకోకుండా; సాగరంబునన్= సముద్రంలో; పడవైచినన్= పడవేయగా; ఒక్క ఝషంబు= ఒక చేప; గ్రసించినన్= (ఆ లోహపు ముక్కను) మింగగా; దానిన్= ఆచేపను; ఒక్క లుబ్ధకుండు= ఒక బోయవాడు; జాలమార్గంబునన్= వల సహాయంతో; పట్టికొని= పట్టుకొని; తద్+ఉదరగతంబు+అయిన= దాని కడుపులో ఉన్నట్టి; లోహఖండంబున్= ఇనుప ముక్కను; తెచ్చి= బయటికి తీసి; బాణ+అగ్రంబునన్= తన బాణంచివర; ముల్కిగాన్+ఒనర్చెన్= మొనగా చేసుకొన్నాడు; అని; తత్+కథా వృత్తాంతంబు= ఆ కథావిషయం; చెప్పిన= చెప్పగా; బాదరాయణిన్= వ్యాసుని పుత్రుడైన శుకుని; కనుంగొని= చూచి; రాజ+ఇంద్రుండు+ఇట్లు+ అనియెన్= రాజశ్రేష్ఠుడు (పరీక్షిత్తు) ఇలా అన్నాడు.

**తా :** యతులను మిక్కిలి తూలనాడడంవల్ల యందువంశం నాశనం కాక తప్పదు. ఇందులో సందేహంలేదు. అని పలికి శ్రీకృష్ణుడు యాదవులతో 'సముద్రపు ఒడ్డున ఒక పెద్దకొండ ఉంది. అక్కడ ఎత్తుగా విశాలంగా భయం కలిగిస్తూ ఉండే బండమీద మీ భుజబలంతో ఈ ఇనుపరోకలిని బాగా పొడిచేసి ఆ పొడిని సముద్ర జలంలో కలిపి రండి. వెళ్లండి' అన్నాడు. విశ్వపతి అయిన శ్రీకృష్ణుడు అలా చెప్పగానే వాళ్లు ఆ రోకలిని పొడిచేసి, దానికంటుకొని మిగిలి ఉండిన లోహపు ముక్కను పట్టించుకోకుండా సముద్రజలంలో పడవేశారు. ఆ లోహపుముక్కను ఒక చేప మింగింది. దానిని ఒక బోయవాడు వల సహాయంతో పట్టుకొన్నాడు. దాని కడుపులో ఉండిన ఇనుపముక్కను తీసి, తన బాణం చివర మొనగా చేసుకొన్నాడు. అని ఆ కథా విషయమంతా చెప్పిన శుకమహర్షిని చూచి పరీక్షిన్మహారాజు ఇలా అన్నాడు.

**క. చిత్తం బే క్రియ నిలుచుం?, జిత్తజగురుపాదపద్మసేవ సదా య**
**త్యుత్తమ మని వసుదేవుఁడు, చిత్తముఁ దగ నిల్పి యెట్లు సెందె మునీంద్రా! 27**

**ప్రతి :** ముని+ఇంద్రా= మునిశ్రేష్ఠా!; చిత్తంబు= మనస్సు; ఏక్రియన్= ఏ విధంగా; నిలుచున్= నిలుస్తుంది లేక నిశ్చలంగా ఉంటుంది; వసుదేవుఁడు; చిత్తజగురు= మన్మథుని తండ్రియైన శ్రీమన్నారాయణుని; పాదపద్మసేవ= చరణకమలాలను సేవించడం; సదా= ఎల్లవేళలా; అత్యుత్తమము+అని= మిక్కిలి ఉత్తమమైందని; చిత్తమున్= మనస్సును; తగన్+నిల్పి= (పరమాత్మయందు) బాగా నిలిపి; ఎట్లు+చెందెన్= ఎలా పరమాత్మను పొందాడు?

**తా :** మహర్షీ! మనస్సు ఎలా చలనరహితంగా నిలుస్తుంది? వసుదేవుడు మన్మథజనకుడైన శ్రీమన్నారాయణుని చరణ కమలాలను ఎల్లవేళలా సేవించడం మిక్కిలి ఉత్తమమని నమ్మి, ఏవిధంగా తన మనస్సును నిశ్చలంగా నిలిపి పరమాత్మను పొందాడు.

**విశే :** చిత్తజుడంటే మనస్సులో పుట్టినవాడు. ఇతడే మన్మథుడు. శివునికంటిమంటతో కాలి బూడిద అయిపోయిన మన్మథుడికి భౌతిక శరీరం లేదు. భావరూపంగా అందరి మనస్సులలో ఉంటాడు.

**వ. అని యడిగిన రాజునకు శుకుం డిట్లనియె. 28**

ప్రతి : అని= అంటూ; అడిగిన; రాజునకున్= పరీక్షిత్తునకు; శుకుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తా : అలా అడిగిన మహారాజుతో శుకమహర్షి ఇలా అన్నాడు.

### a =వసుదేవునకు నారదుండు పురాతనంబగు విదేహర్షభ సంవాదంబుఁ దెలుపుట a

**క. వినుము నృపాలక! సెప్పెద, ఘనమై విలసిల్లు పూర్వకథ గల దదియున్**
**మును ద్వారక కేతెంచియు, నొనరఁగ నారదుఁడు గృష్ణు నొయ్యనఁ గాంచెన్. 29**

ప్రతి : నృపాలక= ఓ రాజా!; చెప్పెదన్= చెపుతాను; వినుము= వినండి; ఘనము+ఐ= గొప్పదై; విలసిల్లు= ప్రఖ్యాతమైన; పూర్వకథ+కలదు= వెనుకటి కథ ఉంది; అదియున్= దాన్ని కూడా (విను); నారదుఁడు= నారదముని; మును= ముందొకసారి; ద్వారకకున్+ఏ తెంచియున్= ద్వారకానగరానికి వచ్చి; ఒనరన్+కన్= ఒప్పునట్లుగా; కృష్ణున్= శ్రీకృష్ణుని; ఒయ్యనన్+కాంచెన్= తిన్నగా సందర్శించాడు.

తా : ఓ రాజా! చెపుతాను వినండి. దీనికి ఒక పెద్దదైన, ప్రఖ్యాతమైన వెనకటి కథ ఉంది. దాన్ని కూడా చెపుతాను. ముందొకసారి నారదముని ద్వారకకు వచ్చి ఎంతో ఇష్టంతో తిన్నగా శ్రీకృష్ణుని సందర్శించాడు.

**వ. అట్లు దేవముని కృష్ణసందర్శనార్థం బరుగుదెంచి తద్గృహాభ్యంతరమున కరిగిన, వసుదేవుం డ మ్మునీంద్రుని నర్ఘ్యపాద్యాదివిధులం బూజించి, కనకాసనాసీనుం గావించి, యుచితకథావినోదంబులం బ్రొద్దు పుచ్చుచు నిట్లనియె; 'ఏ నరుండు నారాయణచరణసరసీరుహభజనపరాయణత్వంబు నిరంతరంబు నొందం; డట్టివానికి మృత్యువు సన్నిహితంబై యుండు; నీ దర్శనంబునం గృతార్థుండ నైతి; నచ్యుతానంత గోవింద నామస్మరణైకాగ్ర చిత్తులైన మీవంటి పుణ్యపురుషుల సమాగమంబున లోకులు సుఖాశ్రయులయి యుండుదురు; దేవతాభజనంబు సేయువారిని గీర్వాణులు నను గ్రహింతు; రట్లు సజ్జనులును దీనవత్సలులు నగువారలు పూజనాది క్రియలచే నా దేవతలను భక్తి సేయుదురు; కావున శ్రీ మహాభాగవతకథాసమూహంబులఁ గల ధర్మంబు లడిగెద; నే యే ధర్మంబులు శ్రవణసుఖంబులుగా వినిన దండధరకింకరతాడనంబులం బడక, ముకుందచరణారవింద వందనాభిలాషులయి పరమపదప్రాప్తు లగుదు; రా ధర్మంబు లానతిమ్ము;తొల్లి గోవిందునిం బుత్రుఁగాఁ గోరి ముక్తిమార్గం బెఱుంగలేక దేవతామాయం జేసి చిక్కి చిత్తవ్యసనాంధకారంబగు సంసారంబునం దగులువడి యున్నవాఁడ; హరికథామృతంబు వెల్లిగొల్పు; మట్లయిన సుఖంబు గలుగు నని వసుదేవ కృతప్రశ్నుండైన నారదుండు వాసుదేవకథాప్రసంగసల్లాపహర్షసమేతుండై సంతసం బంద నిట్లనియె. 30**

ప్రతి : అట్లు= ఆవిధంగా; దేవముని= దేవర్షి (నారదుడు); కృష్ణ సందర్శన+అర్థంబు+అరుగుదెంచి= శ్రీకృష్ణణ్ణి దర్శించడానికి వచ్చి; తద్+గృహ+అభ్యంతరంబునకున్= ఆ ఇంటి లోపలికి; అరిగినన్= వెళ్లగా; వసుదేవుండు= వసుదేవుడు; ఆ+ముని+ ఇంద్రునిన్= ఆ మహర్షి సత్తముణ్ణి; అర్ఘ్యపాద్య+ఆది+విధులన్= అర్ఘ్యం, పాద్యం మొదలైన ఉపచారాలతో; పూజించి= అర్చించి; కనక+ఆసన+ఆసీనున్= బంగారు ఆసనంమీద కూర్చున్నవాణ్ణిగా; కావించి= చేసి; ఉచిత= తగిన; కథావినోదంబులన్= కథావృత్తాంతాలతో సంతోషపెడుతూ; ప్రొద్దుపుచ్చుచున్= సమయం గడుపుతూ; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; ఏ నరుండు= ఏ మానవుడు; నారాయణ= శ్రీమన్నారాయణుని; చరణసరసీరుహ= పాదపద్మాలను;

నిరంతరం= ఎల్లప్పుడూ; భజన పరాయణత్వంబున్+ఒందండు= ఆసక్తిగా భజించడో; అట్టివానికిన్= అలాంటి వాడికి; మృత్యువు= చావు; సన్నిహితంబు+ఐ+ఉండున్= సమీపంలోనే ఉంటుంది; నీ దర్శనంబునన్= నిన్నుచూడడంవల్ల; కృత+అర్థుండను+ఐతిన్= ధన్యుడనయ్యాను; అచ్యుత; అనంత; గోవింద; నామస్మరణ+ఏక+అగ్ర= నామాలను స్మరిస్తూ ఏకాగ్రమైన; చిత్తులు+ఐన= మనస్సుగలవారైన; మీవంటి= మీలాంటి; పుణ్యపురుషుల= సుకృతాత్ముల; సమాగమంబునన్= రాకవల్ల; లోకులు; సుఖ+ఆశ్రయులు+అయి= సుఖవంతులై; ఉండుదురు= ఉంటారు; దేవతాభజనంబు= దేవతలపూజ; చేయువారినిన్= చేసేవాళ్లను; గీర్వాణులును= దేవతలుకూడా; అనుగ్రహింతురు= దయతో చూస్తారు; అట్లు= అలా; సజ్జనులును= సత్పురుషులు; దీనవత్సలులును= దీనులయెడ దయగలవారు; అగువారలు= అయినవాళ్లు; పూజన+ఆది= పూజ మొదలైన; క్రియలచేన్= విధులతో; ఆ దేవతలను; భక్తి+చేయుదురు= భక్తితో పూజిస్తూ ఉంటారు; కావునన్= కాబట్టి; శ్రీమహాభాగవత= శ్రీమద్భాగవతంలోని; కథాసమూహంబులన్+కల= అనేక కథలలోగల; ధర్మంబులు+అడిగెదన్= ధర్మాలను అడుగుతాను; ఏఏ ధర్మంబులు= ఏయే ధర్మాలు; శ్రవణ సుఖంబులుగా వినినన్= వీనులవిందుగా వింటే; దండధర= యముని; కింకర= భటుల; తాడనంబులన్+పడక= దెబ్బలు తినకుండా; ముకుంద చరణ+అరవింద= ముకుందుని పాదపద్మాలను; వందన+అభిలాషులు+అయి= నమస్కరించాలనే కోరిక కలవారై; పరమపద ప్రాప్తులు+అగుదురు= వైకుంఠపదవిని పొందిన వారవుతారు; ఆ ధర్మంబులు= అలాంటి ధర్మాలను; ఆనతి+ఇమ్ము= తెలియజేయండి; తొల్లి= పూర్వం; గోవిందునిన్= శ్రీకృష్ణుణ్ణి; పుత్రున్+కాన్+కోరి= కొడుకుగా కోరుకొని; ముక్తిమార్గంబు= మోక్షమార్గం; ఎఱుంగలేక= తెలుసుకోలేక; దేవతామాయన్+చేసి= దైవమాయవల్ల; చిక్కి= లోబడి; చిత్తవ్యసన+అంధకారంబు+అగు= మనస్సులో పుట్టిన అపాయం అనే అంధకారమైన; సంసారంబునన్= సంసారంలో; తగులువడి= చిక్కుకొని; ఉన్నవాఁడు+అ= ఉన్నాను; హరికథా+అమృతంబున్= విష్ణుకథ అనే అమృతాన్ని; వెల్లి+కొల్పుము= ప్రవహింపజేయండి; అట్లు+అయినన్= అలా అయితే; సుఖంబు+కలుగున్+అనినన్= సుఖం కలుగుతుందనిన; వసుదేవకృత ప్రశ్నుండు+ఐన= వసుదేవునిచే ప్రశ్నింపబడినవాడైన; నారదుండు= నారదమహర్షి; వాసుదేవకథా= వాసుదేవునికథల; ప్రసంగ= ప్రస్తావన; సల్లాప= పరస్పరసంభాషణ మూలమైన; హర్ష= సంతోషంతో; సమేతుండు+ఐ= కూడినవాడై; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఆవిధంగా దేవర్షి నారదుడు శ్రీకృష్ణదర్శనానికి వచ్చి ఇంటిలోపలికి వెళ్లగా వసుదేవుడు ఆ మహర్షిసత్తముని అర్ఘ్యపాద్యాదులతో యథావిధిగా పూజించి బంగారు ఆసనంపై కూర్చుండబెట్టి తగిన కథావృత్తాంతాల వినోదాలతో పొద్దుపుచ్చుతూ ఇలా అన్నాడు. 'మునీంద్రా! ఏ మానవుడు నిరంతరం శ్రీమన్నారాయణుని పాదపద్మాలను ఆసక్తిగా భజించడో వాడికి చావు సమీపంలోనే ఉంటుంది. నీ దర్శనంవల్ల ధన్యుడనయ్యాను. అచ్యుత, అనంత, గోవింద మొదలైన నామాలను స్మరిస్తూ ఏకాగ్రమైన చిత్తంగల మీవంటి సుకృతాత్ముల రాకవల్ల లోకులు సుఖాశ్రయులై ఉంటారు. దేవతలను భజించేవాళ్లను దేవతలుకూడా దయతో చూస్తారు. అటువంటి సజ్జనులు, దీనవత్సలులు పూజాదివిధులతో ఆ దేవతలను భక్తితో పూజిస్తూ ఉంటారు. కాబట్టి శ్రీమద్భాగవతకథలలో గల ధర్మాలను అడుగుతాను.

ఏయే ధర్మాలను వీనులవిందుగా వింటే యమభటుల దెబ్బలు తినకుండా ముకుందుని పాదపద్మాలకు నమస్కరించే కోరిక కలవారై వైకుంఠపదవిని పొందుతారో అలాంటి ధర్మాలను తెలియజేయండి. పూర్వం శ్రీకృష్ణుణ్ణి కొడుకుగా కోరుకొని మోక్షమార్గం తెలుసుకోలేక దైవమాయలో పడి మనస్సులో పుట్టిన అపాయాంధకారసంసారంలో చిక్కుకొని ఉన్నాను. హరికథామృతాన్ని ప్రవహింపజేయండి. అట్లైతే నాకు సుఖం కలుగుతుంది', అని వసుదేవుడు ప్రార్థించగా నారదుడు వాసుదేవునికథల ప్రస్తావనవల్ల పరస్పర సంభాషణమూలమైన సంతోషంతో ఇలా అన్నాడు.

**విశే :** ముకుందుడంటే మోక్షాన్ని ప్రసాదించేవాడని అర్థం. శ్రీకృష్ణునికి ముకుందుడని పేరుంది.

**క. నను నీవు సేయు ప్రశ్నము, జనసన్నుత! వేదశాస్త్రసారాంశంబై**
**ఘనమగు హరిగుణకథనము, విను మని, వినిపింపఁ దొడఁగె వేడ్క దలిర్పన్. 31**

**ప్రతి :** జనసన్నుత= జనులచే నుతింపబడేవాడా!; ననున్= నన్ను; నీవు; చేయుప్రశ్నము= వేసిన ప్రశ్న; వేదశాస్త్ర= వేదశాస్త్రాలయొక్క; సారాంశంబు+ఐ= సారాంశమై; ఘనము+అగు= గొప్పదైన; హరిగుణకథనము= శ్రీహరి గుణాలను చెప్పడం; వినుము+అని= వినుమని; వేడ్క+తలిర్పన్= వేడుక చిగురించగా; వినిపింపన్+తొడఁగెన్= వినిపించడం ఆరంభించాడు.

**తా :** జనసుతా! నీవు నన్నడిగిన ప్రశ్నకు సమాధానం వేదశాస్త్రచోదితమైన గొప్పదైన శ్రీహరిగుణకథనమే. వినవలసిందని వేడుకతో వినిపించడం ఆరంభించాడు.

**క. అతిపాపకర్ము లైనను, సతతము నారాయణాఖ్యశబ్దము మదిలో**
**వితతంబుగఁ బఠియించిన, చతురులఁ గొనియాడఁ గమలసంభవు వశమే? 32**

**ప్రతి :** అతిపాపకర్ములు+ఐనను= ఎంతటి పాపం చేసినవాళ్లైనా; సతతము= ఎల్లప్పుడూ; నారాయణ+ఆఖ్య= నారాయణ అనే; శబ్దము= మాటను; మదిలో= మనస్సులో; వితతంబుఁ+కన్= ఎక్కువగా; పఠియించిన= స్మరించే; చతురులన్= బుద్ధిమంతులను; కొనియాడన్= నుతించడం; కమలసంభవు= కమలగర్భుడైన బ్రహ్మదేవుని; వశమే= సాధ్యమా?

**తా :** ఎంతటి పాపం చేసినవాళ్లైనా ఎప్పుడూ నారాయణశబ్దాన్ని ఎక్కువగా స్మరించేవాళ్లు బుద్ధిమంతులను అలాంటి వాళ్లను నుతించడం బ్రహ్మకుకూడా సాధ్యం కాదు.

**వ. అట్లు గావునఁ బరమేశ్వరభక్తి జనకంబై కైవల్యపద ప్రాప్తికరంబయి యొప్పుచున్న విదేహర్షభ సంవాదంబు నాఁ బరఁగు నొక్క పురాతనపుణ్యకథావిశేషం బెఱింగించెద, సావధాన మనస్కుండవై యాకర్ణింపు' మని యిట్లనియె. 33**

**ప్రతి :** అట్లు+కావునన్= అందుకని; పరమేశ్వర భక్తి జనకంబు+ఐ= శ్రీమన్నారాయణునిమీద భక్తిని కలిగించేదై; కైవల్యపద ప్రాప్తికరంబు+అయి= మోక్షమార్గాన్ని పొందింపజేసేది అయి; ఒప్పుచున్+ఉన్న= ప్రసిద్ధంగా ఉన్న; విదేహ+ఋషభ సంవాదంబునాన్+పరఁగున్= విదేహ ఋషభ సంవాదమని ప్రసిద్ధిపొందిన; ఒక్క పురాతన= ఒక ప్రాచీన; పుణ్య కథావిశేషంబున్= పవిత్రమైన కథావిశేషాన్ని; ఎఱింగించెదన్= అర్థమయ్యేటట్లు చెపుతాను; సావధానమనస్కుండవు+ఐ= ఏకాగ్రమైన మనస్సు కలవాడివై; ఆకర్ణింపుము+అని= వినుమని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అందుకని శ్రీమన్నారాయణునిమీద భక్తిని కలిగించేది, మోక్షమార్గాన్ని పెంపొందింపజేసేది అయి ప్రసిద్ధిగా ఉన్న విదేహఋషభసంవాదమని పేరొందిన ప్రాచీనమైన ఒక కథావిశేషాన్ని నీకు చెపుతాను, ఏకాగ్రమైన మనస్సుతో వినుమని ఇలా చెప్పాడు.

**తే. 'వినుము స్వాయంభువుండను మనువునకును, రమణ నుదయించెనఁట ప్రియవ్రతుఁ డనంగఁ**
**దనయు; డాతని కాగ్నీధ్రుఁ డనఁగ సుతుఁడు, జాతుఁ దయ్యెను భువనవిఖ్యాతుఁ డగుచు. 34**

**ప్రతి :** వినుము= (ఓ వసుదేవా!) విను; స్వాయంభువుండు+అను= స్వాయంభువుడు అనే; మనువునకును= మనువుకు; ప్రియవ్రతుఁడు+అనన్+కన్= ప్రియవ్రతుడు అనే; తనయుఁడు= కుమారుడు; రమణన్= మనోజ్ఞంగా; ఉదయించెను+అఁట= పుట్టినాడు; ఆతనికిన్= ఆ ప్రియవ్రతునికి; భువన విఖ్యాతుఁడు+అగుచున్= లోక ప్రసిద్ధుడైన; ఆగ్నీధ్రుఁడు+అనన్+కన్= ఆగ్నీధ్రుడు అనే పేరుగల; సుతుఁడు= కొడుకు; జాతుఁడు+అయ్యెను= పుట్టాడు.

**తా :** ఓ వసుదేవా! విను. స్వాయంభువుడనే మనువుకు ప్రియవ్రతుడనే కొడుకు కలిగాడు. ప్రియవ్రతునికి లోకప్రసిద్ధుడైన ఆగ్నీధ్రుడు అనే పుత్రుడు పుట్టాడు.

**విశే :** మానవుల పుట్టుకకు మనువు కారణమని చెపుతారు. మనువు దైవాంశసంభూతుడు. పదునలుగురు మనువులున్నారు. 1) స్వాయంభువ, 2) స్వారోచిష, 3) ఉత్తమ, 4) తామస, 5) రైవత, 6) చాక్షుష, 7) వైవస్వత, 8) సావర్ణి, 9) దక్షసావర్ణి, 10) బ్రహ్మ, 11) ధర్మసావర్ణి, 12) రుద్రసావర్ణి, 13) రౌచ్య, 14) ఇంద్రసావర్ణి అనే పేర్లు గలవారు మనువులు.

**వ. ఆ యాగ్నీధ్రునకు నాభి యను ప్రాజ్ఞుండగు తనూభవుం డుదయించి బలిచక్రవర్తితో మైత్రింజేసి ధారుణీభారంబు పూని యాజ్ఞాపరిపాలనంబున నహితరాజన్యరాజ్యంబులు స్వవశంబులు గావించుకొని యుండె; నంతట నాభికి సత్పుత్రుం డయిన ఋషభుండు పుట్టె; నతండు హరిదాసుండై సుతశతకంబుఁ బడసె; నందగ్రజుం డయిన భరతుం డను మహానుభావుండు నారాయణపరాయణుండై యిహలోక సుఖంబులం బరిహరించి, ఘోరతపం బాచరించి జన్మత్రితయంబున నిర్వాణసుఖపారవశ్యంబున సకలబంధ విముక్తుండై వాసుదేవపదంబు నొందె; నాతనిపేర నతం దేలిన భూఖండంబు భారతవర్షం బను వ్యవహారంబున నెగడి జగంబులఁ బ్రసిద్ధం బయ్యెఁ; మఱియు నందుఁ దొమ్మండ్రు కుమారులు బలపరాక్రమ ప్రభావరూపసంపన్నులయి నవఖండంబులకు నధిష్ఠాత లైరి; వెండియు వారలలో నెనుబదియొక్కండ్రు కుమారులు నిత్యకర్మానుష్ఠానపరతంత్రులై విప్రత్వం బంగీకరించి; రందుఁ గొందఱు శేషించినవారలు కవిహర్యంతరిక్ష ప్రబుద్ధపిప్పలాయ నావిర్హోత్ర ద్రమిళ చమస కరభాజను లనం బరఁగు తొమ్మం డ్రూర్ధ్వరేతస్కు లయి బ్రహ్మవిద్యావిశారదు లగుచు, జగత్త్రయంబును బరమాత్మస్వరూపంబుగాఁ దెలియుచు ముక్తులై యవ్యాహతగమనులగుచు, సురసిద్ధసాధ్యయక్షగంధర్వ కిన్నరకింపురుష నాగలోకంబులందు స్వేచ్ఛా విహారంబు సేయుచు నొక్కనాఁడు. 35**

**ప్రతి :** ఆ+ఆగ్నీధ్రునకున్= ఆ ఆగ్నీధ్రుడికి; నాభి+అను= నాభి అనే పేరుగల; ప్రాజ్ఞుండు+అగు= పండితుడైన; తనూభవుండు+ఉదయించి= కొడుకుపుట్టి; బలిచక్రవర్తితో; మైత్రిన్+చేసి= స్నేహంచేసి; ధారుణీభారంబు పూని= భూభారాన్ని వహించి; ఆజ్ఞాపరిపాలనంబునన్= ఆజ్ఞాబలంచేత; అహితరాజన్య= శత్రురాజుల; రాజ్యంబులు= రాజ్యాలు; స్వవశంబులు+కావించుకొని= స్వాధీనంలోకి తెచ్చుకొని; ఉండెన్= ఉండెను; అంతటన్; నాభికిన్; సత్+పుత్రుండు+అయిన= మంచి కొడుకైన; ఋషభుండు పుట్టెన్= ఋషభుడు పుట్టాడు; అతండు= ఆ ఋషభుడు; హరిదాసుండు+ఐ= శ్రీహరిభక్తుడై; సుతశతకంబున్+పడసెన్= నూర్గురు కొడుకులను పొందాడు; అందున్= ఆ నూర్గురిలో; అగ్రజుండు+అయిన= పెద్దవాడైన; భరతుండు+అను= భరతుడు అనే పేరుగల; మహా+అనుభావుండు= గొప్పవాడు; నారాయణపరాయణుండు+ఐ=

శ్రీమన్నారాయణుని భక్తుడై; ఇహలోకసుఖంబులన్+పరిహరించి= ఈ లోక సుఖాలను వదలి; ఘోరతపంబు+ఆచరించి= భయంకరమైన తపస్సుచేసి; జన్మ త్రితయంబునన్= మూడు జన్మలలో; సకలబంధ విముక్తుండు+ఐ= సకల బంధాలనుండి విముక్తి చెంది; నిర్వాణ సుఖపారవశ్యంబునన్= మోక్షసుఖం కలిగించిన పరవశత్వంతో; వాసుదేవపదంబున్+ఒందెన్= శ్రీమన్నారాయణాత్మక పరమపదాన్ని పొందాడు; ఆతని పేరన్= అతని పేరుమీద; అతండు+ఏలిన= అతడు పాలించిన; భూఖండంబు= భూభాగం; భారతవర్షంబు+అను= భరతవర్షమనే; వ్యవహారంబున్= పేరుతో; నెగడి= వర్ధిల్లి; జగంబులన్= లోకాలలో; ప్రసిద్ధంబు+అయ్యెన్= ప్రఖ్యాతి పొందింది; మఱియున్= మరల; అందున్= ఆ నూర్గురుకొడుకులలో; తొమ్మండ్రు కుమారులు= తొమ్మిదిమంది తనయులు; బలపరాక్రమ= బలపరాక్రమాలచేత; ప్రభావరూప= తేజోరూపాలచేత; సంపన్నులు+అయి= సంపన్నులై; నవఖండంబులకున్= తొమ్మిది భూభాగాలకు; అధిష్ఠాతలు+ఐరి= అధికారులైనారు; వెండియున్= మరల; వారలలోన్= వాళ్ళలో; ఎనుబదియొక్కండ్రు= ఎనభై ఒక్కమంది; కుమారులు; నిత్యకర్మ+అనుష్ఠాన= నిత్యకర్మలయొక్క, అనుష్ఠానాలలో; పరతంత్రులు+ఐ= ఆసక్తి కలవారై; విప్రత్వంబు+అంగీకరించిరి= బ్రాహ్మణత్వాన్ని స్వీకరించారు; అందున్+కొందఱు= వారిలో కొందరు; శేషించినవారలు= మిగిలిన వాళ్లు; కవి+హరి+అంతరిక్ష= కవి, హరి, అంతరిక్షుడు; ప్రబుద్ధ= ప్రబుద్ధుడు; పిప్పలాయన= పిప్పలాయనుడు; అవిర్హోత్ర= అవిర్హోత్రుడు; ద్రమిళ= ద్రమిళుడు; చమస= చమసుడు; కరభాజనులు+అనన్+పరఁగు= కరభాజనుడు అనే పేర్లుగల; తొమ్మండ్రు= తొమ్మిదిమంది; ఊర్ధ్వరేతస్కులు+అయి= ఋషులై; బ్రహ్మవిద్యావిశారదులు+అగుచున్= బ్రహ్మవిద్యలో ఆరితేరినవారై; జగత్త్రయంబును= మూడులోకాలను; పరమాత్మ స్వరూపంబు+కాన్= పరమాత్మయొక్క స్వరూపంగా; తెలియుచున్= తెలుసుకొంటూ; ముక్తులు+ఐ= ప్రాపంచిక లోకంనుండి విడివడి; అవ్యాహత గమనులు+అగుచున్= ఆటంకంలేని రాకపోకలు కలిగినవారవుతూ; సుర= దేవతల; సిద్ధ= సిద్ధుల; సాధ్య= సాధ్యుల; యక్ష= యక్షుల; గంధర్వ= గంధర్వుల; కిన్నర= కిన్నరుల; కింపురుష= కింపురుషుల; నాగ= నాగుల; లోకంబుల+అందున్= లోకాలలో; స్వేచ్ఛావిహారంబు+చేయుచున్= ఇష్టానుసారం విహరిస్తూ; ఒక్కనాఁడు= ఒకరోజు...

**తా :** ఆ ఆగ్నీధ్రుడికి పండితుడైన 'నాభి' అనే కొడుకు జన్మించాడు. అతడు బలిచక్రవర్తితో స్నేహంచేసి భూభారం వహించి తన ఆజ్ఞాబలంతో శత్రువుల రాజ్యాలన్నీ స్వాధీనం చేసుకొని పాలించాడు. ఆ 'నాభి' కి 'ఋషభుడు' అనే మంచికొడుకు కలిగాడు. హరిభక్తుడైన ఋషభుడు వందమంది కొడుకులను పొందాడు. ఆ వందమందిలో పెద్దవాడైన 'భరతుడు' అనే మహానుభావుడు శ్రీమన్నారాయణుని భక్తుడై ప్రాపంచిక సౌఖ్యాలను పరిత్యజించాడు. గొప్ప తపస్సుచేసి మూడు జన్మలలో బంధాలనుండి విముక్తి పొందాడు. మోక్షసుఖం కలిగిన పరవశత్వంతో శ్రీమన్నారాయణాత్మక పరమపదాన్ని పొందాడు. భరతుడు పాలించిన భూభాగం భరతవర్షం అనే పేరుతో వర్ధిల్లి ప్రఖ్యాతమైంది.

మరలా ఆ ఋషభుని కుమారులలో తొమ్మిదిమంది బలపరాక్రమ, తేజోరూపాలు కలవారై తొమ్మిది భూభాగాలకు అధికారులైనారు. ఇంకా వాళ్లలోని ఎనభై ఒక్కమంది కుమారులు నిత్యకర్మానుష్ఠానాలలో ఆసక్తి కలవారై బ్రాహ్మణత్వాన్ని స్వీకరించారు. ఇక మిగిలినవారిలో కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, అవిర్హోత్రుడు, ద్రమిళుడు, చమసుడు, కరభాజనుడు అనే పేర్లుగల తొమ్మిదిమంది ఋషులు బ్రహ్మవిద్యావిశారదులు అయినారు. మూడు లోకాలను పరమాత్మ స్వరూపంగా భావించారు. ప్రాపంచిక జగత్తుతో సంబంధం లేనివాళ్లయినారు. ఆటంకం లేని రాకపోకలు కలవారై దేవ, సిద్ధ, సాధ్య, యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుష, నాగ లోకాలలో ఇష్టానుసారం విహరిస్తూ ఒకనాడు.

**విశే :** నిత్యనైమిత్తిక కామ్యకర్మలని కర్మలు మూడు రకాలు. ప్రతిరోజూ చేయవలసిన స్నానసంధ్యాద్యనుష్ఠానాలు నిత్యకర్మలు. ఇవి చేయకపోతే దోషం కలుగుతుంది. కొన్నికారణాల నిమిత్తం ఆచరించదగినవి నైమిత్తిక కర్మలు. పిండ ప్రదాన కర్మలు ఇలాంటివి. ఇవి ఆయా సందర్భాల్లో చేయదగినవి. కోరికలు నెరవేర్చుకోడానికి చేసేవి కామ్యకర్మలు. వీటివల్ల ఫలితం ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కాని ప్రత్యవాయంమాత్రం కలుగదు.

**క. జగదేకనాథుగుణములు, మిగులఁగ సంస్మరణతోడ మీఱినభక్తిం**
**బగలును రాత్రియు సంధ్యలుఁ, దగిలి జితేంద్రియులు నైన తపసులు ధాత్రిన్. 36**

**ప్రతి :** జగత్+ఏకనాథు= లోకాలన్నిటికి ఒకే ప్రభువైన శ్రీహరియొక్క; గుణములు= గుణగణాలను; మిగులన్+కన్= మిక్కిలిగా; సంస్మరణతోడన్= స్మరించుకొంటూ; మీఱినభక్తిన్= అతిశయించిన భక్తితో; పగలును రాత్రియున్= పగలూ రాత్రీ; సంధ్యలున్= సంధ్యా సమయాలూ; తగిలి= ఆసక్తిగలిగి; జిత+ఇంద్రియులున్+ఐన= ఇంద్రియనిగ్రహం కలవారైన; తపసులు= తాపసులు; ధాత్రిన్= భూలోకంలో...

**తా :** లోకాలన్నిటికి ఒకే ప్రభువైన శ్రీహరి గుణగణాలను ఎక్కువగా స్మరించుకొంటూ, అతిశయించిన భక్తితో రేయింబవళ్లు, సంధ్యాసమయాలు ఆ శ్రీహరియందే ఎంతో ఆసక్తి కలిగి ఇంద్రియ నిగ్రహులైన ఆ తాపసులు భూలోకంలో

**క. ఊహింపఁ బుణ్యుఁడైన వి, దేహుని యజ్ఞాంతమందు నేతెంచినచో**
**గేహము వెడలి యెదుర్కొని, మోహవివర్జితులఁ బుణ్యమునిసంఘములన్. 37**

**ప్రతి :** ఊహింపన్= ఆలోచించగా; పుణ్యుఁడు+ఐన= పుణ్యాత్ముడైన; విదేహుని= విదేహరాజైన నిమియొక్క; యజ్ఞ+అంతము+ అందున్= యజ్ఞం ముగింపుకు వచ్చిన సమయంలో; ఏతెంచినచో= (తాపసులు) విచ్చేయగా; గేహము వెడలి= ఇంటినుండి బయటికి వచ్చి; మోహవివర్జితులన్= మోహం చేత విడివడిన వాళ్లయిన; పుణ్యమునిసంఘములన్= పుణ్యాత్ములైన తాపసుల సముదాయానికి; ఎదురు+కొని= ఎదురువెళ్లి...

**తా :** ఎంతో పుణ్యాత్ముడైన విదేహరాజైన నిమి నిర్వర్తించిన యజ్ఞం పరిసమాప్తి పొందుతున్న సమయంలో మోహం వదలిన పుణ్యాత్ములైన తాపసులు రాగా నిమి వాళ్లకు ఎదురువెళ్లి

**తే. అర్ఘ్యపాద్యాదివిధులను నర్థితోడఁ, బూజ గావించి వారలఁ బొలుపు మిగుల**
**నుచితపీఠంబులందును నునిచి యెలమి, నవమునిశ్రేష్ఠులను భూమినాయకుండు. 38**

**ప్రతి :** అర్థితోడన్= ఎంతో వేడుకతో; అర్ఘ్యపాద్య+ఆది విధులను= అర్ఘ్యపాద్యాది ఉపచారాలతో; వారలన్= వాళ్లను; పూజకావించి= పూజించి; పొలుపు మిగులన్= అతిశయంగా; భూమినాయకుండు= భూపాలుడు (నిమి); నవముని శ్రేష్ఠులను= తొమ్మిదిమంది మునివర్యులను; ఎలమిన్= సంతోషంతో; ఉచిత పీఠంబుల+అందును= సముచిత ఆసనాలపైన; ఉనిచి= గూర్చుండబెట్టి...

**తా :** భూపాలుడైన నిమి తొమ్మిదిమంది మునివర్యులను ఎంతో వేడుకగా అర్ఘ్యపాద్యాదిఉపచారాలతో పూజించాడు. వాళ్లను ఉచితాసనాలమీద కూర్చుండబెట్టి

**క. వారల కిట్లను 'మీరలు, గారవమున విష్ణుమూర్తిఁ గైకొనిన మహా**
**భూరితపోధనవర్యులు, సారవిహీనంబు లైన సంసారములన్. 39**

**క. ఏ రీతిఁ గడప నేర్తురు?, క్రూరులు బహుదుఃఖరోగకుత్సిత బుద్ధుల్**
**నీరసులు నరులు గావున, నారయ సుజ్ఞానబుద్ధి నానతి యీరే? 40**

**ప్రతి :** వారలకున్+ఇట్లు+అనున్= వాళ్లతో (రాజు) ఇలా అన్నాడు. మీరలు= మీరు; గారవమునన్= ప్రీతిగా; విష్ణుమూర్తిన్+ కైకొనిన= విష్ణుమూర్తిని భక్తితో పూజించే; మహాభూరి= ఎంతోగొప్ప; తపస్+ధనవర్యులు= తపోనిధులు; సారవిహీనంబులు+ ఐన= సారం లేని; సంసారములన్= సంసారాలను; నరులు= మానవులు; క్రూరులు= భయంకరులు; బహు= అనేక; దుః ఖ= దుఃఖాలతోను; రోగ= వ్యాధులతోను (కూడిన); కుత్సితబుద్ధుల్= హీనమానసులు; నీరసులు= అల్పులు; కావునన్= అందువల్ల; ఏరీతిన్= ఏరకంగా; గడపనేర్తురు= దాటగలరు; ఆరయన్= ఆలోచించి; సుజ్ఞానబుద్ధిన్= జ్ఞానంతో; ఆనతి+ఈరే= ఆనతి ఇవ్వండి.

**తా :** (ఉచితాసనాలమీద కూర్చుండిన) వాళ్లతో విదేహరాజైన నిమి ఇలా అన్నాడు. 'మీరు విష్ణుమూర్తిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించే గొప్ప తపోనిధులు. భయంకరులు, అనేక దుఃఖాలతోను రోగాలతోను కూడినవారు, చెడ్డబుద్ధి గలవారు, అల్పులు అయిన మానవులు సారంలేని సంసారాలను ఎలా దాటగలరో ఆలోచించి జ్ఞానమార్గం తెలియజేయండి'.

**వ. మఱియు సకలజంతుసంతానంబుకంటె మానుషాకారంబు నొందుట దుర్లభం; బంతకంటె నారాయణ చరణయుగళస్మరణపరాయణు లగుట దుష్కరంబు; గావున నాత్యంతికంబగు క్షేమం బడుగవలసెఁ; బరమేశ్వరుండు ప్రపత్తినిష్ఠులకు సారూప్యం బెట్లొసంగు నత్తెఱం గానతిం' డనిన విని విదేహభూపాలునకు హరికథామృతపానాతిపరవశులైన మునిసమాజంబునందుఁ గవి యను మహానుభావుం డిట్లని చెప్పం దొడంగె; 'నరిషడ్వర్గంబునందు నేషణత్రయంబుచేతం దగులువడి మాత్సర్యయుక్తచిత్తుండగునట్టివాని కెవ్విధంబున నచ్యుతపాదారవిందభజనంబు సంభవించు? విశ్వంబును నాత్మయు వేఱుగా భావించువానికి భీరుత్వం బెట్లులే? దవిద్యాంధకారమగ్నులకు హరిచింతనం బెట్లు సిద్ధించు? నట్టి నరుండు తొంటికళేబరంబు విడిచి పరతత్త్వం బెబ్భంగిం జేరు? ముకుళీకృతనేత్రుండయిననరుండు మార్గభ్రమణంబునఁదొట్రుపాటు వడి చను చందంబున విజ్ఞానవిమలహృదయభక్తిభావనావశంబు లేకున్నఁబరమపదంబు వీరి కెవ్విధంబునం గలుగు? నని యడిగితివి; గావునఁజెప్పెద; సావధానుండవై యాకర్ణింపుము. 41**

**ప్రతి :** మఱియున్= మరల; సకలజంతు= అన్నిరకాల ప్రాణుల; సంతానంబుకంటెన్= సమూహంకంటె; మానుష+ ఆకారంబున్+ ఒందుట= మానవాకారాన్ని పొందడం (మనుష్య జన్మ పొందడం); దుర్లభంబు= కష్టసాధ్యం; అంతకంటెన్= మనుష్య జన్మ పొందినా; నారాయణ= శ్రీమన్నారాయణుని; చరణయుగళ= పాదాలమీద; స్మరణపరాయణులు+అగుట= ధ్యానాసక్తి కలగడం; దుష్కరంబు= కష్టం; కావునన్= కాబట్టి; న+అతి+అంతికంబు+అగు= అంతము లేనటువంటి అనగా శాశ్వతమైన; క్షేమంబు+అడుగవలసెన్= శుభాన్ని గురించి అడుగవలసి వచ్చింది; పరమ+ఈశ్వరుండు= పరమాత్మ; ప్రపత్తి నిష్ఠులకున్= శరణాగతి పొందినవారికి; సారూప్యంబు= తనతో సమానమైన రూపాన్ని అనగా మోక్షాన్ని; ఎట్లు+ఒసంగున్= ఎలా ఇస్తాడు; ఆ+తెఱంగు= ఆ పద్ధతిని; ఆనతి+ఇందు+అనినన్= తెలియజేయుమని అడుగగా; విని= ఆకర్ణించి; విదేహభూపాలునకున్= విదేహ రాజుతో; హరికథ+అమృతపాన= శ్రీహరి కథలు అనే అమృతాన్ని తాగడంవల్ల; అతిపరవశులు+ఐన= ఎంతో పారవశ్యం పొందిన; మునిసమాజంబున్+అందున్= మునుల సమూహంలో; కవి+అను= కవి అనే పేరుగల; మహ+అనుభావుండు= మహిమాన్వితుడు; ఇట్లు+అని= ఇలాగని; చెప్పన్+తొడంగెన్=

చెప్పడం ప్రారంభించాడు; అరిషడ్వర్గంబున్+అందున్= మనిషికి అంతశ్శత్రువులైన కామక్రోధలోభమోహమదమాత్సర్యాలనే ఆరింటియందు; ఏషణత్రయంబు+చేతన్= మూడు రకాల కోరికలచేత; తగులు+పడి= చిక్కి; మాత్సర్యయుక్త= మత్సరంతో కూడిన; చిత్తుండు+అగు= మనస్సుగల; అట్టివానికిన్= అలాంటివాడికి; ఏ+విధంబునన్= ఏవిధంగా; అచ్యుత= మాధవుని; పాద+అరవింద= పాదపద్మాల; భజనంబు= సేవ; సంభవించున్= లభిస్తుంది; విశ్వంబును= ప్రపంచాన్ని; ఆత్మను; వేఱుగా భావించువానికిన్= వేర్వేరుగా తలచేవాడికి; భీరుత్వంబు= భయం; ఎట్లు+లేదు= ఎలా ఉండదు? అవిద్య+అంధకార= అజ్ఞానమనే చీకటిలో; మగ్నులకున్= మునిగినవాళ్లకు; హరిచింతనంబు= శ్రీహరిని ధ్యానించడం; ఎట్లు+సిద్ధించున్= ఎలా సిద్ధిస్తుంది? అట్టినరుండు= అలాంటి మానవుడు; తొంటి= మునుపటి; కళేబరంబు= దేహం; విడిచి= వదిలిపెట్టి; పరతత్త్వంబు= పరమాత్మతత్త్వాన్ని; ఏ+భంగిన్+చేరున్= ఏ విధంగాచేరుతాడు? ముకుళీకృత= మూసుకొన్న; నేత్రుండు+ అయిన= కన్నులు కలవాడైన; నరుండు= మానవుడు; మార్గభ్రమణంబునన్= దారిలో నడుస్తూ; తొట్రుపాటు+పడి= తడబాటుపడి; చను చందంబునన్= వెళ్లేవిధంగా; విజ్ఞాన= పరమాత్మ జ్ఞానంచేత; విమల= స్వచ్ఛమైన; హృదయ= మనస్సులో; భక్తిభావనా వశంబు= భక్తిభావం స్వాధీనమై; లేక+ఉన్నన్= ఉండకపోతే; వీరికిన్= వీళ్లకు; పరమపదంబు= పరమాత్మ స్థితి; ఏ+విధంబునన్+కలుగున్= ఏ రకంగా కలుగుతుంది? అని; అడిగితివి= అడిగావు; కావునన్= కాబట్టి; చెప్పెద= చెపుతాను; స+అవధానుండవు+ఐ= శ్రద్ధ కలిగినవాడవై; ఆకర్ణింపుము= విను.

**తా :** అన్ని ప్రాణుల జన్మలకంటె మానవజన్మను పొందడం కష్టసాధ్యం. మానవజన్మ పొందినా శ్రీమన్నారాయణుని పాదాలధ్యానం మీద ఆసక్తి కలగడం మరీ కష్టం. అందువల్ల శాశ్వతమైన శుభాన్నిగురించి అడుగవలసి వచ్చింది. శరణాగతి పొందిన భక్తులకు శ్రీమన్నారాయణుడు సారూప్యం ఎలా అనుగ్రహిస్తాడు? ఆ విషయాన్ని గురించి తెలపండి, అని అడిగిన విదేహరాజుతో శ్రీహరికథలు అనే అమృతం తాగి పారవశ్యం పొందిన మునుల సమూహంలో “కవి” అనే పేరుగల మహానుభావుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు.

కామక్రోధ లోభమోహ మదమాత్సర్యాలనే వైరివర్గం లోను, మూడు రకాల కోరికలలోను చిక్కి మత్సర స్వభావంతో కూడిన మనస్సుగల మానవుడికి అచ్యుతుని పాదపద్మాలను సేవించే భాగ్యం ఎలా లభిస్తుంది? విశ్వాన్ని, ఆత్మను వేరువేరుగా భావించేవాడికి భయం లేకుండా ఎలా పోతుంది? అజ్ఞానమనే చీకటిలో మునిగిన వాళ్లకు శ్రీహరి ధ్యానం ఎలా సిద్ధిస్తుంది? అటువంటి మానవుడు శరీరాన్ని వదిలి పరమాత్మ తత్త్వాన్ని ఎలా చేరుతాడు? కండ్లుమూసుకొన్న మానవుడు దారిలో నడుస్తూ తడబాటుపడి వెళ్లే విధంగా పరమాత్మ జ్ఞానంచేత స్వచ్ఛమైన మనస్సులో భక్తిభావం నిండుగా ఉండకపోతే వీళ్లకు పరమాత్మ స్థితి ఎలా సిద్ధిస్తుంది? అని అడిగావు. సమాధానం చెబుతాను శ్రద్ధతో విను.

**విశే :** జీవి తన సర్వకర్మలను భగవత్పరం చేసి ‘అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ’ అని భగవంతునికి ఆత్మార్పణ చేసుకోవడం శరణాగతి. భగవంతుణ్ణి చేరడానికి కర్మ జ్ఞాన భక్తియోగాలతో పాటు ప్రపత్తియోగాన్ని కూడా ప్రతిపాదించారు వైష్ణవులు. శరణాగతి పొందడమే ప్రపత్తియోగ లక్షణం.

దారైషణ (భార్యమీద కోరిక), ధనైషణ (ధనంమీద కోరిక), పుత్రైషణ (కొడుకు కావాలని కోరిక) అనేవి ఏషణత్రయం. మానవ జీవితంలో ఈ మూడూ ప్రధానమైన కోరికలు. ఇవి మానవుని ప్రాపంచిక స్థితిలో పడవేస్తాయి. వీటిని జయిస్తే తప్ప పారమార్థికమైన ఆలోచనలు కలగవు.

**క. కరణత్రయంబుచేతను, నరుఁ డే కర్మంబు సేయు నయ్యైవేళన్**
**హరి కర్పణ మని పలుకుట, పరువడి సుజ్ఞాన మండ్రు పరమమునీంద్రుల్. 42**

**ప్రతి :** నరుఁడు= మానవుడు; ఆ+అయి+వేళన్= ఆయా సమయంలో; కరణత్రయంబుచేతను= త్రికరణాలతో; ఏ కర్మంబు+చేయున్= ఏయే కర్మలు చేస్తాడో; పరువడిన్= క్రమంగా; హరికిన్= శ్రీహరికి; అర్పణము+అని= సమర్పణం అని; పలుకుట= చెప్పడమే; పరమముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు; సుజ్ఞానము+అంద్రు= మంచి జ్ఞానమని చెబుతారు.

**తా :** మానవుడు త్రికరణాలతో ఏయే కర్మలు చేసినా ఆ సమయంలో ప్రతికర్మను 'కృష్ణార్పణం' అనడం (స్వామికి సమర్పించడం) సుజ్ఞానమని మునిశ్రేష్ఠులు చెబుతారు.

**విశే :** మనోవాక్కాయాలు త్రికరణాలు. అంటే మనస్సు, వాక్కు (మాట), కాయం (శరీరం). ఏ పనిచేసినా త్రికరణశుద్ధిగా చెయ్యాలంటారు పెద్దలు.

**వ. జ్ఞానాజ్ఞానంబులందు సంకలితుండైన స్మృతివిపర్యయంబు నొందు; నట్లు గావున గురుదేవతాత్మకుం డయి, బుద్ధిమంతుండైన మర్త్యుండు శ్రీ వల్లభు నుత్తమోత్తమునిఁగాఁ జిత్తంబునఁ జేర్చి సేవింపవలయు; స్వప్నమనోరథేచ్ఛాద్యవస్థలయందు సర్వసంకల్పనాశం బగుటంజేసి, వానిఁ గుదియం బట్టి నిరంతర హరిధ్యానపరుండైన వానికిఁ గైవల్యంబు సులభముగఁ గరతలామలకంబై యుండు. 43**

**ప్రతి :** జ్ఞాన+అజ్ఞానంబుల+అందున్= జ్ఞాన, అజ్ఞానాలలో; సంకలితుండు+ఐన= కూడినవాడైతే; స్మృతి= జ్ఞాపకశక్తి; విపర్యయంబున్+ఒందున్= వ్యత్యస్తం అవుతుంది; అట్లు+కావునన్= అందువల్ల; గురుదేవత+ఆత్మకుండు+అయి= గురువునే దైవంగా భావించి; బుద్ధిమంతుఁడు+ఐన= తెలివిగల వాడైన; మర్త్యుండు= మానవుడు; శ్రీవల్లభున్= లక్ష్మీ నాయకుని; ఉత్తమ+ఉత్తమునిన్+కాన్= ఉత్తమోత్తముడుగా; చిత్తంబునన్+చేర్చి= మనస్సులో నిలిపి; సేవింపవలయున్= కొలవాలి; స్వప్నమనోరథ+ఇచ్ఛాది= కోరికలనే తన కలలు మొదలైన; అవస్థల+అందున్= దశలలో; సర్వ= పూర్తిగా; సంకల్పనాశంబు= ఆలోచన నాశనం; అగుటన్+చేసి= అవడంవల్ల; వానిన్= కోరికలను; కుదియన్+పట్టి= తగ్గించుకొని; నిరంతర హరిధ్యానపరుండు+ఐన= ఎప్పుడూ శ్రీహరిని ధ్యానిస్తూ ఉండే; వానికిన్= వాడికి; కైవల్యంబు= మోక్షం; సులభముగన్= సులువుగా; కరతల+ఆమలకంబు+ఐ= చేతిలో ఉసిరిక కాయవలె; ఉండున్= ఉంటుంది.

**తా :** జ్ఞాన అజ్ఞానాలలో పడి ఉంటే జ్ఞాపకశక్తి వ్యత్యస్తం అవుతుంది. కాబట్టి తెలివైన మానవుడు గురువునే దైవంగా భావించి, ఉత్తమోత్తముడైన లక్ష్మీనాయకుని మనస్సులో నిలిపి సేవించాలి. కలల్లాంటి కోరికలతో తేలిపోవడం వల్ల ఆలోచన నశిస్తుంది. అందువల్ల కోరికలను తగ్గించుకొని ఎప్పుడూ శ్రీహరిని ధ్యానిస్తూ ఉండేవాడికి చేతిలో ఉసిరిక కాయవలె మోక్షం సులభంగా దొరుకుతుంది.

**విశే :** శరీర ఇంద్రియాలతో సంబంధంలేని ఆత్మ అద్వితీయమై ఉండే స్థితి కైవల్యం.

**సీ. సంతతంబును గృష్ణసంకీర్తనంబులు వీనుల కింపుగ వినఁగవలయు**
**హర్షంబుతోడుత హరినామకథనంబు పాటలనాఁటలఁ బరఁగవలయు**
**నారాయణునిదివ్యనామాక్షరంబులు హృద్వీథి సతతంబు నెన్న వలయుఁ**
**గంజాక్షులీలలు కాంతారముల నైన భక్తియుక్తంబుగాఁ బాడ వలయు**

**తే. వెఱ్ఱిమాడ్కిని లీలతో విశ్వమయుని, నొడువుచును లోకబాహ్యత నొందవలయు**
**నింతయును విష్ణుమయ మని యెఱుఁగ వలయు, భేద మొనరింప వలవదు మేదినీశ! 44**

**ప్రతి :** మేదినీ+ఈశా= భూనాయకా!; కృష్ణసంకీర్తనంబులు= శ్రీకృష్ణుని గురించిన పాటలను; సతతంబును= ఎల్లప్పుడూ; వీనులకున్+ఇంపుగన్= చెవులకు ఆనందం కలిగేటట్లు; వినఁగన్+కన్+వలయున్= వినాలి; హర్షంబుతోడుతన్= సంతోషంతో; హరినామ కథనంబున్= శ్రీహరినామమాహాత్మ్యాన్ని వివరించే విషయాలను; పాటలన్= పాటలుగా పాడుతూ; ఆఁటలన్= ఆటలుగా ఆడుతూ; పరఁగవలయున్= ప్రవర్తించాలి; నారాయణుని= శ్రీమన్నారాయణుని; దివ్య= దివ్యమైన; నామ+అక్షరంబులు= పేరులోని అక్షరాలను; హృత్+వీథిన్= మనస్సులో; సతతంబున్= ఎప్పుడూ; ఎన్నవలయున్= స్మరించాలి; కంజ+అక్షు= పద్మలోచనుని; లీలలు= క్రీడలను; కాంతారములను+ఐన= అడవులలో ఉన్నపుడైనా; భక్తియుక్తంబు+కాన్= భక్తితో; పాడవలయున్= గానం చెయ్యాలి; వెఱ్ఱిమాడ్కినిన్= వెర్రివానివలె; లీలతోన్= ఆనందంతో; విశ్వమయునిన్= విశ్వరూపుడైన శ్రీహరిని; ఒడువుచును= నేర్పుగా నుతిస్తూ; లోకబాహ్యతన్= ప్రాపంచిక స్థితిని అంటకుండా ఉండే విధానాన్ని; ఒందవలయున్= పొందాలి; ఇంతయును= కనిపిస్తున్న సృష్టి అంతా; విష్ణుమయము+అని= విష్ణువే; అని; ఎఱుఁగ వలయున్= తెలుసుకోవాలి; భేదము+ఒనరింపన్= భేదభావంతో చూడడం; వలవదు= పనికిరాదు.

**తా :** ఓ రాజా! ఎల్లప్పుడూ శ్రీకృష్ణుణ్ణి గురించి పాడే పాటలను చెవులకు ఇంపుగా వినాలి. శ్రీహరినామమాహాత్మ్యాన్ని వివరించే విషయాలను సంతోషంతో పాటలుగా పాడుతూ, ఆటలుగా ఆడుతూ ప్రవర్తించాలి. శ్రీమన్నారాయణుని పవిత్రమైన పేరులోని అక్షరాలను హృదయంలో ఎప్పుడూ స్మరిస్తూ ఉండాలి. పద్మలోచనుని లీలలను అడవిలో ఉన్నపుడైనా భక్తితో గానం చెయ్యాలి. విశ్వమంతా నిండి ఉన్న శ్రీహరిని వెర్రివాడివలె కీర్తిస్తూ లోకాన్ని అంటకుండా ఉండాలి. సృష్టి అంతా విష్ణుమయమని తెలుసుకోవాలి. భేదంగా చూడడం పనికిరాదు.

**వ. అనిన విదేహభూపాలుండు 'భాగవతధర్మం బెద్ది? యే ప్రకారంబునం బ్రవర్తించు? వారల చిహ్నంబు లెవ్వి? యంతయు నెఱింగింప మీర యర్హులరు' అనిన నందులో హరి యను మహాత్ముం డిట్లనియె. 45**

**ప్రతి :** అనినన్= అని చెప్పగా; విదేహభూపాలుఁడు= విదేహరాజైన నిమి; భాగవతధర్మంబు+ఎద్ది= భాగవతధర్మం ఏది; ఏ ప్రకారంబునన్= ఏ విధంగా; ప్రవర్తించున్= ప్రవర్తిస్తుంది; వారల= భాగవతుల; చిహ్నంబులు+ఎవ్వి= గుర్తులు ఎలా ఉంటాయి; అంతయున్= ఆ విషయాలన్నీ; ఎఱింగింపన్= తెలియజేయడానికి; మీరు+అ= మీరే; అర్హులరు+అనినన్= తగినవారు అనగా; అందులోన్= ఆ మునిసమూహంలో; హరి+అను+మహాత్ముండు= హరి అనే మహాముని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** కవి అనే ముని చెప్పిన మాటలు వినిన విదేహరాజు భాగవతధర్మం ఏది? ఆ ధర్మం ఏవిధంగా ప్రవర్తిస్తుంది? భాగవతుల గుర్తులు ఎలా ఉంటాయి; ఆ విషయాలన్నీ తెలియజేయడానికి మీరే తగినవారు అన్నాడు. వెంటనే ఆ ముని సమూహంలోని హరి అనే మహాముని ఇలా అన్నాడు.

**తే. సర్వభూతమయుండైన సరసిజాక్షుఁ డతఁడె తన యాత్మయం దుండు ననెడువాఁడు**
**శంఖచక్రధరుం డంచుఁ జనెడువాఁడు, భక్తిభావాభిరతుఁడు వో భాగవతుఁడు. 46**

**ప్రతి :** సర్వభూతమయుండు+ఐన= సర్వప్రాణులలో ఉండేవాడైన; సరసిజ+అక్షుఁడు= పద్మలోచనుడు; అతఁడు+ఎ= అతడే; తన+ఆత్మఅందున్= తన మనస్సులో; ఉండును+అనెడువాడు= ఉన్నాడనే నమ్మకం కలవాడు; అతఁడు+ఎ= అతడే; శంఖచక్రధరుండు+అంచున్= శంఖ చక్రధారి అంటూ; చనెడువాఁడు= ప్రవర్తించేవాడు; భక్తిభావ+అభిరతుఁడును= భక్తిభావంతో ఆసక్తి కలవాడు; భాగవతుఁడు= భాగవతుడే; వో (పొమ్ము)= నిశ్చయం

**తా :** సర్వప్రాణులలో ఉండేవాడైన పద్మలోచనుడే తన మనస్సులో ఉండేవాడని, అతడే శంఖచక్రధరుడని నమ్మి భక్తితో ఆసక్తి గలిగి ప్రవర్తించేవాడే భాగవతుడు. ఇది నిశ్చయం.

**క. 'వర్ణాశ్రమధర్మంబుల, నిర్ణయకర్మములఁ జెడక నిఖిలజగత్సం**
**పూర్ణుఁడు హరి' యను నాతఁడె, వర్ణింపఁగ భాగవతుఁడు వసుధాధీశా! 47**

**ప్రతి :** వసుధా+అధీశా= భూపాలా!; వర్ణింపన్+కన్= ఆలోచించి చూడగా; వర్ణ+ఆశ్రమధర్మంబులన్= వర్ణ, ఆశ్రమ ధర్మాలలోను; నిర్ణయకర్మములన్= ఆయా వర్ణాశ్రమాలకు విధించిన కర్మలలోను; చెడక= మునిగిపోకుండా; నిఖిల జగత్+సంపూర్ణుఁడు= సమస్తజగత్తులో నిండినవాడు; హరి= శ్రీహరి; అను+ఆతఁడు+ఎ= అని భావించేవాడే; భాగవతుఁడు= భాగవతుడు.

**తా :** భూపాలా! వర్ణాశ్రమధర్మాలలోను, ఆయా వర్ణాశ్రమాలకు విధించినకర్మలలోను మునిగిపోకుండా సమస్త జగత్తులో నిండినవాడే శ్రీహరి అని భావించేవాడే భాగవతుడు అని పేర్కొనదగినవాడు.

**వ. ఇట్లు సర్వసంగపరిత్యక్తుండై నిఖిలాంతరాత్ముండై పరమేశ్వరు దరుణగభస్తికిరణసహస్రంబుల లోకత్రయంబుం బావనంబు సేయుచందంబునం దన చరణారవిందరజఃపుంజంబుచేతం బవిత్రంబు సేయుచు, సురాసుర జేగీయమాన సేవ్యంబైన జనార్దన పాదారవిందంబులకు వందనాభిలాషుఁడై భక్తియు లవమాత్రంబునుం జలింపనీక సుధాకరోదయంబున దివాకరజనితతాపనివారణం బయిన భంగి నారాయణాంఘ్రినఖమణిచంద్రికానిరస్తహృదయతాపుండై యాత్మీయభక్తిరశనానుబంధ బంధురంబైన వాసుదేవ చరణసరోరుహధ్యానానందపరవశుం డగు నతండు భాగవతప్రధానుం' దని యెఱింగించిన విని విదేహుం డిట్లనియె. 48**

**ప్రతి :** ఇట్లు= ఇలా; సర్వసంగ= అన్నిబంధాలను; పరిత్యక్తుండు+ఐ= పరిత్యజించినవాడై; నిఖిల+అంతర+ఆత్ముండు+ఐ= అన్నిటిలో ఆత్మగలవాడై, అన్నిటిని తనలాగా భావించినవాడై; పరమ+ఈశ్వరుఁడు= పరమాత్మ; అరుణగభస్తి= సూర్యుడు; కిరణ సహస్రంబులన్= సహస్రకిరణాలచేత; లోకత్రయంబున్= ముల్లోకాలను; పావనంబు+చేయు+చందంబునన్= పవిత్రం చేస్తున్న విధంగా; తన చరణ+అరవింద= తన అడుగుదమ్ములు; రజఃపుంజంబుచేతన్= ధూళికణాల సమూహంచేత; పవిత్రంబు+చేయుచున్= (ముల్లోకాలను) పావనంచేస్తూ; సుర+అసుర= దేవదానవులచేత; జేగీయమాన= కొనియాడబడుతూ; సేవ్యంబు+ఐన= సేవింపదగిన; జనార్దనుని= శ్రీకృష్ణుని; పాద+అరవిందంబులకున్= పద్మాలవంటి పాదాలకు; వందన+అభిలాషుఁడు+ఐ= నమస్కరించాలనే కోరిక కలిగి, భక్తియు= భక్తి; లవమాత్రంబునున్= రవ్వంతకూడా; చలింపన్+ఈక= సడలనీయకుండా; సుధాకర+ఉదయంబునన్= చంద్రోదయంవల్ల; దివాకర జనిత= సూర్యునివలన పుట్టిన; తాప= ఎండబాధ; నివారణంబు+అయిన= తొలగిపోయిన; భంగిన్= విధంగా; నారాయణ+అంఘ్రి= శ్రీమన్నారాయణుని చరణ; నఖమణి= గోరు అనే మణియొక్క; చంద్రికా= కాంతిచేత; నిరస్త= తోసివేయబడిన; హృదయతాపుండు+ఐ= మనస్సులో బాధకలవాడై; ఆత్మీయభక్తి= తన భక్తి అనే; రశన+అనుబంధ= తాడు అనే బంధనంచేత; బంధురంబు+ఐన= బంధింపబడిన; వాసుదేవ= వాసుదేవుని; చరణ సరస్+రుహ= పాదపద్మాలను; ధ్యాన= ధ్యానించుటవల్ల; ఆనందపరవశుండు+అగు= ఆనందంలో పరవశుడైన; అతండు= అట్టివాడు; భాగవత ప్రధానుండు+అని= ఉత్తమ భాగవతుడు అని; ఎఱింగించినన్= తెలియజేయగా; విని; విదేహుండు= విదేహరాజు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఇలా అన్నిబంధాలను పరిత్యజించి, అన్నింటిని తనలాగా భావించి, సూర్యుడు తన సహస్రకిరణాలతో ముల్లోకాలను పవిత్రం చేస్తున్నవిధంగా తన అడుగుదమ్ముల దుమ్ముచేత ముల్లోకాలను పవిత్రం చేస్తూ దేవదానవులచేత కూడా కొనియాడబడి సేవింపదగిన జనార్దనుని పాదపద్మాలకు నమస్కరించాలనే కోరిక కలిగి, భక్తిని రవ్వంతకూడా సడలనీకుండా, చంద్రోదయం వల్ల ఎండబాధ తొలిగిపోయిన విధంగా శ్రీమన్నారాయణుని చరణ నఖకాంతుల వెన్నెలచే హృదయతాపం పోగొట్టుకొని, తన భక్తి అనే తాడు బంధనంతో బంధింపబడిన వాసుదేవుని పాదపద్మాలను ధ్యానించడంవల్ల కలిగిన ఆనందంలో పరవశించేవాడు ఉత్తమభాగవతుడని చెప్పగా విని విదేహరాజు ఇలా అన్నాడు.

**క. గజరాజవరదుగుణములు, త్రిజగత్పావనము లగుటఁ దేటపడంగా**
**సుజనమనోరంజకముగ, విజితేంద్రియ! వినఁగ నాకు వేడుక పుట్టెన్. 49**

**ప్రతి :** విజిత+ఇంద్రియ= ఇంద్రియములను జయించిన వాడా! (మహర్షీ)!; గజరాజవరదు= కరిరాజుకు వరమిచ్చి కాపాడిన శ్రీహరి; గుణములు= సౌశీల్యవాత్సల్యాది గుణములు; త్రిజగత్+పావనములు+అగుటన్= మూడు లోకాలనూ పవిత్రం చేసేవి కావడంవల్ల; తేటపడంన్+కా= స్పష్టంగా తెలిసేవిధంగా; సుజన= సజ్జనులకు; మనస్+రంజకము+కన్= మనోరంజకంగా; వినన్+కన్= వినాలని; నాకున్= నాకు; వేడుక= కుతూహలం; పుట్టెన్= పుట్టింది (కలిగింది).

**తా :** జితేంద్రియుడవైన మహర్షీ! కరిరాజుకు వరమిచ్చి కాపాడిన (శ్రీహరిసౌశీల్యవాత్సల్యాది) గుణాలు మూడు లోకాలనూ పావనం చేసేవి. అటువంటి గుణాలను స్పష్టంగా మనోరంజకంగా వినాలని నాకు కూతూహలం కలిగింది.

**వ. అనిన విని యంతరిక్షుం డను ఋషిశ్రేష్ఠుం డిట్లనియె. 50**

**ప్రతి :** అనినన్+విని= అని అడుగగా విని; అంతరిక్షుండు+అను= అంతరిక్షుడు అనే పేరుగల; ఋషిశ్రేష్ఠుండు= గొప్పఋషి; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

**తా :** అలా అడిగిన విదేహరాజు మాటలు విని అంతరిక్షుడనే గొప్పఋషి ఇలా చెప్పాడు.

**క. పరమబ్రహ్మ మనంగాఁ, బరతత్త్వ మనంగఁ బరమపద మనఁగను నీ**
**శ్వరుఁడనఁ గృష్ణుఁడన జగ, ద్భరితుఁడు నారాయణుండు దా వెలుఁగొందున్. 51**

**ప్రతి :** పరమ బ్రహ్మము+అనన్+కాన్= పరబ్రహ్మమని; పరతత్త్వము+అనన్+కన్= పరతత్త్వమని; పరమపదము+అనన్+కను= పరమపదమని; ఈశ్వరుఁడు+అనన్= పరమేశ్వరుడు అని; కృష్ణుఁడు+అనన్= శ్రీకృష్ణుడని; నారాయణుండు= శ్రీమన్నారాయణుడు; తాన్= తానే; జగత్+భరితుఁడు= ప్రపంచమంతా నిండినవాడై; వెలుఁగొందున్= ప్రకాశిస్తున్నాడు.

**తా :** పరబ్రహ్మమని, పరతత్త్వమని, పరమపదమని, పరమేశ్వరుడని, శ్రీకృష్ణుడని, వేరువేరు పేర్లతో శ్రీమన్నారాయణుడే ప్రపంచమంతా నిండి ప్రకాశిస్తున్నాడు.

**వ. అవ్యక్త నిర్గుణ పరబ్రహ్మంబునందుఁ దనకు విపర్యయంబుగా జననం బయిన జ్ఞానంబె విష్ణుమాయ యనంబడుఁ; బరమేశ్వరుఁ డట్టి మాయచేత జగంబు నిర్మించి నిశ్చింతుండై యుండు; నింద్రియార్థ భ్రమణంబు సేసెడు దుర్మతులకు సుషుప్త్యాద్యవస్థలు వరుసన కలుగుటంజేసి పరమేశ్వరునిం**

**బొందరామియను నాలుగవ యవస్థయుఁ గలుగు; స్వప్నంబునందు గ్రాహ్యగ్రాహక గ్రహణంబులను త్రివిధభేదంబు గలిగియుండు, నీ చందంబున నవిద్యాంధకార సంవృతం బై మూఁడువిధంబులఁబర్యవసించు మనోరథంబు స్వప్నావస్థయం దణంగిన క్రియఁ ద్రివిధం బగు మాయయు నాత్మయందు లీనంబగుఁ; బరమేశ్వరుండు మొదలం బృథివ్యాది మహాభూతమయం బయిన సృష్టిని గలుగఁజేసి, యందుఁ బంచభూతాత్మకం బయిన యాత్మ కేకాదశేంద్రియం బులచేత భేదంబు పుట్టించుచు, గుణంబులచేత గుణంబు లంగీకరించుచు, నాత్మయందుఁ బ్రద్యోతిత గుణంబులవలన గుణానుభవంబుఁజేయుచు నున్నవాఁడై, సృష్టి నాత్మీయంబుగా భావించు; దేహి కర్మమూలంబున నైమిత్తిక కర్మంబుల నాచరించుచుఁ దత్ఫలం బంగీకరించి దుఃఖైకవశుండై వర్తించుఁ; బెక్కు దుఃఖంబులం బడిన యా దేహి కర్మఫలప్రాప్తుం డగుచు భూత సంప్లవపర్యంతంబు పరవశుండై జన్మమరణంబులం బొరలుచుండు; నంత్యకాలం బాసన్నం బయిన ద్రవ్యగుణస్వరూపం బగు జగంబు ననాదినిధనం బగు కాలంబు ప్రకృతిం బొందించు; నటమీఁద శతవర్షంబులు వర్షంబు లేమిచేత నత్యుగ్రలోక లోచనుతేజంబున సకలలోకంబులు దహింపఁబడు; నంత నధోలోకంబుననుండి సంకర్షణముఖజనితానలం బూర్ధ్వ శిఖాజాలంబుల వాయుసహాయంబై దిక్కులయం దెల్లఁబ్రవర్తించు; నటమీఁద సంవర్తక వలాహక గణంబులు నూఱుహాయనంబులు సలిలధారాపాతంబుగా వర్షంబు గురియు; నందు విరాడ్రూపంబు లీనం బగు; నంత నీశ్వరుం డింధనాగ్నిచందంబున నవ్యక్తంబుఁ బ్రవేశించు; తదనంతరంబ ధరణీ మండలంబు వాయుహృతగంధంబై కబంధరూపంబుఁ దాల్చు; నా జలంబు హృతరసంబై తేజోరూపంబు నొందు; నా తేజంబు తమోనిరస్తంబై వాయువం దడంగు; నా గంధవహుండు స్పర్శవిరహితుండయి యాకాశంబునందు సంక్రమించు; నా విష్ణుపదంబును విగత శబ్దగుణంబు గలదియై యాత్మయం దడంగు; నింద్రియంబులును మనంబును బుద్ధియు వికారంబులతోడ నహంకారంబుఁ బ్రవేశించు; నా యహంకారంబును స్వగుణయుక్తంబై పరమాత్మునిం జేరు; నిట్లు త్రివర్ణాత్మకయై సర్గస్థితిలయకారిణి యగు మాయ యిట్టిది యని తత్స్వరూపమాహాత్మ్యంబులు వివరించిన నరపాలుం డిట్లనియె. 52**

**ప్రతి :** అవ్యక్త= వ్యక్తముకాని అనగా కనిపించని; నిర్గుణ= గుణరహితమైన; పరబ్రహ్మంబు+అందున్= పరబ్రహ్మంలో; తనకున్= ఆ పరబ్రహ్మకు; విపర్యయంబు+కాన్= వ్యత్యాసంగా; జననంబు+అయిన= పుట్టిన; జ్ఞానంబు+ఎ= జ్ఞానమే; విష్ణుమాయ+అనన్+పడున్= విష్ణుమాయ అని పిలువబడుతుంది; పరమేశ్వరుఁడు= భగవంతుడు; అట్టిమాయచేతన్= అటువంటి విష్ణుమాయచేత; జగంబు= ప్రపంచాన్ని; నిర్మించి= సృష్టించి; నిశ్చింతుండు+ఐ= చింతలేనివాడై; ఉండున్= ఉంటాడు; ఇంద్రియ+అర్థ= ఇంద్రియ విషయాలకోసం; భ్రమణంబు+చేసెడు= తిరుగులాడే; దుర్మతులకున్= చెడుబుద్ధి గలవారికి; సుషుప్తి+ఆది+అవస్థలు= గాఢనిద్ర, స్వప్నం, మెలకువ అనే మూడు దశలు; వరుసనన్= వరుసగా; కలుగుటన్+చేసి= కలగడంవల్ల; పరమేశ్వరుని= భగవంతుని; పొందరామి+అను= పొందలేకపోవడం అనే; నాలుగవ; అవస్థయున్= అవస్థకూడా; కలుగున్= కలుగుతుంది; స్వప్నంబు+అందున్= స్వప్నంలో; గ్రాహ్య= గ్రహింపదగినది; గ్రాహక= గ్రహించేవాడు; గ్రహణంబులను= గ్రహించడం అనే; త్రివిధ భేదంబున్= మూడు భేదాలను; కలిగి+ఉండున్=

పొంది ఉంటుంది; ఈ చందంబునన్= ఈవిధంగా; అవిద్యా+అంధకార= అవిద్య అనే చీకటిచేత; సంవృతంబు+ఐ= చుట్టుకోబడి; మూఁడు విధంబులన్= మూడు విధాలుగా; పర్యవసించున్= పరిణమించు; మనోరథంబు= కోరిక; స్వప్న+అవస్థయందున్= స్వప్నదశలో; అణంగిన క్రియన్= అణగిన విధంగా; త్రివిధంబు+అగు= మూడు విధాలైన; మాయయున్= మాయకూడా; ఆత్మయందున్= ఆత్మలో; లీనంబు+అగున్= లీనమవుతుంది; పరమేశ్వరుండు; మొదలన్= మొదట; పృథివీ+ఆది= పృథివి మొదలైన; మహాభూతమయంబు+అయిన= మహాభూతాత్మకమైన; సృష్టిని; కలుగన్+చేసి= కలిగించి; అందున్= సృష్టిలో; పంచభూతాత్మకంబు+అయిన= నేల, నీరు అగ్ని, గాలి, ఆకాశం అనే అయిదు భూతాలతో కూడిన; ఆత్మకున్= శరీరానికి; ఏకాదశ+ఇంద్రియంబులచేతన్= పదకొండు ఇంద్రియాలతో; భేదంబు పుట్టించుచున్= భేదం కలిగిస్తూ; గుణంబులచేతన్= గుణాలచేత; గుణంబులు+అంగీకరించుచున్= గుణాలను అంగీకరిస్తూ; ఆత్మ+అందున్= ఆత్మయందు; ప్రద్యోతిత= వ్యక్తమైన; గుణంబులవలనన్= గుణాలవల్ల; గుణ+అనుభవంబు+ చేయుచున్+ఉన్నవాడు+ఐ= గుణాలను అనుభవిస్తున్నవాడై; సృష్టిని; ఆత్మీయంబు+కాన్+భావించున్= తనదిగా భావిస్తాడు; దేహి= శరీరధారి; కర్మమూలంబునన్= కర్మకారణంగా; నైమిత్తిక కర్మంబులన్= నిమిత్తములైన కర్మలను; ఆచరించుచున్= చేస్తూ; తత్+ఫలంబు+ అంగీకరించి= అవి కలిగించే ఫలితాన్ని అంగీకరించి; దుఃఖ+ఏకవశుండు+ఐ= దుఃఖానికే వశుడై; వర్తించున్= ప్రవర్తిస్తూ ఉంటాడు; పెక్కు= అనేక; దుఃఖంబులన్+పడిన= దుఃఖాలలో మునిగిన; ఆ దేహి; కర్మఫల ప్రాప్తుండు+అగుచున్= కర్మఫలాన్ని పొందుతూ; భూత సంప్లవ పర్యంతంబు= ప్రాణులన్నీ నీటిలో మునిగిపోయే వరకు (జలప్రళయం వచ్చి సర్వభూతాలు అందులో మునిగి పోయేవరకు); పరవశుండు+ఐ= అనుభవాలు పొందుతూ; జన్మమరణంబులన్= చావుపుట్టుకలతో; పొరలుచున్+ఉండున్= పడిదొర్లుతూ ఉంటాడు; అంత్యకాలంబు= ప్రళయకాలం; ఆసన్నంబు+అయిన= వచ్చిన సమయంలో; ద్రవ్యగుణస్వరూపంబు+ అగు= వస్తుగుణాల స్వరూపం పొందిన; జగంబున్= జగత్తును; అనాది నిధనంబు+అగు= ఆద్యంతాలు లేని; కాలంబు= కాలం; ప్రకృతిన్+పొందించున్= ప్రకృతిని పొందిస్తుంది; అటమీఁదన్= ఆపైన; శతవర్షంబులు= నూరేండ్లు; వర్షంబు లేమిచేతన్= వానలేక పోవడంవల్ల; అతి+ఉగ్రలోక+లోచను= భయంకరమైన లోకమే కన్నుగా గలవాని అనగా సూర్యుని; తేజంబునన్= ఎండచేత; సకలలోకంబులు= ఎల్ల లోకాలు; దహింపన్+పడున్= కాల్చివేయబడతాయి; అంతన్= ఆ తరువాత; అధోలోకంబునన్+ఉండి= కింది లోకం నుండి; సంకర్షణ= ఆదిశేషునియొక్క; ముఖజనిత= ముఖంనుండి పుట్టిన; అనలంబు= అగ్ని; ఊర్ధ్వశిఖాజాలంబులన్= పైకి ఎగసిన అగ్నిజ్వాలలుగా; వాయు సహాయంబు+ఐ= గాలి సహాయంగా కల్గిందై; దిక్కులయందు+ఎల్లన్= దిక్కులంతటా; ప్రవర్తించున్= వ్యాపిస్తాయి; అటమీఁదన్= ఆపైన; సంవర్తక= సంవర్తకాలనే; వలాహక= మేఘాలయొక్క; గణంబులు= సమూహాలు అనగా మేఘాలగుంపులు; నూఱు హాయనంబులు= నూరు సంవత్సరాలు; సలిల ధారాపాతంబు+కాన్= అవిచ్ఛిన్నంగా నీటి ప్రవాహం పడేటట్లుగా; వర్షంబు+కురియున్= వాన పడుతుంది; అందున్= ఆ నీటిలో; విరాట్+రూపంబు= బ్రహ్మాండం; లీనంబు+అగున్= లీనం అవుతుంది; అంతన్= అప్పుడు; ఈశ్వరుండు= పరమాత్మ; ఇంధన+అగ్నిచందంబునన్= కట్టెలలోని అగ్నివలె; అవ్యక్తంబుల్= వ్యక్తంకాని దానిలో; ప్రవేశించున్= ప్రవేశిస్తాడు; తద్+అనంతరంబు+అ= ప్రవేశించిన తరువాత; ధరణీమండలంబు= భూమండలం; వాయు= గాలిచేత; హృత= గ్రహింపబడిన; గంధంబు+ఐ= వాసన గలదై (గంధ గుణాన్ని కోల్పోయి); కబంధరూపంబున్+తాల్చున్= నీటిరూపాన్ని ధరిస్తుంది; ఆ జలంబు= ఆ నీళ్లు; హృతరసంబు+ఐ= రసాన్ని కోల్పోయి; తేజోరూపంబున్+ఒందున్= తేజోరూపాన్ని పొందుతుంది; ఆ తేజంబు= ఆ తేజస్సు; తమోనిరస్తంబు+ఐ= చీకటిచేత తొలగింపబడి; వాయువు+అందున్+అడంగున్= వాయువులో అణగుతుంది; ఆ గంధవహుండు= ఆ వాయువు; స్పర్శవిరహితుండు+అయి= స్పర్శను పోగొట్టుకొని; ఆకాశంబు+అందున్= ఆకాశంలో; సంక్రమించున్= కలుస్తుంది; ఆ విష్ణుపదంబును= ఆ యాకాశం కూడా; విగత= పోయిన; శబ్దగుణంబు+కలది+ఐ= శబ్దగుణం కలదై (శబ్దగుణాన్ని

పోగొట్టుకొని); ఆత్మయందున్+అడంగున్= ఆత్మయందు అణగిపోతుంది; ఇంద్రియంబులును= ఇంద్రియాలు; మనంబును= మనస్సు; బుద్ధియు= బుద్ధి; వికారంబులతోడన్= ఆకారాలలో మార్పులతో; అహంకారంబున్= అహంకారంలో; ప్రవేశించున్= ప్రవేశిస్తాయి; ఆ+అహంకారంబును= ఆ అహంకారం; స్వగుణయుక్తంబు+ఐ= తన గుణాలతో కలసి; పరమాత్మునిన్+ చేరున్= పరమాత్మను చేరుతుంది; ఇట్లు= ఈవిధంగా; త్రివర్ణాత్మక+ఐ= మూడువర్ణాలు గలిగి; సర్గ= సృష్టి; స్థితి; లయకారిణి+అగు= లయాలకు కారణమైన; మాయ; ఇట్టిది+అని= ఇటువంటిదని; తత్+స్వరూప= దాని స్వరూపం; మాహాత్మ్యంబులు= మాహాత్మ్యాలు; వివరించినన్= వివరంగా చెప్పగా; నరపాలుండు= విదేహరాజు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అవ్యక్తమైన, గుణరహితమైన పరబ్రహ్మంనుండి వ్యత్యాసంగా పుట్టిన జ్ఞానాన్ని 'విష్ణుమాయ' అంటారు. అటువంటి మాయచేత ప్రపంచాన్ని నిర్మించి భగవంతుడు ఎలాంటి చింతా లేకుండా ఉంటాడు. ఇంద్రియసుఖాలకోసం తిరుగులాడే చెడుబుద్ధి గలవారికి గాఢనిద్ర, స్వప్నం, మెలకువ అనే మూడు అవస్థలతోపాటు భగవంతుని పొందలేక పోవడమనే నాలుగో అవస్థకూడా కలుగుతుంది. కలలో గ్రహించదగిందీ, గ్రహించేవాడూ, గ్రహించడం అనే మూడు (త్రిపుటి) భేదాలుంటాయి. (త్రిపుటి) ఈవిధంగా అవిద్య అనే చీకటితో చుట్టుకోబడి మూడువిధాలుగా పరిణమించేకోరిక స్వప్నదశలో అణగినవిధంగా మూడు విధాలైన మాయకూడా ఆత్మలో విలీనమవుతుంది.

పరమేశ్వరుడు మొదట పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలతో నిండిన సృష్టిని కలిగించి అందులో పంచభూతాత్మకమైన శరీరానికి పదకొండుఇంద్రియాలతో భేదం పుట్టిస్తూ, గుణాలచే గుణాలను అంగీకరిస్తూ, ఆత్మయందు వ్యక్తమైన గుణాలవల్ల గుణాలను అంగీకరిస్తూ ఉన్నవాడై సృష్టిని తనదిగా భావిస్తాడు. శరీరధారి పూర్వకర్మ మూలంగా నిమిత్తమాత్రాలైనకర్మలు చేస్తూ, అవి కలిగించే ఫలితాన్ని అంగీకరించి దుఃఖానికే వశుడై ప్రవర్తిస్తూ ఉంటాడు. అనేకదుఃఖాలతో మునిగిన ఆ దేహి కర్మఫలాన్ని పొందుతూ జలప్రళయం వచ్చి సర్వభూతాలు అందులో మునిగిపోయే వరకు (స్వేచ్ఛను కోల్పోయి) ప్రాపంచిక అనుభవాలు పొందుతూ చావుపుట్టుకలలో పడి దొర్లుతూ ఉంటాడు. ప్రళయకాలం (కల్పాంతసమయం) వచ్చినప్పుడు వస్తుగుణాలస్వరూపం పొందిన జగత్తును ఆద్యంతాలు లేని కాలం ప్రకృతిని పొందిస్తుంది.

ఆపైన నూరేండ్లు వాన లేకపోవడంవల్ల లోకాలన్నీ సూర్యతేజం (ఎండ)తో కాల్చివేయబడతాయి; ఆ తరువాత కింది లోకంలోని ఆదిశేషుని ముఖంనుండి వెడలిన అగ్నిజ్వాలలు వాయుసహాయంతో లేచి, అన్ని దిక్కులలో వ్యాపిస్తాయి. అటు తరువాత సంవర్తకాలు, వలాహకాలు అనేడి మేఘాల గుంపు నూరేండ్లు ధారాపాతంగా వర్షిస్తాయి. ఆ వర్షపు నీటిలో వీరాడ్రూపం విలీనమవుతుంది. అప్పుడు ఈశ్వరుడు కట్టెలలో అగ్నివలె అవ్యక్తంలో ప్రవేశిస్తాడు. ప్రవేశించిన తరువాత భూమండలం తన వాసనగుణాన్ని కోల్పోయి నీటిరూపం ధరిస్తుంది. ఆ నీళ్ల రసాన్ని కోల్పోయి తేజోరూపం పొందుతాయి. ఆ తేజస్సు చీకటితో తొలిగింపబడి వాయువులో అణగుతుంది. ఆ వాయువు స్పర్శగుణాన్ని పోగొట్టుకొని ఆకాశంలో కలుస్తుంది. ఆ ఆకాశం శబ్దగుణాన్ని పోగొట్టుకొని ఆత్మయందు అణగిపోతుంది. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి వికారాలతో అహంకారాన్ని ప్రవేశిస్తాయి. ఆ అహంకారం తన గుణాలతో కలసి పరమాత్మను చేరుతుంది. ఈ విధంగా మాయ తెలుపు (సత్త్వగుణం), ఎరుపు (రజోగుణం), నలుపు (తమోగుణం) అనే మూడు వర్ణాలు (గుణాలు) కలిగి, సృష్టి స్థితి లయాలకు కారణమవుతుంది. అని మాయా స్వరూపమూ, మాహాత్మ్యమూ వివరించగా విని విదేహరాజు ఇలా అన్నాడు.

**ఉ. 'జ్ఞానవిహీనులైన నరసంఘముఁ గానఁగరాని మాయఁ దా**
**లోన నడంచి యెట్లు హరిలోకముఁ జెందుదు రంతయుం దగన్**

**భూనుత! సత్యవాక్యగుణభూషణ! యిక్కథ వేడ్కతోడుతన్**
**బూనికఁ జెప్పు మన్నను బ్రబుద్ధుఁడు నిట్లను గారవంబునన్.** **53**

**ప్రతి :** భూనుత= జగన్నుతా!; సత్యవాక్యగుణభూషణ= సత్యవాక్కులు, సద్గుణాలు భూషణాలుగా కలవాడా!; జ్ఞానవిహీనులు+ఐన= అజ్ఞానులైన; నరసంఘమున్= మానవులు; కానఁగరాని మాయన్= కనిపించని మాయను; లోనన్+అడంచి= లోపలే అణచివేసి; హరిలోకమున్= వైకుంఠాన్ని; ఎట్లు= ఏవిధంగా; చెందుదురు= పొందుతారు, చేరుతారు; ఈ+కథ= ఈ వృత్తాంతం; అంతయున్+తగన్= పూర్తిగా అర్థమయ్యేటట్లు; వేడ్కతోడుతన్= సంతోషంగా; పూనికన్= గట్టిగా; చెప్పుము+అన్నను= చెప్పండి అని అడుగగా; ప్రబుద్ధుఁడు= ప్రబుద్ధుడనే ముని; గారవంబునన్= ఆదరపూర్వకంగా; ఇట్లు+అనున్= ఇలా అన్నాడు.

**తా :** జగన్నుతా! సత్యవాక్కుల్ని, సద్గుణాల్ని భూషణాలుగా కలవాడా! అజ్ఞానులైన మానవులు కనరాని మాయను లోపల అణచివేసి వైకుంఠాన్ని ఎలా పొందుతారు? ఈ వృత్తాంతాన్ని పూర్తిగా అర్థమయ్యేటట్లు చెప్పండి అని అడుగగా ప్రబుద్ధుడనే ముని ఆదరపూర్వకంగా ఇలా అన్నాడు.

**వ.** **సూర్యోదయాస్తమయంబులం బ్రతిదినంబు నాయువు క్షీణంబు నొంద, దేహకళత్రమిత్ర భ్రాతృమమత్వ పాశబద్ధులై విడివడు నుపాయంబు గానక సంసారాంధకారమగ్ను లయి గతాగతకాలంబుల నెఱుంగక దివాంధంబులగు జంతుజాలంబులభంగి జన్మజరారోగ విపత్తి మరణంబు లందియు, శరీరంబ మే లనుచుఁ బ్రమోద మోహమదిరాపానమత్తులై విషయాసక్తతం జిక్కి తమ్ముఁ దా రెఱుంగక యుండి విరక్తిమార్గంబు దెలియక వర్తించు మూఢులగు జనంబుల పొంతలఁ బోవక కేవలనారాయణభక్తిభావంబు గల సద్గురుం బ్రతిదినంబును భజియించి; సాత్త్వికంబు, భూతదయయును, హరికథామృతపానంబును, బ్రహ్మచర్య వ్రతంబును, విషయంబుల మనంబు సేరకుండుటయు, సాధుసంగంబును, సజ్జనమైత్రియు, వినయ సంపత్తియు, శుచిత్వంబును, తపంబును, క్షమయు, మౌనవ్రతంబును, వేదశాస్త్రాధ్యయన తదర్థానుష్ఠానం బులును, నహింసయు, సుఖదుఃఖాదిద్వంద్వసహిష్ణుతయు, నీశ్వరుని సర్వగతునింగా భావించుటయు, ముముక్షుత్వంబును, జనసంగవర్జనంబును, వల్కలాదిధారణంబును, యదృచ్ఛాలాభసంతుష్టియు, వేదాంతశాస్త్రార్థజిజ్ఞాసయును, దేవతాంతరనిందావర్జనంబును, గరణత్రయశిక్షణంబును, సత్యవాక్యతయు, శమదమాదిగుణవిశిష్టత్వంబును, గృహారామక్షేత్రకళత్రపుత్త్ర విత్తాదుల హరి కర్పణంబు సేయుటయు, నితర దర్శనవర్జనంబు సేయుటయును భాగవతోత్తమధర్మంబు లని చెప్పి యిట్లనియె.** **54**

**ప్రతి :** సూర్య+ఉదయ+అస్తమయంబులన్= సూర్యుడు ఉదయించడం, అస్తమించడంతో; ప్రతిదినంబున్= ప్రతిరోజూ; ఆయువు= ఆయుస్సు; క్షీణంబున్+ఒందన్= తగ్గిపోతుండగా; దేహ= శరీరంపైన; కళత్ర= భార్యపైన; మిత్ర= స్నేహితులపైన; భ్రాతృ= సోదరులపైన; మమత్వ= నాది, నావారు అనే; పాశబద్ధులు+ఐ= తాడుతోకట్టబడినవారై అనగా మమకారంతో కట్టువడి; విడివడున్= తొలిగించుకొనే; ఉపాయంబు+కానక= ఉపాయం కనబడక; సంసార+ అంధకార= సంసారమనే చీకటిలో; మగ్నులు+అయి= మునిగిపోయి; గత+అగత కాలంబులన్= భూత భవిష్యత్కాలాలను; ఎఱుంగక= తెలుసుకోలేక; దివా+అంధంబులు+అగు= పగలుకూడా కనిపించని; జంతుజాలంబులభంగిన్= గుడ్లగూబలవలె; జన్మ= పుట్టుక; జరా=

ముసలితనం; రోగ= వ్యాధి; విపత్తి= ఆపద; మరణంబులు= చావులు; అందియున్= పొందుతూ; శరీరంబు+అ= దేహమే; మేలు+అనుచున్= మేలనుకొంటూ; ప్రమోద= సంతోష; మోహ= భ్రాంతి అనే; మదిరా= మద్యం; పాన= తాగడంవల్ల; మత్తులు+ఐ= మదించినవారై; విషయ+ఆసక్తతన్+చిక్కి= ఇంద్రియ విషయాల మీదగల కోరికలకు వశులై; తమ్ముగ్= తమను; తారు= తాము; ఎఱుంగక+ఉండి= తెలుసుకోలేని వాళ్లవుతూ; విరక్తిమార్గంబు= వైరాగ్యం పొందేమార్గం; తెలియక; వర్తించు= ప్రవర్తించే; మూఢులు+అగు= మూర్ఖులైన; జనంబుల= మనుష్యుల; పొంతలన్+పోవక= సమీపానికి పోకుండా; కేవల= పూర్తిగా; నారాయణ భక్తిభావంబు= శ్రీమన్నారాయణునిమీద భక్తిభావం; కల= కలిగిన; సద్గురున్= మంచి గురువును; ప్రతిదినంబును= ప్రతిరోజూ; భజియించి= పూజించి; సాత్త్వికంబు= సత్త్వగుణం; భూతదయయును= ప్రాణులయందు దయ; హరికథా+అమృతపానంబును= శ్రీహరి కథలు అనే అమృతాన్ని పానం చేయడం; బ్రహ్మచర్యవ్రతంబును= బ్రహ్మచర్యాన్ని వ్రతంగా పాటించడం; విషయంబులన్= ఇంద్రియ సుఖాలను; మనంబు= మనస్సులో; చేరకుండుటయు= చేరనీయకుండా ఉండడం; సాధుసంగంబును= సాధువులతో కలసి ఉండడం; సజ్జనమైత్రియు= సజ్జనులతో స్నేహం కలిగి ఉండడం; వినయ సంపత్తియు= వినయ సంపద; శుచిత్వంబును= శుచిగా ఉండడం; తపంబును= తపస్సు; క్షమయున్= ఓర్పు; మౌనవ్రతంబును= మౌనవ్రతం; వేదశాస్త్ర+అధ్యయన= వేదశాస్త్రాలను చదవడం; తద్+అర్థ+ అనుష్ఠానంబులును= వాటి అర్థాలను పాటించడం; అహింసయున్= హింసచేయకుండా ఉండడం; సుఖదుఃఖ+ఆది+ద్వంద్వ= సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలను; సహిష్ణుతయున్= ఓర్చుకోవడం; ఈశ్వరుని= భగవంతుని; సర్వగతునిన్+కాన్= అంతటా ఉన్నవాడుగా; భావించుటయును= భావించడం; ముముక్షుత్వంబును= మోక్షేచ్ఛ; జనసంగవర్జనంబును= జనసాంగత్యాన్ని వదలడం; వల్కల+ఆది= నారచీరలు మొదలైన వాటిని; ధారణంబును= ధరించడం; యదృచ్ఛాలాభ= తనంత తానుగా లభించినదానితో; సంతుష్టియున్= సంతృప్తి పడడం; వేదాంతశాస్త్ర+అర్థ= వేదాంతశాస్త్రం యొక్క అర్థాలను; జిజ్ఞాసయును= తెలుసుకోవాలనే కోరిక; దేవతా+అంతర= ఇతర దేవతల; నిందావర్జనంబును= నిందను పరిహరించడం, చేయకుండా ఉండడం; కరణత్రయ= మనోవాక్కాయాల విషయంలో; శిక్షణంబును= శుద్ధి కలిగి ఉండడం; సత్యవాక్యతయు= సత్యమునే పలకడం; శమదమ+ఆది= శమం దమం మొదలైన; గుణ= గుణాలు; విశిష్టత్వంబును= విశేషంగ కలిగి ఉండడం; గృహ+ఆరామ= ఇల్లు, తోటలు; క్షేత్ర= పొలాలు; కళత్ర= భార్య; పుత్ర= సంతానం; విత్త+ఆదులన్= ధనం మొదలైన వాటిని; హరికిన్+అర్పణంబు+చేయుటయున్= శ్రీహరికి అర్పించడం; ఇతర దర్శన= భక్తులు కానివారిని దర్శించడం; వర్జనంబు+చేయుటయును; విడనాడడం అనగా దర్శించకుండా ఉండడం; భాగవత+ఉత్తమ= ఉత్తములైన భాగవతుల; ధర్మంబులు= ధర్మాలు; అనిచెప్పి; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** సూర్యోదయ సూర్యాస్తమయంతో ప్రతిరోజూ మానవుల ఆయుస్సు తగ్గిపోతూ ఉంటుంది. శరీరంపైన, భార్యపైన, స్నేహితులపైన, సోదరులపైన నాది, నావారు అనే మమకారంతో కట్టువడి ఆ బంధాన్ని వదిలించుకొనే ఉపాయం కనపడక, సంసారమనే చీకటిలో మునిగి, భూతభవిష్యత్కాలాలు తెలియక గుడ్లగూబలవలె పుట్టుక, ముసలితనం, రోగాలు, ఆపదలు, చావులు పొందుతూ శరీరమే మేలనుకొంటూ ఉంటారు. ప్రమోదమూ, మోహమూ అనే మద్యపానంతో మదించినవారై, ఇంద్రియ విషయాసక్తులై తమను తాము తెలుసుకోలేక విరక్తిమార్గం తెలియక ప్రవర్తిస్తూ ఉంటారు. అటువంటి మూర్ఖులైన మనుష్యుల సమీపానికి పోకుండా, పూర్తిగా శ్రీమన్నారాయణునిమీదే భక్తిభావం కలిగిన సద్గురువును నిత్యమూ పూజించి ఉత్తమ భాగవత ధర్మాలను ఆచరించాలి. ఆ భాగవత ధర్మాలు ఇవి :

1) సత్త్వగుణం కలిగి ఉండడం, 2) అన్ని ప్రాణులమీద దయగలిగి ఉండడం, 3) శ్రీహరికథలు అనే అమృతాన్ని పానం చేయడం, 4) బ్రహ్మచర్య వ్రతం అవలంబించడం, 5) ఇంద్రియ సుఖాలను మనస్సులో చేరనీయకుండా ఉండడం,

6) సాధువులతో సహవాసం చేయడం, 7) సజ్జనులతో స్నేహం కలిగి ఉండడం, 8) వినయసంపద కలిగి ఉండడం, 9) శుచిగా ఉండడం, 10) తపోలక్షణం కలిగి ఉండడం, 11) ఓర్పు కలిగి ఉండడం, 12) మౌనవ్రతం పాటించడం, 13) వేదశాస్త్రాలను చదివి ఆ యర్థాలను అనుష్ఠించడం, 14) హింసకు పూనుకోకుండా ఉండడం, 15) సుఖదుఃఖాది ద్వంద్వాలను సహించడం, 16) భగవంతుడు అంతటా ఉన్నట్లు భావించడం, 17) మోక్షేచ్ఛ కలిగి ఉండడం, 18) జన సాంగత్యాన్ని వదలడం, 19) నారచీరలు మొదలైనవి ధరించడం, 20) తనంత తానుగా లభించిన దానితో తృప్తిపడడం, 21) వేదాంత శాస్త్రార్థాలను తెలుసుకోవాలనే కోరిక ఉండడం, 22) ఇతరదేవతలను నిందించకుండా ఉండడం, 23) మనోవాక్కాయాలతో శుద్ధి కలిగి ఉండడం, 24) సత్యమే మాట్లాడడం, 25) శమదమాది గుణాలు కలిగి ఉండడం, 26) ఇల్లు, తోటలు, పొలాలు, భార్య, సంతానం, ధనం మొదలైన వాటిని పరమేశ్వరార్పణంగా భావించడం, 27) భక్తులు కానివారిని దర్శించకుండా ఉండడం.

**క. 'హరిదాసుల మిత్రత్వము, మురరిపుకథ లెన్నికొనుచు మోదముతోడన్**
**భరితాశ్రుపులకితుండై, పురుషుఁడు హరిమాయ గెల్చు భూపవరేణ్యా!' 55**

**ప్రతి :** భూపవరేణ్యా= మహారాజా!; హరిదాసుల= శ్రీహరిభక్తుల; మిత్రత్వము= స్నేహం చేస్తూ; మురరిపుకథలు+ ఎన్నికొనుచున్= మురాసురుని శత్రువైన శ్రీకృష్ణునివృత్తాంతాలను తలచుకొంటూ, మోదముతోడన్= సంతోషంతో; భరిత+అశ్రు= నిండిన ఆనందబాష్పాలతో; పులకితుండు+ఐ= పులకితమైన శరీరం కలవాడై; పురుషుఁడు= మానవుడు; హరిమాయ= విష్ణుమాయను; గెల్చున్= గెలుస్తాడు.

**తా :** మహారాజా! మానవుడు శ్రీహరి భక్తులతో స్నేహంచేస్తూ, శ్రీహరి వృత్తాంతాలను మననం చేసుకొంటూ, ఆనందబాష్పాలు నిండిన కళ్లతో శరీరం పులకితమవుతుండగా విష్ణుమాయను గెలుస్తాడు.

**విశే :** భాగవతుడికి శ్రీహరి కథలు మదిలో మెదలగానే శరీరం పులకలు రేగుతుంది. ఆ కథలను స్మరిస్తూ ఒకప్పుడు ఏడుస్తూ, మరొకప్పుడు నవ్వుతూ లౌకిక వ్యక్తులకంటె భిన్నమైన ప్రవర్తన కలిగి ఉంటాడు. ఇది కూడా భాగవతునిలక్షణమే.

**వ. అనిన రాజేంద్రుండు వారల కిట్లనియె. 'భాగవతులారా! సకలలోకనాయకుం డగు నారాయణుం డనంబరఁగిన పరమాత్ముని ప్రభావంబు వినవలతు; నానతిం డనినఁ బిప్పలాయనుం డిట్లనియె. 56**

**ప్రతి :** అనినన్= అని చెప్పగా; రాజ+ఇంద్రుండు= విదేహచక్రవర్తి; వారలకున్+ఇట్లు+అనియెన్= వాళ్లతో ఇలా అన్నాడు; భాగవతులారా!; సకలలోక నాయకుండు+అగు= అన్నిలోకాలకు ప్రభువైన; నారాయణుండు+అనన్+పరఁగిన= నారాయణుడనే పేరుతో ప్రసిద్ధుడైన; పరమాత్ముని; ప్రభావంబున్= మహిమను; వినవలతును= వినాలని అనుకొంటున్నాను; ఆనతిండు+అనినన్= ఆనతీయండి అనగా; పిప్పలాయనుండు= పిప్పలాయనుడనే ముని; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

**తా :** అని చెప్పగా విదేహచక్రవర్తి వాళ్లతో ఇలా అన్నాడు. భాగవతులారా! అన్ని లోకాలకు ప్రభువై నారాయణుడు అనే పేరుతో ప్రసిద్ధుడైన పరమాత్ముని మహిమను వినాలనుకొంటున్నాను ఆనతీయండి అని అడుగగా పిప్పలాయనుడు అనే ముని ఇలా చెప్పాడు.

**సీ. నరవర! విను జగన్నాథునిచారిత్ర మెఱిఁగింతు నీమది కింపు మిగుల**
**లసదుద్భవస్థితిలయకారణం బయి దేహేంద్రియాదులఁ దిరము గాఁగఁ**

జొనుపు నెప్పుడు పరంజ్యోతిస్స్వరూపంబు జ్వాలల ననలుండుఁ జనని పగిది
నింద్రియంబులు నాత్మ నెనయవు శబ్దంబు పొరయక సుషిరంబుఁ బొందు సత్య

**తే.** మనఁగ సత్త్వరజస్తమోమయగుణంబు, మహదహంకారరూపమై మహిమ వెలయు
చేతనత్వంబు గలదేని జీవ మందు, రిదియ సదసత్స్వరూపమై యెన్నఁబడును. **57**

**ప్రతి :** నరవర= రాజా!; జగత్+నాథుని= లోకేశ్వరుని; చారిత్రమున్= చరిత్రను; నీమదికిన్= నీ మనస్సుకు; ఇంపుమిగులన్= ఇష్టం అతిశయించేటట్లు; ఎఱిఁగింతున్ (ఎఱిగించుదును)= తెలియజేస్తాను; విను= వినుము; లసత్= ప్రకాశించే; ఉద్భవ= సృష్టి; స్థితి; లయ= లయలకు; కారణంబు+అయి= కారణమైన; పరంజ్యోతి స్వరూపంబు= పరంజ్యోతి స్వరూపం లేదా పరబ్రహ్మం; దేహ+ఇంద్రియ+ఆదులన్= దేహంలో, ఇంద్రియాదులలో; తిరము+కాన్+కన్= స్థిరంగా; చొనుపున్= ప్రవేశిస్తుంది; జ్వాలలన్= మంటలలో; అనలుండున్= అగ్నికూడా; చనని పగిదిన్= ప్రవేశింపలేని విధంగా; ఇంద్రియములు= ఇంద్రియాలు; ఆత్మన్+ఎనయవు= ఆత్మను పొందలేవు; శబ్దంబు= నాదం; సుషిరంబున్= పిల్లన గ్రోవిని; పొరయక+పొందున్= ప్రవేశించలేదు; సత్యము+అనన్+కన్= సత్యమేమిటంటే; సత్త్వ+రజస్+తమస్+మయ గుణంబులు= సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణత్రయం; మహత్+అహంకారరూపము+ఐ= మహదహంకారరూపమై; మహిమవెలయు= మహిమ వ్యక్తమయ్యే విధంగా; చేతనత్వంబు= చైతన్యం; కలదు+ఏనిన్= కలిగినట్లైతే, చైతన్యంతో కలిస్తే; జీవము+అందురు= జీవమంటారు; ఇది+అ= ఇదే; సత్+అసత్+స్వరూపము+ఐ= సత్తు, అసత్తు స్వరూపంగా; ఎన్నన్+పడును= ఎన్నబడుతుంది.

**తా :** రాజా! నీమదికి ఇంపు కలిగేవిధంగా లోకేశ్వరుని చరిత్రను తెలియజేస్తాను. విను. సృష్టి స్థితి లయాలకు కారణమైన స్వయం ప్రకాశం కల పరంజ్యోతి స్వరూపం లేదా పరబ్రహ్మం దేహేంద్రియాలలో స్థిరంగా ప్రవేశిస్తుంది. మంటలు అగ్నిలో ప్రవేశింపలేనట్లు ఇంద్రియాలు ఆత్మను పొందలేవు. నాదం పిల్లనగ్రోవిని లోగొనలేదు కదా! సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలు మహదహంకార రూపమై చైతన్యంతో కలిస్తే జీవమంటారు. ఇదే సత్తు, అసత్తు స్వరూపంగా ఎన్నబడుతుంది.

**విశే :** సత్త్వరజస్తమస్సులనే మూడు గుణాలు కలది ఒక తత్త్వం. ఆ తత్త్వం సకలపదార్థాలకు ఆధారం. దానినుండి వెలువడినవి అహంకారం, మహత్తు అనేవి. ఆ మహదహంకారం నుండి సకల భూతాలు, ఇంద్రియాలు వెలువడతాయి. వీటిలో చైతన్యరూపం కలిస్తే జీవం ఏర్పడుతుంది. ఆ చైతన్యరూపమే పరబ్రహ్మం. జీవుడు కర్మలను ఆచరించి ఆ ఫలాలకు భోక్త అవుతున్నాడు. చేతనాచేతనాలనే సత్తు, అసత్తు అంటారు. రెంటిలోను పరబ్రహ్మమే వ్యాపించి ఉంటుంది.

**వ.** దీనికిం బెక్కైనది పరమాత్మగా నెఱింగి కమలసంభవాదులు నుతియింతు; రిట్టి పరమాత్మ స్థావర జంగమంబుల నధిష్ఠించి వృద్ధిక్షయంబులం బొందక నిమిత్తమాత్రంబునం దరులతాదులందు జీవంబు లేక తదంతరస్థుండై వర్తించు; నంత సర్వేంద్రియావృతం బైన యాకారంబు నష్టంబైన మనంబునుం బాసి శ్రుతివిరహితుండై తిరుగుచుండు; నిర్మలజ్ఞానదృష్టి గలవానికి భానుప్రభాజాలంబు దోఁచిన క్రియను, సుజ్ఞానవంతుండు హరిభక్తిచేత గుణకర్మార్థంబులైన చిత్తదోషంబులు భంజించి భగవత్సదనంబు సేరు' ననిన విని రా జిట్లనియె. **58**

**ప్రతి :** దీనికిన్= ఇందులకు; పెక్కు+ఐనది= అతీతమైనది; పరమాత్మ+కాన్+ఎఱింగి= పరమాత్మగా తెలుసుకొని; కమలసంభవ+ఆదులు= బ్రహ్మ మొదలైనవారు; నుతియింతురు= స్తుతిస్తారు; ఇట్టి పరమాత్మ= ఇటువంటి పరమాత్మ; స్థావర= ఉన్నచోటునుండి కదలని; జంగమంబులన్= కదిలే వస్తువులను; అధిష్ఠించి= ఆశ్రయించి; వృద్ధి= పెరగడం; క్షయంబులన్= తరుగడం; పొందక= పొందకుడా; నిమిత్త మాత్రంబునన్= నిమిత్తమాత్రంచేతనే; తరు= చెట్లు; లతా+ఆదులందున్= తీగలు మొదలైనవాటిలో; జీవంబులేక= ప్రతిస్పందన లేకుండా; తద్+అంతరస్థుండు+ఐ= వాటిలోపలనే ఉంటూ; వర్తించున్= ప్రవర్తిస్తూ ఉంటాడు; అంతన్= పిమ్మట; సర్వ+ఇంద్రియ+ఆవృతంబు+ఐన= ఎల్ల ఇంద్రియాలచేత ఆవరింపబడిన; ఆకారంబు= రూపం; నష్టంబు+ఐనన్= నశించగా; మనంబునున్+పాసి= మనస్సును కూడా విడిచి; శ్రుతి విరహితుండు+ఐ= వేదబాహ్యుడై; తిరుగుచున్+ఉండున్= తిరుగుతూ ఉంటాడు; నిర్మల= స్పష్టమైన; జ్ఞానదృష్టి+ కలవానికిన్= జ్ఞానదృష్టి కలవాడికి; భాను= సూర్యునియొక్క; ప్రభాజాలంబు= కాంతి సమూహం; తోఁచిన క్రియను= కనిపించిన విధంగా; సుజ్ఞానవంతుండు= మంచి జ్ఞానం కలవాడు; హరిభక్తిచేతన్= విష్ణుభక్తి చేత; గుణకర్మ+అర్థములు+ ఐన= గుణకర్మార్థాలైన; చిత్తదోషంబులు= మనస్సులోని తప్పులను; భంజించి= నశింపజేసుకొని; భగవత్+సదనంబు+చేరున్= భగవంతుని సన్నిధి చేరుతాడు; అనినన్= అని చెప్పగా; విని; రాజు+ఇట్లు+అనియెన్= రాజు ఇలా అన్నాడు.

**తా :** జీవభావం కంటె అతీతమైన దాన్ని పరమాత్మగా తెలుసుకొని బ్రహ్మ మొదలైనవారు నుతిస్తారు. ఇటువంటి పరమాత్మ స్థిర చరాలలో ఉండి వృద్ధిక్రయాలు పొందకుండా, నిమిత్తమాత్రంచేత చెట్లు, తీగలు మొదలైన వానిలో ప్రతిస్పందన లేకుండా ఉంటాడు. పిమ్మట ఎల్ల ఇంద్రియాలచేత ఆవరింపబడిన ఆకారం పోగా మనస్సును వదలి వేదబాహ్యుడై తిరుగుతూ ఉంటాడు. స్పష్టమైన జ్ఞానదృష్టి గలవాడు సూర్యకాంతిసమూహాన్ని దర్శించినట్లు మంచి జ్ఞానం కలవాడు. విష్ణుభక్తిచేత గుణాలవల్ల, కర్మలవల్ల కలిగిన మనస్సులోని తప్పులను నశింపజేసుకొని, భగవంతుడిసన్నిధిని చేరుకోగలుగుతాడు. అని చెప్పగా విని విదేహరాజు ఇలా అన్నాడు.

**క. 'పురుషుం డేయే కర్మము, పరువడిఁ గావించి పుణ్యపరుఁడై మనుఁ? దా**
**దురితములుఁ దొరఁగి మురరిపు, చరణయుగం బెట్లు సేరు? సన్మునివర్యా!' 59**

**ప్రతి :** సత్+మునివర్యా= మునిశ్రేష్ఠుడా!; పురుషుండు= మనుష్యుడు; ఏ+ఏ+కర్మము= ఏయే పనినీ; పరువడిన్= క్రమంగా; కావించి= చేసి; పుణ్యపరుఁడు+ఐ= పుణ్యాత్ముడై; మనున్= జీవిస్తాడు; తాన్= తాను; దురితములున్= పాపాలను; తొరఁగి= పోగొట్టుకొని; మురరిపు= విష్ణువుయొక్క; చరణయుగంబు= అడుగుల జంటను; ఎట్లు+చేరున్= ఎలా చేరుకుంటాడు.

**తా :** ఓ మునిశ్రేష్ఠా! పిప్పలాయనా! మనిషి ఏయే పనులు (కర్మలు) క్రమంగా చేసి పుణ్యాత్ముడై జీవిస్తాడు? తాను పాపాలను పోగొట్టుకొని శ్రీహరి చరణాల్ని చేరుకుంటాడు?

**వ. అనిన విని యం దావిర్హోత్రుం డి ట్లనియెఁ; 'గర్మాకర్మ వికర్మ ప్రతిపాదకంబు లగు శ్రుతివాదంబు లలౌకికవర్ణితంబు; లట్టి యామ్నాయంబులు సర్వేశ్వరస్వరూపంబులు గాన విద్వాంసులు నెఱుంగ లే; రవి కర్మాచారంబు లనంబడు; మోక్షంబుకొఱకు నారాయణభజనంబు పరమపావనంబు; వేదోక్తంబుల నాచరింపక ఫలంబులకు వాంఛ సేయువార లనేక జన్మాంతరంబులం బడయుదురు; మోక్షంబు నపేక్షించువాఁడు విధిచోదిత**

**మార్గంబున హరిం బూజింపవలయు; నట్టి పూజాప్రకారం బెట్లనినఁ, బవిత్రగాత్రుం డయి జనార్దనుసన్నిధిం బూతచిత్తుండై, షోడశోపచారంబులఁ జక్రధరు నారాధించి, గంధపుష్పధూపదీప నైవేద్యంబులు సమర్పించి, సాష్టాంగదండప్రణామంబు లాచరించి, భక్తిభావనావిశేషుండగు నతండు హరిం జేరు' నని చెప్పిన విని విదేహుం డిట్లనియె; 'నీశ్వరుం డే యే కర్మంబుల నాచరించె, నంతయు నెఱింగింపు' మనిన ద్రమిళుం డిట్లనియె. 60**

**ప్రతి :** అనినన్= విదేహరాజు ఆవిధంగా అనగా; విని; అందున్= వారిలో; ఆవిర్హోత్రుండు= ఆవిర్హోత్రుడు అనే ముని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; కర్మ+అకర్మ= కర్తవ్య కర్మ, కర్మను చేయకుండడం; వికర్మ= నిషిద్ధ కర్మచేయడం; ప్రతిపాదకంబులు+అగు= అనేవాటిని తెలిపేవి అయిన; శ్రుతివాదంబులు= వేదాలు ప్రకటించే అభిప్రాయాలు; అలౌకిక వర్ణితంబులు= లోకాతీతులచే వర్ణింపబడేవి; అట్టి+ఆమ్నాయంబులు= అటువంటి వేదాలు; సర్వ+ఈశ్వర స్వరూపంబులు= పరమేశ్వరుని స్వరూపాలు; కాన= కాబట్టి; విద్వాంసులు= పండితులు కూడా; ఎఱుంగన్+లేరు= తెలుసుకో జాలరు; అవి= ఆ వేదాలు; కర్మ+ఆచారంబులు+అనన్+పడున్= కర్మాచారాలనిపించుకొంటాయి; మోక్షంబు కొఱకున్= ముక్తికోసం, నారాయణ భజనంబు= శ్రీమన్నారాయణునిసేవ; పరమ= మిక్కిలి; పావనంబు= పవిత్రమైంది; వేద+ఉక్తంబులన్= వేదాలు చెప్పినవాటిని; ఆచరింపక= చేయకుండా; ఫలంబులకున్= ఫలితాలకు; వాంఛ+చేయువారలు= కాంక్ష చేసేవాళ్లు; అనేకజన్మ+అంతరంబులన్= పెక్కు పుట్టువులను; పడయుదురు= పొందుతారు; మోక్షంబున్+అపేక్షించువాఁడు= ముక్తిని కోరేవాడు; విధిచోదిత= శాస్త్రం చెప్పిన; మార్గమునన్= మార్గంలో; హరిన్= విష్ణువును; పూజింపవలయున్= పూజించాలి; అట్టి= అటువంటి; పూజాప్రకారంబు= పూజావిధానం; ఎట్లు+అనినన్= ఎలా అంటే; పవిత్రగాత్రుండు+అయి= పరిశుద్ధమైన దేహం కలిగి; జనార్దనుసన్నిధిన్= విష్ణుసన్నిధానంలో; పూతచిత్తుండు+ఐ= పవిత్రమైన మనస్సు కలవాడై; షోడశ+ఉపచారంబులన్= పదహారు సేవలతో; చక్రధరున్+ఆరాధించి= చక్రం ధరించిన శ్రీహరిని పూజించి; గంధ= గంధం; పుష్ప= పూలు; ధూప= సువాసన నిచ్చే సుగంధ ద్రవ్యం; దీప= దీపం; నైవేద్యంబు= దేవతలకిచ్చే నివేదనలను; సమర్పించి= సమర్పణ చేసి; స+అష్ట+అంగదండ ప్రణామంబులు= సాగిలబడి ఎనిమిది అంగాలు నేలకు సోకేటట్లు చేసే నమస్కారాలు; ఆచరించి= చేసి; భక్తిభావనా విశేషుండు+అగు+అతండు= భక్తిభావంతో నిండిన మనస్సు గలవాడు; హరిన్+చేరున్= విష్ణువును చేరుతాడు; అని చెప్పినన్= అని చెప్పగా; విని; విదేహుండు= విదేహరాజు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; ఈశ్వరుండు= భగవంతుడు; ఏ+ఏ కర్మంబులన్= ఏయే పనులను, లీలలను; ఆచరించెన్= చేశాడో; అంతయున్= అంతా, పూర్తిగా; ఎఱింగింపుము+అనినన్= తెలుపుమనగా; ద్రమిళుండు+ఇట్లు+అనియెన్= ద్రమిళుడు అనే ముని ఇలా చెప్పాడు.

**తా :** అని విదేహరాజు అనగా విని ఆవిర్హోత్రుడు అనే ముని ఇలా అన్నాడు. కర్తవ్య కర్మలు చేయడం, కర్మలను చేయకుండడం, నిషిద్ధకర్మలు చేయడం అనే వాటిని తెలిపే వేదాలు పరమేశ్వరుని స్వరూపాలు కాబట్టి వాటిని పండితులు కూడా తెలుసుకోలేరు. అవి కర్మాచారాలనిపించుకొంటాయి. పరమ పవిత్రమైన శ్రీహరిసేవ ముక్తిదాయకం. వేదవిధులను ఆచరించకుండా ఫలితాలు కోరే వాళ్లు అనేక జన్మలను పొందుతారు. ముక్తికోరేవాడు శాస్త్రం చెప్పిన విధంగా విష్ణువును పూజించాలి. ఆ పూజావిధానం ఎటువంటి దంటే – పరిశుద్ధమైన దేహంతో భగవంతుని సన్నిధిలో పవిత్రమనస్కుడై పదహారువిధాలైన (షోడశ) సేవలతో చక్రధరుని పూజించి, గంధ పుష్ప ధూప దీప నైవేద్యాలు సమర్పించి, సాష్టాంగదండ

ప్రణామాలు చేసి భక్తిభావంతో నిండిన మనస్సుగలవాడు హరిని చేరుతాడు – అని ఆవిర్హోత్రుడు చెప్పగా విని విదేహుడు 'భగవంతుడు ఏయే కర్మలు లేదా లీలలు ఆచరించాడో అంతా తెలుపవలసింది' అనగా ద్రమిళుడనే ముని ఇలా అన్నాడు.

**విశే :** జనార్దన శబ్దానికి ప్రళయకాలంలో జనులందరిని పీడించువాడు అని వ్యుత్పత్త్యర్థం.

షోడశోపచారాలు – 1) ఆవాహనం 2) ఆసనం 3) పాద్యం 4) అర్ఘ్యం 5) ఆచమనీయం 6) అభిషేకం 7) వస్త్రం 8) యజ్ఞోపవీతం 9) గంధం 10) పుష్పం 11) ధూపం 12) దీపం 13) నైవేద్యం 14) తాంబూలం 15) ప్రదక్షిణం 16) నమస్కారం. పూజాసమయంలో ఆచరించవలసినవి ఇవన్నీ.

**క. తారల నెన్నఁగ వచ్చును; భూరేణుల లెక్కవెట్టఁబోలును ధాత్రిన్;**
**నారాయణగుణకథనము, లారయ వర్ణింపలేరు హరబ్రహ్మాదుల్. 61**

**ప్రతి :** తారలన్= నక్షత్రాలను; ఎన్నన్+కన్+వచ్చును= లెక్కపెట్టవచ్చును; ధాత్రిన్= భూమిపైగల; భూరేణువులన్= దుమ్ము కణాలను; లెక్కపెట్టన్+పోలును= లెక్కబెట్టడానికి సాధ్యమవుతుంది. ఆరయన్= చూడగా; హరబ్రహ్మ+ఆదుల్= ఈశ్వరుడు బ్రహ్మ మొదలైనవారు; నారాయణ= శ్రీమన్నారాయణుని; గుణకథనములు= గుణాల్ని చెప్పడం; వర్ణింపన్= వర్ణించడం; లేరు= చేయలేరు.

**తా :** ఆకాశంలోని నక్షత్రాలను (చుక్కలను) లెక్కబెట్టవచ్చును. భూమిపై గల దుమ్ముకణాలను కూడా లెక్కబెట్టడానికి సాధ్యమవుతుంది. కాని పరిశీలించి చూడగా బ్రహ్మరుద్రాదులు కూడా శ్రీమన్నారాయణుని గుణవిశేషాలను వర్ణించలేరు.

**వ. అట్లు గావున నాత్మసృష్టంబైన పంచభూతనికరంబును పురం బొనరించి, యందు నిజాంశంబునం బ్రవేశించి, సగుణనిష్ఠుండై నారాయణాభిధానంబు గల ఋషీశ్వరుండగు పరమేశ్వరుండు వెలుఁగొందె; నతని దశేంద్రియంబులచేఁ బాలితంబులైన దేహంబులు ధరించి, జగద్రక్షకత్వ సంహారకత్వాది గుణంబులు గలుగుటం జేసి గుణనిష్ఠుండయి రజస్సత్త్వతమోగుణంబుల బ్రహ్మవిష్ణురుద్రమూర్తు లనంబరఁగి, త్రిగుణాత్మకుం డనంబడు నారాయణాఖ్యునిచరిత్రం బెఱింగించెద; నాకర్ణింపుము. 62**

**ప్రతి :** అట్లు+కావునన్= అందుచేత; ఆత్మ సృష్టంబు+ఐన= తాను సృజించిన; పంచభూత నికరంబును= పంచభూతాల సమూహాన్ని; పురంబు+ఒనరించి= శరీరంగాచేసి; అందున్= ఆ శరీరంలో; నిజ+అంశంబునన్= తన అంశతో; ప్రవేశించి= చొచ్చి; సగుణనిష్ఠుండు+ఐ= సగుణమూర్తియై; నారాయణ+అభిధానంబు+కల= నారాయణుడు అనే పేరుగల; ఋషి+ఈశ్వరుండు+అగు= మునివర్యుడైన; పరమ+ఈశ్వరుండు= పరమేశ్వరుడు; వెలుఁగు+ఒందెన్= ప్రకాశించాడు; అతని= ఆ పరమేశ్వరుని; దశ+ఇంద్రియంబులచేన్= పది ఇంద్రియాలచేత; పాలితంబులు+ఐన= పాలింపబడే; దేహంబులు= శరీరాలు; ధరించి= తాల్చి; జగత్+రక్షకత్వ= లోకాన్ని రక్షించడం; సంహారకత్వ= సంహరించడం; ఆది గుణంబులు; మొదలైన గుణాలు; కలుగుటన్+చేసి= ఉండడంచేత; గుణనిష్ఠుండు+అయి= గుణాలు కలిగి; రజస్+సత్త్వ+తమస్+గుణంబులన్= రజస్సు, సత్త్వం, తమస్సు అనే త్రిగుణాలతో; బ్రహ్మవిష్ణురుద్రమూర్తులు+అనన్+పరఁగి= బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు అనే పేర్లతో ఒప్పి; త్రిగుణ+ఆత్మకుండు+అనన్+పడు= త్రిగుణాత్మకుడనబడే; నారాయణ+ఆఖ్యునిన్= నారాయణుడు అనే పేరుగల వాని; చరిత్రంబు+ఎఱింగించెదన్= చరిత్ర చెపుతాను; ఆకర్ణింపుము= విను.

**తా :** అందుచేత తాను సృజించిన (సృష్టించిన) పంచభూతసమూహాన్ని శరీరంగా చేసి; దానిలో తన అంశతో ప్రవేశించి, సగుణాకారుడై నారాయణుడు అనే పేరుగల మునివర్యుడైన పరమేశ్వరుడు ప్రకాశించాడు. ఆయన పది ఇంద్రియాలతో నిర్మితాలైన శరీరాలను ధరించి, జగత్తును రక్షించడం, సంహరించడం మొదలైన గుణాలుండడంచేత రజస్సు, సత్త్వం, తమస్సు అనే త్రిగుణాలతో బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు అనే పేర్లతో ఒప్పుతుంటాడు. త్రిగుణాత్మకుడనబడే ఆ నారాయణునిచరిత్ర చెపుతాను. విను.

**విశే :** భూమి, నీరు అగ్ని, వాయువు, ఆకాశం అనే ఐదూ పంచభూతాలు. ఈ పంచభూతాలతో శరీరం నిర్మించ బడుతుంది. శరీరమే పురం. దేవుడు అందులో ప్రవేశిస్తాడు కాబట్టి పురుషుడు అనేపేరు వచ్చింది. ఈ పురుషుడే పరమాత్మ.

**క. ధర్ముండు దక్షపుత్త్రిక, నిర్మలమతిఁ బెండ్లియాడి నెఱిఁ బుత్త్రుని స**
**త్కర్ముని నారాయణ ఋషి, నర్మిలిఁ గనె నతఁడు బదరికాశ్రమమందున్. 63**

**ప్రతి :** ధర్ముండు= బ్రహ్మమానస పుత్రులలో ఒకడైన ధర్ముడు; నిర్మలమతిన్= స్వచ్ఛమైన మనస్సుగలదైన; దక్షపుత్త్రికన్= దక్షప్రజాపతి కుమార్తెను; పెండ్లి+ఆడి= వివాహం చేసుకొని; నెఱిన్= సొంపుగా; అతఁడు= ఆ యముడు; బదరికా+ఆశ్రమము+అందున్= బదరిక అనే పేరుగల ఆశ్రమంలో; పుత్త్రునిన్= కొడుకును; సత్+కర్మునిన్= మంచిపనులు చేసేవాడిని; నారాయణ ఋషిన్= నారాయణుడు అనే పేరుగల మునిని; అర్మిలిన్= కోరికతో; కనెన్= కన్నాడు.

**తా :** బ్రహ్మమానస పుత్రులలో ఒకడైన ధర్ముడు స్వచ్ఛమైన మనస్సు కలదైన దక్షప్రజాపతి కుమార్తెను పెండ్లాడి బదరికాశ్రమంలో సత్కర్ముడైన నారాయణఋషిని పుత్రుడుగా పొందాడు.

**విశే :** బదరి అంటే రేగుచెట్టు. రేగుచెట్లు విస్తారంగా ఉండడంవల్ల నరనారాయణులు తపస్సుచేసిన ఆశ్రమానికి బదరికాశ్రమమని పేరు.

**తే. అట్టి నారాయణాహ్వయుండైన మౌని, బదరికాశ్రమమందు నపారనిష్ఠఁ**
**దపముఁగావింప బలభేది దలఁకి మదిని, మీనకేతను దివిజకామినులఁ బనిచె. 64**

**ప్రతి :** అట్టి= అటువంటి; నారాయణ+ఆహ్వయుండు+ఐన= నారాయణుడు అనే పేరుగల; మౌని= ముని; బదరికాశ్రమము+అందున్= బదరికాశ్రమంలో; అపారనిష్ఠన్= అంతంలేని నియమంతో; తపమున్+కావింపన్= తపస్సు చేయగా; బలభేది= ఇంద్రుడు; మదినిన్= మనస్సులో; తలఁకి= భయపడి; మీనకేతనున్= మన్మథుడిని; దివిజకామినులన్= దేవవేశ్యలను; పనిచెన్= పంపినాడు.

**తా :** అటువంటి నారాయణముని బదరికాశ్రమంలో అంతులేని నియమంతో తపస్సుచేశాడు. ఇంద్రుడు మనస్సులో భీతిచెంది అతని తపస్సును భగ్నం చేయడానికి మన్మథుణ్ణి, దేవ వేశ్యల్ని పంపాడు.

**విశే :** బలభేది= బలాసురుని సంహరించినవాడైన ఇంద్రుడు; మన్మథుని జెండాపై చేపబొమ్మ ఉండడంవల్ల మన్మథుడు మీనకేతనుడు.

**వ. వారు నారాయణాశ్రమంబునకు నతని తపోవిఘ్నంబు సేయ వచ్చు నప్పు డవ్వనంబు సాల రసాల బిల్వ కదళీ ఖర్జూర జంబు జంబీర చందన పున్నాగ మందారాది వివిధ వృక్ష నిబిడంబును, పుష్పఫల భరిత**

**శాఖావనమ్ర తరులతా బృందంబును, మాధవీ కుంజమంజరీ పుంజ మకరంద పానమత్త మధుకర నికర ఝుంకారరవ ముఖరిత హరిదంతరంబును, గనక కమల కహ్లార విలసత్సరో విహరమాణ చక్రవాక బక క్రౌంచ మరాళదంపతి మండల మండితంబును, మృణాళ భోజనాసక్త సారసచయ చంచూపుట విపాటిత కమలముకుళ కేసర విసర వితత ప్రశస్త సరోవరంబునునై వెలయు నవ్వనంబున నిందువదన లందంద మందగమనంబులం జెందు ఘర్మజలబిందుబృందంబులు నఖాంతంబుల నోసరింపుచు డాయం జను నప్పుడు.** **65**

**ప్రతి :** వారు= మన్మథుడూ, దేవవేశ్యలూ; నారాయణ+ఆశ్రమంబునకున్= నారాయణముని ఆశ్రమానికి; అతని= ఆ నారాయణముని; తపస్+విఘ్నంబు+చేయన్= తపస్సును చెడగొట్టడానికి; వచ్చు+అప్పుడు= వచ్చే సందర్భంలో; ఆ+వనంబు= ఆ తోట; సాల= మద్ది; రసాల= తీయమామిడి; బిల్వ= మారేడు; కదళీ= అరటి; ఖర్జూర; జంబు= నేరేడు; జంబీర= నిమ్మ; చందన= మంచిగంధం; పున్నాగ= సురపొన్న; మందార; ఆది= మొదలైన; వివిధ= రకరకాల; వృక్షనిబిడంబును= చెట్లతో దట్టమైందీ; పుష్ప= పూలతోను; ఫల= పండ్లతోను; భరిత= నిండిన; శాఖా+అవనమ్ర= కొమ్మలచే వంగిన; తరులతా బృందంబును= చెట్ల, తీగెల సమూహంకలదీ; మాధవీ= గురివెంద; కుంజ= పొదల; మంజరీపుంజ= పుష్పసమూహాల; మకరందపానమత్త= మకరందాన్ని తాగడంచేత మదించిన; మధుకర= తుమ్మెదల; నికర= సమూహంయొక్క; ఝుంకారరవ= ఝుం అనే నాదంచేత; ముఖరిత= ప్రతిధ్వనించే; హరిత్+అంతరంబును= దిక్కుల లోపలి భాగాలు కలదీ; కనక కమల= బంగారుపద్మాలతో; కహ్లార= కలువలతో; విలసత్= ప్రకాశించే; సరస్+విహరమాణ= సరస్సులో విహరిస్తున్న; చక్రవాక= జక్కవపక్షుల; బక= కొంగల; క్రౌంచ= క్రౌంచపక్షుల; మరాళదంపతి= హంసమిథునాల; మండల= సమూహంచేత; మండితంబును= అలంకరింపబడిందీ; మృణాల= తామరతూండ్లు; భోజన+ఆసక్త= తినడంలో ఆసక్తిగల; సారసచయ= బెగ్గురుపక్షుల సమూహంయొక్క; చంచూపుట= దొప్పలవంటి ముక్కులచేత; విపాటిత= చీల్చబడిన; కమలముకుళ= తామర మొగ్గల; కేసర విసర= కింజల్కాల సమూహంచేత; వితత= వ్యాపించిన; ప్రశస్త= మంచివైన; సరోవరంబును+ఐ= సరస్సులు గలదై; వెలయు= అలరారే; ఆ+వనంబునన్= ఆ తోటలో; ఇందువదనలు= చంద్రముఖులు; అందున్+అందున్+అ= ఎడనెడ; మందగమనంబులన్= మెల్లని నడకలతో; చెందు= చిందే; ఘర్మజలబిందు బృందంబులు= చెమట నీటిబొట్ల సమూహాలను; నఖ+అంతంబులన్= కొనగోళ్లతో; ఓసరింపుచున్= చిమ్ముకుంటూ లేక తొలగిస్తూ; డాయన్+చను+అప్పుడు= సమీపింపబోయే సమయంలో...

**తా :** మన్మథుడు, దేవవేశ్యలు నారాయణముని తపస్సు చెడగొట్టడానికి అతని ఆశ్రమానికి వచ్చారు. అప్పుడు ఆ తోట (తపోవనం) మద్ది, తీయమామిడి, మారేడు, అరటి, ఖర్జూరం, నేరేడు, నిమ్మ, మంచిగంధం, సురపొన్న, మందారం మొదలైన రకరకాల వృక్షాలతో దట్టంగా నిండి ఉన్నది. పూలతో, పండ్లతో నిండి వంగిన కొమ్మలతో కూడి ఉన్నది. గురివెంద పొదల పూలగుత్తుల మకరందం తాగి మదించిన తుమ్మెదలు చేసే ఝుంకారాలతో ప్రతిధ్వనిస్తూ ఉన్నది. బంగారు పద్మాలతో, కలువలతో ప్రకాశించే సరస్సులు జంటలుగా విహరిస్తున్న జక్కవలూ, కొంగలూ, క్రౌంచపక్షులూ, హంసల గుంపులచే అలంకరింపబడి ఉన్నాయి. తామరతూండ్లను తినడంలో ఆసక్తిగల సారసపక్షుల ముక్కులచే చీల్చబడిన తామరమొగ్గలలోని కేసరాలతో భాసించే సరోవరాలు కలిగి ప్రకాశిస్తూ వుంది. అటువంటి తపోవనంలో ఆ చంద్రముఖులు మెల్లగా నడుస్తూ చెమట బిందువులను కొనగోళ్లతో చిమ్ముకుంటూ నారాయణ మహర్షిని సమీపింపబోయేటప్పుడు...

చ. మదనునిబాణజాలముల మగ్నతc బొందక ధైర్యవంతుcడై
ముదితలవాcడిచూపులకు మోహము నొందక నిశ్చలాత్ముcడై
హృదయమునందు నచ్యుతు రమేశు ననంతు జగన్నివాసునిన్
వదలక భక్తి నిల్పుకొని వారికి నిట్లనె మౌని పెంపునన్. 66

ప్రతి : మదనుని= మన్మథునియొక్క; బాణజాలములన్= బాణాల సమూహాలలో; మగ్నతన్+పొందక= మునిగిపోకుండా; ధైర్యవంతుcడు+ఐ= ధైర్యం కలవాడై; ముదితల= స్త్రీల; వాcడి చూపులకున్= పదునైన చూపులకు; మోహమున్+ఒందక= మోహం పొందకుండా; నిశ్చల+ఆత్ముcడై= చలించని మనస్సు గలవాడై; హృదయము+అందున్= మనస్సులో; అచ్యుతున్= అచ్యుతుణ్ణి; రమా+ఈశున్= రమేశుణ్ణి; అనంతున్= అనంతుణ్ణి; జగత్+నివాసునిన్= లోకస్థితుణ్ణి; వదలక= విడువకుండా; భక్తిన్+నిల్పుకొని= భక్తితో నిలుపుకొని; మౌని= నారాయణముని; పెంపుగన్= గొప్పగా; వారికిన్= ఆ వేశ్యలతో; ఇట్లు+అనెన్= ఇలా అన్నాడు.

తా : నారాయణముని మన్మథునిబాణసమూహాలలో మునిగిపోలేదు. ధైర్యం విడువలేదు. ఆ స్త్రీల పదునైన చూపులకు మోహం పొందలేదు. ఏమాత్రం చలించకుండా తన హృదయంలో అచ్యుతుడు, రమేశుడు, అనంతుడు అయిన జగన్నివాసుణ్ణి వదలక నిశ్చలభక్తితో నిలుపుకొని ఆ స్త్రీలతో ఇలా అన్నాడు.

క. 'జంభారిపంపునను మీ, రంభోరుహవదనలార! యరుదెంచితి; రా
శుంభ ద్విహారవాంఛా, రంభంబునc దిరుగుc' డనిన లజ్జించి వెసన్. 67

ప్రతి : జంభ+అరి= జంభుడనే రాక్షసుడిశత్రువైన ఇంద్రుని; పంపునను= ఆజ్ఞచేత; అంభస్+రుహవదనలార= పద్మముఖులారా!; మీరు; అరుదెంచితిరి= వచ్చారు; ఆ శుంభత్= మిక్కిలి ఒప్పుచున్న; విహార= విహరించడంలో; వాంఛా+ఆరంభమునన్= ఆసక్తిగల పూనికతో; తిరుగుcడు+అనినన్= తిరగండి అనగా; లజ్జించి= సిగ్గుపడి; వెసన్= వెంటనే...

తా : ఓ పద్మముఖులారా! మీరు ఇంద్రుడు పంపగా వచ్చారు. విహరించాలని కోరిక ఉంటే ఇక్కడ తిరగండి. అని మహర్షి అనగా వాళ్లు సిగ్గుపడి వెంటనే -

విశే : అంభోరుహం అంటే నీటిలో మొలిచింది పద్మం.

సీ. 'దేవమునీంద్ర! నీ దివ్యచారిత్రంబు నెఱిcగి సన్నుతిసేయ నెవ్వc డోపుc?
బుత్త్ర మిత్ర కళత్ర భోగాదులను మాని తపము గావించు సద్ధర్ములకును
విఘ్నముల్ సెందునే? విశ్వేశుc గొల్చిన యతనికి నంతరాయంబు గలదె?
కామంబుc గ్రోధంబుcగల తపస్వితపంబు పల్వలోదకములభంగిcగాదె?

తే. నిన్ను వర్ణింప నలవియే? నిర్మలాత్మ!, రమణ లోcగొను మా యపరాధ' మనుచు
సన్నుతించిన నతcడు ప్రసన్నుc డగుచుc, దనదు సామర్థ్య మెఱిcగింపc దలcచి యపుడు. 68

ప్రతి : దేవముని+ఇంద్ర= దివ్యమునివర్యా!; నీ దివ్యచారిత్రంబున్= నీ మహనీయచరిత్రను; ఎఱిcగి= తెలిసి; సన్నుతి+చేయన్= పొగడడానికి; ఎవ్వcడు+ఓపున్= ఎవడు సరిపోతాడు? (ఎవ్వడూ చాలడని భావం); పుత్త్ర= పుత్రులను;

మిత్ర= స్నేహితులను; కళత్ర= భార్యలను; భోగ+ఆదులను= సౌఖ్యాలు మొదలగు వానిని; మాని= కాదని; తపము+కావించు= తపస్సుచేసే; సత్+ధర్ములకును= మంచి ధర్మాలను ఆచరించేవాళ్లకు; విఘ్నముల్+చెందున్+ఏ= అంతరాయాలు కలుగుతాయా? విశ్వ+ఈశున్= జగదీశ్వరుని; కొల్చిన+అతనికిన్= సేవించేవాడికి; అంతరాయంబు+కలదె= విఘ్నం ఉంటుందా? కామంబున్ క్రోధంబున్+కల= కామక్రోధాలుగల; తపస్వితపంబు= ముని తపస్సు; పల్వల+ఉదకముల= బురద గుంటలోని నీళ్ల; భంగిన్+కాదె= వంటిదికదా!; నిర్మల+ఆత్మ= స్వచ్ఛమైన మనస్సుగలవాడా; నిన్నున్= నిన్ను; వర్ణింపన్+అలవి+ఏ= వర్ణింపతరమా?; మా+అపరాధము= మా తప్పును; రమణన్= ప్రేమతో; లోన్+కొను= మన్నించు; అనుచున్= అంటూ; సన్నుతించినన్= స్తుతించగా; అతఁడు= నారాయణముని; ప్రసన్నుఁడు+అగుచున్= అనుగ్రహించిన వాడవుతూ; తనదు= తనయొక్క; సామర్థ్యము= శక్తిని; ఎఱిఁగింపన్+తలఁచి= తెలపాలనుకొని; అపుడు= ఆ సమయంలో...

**తా :** ఓ దివ్యమునివర్యా! నీ మహనీయ చరిత్రను తెలుసుకొని స్తుతించడానికి ఎవడికి సాధ్యమవుతుంది? ఆలుబిడ్డలనూ, మిత్రులనూ, సుఖాలనూ వద్దనుకొని తపస్సుచేసే ధర్మాత్ములకు అంతరాయాలు కలుగుతాయా? జగదీశ్వరుణ్ణి కొలిచే వాళ్లకు ఆటంకం కలుగుతుందా? కామక్రోధాలుగల మునిచేసే తపస్సు బురదగుంటలోని నీటివంటిది కదా! స్వచ్ఛమైన మనస్సు కలవాడా! నిన్ను వర్ణించడం మా తరమా? మా తప్పు మన్నించు - అంటూ సన్నుతించగా ఆ ముని ప్రసన్నుడై తన శక్తిని వాళ్లకు తెలియజెయ్యాలనుకొని అప్పుడు

**వ. అ మ్మునీశ్వరుండు పరమాశ్చర్యనిధానంబుగా నిజతనూరుహంబులవలనం ద్రికోటికన్యకా నివహంబుల నుద్భవింపం జేసిన, గంధర్వవిబుధకామినీసముదయంబులు పరమాద్భుతభయంబులు మనంబులం బొడమ సన్నుతించి, య వ్విలాసినీసమూహంబులో నూర్వశి యను దానిం గొని చని, పాకశాసను సభాసదనంబునం బెట్టి తద్వృత్తాంతం బంతయు విన్నవించిన నాశ్చర్యయుక్తహృదయుం డయి సునాసీరుం డూరకుండె; నట్టి నారాయణ మునీశ్వరుచరిత్రంబు వినువారలు పరమ కల్యాణగుణవంతు లగుదు రని చెప్పిన. 69**

**ప్రతి :** ఆ+ముని+ఈశ్వరుండు= ఆ నారాయణ మునివర్యుడు; పరమ+ఆశ్చర్య విధానంబు+కాన్= ఎంతో ఆశ్చర్యంగా; నిజ= తన; తనూరుహంబుల= రోమాల; వలనన్= నుండి; త్రికోటి= మూడుకోట్ల; కన్యకా నివహంబులన్= కన్యకల సముదాయాన్ని; ఉద్భవింపన్+చేసినన్= పుట్టించగా; గంధర్వ= గంధర్వజాతికి చెందిన; విబుధ= దేవతాజాతికి చెందిన; కామినీ సముదయంబులు= కామినుల సమూహాలు; పరమ+అద్భుత భయంబులు= మిక్కిలి ఆశ్చర్యం, భయం; మనంబులన్= మనస్సులలో; పొడమన్= పుట్టగా; సన్నుతించి= స్తుతించి; ఆ+విలాసినీ సమూహంబులోనన్= ఆ అందగత్తెల గుంపులో; ఊర్వశి+అనుదానిన్= ఊర్వశి అనుపేరుగల దానిని; కొని చని= తీసుకొనివెళ్లి, పాకశాసను= ఇంద్రునియొక్క; సభాసదనంబునన్= సభాస్థానంలో; పెట్టి= ఉంచి; తద్+వృత్తాంతంబు+అంతయున్= ఆ విషయమంతా; విన్నవించినన్= మనవి చేయగా; సునాసీరుండు= ఇంద్రుడు; ఆశ్చర్యయుక్త హృదయుండు+అయి= విస్మయంతో కూడిన మనస్సు గలవాడై; ఊరక+ఉండెన్= మిన్నకుండెను; అట్టి= అలాంటి; నారాయణముని+ఈశ్వరు= నారాయణ మునిశ్రేష్ఠునియొక్క; చరిత్రంబు= చరిత్ర; వినువారలు= వినేవాళ్లు; పరమ= మిక్కిలి; కల్యాణ= శుభమైన; గుణవంతులు= సద్గుణాలు కలవారు; అగుదురు= అవుతారు; అని చెప్పినన్= అని చెప్పగా...

**తా :** ఆ నారాయణమునివర్యుడు ఎంతో ఆశ్చర్యంగా తన రోమాలనుండి మూడుకోట్ల కన్యలసముదాయాన్ని పుట్టించాడు. గంధర్వ దేవతా కామినులు మిక్కిలి ఆశ్చర్యం, భయం మనస్సులో పుట్టగా ఆ మహర్షిని స్తుతించారు. ఆ అందగత్తెలలో

నుండి ఊర్వశి అనే ఒక అందగత్తెను తీసుకొని వెళ్లి ఇంద్రుని సభాస్థానంలో ఉంచి, జరిగిన విషయమంతా విన్నవించారు. ఇంద్రుడు మునిశక్తికి ఆశ్చర్యపడి మిన్నకున్నాడు. అటువంటి నారాయణమునీశ్వరుని చరిత్ర వినేవాళ్లు మిక్కిలి కల్యాణ గుణసంపన్నులు అవుతారు అని చెప్పగా –

**విశే :** 'విబుధ' శబ్దానికి దేవత అని అర్థం. 'వృత్రాసురభ్రాతరం శాసితవాన్ పాకశాసనః' అని పాకశాసన శబ్దానికి వ్యుత్పత్తి. వృత్రాసురుని సోదరుడైన పాకాసురుణ్ణి చంపినవాడని అర్థం. 'సునాసీర' అనేది ఇంద్రుణ్ణి తెలిపే పదం. శ్రేష్ఠమైన సేనాగ్రభాగం కలవాడు సునాసీరుడు.

**తే. ఋషభునకు నాత్మయోగ మీ రీతిఁ జెప్పె; నచ్యుతుఁడు భూమిభారము నడఁప నంత**
**సొరిది నవతారములు దాల్చి సొంపు మీఱ, రాత్రిచరులను జంపె నీరసముతోడ. 70**

**ప్రతి :** ఋషభునకున్= ఋషభుడనే వాడికి; ఆత్మయోగమున్= ఆత్మయోగాన్ని; ఈరీతిన్= ఈ విధంగా; చెప్పెన్= చెప్పాడు; అంతన్= తరువాత; అచ్యుతుఁడు= శ్రీహరి; భూమిభారమును+అడంపన్= భూభారాన్ని అణచడానికి; సొరిదిన్= క్రమంగా; అవతారములు+తాల్చి= అవతారాలు ధరించి; సొంపుమీఱన్= ఎంతో చక్కగా; ఈరసముతోడన్= కోపంతో; రాత్రిచరులను= రాక్షసులను; చంపెన్= సంహరించాడు.

**తా :** ఋషభునికి ఈవిధంగా ఆత్మయోగాన్ని గురించి చెప్పాడు. తరువాత శ్రీమహావిష్ణువు భూభారాన్ని అణచడానికి (తగ్గించడానికి) క్రమంగా అవతారాలు ధరించి కోపంతో రాక్షసులను సంహరించాడు.

**వ. అట్టి పరమేశ్వరుని లీలాగృహీతంబు లగు మత్స్యకూర్మవరాహ నారసింహ వామన రామ రఘురామ రామ బుద్ధ కల్క్యాద్యవతారంబు లనేకంబులు గలవు; వాని నెఱిఁగి నుతియింప శేష భాషాపతుల కైన నలవి గాదు; మఱియును. 71**

**ప్రతి :** అట్టి= అటువంటి; పరమ+ఈశ్వరుని; లీలా= విలాసంగా; గృహీతంబులు+అగు= గ్రహింపబడినవైన; మత్స్య, కూర్మ; వరాహ; నారసింహ; వామన; రామ= పరశురామ; రఘురామ= రఘువంశానికి చెందిన శ్రీరామ; రామ= బలరామ; బుద్ధ; కల్కి+ఆది= కల్కి మొదలైన; అవతారంబులు= అవతారాలు; అనేకంబులు+కలవు= ఎన్నో ఉన్నాయి; వానిన్+ఎఱిఁగి= వాటిని తెలుసుకొని; నుతియింపన్= నుతించడానికి; శేష భాషాపతులకున్+ఐనన్= ఆదిశేష, సరస్వతీదేవి భర్త అయిన బ్రహ్మలకైనా; అలవి+కాదు= సాధ్యంకాదు; మఱియును= ఇంకా...

**తా :** అటువంటి పరమేశ్వరుడు విలాసంగా గ్రహించిన మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రఘురామ, (బల)రామ, బుద్ధ, కల్కి – ఇత్యాది అవతారాలెన్నో ఉన్నాయి. ఆ అవతారాలనుగురించి తెలుసుకొని వాటిని నుతించడం ఆదిశేషునికైనా, బ్రహ్మదేవునికైనా సాధ్యంకాదు. అని చెప్పి

**సర్వలఘుసీసము**

**నవ వికచ సరసిరుహ నయనయుగ! నిజచరణ గగనచరనదిజనిత! నిగమవినుత!**
**జలధిసుత కుచకలశ లలిత మృగమద రుచిర పరిమళిత నిజహృదయ! ధరణిభరణ!**

**ద్రుహిణముఖ సురనికర విహిత నుతికలితగుణ కటిఘటిత రుచిరతర కనకవసన!**
**భుజగరిపువరగమన! రజతగిరిపతివినుత! సతతజపరత! నియమసరణి చరిత!**

**తే. తిమికమఠకిటినృహరిముదితబలి నిహి, త పద పరశుధర దశవదన విదళన!**
**మురదమన కలికలుష సముదపహరణ!, కరివరద! మునినరసుర గరుడవినుత! 72**

**ప్రతి :** నవవికచ= కొత్తగా వికసించిన; సరసిరుహ= పద్మాలవంటి; నయనయుగ= కన్నుల జంట కలవాడా!; నిజచరణ= నీ పాదాలయందు; గగనచర= ఆకాశంలో ప్రవహించే; నది జనిత= గంగానదిని పుట్టించినవాడా; నిగమ= వేదాలచే; వినుత= కొనియాడబడినవాడా!; జలధిసుత= సముద్రపుత్రిక అయిన లక్ష్మియొక్క; కుచకలశ= స్తనకుంభాలయందలి; లలిత= మనోజ్ఞమైన; మృగమద= కస్తూరిచే; పరిమళిత= పరిమళించే; నిజహృదయ= సొంత హృదయం కలవాడా! ధరణిభరణ= భూమిని మోసినవాడా; ద్రుహిణముఖ= బ్రహ్మ మొదలైన; సురనికర= దేవతా సమూహాలచేత; విహిత= చెప్పబడిన; నుతికలితగుణ= స్తోత్రములతో కూడిన గుణములు కలవాడా!; కటి ఘటిత= నడుముకు కట్టబడిన; రుచిరతర= అందమైన; కనకవసన= బంగారు వస్త్రం ధరించినవాడా!; భుజగరిపువర= సర్పాలకు శత్రుశ్రేష్ఠుడైన గురుత్మంతునిపై; గమన= గమనము గలవాడా! (వాహనంగా కలవాడా అని భావం); రజతగిరిపతి= వెండికొండపతి అయిన ఈశ్వరునిచే; వినుత= నుతింపబడువాడా! సతత= ఎల్లప్పుడూ; జపరత= జపం చేయుటలో ఆసక్తి కలవాడా! నియమసరణిచరిత= నియమబద్ధమైన నడవడి కలవాడా!; తిమి= మత్స్య; కమఠ= కూర్మ; కిటి= వరాహ; నృహరి= నృసింహ; ముదిత= సంతుష్టుడైన; బలినిహిత= బలిచక్రవర్తి యందు ఉంచబడిన; పద= పాదాలు కలవాడా! పరశుధర= గండ్రగొడ్డలిని ధరించినవాడా!; దశవదన= రావణుని; విదళన= ఖండించినవాడా! మురదమన= మురాసురుని అణచినవాడా!; కలికలుష= కలికాలంలోని పాపంయొక్క; సుముత్+అపహరణ= ఆనందాన్ని హరించువాడా! కరివరద= గజేంద్రునికి వరాలిచ్చినవాడా!; ముని= మునులచే; నర= నరులచే; సుర= దేవతలచే; గరుడ= పక్షులచే; వినుత= పొగడబడినవాడా!

**తా :** కొత్తగా వికసించిన పద్మాలవంటి కన్నుల జంట కలవాడా! పాదాలయందు ఆకాశగంగను పుట్టించిన వాడా! వేదములచే కొనియాడబడినవాడా! లక్ష్మీదేవియొక్క స్తన కుంభాలయందు పూయబడిన మనోజ్ఞమైన కస్తూరిచే పరిమళించే హృదయం కలవాడా! భూమిని మోసినవాడా! బ్రహ్మ మొదలైన దేవతల సమూహాల సంస్తుతులతో కూడినవాడా! నడుము మీద అందమైన బంగారువస్త్రం ధరించినవాడా! గరుత్మంతుడు వాహనంగా కలవాడా! వెండికొండ వేలుపుచే నుతింపబడిన వాడా! ఎల్లప్పుడు జపం చేయడంలో ఆసక్తి గలవాడా! నియమబద్ధమైన నడవడి కలవాడా! మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, కల్కి అవతారాలను తాల్చినవాడా! గజేంద్రునికి వరాలిచ్చినవాడా! మునులచే, నరులచే, దేవతలచే, పక్షులచే పొగడబడినవాడా! కలికాలంలోని పాపాత్ముల ఆనందాన్ని హరించేవాడా!

**విశే :** సర్వలఘు సీసపద్యం మొత్తం లఘు అక్షరాలతో ఉంటుంది.

**వ. ఇ వ్విధంబునం బ్రవర్తిల్లిన శ్రీమన్నారాయణమూర్తి లీలావిలాసంబు లనంతంబులు గలవు; మనోవాక్కాయ కర్మంబుల హరిపూజనంబు సేయక, విపరీతగతులం దిరుగుచుండు జడుల కెవ్విధంబు గతి గలుగు? ననిన నప్పు డప్పుడమితేఁ డప్పరమపురుషుం జూచి యట్టి జడులు ముక్తి నొందు నుపాయం బెట్టు లంతయు నెఱింగింపుఁ' దనినఁ జమసుం డిట్లనియె. 73**

**ప్రతి :** ఈ+విధంబునన్= ఈ రీతిగా; ప్రవర్తిల్లిన= నడచిన; శ్రీమత్+నారాయణమూర్తి= శ్రీమంతుడైన విష్ణువుయొక్క; లీలావిలాసంబులు= లీలలయొక్క విలాసాలు; అనంతంబులు= లెక్కలేనన్ని; కలవు= ఉన్నాయి; మనస్+వాక్+కాయ కర్మంబులన్= మనస్సు, మాట, శరీరాలయొక్క కర్మలచేత; హరిపూజనంబున్= విష్ణుపూజను; చేయక= చేయకుండా; విపరీతగతులన్= వ్యత్యస్తాలైన పోకడలతో; తిరుగుచున్+ఉండు= సంచరించే; జడులకున్= మూఢులకు; ఏ+విధంబు= ఏ విధంగా; గతి+కలుగున్= మంచిస్థితి కలుగుతుంది? అనినన్= అనగా; అప్పుడు; ఆ+పుడమిఱేఁడు= ఆ మహారాజు; ఆ+పరమ పురుషున్= ఆ మహాత్ముని; చూచి; అట్టిజడులు= అలాంటి మూఢులు; ముక్తిన్+ఒందు= మోక్షం పొందే; ఉపాయంబు= మార్గం; ఎట్టులు= ఎలా ఉంటుంది? అంతయున్= పూర్తిగా; ఎఱింగింపుఁడు+అనినన్= తెలియజేయుమనగా; చమసుండు= 'చమసుదు' అనే ముని; ఇట్లు+అనియెన్.

**తా :** ఈ రీతిగా ప్రవర్తిల్లిన శ్రీమన్నారాయణమూర్తి లీలావిలాసాలు ఎన్నో ఉన్నాయి. మనస్సుచేత, మాటచేత, శరీరంచేతచేసే, కర్మలతో విష్ణువును పూజించకుండా వ్యత్యస్తాలైన పోకడలతో సంచరించే మూఢులకు మంచి స్థితి ఎలా కలుగుతుంది? అని ముని అనగా ఆ మహారాజు ఆ మహాత్ముని చూచి 'అటువంటి మూఢులు ముక్తి పొందే మార్గం తెలియజేయుమ'ని అడిగాడు. అప్పుడు ఆ మునులలో 'చమసుడు' అనే ముని రాజుతో ఇలా అన్నాడు.

**సీ. హరిముఖ బాహూరు వరపదాబ్జములందు వరుసఁ జతుర్వర్ణ వర్గసమితి**
**జనియించె; నందులో సతులును శూద్రులు హరిఁదలంతురు; కలిహాయనముల**
**వేదశాస్త్ర పురాణ విఖ్యాతులై కర్మ కర్తలై విప్రులు గర్వ మెసఁగి**
**హరిభక్తిపరులను హాస్యంబు సేయుచు నిరయంబు నొందుట నిజము గాదె?**

**తే. మృదుల పక్వాన్న భోజనములను మాని, జీవహింసకుఁ జనువానిఁ జెందు నఘము;**
**హరి నుతింపక స్త్రీలోలుఁ డైనవాఁడు, నరకవాసుండు నగుచుండు ననవరతము. 74**

**ప్రతి :** హరి= శ్రీహరి; ముఖ= ముఖంనుండి; బాహు= భుజాలనుండి; ఊరు= తొడలనుండి; వర= శ్రేష్ఠమైన; పద+అబ్జముల+అందున్= పాదపద్మాలయందు; వరుసన్= వరుసగా; చతుర్+వర్ణ వర్గసమితి= నాలుగు వర్ణాల సమూహం; జనియించెన్= పుట్టింది; అందులోన్= ఆ వర్ణాలసమూహంలో; సతులును= స్త్రీలూ; శూద్రులున్= నాల్గవ వర్ణం వారైన శూద్రులూ; హరిన్+తలంతురు= శ్రీహరిని ధ్యానిస్తారు; కలిహాయనములన్= కలియుగ సంవత్సరాలలో; వేద= వేదాలలో; శాస్త్ర= శాస్త్రాలలో; పురాణ= పురాణాలలో; విఖ్యాతులు+ఐ= ప్రసిద్ధులై; కర్మకర్తలు+ఐ= కర్మలను ఆచరించేవారై; విప్రులు= బ్రాహ్మణులు; గర్వము+ఎసఁగి= గర్వం ఎక్కువై; హరిభక్తిపరులను= శ్రీహరి భక్తిసల్పేవారిని; హాస్యంబు+చేయుచున్= ఎగతాళి చేస్తూ; నిరయంబున్+ఒందుట= నరకాన్ని పొందడం; నిజము+కాదె?= నిజం కాదా? మృదుల= మెత్తని; పక్వ+అన్న= పచనమైన అన్నంతో కూడిన; భోజనములను= భోజనాలను; మాని= తినడం నిలిపివేసి; జీవహింసకున్= ప్రాణిహానికి; చనువానిన్= పాల్పడేవాడికి; అఘము= పాపం; చెందున్= చెందుతుంది; హరిన్= శ్రీహరిని; నుతింపక= స్తుతించకుండా; స్త్రీలోలుఁడు+ఐనవాఁడు= ఇంతుల సౌఖ్యాన్ని అనుభవించాలని వెంపరలాడేవాడు; అనవరతము= ఎల్లప్పుడూ; నరకవాసుండున్= నరకంలో ఉండేవాడు; అగుచుండున్= అవుతూ ఉంటాడు.

**తా :** శ్రీహరి ముఖంనుండి, బాహువులనుండి, ఊరువులనుండి, పాదపద్మాలనుండి క్రమంగా నాలుగువర్ణాలవాళ్లు పుట్టారు. వాళ్లలో స్త్రీలూ, శూద్రులూ విష్ణువును స్మరిస్తారు. కలియుగంలో వేద, శాస్త్ర, పురాణాలలో ప్రసిద్ధులై, కర్మలను

ఆచరిస్తూ బ్రాహ్మణులు మిక్కిలిగర్వంతో విష్ణుభక్తులను ఎగతాళి చేస్తారు. వాళ్లు నరకానికి పోవడం నిజం. మెత్తని పక్వాన్నం తినడం మాని, ప్రాణిహానికి పాల్పడేవాడికి – అంటే జంతువులను చంపి మాంసం భుజించేవాడికి పాపం కలుగుతుంది. హరిని స్తుతించకుండా స్త్రీసౌఖ్యాన్ని అనుభవించాలని వెంపరలాడేవాడికి ఎప్పటికీ నరకమే కలుగుతుంది.

**వ. అట్లు గావున గృహ క్షేత్ర పుత్త్ర కళత్ర ధన ధాన్యాదులందు మోహితుం డయి 'ముక్తిమార్గంబు లప్రత్యక్షంబు' లని నిందించువాఁడును, హరిభక్తివిరహితుండును, దుర్గతిం గూలుదు రని మునివరుం డానతిచ్చిన విదేహుం డిట్లనియె. 75**

**ప్రతి :** అట్లు+కావునన్= అందుచేత; గృహ= ఇల్లు; క్షేత్ర= పొలం; పుత్త్ర= సంతానం; కళత్ర= భార్య; ధన= ధనం; ధాన్య= ధాన్యం; ఆదుల+అందున్= మొదలైన వానియందు; మోహితుండు+అయి= వ్యామోహితుడై; ముక్తి మార్గంబులు= మోక్షమార్గాలు; అప్రత్యక్షంబులు+అని= కంటికి కనపడేవి కావని; నిందించువాఁడును= దూషించేవాడూ; హరిభక్తి; విరహితుండును= లేనివాడూ; దుర్గతిన్= నరకంలో; కూలుదురు+అని= పడిపోతారని; మునివరుండు; ఆనతి+ఇచ్చినన్= ఆనతీయగా; విదేహుండు= విదేహరాజు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అందుచేత ఇల్లు, పొలం, సంతానం, భార్య, ధనం, ధాన్యం మొదలైన వాటిమీది వ్యామోహంచేత మోక్షమార్గాలు కంటికి కనపడేవి కావని (పరోక్షాలని) నిందించేవాడూ, హరిభక్తి లేనివాడూ నరకంలో పడతారని చమసుడు అనే మునివర్యుడు ఆనతిచ్చాడు. అప్పుడు విదేహరాజు ఇలా అన్నాడు.

**ఆ. ఏ యుగంబునందు నే రీతి వర్తించు?, నెట్టి రూపువాఁడు? నె వ్విధమున**
**మును నుతింపఁబడెను మునిదేవగణముచే, విష్ణుఁ డవ్యయుండు విశ్వవిభుఁడు?" 76**

**ప్రతి :** అవ్యయుండు= వ్యయం లేదా నాశం లేనివాడు, అచ్యుతుడు; విశ్వవిభుఁడు= జగత్పతి అయిన విష్ణువు; ఏ యుగంబున్+అందున్= ఏ యుగంలో; ఏ రీతిన్= ఏ విధంగా; వర్తించున్= ఉంటాడు; ఎట్టి= ఎటువంటి; రూపువాఁడు= ఆకారం కలిగి ఉంటాడు; మును= పూర్వం; మునిదేవగణముచేతన్= మునుల, దేవతల సమూహంచేత; నుతింపఁ బడెను= స్తుతించబడినాడు.

**తా :** అవ్యయుడు, జగన్నాథుడు అయిన విష్ణువు ఏ యుగంలో ఏ విధంగా ఉన్నాడు? ఏ రూపం ధరించాడు? పూర్వం మునులచే, దేవతలచే ఏవిధంగా స్తుతించబడినాడు.

**వ. అనిన విని యందుఁ గరభాజనుం డిట్లనియె; 'ననేకావతారంబులు నానారూపంబులును బహువిధ వర్ణంబులునుం గలిగి, రాక్షసులను సంహరించి, దుష్టజన నిగ్రహంబును శిష్టజన పరిపాలనంబును జేయుచుఁ గృతయుగంబున శుక్లవర్ణుండై చతుర్బాహుండై జటావల్కల కృష్ణాజినోత్తరీయ జపమాలికా దండ కమండలు ధరుండయి హరి నిర్మలతపోధ్యానానుష్ఠానగరిష్ఠులైన పురుష శ్రేష్ఠులచేత హంసుండు సువర్ణుండు వైకుంఠుండు ధర్ముం డమలుండు యోగేశ్వరుం డీశ్వరుండు పురుషుం డవ్యక్తుండు పరమాత్ముం డను దివ్యనామంబులం బ్రసిద్ధి వహించి గణుతింపంబడుఁ; ద్రేతాయుగంబున రక్తవర్ణుండయి బాహుచతుష్క మేఖలాత్రయ విశిష్టుండయి హిరణ్యకేశుండును, వేదత్రయస్వరూపుండును, స్రుక్ స్రువాద్యుపలక్షణ శోభితుండు**

**నయి విష్ణుయజ్ఞ పృశ్నిగర్భ సర్వదేవోరుక్రమ వృషాకపి జయంతోరుగాయాఖ్యుల బ్రహ్మవాదులచేత నుతియింపంబడు; ద్వాపరంబున శ్యామల దేహుండును పీతాంబరధరుండును బాహుద్వయోపశోభితుండును దివ్యాయుధధరుండును శ్రీవత్సకౌస్తుభ వనమాలికావిరాజమానుండును మహారాజోపలక్షణుండునై జనార్దన వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధ నారాయణ విశ్వరూప సర్వభూతాత్మకాది నామంబుల వెలసి, మూర్ధాభిషిక్తులచేత సన్నుతింపంబడు. కలియుగంబునఁ గృష్ణవర్ణుండును గృష్ణనామకుండునునై భక్త సంరక్షణార్థంబు పుండరీకాక్షుండు యజ్ఞ సంకీర్తనంబులచేతం బ్రస్తుతింపంబడు; హరి రామ నారాయణ నృసింహ కంసారి నలినోదరాది బహువిధనామంబులచే బ్రహ్మవాదులైన మునీంద్రులు నుతియింపుదురు; మఱియును. 77**

**ప్రతి :** అనినన్ విని= విదేహరాజు అలా అడుగగా విని; అందున్= ఆ మునులలో; కరభాజనుండు= కరభాజనుడు అనేముని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; అనేక+అవతారంబులు= అనేక అవతారాలు; నానారూపంబులును= అనేక రూపాలు; బహువిధ= అనేక విధాలైన; వర్ణంబులునున్+కలిగి= రంగులు కలిగి; రాక్షసులను; సంహరించి= చంపి; దుష్టజన= దుర్జనుల; నిగ్రహంబును= సంహారం; శిష్టజన= సజ్జనుల; పరిపాలనంబును= రక్షించడం; చేయుచున్= చేస్తూ; కృతయుగంబునన్= కృతయుగంలో; శుక్లవర్ణుండు+ఐ= తెల్లని రంగు గలవాడై; చతుర్బాహుండు+ఐ= నాలుగుచేతులు గలవాడై; జటా= జడలు; వల్కల= నారబట్టలు; కృష్ణ+అజిన+ఉత్తరీయ= నల్లజింక చర్మపు ఉత్తరీయం; జపమాలికా= జపమాల; దండ= దండం; కమండలు= కమండలువు; ధరుండు+అయి= ధరించినవాడై; హరి= శ్రీహరి; నిర్మల= పరిశుద్ధమైన; తపస్+ధ్యాన= తపస్సు, ధ్యానం; అనుష్ఠాన= ఆచరణచేత; గరిష్ఠులు+ఐన= గొప్పవారైన; పురుషశ్రేష్ఠుల చేతన్= పురుషవర్యులచేత; హంసుండు= హంసుడు; సువర్ణుండు= సువర్ణుడు; వైకుంఠుండు= వైకుంఠుడు; ధర్ముండు= ధర్ముడు; అమలుండు= అమలుడు; యోగ+ఈశ్వరుండు= యోగేశ్వరుడు; ఈశ్వరుండు= ఈశ్వరుడు; పురుషుండు= పురుషుడు; అవ్యక్తుండు= అవ్యక్తుడు; పరమాత్ముండు+అను= పరమాత్ముడు అనే; దివ్యనామంబులన్= దివ్యమైన పేర్లచేత; ప్రసిద్ధివహించి= ప్రసిద్ధిచెంది; గణుతింపన్+పడున్= గణింపబడుతాడు; త్రేతాయుగంబునన్= త్రేతాయుగంలో; రక్తవర్ణుండు+అయి= ఎరుపురంగు కలవాడై; బాహు చతుష్క= నాలుగు చేతులూ; మేఖలాత్రయ= మూడుపోగులమొలనూళ్లూ; విశిష్టుండు+అయి= కలిగినవాడై; హిరణ్య= బంగారు వర్ణపు; కేశుండును= వెంట్రుకలు కలవాడూ; వేదత్రయ స్వరూపుండును= ఋగ్యజుస్సామాలనే మూడు వేదాల స్వరూపం కలవాడై; స్రుక్+స్రువ+ ఆది+ఉపలక్షణ= స్రుక్కు, స్రువం మొదలైన హోమసాధనాల చిహ్నాలతో; శోభితుండును= ప్రకాశించేవాడూ; విష్ణుయజ్ఞ; పృశ్నిగర్భ; సర్వదేవ; ఉరుక్రమ; వృషాకపి; జయంత; ఉరుగాయ; ఆఖ్యలన్= అనేపేర్లతో; బ్రహ్మవాదులచేతన్= వేదాంతులచేత; నుతియింపన్+పడున్= పొగడబడతాడు; ద్వాపరంబునన్= ద్వాపరయుగంలో; శ్యామలదేహుండును= నీలవర్ణంగల శరీరం కలవాడూ; పీత+అంబరధరుండును= పసుపుపచ్చని వస్త్రం ధరించినవాడూ; బాహుద్వయ+ఉపశోభితుండును= రెండుచేతులతో ప్రకాశించేవాడూ; దివ్య+ఆయుధ ధరుండును= దివ్యమైన ఆయుధాలు ధరించినవాడూ; శ్రీవత్స= శ్రీవత్సం; కౌస్తుభ= కౌస్తుభమణి; వనమాలికా= తోమాలతో; విరాజమానుండును= ప్రకాశించేవాడూ; మహారాజ+ఉపలక్షణుండును+ఐ= మహారాజ లక్షణాలు కలవాడూ అయి; జనార్దన; వాసుదేవ; సంకర్షణ; ప్రద్యుమ్న; అనిరుద్ధ; నారాయణ; విశ్వరూప; సర్వభూత+ఆత్మక+ఆది= సర్వభూతాత్మకుడు మొదలైన; నామంబులన్= పేర్లతో; వెలసి= ఒప్పి; మూర్ధ+అభిషిక్తులచేతన్= పట్టాభిషిక్తులైన రాజులచేత; సన్నుతింపన్+పడున్= కీర్తించబడుతాడు; కలియుగంబునన్= కలియుగంలో; కృష్ణవర్ణుండును= నల్లని మైచాయ గలవాడూ;

కృష్ణనామకుండును+ఐ= కృష్ణుడను పేరుగల వాడును అయి; భక్త సంరక్షణ+అర్థంబు= భక్తులను రక్షించడంకోసం; పుండరీక+అక్షుండు= తెల్లతామరలవంటి కనులు కలవాడు; యజ్ఞ= యజ్ఞాలు నిర్వహించడంచేత; సంకీర్తనంబులచేతన్= సంకీర్తనలచేత; ప్రస్తుతింపన్+పడున్= కీర్తించబడుతాడు; హరి; రామ; నారాయణ; నృసింహ= నరసింహ; కంస+అరి= శ్రీకృష్ణ; నలిన+ఉదర+ఆది= నలినోదరుడు మొదలైన; బహువిధ= పలువిధాలైన; నామంబులచేన్= పేర్లతో; ముని+ఇంద్రులు= మునివర్యులు; నుతియింపుదురు= స్తుతిస్తారు; మఱియును= ఇంకా...

**తా :** విదేహరాజు అడిగిన విషయం వినిన మునులలో 'కరభాజనుడు' అనే మునివర్యుడు ఇలా అన్నాడు. "ఎన్నో అవతారాలు, ఎన్నోరూపాలు, పలువిధాలైన రంగులు కలిగి రాక్షసులను సంహరించి; దుర్జనశిక్షణ, సజ్జనరక్షణ చేస్తూ శ్రీమహావిష్ణువు కృతయుగంలో తెల్లనిరంగు కలిగి, నాలుగుచేతులు కలిగి ఉంటాడు. జడలు, నారచీరలు, నల్లజింకచర్మపు ఉత్తరీయం, జపమాల, దండం, కమండలువు ధరించి; తపస్సు; ధ్యానం; అనుష్ఠానం గల మునిశ్రేష్ఠులచేత హంసుడు, సువర్ణుడు, వైకుంఠుడు, ధర్ముడు, అమలుడు, యోగీశ్వరుడు, ఈశ్వరుడు, పురుషుడు, అవ్యక్తుడు, పరమాత్ముడు అనే దివ్యనామాలతో ప్రశంసింపబడుతూ ప్రసిద్ధుడవుతాడు. త్రేతాయుగంలో ఎరుపురంగు కలవాడై నాలుగుచేతులు, మూడు పోగుల మొలనూళ్లు ధరించి, బంగరు రంగు జుట్టు కలిగి, మూడువేదాల ఆకృతి ధరించి, స్రుక్కు, స్రువం మొదలైన హోమసాధనాల చిహ్నాలలో శోభిల్లుతూ; విష్ణువు, యజ్ఞుడు, పృశ్నిగర్భుడు, సర్వదేవుడు, ఉరుక్రముడు, వృషాకపి, జయంతుడు, ఉరుగాయుడు అనే పేర్లతో వేదాంతులచేత నుతింపబడుతాడు. ద్వాపరయుగంలో నీలవర్ణం కలిగి, పీతాంబరం కట్టుకొని, రెండు చేతులు కలిగి, దివ్యాయుధాలు ధరించి, శ్రీవత్సం, కౌస్తుభం, వనమాల అనే వాటితో ప్రకాశిస్తూ, మహారాజలక్షణాలు కలవాడై జనార్దనుడు, వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, నారాయణుడు, విశ్వరూపుడు, సర్వభూతాత్మకుడు మొదలైన పేర్లతో వెలసి చక్రవర్తులచేత సన్నుతింపబడుతాడు. కలియుగంలో నల్లని రంగు కలిగి, కృష్ణుడనే పేరు కలిగి, భక్తులను రక్షించడానికి పుండరీకాక్షుడు యజ్ఞగానాలచేత వినుతింపబడతాడు. హరి, రాముడు, నారాయణుడు, నృసింహుడు, కంసారి, నలినోదరుడు మొదలైన పేర్లతో వేదాంతులైన మునివర్యులు స్తుతిస్తారు. ఇంకా –

**తే.** **ద్రవిడదేశంబునందులఁ దామ్రపర్ణి, సహ్యజాకృతమాలాది సకలనదుల**
**కెవ్వఁ డేనియు భక్తితో నేఁగి యచటఁ, బొదలి తర్పణ మొగిఁ జేయఁ బుణ్య మొదవు. 78**

**ప్రతి :** ద్రవిడ దేశంబున్+అందులన్= ద్రవిడ దేశంలో; తామ్రపర్ణి; సహ్యజా; కృతమాలా+ఆది= కృతమాల మొదలైన; సకల నదులకున్= అన్ని నదులకు; ఎవ్వఁడు+ఏనియున్= ఎవడైనా; భక్తితోన్+ఏఁగి= భక్తితో వెళ్లి; అచటన్= ఆ నదీ ప్రాంతాలలో; పొదలి= నివసించి; ఒగిన్= క్రమంగా; తర్పణము= పితృయజ్ఞం; చేయన్= చేస్తే; పుణ్యము+ఒదవున్= పుణ్యం కలుగుతుంది.

**తా :** ద్రవిడ దేశంలోని తామ్రపర్ణి, సహ్యజ, కృతమాల మొదలైన నదుల దగ్గరకు ఎవడైనా భక్తితో వెళ్లి, అక్కడ ఉండి పితృయజ్ఞాలు చేస్తే పుణ్యం లభిస్తుంది.

**వ.** **ఇ వ్విధంబునఁ బ్రశంసింపఁదగిన కావేర్యాదిమహానదీ పావనజలస్నానపానదానంబులను, విష్ణుధ్యాన కథాసుధారసానుభవంబుల న్నిరూఢులగు భాగవతోత్తములు గలిగి రేనియుం జెడని పదంబునుం బొందుదు రని ఋషభకుమారులు భగవత్ప్రతిబింబంబు లయిన పరమపురుషులుం బోలె విదేహజనపాలునకు నిశ్శ్రేయః**

**పదప్రాప్తికరంబులైన భగవద్భక్తిధర్మంబు లుపదేశించి యంతర్ధానంబు నొందిరి; మిథిలేశ్వరుండును జ్ఞానయోగం బంగీకరించి నిర్వాణపదంబు నొందె; నీ యుపాఖ్యానంబు వ్రాసినఁ బఠించిన వినిన నాయు రారోగ్యైశ్వర్యములు గలిగి పుత్త్ర పౌత్త్రవంతులై సకలకలికల్మషరహితులై విష్ణులోక నివాసు లగుదు'రని నారదుండు వసుదేవునకుం జెప్పి మఱియును. 79**

**ప్రతి :** ఈ+విధంబునన్= ఈ విధంగా; ప్రశంసింపన్+తగిన= కొనియాడదగిన; కావేరి+ఆది= కావేరి మొదలైన; మహానదీ= గొప్పనదుల; పావనజల= పవిత్రమైన నీళ్లలో; స్నాన= స్నానం; పాన= పానం; దానంబులను= దానాలచేత; విష్ణుధ్యాన= విష్ణువును ధ్యానించడంచేత; కథారస= కథలనే అమృతరసాన్ని; అనుభవంబులన్= అనుభవించడంచేత; నిరూఢులు+అగు= ప్రసిద్ధులైన; భాగవత+ఉత్తములు= భాగవతశ్రేష్ఠులు; కలిగిరి+ఏనిన్= ఉంటే; చెడని పదంబునున్+ పొందుదురు= సుస్థిరమైన స్థానాన్ని పొందుతారు; అని; ఋషభ కుమారుల= ఋషభ కుమారులయొక్క; భగవత్+ ప్రతిబింబంబులు+అయిన= భగవంతుని మారు రూపాలైన; పరమపురుషులున్+పోలె= మహాత్ములవలె; విదేహ జనపాలునకున్= విదేహాధిపతికి; నిశ్శ్రేయస్+పదప్రాప్తి+కరంబులు+ఐన= మోక్షపదప్రాప్తిని కలిగించేవైన; భగవత్+భక్తి ధర్మంబులు= భగవంతుని భక్తికి సంబంధించిన ధర్మాలను; ఉపదేశించి= బోధించి; అంతర్ధానంబున్+ఒందిరి= అంతర్హితులయ్యారు; మిథిలా+ఈశ్వరుండును= మిథిలానగరాధిపతి కూడా; జ్ఞానయోగంబు+అంగీకరించి= జ్ఞానయోగాన్ని స్వీకరించి; నిర్వాణపదంబున్+ఒందెన్= ముక్తిపదాన్ని పొందాడు; ఈ+ఉప+ఆఖ్యానంబున్= ఈ కథను; వ్రాసినన్= రాసినా; పఠించినన్= చదివినా; వినినన్= విన్నా; ఆయుస్+ఆరోగ్య+ఐశ్వర్యములు= ఆయువు, ఆరోగ్యం, సంపదలు; కలిగి= పొంది; పుత్త్ర పౌత్త్రవంతులు+ఐ= కొడుకులూ, మనుమలూ కలిగినవారై; సకల= అన్నివిధాలైన; కలి= కలికాలానికి చెందిన; కల్మష రహితులు+ఐ= దోషాలు తొలగినవారై; విష్ణులోక= విష్ణులోకంలో; నివాసులు+అగుదురు= నివసించే వాళ్లవుతారు; అని; నారదుండు= నారదమహర్షి; వసుదేవునకున్+చెప్పి= వసుదేవుడికి చెప్పి; మఱియును= ఇంకా.

**తా :** ఈ విధంగా కొనియాడదగిన కావేరి మొదలైన మహానదుల పవిత్ర జలాలలో స్నానం, పానం, దానం ఆచరించి; విష్ణుకథలనే అమృతరసం అనుభవించి ప్రసిద్ధులైన భాగవతశ్రేష్ఠులు ఉంటే వాళ్లు నశించనిస్థానం పొందుతారని ఋషభకుమారులు భగవంతునిమారురూపాలైన మహాత్ములవలె విదేహరాజుకు మోక్షప్రాప్తిని కలిగించ గలిగిన భగవద్భక్తికి సంబంధించిన ధర్మాలను బోధించి అంతర్హితులయ్యారు. మిథిలాధిపతి కూడా జ్ఞానయోగం స్వీకరించి ముక్తిపదం పొందాడు. 'ఈ కథను ఎవరు రాసినా, చదివినా, విన్నా వాళ్లకు ఆయువు, ఆరోగ్యం, సంపదలూ కలుగుతాయి. కొడుకులు, మనుమలూ కలుగుతారు. కలికాలానికి చెందిన సమస్త దోషాలు తొలగి విష్ణులోకంలో నివసిస్తారు' అని నారదమహర్షి వసుదేవుడికి చెప్పాడు. అంతే కాకుండా –

**సీ. 'కమలాక్షపదభక్తికథనముల్ వసుదేవ! విని యఘంబులఁ బాసి వెలసి తీవు
భువనప్రసిద్ధిగాఁ బొలుపొందు సత్కీర్తి కైవల్యలక్ష్మియుఁ గలుగు మీఁద
నారాయణుండు నీ నందనుం డను మోహ మెడలించి విష్ణుగా నెఱిఁగి కొలువు
మతఁడు నీ తనయుఁడై యవతరించుటఁజేసి సిద్ధించె దేహసంశుద్ధి నీకు**

**తే. సరససల్లాప సౌహార్ద సౌష్ఠవమునఁ, బావనం బైతి శిశుపాల పౌండ్ర నరక
ముర జరాసంధ యవనులు ముదముతోడ, వాసుదేవునిఁ జెందిరి వైరు లయ్యు. 80**

**ప్రతి :** వసుదేవ= వసుదేవా!; కమల+అక్ష= కమలలోచనుని; పదభక్తి= పాదాలయందు గల భక్తికి సంబంధించిన; కథనముల్= కథలు; విని; అఘంబులన్+పాసి= పాపాలను విడిచి; వెలసితివి+ఈవు= నీవు వెలసినావు, భువన ప్రసిద్ధి+కాన్= లోకప్రసిద్ధంగా; సత్+కీర్తి= మంచికీర్తి; పొలుపు+ఒందున్= వ్యాపిస్తుంది; మీఁదన్= తరువాత; కైవల్య లక్ష్మియున్= మోక్షలక్ష్మి; కలుగున్= సిద్ధిస్తుంది; నారాయణుండు= శ్రీమన్నారాయణుడు; నీ నందనుండు+అను= నీ కొడుకు అనే; మోహము+ఎడలించి= మోహాన్ని వదిలిపెట్టి; విష్ణు+కాన్+ఎఱిఁగి= శ్రీమహావిష్ణువుగా భావించి; కొలువుము= భజించు; అతఁడు= ఆ శ్రీమన్నారాయణుడు; నీ తనయుఁడు+ఐ= నీ కొడుకై; అవతరించుటన్+చేసి= అవతరించడం చేత; నీకున్= నీకు; దేహసంశుద్ధి= జన్మపవిత్రత; సిద్ధించెన్= కలిగింది; సరస= సరసమైన; సల్లాప= సద్భాషణ; సౌహార్ద= స్నేహ; సౌష్ఠవమున్= గొప్పతనంచేత; పావనంబు+ఐతివి= పవిత్రుడవయ్యావు; శిశుపాల= శిశుపాలుడు; పౌండ్ర= పౌండ్రకుడు; నరక= నరకుడు; ముర= మురుడు; జరాసంధ= జరాసంధుడు; యవనులు= కాలయవనాదులు; వైరులు+అయ్యున్= శత్రువులైనా; ముదముతోడన్= సంతోషంతో; వాసుదేవునిన్= శ్రీకృష్ణుని; చెందిరి= ఐక్యమయ్యారు.

**తా :** వసుదేవా! నీవు కమలలోచనుడైన శ్రీమన్నారాయణుని పదభక్తికి సంబంధించిన కథలు విని పాపరహితుడవయ్యావు. నీకు లోకప్రసిద్ధమైన మంచి కీర్తి కలుగుతుంది. ఆపై కైవల్యం సిద్ధిస్తుంది. విష్ణువు నీ కొడుకు అనే మోహాన్ని విడిచి ఆయన శ్రీమహావిష్ణువు అని తెలుసుకొని సేవించు. ఆయన నీ కొడుకుగా అవతరించడం చేత నీ జన్మ పవిత్రమైంది. ఆయనతో సరస సల్లాపాలు జరుపుతూ స్నేహంగా మెలగడంవల్ల పవిత్రుడవైనావు. శిశుపాలుడు, పౌండ్రకుడు, నరకుడు, మురుడు, జరాసంధుడు, కాలయవనుడు శత్రువులైనా సంతోషంతో వాసుదేవునిలో చేరారు. (అంటే వైరభక్తితో ముక్తి పొందారని భావం.)

**విశే :** శిశుపాలుడు – శ్రీకృష్ణునిమేనత్త సాత్త్వతి ఇతనితల్లి. తండ్రి దమఘోషుడు. శిశుపాలుడు గతజన్మలో హిరణ్యకశిపుడు. ధర్మరాజు రాజసూయయాగం చేసిన సందర్భంలో కృష్ణుడు తన సుదర్శనాయుధంతో నీతనిని సంహరించాడు.

పౌండ్రకుడు – ఇతడు కరూశదేశాధిపతి. తానే నిజమైన వాసుదేవుడనని చెప్పుకొంటూ శ్రీకృష్ణునికి గల వాసుదేవ నామాన్ని తొలగించుకొమ్మని ఆగడం చేయడంవల్ల శ్రీకృష్ణునిచేతిలో మరణించాడు.

మురుడు – ఇతడు మురుడనే రాక్షసుడు. వరప్రభావంతో గర్వించి దేవేంద్రుని బాధించడంవల్ల శ్రీకృష్ణుడితనిని వధించాడు.

జరాసంధుడు – ఇతడు మగధరాజు బృహద్రథుడికొడుకు. ఇద్దరు స్త్రీలకు సగం సగం శరీర భాగాలతో పుట్టిన ఇతనిని ఆ స్త్రీలిద్దరూ పారేస్తారు. జర అనే రాక్షసి ఆ రెండు శరీరభాగాలను కలపడంవల్ల ఇతడు బతుకుతాడు. జర కలిపింది కాబట్టి ఇతనికి జరాసంధుడు అనే పేరు కలిగింది. కంసుడి మామ అయిన ఈ జరాసంధుడు భీముడి చేతిలో మరణిస్తాడు.

కాలయవనుడు – యవనుడి కొడుకితడు. ఇతనిని నారదుడు ప్రేరేపించి కృష్ణుడి మీదికి యుద్ధానికి పంపిస్తాడు. కృష్ణుడు ఎదురుగావెళ్లి పోరాడకుండా నీకు ధైర్యముంటే నన్ను పట్టుకొమ్మని పరుగెత్తి ముచికుందుడు అనే మహర్షి ఉన్న గుహలోకి వెళతాడు. కాలయవనుడు కూడా గుహలోకి వెళ్లి కృష్ణుడనుకొని ముచికుందుణ్ణి తొక్కి, అతడి చూపులకు భస్మమవుతాడు.

వైరభక్తి – శ్రీమన్నారాయణుడితో వైరంపూని ఆయనను సంహరించడానికి ప్రయత్నించి తామే ఆయన చేతిలో మృతులై కైవల్యప్రాప్తి పొందిన రాక్షసులెందరో ఉన్నారు. శిశుపాల జరాసంధులు ఇటువంటి వాళ్లే. వైరంతో భగవంతుని అనవరతం వెదుకుతూ, ఆయన నామాన్ని ఇష్టం లేకున్నా ఉచ్చరిస్తూ వైరభక్తిని ప్రకటించుకొన్న వాళ్లు కూడా చివరకు మోక్షమే పొందగలిగారు.

**క. దుష్టజననిగ్రహంబును, శిష్టప్రతిపాలనంబు సేయన్ హరి దా**
**సృష్టి నవతార మొందెను, స్రష్టృముఖానేక దివిజసంఘము వొగడన్. 81**

**ప్రతి :** దుష్టజన= దుర్జనుల్ని; నిగ్రహంబును= శిక్షించడం; శిష్ట= సజ్జనుల్ని; ప్రతిపాలనంబు= రక్షించడం; చేయన్= చేయడానికి; హరి తాన్= శ్రీహరి తానే; స్రష్టృముఖ+అనేక= బ్రహ్మ మొదలైన ఎందరో; దివిజసంఘము= దేవతలసమూహం; పొగడన్= నుతించగా; సృష్టిన్= లోకంలో; అవతారము+ఒందెన్= అవతరించినాడు.

**తా :** దుర్జనులను శిక్షించడం కోసం, సజ్జనులను రక్షించడంకోసం బ్రహ్మ మొదలైన ఎందరో దేవతలు ప్రార్థించగా శ్రీహరి లోకంలో అవతరించాడు.

**వ. అట్లు గావున లోకరక్షణార్థంబు గృష్ణుం డవతారంబు నొందె' నని హరిభక్తిపరంబు లగు నుపాఖ్యానంబులు నారదుం డుపన్యసించిన విని విస్మితచిత్తులై దేవకీవసుదేవులు గృష్ణుని పరమాత్మునిగా విచారించి'రని శుకుండు రాజునకుం జెప్పిన నతండు మునీంద్రా! యదువుల నేప్రకారంబున హరి హరియించె? సపరివారులగు బ్రహ్మరుద్రేంద్రదిక్పాలకమునీంద్రులు ద్వారకా నగర ప్రవేశం బెట్లు సేసిరి? యే మయ్యె? మఱియుఁ బరమేశ్వరకథామృతంబు వీనులలరం జవిగొనియు నింకం దనివి సనదు; భక్తరక్షకుండగు హరిచారిత్రం బేరీతిఁ జాగెఁ దర్వాతి వృత్తాంతం బంతయు నెఱింగింపు మనిన శుకుం డిట్లనియె. 82**

**ప్రతి :** అట్లు+కావునన్= ఆ కారణంచేత; లోకరక్షణ+అర్థంబు= లోకాన్ని రక్షించడంకోసం; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; అవతారంబున్+ఒందెన్= అవతరించాడు; అని; హరిభక్తి పరంబులు+అగు= హరిభక్తికి సంబంధించినవైన; ఉపాఖ్యానంబులు= కథలు; నారదుండు= నారదుడు; ఉపన్యసించినన్= వివరంగా చెప్పగా; విని; దేవకీ వసుదేవులు; విస్మితచిత్తులు+ఐ= ఆశ్చర్యపడిన మనస్సులుగలవారై; కృష్ణుని; పరమ+ఆత్ముని+కాన్= మహాత్మునిగా; విచారించిరి= తలచారు; అని; శుకుండు= శుకమహర్షి; రాజునకున్= పరీక్షిన్మహారాజుతో; చెప్పినన్= చెప్పగా; అతండు= పరీక్షిత్తు; ముని+ఇంద్రా= మునివర్యా!; హరి; యదువులన్= యాదవులను; ఏ ప్రకారంబునన్= ఏ విధంగా; హరియించెన్= నశింపజేశాడు; సపరివారులు+అగు= తమ పరివారాలతో కూడి; బ్రహ్మ; రుద్ర+ఇంద్ర= రుద్రుడు, ఇంద్రుడు; దిక్పాలక= దిక్పతులు; ముని+ఇంద్రులు= ఋషీశ్వరులు; ద్వారకానగర ప్రవేశంబు= ద్వారకానగరంలో ప్రవేశించడం; ఎట్లు+చేసిరి= ఎలా చేశారు? ఏమి+అయ్యెన్= ఏమయింది? మఱియున్= ఇంకా; పరమ+ఈశ్వర= కృష్ణపరమాత్ముని; కథా+అమృతంబు= అమృతంవంటి కథలను; వీనులు+అలరన్= చెవులకింపుగా; చవి+కొనియున్= రుచి చూచికూడా; ఇంకన్= ఇంకా; తనివి+చనదు= తృప్తి కలుగదు; భక్తరక్షకుండు+అగు= భక్తులను రక్షించువాడైన; హరి; చారిత్రంబు= చరిత్ర; ఏరీతిన్+సాగెన్= ఏవిధంగా కొనసాగింది; తర్వాతి వృత్తాంతంబు+ అంతయున్= తరువాత జరిగిన కథనంతా; ఎఱింగింపుము+అనినన్= తెలుపుమనగా; శుకుండు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఆ కారణంచేత లోకాలను రక్షించడంకోసం విష్ణువు అవతరించాడని వివరిస్తూ నారదుడు విష్ణుభక్తికి సంబంధించిన కథలు చెప్పాడు. ఆ కథలను వినిన దేవకీవసుదేవులు ఆశ్చర్యచకితమానసులై శ్రీకృష్ణుని పరమాత్మగా భావించారు. ఈ విషయాలు శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు చెప్పాడు. పరీక్షిత్తు 'మునివర్యా! యాదవులను శ్రీహరి ఏవిధంగా నశింపజేశాడు? పరివారాలతో కూడినబ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, దిక్పాలకులు, ఋషులు ద్వారకానగరంలో ఎలా ప్రవేశించారు?

తరువాత ఏమైంది? శ్రీకృష్ణుడికథలు అనే అమృతాన్ని వీనులవిందుగా ఆస్వాదించినా ఇంకా తృప్తి కలగడంలేదు. భక్తులను రక్షించే శ్రీహరిచరిత్ర ఎలా కొనసాగింది; ఆపై వృత్తాంతమంతా తెలుపుము'. అనగా శుకుడు ఇలా అన్నాడు.

### a =బ్రహ్మాది దేవతలు శ్రీకృష్ణుని వైకుంఠమునకుఁ బిలువ వచ్చుట a

**క. సుర గరుడ ఖచర విద్యా, ధర హర పరమేష్ఠిముఖ సుధాశనులు మునుల్**
**సరసిజనయనునిఁ గనుఁగొన, నరుదెంచిరి ద్వారవతికి నతిమోదమునన్. 83**

**ప్రతి :** సుర= దేవతలు; గరుడ= గరుడులు; ఖచర= ఖేచరులు; విద్యాధర= విద్యాధరులు; హర= హరుడు; పరమేష్ఠిముఖ= బ్రహ్మ మొదలైన; సుధా+అశనులు= దేవతలు; మునుల్= మహర్షులు; సరసిజనయనునిన్= కమలాక్షుని; కనుఁగొనన్= దర్శించడానికి; అతిమోదమునన్= మిక్కిలి సంతోషంతో; ద్వారవతికిన్= ద్వారకానగరానికి; అరుదెంచిరి= వచ్చారు.

**తా :** దేవతలు, గరుడులు, ఖేచరులు, విద్యాధరులు, రుద్రుడు, బ్రహ్మ మొదలైన దేవతలు; మహర్షులు కమలాక్షుడైన శ్రీకృష్ణుని దర్శించడానికి ఎంతో సంతోషంతో ద్వారకానగరానికి వచ్చారు.

**విశే :** సుధాశనులు= సుధను (అమృతాన్ని) అశనంగా (ఆహారంగా) గ్రహించేవాళ్లు దేవతలు. సుఖంగా పానం చేయబడేది సుధ. దేవతలు అమృతం ఆహారంగా గ్రహిస్తారు కాబట్టి వాళ్లకు జరామరణాలుండవు. రెక్కలతో ఎగిరేవాళ్లు గరుడులు. ఆకాశంలో సంచరించే వాళ్లు ఖేచరులు. గుటికాంజనాది విద్యలను ప్రదర్శించేవాళ్లు విద్యాధరులు. వీళ్లందరూ దేవతలలోని వారే.

**క. కని పరమేశుని యాదవ, వనశోభితపారిజాతు వనరుహనేత్రున్**
**జనకామితఫలదాయకు, వినుతించిరి దివిజు లపుడు వేదోక్తములన్. 84**

**ప్రతి :** పరమ+ఈశునిన్= పరమేశ్వరుడైన శ్రీకృష్ణుని; యాదవవనశోభిత= యాదవవంశం అనే వనంలో ప్రకాశించే; పారిజాతున్= కల్పవృక్షం అయిన వానిని; వనరుహనేత్రున్= కమలాక్షుని; జనకామిత= జనులు కోరిన; ఫలదాయకున్= ఫలాలను ఇచ్చేవానిని; దివిజులు= దేవతలు; అపుడు; కని= చూచి; వేద+ఉక్తములన్= వేదసూక్తాలతో; వినుతించిరి= స్తుతించారు.

**తా :** యాదవవంశమనే ఉద్యానవనంలో ప్రకాశించే కల్పవృక్షంవంటివాడు పరమేశ్వరుడు. జనులు కోరిన ఫలాలను ఇచ్చేవాడు అయిన పద్మాక్షుని దేవతలు దర్శించి వైదిక సూక్తాలతో స్తుతించారు.

**విశే :** పారిజాతం దేవతరువు. పాలసముద్రంలో పుట్టిన వృక్షమిది. దేవతరువులు ఐదున్నాయి. అవి – మందారం, పారిజాతం, సంతానం, కల్పవృక్షం, హరిచందనం.

**తే. అఖిలలోకేశ! సర్వేశ! యభవ! నీవు, నుదయ మందుట భూభార ముడుపుకొఱకుఁ**
**బంచవింశోత్తరశతాబ్దపరిమితంబు, నయ్యె విచ్చేయు వైకుంఠ హర్మ్యమునకు. 85**

**ప్రతి :** అఖిలలోక+ఈశ= సకల భువనాధిపతీ!; సర్వ+ఈశ= సర్వేశ్వరా!; అభవ= పుట్టుక లేనివాడా!; నీవున్= నీవు; ఉదయము+అందుట= అవతరించడం; భూభారము= భూమిబరువు; ఉడుపు కొఱకున్= పోగొట్టడానికి; పంచవింశ+

ఉత్తరశతాబ్ద పరిమితంబున్= నూట ఇరవై అయిదు సంవత్సరాల కాలం; అయ్యెన్= అయిపోయింది; వైకుంఠ హర్మ్యమునకున్= వైకుంఠంలోని సౌధానికి; విచ్చేయు (ము)= వేంచేయుము.

**తా :** సకలభువనాధిపతీ! సర్వేశ్వరా! పుట్టుక లేనివాడవై భూమి బరువును తగ్గించడంకోసం నీవు అవతరించావు. నీవు జన్మించి ఇప్పటికి నూటాఇరవైఅయిదు సంవత్సరాల కాలం గడచిపోయింది. ఇక వైకుంఠసౌధానికి వేంచేయి.

**వ. అనినc గమలభవ భవ ముఖ నిఖిల సురగణంబుల వచనంబు లియ్యకొని కృష్ణుండు వారితోడ 'యాదవుల కన్యోన్యవైరానుబంధంబులు గల్పించి వారల హతంబు గావించి భూభారం బడంచి యిదె వచ్చెదం బొం' దని చెప్పి వీడ్కొలిపినc గమలాసనాది బృందారకులు నిజస్థానంబులకుం జని రంత. 86**

**ప్రతి :** అనినన్= అనగా; కమలభవ= బ్రహ్మ; భవ ముఖ= ఈశ్వరుడు మొదలైన; నిఖిల సురగణంబుల= సమస్త దేవతా సమూహాల; వచనంబులు= మాటలు; ఇయ్యకొని= అంగీకరించి; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; వారితోడన్= ఆ దేవతలతో; యాదవులకున్= యాదవులకు; అన్యోన్య= పరస్పర; వైర+అనుబంధంబులు= శత్రుత్వాలు; కల్పించి= కలిగించి; వారలన్= ఆ యాదవులను; హతంబు+కావించి= చంపించి; భూభారంబు+అడంచి= భూమి బరువు తగ్గించి; ఇదె వచ్చెదన్= త్వరగా వస్తాను; పొందు+అని= మీరు వెళ్లండని; చెప్పి; వీడ్కొలిపినన్= పంపివేయగా; కమలాసన+ఆది= బ్రహ్మ మొదలైన; బృందారకులు= దేవతలు; నిజస్థానంబులకున్+చనిరి= తమ తమ స్థానాలకు వెళ్లారు; అంతన్= తరువాత...

**తా :** ఆ విధంగా అనిన బ్రహ్మ, ఈశ్వరుడు మొదలైన సమస్త దేవతా సమూహాల మాటలను అంగీకరించి శ్రీకృష్ణుడు వాళ్లతో "యాదవులకు పరస్పరం శత్రుత్వాన్ని కల్పించి వాళ్లను చంపించి భూమి బరువును తగ్గించి త్వరగా వస్తాను మీరు వెళ్లండి" అని చెప్పి బ్రహ్మాదులను వీడ్కొలిపాడు. బ్రహ్మాదిదేవతలు తమతమ స్థానాలకు వెళ్లారు. తరువాత –

**విశే :** యాదవులను చంపించడం భూభారం తగ్గించడంకోసమే. ఇది శ్రీమన్నారాయణుని దుష్టశిక్షణ, శిష్టరక్షణ కార్యక్రమంలో ఒక భాగం.

### a =కృష్ణుండు దుర్నిమిత్తములం గని యాదవుల నెల్ల ద్వారకనుండి ప్రభాస తీర్థమునకుc బంపుట a

**సీ. కాక ఘూకంబులు గనకసౌధములలోc బగలు వాపోయెడి బహువిధముల**
**నశ్వవాలములందు ననల ముద్భవ మయ్యె నన్నంబు మొలిచె మహాద్భుతముగ**
**శుకశారికలు రాత్రి సొగసె విస్వరముల జంతువు వేఱొక్క జంతువుc గనె**
**నొగిc బౌరగృహముల నుల్కలు నుదయించె బెరసెc గావిరి రవిబింబ మపుడు.**

**తే. గాన నుత్పాతములు సాలc గానcబడియె, నరయ నిందుండ వలవదు యదువులార!**
**తడయ కిపుడ ప్రభాసతీర్థమున కరుగుc, డనుచు శ్రీకృష్ణుc డెంతయు నానతిచ్చె. 87**

**ప్రతి :** కాక ఘూకంబులు= కాకులు, గుడ్లగూబలు; కనక సౌధములలోన్= బంగారు మేడలలో; పగలు= పగటివేళల్లోనే; బహువిధములన్= పెక్కు విధాలుగా; వాపోయెడిన్= ఏడుస్తున్నాయి; అశ్వవాలముల+అందున్= గుర్రాలతోకలలో; అనలము= అగ్ని; ఉద్భవము+అయ్యెన్= పుట్టింది; మహా+అద్భుతము+కన్= మిక్కిలి ఆశ్చర్యకరంగా; అన్నంబు= అన్నం; మొలిచెన్= మొలకెలెత్తింది; శుకశారికలు= చిలుకలు, గోరువంకలు; రాత్రిన్= రాత్రివేళల్లో; విస్వరములన్= వికృత

స్వరాలతో; సొగసెన్= మూర్ఛిల్లాయి; జంతువు= ఒకరకం జంతువు; వేఱు+ఒక్క= వేరు విధమైన; జంతువున్= జంతువును; కనెన్= ప్రసవించింది; ఒగిన్= క్రమంగా; పౌరగృహములన్= పురప్రజలఇండ్లలో; ఉల్కలున్= ఆకాశం నుండి పడే అగ్నికణాలు; ఉదయించెన్= పుట్టాయి; అపుడు; రవిబింబం= సూర్యబింబాన్ని; కావిరి= నలుపురంగు; పెరసెన్= కప్పింది; కానన్= కాబట్టి; ఉత్పాతములు= ఉపద్రవాలు; చాలన్= ఎక్కువగా; కానన్+పడియెన్= కనిపించాయి; అరయన్= ఆలోచించగా; యదువులార= ఓ యాదవులారా! ఇందున్+ఉండవలవదు= ఇక్కడ ఉండవద్దు; తడయక= ఆలసించకుండా; ఇపుడు= ఇప్పుడే; ప్రభాసతీర్థమునకున్= ప్రభాసతీర్థానికి; అరుగుఁడు+అనుచున్= వెళ్లండి అంటూ; శ్రీకృష్ణుడు; ఎంతయున్= ఎంతగానో; ఆనతి+ఇచ్చెన్= ఆదేశించాడు.

**తా :** కాకులు, గుడ్లగూబలు పగటిపూటే బంగారుమేడలలో పెక్కువిధాలుగా ఏడుస్తున్నాయి. గుర్రాల తోకలయందు అగ్గిపుట్టింది. ఎంతో ఆశ్చర్యకరంగా అన్నం మొలకలెత్తింది. రాత్రిపూట చిలుకలు, గోరువంకలు వికృతస్వరాలతో మూర్ఛిల్లాయి. ఒక జంతువు వేరొక రకమైన జంతువును ఈనింది. పౌరుల ఇండ్లలో ఆకాశంనుండి ఉల్కలు కురిశాయి. సూర్యబింబాన్ని నల్లనిరంగు ఆవరించింది. ఇలా అపశకునాలు లేక ఉపద్రవాలు ఎన్నో కనిపించాయి. అందుచేత ఓ యాదవులారా! మీరు ఇక్కడ ఉండవద్దు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఇప్పుడే ప్రభాసతీర్థానికి వెళ్లండి" అని శ్రీకృష్ణుడు ఆదేశించాడు.

**విశే :** ప్రభాసతీర్థం గొప్ప పుణ్యక్షేత్రం. దక్షుడి శాపంవల్ల క్షయరోగం కలిగిన చంద్రుడు ప్రభాసతీర్థంలో స్నానం చేయగానే ఆ రోగం పోయింది. ఆ మాట చెప్పి యాదవులందరినీ ఆ క్షేత్రానికి వెళ్లమన్నాడు శ్రీకృష్ణుడు.

**క. నారాయణువచనముల క, పారంబగు సమ్మదమున బలములతోడన్**
**దార సుత మిత్ర యుతులై, వారణ హయ సమితితోడ వడి నేఁగి రొగిన్. 88**

**ప్రతి :** నారాయణు వచనములకున్= శ్రీకృష్ణుని మాటలకు; అపారంబు+అగు= అంతులేని; సమ్మదమునన్= సంతోషంతో; బలములతోడన్= తమ బలగాలతో; దార సుత మిత్రయుతులు+ఐ= భార్యలతో, బిడ్డలతో, మిత్రులతో కూడినవారై; వారణ హయ సమితితోడన్= ఏనుగుల, గుర్రాల సమూహంతో కలసి; ఒగిన్= క్రమంగా; వడిన్+ఏఁగిరి= తొందరగా వెళ్లారు.

**తా :** శ్రీకృష్ణుని మాటలు విని యాదవులు సంతోషంతో తమ బలగాలతోనూ, భార్యలు, బిడ్డలు, మిత్రులతోనూ; ఏనుగుల, గుర్రాల సమూహాలతోనూ కలసి క్రమంగా తొందరగా ప్రభాసతీర్థానికి వెళ్లారు.

**వ. అంత. 89**

**ప్రతి :** అంతన్= తరువాత...

**క. జ్ఞానమున నుద్ధవుఁడు దన, మానసమున నెఱిఁగి 'శ్రీరమాధిప! హరి! యో**
**దీనజనకల్పభూజ! సు, ధీనాయక! మాకు నీవె దిక్కని పొగడెన్. 90**

**ప్రతి :** ఉద్ధవుఁడు; జ్ఞానమునన్= తెలివితో (దివ్యజ్ఞానంతో); తన మానసమునన్= తన మనస్సులో; ఎఱిఁగి= తెలిసి; శ్రీరమా+అధిప= లక్ష్మీపతీ! హరి= శ్రీహరీ! ఓ దీనజనకల్పభూజ= ఆర్తజనుల పాలిటి కల్పవృక్షమా!; సుధీనాయక= పండితశ్రేష్ఠా!; మాకున్= మాకు; నీవే దిక్కు+అని= నీవే దిక్కని; పొగడెన్= స్తుతించాడు.

విశే : ఉద్ధవుడు దివ్యజ్ఞానంతో తన మనస్సులో తెలుసుకొని లక్ష్మీపతీ! శ్రీహరీ! ఆర్తజనుల పాలిటి కల్పవృక్షమా! పండితులను నడిపించువాడా! మాకు నీవే దిక్కని స్తుతించాడు.

## a =కృష్ణుం డుద్ధవునకుఁ బరమార్థోపదేశము సేయుట a

వ. ఇట్లు నుతియించి 'దేవా! నీవు యదుక్షయంబు గావించి చనిన నే మేవిధంబున నిర్వహింతుము? నీ సహచరులమై జరిపిన మజ్జన భోజన శయనాసనాది కృత్యంబులు మఱవ వచ్చునే?' యని యుద్ధవుం డాడిన వాసుదేవుం డిట్లనియె; 'బ్రహ్మాదిదేవతాప్రార్థనంబునం జేసి ధాత్రీభారంబు నివారించితి; నింక ద్వారకానగరంబు నేఁటికి సప్తమ దివసంబున సముద్రుండు ముంపంగలవాఁడు; యదుక్షయంబునుం గాఁగల యది; యంతటం గలియుగంబునుం బ్రాప్తంబయ్యెడి, నందు మానవులు ధర్మవిరహితులు, నాచారహీనులు, నన్యాయపరులును, నతిరోషులు, మందమతులు, నల్పతరాయువులు, బహురోగపీడితులు, నిష్ఫలారంభులు, నాస్తికులునై యొండొరుల మెచ్చక యుందురు; గావున నీవు సుహృద్బాంధవ స్నేహంబు వర్జించి, యింద్రియసౌఖ్యంబులం బొరయక క్షోణీతలంబునం గల పుణ్యతీర్థంబుల నవగాహనంబు సేయుచు, మానస వాగక్షి శ్రోత్ర ఘ్రాణేంద్రియ గృహ్యమాణంబగు వస్తుజాతం బెల్ల నశ్వరంబుగా నెఱుంగుము; పురుషుండు నానార్థకామంబుల నంగీకరించి నిజగుణదోషంబుల మోహితుండై యుండుం; గావున హస్తిపకుండు గంధనాగంబుల బంధించుచందంబున నింద్రియంబులను, మనోవికారంబులను నిగ్రహించి యేషణత్రయంబును వర్జించి, మోదఖేదంబుల సముండవుగా వర్తించుచు, నీ జగం బంతయు నాత్మాధిష్ఠితంబుగా నెఱింగి, మాయాదు లాత్మతత్త్వాధీనంబులుగాఁ దెలియుచు, జ్ఞానవిజ్ఞానయుక్తుండవై యాత్మానుభవసంతుష్టుండవై, విశ్వంబును నన్నుఁగా భావించి, వర్తింప వలయు'నని వాసుదేవుం డానతిచ్చిన నుద్ధవుండు భక్తిభయవినయంబులం గరంబులు మొగిడ్చి 'మహాత్మా! సన్న్యస్తలక్షణంబు దుష్కరంబు; పామరులగువార లాచరింపలేరు; నీ మాయచేత భ్రాంతులైన సాంసారికులు భవాబ్ధిం గడచి యెట్లు ముక్తి వడయుదురు? భృత్యుండనైన నామీఁది యనుగ్రహంబునం జేసి, యానతిమ్ము; బ్రహ్మాదిదేవతా సముదయంబును, బాహ్యవస్తువుల భ్రాంతులై పర్యటనంబు సేయుదురు; నీ భక్తులైన పరమభాగవతు లమ్మాయానిరసనంబును సేయుదురు; గృహిణీ గృహస్థుల కైన, యతులకైన నిత్యంబును నీ నామస్మరణంబు మోక్షసామ్రాజ్యపదంబు; గావునఁ బరమేశ్వరా! నీదు చరణంబుల శరణంబు నొందెదఁ; గృపారసంబు నాపై నిగిడింపు' మని ప్రియసేవకుండైన యుద్ధవుండు పలికిన నతనికిఁ గంసమర్దనుం డిట్లనియెఁ; 'బురుషున కాత్మకు నాత్మయె గురువని యెఱుంగుము! కుపథంబులం జనక, సన్మార్గవర్తివై పరమంబైన మన్నివాసంబునకుం జనుము. సర్వమూలశక్తిసంపన్నుండనైన నన్ను సాంఖ్యయోగపరులు నిరంతర భావంబులందుఁ బురుషభావంబు గావించి తలంచుచుందురు! మఱియు నేక ద్వి త్రి చతుష్పాదబహుపాదా పాదంబులునై యుండు జీవజాలంబులోన ద్విపాదంబులు గల మనుష్యులు మేలు; వారలలోన నిరంతరధ్యానగరిష్ఠులైన యోగీంద్రు లుత్తములు; వారలలో సందేహపరులచే నగ్రాహ్యుండగు నన్ను సత్త్వగుణ

**గ్రాహ్యునిఁగా నెఱింగి నిజచేతఃపంకజంబునందు జీవాత్మ పరమాత్మల నేకంబుగాఁ జేసి, శంఖచక్రగదాఖడ్గ శార్ఙ్గ కౌమోదకీ కౌస్తుభాభరణయుక్తుంగా నెఱుంగుచు నుండువారలు పరమయోగీంద్రు లనియు, బరమజ్ఞాను లనియునుం జెప్పి మఱియు "నవధూత యదు సంవాదం" బను పురాతనేతిహాసంబు గలదుఁ సెప్పెద నాకర్ణింపుము. 91**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; నుతియించి= స్తుతించి; దేవా! నీవు; యదుక్షయంబు+కావించి= యాదవజాతిని నాశనం చేసి, చనినన్= వెళ్లిపోతే; ఏము= మేము; ఏ విధంబునన్= ఏ విధంగా; నిర్వహింతుము= మనగలం? నీ సహచరులము+ఐ= నీతో కలసి తిరిగినవాళ్లమై; జరిపిన= చేసిన; మజ్జన= స్నానం; భోజన= భోజనం; శయన+ఆసన+ఆది= నిద్రించడం; ఒక ఆసనంపై కూర్చోవడం మొదలైన; కృత్యంబులు= పనులు; మఱువ వచ్చునే= మరచిపోగలమా? అని; ఉద్ధవుండు+ ఆడినన్= ఉద్ధవుడు అనగా; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్; బ్రహ్మ+ఆది= బ్రహ్మ మొదలైన; దేవతా= దేవతల; ప్రార్థనంబునన్+చేసి= విన్నపాన్ని అనుసరించి; ధాత్రీభారంబు= భూభారాన్ని; నివారించితిన్= తొలగించాను; ఇంకన్= ఇకమీద; ద్వారకానగరంబు; నేఁటికిన్= ఈ రోజుకు; సప్తమదివసంబునన్= ఏడవరోజున; సముద్రుండు; ముంపన్+కలవాఁడు= ముంచివేస్తాడు; యదుక్షయంబునున్+కాన్+కల అది= యాదవుల నాశనంకూడా జరుగుతుంది; అంతటన్= తరువాత; కలియుగంబునున్= కలియుగంకూడా; ప్రాప్తంబు+అయ్యెడిన్= ప్రాప్తిస్తుంది (వస్తుంది); అందున్= ఆ కలియుగంలో; మానవులు; ధర్మవిరహితులున్= ధర్మం వదలినవారు; ఆచారహీనులున్= సదాచారరహితులు; అన్యాయపరులును= అన్యాయాన్ని ఇష్టపడేవారు; అతిరోషులు= అధికమైన కోపం గలవారు; మందమతులును= తెలివితక్కువ వారు; అల్పతర+ఆయువులు= మిక్కిలి తక్కువ ఆయువు కలవారు; బహురోగపీడితులు= అనేక వ్యాధులతో బాధింపబడేవారు; నిష్ఫల+ఆరంభులును=ఫలించని పనులు చేసేవారు; నాస్తికులును+ఐ= వేదాలపై విశ్వాసం లేనివారై; ఒండొరులన్= ఒకరిని మరొకరు; మెచ్చక= ఇష్టపడక; ఉందురు; కావునన్= కాబట్టి; నీవు; సుహృత్+బాంధవ స్నేహంబు= మిత్రుల, చుట్టాల నెయ్యం; వర్జించి= వదిలిపెట్టి; ఇంద్రియసౌఖ్యంబులన్+పొరయక= ఇంద్రియసుఖాలను అనుభవించకుండా; క్షోణితలంబునన్+కల= భూతలంమీద ఉన్న; పుణ్యతీర్థంబులన్= పవిత్రనదులలో; అవగాహనంబు+చేయుచున్= మునుగుతూ; మానస= మనస్సుచేత; వాక్= మాటచేత; అక్షి= కంటిచేత; శ్రోత్ర= చెవిచేత; ఘ్రాణ+ఇంద్రియ= ముక్కు అనే ఇంద్రియాలచేత; గృహ్యమాణంబు+అగు= గ్రహింపబడుతున్న; వస్తుజాతంబు+ఎల్లన్= పదార్థాల సమూహాలనన్నిటిని; నశ్వరంబు+కాన్+ఎఱుంగుము= నశించేవని తెలుసుకో; పురుషుండు; నానా+అర్థకామంబులన్= అనేక వస్తువుల మీదగల కోరికలను; అంగీకరించి= సమ్మతించి; నిజ= తనవి అయిన; గుణదోషంబులన్= గుణాలచే, దోషాలచే, మోహితుండు+ఐ= మోహం పొందినవాడై; ఉండున్= ఉంటాడు; కావునన్= కాబట్టి; హస్తిపకుండు= మావటివాడు; గంధనాగంబులన్= మదపుటేనుగులను; బంధించు చందంబునన్= బంధించే విధంగా; ఇంద్రియంబులను= ఇంద్రియాలను; మనస్+వికారంబులను= మనస్సులో కలిగే వికారాలను; నిగ్రహించి= నిరోధించి; ఏషణ త్రయంబును= ధనైషణ, దారైషణ, పుత్రైషణ అనే మూడింటిని; వర్జించి= వదిలిపెట్టి; మోదఖేదంబులన్= సంతోష దుఃఖాలలో; సముండవుగాన్= ఒకేవిధంగా; వర్తించుచున్= ప్రవర్తిస్తూ; ఈ జగంబు+అంతయున్= ఈ లోకమంతా; ఆత్మ+అధిష్ఠితంబు+కాన్+ఎఱింగి= ఆత్మలో ఉన్నట్లు తెలుసుకొని; మాయా+ఆదులు= మాయ మొదలైనవి; ఆత్మతత్త్వ+అధీనంబులు+కాన్= ఆత్మతత్త్వానికి వశమైనవిగా; తెలియుచున్= తెలుసుకొంటూ; జ్ఞానవిజ్ఞానయుక్తుండవు+ఐ= జ్ఞానవిజ్ఞానాలతోకూడిన వాడవై; ఆత్మ+అనుభవ=

ఆత్మానుభూతిచే; సంతుష్టుండవు+ఐ= తృప్తుడవై; విశ్వంబును= లోకాన్ని; నన్నున్+కాన్= నన్నుగానే; భావించి= ఎంచి; వర్తింపవలయును+అని= ప్రవర్తించాలని; వాసుదేవుండు+ఆనతి+ఇచ్చినన్= శ్రీకృష్ణుడు ఆనతియ్యగా; ఉద్ధవుండు; భక్తి భయ వినయంబులన్= భక్తి, భయం, వినయాలతో; కరంబులు= చేతులు; మొగిడ్చి= జోడించి; మహా+ఆత్మా!; సన్న్యస్త లక్షణంబు= సన్యసించిన వాడి లక్షణం; దుష్కరంబు= కష్టం; పామరులు+అగువారలు= పామరులైన వాళ్లు; ఆచరింపలేరు= ఆచరించలేరు; నీమాయచేతన్= నీవు కల్పించే మాయచేత; భ్రాంతులు+ఐన= భ్రమ పొందిన; సాంసారికులు= గృహస్థులు; భవ+అబ్ధిన్= సంసార సముద్రాన్ని; కడచి= దాటి; ఎట్లు; ముక్తి+పడయుదురు= మోక్షం పొందుతారు; భృత్యుండను+ఐన= సేవకుడనైన; నామీఁది= నామీదగల; అనుగ్రహంబునన్+చేసి= దయచేత; ఆనతి+ఇమ్ము= చెప్పుము; బ్రహ్మ+ఆది= బ్రహ్మ మొదలైన; దేవతా సముదయంబును= దేవతల సమూహము కూడా; బాహ్య వస్తువులన్= ఆత్మేతరవిషయాలలో; భ్రాంతులు+ఐ= భ్రమ చెందినవారై; పర్యటనంబు+చేయుదురు= తిరుగుతారు; నీ భక్తులైన; పరమభాగవతులు= భాగవతశ్రేష్ఠులు; ఆ+మాయా నిరసనంబును= ఆ మాయను తిరస్కరించడం; చేయుదురు= చేస్తారు; గృహిణీ గృహస్థులకున్+ఐనన్= గృహిణులకైనా, గృహస్థులకైనా; యతులకున్+ఐనన్= సన్యాసులకైనా; నిత్యంబును= అనవరతం; నీ నామస్మరణంబు= నీ నామాన్ని స్మరించడం; మోక్షసామ్రాజ్యపదంబు= మోక్ష సామ్రాజ్య పదవి; కావునన్; పరమ+ఈశ్వరా! నీదు చరణంబులన్= నీ పాదాలను; శరణంబున్+ఒందెదన్= శరణు పొందుతాను; కృపారసంబు= కరుణ రసం; నాపైన్= నామీద; నిగిడింపుము+అని= ప్రసరింపజేయుమని; ప్రియసేవకుండు+ఐన= ప్రియభక్తుడైన; ఉద్ధవుండు; పలికినన్= కోరగా; అతనికిన్= ఉద్ధవునితో; కంసమర్దనుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్; పురుషునకున్= పురుషునికి; ఆత్మకున్= ఆత్మకు; ఆత్మ+ఏ= ఆత్మయే; గురువు+అని; ఎఱుంగుము= తెలుసుకో; కుపథంబులన్+చనక= చెడుమార్గాలలోకి వెళ్లకుండా; సన్మార్గవర్తివి+ఐ= మంచిమార్గంలో నడుస్తూ; పరమంబు+ఐన= మిక్కిలి గొప్పదైన; మత్+నివాసంబునకున్= నా నివాసానికి (వైకుంఠానికి); చనుము= వెళ్లు; సర్వమూలశక్తి సంపన్నుండను+ఐన= సమస్త ముఖ్యశక్తులతో కూడిన; నన్ను; సాంఖ్యయోగపరులు= సాంఖ్యయోగాన్ని అభ్యసించినవాళ్లు; నిరంతర భావంబుల+అందున్= ఎడతెగకుండా కలిగే భావాలలో; పురుషభావంబు+ కావించి= పురుషభావాన్నే ఎంచుకొని; తలంచుచున్+ఉందురు= ఆలోచిస్తూ ఉంటారు; మఱియున్; ఏక= ఒకటి; ద్వి= రెండు; త్రి= మూడు; చతుష్పాద= నాలుగుపాదాలు; బహుపాద= అనేక పాదాలు; అపాదంబులున్+ఐ= పాదాలు లేకుండా; ఉండు= కనిపించే; జీవజాలంబులోనన్= జీవుల సమూహంలో; ద్విపాదంబులు+కల= రెండుపాదాలు గల; మనుష్యులు= మానవులు; మేలు= శ్రేష్ఠులు; వారలలోనన్= ఆ మానవులలో; నిరంతర= ఎడతెగని; ధ్యానగరిష్ఠులు+ ఐన= ధ్యానం చేయడంలో గొప్పవారైన; యోగి+ఇంద్రులు= యోగిశ్రేష్ఠులు; ఉత్తములు= శ్రేష్ఠులు; వారలలోన్= అలాంటి ఉత్తములలో; సందేహపరులచేన్= సంశయగ్రస్థులైన వాళ్లచేత; అగ్రాహ్యుండు+అగు= తెలుసుకోబడని; నన్ను; సత్త్వగుణ గ్రాహ్యునిన్+కాన్= సత్త్వగుణాలు గలవాడు గ్రహించే వానినిగా; ఎఱింగి= తెలుసుకొని; నిజచేతస్+పంకజంబునందున్= తనదైన మనఃపద్మంలో; జీవాత్మ పరమాత్మలన్= జీవాత్మ పరమాత్మలను; ఏకంబు+కాన్+చేసి= ఒకటిగాచేసి; శంఖ; చక్ర; గదా; ఖడ్గ; శార్ఙ్గ, కౌమోదకీ; కౌస్తుభ; ఆభరణయుక్తున్+కాన్= భూషితునిగా; ఎఱుంగుచున్= తెలుసుకొంటూ; ఉండువారలు= ఉండేవాళ్లు; పరమయోగి+ఇంద్రులు+అనియు= గొప్ప యోగీశ్వరులని, పరమజ్ఞానులు+అనియునున్= గొప్ప జ్ఞానవంతులని; చెప్పి; మఱియున్; అవధూత యదు సంవాదంబు+అను; పురాతన+ఇతిహాసంబు= పురాతనమైన కథ; కలదు= ఉంది; చెప్పెదన్= చెపుతాను; ఆకర్ణింపుము= వినుము.

**తా :** ఈ విధంగా స్తుతించి “దేవా! నీవు యాదవజాతిని నాశనం చేసి వెళ్లిపోతే మేము ఏ విధంగా జీవించగలం? నీకు సహచరులమై నీతో కలసి చేసిన స్నాన, పాన, భోజన, శయన, ఆసనాదులను ఎలా మరచిపోగలం?” అని ఉద్ధవుడు అనగా శ్రీకృష్ణుడిలా అన్నాడు. “బ్రహ్మ మొదలైన దేవతలు చేసిన విన్నపాన్ని అనుసరించి భూమి బరువును తొలగించాను. ఇక నేటికి ఏడవరోజు సముద్రుడు ద్వారకానగరాన్ని ముంచివేస్తాడు. యాదవజాతి నాశనం అవుతుంది. అంతట కలియుగం వస్తుంది. కలియుగంలో మానవులు ధర్మం వదిలినవారూ, సదాచారరహితులూ, అన్యాయపరులూ, అధికమైన కోపం గలవారూ, మందమతులూ, తక్కువ ఆయువు కలవారూ, బహురోగాలచేత పీడింపబడుతూ ఉండేవారూ, ఫలించని పనులు చేసేవారూ, నాస్తికులూ అయి ఒకరిపై ఒకరికి ఇష్టం లేకుండా ఉంటారు. కాబట్టి నీవు స్నేహితులు, చుట్టాలు మొదలైనవాళ్ల అనుబంధాన్ని వదిలిపెట్టు. ఇంద్రియసౌఖ్యాలలో మునిగిపోకు. భూతలంమీద గల పుణ్యతీర్థాలలో స్నానం చెయ్యి. మనస్సుతో పంచేంద్రియాలతో గ్రహింపదగు వస్తుసముదాయమంతా నశించేది అని తెలుసుకో. పురుషుడు (జీవుడు) అనేకాలైన సంపదలను సంపాదించి తన గుణదోషాలతో మోహితుడై ఉంటాడు. కాబట్టి మావటివాడు మదగజాన్ని కట్టివేసిన విధంగా ఇంద్రియాలనూ, మనోవికారాలనూ నిగ్రహించి; భార్యాపుత్రులు ధనం విషయంలో ఆసక్తి వదలి సుఖదుఃఖాలలో సమంగా ప్రవర్తించు. ఈ ప్రపంచమంతా పరమాత్మయే అధిష్ఠానంగా కల్గిందిగా తెలుసుకో. మాయ ఆత్మకు వశమైనదిగా గ్రహించు. జ్ఞానవిజ్ఞానవంతుడవై ఆత్మానుభవంతో తృప్తిపొంది విశ్వాన్ని నన్నుగా భావించి ప్రవర్తించు” అని శ్రీకృష్ణుడు ఆనతిచ్చాడు. ఉద్ధవుడు భక్తితో, భయంతో, వినయంతో చేతులు జోడించి “మహాత్మా! సన్న్యాస జీవితం చాలా కష్టం. పామరులైనవాళ్లు ఆచరించలేరు. నీ మాయచేత భ్రాంతులైనవారు ఈ సంసారసముద్రాన్ని దాటి ఎలా మోక్షం పొందుతారు? సేవకుడనైన నామీద దయతో చెప్పాలి. బ్రహ్మ మొదలైన దేవతల సమూహం కూడా బాహ్యవస్తువులందు భ్రాంతులై తిరుగుతూ ఉంటారు. నీ భక్తులైన పరమభాగవతులుమాత్రమే ఆ మాయను తిరస్కరించగలుగుతారు. గృహిణులకైనా, గృహస్థులకైనా, సన్న్యాసులకైనా ఎప్పుడూ నీ నామస్మరణే మోక్షసామ్రాజ్యాన్ని అందిస్తుంది. కాబట్టి పరమేశ్వరా! నీ పాదాలను శరణు పొందుతున్నాను. నామీద కరుణరసాన్ని ప్రసరింపజేయి” అని ప్రియసేవకుడైన ఉద్ధవుడు పలికాడు. అప్పుడు అతనితో శ్రీకృష్ణుడిలా అన్నాడు. “పురుషునికి, ఆత్మకు ఆత్మే గురువు. చెడు మార్గాలలోకి వెళ్లకుండా మంచిమార్గంలో వర్తిస్తూ మిక్కిలి గొప్పదైన నా నివాసానికి (వైకుంఠానికి) చేరుకో. సమస్తశక్తులు గల నన్ను సాంఖ్యయోగులు ఎప్పుడూ పురుషభావంతో (పరమాత్మభావంతో) భావిస్తూ ఉంటారు. ఒకటి, రెండు, మూడు, నాలుగు కాళ్లు కలవి, అసలు కాళ్లు లేనివి అయిన జీవులలో రెండుకాళ్లుగల మనుష్యులు ఉత్తములు. అలాంటి ఉత్తములైన మనుష్యులలో నిరంతర ధ్యానగరిష్ఠులైన యోగీశ్వరులు ఉత్తములు. వాళ్లలో సందేహించేవాళ్లు గ్రహించలేని నన్ను సత్త్వగుణులు గ్రహిస్తారని తెలిసి తమ మనః పద్మాలలో జీవాత్మ, పరమాత్మలను ఒకటిచేసి శంఖం, చక్రం, గద, ఖడ్గం, శార్‌ఙ్గం, కౌమోదకి, కౌస్తుభం – వీటితో కూడినవానిగా నన్ను భావించేవారు పరమయోగీంద్రులు, పరమజ్ఞానులు” అని చెప్పి ఇంకా ‘అవధూత – యదు సంవాదం’ అనే ప్రాచీనమైన కథ ఒకటి ఉంది. చెపుతాను వినుమన్నాడు.

**విశే :** శ్రీమన్నారాయణుడు “సర్వమూలశక్తి సంపన్నుండు” అంటే సర్వజ్ఞత్వ, సత్య సంకల్పాది శక్తులతో కూడి జగత్ సృష్టి చేయగలిగిన వాడని అర్థం. సాంఖ్యయోగపరులంటే – సాంఖ్యయోగాన్ని అభ్యసించినవాళ్లు. సంఖ్యతో కూడినది సాంఖ్యం. సాంఖ్యమంటే జ్ఞానం. జ్ఞానవిచారణలో అనాత్మ వస్తువులను లెక్కించవలసి ఉంటుంది. లెక్కచెప్పేటప్పుడు సంఖ్యను ఆశ్రయించవలసి వస్తుంది కాబట్టి సాంఖ్యమని పేరేర్పడింది. ప్రకృతిలోగల తత్త్వాలను లెక్కించి వాటిలో అనాత్మరూపాలను త్యజించి, పరమాత్మజ్ఞానాన్ని గ్రహించడమే సాంఖ్యవిద్య. అందువల్ల ఆత్మానాత్మ రూపమైన విజ్ఞానమే సాంఖ్యం.

షడ్దర్శనాలలో సాంఖ్య దర్శనం ఒకటి. న్యాయం, వైశేషికం, సాంఖ్యం, యోగం, మీమాంస, వేదాంతం షడ్దర్శనాలు.

## a ═అవధూత- యదుసంవాదము a

**ఉ. పంకజనాభుఁ డుద్ధవునిపైఁగల కూర్మిని జెప్పె నొప్ప నెం**
**దంకిలి లేక యన్నిదిశలందుఁ జరించుచు నిత్యతృప్తుఁడై**
**శంకరవేషధారి యొక సంయమి యా యదురాజుఁ జేర 'నే**
**వంకను నుండి వచ్చి' తన వానికి నిట్లనె నర్థి నేర్పడన్. 92**

**ప్రతి :** పంకజనాభుఁడు= పద్మం నాభియందు గలవాడు, విష్ణువు; ఉద్ధవునిపైన్+కల= ఉద్ధవుని మీదగల; కూర్మినిన్= ప్రేమచేత; ఒప్పన్= ఒప్పునట్లుగా; చెప్పెన్= చెప్పాడు; ఎందున్+అంకిలిలేక= ఎక్కడా ఆటంకం లేకుండా; అన్ని దిశలందున్= అన్ని దిక్కులలో; చరించుచున్= తిరుగుతూ; నిత్య తృప్తుఁడు+ఐ= ఎప్పుడూ సంతృప్తి కలవాడై; శంకర వేషధారి= ఈశ్వరుడి వేషం ధరించిన; ఒక సంయమి= ఒక ముని; ఆ యదురాజున్+చేరన్= ఆ యదురాజుదగ్గరకు రాగా; ఏ వంకను నుండి= ఏ వైపునుండి; వచ్చితి+అనన్= వచ్చావనగా; వానికిన్= యదురాజుతో; అర్థిన్= ఆసక్తితో; ఏర్పడన్= స్పష్టమయ్యేటట్లు; ఇట్లు+అనెన్= ఇలా అన్నాడు.

**తా :** పద్మనాభుడైన శ్రీకృష్ణుడు ఉద్ధవుని మీద గల కూరిమితో ఇలా చెప్పాడు. ఒకరోజు యదురాజు దగ్గరకు ఎక్కడనుండో ఒక యోగి వచ్చాడు. అతడు అడ్డులేక అన్ని దిక్కులూ తిరిగేవాడు. ఎప్పుడూ సంతృప్తితో ఉంటాడు. ఈశ్వరుడివేషం ధరించి ఉన్నాడు. యదురాజు ఆ యోగిని ఎక్కడనుండి వచ్చావని అడిగాడు. అందుకా యోగి ఇలా అన్నాడు.

**క. అవధూత వల్కె నంతటఁ, 'బ్రవిమలవిజ్ఞాననిపుణభవ్యులు గురువుల్**
**దవిలిన నిరువదినలువురు, నవనిన్ విజ్ఞాని నైతి' నని పల్కుటయున్. 93**

**ప్రతి :** అంతటన్= తరువాత; అవధూత+పల్కెన్= అవధూత అన్నాడు; ప్రవిమల= నిర్మలమైన; విజ్ఞాన= విజ్ఞానంలో; నిపుణ= నేర్పరులైన; భవ్యులు= యోగ్యులు; ఇరువది నలువురు= ఇరవైనాలుగుమంది; తవిలినన్= తారసపడగా; అవనిన్= భూమియందు; విజ్ఞానిని+ఐతిన్= విజ్ఞానినైనాను; అని; పల్కుటయున్= అనగా...

**తా :** అవధూత ఇలా అన్నాడు. "నిర్మలమైన విజ్ఞానంలో నేర్పరులైన యోగ్యులు ఇరవైనాలుగుమంది గురువులు నాకు తారసపడగా వారివల్ల నేను విజ్ఞానినైనాను".

**విశే :** అవధూత – వర్ణాశ్రమధర్మాలను వదిలిపెట్టి, శీతోష్ణపరిస్థితులను తట్టుకొంటూ, దేహసంస్కారాలు లేకుండా కేవలం బ్రహ్మనిష్ఠతో మెలిగేవాడు అవధూత.

**వ. అంత యదుప్రవరుండు 'దేహి లోభమోహాదుల వర్జించి జనార్దనుని నే విధంబునం జేరవచ్చు? నెఱింగింపు' మనిన నతం డిట్లనియె. 94**

**ప్రతి :** అంతన్= అంతట; యదుప్రవరుండు= యాదవరాజు; దేహి= శరీరి; లోభమోహ+ఆదులన్= లోభం, మోహం మొదలైనవాటిని; వర్జించి= పరిత్యజించి; జనార్దనునిన్= విష్ణువును; ఏ విధంబునన్= ఏ రకంగా; చేరన్+వచ్చున్= చేరవచ్చును; ఎఱింగింపుము+అనినన్= తెలుపవలసిందనగా; అతండు= ఆ అవధూత; ఇట్లు+అనియెన్.

**తా :** అంత యాదవరాజు లోభం మోహం మొదలైన వాటిని వదిలిపెట్టి శరీరి ఏ రకంగా విష్ణువును చేరవచ్చునో తెలుపుమనగా అవధూత ఇలా అన్నాడు.

**సీ. పరధన పరదార పరదూషణాదులఁ బరవస్తు చింత దాఁ బరిహరించి**
**ముదిమిచే రోగము లుదయింప కటమున్న తనువు చంచలతను దగులకుండ**
**బుద్ధి సంచలతచేఁ బొదలక యట మున్న శ్లేష్మంబు గళమునఁ జేరకుండ**
**శక్తియుక్తుల మది సన్నగిల్లక మున్న భక్తి భావనచేతఁ బ్రౌఢుఁడగుచు**

**తే. దైత్యభంజను దివ్యపాదారవింద, భజన నిజభక్తి భావనఁ బ్రాజ్ఞుఁ డగుచు**
**నవ్యయానందమును బొందు ననుదినంబు, నతఁడు కర్మవిముక్తుఁడౌ ననఘచరిత! 95**

**ప్రతి :** అనఘచరిత= సత్ప్రవర్తన కలవాడా!; పరధన= ఇతరులసొమ్మును; పరదార= ఇతరుల భార్యలను; పరదూషణ+ఆదులన్= ఇతరులను నిందించడం మొదలైనవాటిని; పరవస్తు= ఇతరుల వస్తువులపై; చింతన్= ధ్యాసను; తాన్= తాను; పరిహరించి= విడిచిపెట్టి; ముదిమిచేన్= ముసలితనంచేత; రోగములు+ఉదయింపక= రోగాలు రాకుండ; అటమున్ను+అ= అంతకుముందే; తనువు= శరీరం; చంచలతను= వణకును; తగులకుండన్= పొందకుండా; బుద్ధి= తెలివి; సంచలతచేన్= చాంచల్యంతో; పొదలక+అటమున్ను+అ= కూడకముందే; శ్లేష్మంబు= కఫం; గళమునన్= కంఠంలో; చేరకుండన్= చేరకుండా; శక్తియుక్తులన్= శక్తియుక్తులలో; మది= బుద్ధి; సన్నగిల్లక మున్ను+అ= సన్నగిల్లడానికి ముందే; భక్తిభావనచేతన్= భక్తిభావంతో; ప్రౌఢుఁడు+అగుచున్= నేర్పరి అవుతూ; దైత్యభంజనున్= రాక్షస సంహారకుడైన శ్రీకృష్ణుని; దివ్యపాద+అరవింద భజనన్= పవిత్రమైన పాదపద్మాలను సేవించడంచేత; నిజభక్తి భావనన్= తన భక్తిభావంతో; ప్రాజ్ఞుఁడు+అగుచున్= ప్రజ్ఞావంతుడవుతూ; అనుదినంబున్= ప్రతిరోజూ; అవ్యయ+ఆనందమును+పొందున్= తరగని ఆనందం పొందునో; అతఁడు= అలాంటివాడు; కర్మ విముక్తుఁడు+ఔను= భవబంధాలనుండి విముక్తుడు అవుతాడు.

**తా :** పుణ్యచరిత్రా ఓ రాజా! పరుల సొమ్మును, పరుల భార్యలను కోరకుండా; ఇతరులను నిందించకుండా, ఇతరుల వస్తువులమీద అభిలాష లేకుండా; ముసలితనంవల్ల రోగాలు రాకముందే; శరీరం వణకకముందే; బుద్ధి చెలించక మునుపే; కంఠంలో కఫం చేరకముందే; శక్తియుక్తులు సన్నగిల్లకముందే; దృఢమైన భక్తిభావంతో దానవాంతకుడైన శ్రీకృష్ణునిపాదపద్మాలను భజిస్తూ; తరగని ఆనందాన్ని ప్రతిరోజూ ఎవడు పొందుతాడో అలాంటివాడు భవబంధాలనుండి విముక్తుడు అవుతాడు.

**ఉ. దారలయందు, బుత్త్రధనధాన్యములందు ననేక భంగులం**
**గూరిమి సేయు మర్త్యుఁ డతిఘోర వియోగజ దుఃఖ మగ్నుఁడై**
**నేరుపు దక్కి, చిక్కువడి నీతివివేకవిహీనుఁడై మనో**
**భారముతోఁ గపోతపతిభంగి నిజంబుగఁ బోవు నష్టమై. 96**

**ప్రతి :** దారల+అందున్= భార్యలయందును; పుత్త్ర= పుత్రులయందును; ధన= ధనమునందును; ధాన్యముల+అందున్= ధాన్యములయందును; అనేక భంగులన్= పెక్కురీతులుగా; కూరిమి+చేయు= మక్కువ చూపించే; మర్త్యుఁడు= మనుష్యుడు;

అతిఘోర= మిక్కిలి భయంకరమైన; వియోగజ= వియోగంవల్ల కలిగిన; దుఃఖమగ్నుఁడు+ఐ= దుఃఖంలో మునిగి; నేరుపున్+తక్కి= తెలివిపోగొట్టుకొని; చిక్కు+పడి= అందులో చిక్కుకొని; నీతి వివేక విహీనుఁడు+ఐ= నీతి, వివేకం లేనివాడయి; మనస్+భారముతోన్= మానసికమైన బరువుతో; కపోతపతి భంగిన్= మగపావురంవలె; నష్టము+ఐ= నశించి; నిజంబు+కన్= సత్యంగా; పోవున్= పోతాడు (మరణిస్తాడు).

**తా :** భార్యాపుత్రధన ధాన్యాదులలో పెక్కువిధాల మక్కువను పెంచుకొన్న మనుష్యుడు మిక్కిలి భయంకరమైన వియోగం వల్ల కలిగిన దుఃఖంతో తెలివిని పోగొట్టుకొని చిక్కువడి, నీతి వివేకాలు లేక మానసిక భారంతో నశించి మగపావురం వలె నిజంగా నశిస్తాడు (మరణిస్తాడు).

**వ. ఇందుల కొక్క యితిహాసంబు గలదు; మహారణ్యంబున నొక్కకపోతంబు దారసమేతంగా నొక్క నికేతనంబు నిర్మించి యన్యోన్యమోహాతిరేకంబునఁ గొంతకాలంబునకు సంతానసమృద్ధి గలదియై యపరిమితంబు లయిన పిల్లలు దిరుగాడుచుండఁ గొన్ని మాసంబులు భోగానుభవంబునం బొరలుచుండఁ గాలవశంబున నొక్క లుబ్ధకుం దురు లొడ్డిన నందు దారాపత్యంబులు దగులువడిన ధైర్యంబు వదలి మోహాతిరేకంబునం గపోతంబు కళత్ర పుత్త్ర స్నేహంబునం దాను నందుఁ జొచ్చి యధికచింతాభరంబునం గృశీభూతం బయ్యెఁ; గావున నతితీవ్రం బయిన మోహంబు గొఱగా దట్లుగాన నిరంతర హరిధ్యానపరుండై భూమి పవన గగన జల కృపీటభవ సోమ సూర్య కపోత తిలిప్స జలధి శలభ ద్విరేఫ గజ మధుమక్షికా హరిణ పాఠీన పింగళా కురర డింభక కుమారికా శరకృ త్సర్ప లూతా సుపేశకృత్సముదయంబులు మొదలుగాఁ గలవాని గుణగణంబు లెఱింగికొని యోగీంద్రులు మెలంగుదు; రనిన. 97**

**ప్రతి :** ఇందులకున్= దీనికి; ఒక్క; ఇతిహాసంబు= కథ, కలదు= ఉన్నది; మహా+అరణ్యంబునన్= పెద్ద అడవిలో; ఒక్క కపోతంబు= ఒక పావురం; దారసమేతంగా= భార్య సహితంగా; ఒక్క నికేతనంబున్= ఒక గూటిని; నిర్మించి= కట్టుకొని; అన్యోన్యమోహ+అతిరేకంబునన్= పరస్పరం మోహాతిశయంతో; కొంతకాలంబునకున్= కొంతకాలానికి; సంతాన సమృద్ధి కలది+ఐ= ఎక్కువ పిల్లలు కలదై; అపరిమితంబులు+అయిన= లెక్కలేనన్ని; పిల్లలు; తిరుగాడుచున్+ఉండన్= తిరుగుతూ ఉండగా; కొన్నిమాసంబులు= కొన్ని నెలలు; భోగ+అనుభవంబునన్= సుఖానుభూతితో; పొరలుచున్+ఉండన్= అనుభవిస్తూ ఉండగా; కాలవశంబునన్= కాలగతిచేత; ఒక్కలుబ్ధకుండు= ఒక బోయవాడు; ఉరులు+ఒడ్డినన్= వలలు పన్నగా; అందున్= ఆ వలలలో; దారా+అపత్యంబులు= భార్యాబిడ్డలు; తగులు+పడినన్= తగులుకోగా; ధైర్యంబు వదలి= ధైర్యం కోల్పోయి; మోహ+అతిరేకంబునన్= భార్యాబిడ్డలమీదగల ప్రేమతో; తానున్= తానుకూడా; అందున్+చొచ్చి= ఆ వలలో ప్రవేశించి; అధికచింతాభరంబునన్= ఎక్కువైన విచారాతిశయంతో; కృశీభూతంబు+అయ్యెన్= చిక్కిపోయింది (నశించిపోయింది); కావునన్= కాబట్టి; అతి తీవ్రంబు+అయిన= మిక్కిలి ఎక్కువైన; మోహంబు= మమత; కొఱ+కాదు= పనికిరాదు; అట్లు కానన్= ఆ కారణంచేత; నిరంతర= ఎల్లప్పుడూ; హరిధ్యానపరుండు+ఐ= శ్రీహరిని ధ్యానించువాడై; భూమి; పవన= గాలి; గగన= ఆకాశం; జల= నీళ్లు; కృపీటభవ= అగ్ని; సోమ= చంద్రుడు; సూర్య= సూర్యుడు; కపోత= పావురం; తిలిప్స= కొండచిలువ; జలధి= సముద్రం; శలభ= మిడత; ద్విరేఫ= తుమ్మెద; గజ= ఏనుగు; మధుమక్షికా= తేనెటీగ; హరిణ= లేడి; పాఠీన= ఒక విధమగు చేప; పింగళా= ముంగిస; కురర= లకుమికి పిట్ట; డింభక= బాలుడు; కుమారికా= కన్యక; శరకృత్= బాణాలు చేసేవాడు; సర్ప= పాము; లూతా= సాలెపురుగు; సుపేశకృత్= కందిరీగ;

సముదయంబులు= సమూహాలు; మొదలుగాన్; కలవాని; గుణగణంబులు; ఎఱింగికొని= తెలుసుకొని; యోగి+ఇంద్రులు= శ్రేష్ఠులైనయోగులు; మెలంగుదురు+అనినన్= ప్రవర్తిస్తూ ఉంటారని చెప్పగా...

**తా :** దీనికొక ఇతిహాసం (కథ) ఉంది. విను. ఒక పెద్ద అడవిలో ఒక పావురం భార్యతో కలసి ఒక గూడు నిర్మించుకొని పరస్పర మోహంతో ఉన్నది. కొంతకాలానికి ఆ పావురందంపతులకు సమృద్ధిగా సంతానం కలిగింది. పిల్లలు అపరిమితంగా అటూఇటూ తిరుగుతూ ఉండగా సంతోషంతో, భోగానుభవంతో కొన్ని నెలలు గడిచాయి. ఇలా ఉండగా కాలగతి వలన ఒక బోయవాడు వచ్చి వలలు వేశాడు. ఆ వలలలో ఆడపావురం, పిల్లలూ తగుల్కొన్నాయి. మగపావురం ధైర్యం కోల్పోయి భార్యాబిడ్డలమీద గల ప్రేమాతిశయంతో తానుకూడా ఆ వలలో ప్రవేశించి విచారంతో కృశించి నశించిపోయింది. కాబట్టి దేనియందూ ఎక్కువ మోహం పనికిరాదు. కనుక యోగీంద్రులైనవారు ఎప్పుడూ విష్ణువును ధ్యానిస్తూ భూమి, గాలి, ఆకాశం, నీళ్లు, అగ్ని, చంద్రుడు, సూర్యుడు, పావురం, కొండచిలువ, సముద్రం, మిడత, తుమ్మెద, ఏనుగు, తేనెటీగ, లేడి, చేప, ముంగిస, లకుముకిపిట్ట, బాలుడు, బాలిక, బాణాలుచేసేవాడు, సాలెపురుగు, కందిరీగ మొదలైన వాటి గుణగణాలు తెలుసుకొని ప్రవర్తిస్తూ ఉంటారు. అనగా

**విశే :** 'ఇతిహాసం' అంటే పూర్వం జరిగన కథ.

**క. 'ఇవి తెలియవలయు నాకును, బ్రవిమలమతి వీనిఁ దెలియఁ బలుకు' మనంగాఁ**
**గ్రమమున వినుమని కృష్ణుఁడు, సవినయుఁడగు నుద్ధవునికిఁ జయ్యనఁ జెప్పెన్. 98**

**ప్రతి :** ఇవి= భూమి మొదలుగా గలవి; నాకును= నాకు; తెలియవలయును= తెలియాలి; ప్రవిమలమతిన్= నిర్మలమైన బుద్ధితో; వీనిన్= వీటినిగురించి; తెలియన్+పలుకుము= తెలియజెయ్యి; అనన్+కాన్= అని అడుగగా; కృష్ణుఁడు= క్రమమునన్= క్రమంగా; వినుము+అని; సవినయుఁడు+అగు= వినమ్రుడైన; ఉద్ధవునికిన్= ఉద్ధవునితో; చయ్యనన్= వెంటనే; చెప్పెన్= చెప్పాడు.

**తా :** ఇవి 'నాకు తెలియాలి. నిర్మలమైన బుద్ధితో వీటినిగురించి తెలియజేయ'మని ఉద్ధవుడు అడిగాడు. అప్పుడు వినయవంతుడైన ఉద్ధవునితో క్రమంగా వినుమని శ్రీకృష్ణుడు వెంటనే చెప్పాడు.

**వ. ఇ వ్విధంబున భూమివలన సైరణయు, గంధవహునివలన బంధురంబగు పరోపకారంబును, విష్ణుపదంబువలనఁగాలసృష్ట గుణసాంగత్యంబు లేమియు, నుదకంబు వలన నిత్యశుచిత్వంబును, నసిత పథునివలన నిర్మలత్వంబును, నిశాకరప్రభాకరులవలన నధికాల్పసమత్వ జీవ గ్రహణ మోక్షణంబులును, గపోతంబుల వలనఁగళత్రపుత్రస్నేహంబును, నజగరంబు వలన స్వేచ్ఛావిహార సమాగతాహారంబును, వననిధివలన నుత్సాహరోషంబులును, శలభంబువలన శక్త్యనుకూలకర్మాచరణంబును, భృంగంబువలన సారమాత్రగ్రహణవిశేషంబును, స్తంబేరమంబువలనం గాంతావైముఖ్యంబును, సరఘువలన సంగ్రహ గుణంబును, హరిణంబువలనం జింతాపరత్వంబును, జలచరంబు వలన జిహ్వాచాపల్యంబును, బింగళవలన యథాలాభసంతుష్టియుఁ, గురరంబువలన మోహపరిత్యాగంబును, డింభకువలన విచారపరిత్యాగంబును, గుమారికవలన సంగత్యాగంబును, శరకారునివలనం దదేకనిష్ఠయు, దండశూకంబువలనం బర**

**గృహవాసంబును, నూర్ణనాభివలన సంసారపరిత్యాగంబును, గణుందురువలన లక్ష్యగత జ్ఞానంబు విడువకుండుటయు ననం గల వీనిగుణంబు లెఱింగి మఱియుఁగామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యంబులను నరిషడ్వర్గంబుల జయించి, జరామరణవిరహితంబుగా వాయువశంబు సేసి, గాత్రపవిత్రత్వంబుకొఱకు షట్కర్మనిరతుండయి, పురనగర గ్రామంబులు పరిత్యజించి పర్వతారణ్యంబుల సంచరించుచు, శరీరధారణార్థంబు నియతస్వల్పభోజనుండై, ఖేదమోదంబులు సరియకా భావించి లోభమోహంబులు వర్జించి, నిర్జితేంద్రియుండయి నన్నె కాని యొం డెఱుంగక యాత్మ నిష్ఠచేఁ బవిత్రాంతః కరణుండైన యోగి నాయందుఁ గలయుం గావున. 99**

**ప్రతి :** ఈ+విధంబునన్; భూమివలనన్= భూమివల్ల; సైరణయున్= సహనం; గంధవహుని వలనన్= వాయువువల్ల; బంధురంబు+అగు= గొప్పదైన; పరోపకారంబును= ఇతరులకు ఉపకారం; విష్ణుపదంబువలనన్= ఆకాశంవల్ల; కాలసృష్ట= కాలం సృష్టించిన; గుణసాంగత్యంబు లేమియును= గుణాలతో సంబంధం లేకపోవడం; ఉదకంబు వలనన్= నీటివల్ల; నిత్యశుచిత్వంబును= ఎప్పుడూ శుచిగా ఉండడం; అసితపథుని వలనన్= అగ్నివల్ల; నిర్మలత్వంబును= స్వచ్ఛత; నిశాకర ప్రభాకరులవలనన్= చంద్ర సూర్యులవల్ల; అధిక+అల్ప సమత్వ= సర్వ సమభావంలో; జీవగ్రహణ మోక్షణంబులును= శరీరం కల్గడాన్నీ, శరీరం పోవడాన్నీ; కపోతంబులవలనన్= పావురాళ్లవల్ల; కళత్రపుత్ర స్నేహంబును= భార్యాబిడ్డలయెడ ప్రేమ; అజగరంబువలనన్= కొండచిలువవల్ల; స్వేచ్ఛావిహార= ఇష్టప్రకారం తిరుగుతూ; సమాగత+ఆహారంబును= తన వద్దకే ఆహారం రావడము; వననిధివలనన్= సముద్రంవల్ల; ఉత్సాహరోషంబులును= ఉత్సాహరోషాలు; శలభంబువలనన్= మిడుతవల్ల; శక్తి+అనుకూల= యథాశక్తిగా; కర్మ+ఆచరణంబును= పనిచేయడం; భృంగంబువలనన్= తుమ్మెదవల్ల; సారమాత్రగ్రహణ విశేషంబును= సారంమాత్రమే గ్రహించడం; స్తంబేరమంబువలనన్= ఏనుగువల్ల; కాంతావైముఖ్యంబును= స్త్రీ విముఖత్వం; సరఘవలనన్= తేనెటీగవల్ల; సంగ్రహగుణంబును= గ్రహించే గుణం; హరిణంబువలనన్= జింకవల్ల; చింతాపరత్వంబును= విచారపరుడు కావడం; జలచరంబువలనన్= చేపవల్ల; జిహ్వాచాపల్యంబును= జిహ్వాచపలత్వం; పింగళవలనన్= ముంగిసవల్ల; యథాలాభసంతుష్టియున్= దొరికిన దానితో తృప్తి పడడం; కురరంబువలనన్= లకుముకి పిట్టవల్ల; మోహపరిత్యాగంబును= మోహం విడిచిపెట్టడం; డింభకువలనన్= బాలునివల్ల; విచారపరిత్యాగంబును= విచారం విడిచిపెట్టడం; కుమారికవలనన్= బాలిక వల్ల; సంగత్యాగంబును= సాంగత్యం విడిచిపెట్టడం; శరకారునివలనన్= బాణాలుచేసే వాడివల్ల; తదేకనిష్ఠయున్= దానియందే దృష్టి కలిగి ఉండడం; దందశూకంబువలనన్= సర్పం వల్ల; పరగృహవాసంబును= పరుల ఇంట నివసించడం; ఊర్ణనాభివలనన్= సాలెపురుగువల్ల; సంసారపరిత్యాగంబును= సంసారం విడిచిపెట్టడం; కణుందురువలనన్= కందిరీగవల్ల; లక్ష్యగత జ్ఞానంబు= లక్ష్యజ్ఞానం; విడువకుండుటయున్= విడిచిపెట్టకుండా ఉండడం; అనన్+కల= అని చెప్పిన; వీని; గుణంబులు+ఎఱింగి= వీటి గుణాలను తెలుసుకొని; మఱియున్= ఇంకా; కామ; క్రోధ; లోభ; మోహ; మద; మాత్సర్యంబులు+అను= మాత్సర్యాలు అనే; అరిషట్+ వర్గంబులన్= శత్రువులైన ఆరింటిని; జయించి; జరామరణ విరహితంబు+కాన్= ముసలితనం, మరణం లేకుండా; వాయువశంబు+చేసి= గాలిని స్వాధీనం చేసుకొని; గాత్ర పవిత్రంబుకొఱకున్= శరీరం పవిత్రంగా ఉండడానికి; షట్+కర్మ నిరతుండు+అయి= ఆరు కర్మలు ఆచరించడంలో ఆసక్తి కలవాడై; పురనగర గ్రామంబులు; పరిత్యజించి= వదిలిపెట్టి; పర్వత+అరణ్యంబులన్= కొండలయందు; అడవులయందు; సంచరించుచున్= తిరుగుతూ; శరీరధారణ+అర్థంబు= శరీరాన్ని నిలుపుకోవడంకోసం; నియత= నియమంతో కూడిన; స్వల్పభోజనుండు+ఐ= తక్కువ తిండి కలవాడై; ఖేదమోదంబులు= దుఃఖం, సంతోషాలు;

సరి+అ+కాన్= సమంగా; భావించి= తలచి; లోభమోహంబులు; వర్జించి; నిర్జిత+ఇంద్రియుండు+అయి= ఇంద్రియాలను గెలిచిన వాడై; నన్నున్+ఎ+కాని= నన్ను తప్ప; ఒండు+ఎఱుంగక= మరొకటి తెలియక; ఆత్మనిష్ఠచేన్= ఆత్మనిష్ఠతో; పవిత్ర+అంతఃకరణుండు+ఐన= పవిత్రమైన మనస్సు కలవాడైన; యోగి; నాయందున్= నాలో; కలయున్+కావునన్= కలుస్తాడు కాబట్టి –

**తా :** ఈ విధంగా భూమివల్ల సహనం, వాయువు (గాలి) వల్ల గొప్పపరోపకారం, ఆకాశంవల్ల కాలం సృజించిన గుణాలతో సాంగత్యం లేకపోవడం. నీటివల్ల ఎప్పుడూ శుచిగా ఉండడం. అగ్నివల్ల నిర్మలంగా ఉండడం, చంద్ర సూర్యులవల్ల వృద్ధి క్షయాలందు సమభావం కల్గి ఉండడం, పావురంవల్ల భార్యాబిడ్డల మీద ప్రేమ, కొండచిలువవల్ల ఇష్టంగా తిరుగుతూ అందిన ఆహారాన్నిమాత్రమే గ్రహించడం, సముద్రంవల్ల ఉత్సాహరోషాలు, మిడుతవల్ల యథాశక్తి అనుకూలకర్మలను ఆచరించడం, తుమ్మెదవల్ల సారంమాత్రమే గ్రహించడం, ఏనుగువల్ల స్త్రీ విముఖత, తేనెటీగవల్ల కూడబెట్టుకొనే గుణం, లేడివల్ల విచారపరత్వం, చేపవల్ల జిహ్వాచపలత, ముంగిసవల్ల దొరికినదానితో తృప్తిపడడం, లకుముకిపిట్టవల్ల మోహత్యాగం, బాలునివల్ల విచారం విడిచి పెట్టడం. బాలికవల్ల సాంగత్యం విడిచిపెట్టడం, బాణాలుచేసేవాడివల్ల ఏకాగ్రత, పామువల్ల పరుల ఇంట నివసించడం, సాలెపురుగువల్ల సంసారబంధంలో చిక్కకుండడం, కందిరీగవల్ల లక్ష్యజ్ఞానం విడువకుండా ఉండడం అనే వీటి గుణాలను తెలుసుకోవాలి.

ఈ గుణాలు గ్రహించి కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యాలనే ఆరుశత్రువులను జయించి; ముసలితనం, మరణం రాకుండా వాయువును (గాలిని) వశంచేసుకొని శరీరం పవిత్రంగా ఉండడానికి యజన యాజన అధ్యయన అధ్యాపన దాన ప్రతిగ్రహాలనే ఆరు కర్మలమీద ఆసక్తి గలవాడై; పట్టణాలను, గ్రామాలను, నగరాలను వదలి; కొండలయందు, అడవులయందు తిరుగుతూ; దేహం నిలవడానికి కావలసిన కొద్దిపాటి ఆహారం గ్రహిస్తూ; సంతోషం, దుఃఖం రెంటినీ సమానంగా భావిస్తూ; లోభాన్ని, మోహాన్ని వదిలిపెట్టి; ఇంద్రియాలను జయించి; నేను తప్ప మరొకటి తెలియక ఆత్మనిష్ఠతో పవిత్రమైన మనస్సు కలిగిన యోగి నాలో కలుస్తాడు కాబట్టి...

**క. మోహితుఁడై వసుకాంక్షా, వాహినిలోఁ జిక్కి క్రూరవశుఁడౌ మనుజుం**
**డూహాపోహ లెఱుంగక, దేహము నలఁగంగఁ జేయు దీనత నెపుడున్. 100**

**ప్రతి :** మోహితుఁడు+ఐ= మోహం కలిగినవాడై; వసుకాంక్షా వాహినిలోన్= ధనవాంఛ అనే ప్రవాహంలో; చిక్కి; క్రూరవశుడు+ఐ= క్రూరత్వానికి లోనైనవాడై; మనుజుండు= మనుష్యుడు; ఊహ+అపోహలు= ఊహ అపోహలు; ఎఱుంగక= తెలియక; దీనతన్= దైన్యంతో; ఎపుడున్= ఎప్పుడూ; దేహమున్= శరీరాన్ని; నలఁగన్+కన్+చేయున్= శ్రమ పెడతాడు.

**తా :** మోహవశుడై ధనవాంఛ అనే ప్రవాహంలో చిక్కుకొని క్రౌర్యానికి వశుడైన మనుష్యుడు ఊహ అపోహలు తెలిసికొనలేక ఎప్పుడూ దైన్యంతో దేహాన్ని శ్రమకు గురిచేస్తాడు.

**వ. ఇందులకుఁ బురాతన వృత్తాంతంబు గలదు; సావధానచిత్తుండవై వినుము. మిథిలానగరంబునఁ బింగళ యను గణికారత్నంబు గలదు. దానివలనం గొంత పరిజ్ఞానంబుఁగంటి? న దెట్లనిన న మ్మానిని ధనకాంక్షం జేసి యాత్మసఖుని మొఱంగి ధనం బిచ్చువానిం జేకొని నిజనికేతనాభ్యంతరంబునకుం గొని చని రాత్రి నిద్రలేకుండుచుఁ బుటభేదన విపణిమార్గంబులఁ బర్యటనంబు సలుపుచు నిద్రాలస్యభావంబున**

**జడనుపడి, యర్థాపేక్షం దగిలి తిరిగి యలసి, యాత్మసుఖంబు సేయు నతండె భర్తయని చింతించి నారాయణు నిట్లు చింతింప నతనికైవల్యంబు సేరవచ్చునని విచారించి, నిజశయనస్థానాదికంబు వర్జించి వేగిరంబ వాసుదేవచరణారవిందవందనాభిలాషిణియై దేహంబు విద్యుత్ప్రకారంబని చింతించి పరమతత్త్వంబు నందుఁ జిత్తంబు గీలుకొలిపి ముక్తురాలయ్యెనని యెఱింగించి. 101**

**ప్రతి :** ఇందులకున్= దీనికి; పురాతన వృత్తాంతంబు= ప్రాచీనకథ; కలదు; స+అవధాన చిత్తుండవు+ఐ= శ్రద్ధతో కూడిన మనస్సు కలవాడవై; విను; మిథిలానగరంబునన్; పింగళ+అను= పింగళ అనే పేరుగల; గణికారత్నంబు= ఉత్తమురాలైన వేశ్య; కలదు; దానివలనన్+కొంత= ఆమెనుండి కొంత; పరిజ్ఞానంబున్+కంటిని= తెలివిని పొందాను; అది+ఎట్లు+అనినన్= అది ఎలాగంటే; ఆ+మానిని= ఆ స్త్రీ; ధనకాంక్షన్+చేసి= డబ్బుమీద ఆశతో; ఆత్మసఖునిన్= తన ప్రియుని; మొఱంగి= మోసపుచ్చి; ధనంబు+ఇచ్చువానిన్= ధనం ఇచ్చేవాడిని; చేకొని= చేపట్టి; నిజ= తన; నికేతన+అభ్యంతరంబునకున్= ఇంటిలోపలకు; కొని చని= తీసుకొనిపోయి; రాత్రి= రేయి; నిద్ర లేకుండుచున్= నిద్ర లేకుండా ఉంటూ; పుటభేదన= పట్టణంలోను; విపణి మార్గంబులన్= బజారులలోను, పర్యటనంబు సలుపుచున్= తిరుగుతూ; నిద్ర+ఆలస్యభావంబునన్= నిద్రలేకపోవడం వల్ల; జడనుపడి= నీరసపడి; అర్థ+అపేక్షన్+తగిలి= ధన వ్యామోహంలో పడి; తిరిగి; అలసి= బడలి; ఆత్మసుఖంబు+చేయు+అతండు+ఏ= తనను సుఖపెట్టువాడే; భర్త+అని; చింతించి= ఆలోచించి; నారాయణున్+ఇట్లు= శ్రీమన్నారాయణునే ఇలా; చింతింపన్= ధ్యానిస్తే; అతని కైవల్యంబు= ఆయన ఇచ్చే కైవల్యం; చేరవచ్చును+అని= పొందవచ్చునని; విచారించి= ఆలోచించి; నిజ= తన; శయనస్థాన+ఆదికంబు= శయనాగారం మొదలైనవానిని; వర్జించి= వదిలిపెట్టి; వేగిరంబు+అ= వెంటనే; వాసుదేవ= వాసుదేవుని; చరణ+అరవింద= పాదపద్మాలకు; వందన+అభిలాషిణి+ఐ= నమస్కరించే కోరిక కలదై; దేహంబు= శరీరం; విద్యుత్+ప్రకారంబు+అని= మెరుపువంటిదని; చింతించి= ఆలోచించి; పరమతత్త్వంబు+అందున్= పరతత్త్వంపై; చిత్తంబు+కీలుకొలిపి= మనస్సును లగ్నంచేసి; ముక్తురాలు+అయ్యెన్+అని= మోక్షం పొందిందని; ఎఱింగించి= తెలిపి...

**తా :** దీనికి నిదర్శనంగా ఒక ప్రాచీనమైన కథ ఉంది. శ్రద్ధతో విను. మిథిలానగరంలో పింగళ అనే ఒక వేశ్యారత్నం ఉంది. ఆమెవలన నాకు కొంత పరిజ్ఞానం కలిగింది. అది ఎలాగంటే – ఆమె డబ్బుమీద ఆశతో తన ప్రియుని మోసగించి ధనమిచ్చే మరొకనిని చేరదీసింది. వాడిని తన ఇంటిలోనికి తీసుకొనిపోయి రాత్రంతా నిద్రలేకుండా గడిపింది. పట్టణంలోనూ, బజారులలోనూ తిరుగుతూ నిద్రలేకపోవడంవల్ల నీరసపడింది. ధనవ్యామోహంలో పడి తిరిగి తిరిగి బడలిక చెందింది. కడకు తనను సుఖపెట్టువాడే భర్త అని ఆలోచించింది. శ్రీమన్నారాయణుని గురించి ఇలా చింతిస్తే ఆయన మోక్షం ప్రసాదిస్తాడుగదా అని భావించింది. తన శయనాగారం, ఇతర సంపదలు త్యజించింది. వెంటనే వాసుదేవుని పాదపద్మాలకు నమస్కరించాలనే కోరిక కలదై శరీరం మెరుపువలె చంచలమైనదని, అశాశ్వతమైనదని నిశ్చయించుకొని పరతత్త్వంపై మనస్సును లగ్నంచేసి మోక్షం పొందింది. అని తెలిపి

**క. దేహము నిత్యముగా దని, మోహముఁ దెగఁగోసి సిద్ధమునివర్తనుఁడై**
**గేహము వెలువడి నరుఁడు, త్సాహమునం జెందు ముక్తిసంపద ననఘా! 102**

**ప్రతి :** అనఘా= పాపరహితుడా! నరుఁడు= మానవుడు; దేహము= శరీరం; నిత్యము+కాదు+అని= స్థిరంకాదని; మోహమున్= మక్కువను; తెగన్+కోసి= ఖండించి; సిద్ధముని= సిద్ధిపొందిన మునివంటి; వర్తనుఁడు+ఐ= నడవడి

కలవాడై; గేహము వెలువడి= ఇల్లు విడిచి; ఉత్సాహమునన్= ఉత్సాహంతో; ముక్తిసంపదన్= మోక్షమనే సంపదను; చెందున్= పొందుతాడు.

**తా :** పాపరహితుడా! శరీరం స్థిరమైనదికాదని, మోహాన్ని విడిచి మానవుడు సిద్ధిపొందిన మునివలె ప్రవర్తిస్తూ, ఇల్లువిడిచి మోక్షసంపదను పొందుతాడు.

**వ. మఱియు నొక్కవిశేషం బయిన పురాతనపుణ్యకథ వినుము; కనకావతీపురంబున నొక్కధరామరుని కన్యకారత్నంబు గల; దవ్వధూతిలకంబు రత్నసమేతంబులగు కంకణంబులు ధరియించి బంధుజనంబులకుఁ బరమాహ్లాదంబుగా నన్నంబు గావించుటకొఱకు శాలితండులంబులు దంచునప్పుడు ముసలగ్రహణ భారంబునఁ గంకణంబు లతిరావంబుగా మ్రోయుచుండ న ప్పరమపతివ్రత యందులకు నసహ్యపడి యన్నియు దులిచి యొక్కటి నిలిపె; నట్లు గావునఁ దత్తఱపడక భగవదాయత్తంబైన యేకచిత్తంబునం బ్రసన్నచిత్తులై నరులు ముక్తు లగుదురు; గావున నవిద్యావిద్యలు నా మాయగా విచారించి, కేవలపశుమార్గులు కాక షడ్గుణైశ్వర్యసంపన్నులైన యోగీశ్వరులపగిది సుఖంబు గోరక యుండువారలు ముక్తులగుదురు; సర్వంబును విష్ణుమాయగాఁ దెలియు' మని యుద్ధవునికిం జెప్పిన నతండు 'దేవా! నీ రూపం బేలాగునం గానవచ్చు' ననిన నతం డిట్లనియె. 'భక్తిభావనపరాయణుండై కృపారసతత్పరుండై మితభాషణుండై బొంకక కర్మంబులు మదర్పణంబుగాఁ జేసినయతండు భాగవతుఁ డనం బరఁగు; మత్కథలును మజ్జన్మకర్మంబులును వినుచు మత్సేవకు లైన భాగవతులంజూచి తనగృహంబునకుం గొనిపోయి, మజ్జన పూజన భోజన శయనాసనాదికంబులఁ బరితుష్టులం జేసిన యతండైనను భాగవతుం డనఁబడు; నిట్లెంతకాలంబు జీవించు, నంతకాలంబును నడపు నతండు మద్రూపంబున వైకుంఠనిలయంబు నొందు; నదియునుంగాక గంధపుష్పధూపదీపనైవేద్యంబుల లక్ష్మీసమేతుండనై, శంఖ చక్ర గదాశార్ఙ్గాదియుక్తుఁడనైన నన్ను శుక సనకాది యోగీంద్రులును, నంబరీష విభీషణ రుక్మాంగదులు మొదలుగాఁగల భాగవతులును, శాస్త్రాచారచోదితులు గాక భక్తి భావనా విశేషంబున నేమఱక నిత్యంబును జింతనాయత్తులై యెఱింగిరి; మధురాపురంబునకు హలాయుధసమేతుండనై యే నరుగుచో, గోపిక లోపికలు లేక భక్తియోగంబునఁ జింతించి ముక్తలై; రిది భక్తియోగప్రకారం' బని యుద్ధవునికిం జెప్పిన. 103**

**ప్రతి :** మఱియున్= ఇంకా; ఒక్క విశేషంబు+అయిన= ఒక ప్రత్యేకతగల; పురాతన పుణ్యకథ; వినుము; కనకావతీ పురంబునన్= కనకావతి అనే పట్టణంలో; ఒక్క ధరా+అమరుని= ఒక బ్రాహ్మణుని; కన్యకారత్నంబు= రత్నం వంటి కన్య; కలదు= ఉంది; ఆ+వధూ తిలకంబు= ఆ కన్యకామణి; రత్నసమేతంబులు+అగు= మణులతో కూడిన; కంకణంబులు= చేతికంకణాలు, మురుగులు; ధరియించి= ధరించి; బంధుజనంబులకున్= చుట్టాలకు; పరమ+ఆహ్లాదంబు+కాన్= ఎంతో సంతోషంతో; అన్నంబు+కావించుటకొఱకున్= అన్నం వండడానికి; శాలితండులంబులు= వరిధాన్యం; దంచు+అప్పుడు= దంచేటప్పుడు; ముసలగ్రహణభారంబునన్= రోకలి పట్టుకోవడం వలన కలిగిన బరువుచేత; కంకణంబులు; అతిరావంబు+కాన్= పెద్దధ్వనితో; మ్రోయుచుండన్= మోగుతుండగా; ఆ+పరమ పతివ్రత= ఆ సతీతిలకం; అందులకున్=

దానికి; అసహ్యపడి= సహించలేక; అన్నియున్= అన్నింటిని; దులిచి= తొలగించి; ఒక్కటి నిలిపెన్= ఒక దానిని ఉంచింది; అట్లు+కావునన్= అందుచేత; తత్తఱపడక= తొందరపడకుండా; భగవత్+ఆయత్తంబు+ఐన= భగవంతుడికి అధీనమైన; ఏక చిత్తంబునన్= అనన్యమనస్సుతో; ప్రసన్నచిత్తులు+ఐ= నిర్మల మనస్కులై; నరులు= మానవులు; ముక్తులు+అగుదురు= ముక్తి పొందుతారు; కావునన్; అవిద్యా విద్యలు= అజ్ఞాన జ్ఞానాలను; నా మాయ+కాన్= నేను కల్పించిన మాయగా; విచారించి= ఎంచి; కేవల పశుమార్గులు+కాక= పశుబుద్ధితో వెళ్లకుండా; షడ్గుణ+ఐశ్వర్య= ఆరు గుణాల సంపదతో; సంపన్నులు+ఐన= కూడినవారైన; యోగి+ఈశ్వరులు పగిదిన్= యోగి వరులవలె; సుఖంబున్+కోరక= సుఖాన్ని ఆశించక; ఉండువారలు; ముక్తులు+అగుదురు= ముక్తి పొందుతారు; సర్వంబును= అంతటిని; విష్ణుమాయ+కాన్+ తెలియుము= విష్ణుమాయ అని తెలుసుకో; అని; ఉద్ధవునికిన్+చెప్పినన్= ఉద్ధవునికి చెప్పగా; అతండు= ఉద్ధవుడు; దేవా! నీరూపంబు= నీ రూపం; ఏలాగునన్= ఏ విధంగా; కానవచ్చున్+అనినన్= కనిపిస్తుంది అని అడుగగా; అతండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్; భక్తిభావన పరాయణుండు+ఐ= భక్తిభావనాపరుడై; కృపారసతత్పరుండు+ఐ= దయారసం కలవాడై; మితభాషణుండు+ఐ= తక్కువగా మాట్లాడువాడై; బొంకక= అబద్ధమాడక; కర్మంబులు; మత్+అర్పణంబు+కాన్= నాకు చెందేటట్లు; చేసిన+అతండు= చేసినవాడు; భాగవతుండు+అనన్+పరఁగున్= భాగవతుడనిపించుకొంటాడు; మత్+కథలును= నా కథలు; మత్+జన్మకర్మంబులున్= నా పుట్టుక, నేను చేసిన పనులు; వినుచున్= వింటూ; మత్+సేవకులు+ఐన= నా దాసులైన; భాగవతులన్+చూచి= భాగవతులను తిలకించి; తన గృహంబునకున్= తన ఇంటికి; కొనిపోయి= తీసుకొని వెళ్లి; మజ్జన= స్నాన; పూజన= పూజ; భోజన; శయన+ఆసన+ఆదికంబులన్= శయనాసనాదులతో; పరితుష్టులన్+చేసినన్= సంతృప్తులనుగా చేస్తే; అతండు+ఐనను= అతడైనా; భాగవతుండు+అనన్+ పడున్= భాగవతుడు అనిపించుకొంటాడు; ఇట్లు+ఎంతకాలంబు= ఇలా ఎంతకాలం; జీవించున్= బతుకుతాడో; అంతకాలంబును= అంతకాలం; నడపు+అతండు= జరిపేవాడు; మత్+రూపంబునన్= నా రూపంతో; వైకుంఠ నిలయంబున్+ఒందున్= వైకుంఠవాసాన్ని పొందుతాడు; అదియునున్+కాక= అదేగాక; గంధ పుష్ప ధూప దీప నైవేద్యంబుల్= గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం మొదలైన వాటితో; లక్ష్మీసమేతుండను+ఐ= లక్ష్మీసహితుడనై; శంఖ చక్ర గదా శార్ఙ్గాది యుక్తుఁడను+ఐన= శంఖ చక్ర గదా శార్ఙ్గాదులతో కూడినవాడనైన; నన్నున్; శుక సనక+ఆది= శుకుడు, సనకుడు మొదలైన; యోగి+ఇంద్రులును= యోగివర్యులు; అంబరీష రుక్మాంగదులు; మొదలు+కాన్+కల= మొదలైన; భాగవతులును; శాస్త్ర+ఆచారచోదితులు= శాస్త్రాలలో చెప్పబడిన ఆచారాలచేత ప్రేరేపించబడేవాళ్లే కాక; కాక; భక్తిభావనా విశేషంబునన్= భక్తి భావన కూడా; ఏమఱక= విడిచి పెట్టకుండా; నిత్యంబును= నిత్యం; చింతన+ఆయత్తులు+ఐ= చింతనతో కూడినవారై; ఎఱింగిరి= తెలుసుకొన్నారు; మధురాపురంబునకున్= మధురా నగరానికి; హలాయుధ సమేతుండను+ఐ= బలరామునితో కలసి; ఏన్= నేను; అరుగుచోన్= వెళ్లినప్పుడు; గోపికలు; ఓపికలు లేక= ఓర్పులులేక; భక్తియోగంబునన్+చింతించి= భక్తియోగంతో ధ్యానించి; ముక్తలు+ఐరి= మోక్షం పొందారు; ఇది; భక్తియోగప్రకారంబు= భక్తియోగ పద్ధతి; అని; ఉద్ధవునికిన్+చెప్పినన్= ఉద్ధవునికి చెప్పగా...

**తా :** ఇంకా ఒక ప్రత్యేకతగల పురాతనపుణ్యకథ చెపుతాను విను. "కనకావతీపురంలో ఒక బ్రాహ్మణునికూతురైన కన్యకారత్నం ఉంది. ఆమె మణిమయకంకణాలు ధరించి ఆనందంతో చుట్టాలకు అన్నం వండడానికి వరిధాన్యం దంచుతున్నది. దంచేటప్పుడు రోకలి బరువుతో చేతులలోని కంకణాలు ధ్వనిస్తూ మోగుతున్నాయి. ఆ ధ్వనిని అసహ్యించుకొని ఆ పరమపతివ్రత ఆ కంకణాలనన్నింటిని తీసివేసి ఒక్క కంకణాన్ని మాత్రమే ఉంచుకొన్నది. అందుచేత తొందరపడక

భగవత్పరమైన, అనన్య మనస్సుతో నిర్మలమనస్కులై నరులు మోక్షం పొందుతారు. కాబట్టి అజ్ఞానం, జ్ఞానం నేను కల్పించిన మాయ అని తెలిసి, పశువులు వెళ్లే మార్గంలో పోకుండా ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, జ్ఞానం, సిరి, వైరాగ్యం అనే షడ్గుణాలు కలిగిన యోగీశ్వరులవలె సుఖం కోరకుండా ఉండేవాళ్లు ముక్తులవుతారు. సర్వం విష్ణుమాయగా తెలుసుకో" అని శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి ఉపదేశం చేశాడు. అప్పుడతడు "దేవా! నీ రూపాన్ని ఎలా దర్శించవచ్చు" నని అడిగాడు. అందుకు శ్రీకృష్ణుడిలా అన్నాడు. "భక్తి భావనాపరుడై, దయాపరుడై, మితంగా మాట్లాడుతూ, అబద్ధాలాడకుండా, చేసే కర్మలన్నీ నాకు అర్పించేవాడు భాగవతుడు అనబడతాడు. నా కథలు, నా జననం, నా పనులూ వింటూ నా దాసులైన భాగవతులను ఇంటికి తీసుకొని వెళ్లి, వాళ్లను స్నానం, పూజ, భోజనం, శయనం, ఆసనం మొదలైన సపర్యలచేత సంతోషింపజేసిన వాడయినా భాగవతుడు అనబడతాడు. ఇలా ఎంతకాలం జీవిస్తాడో అంతకాలం ఇదేవిధంగా ఉండేవాడు నా రూపంతో వైకుంఠంలో ఉంటాడు.

అదీగాక శుకుడు, సనకుడు మొదలైన యోగీంద్రులూ, అంబరీషుడు, విభీషణుడు, రుక్మాంగదుడు మొదలైన భాగవతులూ శాస్త్రాచారాలు ప్రేరేపించడంచేతనే కాకుండా విశేషించిన భక్తితో, ఏమరపాటు రాకుండా లక్ష్మీసమేతుడను, శంఖ చక్ర గదా శార్ఙ్గాదులతో కూడినవాడను అయిన నన్ను గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం మొదలైనవి సమర్పిస్తూ ఎప్పుడూ ధ్యానిస్తూ తెలుసుకొన్నారు. మధురాపురానికి బలరామునితో కలసి నేను వెళ్లినప్పుడు గోపికలు ఓపిక లేకే (విరహాన్ని భరించలేక) భక్తియోగంతో నన్నే ధ్యానించి ముక్తి పొందారు. ఇదే భక్తియోగ పద్ధతి అని శ్రీకృష్ణుడు ఉద్ధవునికి చెప్పగా –

**క. 'ధ్యానం బేక్రియ నిలుచును?, ధ్యానం బే రీతిఁ దగు? నుదాత్తచరిత్రా!**
**ధ్యానప్రకార మంత య, నూనంబుగఁ జెప్పుమయ్య యుర్వీరమణా!' 104**

**ప్రతి :** ఉర్వీరమణా= భూపతీ!; ఉదాత్త చరిత్రా= గొప్పచరిత్ర కలవాడా!; ధ్యానంబు= ధ్యానం; ఏ క్రియన్= ఏ రీతిగా; నిలుచును= కుదురుతుంది; ధ్యానంబు= ఏ రీతిన్= ఏ విధంగా; తగున్= అవుతుంది; ధ్యాన ప్రకారము+అంతన్= ధ్యాన విధానాన్ని పూర్తిగా; అనూనంబు+కన్= కొరతలేకుండా; చెప్పుము+అయ్య= చెప్పవయ్యా!

**తా :** భూపతివైన శ్రీకృష్ణా! ఉదాత్తచరిత్రా! ధ్యానం ఎలా నిలుస్తుంది? ధ్యానం ఎలా ఉంటుంది? ధ్యానం ప్రకారమంతటిని కొరతలేకుండా చెప్పవయ్యా!

**వ. అని యడిగిన న య్యాదవేంద్రుం డి ట్లని పలుకం దొడంగె; 'దారుమధ్యభాగంబున ననలంబు సూక్ష్మరూపంబున వర్తించు చందంబున నందంబై సకలశరీరులయందు నచ్ఛేద్యుండు, నదాహ్యుండు, నశోష్యుండు నైన జీవుండు వసించి యుండు' ననిన హరికి నుద్ధవుం డిట్లనియె; 'సనకసనందనాది యోగీంద్రులకు యోగమార్గం బే రీతి నానతిచ్చితి, వది యే విధం? బానతీయవే' యని యభ్యర్థించిన నతం డిట్లనియె; 'వారలు చతుర్ముఖు నడిగిన నతండు, 'నేనును దెలియనేర' ననిన వారలు విస్మయం బందు చుండ నే నా సమయంబున హంసస్వరూపుండనై వారల కెఱింగించిన తెఱంగు వినుము; పంచేంద్రియంబులకు దృష్టం బయిన పదార్థం బనిత్యంబు;నిత్యదృష్టి బ్రహ్మం బని తెలియవలయు; దేహి కర్మార్జితదేహుండై సంసారమమతలు నిరసించి, నిశ్చలజ్ఞానయుక్తుండై మత్పదప్రాప్తుండగు; స్వప్న**

లబ్ధపదార్థంబు నిజంబు గాని క్రియఁ గర్మానుభవపర్యంతంబు కళేబరంబు వర్తించు నని సాంఖ్యయోగంబున సనకాదుల కెఱింగించిన విని, బ్రహ్మ మొదలైన దేవత లెఱింగిరి; వారివలన భూలోకంబునఁ బ్రసిద్ధం బయ్యెఁ; నది గావున నీవును నెఱింగికొని, పుణ్యాశ్రమంబులకుం జను; మస్మదీయభక్తి యుక్తుండును, హరిపరాయణుండు నైన యతనిచరణరజఃపుంజంబు తనశరీరంబు సోఁక జేయు నతండును, ముద్రాధారణపరులకును హరిదివ్యనామంబులు ధరియించువారలకు నన్నోదకంబుల నిడు నతండును, వాసుదేవభక్తులం గని హర్షించు నతండును, భాగవతుఁ'డని చెప్పి మఱియు 'సర్వసంగపరిత్యాగంబు సేసి, యొండెఱుంగక నన్నే తలంచు మానవునకు భుక్తి ముక్తి ప్రదాయకుండనై యుండుదు' నని యానతిచ్చిన నుద్ధవుండు 'ధ్యానమార్గం బే రీతి? యానతీయ వలయు' ననిన హరి యిట్లనియె; ఏకాంతమానసులై హస్తాబ్జంబు లూరుద్వయంబున సంధించి, నాసాగ్రంబున వీక్షణంబు నిలిపి, ప్రాణాయామంబున నన్ను హృదయగతుంగాఁ దలంచి, యష్టాదశధారణాయోగసిద్ధు లెఱింగి, యం దణిమాదులు ప్రధానసిద్ధులుగాఁ దెలిసి, యింద్రియంబుల బంధించి, మనం బాత్మయందుఁ జేర్చి, యాత్మ నాత్మతోఁ గీలించిన బ్రహ్మ పదంబుఁబొందు. భాగవతశ్రేష్ఠు లితరధర్మంబులు మాని నన్నుం గాంతురు; తొల్లి పాండునందనుఁడగు నర్జునుండు యుద్ధరంగంబున విషాదంబు నొంది యిట్ల యడిగిన నతనికి నేఁజెప్పిన తెఱం గెఱింగించెదఁ; జరాచరభూతంబయిన జగంబంతయు మదాకారంబుగా భావించి, భూతంబులందు నాధార భూతంబును, సూక్ష్మంబులందు జీవుండును, దుర్జయంబులందు మనంబును, దేవతలందుఁబద్మగర్భుండును, వసువులందు హవ్యవాహుండును, నాదిత్యులందు విష్ణువును, రుద్రులందు నీలలోహితుండును, బ్రహ్మలందు భృగువును, ఋషులందు నారదుండును, ధేనువులందుఁ గామధేనువును, సిద్ధులయందుఁ గపిలుండును, దైత్యులయందుఁ బ్రహ్లాదుండును, గ్రహంబులందుఁ గళానిధియును, గజంబులయం దైరావతంబును, హయంబులయం దుచ్చైశ్శ్రవంబును, నాగంబులందు వాసుకియును, మృగంబులందుఁ గేసరియు, నాశ్రమంబు లందు గృహస్థాశ్రమంబును, వర్ణంబులయం దోంకారంబును, నదులందు గంగయు, సాగరంబులయందు దుగ్ధసాగరంబును, నాయుధంబులందుఁ గార్ముకంబును, గిరులందు మేరువును, వృక్షంబులయం దశ్వత్థంబును, నోషధులయందు యవలును, యజ్ఞంబులయందు బ్రహ్మయజ్ఞంబును, వ్రతంబులం దహింసయు, యోగంబులం దాత్మయోగంబును, స్త్రీలయందు శతరూపయు, భాషణంబుల యందు సత్యభాషణంబును, ఋతువులందు వసంతాగమంబును, మాసంబులలో మార్గశీర్షంబును, నక్షత్రంబులలో నభిజిత్తును, యుగంబులందుఁగృతయుగంబును, భగవదాకారంబులందు వాసుదేవుండును, యక్షులలోఁ గుబేరుండును, వానరులం దాంజనేయుండును, రత్నంబులందుఁ బద్మరాగంబును, దానంబులలో నన్నదానంబును, దిథులయం దేకాదశియు, నరులయందు వైష్ణవుండై భాగవతప్రవర్తనం బ్రవర్తించువాఁడును – నివి యన్నియు మద్విభూతులుగా నెఱుంగు'మని కృష్ణుం డుద్ధవునకు నుపన్యసించిన వెండియు నతండి ట్లనియె. 105

**ప్రతి :** అని+అడిగినన్= అని అడుగగా; ఆ+యాదవ+ఇంద్రుండు= ఆ శ్రీకృష్ణుడు; ఇట్లు+అని; పలుకన్+తొడంగెన్= చెప్పనారంభించాడు; దారుమధ్య భాగంబునన్= కొయ్యనడుమ; అనలంబు= అగ్ని; సూక్ష్మరూపంబునన్= స్వల్పంగా; వర్తించే చందంబునన్= ఉండే విధంగా; అందంబు+ఐ= అందంగా; సకల= అన్ని; శరీరుల+అందున్= శరీరాలతోనూ; అచ్ఛేద్యుండున్= ఛేదింపరానివాడును; అదాహ్యుండున్= దహింపరాని వాడును; అశోష్యుండున్= ఎండింపరానివాడును; ఐన; జీవుండు; వసించి+ఉండున్= నివసిస్తూ ఉంటాడు; అనినన్= అనగా; హరికిన్= శ్రీకృష్ణునితో; ఉద్ధవుండు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; సనకసనందన+ఆది= సనకుడు, సనందనుడు మున్నగు; యోగి+ఇంద్రులకు; యోగమార్గంబు; ఏ రీతిన్= ఏ విధంగా; ఆనతి+ఇచ్చితి(వి)= తెలియజేశావు; అది ఏవిధంబు= అది ఎలాంటిది; ఆనతి+ ఈయవు+ఏ= ఆనతివ్వు; అని; అభ్యర్థించినన్= ప్రార్థించగా; అతండు= శ్రీకృష్ణుడు; ఇట్లు+అనియెన్; వారలు; చతుర్ముఖున్+ అడిగినన్= బ్రహ్మను అడుగగా; అతండు; నేనును= నేనుకూడా; తెలియనేరన్= తెలియనైతిని; అనినన్; వారలు= వాళ్లు; విస్మయంబు+అందుచున్+ఉండన్= ఆశ్చర్యపడుచుండగా; నేను+ఆ సమయంబునన్= నేనప్పుడు; హంసస్వరూపుండను+ ఐ= హంసరూపంలో ఉండి; వారలకు+ఎఱింగించిన= వాళ్లకు తెలియజేసిన; తెఱంగు= విధానం; వినుము; పంచ+ ఇంద్రియంబులకున్= ఐదు ఇంద్రియాలకు; దృష్టంబు+అయిన= కనిపించిన; పదార్థంబు= వస్తువు; అనిత్యంబు= శాశ్వతం కాదు; నిత్యదృష్టి= ఎప్పటికీ ఉండే చూపు (ఎప్పటికీ కనిపించేది); బ్రహ్మంబు+అని= బ్రహ్మమని; తెలియవలయున్= తెలుసుకోవాలి; దేహి= శరీరి; కర్మ+ఆర్జితదేహుండు+ఐ= కర్మలచేత ప్రాప్తించిన శరీరంగలవాడై; సంసారమమతలు= సంసారంలోని మమకారాలు; నిరసించి= తోసిపుచ్చి; నిశ్చల జ్ఞానయుక్తుండు+ఐ= స్థిరమైన జ్ఞానంతో కూడినవాడై; మత్+పదప్రాప్తుండు+అగున్= నా స్థితిని పొందిన వాడవుతాడు; స్వప్నలబ్ధ= కలలో పొందిన; పదార్థంబు= వస్తువు; నిజంబు+కాని క్రియన్= సత్యంకాని విధంగా; కర్మ+అనుభవ పర్యంతంబు= కర్మఫలం అనుభవించేవరకు; కళేబరంబు= శరీరం; వర్తించున్+అని= ఉంటుందని; సాంఖ్యయోగంబునన్= సాంఖ్యయోగపద్ధతిలో; సనకాదులకు; ఎఱింగించినన్+విని= తెలుపగా విని; బ్రహ్మ; మొదలైన; దేవతలు; ఎఱింగిరి= తెలుసుకొన్నారు; వారివలనన్= వాళ్లవల్ల; భూలోకంబునన్= భూలోకంలో; అది; ప్రసిద్ధంబు+అయ్యెన్= ప్రసిద్ధమైంది; కావునన్= కాబట్టి; నీవును= నీవుకూడా; ఎఱింగికొని= తెలుసుకొని; పుణ్య+ఆశ్రమంబులకున్+చనుము= పవిత్రమైన ఆశ్రమాలకు వెళ్లు; అస్మదీయ భక్తియుక్తుండును= నాయందు భక్తి గలవాడును; హరిపరాయణుండును+ఐన= విష్ణుపరుడు అయిన; అతని; చరణరజస్+పుంజంబు= పాదధూళి సమూహం; తన శరీరంబు; సోఁకన్+చేయు+అతండును= తాకించుకొన్నవాడూ; ముద్రాధారణపరులకును= ముద్రలు ధరించుటయందు ఆసక్తిగల వాళ్లకు; హరి; దివ్యనామంబులు= ఊర్ధ్వపుండ్రాలు; ధరియించువారలకును= ధరించేవాళ్లకు; అన్న+ఉదకంబులన్+ ఇడు+అతండును= అన్నం, నీరు ఇచ్చేవాడూ; వాసుదేవభక్తులన్= విష్ణుభక్తులను; కని= చూచి; హర్షించు+అతండును= సంతోషించేవాడూ; భాగవతుఁడు+అని= భాగవతుడు అని; చెప్పి; మఱియున్= మరల; సర్వసంగపరిత్యాగంబు+చేసి= అన్ని సాంగత్యాలు విడిచిపెట్టి; ఒండు+ఎఱుంగక= ఇంకొకటి తెలియక; నన్నున్+ఏ= నన్నే; తలంచు= ఆలోచించే; మానవునకున్; భుక్తి ముక్తి ప్రదాయకుండను+ఐ= భుక్తీ ముక్తీ ఇచ్చేవాడనై; ఉండుదున్= ఉంటాను; అని; ఆనతి+ఇచ్చినన్; ఉద్ధవుండు; ధ్యానమార్గంబు+ఏ రీతి= ధ్యానపద్ధతి ఎలా ఉంటుంది; ఆనతి+ఈయన్+వలయున్= చెప్పవలసింది; అనినన్; హరి; ఇట్లు+అనియెన్; ఏకాంత మానసులు+ఐ= ఏకాగ్రమైన మనస్సు కలవారై; హస్త+అబ్జంబులు= కరకమలాలు; ఊరుద్వయంబునన్= రెండు తొడలమీద; సంధించి= ఉంచి; నాస+అగ్రంబునన్= ముక్కు కొనమీద; వీక్షణంబున్= చూపును; నిలిపి; ప్రాణాయామంబునన్= ప్రాణాయామంతో; నన్ను; హృదయగతున్+కాన్= మనస్సులో ఉన్నవాడుగా;

తలంచి; అష్టాదశ= పదునెనిమిది; ధారణాయోగ సిద్ధులు+ఎఱింగి= ధారణలు, యోగాలు, సిద్ధులు తెలుసుకొని; అందున్= వాటిలో; అణిమా+ఆదులు= అణిమ మొదలైనవి; ప్రధాన సిద్ధులు+కాన్+తెలిసి= ముఖ్యమైన సిద్ధులుగా తెలుసుకొని; ఇంద్రియంబులన్= ఇంద్రియాలను; బంధించి= కట్టడిచేసి; మనంబు+ఆత్మయందున్= మనస్సును ఆత్మయందు; చేర్చి; ఆత్మన్+ఆత్మతోన్= ఆత్మను ఆత్మతో; కీలించినన్= లగ్నంచేస్తే; బ్రహ్మపదంబున్+పొందున్= బ్రహ్మపదాన్ని పొందుతాడు; భాగవతశ్రేష్ఠులు; ఇతర ధర్మంబులున్= ఇతర విషయాలను; మాని= వదలి; నన్నున్= నన్ను; కాంతురు= దర్శిస్తారు; తొల్లి= పూర్వం; పాండు నందనుఁడు+అగు= పాండురాజు కొడుకైన; అర్జునుండు; యుద్ధరంగంబునన్= యుద్ధభూమిలో; విషాదంబున్+ఒంది= విచారం పొంది; ఇట్లు+అ= ఇలా; అడిగినన్; అతనికిన్= అతనికి; ఏన్= నేను; చెప్పినతెఱంగున్= చెప్పిన విధం; ఎఱింగించెదన్= తెలియజేస్తాను. చర+అచరభూతంబు+అయిన= కదిలే, కదలని ప్రాణులతో కూడిన; జగంబు+అంతయున్= లోకమంతా; మత్+ఆకారంబు+కాన్= నారూపంగా; భావించి= తలచి; భూతంబుల+అందున్= ప్రాణులలో; ఆధారభూతంబును= ముఖ్యమైన ప్రాణిగా; సూక్ష్మంబుల+అందున్= సూక్ష్మాలలో; జీవుండును= జీవుడుగా; దుర్జయంబుల+అందున్= జయింపరాని వాటిలో; మనంబును= మనస్సుగా; దేవతల+అందున్= దేవతలలో; పద్మగర్భుండును= బ్రహ్మగా; వసువుల+అందున్= వసువులలో; హవ్యవాహుండును= అగ్నిగా; ఆదిత్యుల+అందున్= దేవతలలో; విష్ణువును= విష్ణువుగా; రుద్రుల+అందున్= రుద్రులలో; నీలలోహితుండును= శివుడుగా; బ్రహ్మలందున్= బ్రహ్మలలో; భృగువును= భృగువుగా; ఋషుల+అందున్= ఋషులలో; నారదుండును= నారదుడుగా; ధేనువుల+అందున్= ఆవులలో; కామధేనువును= కామధేనువుగా; సిద్ధుల+అందున్= సిద్ధులలో; కపిలుండును= కపిలుడుగా; దైత్యుల+అందున్= రాక్షసులలో; ప్రహ్లాదుండును= ప్రహ్లాదుడుగా; గ్రహంబుల+అందున్= తారలలో; కళానిధియును= చంద్రుడుగా; గజంబుల+అందున్= ఏనుగులలో; ఐరావతంబును= ఐరావతంగా; హయంబుల+అందున్= గుర్రాలలో; ఉచ్చైశ్రవంబును= ఉచ్చైశ్రవంగా; నాగంబుల+అందున్= సర్పాలలో; వాసుకియును= వాసుకిగా; మృగంబుల+అందున్= జంతువులలో; కేసరియును= సింహంగా; ఆశ్రమంబుల+అందున్= ఆశ్రమాలలో; గృహస్థ+ఆశ్రమంబును= గృహస్థాశ్రమంగా; వర్ణంబులయందున్= అక్షరాలలో; ఓంకారంబును= ఓంకారంగా; నదులందున్= నదులలో; గంగయు= గంగగా; సాగరంబుల+అందున్= సముద్రాలలో; దుగ్ధసాగరంబును= పాలకడలిగా; ఆయుధంబుల+అందున్= ఆయుధాలలో; కార్ముకంబును= విల్లుగా; గిరులందున్= పర్వతాలలో; మేరువును= మేరుపర్వతంగా; వృక్షంబులయందున్= చెట్లలో; అశ్వత్థంబును= అశ్వత్థవృక్షంగా; ఓషధుల+అందున్= మూలికలలో; యవలును= యవలుగా; యజ్ఞంబుల+అందున్= యజ్ఞాలలో; బ్రహ్మయజ్ఞంబును= బ్రహ్మయజ్ఞంగా; వ్రతంబుల+అందున్= వ్రతాలలో; అహింసయు= అహింసగా; యోగంబుల+అందున్= యోగాలలో; ఆత్మయోగంబును= ఆత్మయోగంగా; స్త్రీల+అందున్; శతరూపయు= శతరూపగా; భాషణంబుల+అందున్= మాటలలో; సత్యభాషణంబును= సత్యవాక్కుగా; ఋతువుల+అందున్= ఋతువులలో; వసంతాగమంబును= వసంతఋతువుగా; మాసంబులలో= నెలలలో; మార్గశీర్షంబును= మార్గశిరంగా; నక్షత్రంబులలోన్= నక్షత్రాలలో; అభిజిత్తును= అభిజిత్తుగా; యుగంబుల+అందున్= యుగాలలో; కృతయుగంబును= కృతయుగంగా; భగవత్+ఆకారంబుల+అందున్= భగవంతుని రూపాలలో; వాసుదేవుండును= వాసుదేవుడుగా; యక్షులలోన్= యక్షులలో; కుబేరుండును= కుబేరుడుగా; వానరుల+అందున్= వానరులలో; ఆంజనేయుండును= ఆంజనేయుడుగా; రత్నంబుల+అందున్= రత్నాలలో; పద్మరాగంబును= పద్మరాగంగా; దానంబులలోన్= దానాలలో; అన్నదానంబును= అన్నదానంగా; తిథుల+అందున్= తిథులలో; ఏకాదశియు= ఏకాదశిగ; నరుల+అందున్= మానవులలో; వైష్ణవుండు+ఐ=

వైష్ణవుడై; భాగవత ప్రవర్తనన్= భాగవతుడినడతతో; ప్రవర్తించువాఁడును= ప్రవర్తించేవాడుగా; ఇవి+అన్నియున్= ఇవన్నీ; మత్+విభూతులు+కాన్= నా విభూతులుగా; ఎఱుంగుము+అని= తెలుసుకొమ్మని; కృష్ణుండు; ఉద్ధవునకున్= ఉద్ధవునితో; ఉపన్యసించినన్= చెప్పగా; వెండియున్= మరల; అతండు= ఉద్ధవుడు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అని ఉద్ధవుడు అడుగగా శ్రీకృష్ణుడిట్లా అన్నాడు. కొయ్యనడుమ అగ్ని సూక్ష్మరూపంలో ఉండే విధంగా అన్ని శరీరాల్లోనూ ఛేదింప వీలుకాని, దహింప వీలుకాని, ఎండింప వీలుకాని జీవుడు నివసిస్తూ ఉంటాడు. ఆ మాట విన్న ఉద్ధవుడు హరితో ఇలా అన్నాడు. 'సనకుడు, సనందుడు మొదలైన యోగీంద్రులకు యోగమార్గం ఏ విధంగా బోధించావు? ఆ మార్గం ఎలాంటిది?' చెప్పుమని కోరగా శ్రీకృష్ణుడిలా అన్నాడు. 'సనకాదులు మొదట ఈ విషయం బ్రహ్మను అడిగారు. బ్రహ్మ తనకు కూడా తెలియదన్నాడు. దానికి వాళ్లు ఆశ్చర్యపడుతుంటే నేనా సమయంలో హంసరూపం ధరించి వాళ్లకు చెప్పిన విధం వినుము. పంచేంద్రియాలకు కనిపించే పదార్థం అనిత్యం (అశాశ్వతం). నిత్యమైంది బ్రహ్మం మాత్రమే. జీవుడు తన కర్మల వల్ల పొందిన శరీరంతో సంసారంలో మమకారాన్ని వదిలిపెట్టి నిశ్చలమైన జ్ఞానంతో నా లోకమైన వైకుంఠం చేరుతాడు. కలలో దొరికే పదార్థం నిజం కానట్లుగా కర్మానుభవం అయినంతవరకు శరీరం ఉంటుంది. అని సాంఖ్యయోగంలో సనకాదులకు తెలిపితే విని బ్రహ్మ మొదలైన దేవతలు తెలుసుకొన్నారు. అది వాళ్ల వల్ల భూలోకంలో ప్రసిద్ధమైంది. కాబట్టి నీవు కూడా దానిని తెలుసుకొని పుణ్యాశ్రమాలకు వెళ్లు. నాయందు భక్తి కలవాడు, ఆసక్తి కలవాడు అయిన వాని పాదధూళిని తన శరీరానికి తాకించుకొనేవాడు; శంఖచక్రాదిముద్రలు ధరించిన వాళ్లకు, శ్రీహరిదివ్యనామాలను (ఊర్ధ్వపుండ్రాలను) ధరించినవాళ్లకు అన్నమూ, నీళ్లూ ఇచ్చేవాడు; వాసుదేవునిభక్తులను చూచి సంతోషించేవాడు భాగవతుడు. అన్ని సాంగత్యాలను వదిలిపెట్టి అన్యం తెలియక నన్నే తలచే మానవుడికి భుక్తినీ, ముక్తినీ ఇస్తాను" అని ఆనతీయగా ఉద్ధవుడు ధ్యానమార్గస్వరూపాన్ని తెలుపుమన్నాడు. శ్రీహరి ఇలా చెప్పాడు. ఏకాగ్రచిత్తులై కరకమలాలు రెండు తొడలపై పెట్టి ముక్కుకొనపై దృష్టి నిలిపి ప్రాణాయామంతో నన్ను హృదయగతుని గావించి, పదునెనిమిది విధాలైన ధారణా యోగసిద్ధులను తెలిసికొని, వాటిలో అణిమ మున్నగు వాటిని ముఖ్యసిద్ధులుగా గ్రహించి, ఇంద్రియాలను బంధించి, మనస్సును ఆత్మలోచేర్చి, ఆత్మను ఆత్మతో లగ్నంచేసి బ్రహ్మపదాన్ని పొందే భాగవతశ్రేష్ఠులు ఇతర విషయాలు మాని నన్ను పొందుతారు. పూర్వం పాండురాజు కొడుకైన అర్జునుడు యుద్ధరంగంలో విషణ్ణుడై ఇలాగే అడిగితే అతనికి నేను చెప్పిన విధం నీకు తెలియజేస్తాను. చరాచరాత్మకమైన లోకమంతా నారూపంగా భావించి, భూతాలలో ఆధారభూతం; సూక్ష్మాలలో జీవుడు; జయింపరాని వాటిలో మనస్సు; దేవతలలో బ్రహ్మ; వసువులలో అగ్ని; ఆదిత్యులలో (దేవతలలో) విష్ణువు; రుద్రులలో శివుడు; బ్రహ్మలలో భృగువు; ఋషులలో నారదుడు; ఆవులలో కామధేనువు; సిద్ధులలో కపిలుడు; రాక్షసులలో ప్రహ్లాదుడు; గ్రహాలలో (నక్షత్రాలలో) చంద్రుడు; ఏనుగులలో ఐరావతం; గుర్రాలలో ఉచ్చైశ్రవం; సర్పాలలో వాసుకి; జంతువులలో సింహం; ఆశ్రమాలలో గృహస్థాశ్రమం; అక్షరాలలో ఓంకారం; నదులలో గంగ; సముద్రాలలో పాలసముద్రం; ఆయుధాలలో విల్లు; కొండలలో మేరుపర్వతం; చెట్లలో అశ్వత్థం (రావిచెట్టు); మూలికలలో యవలు; యజ్ఞాలలో బ్రహ్మయజ్ఞం; వ్రతాలలో అహింసావ్రతం; యోగాలలో ఆత్మయోగం; స్త్రీలలో శతరూప; వాక్కులలో సత్యవాక్కు; ఋతువులలో వసంతం; మాసాలలో మార్గశిరం; నక్షత్రాలలో అభిజిత్తు; యుగాలలో కృతయుగం; భగవంతుని రూపాలలో వాసుదేవుడు; యక్షులలో కుబేరుడు; కోతులలో ఆంజనేయుడు; రత్నాలలో పద్మరాగం, దానాలలో అన్నదానం; తిథులలో ఏకాదశి; నరులలో వైష్ణవుడై భాగవతుడిలా ప్రవర్తించేవాడు – ఇవన్నీ నా విభూతులుగా తెలుసుకో' అని శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి చెప్పగా మళ్లీ ఉద్ధవుడిలా అన్నాడు.

**క. వర్ణాశ్రమధర్మంబులు, నిర్ణయముగ నానతిమ్ము నీరజనాభా!**
**కర్ణరసాయనముగ నవి, వర్ణింపుము, వినెద నేఁడు వనరుహనేత్రా! 106**

**ప్రతి :** నీరజనాభా= పద్మం నాభియందు కలవాడా!; వనరుహనేత్రా= కమలనయనా; వర్ణ+ఆశ్రమధర్మంబులు= వర్ణములు, ఆశ్రమములు, వాని ధర్మాలు; నిర్ణయము+కన్= వివరంగా; ఆనతి+ఇమ్ము; అవి; కర్ణరసాయనముగన్= చెవులకు ఇంపుగా; వర్ణింపుము; నేఁడు; వినెదన్= వింటాను.

**తా :** పద్మనాభా! కమలనయనా! వర్ణాలు, ఆశ్రమాలు, వాటిధర్మాలు నిర్ణయించి, చెవులకు ఇంపుగా ఆనతిస్తే నేడు వింటాను.

**వ. అనినం గృష్ణుండు నాలుగువర్ణంబుల యుత్పత్తియు నాలు గాశ్రమంబుల కిట్టిట్టి వర్తంబు లన్నియును, నాలుగువేదంబులం జెప్పిన ధర్మంబులును, బ్రవృత్తినివృత్తిహేతువులగు పురాణేతిహాసశాస్త్రంబులును, వైరాగ్య విజ్ఞానంబులును నివి మొదలుగాఁగల వన్నియు నెఱింగించి, "సర్వధర్మాన్పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ" యను నుపనిషత్తుల్యంబగు గీతావచనప్రకారంబున నెవ్వఁడేని నా యందు మతి గలిగి వర్తించువాఁడు నే నని పలుకంబడుఁ; బెక్కు విధంబుల వాదంబు లేల? యని యెందును దగులువడక నామీఁదఁ దలంపు గలిగి వర్తింపు' మనిన నుద్ధవుం డిట్లనియె. 107**

**ప్రతి :** అనినన్= అనగా; కృష్ణుండు; నాలుగువర్ణంబులు= బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల; ఉత్పత్తియున్= పుట్టుక; నాలుగు+ఆశ్రమంబులకున్= నాలుగాశ్రమాలకు; ఇట్టి+ఇట్టివి+అర్థంబులు= ఈ ఈ పనులు తగినవి; అన్నియును= ఇవన్నీ; నాలుగు వేదంబులన్+చెప్పిన= ఋగ్యజుస్సామాథర్వ వేదాలలో చెప్పిన; ధర్మంబులును= ధర్మాలూ; ప్రవృత్తి= ప్రవర్తించడానికి; నివృత్తి= నివర్తించడానికి (మరలడానికి); హేతువులు+అగు= కారణాలైన; పురాణ+ఇతిహాస శాస్త్రంబులును= పురాణాలూ , ఇతిహాసాలూ, శాస్త్రాలూ; వైరాగ్యవిజ్ఞానంబులును= వైరాగ్యానికి సంబంధించిన విజ్ఞానాలనూ; ఇవి మొదలు+కాన్+కలవి+అన్నియున్= మున్నుగా గల అన్నిటిని; ఎఱింగించి= తెలిపి; సర్వధర్మాన్= అన్ని ధర్మాలను; పరిత్యజ్య= విడిచిపెట్టి; మామ్= నన్ను; ఏకమ్= ఒక్కని మాత్రం; శరణం వ్రజ= శరణుపొందు; అను; ఉపనిషత్+తుల్యంబు+అగు= అనే ఉపనిషత్సమానమైన; గీతావచనప్రకారంబునన్= భగవద్గీతలోని వచనం చొప్పున; ఎవ్వఁడు+ఏనిన్= ఎవడైనా; నా+అందున్= నాయందు; మతి+కలిగి= బుద్ధి కలిగి; వర్తించువాఁడు= ప్రవర్తించేవాడు; నేను+అని; పలుకన్+పడున్= పలుకబడును (చెప్పబడతాడు); పెక్కు విధంబుల= పలురకాలైన; వాదంబులు+ఏల= వాదాలెందుకు? అని; ఎందును+తగులు+పడక= దేనిమీదా మనస్సు లగ్నం చేసుకోకుండా; నా మీఁదన్= నామీదనే; తలంపు+కలిగి= మనస్సు కలిగి; వర్తింపుము= నడచుకో; అనినన్; ఉద్ధవుండు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అని ఉద్ధవుడు అడుగగా శ్రీకృష్ణుడు నాలుగువర్ణాల పుట్టుకా, నాలుగు ఆశ్రమాలకు తగిన పనులూ, నాలుగు వేదాలలో చెప్పిన ధర్మాలూ, ప్రవర్తించడానికి, నివర్తించడానికి కారణాలైన పురాణాలూ, ఇతిహాసాలూ, శాస్త్రాలూ, వైరాగ్యానికి సంబంధించిన విజ్ఞానాలూ మొదలైనవన్నీ తెలిపాడు. 'అన్నిధర్మాలను వదిలిపెట్టి నన్నొక్కడినే శరణుపొందు' అనే ఉపనిషత్తుల్యమైన భగవద్గీతావచనం చొప్పున నాయందు మనస్సు పెట్టి ఉండేవాడు నేనే నని చెప్పబడుతాడు. పలురకాల వాదాలెందుకు? దేనిమీదా మనస్సు లగ్నం కానీక నా మీదనే మనస్సు కలిగి నడచుకో అని చెప్పగా ఉద్ధవుడు ఇలా అన్నాడు.

**విశే :** వచనంలో ఈ ప్రతిపాదింపబడిన అతి సులభమైన భక్తి, ప్రపత్తి, శరణాగతి ముక్తికి హేతువులుగా చెప్పబడడంవల్ల పాండిత్యం లేనివారు, గొప్పశాస్త్రాలు చదువలేనివారు కూడా ముక్తికోసం దిగులు చెందవలసిన అవసరంలేదని, నిర్మలమైన దైవభక్తి ఉంటే చాలునని తెలుస్తుంది.

**క. 'తెలియనివి కొన్ని సెప్పితి; తెలియంగల వెల్ల నింకఁ దెలుపుము కృష్ణా!**
**వల నెఱిఁగి మెలఁగవలయును, నలినాసనజనక! భక్తనతపదయుగళా!' 108**

**ప్రతి :** నలిన+ఆసనజనక= పద్మం ఆసనంగా గల బ్రహ్మకు తండ్రియైనవాడా! భక్త= భక్తులచేత; నత= నమస్కరింప బడిన; పదయుగళా= చరణద్వంద్వం కలవాడా! కృష్ణా! తెలియనివి; కొన్ని+చెప్పితి (వి)= కొన్ని చెప్పావు; తెలియన్+కలవి+ ఎల్లన్= ఇకముందు తెలుసుకోవలసినవన్నీ; ఇంకన్= ఇంకా; తెలుపుము; వలను+ఎఱిఁగి= ఉపాయం తెలిసి; మెలగవలయును= నడచుకోవాలి;

**తా :** బ్రహ్మకు తండ్రియైనవాడా! భక్తులు నమస్కరించే పాదద్వంద్వం కలవాడా! శ్రీకృష్ణా! నాకు తెలియని విషయాలు కొన్ని చెప్పావు. ఇంకా తెలుసుకోవలసిన వాటినిగురించి చెప్పు. ఉపాయంతో ప్రవర్తిస్తాను.

**వ. అని యుద్ధవుం డడిగినం బ్రబుద్ధమనస్కుండయిన పుండరీకాక్షుండు 'నీ ప్రశ్నంబులు దుర్లభంబు లయినను వినుము; నియమశమదమాదులు దపంబును సుఖదుఃఖంబులు స్వర్గనరకంబులు ననం బరఁగినవి యెవ్వి, దరిద్రుం డెట్టివాఁ డీశ్వరుం డెవ్వం, డని నీవు న న్నడిగిన యర్థంబు లెల్ల వేఱు వేఱ వివరించెద; మౌనవ్రతబ్రహ్మచర్యక్షమాజపతపంబులును, నతిథిసత్కారంబును, బరహితంబును జౌర్యాది రహితత్వంబును ననునివి మొదలైనవి నియమంబు లనందగు; నింద్రియనిగ్రహంబును, శత్రుమిత్ర సమత్వంబును శమం బనంబరఁగు; మూఢజనులకు జ్ఞానోపదేశంబును, గామ్యత్యాగంబును, సమదర్శనంబును, వైష్ణవసమూహంబులతోడి భక్తియుఁ, బ్రాణాయామంబును, జిత్తశుద్ధియు ననునివి కలిమివిద్య యనంబడు; శమదమాదిగుణరహితుండును, మద్భక్తివిరహితుండును నగుట యవిద్య యనందగుఁ; జిత్తశుద్ధి గలిగి నిత్యతృప్తుండౌట దమం; బిట్టి నియమాదిగుణసహితత్వంబును మద్భక్తియుక్తియు ననునదియే సుఖంబు; నన్నెఱుంగలేక తమోగుణంబునం బరఁగుటయె దుఃఖం బనంబడు; బంధుగురు జనంబులయెడ భేదబుద్ధి నొంది, శరీరంబు నిజగృహంబుగా భావించినవాఁడె దరిద్రుం; డింద్రియ నిరసనుండును, గుణసంగవిరక్తుండు నైనవాఁడె యీశ్వరుండు; నాయందుఁ దలంపు నిలిపి, కర్మయోగంబునందును, భక్తియోగంబునందును వాత్సల్యంబు గలిగి జనకాదులు కైవల్యంబుఁ జెందిరి; భక్తియోగంబునం జేసి బలిప్రహ్లాద ముచుకుందాదులు పరమపదప్రాప్తులై; రది గావున నిది యెఱింగి నిరంతరభక్తియోగం బధికంబుగా నీ మనంబున నిలుపుము; మృణ్మయం బైన ఘటంబున జలంబులు జాలుగొను తెఱంగున దినదినంబునకు నాయువు క్షయంబై మృత్యువు సన్నిహితంబై వచ్చుఁ గావున నిది యెఱింగి నిరతరంబును న న్నేమఱక తలంచుచుండు నతండు నాకుం బ్రియుండు. 109**

**ప్రతి :** అని; ఉద్ధవుండు; అడిగినన్= అడుగగా; ప్రబుద్ధ= జాగృతమైన; మనస్కుండు+అయిన= మనస్సు కలవాడైన; పుండరీక+అక్షుండు= తెల్లతామరలవంటి కనులు గలవాడైన శ్రీకృష్ణుడు; నీ ప్రశ్నంబులు= నీ ప్రశ్నలు; దుర్లభంబులు= క్లిష్టమైనవి; అయినను; వినుము; నియమ శమ దమ+ఆదులు= నియమాలు, అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహాలు మొదలైనవి; తపంబును= తపస్సు; సుఖదుఃఖంబులు= సుఖదుఃఖాలు; స్వర్గనరకంబులున్= స్వర్గనరకాలు; అనన్+పరఁగినవి= అని చెప్పబడేవి; ఎవ్వి?; దరిద్రుండు+ఎట్టివాఁడు= దరిద్రుడు ఎలాంటివాడు?; ఈశ్వరుండు+ఎవ్వండు= ఐశ్వర్యవంతుడు ఎవరు?; అని; నీవు; నన్నున్+అడిగిన= నన్నడిగిన; అర్థంబులు+ఎల్లన్= విషయాలనన్నిటినీ; వేఱువేఱు+అ= వేరువేరుగా; వివరించెదన్= వివరిస్తాను; మౌనవ్రత= మౌనవ్రతం; బ్రహ్మచర్య= బ్రహ్మచర్యం; క్షమా= ఓర్పు; జపతపంబులును= జపతపాలు; అతిథి సత్కారంబును; పరహితంబును= ఇతరులకు చేయు మేలు; చౌర్య+ఆదిరహితత్వంబును= దొంగతనం మొదలైనవి లేకుండుట; అను+ఇవి= అనేటువంటివి; నియమంబులు+అనన్+తగున్= నియమాలు అనబడతాయి; ఇంద్రియ నిగ్రహంబును= ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడం; శత్రుమిత్రసమత్వంబును= శత్రులయెడ, మిత్రులయెడ సమానంగా ఉండడం; శమంబు+అనన్+పరఁగున్= శమమని చెప్పబడుతుంది; మూఢజనులకున్= అజ్ఞానులకు; జ్ఞాన+ఉపదేశంబును= జ్ఞానాన్ని ఉపదేశించడం; కామ్యత్యాగంబును= కోరికలను వదలిపెట్టడం; సమదర్శనంబును= సమంగా దర్శించడం; వైష్ణవ సమూహంబుల తోడి= విష్ణుభక్తుల సమూహంపట్ల; భక్తియున్= భక్తీ; ప్రాణాయామంబును= ప్రాణవాయువును నిరోధించడమనే యోగం; చిత్తశుద్ధియున్= మనోనిర్మలత్వం; అను+ఇవి+కలిమి= అనే ఇవి కల్గి ఉండడం; విద్య= విద్య; అనఁబడున్= అనబడుతుంది; శమ దమ+ఆది= అంతరింద్రియ బహిరింద్రియాది; గుణరహితుండును= గుణాలులేనివాడు; మత్+భక్తి విరహితుండును= నాయందు భక్తిలేనివాడు; అగుట= కావడం; అవిద్య+అనన్+తగున్= అవిద్య అనబడుతుంది; చిత్తశుద్ధి+కలిగి= మనోనిర్మలతను కలిగి; నిత్యతృప్తుండు+ఔట= ఎప్పుడూ తృప్తిగా ఉండడం; దమంబు= దమమని చెప్పబడుతుంది; ఇట్టి; నియమ+ఆది= నియమాలు మొదలైన; గుణసహితత్వంబును= గుణాలు కలిగి ఉండడం; మత్+భక్తి యుక్తియున్= నాయందు భక్తి కలిగి ఉండడం; అను+అది+ఏ= అనేదే; సుఖంబు= సుఖం; నన్నున్+ఎఱుంగలేక= నన్ను తెలుసుకోలేక; తమస్+గుణంబునన్= తమోగుణంతో; పరఁగుట+ఎ= ఉండడమే; దుఃఖంబు+అనన్+పడున్= దుఃఖం అనబడుతుంది; బంధుగురు జనంబుల+ఎడన్= చుట్టాల, గురులయెడల; భేదబుద్ధిన్+ఒంది= భేదబుద్ధిని పొంది; శరీరంబు; నిజగృహంబు+కాన్= తన ఇల్లుగా; భావించిన వాఁడు+ఎ= తలచినవాడే; దరిద్రుండు= దరిద్రుడు; ఇంద్రియ నిరసనుండును= ఇంద్రియాలను నిగ్రహించినవాడు; గుణసంగ విరక్తుండున్= త్రిగుణాలతో సాంగత్యం లేనివాడు; ఐనవాఁడు+ఎ= అయినవాడే; ఐశ్వర్యవంతుడు; నాయందున్; తలంపున్ నిలిపి= మనస్సును నిలిపి; కర్మయోగంబు న్+అందును= కర్మయోగమందు; భక్తియోగంబున్+ అందును= భక్తియోగమందు; వాత్సల్యంబు+కలిగి= ఇష్టం కలిగి; జనక+ఆదులు= జనకుడు మొదలైనవాళ్లు; కైవల్యంబున్= మోక్షాన్ని; చెందిరి= పొందారు; భక్తియోగంబునన్+చేసి= భక్తియోగంచేత; బలి, ప్రహ్లాదుడు, ముచుకుంద+ఆది= ముచుకుందుడు మొదలైనవాళ్లు; పరమపదప్రాప్తులు+ఐరి= మోక్షం పొందారు; అది; కావునన్= కాబట్టి; ఇది+ఎఱింగి= ఈ విషయం తెలుసుకొని; నిరంతర= ఎడతెగని; భక్తియోగంబు; అధికంబు+కాన్= ఎక్కువగా; నీ మనంబునన్= నీ మనస్సులో; నిలుపుము; మృత్+మయంబు+ఐన= మట్టిచేత చేయబడిన; ఘటంబునన్= కుండలో; జలంబులు= నీళ్లు; జాలు+కొను తెఱంగునన్= జాలువారే విధంగా; దినదినంబునకున్= రోజురోజుకు; ఆయువు; క్షయంబు+ఐ= తరిగిపోయి; మృత్యువు= చావు; సన్నిహితంబు+ఐ= దగ్గరపడుతూ; వచ్చున్= వస్తుంది; కావునన్; ఇది; ఎఱింగి= తెలుసుకొని; నిరంతరంబును= నిరంతరం; నన్నున్+ఏమఱక= నన్ను మరచిపోకుండా; తలంచుచున్+ఉండు+అతండు= స్మరించేవాడు; నాకున్+ప్రియుండు= నాకు ఇష్టుడు;

**తా :** అని ఉద్ధవుడు అడుగగా జ్ఞానాత్మకుడైన శ్రీకృష్ణుడు చెప్పసాగాడు. ఉద్ధవా! నీ ప్రశ్నలకు సమాధానాలు లభించడం కష్టము. అయినా చెపుతాను విను. నియమాలూ, శమదమాలూ మొదలైనవి ఏవి? తపమనగా నేమి? సుఖదుఃఖాలూ, స్వర్గనరకాలూ ఏవి? దరిద్రుడు ఎట్టివాడు? ఈశ్వరుడంటే ఎవరు? అని నీవు నన్నడిగిన విషయాలన్నిటినీ వేరువేరుగా వివరిస్తాను.

మౌనవ్రతమూ, ఓర్పూ, జపమూ, తపమూ, అతిథులను సత్కరించడమూ, పరహితమూ, దొంగతనమూ మొదలైనవి లేకుండుట అనే ఇలాంటివి నియమాలు అనబడతాయి. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడం, శత్రుమిత్రుల యెడల సమానంగా ఉండడం 'శమ' మని చెప్పబడుతుంది. అజ్ఞానులకు జ్ఞానోపదేశం చేయడం, కోరికలను వదిలిపెట్టడం, సమదర్శనం, వైష్ణవభక్తి, ప్రాణాయామం, మనోనిర్మలత్వం అనేవి కల్గి ఉండడం విద్యగా చెప్పబడుతుంది. శమదమాది గుణాలు లేని వాడుగావడం, నాయందు భక్తి లేనివాడు గావడం 'అవిద్య' అనబడుతుంది. చిత్తశుద్ధి గలిగి ఎప్పుడూ తృప్తిచెందినవాడుగా ఉండడం 'దమ' మని చెప్పబడుతుంది. ఇటువంటి నియమాలూ, గుణాలూ కలిగి నాయందు భక్తి కలిగి ఉండడమే 'సుఖం'. నన్ను తెలుసుకోలేక తమోగుణంతో ఉండడమే 'దుఃఖం'. బంధువుల, గురువుల యెడల భేదబుద్ధి పొంది శరీరాన్ని తన ఇల్లుగా భావించేవాడే దరిద్రుడు. ఇంద్రియాలను నిగ్రహించి త్రిగుణ సాంగత్యం లేనివాడే ఐశ్వర్యవంతుడు. నాయందు మనస్సు నిలిపి కర్మయోగమందూ, జ్ఞానయోగమందూ ఇష్టం కలిగిన వాళ్లై జనకరాజు మొదలైనవాళ్లు మోక్షాన్ని పొందారు. భక్తియోగం చేత బలి, ప్రహ్లాదుడు, ముచుకుందుడు మొదలైనవాళ్లు పరమపదాన్ని పొందారు. కనుక ఈ విషయాన్ని తెలుసుకొని నిరంతరం నీ మనస్సులో భక్తియోగాన్ని నిలుపుకో. మట్టికుండకు రంధ్రం పడితే నీళ్లు కారిపోయే విధంగా రోజురోజుకు ఆయువు తరిగిపోతూ, చావు దగ్గరపడుతూ ఉంటుంది. కాబట్టి ఇది తెలుసుకొని ఎప్పుడూ ఏమరకుండా నన్నే తలుస్తూ ఉండేవాడు నాకు ఇష్టుడు.

**క. 'గర్భమునఁ బరిజ్ఞానము, నిర్భరమై యుండు జీవునికిఁ దుది నతఁడా**
**విర్భూతుఁడైనఁ జెడు నం, తర్భావం బైన బోధ మంతయు ననఘా! 110**

**ప్రతి :** అనఘా= పాపరహితుడా! జీవునికిన్= జీవుడికి; గర్భమునన్= తల్లి కడుపులో; పరిజ్ఞానము= స్మృతి; నిర్భరము+ఐ= సంపూర్ణమై; ఉండున్= ఉంటుంది; తుదిన్= చివర; అతఁడు= ఆ జీవుడు; ఆవిర్భూతుఁడు+ఐనన్= పుట్టినప్పుడు; అంతర్భావంబు+ఐన= గర్భం లోపల ఉన్నపుడు ఉండిన; బోధము+అంతయున్= తెలివి అంతా; చెడున్= నశిస్తుంది.

**తా :** పాపరహితుడైన ఉద్ధవా! తల్లిగర్భంలో ఉన్నప్పుడు జీవునికి పూర్వజన్మ స్మృతి (జ్ఞానం) సంపూర్ణంగా ఉంటుంది. అతడు కడుపులోనుండి భూమిమీద పడగానే లోపల ఉండిన ఆ జ్ఞానమంతా నశిస్తుంది.

**వ. అట్లు గావున జనుండు బాల్య కైశోర కౌమార వయోవిశేషంబుల వెనుక నైననుం, బెద్దయైన వెనుకనైనను, న న్నెఱింగెనేనిఁగృతకృత్యుండగుఁ, సంపద్గర్వాంధుండైన నంధకారకూపంబునం బడు; వానిం దరిద్రునింగాఁ జేసిన జ్ఞానియై యస్మత్పాదారవింద వందనాభిలాషియై ముక్తుండగు; నట్లు గావున దేహాభిమానంబు వర్జించి యైహికాముష్మిక సుఖంబులఁగోరక మనంబు గుదియించి యే ప్రొద్దు నన్నుఁ దలంచువాఁడు వైకుంఠపదప్రాప్తుండగు; నేను నతని విడువంజాలక వెనువెంట నరుగుదు; నారదాది మునులు భక్తిభావంబునం జేసి నా రూపంబై' రని యుద్ధవునకుం జెప్పిన నతండు మఱియు నిట్లనియె. 111**

**ప్రతి :** అట్లు+కావునన్= అందుచేత; జనుండు= మనుష్యుడు; బాల్య= బాల్యం; కైశోర= కిశోరత్వం (పిల్లతనం); కౌమార= కౌమారం (యువత్వం) అనే; వయస్+విశేషంబుల= వయస్సుల; వెనుకన్+ఐననున్= తరువాతనైనా; పెద్ద+ఐన= పెద్దవాడైన; వెనుకన్+ఐననున్= తరువాతనైనా; నన్ను; ఎఱింగెన్+ఏనిన్= తెలుసుకుంటే; కృతకృత్యుండు+అగున్= కృతార్థుడవుతాడు; సంపత్+గర్వ+అంధుండు+ఐనన్= సంపదవల్ల కలిగిన గర్వంచేత గుడ్డివాడయితే; అంధకార= చీకటి అనే; కూపంబునన్= బావిలో; పడున్; వానిన్= అలాంటివాడిని; దరిద్రునిన్+కాన్+చేసినన్= దరిద్రుడు అయ్యేటట్లు చేస్తే; జ్ఞాని+ఐ= తెలివిగలవాడై; అస్మత్+పాద+అరవింద= నా అడుగుదమ్ములకు; వందన+అభిలాషి+ఐ= నమస్కరించే కోరిక కలవాడై; ముక్తుండు+అగున్= మోక్షం పొందుతాడు; అట్లు+కావునన్; దేహ+అభిమానంబున్= శరీరంపై మమకారాన్ని; వర్జించి= విడిచి; ఐహిక+ఆముష్మిక= ఇహలోక పరలోక; సుఖంబులన్= సౌఖ్యాలను; కోరక; మనంబున్= మనస్సును; కుదియించి= నిగ్రహించి; ఏ ప్రొద్దున్= ఎల్లప్పుడూ; నన్నున్+తలంచువాఁడు= నన్ను స్మరించేవాడు; వైకుంఠపదప్రాప్తుండు+అగున్; నేనున్= నేనుకూడా; అతనిన్= అతనిని; విడువన్+చాలక= విడిచిపెట్టలేక; వెనువెంటన్= వెనుకనే; అరుగుదున్= వెళతాను; నారద+ఆది మునులు; భక్తిభావంబునన్+చేసి= భక్తిభావంవల్ల; నారూపంబు+ఐరి= నా ఆకారం పొందారు; అని; ఉద్ధవునకున్; చెప్పినన్; అతండు; మఱియున్; ఇట్లు+అనియెన్.

**తా :** 'అందుచేత మానవుడు బాల్యం, పిన్నతనం, యువకత్వం అనే వయోదశల తరువాతగాని, పెద్దవాడైన తరువాతగాని నన్ను తెలుసుకొంటే కృతార్థుడవుతాడు. సంపద కలిగించే గర్వంవల్ల గుడ్డివాడయితే చీకటి అనే బావిలో పడతాడు. అలాంటి వాడిని దరిద్రుడుగా చేస్తే జ్ఞానోదయమై నా పాదపద్మాలకు నమస్కరించాలనే తలంపుకలిగి మోక్షం పొందుతాడు. అందువల్ల శరీరాభిమానం వదిలిపెట్టి, ఇహలోకపరలోక సౌఖ్యాలను కోరకుండా, మనస్సును నిగ్రహించుకొని ఎప్పుడూ నన్ను స్మరించేవాడు వైకుంఠపదాన్ని పొందుతాడు. నేను కూడా అతనిని విడువలేక అతని వెంటనే వెళుతూ ఉంటాను. నారదాది మునులు భక్తిభావంవల్ల నా రూపం పొందారు'. అని శ్రీకృష్ణుడు ఉద్ధవుడికి చెప్పగా అతడింకా ఇలా అన్నాడు.

**క. అయ్యా! దేవ! జనార్దన!, నెయ్యంబున సృష్టికర్త నేర్పరియై తా**
**నొయ్యన నడపును నెవ్వఁడు, సయ్యన నెఱిఁగింపవయ్య! సర్వజ్ఞనిధీ!' 112**

**ప్రతి :** అయ్యా; దేవ; జనార్దన= శ్రీకృష్ణా!; సర్వజ్ఞనిధీ= సర్వజ్ఞతకు నిధి అయినవాడా!; నెయ్యంబునన్= స్నేహంతో; సృష్టికర్తన్= సృష్టిచేసే బ్రహ్మను; నేర్పరి+ఐ; తాన్= తాను; ఒయ్యనన్= క్రమంగా; ఎవ్వఁడు; నడపును; చయ్యనన్= వెంటనే; ఎఱిఁగింపు+అయ్య= చెప్పవయ్యా!

**తా :** అయ్యా! దేవా! శ్రీకృష్ణా! సర్వజ్ఞనిధీ! సృష్టికర్తయైన బ్రహ్మను ఎవడు నేర్పుతో నడుపుతాడో వెంటనే నాపై స్నేహంతో చెప్పవయ్యా!

**విశే :** 'జనార్దన' అనే శబ్దానికి 'సముద్ర మధ్య వర్తినో జన నామ్నోఽ సురా నర్దిత వానితి జనార్దనః' అని వ్యుత్పత్తి. సముద్ర మధ్యంలో గల జనులనే రాక్షసులను పీడించువాడని తాత్పర్యం. 'ప్రళయకాలే జనా న్సర్వానపి అర్దయతీతి వా జనార్దనః' అని మరొక వివరణ. ప్రళయకాలంలో జనులందరిని పీడించువాడు జనార్దనుడు.

**వ. అనుటయు హరి యుద్ధవునకుం జెప్పె; 'నట్లు మత్ప్రేరితంబులై మహదాది గుణంబులు గూడి యండంబై యుద్భవించె; నా యండంబువలన నే నుద్భవించితి; నంత నా నాభివివరంబున బ్రహ్మ యుదయించె;**

**సాగరారణ్యనదీనదసంఘంబులు మొదలుగాఁగల జగన్నిర్మాణంబు లతని వలనం గల్పించితి; నంత శతానందులకు శతాబ్దంబులు పరిపూర్ణంబైన ధాత్రి గంధంబునం దడంగు; నాగంధం బుదకంబునం గలయు; నా యుదకంబు రసంబున లీనం బగు; నా రసంబు తేజోరూపం బగు; నా తేజంబు రూపంబున సంక్రమించు; నా రూపంబు వాయువందుం గలయు; వాయువు స్పర్శగుణ సంగ్రాహ్యం బైన స్పర్శగుణం బాకాశంబున లయంబగు; నా యాకాశంబు శబ్దతన్మాత్రచే గ్రసియింపఁబడిన నింద్రియంబులు మనోవైకారిక గుణంబులం గూడి యీశ్వరునిం బొంది, యీశ్వరరూపంబు దాల్చు;**

**నేను రజస్సత్త్వ తమోగుణ సమేతుండనై త్రిమూర్తులు వహించి, జగదుత్పత్తి స్థితిలయ కారణుండనై వర్తిల్లుదుఁ; గావున నీ రహస్యంబు నీకు నుపదేశించితిఁ, బరమ పావనుండవుఁబరమ భక్తియుక్తుండవుగ' మ్మని చెప్పె; నంత. 113**

**ప్రతి :** అనుటయున్= అని ఉద్ధవుడడుగగా; హరి; ఉద్ధవునకున్; చెప్పెన్= చెప్పాడు; అట్లు= ఆ విధంగా; మత్+ ప్రేరితంబులు+ఐ= నాచేత ప్రేరింపబడినవై; మహత్+ఆది గుణంబులు= మహత్తు మొదలైన గుణాలు; కూడి= కలసి; అండంబు+ఐ= గుడ్డు అయి; ఉద్భవించెన్= పుట్టింది; ఆ+అండంబు వలనన్= ఆ గుడ్డువల్ల; నేను; ఉద్భవించితిన్= పుట్టాను; అంతన్= తరువాత; నా నాభి వివరంబునన్= నా బొడ్డు రంధ్రంనుండి; బ్రహ్మ+ఉదయించెన్= బ్రహ్మపుట్టాడు; సాగర+అరణ్య= సముద్రాలు, అడవులు; నదీనద= నదుల, నదాల; సంఘంబులు= సమూహాలు; మొదలుగాన్+కల= మొదలైన; జగత్+నిర్మాణంబులు= జగాల సృష్టులు; అతని వలనన్= బ్రహ్మవల్ల; కల్పించితిన్= కల్పింపజేశాను; అంతన్= తరువాత; శతానందులకున్= బ్రహ్మగారికి; శత+అబ్దంబులు= నూరేండ్లు; పరిపూర్ణంబు+ఐనన్= నిండగా; ధాత్రి= భూమి; గంధంబునందున్= గంధంలో; అడంగున్= అణగిపోతుంది; ఆ గంధంబు; ఉదకంబునన్= నీటిలో; కలయున్= కలుస్తుంది; ఆ+ఉదకంబు= ఆ నీళ్లు; రసంబునన్= రసంలో; లీనంబు+అగున్= లీనమవుతుంది; ఆ రసంబు; తేజస్+రూపంబు+అగున్= తేజోరూపం ధరిస్తుంది; ఆ తేజంబు; రూపంబునన్= రూపంలో; సంక్రమించున్= కలసిపోతుంది; ఆ రూపంబు; వాయువు+అందున్= వాయువులో (గాలిలో); కలయున్= కలుస్తుంది; వాయువు; స్పర్శగుణ సంగ్రాహ్యంబు+ఐన= స్పర్శమనే గుణంతో గ్రహింపదగినదైతే; స్పర్శగుణంబు; ఆకాశంబునన్= ఆకాశంలో; లయంబు+అగున్= లీనమవుతుంది; ఆ+ఆకాశంబు; శబ్ద తన్మాత్రచేన్= శబ్దమనే తన్మాత్రచేత; గ్రసియింపన్+పడినన్= లోగొనబడినట్లయితే; ఇంద్రియంబులు= ఇంద్రియాలు; మనస్+వైకారిక= మనోవికారమైన; గుణంబులన్+కూడి= గుణాలతో కలసి; ఈశ్వరునిన్+పొంది= ఈశ్వరునిలో లీనమై; ఈశ్వరరూపంబు= ఈశ్వరరూపం; తాల్చున్= ధరిస్తాయి.

నేను; రజస్+సత్త్వ= రజస్సు, సత్త్వం; తమస్+గుణ= తమస్సు అనే గుణాలతో; సమేతుండను+ఐ= కూడినవాడనై; త్రిమూర్తులు= మూడు రూపాలు; వహించి= ధరించి; జగత్= సృష్టియొక్క; ఉత్పత్తి స్థితి లయ= ఉత్పత్తి స్థితి లయలకు; కారణుండను+ఐ= కారణుడనై; వర్తిల్లుదున్= ప్రవర్తిస్తాను (ఉంటాను); కావునన్; ఈ రహస్యంబున్= ఈ రహస్యాన్ని; నీకున్+ఉపదేశించితిన్= నీకు ఉపదేశించాను; పరమపావనుండవు= మిక్కిలి పవిత్రుడవు; పరమ భక్తియుక్తుడవు= మిక్కిలి భక్తి సహితుడవు; కమ్ము+అని= అగుమని; చెప్పెన్= చెప్పాడు; అంతన్= తరువాత....

**తా :** అనగా శ్రీకృష్ణుడు ఉద్ధవునితో ఇలా అన్నాడు 'ఆ విధంగా నాచేత ప్రేరేపించబడి మహత్తు మొదలైన గుణాలు కలసి ఒక గుడ్డు (అండం) ఉద్భవించింది. ఆ గుడ్డునుండి నేను పుట్టాను. అంత నా బొడ్డు రంధ్రం నుండి బ్రహ్మ పుట్టాడు.

సముద్రాలు, అరణ్యాలు, నదులు, నదాలు మొదలైన జగాన్నంతా అతనిచేత నేనే నిర్మింపజేశాను. ఆ బ్రహ్మకు నూరేండ్లు నిండిన తరువాత భూమి గంధంలో అణగిపోతుంది. ఆ గంధం నీటిలో కలుస్తుంది. ఆ నీరు రసంలో లీనమవుతుంది. ఆ రసం తేజోరూపాన్ని ధరిస్తుంది. ఆ తేజస్సు రూపంలో సంక్రమిస్తుంది. ఆ రూపం వాయువు (గాలి) లో కలుస్తుంది. ఆ వాయువు స్పర్శగుణంతో గ్రహింపబడి ఆకాశంలో లయిస్తుంది. ఆ ఆకాశం శబ్దమనే తన్మాత్రచే లోగొనబడినట్లయితే ఇంద్రియాలు మనోవికారాలతో కూడి ఈశ్వరుని పొంది ఈశ్వరత్వం పొందుతుంది.

నేను రజస్సు, సత్త్వం, తమస్సు అనే మూడు గుణాలతో కూడి మూడు మూర్తులు ధరించి జగత్తు పుట్టుకకూ, ఉనికికీ, నాశనానికీ కారణుడనై వర్తిస్తాను. ఈ రహస్యాన్ని నీకు ఉపదేశించాను. పరమ పవిత్రుడవు, పరమ భక్తిసహితుడవు కమ్ము' అని చెప్పాడు. అంత

**విశే : మహత్ –** సాంఖ్యుల పంచవింశతితత్త్వాలలో ఒకటి. అవ్యక్తమైన ప్రధానం నుండి వచ్చిన భూమిక. ఈ తత్త్వాలను కొందరు తొమ్మిదిగా చెపుతారు. పురుషుడు, ప్రకృతి, మహత్తత్త్వం, అహంకారం, ఆకాశం, వాయువు, తేజస్సు, జలం, పృథివి అనేవి తొమ్మిది తత్త్వాలు. జీవుడు, పరమాత్మ అనే ఇద్దరిని కలిపి పురుషుడు అన్నారు. మహదాదిగుణాలు కలసి 'అండం' ఉద్భవించిందని, దానినుండి భగవానుడు ఉద్భవించాడని భాగవతం చెపుతున్నది. 'అండపిండ బ్రహ్మాండంబు' అంటూ ఉంటారు. వీటిలో అండం అంటే గుడ్డు, పిండం అంటే దేహధారణ చేస్తున్న దశలోని రూపం. బ్రహ్మాండమంటే విశ్వం. పారమార్థికంగా అండం అంటే పంచమహాభూతాలతో కూడిన సృష్టి.

శ్రీమన్నారాయణుడే త్రిమూర్తులను ధరించి సృష్టి స్థితి లయలనే కార్యాలను నిర్వహిస్తాడని భాగవతం చెపుతున్నది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులే త్రిమూర్తులు. త్రిమూర్తత్వం ఒకే తత్త్వం. వివిధ కార్యాల నిర్వహణకోసం అది మూడు తత్త్వాలుగా రూపొందింది. మొదటిది బ్రహ్మతత్త్వం. ఈ తత్త్వం సృష్టికార్యాన్ని నిర్వహిస్తుంది. కాబట్టి రజోగుణ సంయుక్తంగా ఉంటుంది. రెండవది విష్ణుతత్త్వం. ఈ తత్త్వం స్థితికి సంబంధించింది. కాబట్టి సత్త్వగుణసంయుక్తంగా ఉంటుంది. మూడవది మహేశ్వరతత్త్వం. ఈ తత్త్వం అప్పటివరకు పోషింపబడిన విశ్వాన్ని లయింపజేస్తుంది. అందువల్ల ఈ తత్త్వం తమోగుణ ప్రధానంగా ఉంటుంది. గుణ ప్రాధాన్యాన్ని బట్టి, నిర్వహించే పనులను బట్టి త్రిమూర్తులు రజస్సు, సత్త్వం, తమస్సు అనే గుణాలకు ప్రతినిధులుగా గుర్తింపబడినారు.

**ఆ. రూపు లేని నీకు రూఢిగా యోగులు, రూపు నిల్పి నిన్ను రుచిరభక్తిc**
**గొల్చి యుంద్రు; వారికోర్కుల నిచ్చెద, వేమిలాగు? నాకు నెఱుcగcబలుకు. 114**

**ప్రతి :** రూపులేని నీకున్= రూపరహితుడవైన నీకు; యోగులు; రూఢిగాన్= నిశ్చయంగా; రూపు= ఆకారాన్ని; నిల్పి= నిలిపి; నిన్నున్; రుచిరభక్తిన్= మేటిభక్తితో; కొల్చి+ఉంద్రు= సేవిస్తూ ఉంటారు; వారి కోర్కులన్= వాళ్ల కోరికలను; ఏమిలాగు= ఏవిధంగా; ఇచ్చెద(వు)= ఇస్తావు (తీరుస్తావు); నాకున్; ఎఱుcగన్+పలుకు= తెలిసేటట్లు చెప్పు.

**తా :** రూపంలేని నీకు యోగులు రూపం కల్పించి నిన్ను మహాభక్తితో సేవిస్తూ ఉంటారు. నీవు వాళ్ల కోరికలను ఎలా తీరుస్తావు. నాకు తెలియజెయ్యి.

**వ. అని యుద్ధవుం డడిగిన నారాయణుం డిట్లనియె; 'నేను సర్వవర్ణంబులకు సమంబైన పూజాప్రకారం బెఱింగించెద; నాచారంబునంజేసి యొకటిcబాషాణమృణ్మయదారువులం గల్పించి, నా రూపంబుగా నిల్పికొని**

**కొందఱు పూజింతురు; కాంస్య త్రపు రజత కాంచన ప్రతిమావిశేషంబు లుత్తమంబు; లిట్లు నా ప్రతిమా రూపంబు లందు మద్భావంబుంచి కొల్చినవారికి నేఁబ్రసన్నుం డనగుదు; నీ లోకంబున మనుష్యులకు ధ్యానంబు నిలువనేరదు; గావునం బ్రతిమావిశేషంబు లనేకంబులు గలవు; వానియందు సౌందర్యసారంబులు మనోహరంబులు నైన రూపంబుల మనఃప్రసన్నుండనై నే నుండుదుఁ; గావున దుగ్ధార్ణవశాయిఁగా భావించి ధౌతాంబరాభరణ మాల్యానులేపనంబులను, దివ్యాన్నపానంబులను, షోడశోక్త ప్రకారంబుల రాజోపచారంబులను, బాహ్య పూజావిధానంబుల నాచరించి మత్సంకల్పితంబులైన పదార్థంబులు సమర్పించి, నిత్యంబును నాభ్యంతర పూజావిధానంబులం బరితుష్టునిం జేసి; దివ్యాంబరాభరణ మాల్యశోభితుండును, శంఖచక్ర కిరీటాద్యలంకార భూషితుండును, దివ్యమంగళ విగ్రహుండునుగాఁ దలంచి ధ్యానపరవశుండైన యతండు నాయందుఁ గలయు; నుద్ధవా! నీ వీ ప్రకారంబు గరిష్ఠనిష్ఠాతిశయంబున యోగనిష్ఠుండవై, బదరికాశ్రమంబు సేరి మత్కథితంబైన సాంఖ్యయోగం బంతరంగంబున నిల్పుకొని, కలియుగావసాన పర్యంతంబు వర్తింపు' మని యప్పరమేశ్వరుం డానతిచ్చిన నుద్ధవుండు నానందభరితాంతరంగుండై తత్పాదారవిందంబులు హృదయంబునం జేర్చుకొని, పావనంబైన బదరికాశ్రమంబునకు నరిగె' నని శుకుండు పరీక్షిన్నరేంద్రునకుం జెప్పుటయు. 115**

**ప్రతి :** అని; ఉద్ధవుండు; అడిగినన్; నారాయణుండు; ఇట్లు+అనియెన్; నేను; సర్వ వర్ణంబులకున్= అన్ని వర్ణాల (కులాల) వారికి; సమంబు+ఐన= సమానమైన; పూజాప్రకారంబున్= పూజావిధానాన్ని; ఎఱింగించెదన్= తెలుపుతాను; ఆచారంబుననన్+ చేసి= ఆచారం ప్రకారం; ఒకటిన్= ఒకదానిని; పాషాణ= శిల; మృట్+మయ= మట్టి; దారువులన్= కొయ్యలతో; కల్పించి= తయారుచేసి; నా రూపంబు+కాన్= నా పేరును ఏర్పడే విధంగా; నిల్పికొని= నిలుపుకొని (ప్రతిష్ఠించుకొని); కొందఱు; పూజింతురు= పూజిస్తారు; కాంస్య= కంచుతోగాని; త్రపు= సీసం (తగరం) తోగాని, రజత= వెండితోగాని; కాంచన= బంగారుతోగాని; (చేసిన) ప్రతిమా విశేషంబులు= విగ్రహ రూపాలు; ఉత్తమంబులు= శ్రేష్ఠమైనవి; ఇట్లు= ఈవిధంగా; నా ప్రతిమారూపంబులందున్= నా విగ్రహరూపాలలో; మత్+భావంబు+ఉంచి= నా భావాన్ని ఉంచి; కొల్చిన వారికిన్= సేవించిన వాళ్లకు; నేన్= నేను; ప్రసన్నుండన్+అగుదున్= ప్రసన్నుడ నవుతాను; ఈ లోకంబునన్= ఈ లోకంలో; మనుష్యులకున్= మానవులకు; ధ్యానంబు= ధ్యానం; నిలువన్+నేరదు= నిలువజాలదు; కావునన్; ప్రతిమా విశేషంబులు= విగ్రహరూపాలు; అనేకంబులు; కలవు= ఉన్నాయి, వాని+అందున్= వాటిలో; సౌందర్యసారంబులు= ఎంతో అందమైనవి; మనోహరంబులు+ఐన= మనస్సును ఆకట్టుకొనేవి అయిన; రూపంబులన్= రూపాలలో; మనః ప్రసన్నుండను+ఐ= ప్రసన్నమైన మనస్సు గలవాడనై; నేన్+ఉందుదున్= నేను ఉంటాను; కావునన్; దుగ్ధ+అర్ణవశాయిన్+కాన్= క్షీరసముద్రంలో పవళించిన వానినిగా; భావించి= తలచి; ధౌత= శుభ్రం చేసిన; అంబర+ఆభరణ= వస్త్రభూషణాలు; మాల్య+అను లేపనంబులును= పూలదండలు మైపూతలతోను; దివ్య= దివ్యమైన; అన్నపానంబులును= అన్నం నీళ్లతోను; షోడశ+ఉక్త ప్రకారంబులన్= పదహారు విధాలుగా చెప్పబడిన పద్ధతులలో; రాజ+ఉపచారంబులన్= రాజోపచారాలతో; బాహ్య పూజా విధానంబులన్= బయటి పూజామార్గాలను; ఆచరించి= చేసి; మత్+సంకల్పితంబులు+ఐన= నాచేత సంకల్పింపబడిన; పదార్థంబులు= వస్తువులు; సమర్పించి= నివేదించి; నిత్యంబునున్= ఎప్పుడూ; అభ్యంతర పూజావిధానంబులన్= మనఃపూర్వక పూజాపద్ధతులతో; పరితుష్టునిన్+చేసి= సంతృప్తుడినిచేసి; దివ్య+అంబర+ఆభరణ

మాల్యశోభితుండును= దివ్యమైన వస్త్రాభరణాలతోను, మాలికలతోను అలంకృతుడు; శంఖ; చక్ర; కిరీటాది+అలంకార= శంఖ చక్ర కిరీటాది అలంకారాలతో; భూషితుండును= అలంకరింప బడినవాడూ; దివ్యమంగళ విగ్రహుండును+కాన్= దివ్యమంగళ విగ్రహునిగా; తలంచి= భావించి; ధ్యానపరవశుండు+ఐన= ధ్యానంతో ఒడలు తెలియనివాడైన; అతండు= అలాంటి భక్తుడు; నాయందున్+కలయున్= నాలో కలుస్తాడు; ఉద్ధవా! నీవు; ఈ ప్రకారంబు= ఈ విధంగా; గరిష్ఠ= తీవ్రమైన; నిష్ఠ+అతిశయంబునన్= గొప్పనిష్ఠ (నియమం) తో; యోగనిష్ఠుండవు+ఐ= యోగనిష్ఠకలవాడవై; బదరిక+ఆశ్రమంబు+చేరి= బదరికాశ్రమం చేరుకొని; మత్+కథితంబు+ఐన= నాచే చెప్పబడిన; సాంఖ్యయోగంబు; అంతరంగంబునన్= మనస్సులో; నిల్పుకొని; కలియుగ+అవసాన పర్యంతంబు= కలియుగం చివరవరకు; వర్తింపుము+అని= ఉండుమని; ఆ+పరమేశ్వరుండు; ఆనతి+ఇచ్చినన్= ఆనతీయగా; ఉద్ధవుండును; ఆనందభరిత+అంతరంగుఁడు+ఐ= ఆనందంతో నిండిన మనస్సు కలవాడై; తద్+పాద+అరవిందంబులు= శ్రీకృష్ణుని పాదపద్మాలను; హృదయంబునన్+ చేర్చుకొని= మనస్సులో నిలుపుకొని; పావనంబు+ఐన= పవిత్రమైన; బదరిక+ఆశ్రమంబునకున్= బదరికాశ్రమానికి; అరిగెన్= వెళ్లాడు; అని; శుకుండు= శుకమహర్షి; పరీక్షిత్+నర+ఇంద్రునకున్= పరీక్షిన్మహారాజుకు; చెప్పుటయున్= చెప్పగా....

**తా :** ఉద్ధవుడు అడిగిన ప్రశ్నకు నారాయణుడు (శ్రీకృష్ణుడు) ఇలా అన్నాడు. నేను అన్ని వర్ణాలవాళ్లకు సమమైన పూజాపద్ధతిని చెపుతాను. రాతితోగాని, మట్టితోగాని, కొయ్యతోగాని తమ ఆచారం ప్రకారం ఒక ఆకారం కల్పించి నా రూపంగా నిలుపుకొని కొందరు పూజిస్తారు. కంచుతోగాని, సీసంతోగాని, వెండితోగాని, బంగారుతోగాని చేసిన విగ్రహరూపాలు శ్రేష్ఠమైనవి. ఈ విధంగా నా విగ్రహరూపాలలో నన్ను భావించి కొలిచిన వారికి నేను ప్రసన్నుడనవుతాను. ఈ లోకంలో మానవులకు ధ్యానం నిలువదు. అందుచేతనే దేవతాప్రతిమలు ఎన్నో ఉన్నాయి. వాటిలో అందమైనవి సారవంతాలైనవి మనస్సును ఆకట్టుకొనేవి అయిన రూపాలలో నేను ప్రసన్నమనస్కుడనై ఉంటాను. కావున నన్ను పాలకడలిలో పవళించిన వాడినిగా ఎంచి శుభ్రమైన వస్త్రాలు, భూషణాలు, పూలదండలు, మైపూతలు అర్పించి, దివ్యాలైన అన్నపానాలతో, పదహారు విధాలైన రాజోపచారాలతో బాహ్యమైన పూజలు చేసి, నాకు ఇష్టమైన పదార్థాలను సమర్పించి, నిత్యం మనః పూజావిధానాలతో సంతోషింపజేసి, దివ్యాలైన వస్త్రభూషణాలతో, పూలదండలతో ప్రకాశిస్తూ శంఖ చక్ర కిరీటాదులతో అలంకృతుడనైన దివ్యమంగళ విగ్రహునిగా భావించి ధ్యానపరవశుడైన నా భక్తుడు నాలో కలిసిపోతాడు.

ఉద్ధవా! నీవు ఇటువంటి తీవ్రమైన యోగనిష్ఠతో బదరికాశ్రమంచేరి, నేను చెప్పిన సాంఖ్యయోగాన్ని మనస్సులో నిలుపుకొని కలియుగాంతం వరకు ఉండుమని శ్రీకృష్ణుడు చెప్పగా ఉద్ధవుడు ఆనందంతో నిండిన మనస్సు గలవాడై శ్రీకృష్ణుని పాదపద్మాలను హృదయంలో నిలుపుకొని పవిత్రమైన బదరికాశ్రమానికి వెళ్లాడు. అని శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు

**విశే : సర్వవర్ణాలు –** బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులే సర్వవర్ణాలవాళ్లు. ఏ వర్ణం వారికైనా పూజావిధానం ఒకటే అనడానికి భాగవతం ఆ విధంగా చెప్పింది. దేవతాప్రతిమలను రాతితోగాని, మట్టితోగాని, కొయ్యతోగాని చేసి పూజించవచ్చు. ఇలాంటి విగ్రహాలకంటె లోహంతో చేసిన విగ్రహాలు శ్రేష్ఠమైనవి. విగ్రహపూజ బాహ్యపూజ. మనస్సులోనే ఒక మూర్తిని కల్పించుకొని ఆరాధించవచ్చు. అది ఆభ్యంతర పూజ. దేవతా విగ్రహాలు ఒకచోట నుండి మరొక చోటికి మార్చదగినవి, ఒకేచోట స్థిరంగా ఉండేవి అని రెండు రకాలు. అలాంటి విగ్రహాలలో మంత్రశక్తితో ప్రాణప్రతిష్ఠచేస్తే అవి సజీవమై భగవంతునికి వాసస్థానా లవుతాయి.

**క. చెప్పిన విని రాజేంద్రుఁడు, సొప్పడ 'శ్రీకృష్ణకథలు చోద్యము గాఁగం**
**జెప్పినఁదనియదు చిత్తం, బొప్పుఁగ మునిచంద్ర! నాకు యోగులు మెచ్చన్. 116**

**ప్రతి :** చెప్పినన్= శుకమహర్షి చెప్పగా; రాజ+ఇంద్రుఁడు= రాజోత్తముడైన పరీక్షిత్తు; విని= ఆలకించి; మునిచంద్ర= మునీశ్వరా!; శ్రీకృష్ణకథలు; చొప్పడన్= ఒప్పుగా; చోద్యము+కాఁగన్= ఆశ్చర్యం అయ్యేటట్లు; యోగులు మెచ్చన్= యోగులు మెచ్చిన విధంగా; ఒప్పుగన్= నేర్పుగా; నాకు; చెప్పినన్= చెప్పినప్పటికి; చిత్తంబు= మనస్సు; తనియదు= తృప్తిపడదు.

**తా :** శుకమహర్షి మాటలు విన్న పరీక్షిత్తు మునిచంద్రా! శ్రీకృష్ణుని కథలను యోగులు మెచ్చేవిధంగా, ఆశ్చర్యం కలిగేవిధంగా, నేర్పుగా చెప్పినప్పటికి నా మనస్సు తృప్తి పడడంలేదు.

**తే. అంతటను గృష్ణుఁడేమయ్యె? నరసిచూడ, యదువు లెట్టులు వర్తించి రేర్పడంగ**
**ద్వారకాపట్టణం బెవ్విధమున నుండె, మునివరశ్రేష్ఠ! యానతీ ముదముతోడ.' 117**

**ప్రతి :** అంతటను= తరువాత; కృష్ణుడు; ఏమి+అయ్యెన్= ఏమైనాడు; అరసిచూడన్= ఆలోచించి చూడగా; యదువులు= యాదవులు; ఎట్టులు= ఎలా; వర్తించిరి= ప్రవర్తించారు; ద్వారకాపట్టణంబు; ఏ+విధమునన్= ఏవిధంగా; ఉండెన్= ఉండింది; మునివరశ్రేష్ఠ= తాపసోత్తమా!; ముదముతోడన్= సంతోషంతో; ఏర్పడంగన్= స్పష్టమయ్యేటట్లు; ఆనతి+ఈ= చెప్పు.

**తా :** తరువాత కృష్ణుడేమైనాడు? యాదవులు ఎలా ప్రవర్తించారు? ద్వారకానగరం ఎలా ఉండింది? తాపసోత్తమా! సంతోషంతో నాకు స్పష్టమయ్యేటట్లు చెప్పు.

## a ---శ్రీ కృష్ణ బలరాములు వైకుంఠమున కరుగుట a

**వ. అనిన రాజునకు శుకుం డిట్లనియె 'నట్లు వాసుదేవుం డన్యాయ ప్రవర్తకు లగు దుష్టుల సంహరించి, న్యాయప్రవర్తకులగు శిష్టులఁబరిపాలనంబు సేసి, బలరామసమేతంబుగా ద్వారకానగరంబు వెడలినం గని యాదవులు దమలోఁదాము మదిరాపానమత్తులై మత్సరంబున నుత్సాహ కలహంబునకున్ గమకించి, కరితురగరథపదాతిబలంబులతో ననర్గళంబుగా యుద్ధసన్నద్ధులై, యుద్ధంబునకుం జొచ్చి మునిశాప కారణంబున నుత్తుంగంబులయిన తుంగసమూహంబులు బడలుపడంగఁ బొడుచుచు, వ్రేయుచుం దాఁకునప్పుడు నవియును వజ్రాయుధ సమానంబులై తాఁకిన భండనంబునం బడి ఖండంబులై యొరగు కబంధంబులును, వికలంబులైన శరీరంబులును, విభ్రష్టంబులైన రథంబులును, వికటంబులైన శకటంబులును, వ్రాలెడు నశ్వంబులును, మ్రొగ్గెడి గజంబులునై, యయ్యోధనంబున నందఱుం బొలియుటకు నగి నగధరుండును రాముండునుం జని చని యంత నీలాంబరుం డొక్కత్రోవం బోయి యోగమార్గంబున ననంతునిం గలసె; న ప్పరమేశ్వరుండు మఱియొక మార్గంబునం జని యొక్క నికుంజపుంజంబు చాటున విశ్రమించుటం జేసి చరణంబు వేఱొక చరణంబుమీఁద సంఘటించి చంచలంబుగా వినోదంబు సలుపు**

**సమయంబున నొక్క లుబ్ధకుండు మృగయార్థంబుగా వచ్చి దిక్కులు నిక్కి నిరీక్షించుచుండ, వృక్షంబు చాటున న ప్పరమపురుషుని చరణకమలంబు హరిణకర్ణంబు గాఁబోలు నని దానింగని శరంబు శరాసనంబు నందు సంధానంబు సేసి యేసిన నతండు హాహారవంబునం గదలుచుండ నప్పరమేశ్వరుని సన్నిధానంబునకు వచ్చి జగన్నాథుంగాఁ దెలిసి, భయంబున 'మహాపరాధుండను; బాపచిత్తుండను; గుటిల ప్రచారుండ'నని యనేకవిధ దీనాలాపంబులం బలుకుచు బాష్పజల ధారాసిక్త వదనుండైన, సరోజనేత్రుండు వానిం గరుణించి యిట్లనియె. 'నీ వేల జాలింబడెదు? పూర్వజన్మ కర్మంబు లెంత వారికైన ననుభావ్యంబులగుం గాని యూరకపోవ నేరవు; నీవు నిమిత్తమాత్రుండ; వింతియ కాని' యని వానికిం దెలిపిన వాఁడును 'మహాపరాధులైనవా రూరక పోవరు; దేవగురు వైష్ణవ ద్రోహులకు నిలువ నెట్లగు' నని పవిత్రాంతఃకరణుండై ప్రాయోపవేశంబునం బ్రాణంబులు వర్జించి వైకుంఠ పదప్రాప్తుండయ్యె నప్పుడు. 118**

**ప్రతి :** అనిన రాజునకున్= అలా అన్న పరీక్షిన్మహారాజుతో; శుకుండు; ఇట్లు+అనియెన్; అట్లు= ఆ విధంగా; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; అన్యాయ ప్రవర్తకులు+అగు= అన్యాయంగా ప్రవర్తించేవారైన; దుష్టులన్= దుర్మార్గులను; సంహరించి= చంపి; న్యాయప్రవర్తకులు+అగు= న్యాయంగా ప్రవర్తించేవారైన; శిష్టులన్= సజ్జనులను; పరిపాలనంబు+చేసి= కాపాడి; బలరామ సమేతంబుగాన్= బలరామునితో కలసి; ద్వారకానగరంబు; వెడలినన్= వెళ్లిపోగా; కని= చూసి; యాదవులు; తమలోన్+తాము= తమలోతాము; మదిరాపానమత్తులు+ఐ= మద్యం తాగి మదించినవారై; మత్సరంబునన్= ఈర్ష్యతో; ఉత్సాహ కలహంబునకున్= వేడుక కయ్యానికి (సరదాగా పోట్లాడుకోవడానికి); గమకించి= పూనుకొని; కరి తురగ రథ పదాతి బలంబులతోన్= ఏనుగులు, గుర్రాలు, రథాలు, కాల్బలం – వీటన్నింటితో; అనర్గళంబుగాన్= అడ్డులేకుండా; యుద్ధసన్నద్ధులు+ఐ= యుద్ధానికి సిద్ధపడినవారై; యుద్ధంబునకున్+చొచ్చి= యుద్ధానికి పూనుకొని; మునిశాపకారణంబునన్= విశ్వామిత్రాదిమునులు ఇచ్చిన శాపం కారణంగా; ఉత్తుంగంబులు+అయిన= ఎత్తైన; తుంగసమూహంబులు= తుంగపోగులు; బడలు పడంగన్= అలసిపోయే విధంగా; పొడుచుచున్= పొడుచుకొంటూ; వ్రేయుచున్= కొట్టుకొంటూ; తాఁకునప్పుడు= మార్కొనేటప్పుడు; అవియును= ఆ తుంగపోగులు; వజ్రాయుధసమానంబులు+ఐ= వజ్రాయుధ సదృశాలై; తాఁకినన్= తగులగా; భండనంబునన్+పడి= యుద్ధంలో పడి; ఖండంబులు+ఐ= ముక్కలై; ఒరగు= కూలిపోయే; కబంధంబులును= మొండాలూ; వికలంబులు+ఐన= విచ్చిన్నాలైన; శరీరంబులును= దేహాలూ; విభ్రష్టంబులు+ ఐన= విరిగిపోయిన; రథంబులును= రథాలూ; వికటంబులు+ఐన= వంగిపోయిన; శకటంబులు= బండ్లూ; వ్రాలెడు= కూలిన; అశ్వంబులును= గుర్రాలూ; మ్రొగ్గెడి= నేలకొరిగిన; గజంబులును+ఐ= ఏనుగులూ అయి; ఆయోధనంబునన్= యుద్ధంలో; అందఱున్= అందరూ; పొలియుటకున్= చనిపోవడానికి; నగి= నవ్వి; నగధరుండును= గిరిధారియైన శ్రీకృష్ణుడూ; రాముండునున్= బలరాముడూ; చని చని= పోయి పోయి;అంతన్= అంతలోనే; నీల+అంబరుండు= నీల వస్త్రం ధరించిన బలరాముడు; ఒక్కత్రోవన్+పోయి= ఒక దారిన వెళ్లి; యోగమార్గంబునన్= యోగమార్గంతో; అనంతునిన్+కలసెన్= ఆదిశేషునిలో కలిశాడు; ఆ+పరమేశ్వరుండు= ఆ శ్రీకృష్ణుడు; మఱియొక= మరొక; మార్గంబునన్= దారిలో; చని= వెళ్లి; ఒక్క= ఒకానొక; నికుంజపుంజంబు= పొదరిల్లు; చాటునన్= మాటున; విశ్రమించుటన్+చేసి= విశ్రాంతి పొందడంచేత; చరణంబు= కాలు; వేఱు+ఒక= మరొక; చరణంబుమీఁదన్= కాలిమీద; సంఘటించి= పెట్టి; చంచలంబు+కాన్= కదిలిస్తూ; వినోదంబు సలుపు సమయంబునన్= వేడుక చేసేటప్పుడు; ఒక్క= ఒకానొక; లుబ్ధకుండు= బోయవాడు; మృగయా+అర్థంబు+కాన్=

జంతుసంపాదన (వేట) కోసం; వచ్చి; దిక్కులు నిక్కి= దిక్కులన్నీ నిగిడి; నిరీక్షించుచున్+ఉండన్= చూస్తూ ఉండగా; వృక్షంబు చాటునన్= చెట్టుమాటున; ఆ+పరమపురుషుని= ఆ పురుషోత్తముని; చరణకమలంబు= పాదపద్మం; హరిణకర్ణంబు+కాఁబోలున్+అని= జింక చెవి అయి ఉంటుందని; దానిన్+కని= దానిని చూసి; శరంబున్= బాణాన్ని; శరాసనంబు+అందున్= వింటియందు; సంధానంబు+చేసి= తొడిగి; ఏసినన్= ప్రయోగించగా; అతండు= శ్రీకృష్ణుడు; హాహారవంబునన్= అయ్యో! అనే ధ్వనితో; కదలుచు+ఉండన్= కదులుతూ ఉండగా; ఆ+పరమేశ్వరుని; సన్నిధానంబునకున్= దగ్గరకు; వచ్చి; జగత్+నాథున్+కాన్= జగత్పతియైన శ్రీకృష్ణుడుగా; తెలిసి= తెలుసుకొని; భయంబునన్= భీతితో; మహా+అపరాధుండను= పెద్దనేరం చేసినవాడను; పాపచిత్తుండను= పాపాత్ముడను; కుటిల ప్రచారుండను= వంకరనడత కలవాడను; అని; అనేకవిధ= పలువిధాలుగా; దీన+ఆలాపంబులన్+పలుకుచున్= దుఃఖపుమాటలు పలుకుతూ; బాష్పజల= కన్నీటి; ధారాసిక్త= ధారలతో తడిసిన; వదనుండు+ఐన= ముఖం కలవాడైన; సరోజనేత్రుండు= పద్మాక్షుడు (శ్రీకృష్ణుడు); వానిన్+కరుణించి= వానిమీద దయతలచి; ఇట్లు+అనియెన్; నీవు; ఏల= ఎందుకు; జాలిన్+పడెదు= జాలి పడుతున్నావు (విచారిస్తున్నావు); పూర్వజన్మ కర్మంబులు; ఎంతవారికి+ఐనన్= ఎటువంటి వారికైనా; అనుభావ్యంబులు+ అగున్= అనుభవింపదగినవి అవుతాయి; కాని; ఊరక పోవనేరవు= ఊరికే పోవు; నీవు; నిమిత్తమాత్రుండవు= కేవలం కారణమైన వాడవు; ఇంతియకాని= ఇంతే; అని; వానికిన్+తెలిపినన్= వాడికి తెలియజేయగా; వాఁడును= ఆ బోయవాడు కూడా; మహా+అపరాధులు+ఐనవారు= పెద్దతప్పు చేసినవారు; ఊరక పోవరు= ఊరికే పోరు; దేవ= దేవతలకు; గురు= గురువులకు; వైష్ణవ= వైష్ణవులకు; ద్రోహులకున్= ద్రోహం చేసినవారికి; నిలువన్+ఎట్లు+అగున్= ఉండడం ఎలా సాధ్యమవుతుంది; అని; పవిత్ర+అంతఃకరణుండు+ఐ= పవిత్రమైన మనస్సుతో కూడినవాడై; ప్రాయోపవేశంబునన్= ప్రాయోపవేశదీక్ష (నిరాహారదీక్ష) తో; ప్రాణంబులు= ప్రాణాలు; వర్జించి= విడిచి; వైకుంఠ పదప్రాప్తుండు+అయ్యెన్= వైకుంఠపదవి పొందినవాడయ్యాడు; అప్పుడు.

**తా :** పరీక్షిన్మహారాజుతో శుకమహర్షి ఇలా అన్నాడు. ఆ విధంగా శ్రీకృష్ణుడు అన్యాయవర్తులైన దుర్మార్గులను చంపి, న్యాయవర్తులైన సజ్జనులను కాపాడి బలరామునితో కలసి ద్వారకనుండి వెళ్లిపోగా యాదవులు మద్యపానంచేసి మదించి ఈర్ష్యతో సరదాగా తమలో తాము పోట్లాడుకోవడం మొదలుపెట్టారు. (అది నిజమైన పోట్లాట (యుద్ధం) గా మారింది). ఏనుగులు, గుర్రాలు, రథాలు, కాల్బలం (సైనికులు) అనే చతురంగ బలాలతో కూడి అడ్డులేకుండా యుద్ధానికి తలపడ్డారు. మునులశాపం కారణంగా ఎత్తైన తుంగపోగులతో అలసిపోయేలా కొట్టుకొంటూ, పొడుచుకొంటూ తలపడ్డారు. తుంగపోగులు వజ్రాయుధంతో సమానంగా తగలగా ముక్కలై, కూలిన మొండాలతో, వికలమైన శరీరాలతో, విరిగిన రథాలతో, ఒరిగిన బండ్లతో, నేలపై కూలిన గుర్రాలతో, ఒరిగిపోయిన ఏనుగులతో ఆ యుద్ధభూమి నిండిపోయింది. ఆ యుద్ధంలో యాదవులందరూ చనిపోవడం చూచి నవ్వుకొంటూ శ్రీకృష్ణుడు, బలరాముడు అలా అలా వెళ్లిపోయారు.

అలా వెళ్లి, బలరాముడు ఒక దారిలో పోయి యోగమార్గంతో ఆదిశేషునిలో కలిశాడు (బలరాముని అవతారం సమాప్తమైంది). శ్రీకృష్ణుడు మరో మార్గంలో వెళ్లి ఒక పొదరింటి మాటున (పడుకొని) విశ్రాంతి తీసుకొంటూ ఒక కాలిమీద మరొక కాలుపెట్టి కదిలిస్తూ వినోదిస్తూ ఉండగా ఒక బోయవాడు వేటకు వచ్చి దిక్కులన్నీ నిక్కి చూస్తూ ఉంటే చెట్టుమాటున ఆ పరమపురుషుని కదలుతున్న కాలు లేడి చెవివలె కనిపించింది. వెంటనే వాడు బాణాన్ని వింటియందు చేర్చి గురిచూసి వదిలాడు. ఆ బాణం తగిలి శ్రీకృష్ణుడు హాహాకారాలు చేస్తూ కదులుతూ ఉంటే, బోయవాడు దగ్గరకు వచ్చి జగదీశ్వరుడైన శ్రీకృష్ణుడని తెలుసుకొని భయంతో 'మహాపరాధిని, పాపాత్ముడను, వక్రబుద్ధిని' అని అనేక విధాలుగా

దుఃఖిస్తూ కన్నీరు కారుస్తూ ఉంటే వాడిని చూచి కృష్ణుడిలా అన్నాడు. 'నువ్వెందుకు దుఃఖిస్తావు? పూర్వజన్మలలో చేసిన కర్మలు ఎంతటి వారికైనా అనుభవించవలసిందే. తప్పదు. నీవు కారణమాత్రుడవు అంతే'. అని తెలుపగా వాడు "గొప్ప తప్పులు చేసినవాళ్లు ఊరికే పోరు. దేవతలకు, గురువులకు, వైష్ణవులకు ద్రోహం చేసినవారు ఉండడానికి వీలుకాదు" అని పవిత్రమైన మనస్సుతో ప్రాయోపవేశదీక్షకు పూనుకొని ప్రాణాలు వదలి వైకుంఠానికి వెళ్లాడు. అప్పుడు ...

**విశే :** ఈ వచనంలో ప్రధానాంశం బలరామకృష్ణుల నిర్యాణం. మూలంలో వివరంగా ఉన్న విషయాలను నారయ ఈ వచనంలో సంగ్రహించాడు. మూలభాగవత విషయాలను చూస్తే అవి తెలుస్తాయి.

**క. దారుకుఁడు గనియె నంతటఁ, జారు నిరూఢావధాను సర్వజ్ఞు హరిన్**
**మేరునగధీరు దనుజ వి, దారుని నేకాంతపరునిఁదద్దయు నెమ్మిన్. 119**

**ప్రతి :** అంతటన్= తరువాత; దారుకుఁడు= దారుకుడనే పేరుగల శ్రీకృష్ణుని రథసారథి; చారు= అందమైన; నిరూఢ= ప్రసిద్ధమైన; అవధానున్= ఏకాగ్రత గలవాడిని; సర్వజ్ఞున్= అన్నీ తెలిసినవాడిని; మేరునగధీరున్= మేరు పర్వతంవలె ధీరుడైన వాడిని; దనుజ విదారునిన్= రాక్షసులను సంహరించినవాడిని; హరిన్= శ్రీకృష్ణుని; ఏకాంతపరునిన్= ఒంటరిగా కనిపించేవాడిని; తద్దయు= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో; కనియెన్= చూశాడు.

**తా :** తరువాత శ్రీకృష్ణుని రథసారథియైన దారుకుడు అందమైనవాడూ, ఏకాగ్రతతో ఆలోచిస్తున్నవాడూ, సర్వజ్ఞుడూ, మేరుపర్వతం వంటి ధీరుడూ, రాక్షస సంహారకుడూ, ఏకాంతంగా ఉన్నవాడూ అయిన శ్రీకృష్ణుని ఎంతో ప్రీతితో చూశాడు.

**విశే :** మేరునగం – పర్వతాలలో చాలా ఉన్నతమైంది. 'మినోతి క్షిపతి శిఖరైర్జ్యోతీంషీతి మేరుః' అని వ్యుత్పత్తి. శిఖరాలనే నక్షత్రాలను వహించునట్టిది. దీనికి హేమాద్రి (బంగారుకొండ) అని కూడా పేరు. మేరుపర్వతం దేవతలకు క్రీడాస్థానం. అందుకే భగవానుడు తాను 'గిరులందు మేరువును' అని ప్రకటించాడు.

**వ. కని యత్యంతభయభక్తి తాత్పర్యంబుల ముకుళిత కరకమలుండై యిట్లనియె. 120**

**ప్రతి :** కని= చూసి; అతి+అంత= మిక్కిలి; భయ= భయంతో; భక్తి= భక్తితో; తాత్పర్యంబులన్= కూడినవాడై; ముకుళిత= జోడించిన; కరకమలుండు+ఐ= హస్తపద్మాలు కలవాడై; ఇట్లు+అనియెన్.

**తా :** అలాచూసి మిక్కిలి భయభక్తులతో చేతులు జోడించి దారుకుడు ఇలా అన్నాడు.

**తే. 'నిన్నుఁజూడని కన్నులు నిష్ఫలములు, నిన్ను నొడువని జిహ్వ దా నీరసంబు**
**నిన్నుఁగానని దినములు నింద్యములగుఁ, గన్నులను జూచి మమ్మును గారవింపు.' 121**

**ప్రతి :** నిన్నున్; చూడని= కనుగొనని; కన్నులు= నేత్రాలు; నిష్ఫలములు= వ్యర్థాలు; నిన్నున్; నొడువని= అనని (వర్ణించని); జీహ్వ= నాలుక; తాన్= తాను; నీరసంబు= రసహీనమైనది; నిన్నున్; కానని= చూడని; దినములు= రోజులు; నింద్యములు+అగున్= నిందింపదగినవి అవుతాయి; కన్నులను+చూచి= కనులారా చూచి; మమ్మును; గారవింపు= ఆదరించు.

**తా :** శ్రీకృష్ణా! నిన్ను కనుగొనలేని కన్నులు వ్యర్థాలు. నిన్ను వర్ణించని నాలుక రసహీనం. నిన్ను చూడని రోజులు నిందింపదగినవి. కనులారా చూచి నన్ను ఆదరించు.

**విశే :** ఈ పద్యం ప్రహ్లాదచరిత్రలోని 'కమలాక్షు నర్చించు కరములు కరములు...' కంజాక్షునకుఁగాని కాయంబు కాయమే...' అనే పోతన పద్యాలను తలపిస్తున్నది. అమూలకమైన పద్యమిది. ప్రహ్లాదచరిత్రలోని పద్యాలను స్ఫురింపజేసే పై పద్యం వెలిగందల నారయకు తన గురువైన పోతనామాత్యుని మీద గల భక్తిని తెలియజేస్తున్నది.

**వ. అనుచు నా దారుకుండు నిర్వేదనపరుండై యిట్లని విన్నవించె;' యాదవసముద్రం బడంగె; బంధు గురుమిత్రజనంబు లక్కడక్కడం బోయిరి; ద్వారకకుం బోయి సుహృజ్జనంబులతోడ నేమందు?' నని పలుకు నవసరంబున దివ్యాయుధంబులును, దివ్యరథరథ్యంబులు నంతర్ధానంబు నొందె; నారాయణుండు వానితో 'నక్రూరవిదురులకు నీ వృత్తాంతం బంతయుఁజెప్పుము; సవ్యసాచిం గని స్త్రీబాల గురువృద్ధజనంబులఁ గరిపురంబునకుం గొని చను మనుము; పొమ్మనిన వాఁడును మరలి చని కృష్ణుని వాక్యంబులు సవిస్తరంబుగాఁ జెప్పె! నట్లు సేయు నాలోన ద్వారకానగరంబు పరిపూర్ణజలంబై మునింగె; నంత నెవ్వరికిం జనరాక యుండె; నప్పరమేశ్వరుండును శతకోటి సూర్యదివ్యతేజో విభాసితుండై వెడలి నారదాది మునిగణంబులును, బ్రహ్మరుద్రాది దేవతలును, జయజయ శబ్దంబుల తోడం గదలి రా నిజపదంబున కరిగె; నన్నారాయణ విగ్రహంబు జలధి ప్రాంతంబున జగన్నాథస్వరూపంబై యుండె' నని శుకుండు పరీక్షిన్నరేంద్రునకుం జెప్పెనని చెప్పి. 122**

**ప్రతి :** అనుచున్= అంటూ; ఆ దారుకుండు; నిర్వేదనపరుండు+ఐ= దుఃఖితుడై; ఇట్లు+అని; విన్నవించెన్= మనవిచేశాడు; యాదవసముద్రంబు+అడంగెన్= యాదవులనే సముద్రం (యాదవ సమూహం) నశించింది; బంధు గురు మిత్ర జనంబులు= చుట్టాలూ, గురువులూ, మిత్రుల సమూహాలూ; అక్కడన్+అక్కడన్= అటూ ఇటూ; పోయిరి= వెళ్లారు; ద్వారకకున్+పోయి= ద్వారకకువెళ్లి; సుహృత్+జనంబులతోడన్= మిత్రజనులతో; ఏమి+అందున్= ఏమి చెప్పేది? అని; పలుకు= పలికే; అవసరంబునన్= సమయంలో; దివ్య+ఆయుధంబులును= దివ్యమైన ఆయుధాలూ; దివ్య= దివ్యమైన; రథరథ్యంబులును= రథాలూ, గుర్రాలూ; అంతర్ధానంబున్+ఒందెన్= మాయమయ్యాయి; నారాయణుండు= శ్రీకృష్ణుడు; వానితోన్= ఆ దారుకునితో; అక్రూర విదురులకున్; ఈ వృత్తాంతంబు+అంతయున్= ఈ జరిగిన విషయమంతా; చెప్పుము; సవ్యసాచిన్+కని= కవ్వడిని (అర్జునుని) చూచి; స్త్రీ= స్త్రీలను; బాల= పిల్లలనూ; గురు= గురువులనూ; వృద్ధజనంబులన్= ముసలివారినీ; కరిపురంబునకున్+కొని= హస్తినాపురానికి తీసుకొని; చనుము+అనుము= వెళ్లుమని చెప్పు; పొమ్ము+అనినన్= పొమ్మనగా; వాఁడును= దారుకుడుకూడా; మరలి చని= తిరిగి వెళ్లి; కృష్ణుని వాక్యంబులు= శ్రీకృష్ణుని మాటలు; సవిస్తరంబుగాన్+చెప్పెన్= వివరంగా చెప్పాడు; అట్లు+చేయు+ఆలోనన్= ఆ విధంగా చేసే లోపల; ద్వారకానగరంబు; పరిపూర్ణజలంబు+ఐ= పూర్తిగా నీరు గలదై; మునింగెన్= మునిగిపోయింది; అంతన్= అంతట; ఎవ్వరికిన్= ఎవరికి కూడా; చనన్+రాక=+ఉండెన్= పోవడానికి వీలు లేకపోయింది; ఆ+పరమేశ్వరుండును; శతకోటి= నూరుకోట్ల; సూర్య= సూర్యుల; దివ్య= దివ్యమైన; తేజస్+విభాసితుండు+ఐ= కాంతితో కూడిన వాడై; వెడలి= బయలుదేరి; నారద+ఆదిమునిగణంబులును= నారదుడు మొదలైన మహర్షుల సమూహాలూ; బ్రహ్మ; రుద్ర+ఆది= రుద్రుడు మొదలైన; దేవతలును= దేవతలూ; జయజయ శబ్దంబులతోడన్= జయజయ నినాదాలతో; కదలిరాన్= కదలిరాగా; నిజపదంబునకున్+ అరిగెన్= తన స్థానానికి వెళ్లాడు; ఆ+నారాయణ విగ్రహంబు= ఆ శ్రీకృష్ణుని మూర్తి; జలధి= సముద్ర; ప్రాంతంబునన్=

ప్రాంతంలో; జగన్నాథ స్వరూపంబు+ఐ= జగన్నాథుడు రూపం పొంది; ఉండెన్= ఉండినది; అని; శుకుండు; పరీక్షిత్+నర+ఇంద్రునకున్= పరీక్షిన్మహారాజుకు; చెప్పెన్; అని చెప్పి= అని తెలిపి.

**తా :** అంటూ దారుకుడు దుఃఖంతో ఇలా విన్నవించాడు. "యాదవసమూహం (సముద్రమంత యాదవసమూహం) నశించింది. చుట్టాలు, గురువులు, మిత్రులు అటూ ఇటూ చెల్లాచెదరైపోయారు. ద్వారకకు పోయి మిత్ర జనంతో ఏమని చెప్పేది?' అంటూ ఉన్న సమయంలోనే శ్రీకృష్ణుని దివ్యమైన ఆయుధాలూ, దివ్యమైన రథాలూ, గుర్రాలూ మాయమైపోయాయి. శ్రీకృష్ణుడు దారుకునితో 'అక్రూరునికి, విదురునికి ఈ విషయమంతా చెప్పు. అర్జునుడి వద్దకు వెళ్లి స్త్రీలనూ, పిల్లలనూ, గురువులనూ, వృద్ధజనాన్ని హస్తినాపురానికి తీసుకొని పొమ్మని చెప్పు. ఇక వెళ్లు' అన్నాడు. దారుకుడు తిరిగివెళ్లి శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు వివరంగా తెలియజేశాడు. అలా చేసేలోపలే ద్వారకానగరం పరిపూర్ణజలంలో మునిగిపోయింది. ఎవరికీ ప్రవేశించడానికి వీలు లేకపోయింది. అప్పుడు పరమేశ్వరుడైన శ్రీకృష్ణుడు నూరుకోట్ల సూర్యుల దివ్యతేజస్సుతో బయలుదేరి నారదాది మునుల సమూహం, బ్రహ్మరుద్రాది దేవతలు జయజయ నినాదాలతో (తోడుగా) కదలిరాగా తన స్థానానికి (వైకుంఠానికి) వెళ్లిపోయాడు. ఆ నారాయణుని (శ్రీకృష్ణుని) మూర్తి (విగ్రహం) సముద్ర ప్రాంతంలో జగన్నాథుని రూపం పొంది ఉంది అని శుకుడు పరీక్షిత్తు చెప్పెనని తెలిపి –

**క. ఈ కథ విన్నను వ్రాసినఁ, బ్రాకటముగ లక్ష్మి యశము భాగ్యము గలుగుం**
**జేకొని యాయువు ఘనుఁడై, లోకములో నుండు నరుఁడు లోకులు వొగడన్. 123**

**ప్రతి :** ఈ కథ= ఈ శ్రీకృష్ణుని కథ; విన్నను= వినినా; వ్రాసినన్= వ్రాసినా; ప్రాకటముగన్= తప్పకుండా; లక్ష్మి= సంపద; యశము= కీర్తి; భాగ్యము= అదృష్టము; కలుగున్= కలుగుతాయి; ఆయువు; చేకొని= కలిగి; ఘనుఁడు+ఐ= గొప్పవాడై; లోకులు= జనం; పొగడన్= స్తుతించగా; నరుఁడు= మానవుడు; లోకములోన్+ఉండున్= లోకంలో ఉంటాడు.

**తా :** ఈ శ్రీకృష్ణుని కథను వినినా, వ్రాసినా సంపద, కీర్తి, అదృష్టం తప్పక కలుగుతాయి. అలాంటి మానవుడు దీర్ఘాయువుతో, లోకులు మెచ్చగా లోకంలో గొప్పగా జీవిస్తాడు.

**విశే :** ఈ పద్యం ఫలశ్రుతి. కథలు చెప్పినప్పుడు ఆ కథలు విన్న వాళ్లకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో చెప్పేది ఫలశ్రుతి.

**చ. నగుమొగమున్ సుమధ్యమును నల్లని మేనును లచ్చి కాట ప**
**ట్టగు నురమున్ మహాభుజము లంచితకుండలకర్ణముల్ మదే**
**భ గతియు నీలవేణియుఁగృపారసదృష్టియుఁగల్గు వెన్నుఁడి**
**మ్ముగఁబొడసూపుఁగాతఁగనుమూసిన యప్పుడు విచ్చినప్పుడున్. 124**

**ప్రతి :** నగుమొగమున్= నవ్వుమోమూ; సుమధ్యమును= చక్కని నడుమూ; నల్లనిమేనును= నల్లనిదేహమూ; లచ్చికిన్= లక్ష్మీదేవికి; ఆటపట్టు+అగు= నివాసస్థానమైన; ఉరమున్= వక్షమూ; మహాభుజములు= పెద్ద బాహువులూ; అంచిత= అందమైన; కుండల= చెవిపోగులు కల; కర్ణముల్= చెవులూ; మద+ఇభ గతియున్= మదగజగమనమూ (నడకా); నీలవేణియున్= నల్లని జుట్టూ; కృపారస దృష్టియున్= దయారసంతో కూడిన చూపూ; కల్గు= కలిగిన; వెన్నుఁడు= విష్ణువు

(శ్రీకృష్ణుడు); కనుమూసిన+ అప్పుడున్= కనులు మూసినప్పుడూ; విచ్చిన+అప్పుడున్= తెరచినప్పుడూ; ఇమ్ముగన్= చక్కగా (సంతోషంగా); పొడసూపున్+కాత= ప్రత్యక్షమగుగాక.

**తా :** నవ్వుమోమూ, చక్కని నడుమూ, నల్లని దేహమూ, లక్ష్మీదేవికి నివాసస్థానమైన వక్షమూ, పెద్దబాహువులూ, అందమైన చెవిపోగులుగల చెవులూ, మదగజగమనమూ, నల్లనిజుట్టూ, దయారసంతోకూడిన చూపూ కలిగిన విష్ణుమూర్తి (శ్రీకృష్ణుడు) ఆనందం కలిగేటట్లు కనులు మూసినప్పుడూ, తెరచినప్పుడూ ప్రత్యక్షమగును గాక.

**విశే :** శ్రీమదాంధ్ర భాగవతం శ్రీరామచంద్రునికి అంకితం. స్కంధంలోని కథాభాగం అయిపోయిన తరువాత కృతిభర్తను గురించి చెప్పే పద్యాలుంటాయి. 'నగుమొగమున్' అనే పై పద్యం కృతిపతిరూపాన్ని రూపు కట్టిస్తున్నది. వాల్మీకి రామాయణంలోని బాలకాండ ప్రారంభంలో శ్రీరామునిరూపం వర్ణించబడింది. ఈ పద్యంలో కనిపించే శ్రీరాముని ఆకార వర్ణనంతా బాలకాండలో విస్తృతంగా కనిపించే దానికి సంక్షిప్త రూపమే.

**క. రాజీవసదృశనయన! వి**
**రాజితసుగుణా! విదేహరాజవినుత! వి**
**భ్రాజితకీర్తి సుధావృత**
**రాజీవభవాండభాండ! రఘుకులతిలకా! 125**

**ప్రతి :** రాజీవ= పద్మాలతో; సదృశ= సమానమైన; నయన= కనులు గలవాడా!; విరాజిత= ప్రకాశించే; సుగుణా= శోభన గుణాలు కలవాడా!; విదేహరాజ= విదేహాధిపతియైన జనకుడిచే; వినుత= పొగడబడిన వాడా!; విభ్రాజిత= ప్రకాశించే; కీర్తిసుధా= కీర్తి అనే అమృతంతో; ఆవృత= ఆవరించబడిన; రాజీవభవ+అండభాండ= బ్రహ్మాండభాండం కలవాడా!; రఘుకుల తిలకా= రఘువంశానికి తిలకంవంటివాడా (రఘువంశ శ్రేష్ఠుడా).

**తా :** పద్మాలవంటి కనులు గలవాడా! సద్గుణాలతో శోభిల్లేవాడా! జనకరాజుచే పొగడబడినవాడా! ప్రకాశించే కీర్తి అనే అమృతంలో ఆవరించబడిన బ్రహ్మాండభాండం కలవాడా! రఘువంశానికి తిలకం వంటివాడా!

**మాలిని. ధరణి దుహితృరంతా! ధర్మమార్గానుగంతా!**
**నిరుపమనయవంతా! నిర్జరారాతిహంతా!**
**గురుబుధసుఖకర్తా! కోసలక్ష్మోణిభర్తా!**
**సురభయపరిహర్తా! సూరిచేతోవిహర్తా! 126**

**ప్రతి :** ధరణి దుహితృ= భూమి పుత్రియైన సీతతో; రంతా= రమించువాడా (ఆనందించువాడా); ధర్మమార్గ= ధర్మమార్గాన్ని; అనుగంతా= అనుసరించి చరించేవాడా!; నిరుపమ= సాటిలేని; నయవంతా= నీతికలవాడా!; నిర్జర+ అరాతి= దేవతలకు శత్రువులైన రాక్షసులను; హంతా= సంహరించువాడా!; గురు= గురువులకూ; బుధ= పండితులకూ; సుఖకర్తా= సుఖం కలిగించేవాడా!; కోసలక్ష్మోణి= కోసలదేశానికి; భర్తా= ప్రభువా!; సురభయ= దేవతల భయాన్ని; పరిహర్తా= పోగొట్టువాడా!; సూరిచేతస్+విహర్తా= పండితుల హృదయాలలో విహరించేవాడా!

**తా :** భూపుత్రి సీతతో ఆనందించువాడా! ధర్మమార్గాన్ని అనుసరించి చరించువాడా! సాటిలేని నీతికలవాడా! దేవతలకు శత్రువులైన రాక్షసులను సంహరించువాడా! గురువులకూ, పండితులకూ సుఖం కలిగించేవాడా! కోసల దేశానికి ప్రభువా! దేవతల భయాన్ని పోగొట్టువాడా! పండితుల హృదయాలలో విహరించువాడా! శ్రీరామా!

**విశే :** ఈ పద్యంలో కృతిభర్త శ్రీరాముని గుణసంపద వర్ణించబడింది.

**గద్యము: ఇది శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్త్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారయ నామధేయప్రణీతంబైన శ్రీమహాభాగవతం బను మహాపురాణంబు నందుఁ గృష్ణుండు భూభారంబు వాపి యాదవుల కన్యోన్య వైరానుబంధంబుఁగల్పించి, వారల హతంబు గావించుటయు, విదేహర్షభ సంవాదంబును, నారాయణముని చరిత్రంబును, నాలుగు యుగంబుల హరి నాలుగు వర్ణంబులై వర్తించుటయు, బ్రహ్మాదిదేవతలు ద్వారకానగరంబునకుం జని కృష్ణుం బ్రార్థించి నిజపదంబునకుఁ రమ్మనుటయు, నవధూతయదుసంవాదంబును, నుద్ధవునకుఁగృష్ణుం డనేకవిధంబులైన యుపాఖ్యానంబు లెఱింగించుటయు, నారాయణప్రకారం బంతయు దారుకుం డెఱింగి వచ్చి ద్వారకా నివాసులకుం జెప్పుటయుఁ, గృష్ణుండు దన దివ్యతేజంబుతోఁ బరమాత్మం గూడుటయు నను కథలు గల యేకాదశ స్కంధము. 127**

**ప్రతి :** ఇది= ఈ స్కంధం; శ్రీ పరమ+ఈశ్వర= శ్రీ పరమేశ్వరుని; కరుణా= దయతో; కలిత= లభించిన;కవితా విచిత్ర= విచిత్రమైన కవిత గల; కేసనమంత్రి; పుత్త్ర= పుత్రుడు; సహజపాండిత్య= సహజంగానే పండితుడైనవాడు; పోతన+అమాత్య= పోతన అనే మంత్రియొక్క; ప్రియశిష్య= ఇష్టుడగు శిష్యుడైన; వెలిగందల నారయ; నామధేయ= పేరుగల వానిచే; ప్రణీతంబు+ఐన= రచింపబడిన; శ్రీమహాభాగవతంబు+అను= శ్రీమహాభాగవతమనే; మహా= గొప్ప; పురాణంబు+అందున్= పురాణంలో; కృష్ణుండు= శ్రీకృష్ణుడు; భూభారంబు+పాపి= భూమిబరువును పోగొట్టి; యదువులకున్= యాదవులకు; అన్య+అన్య= పరస్పరం; వైర+అనుబంధంబులు= శత్రుత్వాలు; కల్పించి= కలిగించి; వారలన్= యాదవులను; హతంబు+ కావించుటయున్= మృతులను చేయడం; విదేహ+ఋషభ= విదేహ ఋషభుల; సంవాదంబును= పరస్పర భాషణం; నారాయణముని; చరిత్రంబును= చరిత్ర; నాలుగు యుగంబులన్= చతుర్యుగాలలో; హరి= శ్రీహరి; నాలుగు వర్ణంబులు+ ఐ= నాలుగు వర్ణాలై; వర్తించుటయున్= ప్రవర్తించడం; బ్రహ్మ+ఆది= బ్రహ్మమొదలైన; దేవతలు; ద్వారకానగరంబునకున్+ చని= ద్వారకానగరానికి వెళ్లి; కృష్ణున్+ప్రార్థించి= శ్రీకృష్ణుని ప్రార్థించి; నిజపదంబునకున్= తన నివాసమైన వైకుంఠానికి; రమ్ము+అనుటయున్= రమ్మనడం; అవధూత యదు సంవాదంబును= అవధూత యదువుల పరస్పర భాషణం; ఉద్ధవునకున్= ఉద్ధవునికి; కృష్ణుండు; అనేక విధంబులు+ఐన= పలువిధాలైన; ఉప+ఆఖ్యానంబులు= కథలు; ఎఱింగించుటయున్= తెలపడం; నారాయణప్రకారంబు+అంతయున్= నారాయణుని (శ్రీకృష్ణుని) విషయమంతా; దారుకుండు+ఎఱింగి= దారుకుడు తెలుసుకొని; వచ్చి; ద్వారకా= ద్వారకానగరంలో; నివాసులకున్= నివాసమున్న వాళ్లకు; చెప్పుటయున్= చెప్పడం; కృష్ణుండు; తన; దివ్య తేజంబుతోన్= దివ్య తేజస్సుతో; పరమాత్మన్= పరమాత్మను; కూడుటయును= కలవడం; అను కథలు; కల; ఏకాదశ= పదకొండవ; స్కంధము.

**తా :** ఇది పరమేశ్వరుని దయచేత లభించిన విచిత్రమైన కవిత్వం కలవాడూ, కేసనమంత్రి కుమారుడూ, సహజ పాండిత్యుడూ అయిన పోతనామాత్యుని ప్రియశిష్యుడైన వెలిగందల నారయ అనే పేరుగల వానిచే రచింపబడిన శ్రీమహాభాగవతమనే పురాణంలో శ్రీకృష్ణుడు భూమిబరువు పోగొట్టి యాదవులకు పరస్పరశత్రుత్వం కలిగించి వాళ్లను మృత్యువుపాలు చేయడం, విదేహ ఋషభ పరస్పర భాషణం, నారాయణముని చరిత్రమూ, నాలుగు యుగాల్లో శ్రీహరి నాలుగు వర్ణాలై ప్రవర్తించడం, బ్రహ్మ మొదలైన దేవతలు ద్వారకా నగరానికి వెళ్లి శ్రీకృష్ణుని ప్రార్థించి తన నివాసమైన వైకుంఠానికి రమ్మనడం, అవధూత యదువుల పరస్పర భాషణం, ఉద్ధవుడికి శ్రీకృష్ణుడు పలువిధాలైన కథలు తెలపడం, శ్రీకృష్ణుడి విషయమంతా తెలుసుకొని దారుకుడు వచ్చి ద్వారకానగరంలోని వారందరికి చెప్పడం, శ్రీకృష్ణుడు తన దివ్యతేజస్సుతో పరమాత్మను కలవడం – అనే కథలు గల పదకొండో స్కంధం.

**విశే :** ఆశ్వాసాంతాలలో గద్య రాయడం పూర్వకవుల సంప్రదాయం. భాగవతంలో ఒక్కొక్క స్కంధం ఒక్కొక్క విభాగం కాబట్టి ప్రతి స్కంధం చివర గద్య ఉంది. గద్యలో ఆ కవి స్వీయ విషయాలతో పాటు ఆ విభాగంలోని కథాంశాలను వరుసగా సూచించడం కనిపిస్తుంది.

భాగవతంలోని విభాగాలకు స్కంధాలని పేరు. స్కంధం అంటే చెట్టుబోదె. భాగవతం కల్పవృక్షంతో పోల్చబడింది. కల్పవృక్షం దేవలోకంలోఉంటుంది. భాగవతమనే కల్పవృక్షం భూలోకంలో ఉంది. ఆ చెట్టు బోదెలే స్కంధాలు. భాగవతంలో పంద్రెండు స్కంధాలున్నాయి. ఇది ఏకాదశ స్కంధం.

*:: శ్రీకృష్ణార్పణమస్తు ::*

# ద్వాదశస్కంధము



శ్రీరస్తు

# శ్రీమహాభాగవతము

## ద్వాదశస్కంధము

**శ్రీ మరుదశనపతిశయన!, కామిత మునిరాజ యోగి కల్పద్రుమ! యు**
**ద్దామ! ఘనజనకవరనృప, జామాతృవరేశ! రామచంద్రమహీశా! 1**

**ప్రతి :** శ్రీ= మంగళప్రదమైన; ఈ 'శ్రీ' ని శ్రీరామచంద్రలోని శ్రీగా భావించాలి. మరుత్+అశనపతిశయన= గాలిని భుజించే సర్పములకు రాజైన ఆదిశేషుడు పాన్పుగా కలవాడా!, ఓ విష్ణుమూర్తీ!; కామిత= కోరికతో ఆశ్రయించిన; ముని= మునులకు; రాజ= రాజులకు; యోగి= యోగులకు; కల్పద్రుమ= కల్పవృక్షమైనవాడా!; ఉద్దామ= ఉన్నతుడా!; ఘన= గొప్పవాడైన; జనకవర= జనకుడనే శ్రేష్ఠుడైన; నృప= రాజుయొక్క; జామాతృ= అల్లుండ్రలో; వర+ఈశ= ఘనత వహించినవాడా!; రామచంద్ర= రామచంద్రుడనే; మహీ+ఈశా= భూనాయకా!.

**తా :** గాలిని ఆహారంగా భుజించే సర్పములకు రాజైన ఆదిశేషుడు పాన్పుగా కలవాడా! కోరికతో ఆశ్రయించిన మునులకు, రాజులకు, యోగులకు కల్పవృక్షం వంటివాడా! ఉన్నతుడా! ఘనుడైన జనక మహారాజుయొక్క అల్లుండ్రలో ఘనత వహించినవాడా! రామచంద్ర ప్రభూ!

**విశే :** 'మునిరాజయోగి' అన్నపుడు 'మునిశ్రేష్ఠులైన యోగులకు' అని కూడా చెప్పవచ్చు. జనక మహారాజుకు రామలక్ష్మణభరతశత్రుఘ్నులు అల్లుండ్రే. అయితే వీరిలో శ్రీరాముడు జామాతృవరేశుడు.

**వ. మహనీయ గుణగరిష్ఠులగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణవ్యాఖ్యానవైఖరీసమేతుండైన సూతుం డిట్లనియె; నట్లు పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుండు వాసుదేవ నిర్యాణ పర్యంతంబుఁ దజ్జన్మ కర్మంబులు సెప్పిన విని సంతసం బంది య న్నరపాలపుంగవుండు 'మహాత్మా, నారాయణ కథా ప్రపంచంబును, దద్గుణంబులును, నాచారవిధియును, జీవాత్మభేదంబును, హరిపూజా విధానంబును, జ్ఞానయోగ ప్రకారంబును మొదలైనవి యెఱింగించి విజ్ఞానవంతుంగాఁ జేసి మన్నించితి; వింక భావికార్యంబు లన్నియు నెఱింగింపు' మనిన శుకుండు రాజున కిట్లనియె. 2**

**ప్రతి :** మహనీయ= పూజనీయ; గుణ= గుణాలచేత; గరిష్ఠులు+అగు= గొప్పవారైన; ఆ+మునిశ్రేష్ఠులకున్= ఆ మునివర్యులైన శౌనకాదులకు; నిఖిల= సమస్త; పురాణ= పురాణాలకు; వ్యాఖ్యాన= వివరణాత్మకమైన; వైఖరీ= రీతులతో; సమేతుండు+ఐన= కూడిన; సూతుండు= సూతుడనే పేరుగల ముని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; అట్లు= ఆ విధంగా; పరీక్షిత్+నర+ఇంద్రునకున్= పరీక్షిన్మహారాజుకు; శుకయోగి+ఇంద్రుండు= యోగిశ్రేష్ఠుడైన శుకుడు; వాసుదేవ= శ్రీకృష్ణుని; నిర్యాణపర్యంతంబున్= మరణం వరకు; తద్+జన్మకర్మంబులు= అతని పుట్టుక; చేసిన కార్యాలు; చెప్పినన్= చెప్పగా; విని= ఆకర్ణించి; సంతసంబు+అంది= సంతోషపడి; ఆ+నరపాల పుంగవుండు= ఆ రాజోత్తముడు; మహా+ఆత్మా=

గొప్పవాడా!; నారాయణ కథా= శ్రీమన్నారాయణుడికి సంబంధించిన వృత్తాంతాల; ప్రపంచంబును= విస్తారాన్ని; తద్+గుణంబులును= ఆయన గుణాలను; ఆచార విధియును= నడవడిక పద్ధతులను; జీవ+ఆత్మభేదంబును= జీవుడికి, పరమాత్మకు గల భేదాన్ని; హరిపూజా విధానంబును= శ్రీహరిని పూజించవలసిన విధానాన్ని; జ్ఞానయోగ ప్రకారంబును= జ్ఞానయోగాన్ని అనుష్ఠించే పద్ధతిని; మొదలు+ఐనవి= మొదలుగా గలిగినవన్నీ; ఎఱింగించి= తెలిపి; విజ్ఞానవంతున్+కాన్+ చేసి= విజ్ఞానిగా చేసి; మన్నించితివి= ఆదరించినావు; ఇంకన్= ఇకమీద; భావికార్యంబులు+అన్నియున్= భవిష్యత్తులో జరుగబోయే పనులన్నిటిని; ఎఱింగింపుము+అనినన్= తెలియజేయుమని కోరగా; శుకుండు= శుకమహర్షి; రాజునకున్= రాజుతో; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

**తా :** పూజనీయమైన గుణాలచేత గొప్పవారైన శౌనకాది మునులకు సమస్త పురాణాలను వివరించి చెప్పే సామర్థ్యం గల సూతుడు ఈ విధంగా చెప్పాడు. పరీక్షిన్మహారాజుకు శుకయోగి శ్రీకృష్ణుడు అవతారం చాలించేవరకు జరిగిన జన్మకర్మలు చెప్పగా విని, సంతోషపడి, 'మహాత్మా! శ్రీమన్నారాయణుని కథలను, ఆయన గుణాలను, ఆచార విధులను, జీవాత్మభేదాన్ని, శ్రీహరిని పూజించవలసిన విధానాన్ని, జ్ఞానయోగాన్ని అనుష్ఠించే పద్ధతిని, ఇంకా ఇటువంటి వాటి నెన్నిటినో చెప్పి నన్ను విజ్ఞానిని చేసి ఆదరించావు. ఇంక భవిష్యత్తులో జరగబోయే పనులను కూడా తెలియజేయి' అని రాజు కోరాడు. శుకమహర్షి ఇలా చెప్పడం ప్రారంభించాడు.

### a =శుకయోగి పరీక్షిత్తునకు భావికాలగతులఁ జెప్పుట a

**క. నరవర! యీ ప్రశ్నములకు, సరి సెప్పఁగ రాదు; నేను సామర్థ్యము చేఁ**
**బరికించి నీకుఁజెప్పెదఁ, గర మొప్పఁగ భావికాలగతులన్ వరుసన్. 3**

**ప్రతి :** నరవర= రాజా!; ఈ ప్రశ్నములకున్= ఈ ప్రశ్నలకు; సరి= సరిగా; చెప్పఁగన్+రాదు= చెప్పడం సాధ్యంకాదు; నేను; సామర్థ్యముచేన్= సమర్థతతో; పరికించి= దర్శించి; కరము+ఒప్పఁగన్= మిక్కిలి నేర్పుతో లేదా తగినట్లుగా; భావికాలగతులన్= రాగల కాలగమనాలను; వరుసన్= వరుసగా; నీకున్= నీకు; చెప్పెదన్= చెపుతాను.

**తా :** రాజా! ఈ ప్రశ్నలకు సమాధానం సరిగా చెప్పడానికి సాధ్యం కాదు. అయినా, నేను నా సమర్థతతో దర్శించి తగినట్లుగా రాగల కాల గమనాలను నీకు వరుసగా చెపుతాను.

**విశే :** రాజు 'భావికార్యంబులన్నియు' ఎరిగించుమని అడగడంలో అనేక ప్రశ్నలున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానం ఒకటి రెండు మాటలలో చెప్పడం సాధ్యం కాదు. విడమరచి చర్చాపూర్వకంగా చెప్పవలసిన సమాధానాలవి. అందువల్ల ప్రశ్నలకు అనకుండా ప్రశ్నములకు అని ఉంది. ప్రశ్నము అంటే చర్చించడం అని కూడా అర్థం.

**వ. అందు రాజులప్రకారం బెఱింగించెద; బృహద్రథునకుం బురంజయుండు పుట్టు; వానికి శునకుం డనెడువాఁడు మంత్రియై పురంజయునిం జంపి తాను రాజ్యం బేలుచుండు; నంతఁగొంతకాలంబున కతనికిం గుమారుఁ డుదయించిన వానికిఁబ్రద్యోతననామం బిడి యతనికిఁ పట్టంబు గట్టు; నా భూభుజునకు విశాఖరూపుం డదయింపంగలం; డాతనికి నందివర్ధనుండు జన్మించు; నీ యేవురు నూటముప్పది యెనిమిది**

**సంవత్సరములు వసుంధరా పరిపాలనంబునం బెంపు వడయుదురు! తదనందరంబ శిశునాగుండను పార్థివుండుదయించు; నా మూర్ధాభిషిక్తునకుఁగాకవర్ణుండు, జనియించు, నా రాజన్యునకు క్షేమవర్ముఁ డుదయింపఁగలం; డా పృథ్వీపతికి క్షేత్రజ్ఞుం, డతనికి విధిసారుండును, విధిసారున కజాతశత్రుండు, నా భూపాలునకు దర్భకుండును, దర్భకునికి నజయుండు, నతనికి నందివర్ధనుండు, నతనికి మహానందియు ననంగల శైశునాగులు పదుండ్రు నరపాలకులుద్భవించి షష్ట్యుత్తరత్రిశతహాయనంబులు గలికాలంబున ధరాతలం బేలుదు; రంతట మహానందికి శూద్రస్త్రీ గర్భంబున నతి బలశాలి యయిన మహాపద్మపతి యను నందనుం డుదయించు; నతనితో క్షత్రియవంశం బడంగిపోఁగల; దా సమయంబున నరపతులు శూద్రప్రాయులై ధర్మ విరహితులై తిరుగుచుండ మహాపద్మునకు సుమాల్యుం డాదిగాఁగల యెనమండ్రు కుమారు లుదయించెదరు; వారు నూఱుసంవత్స రంబులు క్షోణితలం బేలెద; రంతటఁగార్ముకుండు మొదలుగా రాజనవకంబు నందాఖ్యలం జనియించు; నా నవనందుల నొక భూసురోత్తముం డున్మూలనంబు సేయు; నప్పుడు వారు లేమిని మౌర్యులు గొంతకాలం బీ జగతీ తలంబు నేలుదు; రత్తఱి నా భూదేవుండు చంద్రగుప్తుం డను వానిం దన రాజ్యంబందు నభిషిక్తుంగాఁ జేయంగలం; డంత నాచంద్రగుప్తునకు వారిసారుండును, వానికి నశోకవర్ధనుండు, నతనికి సుయశస్సును, వానికి సంయుతు, దమ్మహనీయునకు శాలిశూకుం డతనికి సోమశర్ముండు, వానికి శతధన్వుండు, నవ్వీరునకు బృహద్రథుండు నుదయించెదరు; మౌర్యులతోఁజేరిన యీ పదుగురును సప్తత్రింశదుత్తరశతాబ్దంబులు నిష్కంటకంబుగా భూపరిపాలనంబు సేసెద; రా సమయంబున బృహద్రథుని సేనాపతియగు పుష్యమిత్రుఁడు శుంగాన్వయుఁడతని వధించి రాజ్యంబు గైకొను; నతనికి నగ్నిమిత్రుం డను నరపతి పుట్టఁగలవాఁ; డాతనికి సుజ్యేష్ఠుండు, సుజ్యేష్ఠునకు వసుమిత్రుండు, నతనికి భద్రకుండును, భద్రకునకుఁ బుళిందుండు, నా శూరునకు ఘోషుండును, వానికి వజ్రమిత్రుండును, నతనికి భాగవతుండును, వానికి దేవభూతియు నుద్భవించెద; రీ శుంగులు పదుండ్రును ద్వాదశోత్తరశతహాయనంబు లుర్వీపతు లయ్యెద; రంతమీఁదట శుంగకులసంజాతుండైన దేవభూతిని గణ్వామాత్యుండగు వసుదేవుం డనువాఁడు వధియించి, రాజ్యం బేలు; వానికి భూమిత్రుండు, న మ్మహానుభావునకు నారాయణుండును గలిగెదరు; కణ్వవంశజులైన వీరలు మున్నూట నలువదేను సంవత్సరంబులు మేదినీతలం బేలుదురు; మఱియును.** **4**

ప్రతి : అందున్= రాగల కాలంలో; రాజుల ప్రకారంబు+ఎఱింగించెదన్= రాజులక్రమం చెపుతాను; బృహద్రథునకున్= బృహద్రథునికి; పురంజయుండు పుట్టున్= పురంజయుడు పుడతాడు; వానికిన్= ఆ పురంజయునికి; శునకుండు+ అనెడివాఁడు= శునకుడు అనేవాడు; మంత్రి+ఐ= అమాత్యుడై; పురంజయునిన్+చంపి= పురంజయుని సంహరించి; తాన్= తానే; రాజ్యంబు+ఏలుచుండున్= రాజ్యం పరిపాలిస్తూ ఉంటాడు; అంతన్= తరువాత; కొంతకాలంబునకున్= కొంతకాలానికి; అతనికిన్= అతనికి; కుమారుండు+ఉదయించినన్= కుమారుడు పుట్టగా; వానికిన్= అతనికి; ప్రద్యోతననామంబు+ఇడి= ప్రద్యోతనుడని పేరుపెట్టి; పట్టంబు+కట్టున్= రాజ్యం కట్టబెడతాడు; ఆ భూభుజునకు= ప్రద్యోతనుడనే ఆ రాజుకు; విశాఖరూపుండు+ఉదయింపన్+కలండు= విశాఖరూపుడు పుట్టబోతాడు; ఆతనికిన్= ఆ

విశాఖరూపుడికి; నందివర్ధనుండు= నందివర్ధనుడు; జన్మించున్= పుడతాడు; ఈ+ఏవురున్= ఈ అయిదుగురు; నూటముప్పది యెనిమిది సంవత్సరములు= నూట ముప్పై ఎనిమిది సంవత్సరాలు; వసుంధరా పరిపాలనంబునన్= భూమిని పాలించడంలో; పెంపు+పడయుదురు= వృద్ధి చెందుతారు; తద్+అనంతరంబు+అ= వారి తరువాతనే; శిశునాగుండు+అను= శిశునాగుడు అనే; పార్థివుండు+ఉదయించున్= రాజు జన్మిస్తాడు; ఆ మూర్ధ+అభిషిక్తునకున్= ఆ రాజుకు; కాకవర్ణుండు= కాకవర్ణుడు; జనియించున్= పుడతాడు; ఆ రాజన్యునకున్= ఆ రాజుకు; క్షేమవర్ముఁడు+ఉదయింపన్+కలండు= క్షేమవర్ణుడు పుడతాడు; ఆ పృథ్వీపతికిన్= ఆ రాజుకు; క్షేత్రజ్ఞుండు; అతనికిన్= ఆతనికి; విధిసారుండును= విధిసారుడు; విధిసారునకు; అజాతశత్రుండున్= అజాతశత్రుడు; ఆ భూపాలునకున్= ఆ రాజుకు; దర్భకుండును= దర్భకుడు; దర్భకునికిన్= దర్భకునికి; అజయుండున్= అజయుడూ; అతనికి; నందివర్ధనుండు= నందివర్ధనుడు; అతనికి; మహానందియున్= మహానంది; అనన్+కల= అనేపేర్లు గల; శైశునాగులు; పదుంద్రు= పదిమంది; నరపాలకులు= రాజులు; ఉద్భవించి= పుట్టి; షష్టి+ఉత్తర త్రిశత= మూడు వందల అరవై; హాయనంబులు= సంవత్సరాలు; కలికాలంబునన్= కలికాలంలో; ధరాతలంబు+ఏలుదురు= భూమండలాన్ని పాలిస్తారు; అంతటన్= ఆ పిమ్మట; మహానందికిన్= మహానందికి; శూద్రస్త్రీ గర్భంబునన్= శూద్రస్త్రీ కడుపున; అతిబలశాలి+అయిన= మిక్కిలి బలవంతుడైన; మహాపద్మపతి+అను= మహాపద్ముడు అనే; నందనుండు+ ఉదయించున్= కొడుకు పుడతాడు; అతనితోన్= అతనితో; క్షత్రియ వంశంబు= క్షత్రియవంశం; అడంగిపోన్+కలదు= నశించిపోతుంది; ఆ సమయంబునన్= ఆ సమయంలో; నరపతులు= రాజులు; శూద్రప్రాయులు+ఐ= శూద్రులతో సమానులై; ధర్మ విరహితులు+ఐ= ధర్మహీనులై అనగా అధర్మపరులై; తిరుగుచున్+ఉండన్= సంచరిస్తూ ఉండగా; మహాపద్మునకున్; సుమాల్యుండు+ఆదిగాన్+కల= సుమాల్యుడు మొదలైన; ఎనమంద్రు= ఎనిమిదిమంది; కుమారులు+ ఉదయించెదరు= కొడుకులు పుడతారు; వారు; నూఱు సంవత్సరంబులు= నూరు సంవత్సరాలు; క్షోణితలంబు+ఏలెదరు= భూమండలం పరిపాలిస్తారు; అంతటన్= ఆ పిమ్మట; కార్ముకుండు= కార్ముకుడు; మొదలు+కాన్= మొదలైన; రాజనవకంబు= తొమ్మిదిమంది రాజులు; నంద+ఆఖ్యలన్= నందులు అనే పేరుతో; జనియించున్= పుడతారు; ఆ నవనందులన్= ఆ తొమ్మిదిమంది నందులను; ఒక భూసుర+ ఉత్తముండు= ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుడు; ఉన్మూలనంబు+చేయున్= సమూలంగా మట్టుపెడతాడు; అప్పుడు; వారు; లేమిని= లేకపోవడంచేత; మౌర్యులు; కొంతకాలంబు= కొంతకాలం; ఈ జగతీ తలంబున్+ఏలుదురు= ఈ భూమండలాన్ని పాలిస్తారు. ఆ+తఱిన్= ఆ సమయంలో; ఆ భూదేవుండు= ఆ బ్రాహ్మణుడు; చంద్రగుప్తుండు+అనువానిన్= చంద్రగుప్తుడు అనే వాడిని; తన రాజ్యంబు+అందున్= తన రాజ్యానికి; అభిషిక్తున్+కాన్+ చేయన్+కలండు= రాజుగా చేస్తాడు; అంతన్= తరువాత; ఆ చంద్రగుప్తునకు; వారిసారుండును= వారిసారుడు; వానికిన్= అతనికి; అశోకవర్ధనుండు= అశోకవర్ధనుడు; అతనికి; సుయశస్సును= సుయశస్సు; వానికి= అతనికి; సంయుతుడు; ఆ+మహనీయునకు= ఆ మహాత్మునికి; శాలిశూకుండు= శాలిశూకుడు; అతనికిన్; సోమశర్ముండు= సోమశర్ముడు; వానికిన్; శతధన్వుండు= శతధన్వుడు; ఆ+వీరునకున్= ఆ వీరునికి; బృహద్రథుండును; ఉదయించెదరు= పుడతారు; మౌర్యులతోన్+చేరిన= మౌర్యులతో కలసిన; ఈ పదుగురును= ఈ పదిమంది; సప్త త్రింశత్+ఉత్తర శతాబ్దంబులు= నూట ముప్పయ్యేడు సంవత్సరాలు; నిష్కంటకంబు+కాన్= నిరాఘాటంగా; భూపరిపాలనంబు+చేసెదరు= భూమిని ఏలుతారు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; బృహద్రథుని; సేనాపతి+అగు= సైన్యాధినేత అయిన; పుష్యమిత్రుఁడు= పుష్యమిత్రుడు; శుంగ+అన్వయుఁడు= శుంగవంశంవాడు; అతనిన్ వధించి= అతనిని చంపి; రాజ్యంబు+కైకొనున్= రాజ్యం ఆక్రమిస్తాడు; అతనికిన్; అగ్నిమిత్రుఁడు+అను= అగ్నిమిత్రుడు అనే; నరపతి= రాజు; పుట్టఁగలవాఁడు= పుడతాడు; ఆతనికిన్= అతనికి; సుజ్యేష్ఠుండు; సుజ్యేష్ఠునకున్; వసుమిత్రుండును= వసుమిత్రుడూ; అతనికిన్= భద్రకుండును= భద్రకుడూ;

భద్రకునకున్= భద్రకునికి; పుళిందుండును= పుళిందుడూ; ఆ శూరునకున్= ఆ పరాక్రమశాలికి; ఘోషుండును= ఘోషుడూ; వానికిన్= అతనికిన్; వజ్రమిత్రుండును= వజ్రమిత్రుడూ; అతనికిన్; భాగవతుండును= భాగవతుడూ; వానికిన్= అతనికి; దేవభూతియును= దేవభూతి; ఉద్భవించెదరు= పుడతారు; ఈ శుంగులు; పదుండ్రును= పదిమందీ; ద్వాదశ+ ఉత్తరశతహాయనంబులు= నూటపన్నెండుసంవత్సరాలు; ఉర్వీపతులు+అయ్యెదరు= రాజులు అవుతారు; అంత మీఁదటన్= ఆ తరువాత; శుంగకుల సంజాతుండు+ఐన= శుంగ వంశీయుడైన; దేవభూతిని= దేవభూతి అనేవాడిని; కణ్వ+అమాత్యుండు+అగు= కణ్వుడి మంత్రి అయిన; వసుదేవుండు= వసుదేవుడనే; అనువాఁడు= పేరుగలవాడు; వధియించి= చంపి; రాజ్యంబు+ఏలున్= రాజ్యాన్ని పాలిస్తాడు; వానికిన్= అతనికి; భూమిత్రుండు= భూమిత్రుడు; ఆ+మహానుభావునకున్= ఆ మహానుభావునికి; నారాయణుండును= నారాయణుడూ; కలిగెదరు= పుడతారు; కణ్వవంశజులు+అయిన= కణ్వవంశస్థులైన; వీరలు= వీళ్లు; మున్నూట నలువదేను సంవత్సరంబులు= మూడువందలనలభైఅయిదేండ్లు; మేదినీతలంబు+ఏలుదురు= భూమండలం పరిపాలిస్తారు; మఱియును= ఇంకా.

**తా :** రాగల కాలంలో రాజుల గురించి చెపుతాను. బృహద్రథుడు అనే రాజుకు పురంజయుడు పుడతాడు. అతనికి శునకుడనే అమాత్యుడుంటాడు. శునకుడు పురంజయుని సంహరించి తానే రాజ్యం పరిపాలిస్తూ ఉంటాడు. అతనికి కొంతకాలానికి ఒక కొడుకు పుడతాడు. వాడికి ప్రద్యోతనుడని పేరు పెట్టి రాజ్యం కట్టబెడతాడు. ప్రద్యోతనునికి విశాఖరూపుడు, అతనికి నందివర్ధనుడు పుడతారు. ఈ రాజులైదుగురు నూట ముప్పై ఎనిమిది సంవత్సరాలు భూమిని పాలించి ప్రసిద్ధి చెందుతారు. ఆ తరువాత శిశునాగుడు అనే రాజు జన్మిస్తాడు. అతనికి కాకవర్ణుడనే కొడుకు కలుగుతాడు. ఆ కాకవర్ణుని కొడుకు క్షేమవర్ముడు. క్షేమవర్మ మహారాజుకు క్షేత్రజ్ఞుడు పుడతాడు. అతనికి విధిసారుడు, విధిసారునికి అజాతశత్రువు, అజాతశత్రువుకు దర్భకుడు, దర్భకునికి అజయుడు, అజయునికి నందివర్ధనుడు, నందివర్ధనునికి మహానంది ఉదయిస్తారు. శైశునాగులు అనే పేరుతో ప్రసిద్ధులైన యీ పదిమంది రాజులు కలికాలంలో మూడువందల అరవై సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా రాజ్యపాలన చేస్తారు.

తరువాత మహానందికి శూద్రవనిత కడుపున మహాపద్ముడు పుడతాడు. అతడు మహాబలవంతు డవుతాడు. అతనితో క్షత్రియవంశం అంతరించి పోతుంది. ఆ సమయంలో రాజులు శూద్రప్రాయులై, ధర్మహీనులై చరిస్తారు. మహాపద్మునికి సుమాల్యుడు మొదలైన ఎనిమిదిమంది కొడుకులు కలుగుతారు. వందసంవత్సరాలపాటు వారి పరిపాలన సాగుతుంది. ఆ పిమ్మట కార్ముకుడు మొదలైన తొమ్మిదిమంది రాజులు పుడతారు. వారికి నవనందులని పేరు. ఆ నవనందులను ఒక బ్రాహ్మణశ్రేష్ఠుడు సమూలంగా మట్టుబెడతాడు. నందులు లేకపోవడం చేత కొంతకాలం పాటు మౌర్యులు పరిపాలనచేస్తారు.

ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు చంద్రగుప్తునికి రాజ్యం అప్పగిస్తాడు. ఆ చంద్రగుప్తునికి వారిసారుడు ఆవిర్భవిస్తాడు. క్రమంగా వారిసారుని కొడుకు అశోకవర్ధనుడు, అతని తనయుడు సుయశస్సు, వాని కొడుకు సంయుతుడు, అతని కొడుకు శాలిశూకుడు, వాని పుత్రుడు సోమశర్ముడు, వాని కొడుకు శతధన్వుడు, వాని కుమారుడు బృహద్రథుడు రాజులవుతారు. మౌర్యునితో కలసి ఆ పదిమంది రాజులు నూటముప్పయ్యేడు సంవత్సరాలు నిరాఘాటంగా రాజ్యపాలన చేస్తారు. ఆ సమయంలో బృహద్రథుని సైన్యాధిపతి శుంగవంశజుడైన పుష్యమిత్రుడు అతనిని చంపి రాజ్యాన్ని ఆక్రమిస్తాడు. పుష్యమిత్రునికి అగ్నిమిత్రుడు పుట్టి రాజవుతాడు. అతని తరువాత సుజ్యేష్ఠుడు, అతనికి వసుమిత్రుడు, అతనికి భద్రకుడు, అతనికి పుళిందుడు, అతనికి ఘోషుడు, అతనికి వజ్రమిత్రుడు, అతనికి భాగవతుడు, వానికి దేవభూతి ఉద్భవిస్తారు. ఈ శుంగులు వరుసగా తమ తండ్రుల నుండి సంక్రమించిన రాజ్యాన్ని తాము గ్రహించి పరిపాలిస్తారు. ఈ పదిమంది

శుంగులు నూటపన్నెండుసంవత్సరాలు రాజ్యపాలన చేస్తారు. తరువాత శుంగవంశీయులలో చివరివాడైన దేవభూతిని కణ్వమంత్రి అయిన వసుదేవుడు వధించి తానే రాజ్యాధిపతి అవుతాడు. అతనికి భూమిపుత్రుడనే పుత్రుడు కలుగుతాడు. ఆ మహానుభావునికి నారాయణుడనే కొడుకు పుడతాడు. కణ్వవంశస్థులు మూడువందలనలభైఅయిదుసంవత్సరాలు భూపరిపాలన చేస్తారు.

**విశే :** నవనందులను నిర్మూలించిన బ్రాహ్మణశ్రేష్ఠుని పేరు చాణక్యుడు. ఇతనికి కౌటిల్యుడు అని కూడా మరొక పేరుంది. చాణక్యుడు చంద్రగుప్తుని రాజుగాచేసి తాను మంత్రిగా మంత్రాంగం నెరపుతాడు. ఇతనిపేరుమీద 'అర్థశాస్త్రం' ఒక ప్రఖ్యాత రాజనీతిశాస్త్ర గ్రంథంగా ప్రచారంలో ఉంది. నవనందులను నిర్మూలించి చాణక్యుడు వాళ్లదగ్గర మంత్రిగా ఉండిన రాక్షసమంత్రిని చంద్రగుప్తునికి మంత్రిగా చేస్తాడు. ఈ కథ విశాఖదత్తుడు సంస్కృతంలో రచించిన 'ముద్రారాక్షసం' అనే నాటకంలో విపులంగా ఉంది.

**క. చతురత నీ క్షితి నేలియు, మతిమోహము విడువలేక మానవనాథుల్**
**సతతముఁదమ కీ కాలం, బతిచంచల మగుట నెఱుఁగరయ్య మహాత్మా! 5**

**ప్రతి :** మహాత్మా= మహానుభావా! పరీక్షిన్మహారాజా!; మానవనాథుల్= రాజులు; చతురతన్= నేర్పుతో; ఈ క్షితిన్= ఈ భూమిని; ఏలియున్= పాలించి; మతిన్= మనస్సునందు; మోహము= అజ్ఞానం; విడువలేక= పోగొట్టుకోలేక; సతతమున్= ఎప్పుడూ; తమకు; ఈ కాలంబు= ఈ కాలం; అతిచంచలము+అగుటన్= మిక్కిలి అస్థిరమనే విషయం; ఎఱుఁగరు+అయ్యా= తెలుసుకోలేక పోతున్నారు గదయ్యా!

**తా :** పరీక్షిన్మహారాజా! రాజులు ఎంతో నేర్పుతో ఈ భూమిని పాలించినా తమ మనస్సులోని అజ్ఞానాన్ని తొలగించుకోలేరు. కాలం మిక్కిలి అస్థిరమైనదనే సత్యాన్ని తెలుసుకోలేక పోతున్నారు గదా!

**క. నరపతులమహిమ నంతయు, నురగాధిపుఁడైన నొడువ నోపఁడు; ధాత్రిం**
**జిరకాల మేలి యిందే, పరువడి నడఁగుదురు వారు భ్రాంతులు నగుచున్. 6**

**ప్రతి :** నరపతుల= రాజులయొక్క; మహిమన్= గొప్పతనాన్ని; అంతయున్= సంపూర్ణంగా; ఉరగ+అధిపుఁడు+ఐనన్= పాముల అధిపతి కూడా అనగా ఆదిశేషుడు కూడా; నొడువన్+ఓపఁడు= నుడువజాలడు అనగా చెప్పలేడు; వారు= రాజులు; భ్రాంతులున్+అగుచున్= భ్రమచెందిన వారవుతూ; ధాత్రిన్= భూమిని; చిరకాలము+ఏలి= చాలకాలం పాలించి; ఇందే= భూమియందే; పరువడిన్= క్రమంగా; అడఁగుదురు= అణగిపోతారు అనగా నశించిపోతారు.

**తా :** రాజుల గొప్పతనాన్ని సంపూర్ణంగా ఆదిశేషుడుకూడా వర్ణించలేడు. ఆ రాజులు ఎంతోకాలం భూపాలన చేసి భ్రాంతిమగ్నులై క్రమంగా చివరకు ఈ భూమిలోనే నశించిపోతారు.

**క. గజతురగాదిశ్రీలను, నిజమని నమ్మంగ రాదు; నిత్యమును హరిన్**
**గజిబిజి లేక తలంచిన, సుజనులకును నతనియందుఁజొరఁగా వచ్చున్. 7**

**ప్రతి :** గజ= ఏనుగులు; తురగ+ఆది= గుర్రాలు మొదలైన; శ్రీలను= సంపదలను; నిజము+అని= సత్యమని లేక స్థిరమని; నమ్మంగన్+రాదు= నమ్మకూడదు; నిత్యమును= ఎల్లప్పుడూ; హరిన్= విష్ణువును; గజిబిజి లేక= కలత లేకుండా,

ప్రశాంతంగా; తలంచినన్= స్మరించిన; సుజనులకును= సజ్జనులకు; అతని+అందున్= విష్ణువునందు; చొరన్+కాన్ వచ్చున్= చేరవచ్చు (ఐక్యం చెందవచ్చు).

**తా :** ఏనుగులు, గుఱ్ఱాలు మొదలైన సంపదలు స్థిరమని నమ్మరాదు. ప్రశాంత హృదయంలో నిరంతరం శ్రీహరిని స్మరించే సజ్జనులు అతనిలోకి చేరుకుంటారు.

**వ.** మఱియుఁగణ్వవంశజుండగు సుశర్ముండను రా జుదయించిన వాని హింసించి తద్భృత్యుం డంధ్ర జాతీయుం డయిన వృషలుం, దధర్మమార్గవర్తియై, వసుమతీచక్రం బవక్రుండై యేలునంత వాని యనుజుండు కృష్ణుం డనువాఁడు రాజై నిలుచు; నా మహామూర్తికి శాంతకర్ణుండును, వానికిఁబౌర్ణమాసుండును, వానికి లంబోదరుండును, వానికి శిబిలకుండు, నతనికి మేఘస్వాతియు, వానికి దండమానుండును, వానికి హాలేయుం డగు నరిష్టకర్మయు, నతనికిఁదిలకుండు, నతనికిఁబురీషసేతుండును, వానికి సునందనుండును, నా రాజశేఖరునకు వృకుండును, వృకునకు జటాపుండును, జటాపునకు శివస్వాతియు, వానికి నరిందముండు, నా భూమీశునకు గోమతియును, వానికిఁబురీమంతుండు, నతనికి దేవశీర్షుండును, వానికి శివస్కందుండును, నతనికి యజ్ఞశీలుండు, నాభవ్యునకు శ్రుతస్కందుండు, వానికి యజ్ఞశత్రుండు, వానికి విజయుం, దవ్విజయునికిఁజంద్రబీజుం, డతనికి సులోమధియు నిట్లు పెక్కం డ్రుదయించి నన్నూట యేఁబదియారు హాయనంబులు ధాత్రిం బాలించెద; రంత నాభీరు లేడ్వురు, గర్దభులు పదుండ్రు, గంకవంశజులు పదాఱుగురు, మేదినీభరంబు దాల్చియుండెద; రటమీఁద యవనులెనమండ్రు, బర్బరులు పదునల్గురు దేశాధీశులై యేలెదరు; మఱియుం బదుముప్వురు గురుండులును, బదునొకండ్రు మౌనులును, వేయుందొమ్మన్నూట తొమ్మిది హాయనంబులు గర్వాంధులయి యేలెద; రటమీఁద నా మౌనవంశజు లగు పదునొకండ్రు త్రిశతయుతంబైన వత్సరంబులు మత్సరంబున నేలెద; రాసమయంబున, గైలికిలు లను యవనులు భూపతు లగుదు; రంత భూతనందుండు నవభంగిరుండు శిశునందుండుఁదద్భ్రాతయగు యశోనందుండుఁబ్రవీరకుండు– వీరలు వీరులై షడుత్తరశత హాయనంబు లేలెద; రంత నా రాజులకుఁ బదుముప్వురు కుమారు లుదయంచి యందు నార్గురు బాహ్లికదేశాధిపతు లయ్యెదరు; కడమ యేడ్వురును గోసలాధిపతు లయ్యెద; రంత వైదూర్యపతులు నిషధాధిపతులై యుండెదరు; పురంజయుండు మగధ దేశాధిపతియై పుట్టి, పుళింద యదు మద్రదేశవాసులగు హీనజాతిజనులు బ్రహ్మజ్ఞానహీనులై హరిభక్తి విరహితులై యుండ, వారికి ధర్మోపదేశంబు సేసి, నారాయణభక్తి నిత్యంబు నుండునట్లుగాఁజేసి, బలపరాక్రమవంతులైన క్షత్త్రియవంశంబు లడంచి, పద్మావతీనగర పరిపాలకుండై గంగానది మొదలు ప్రయాగ వరకు గల భూమి నేలఁగలండు; సౌరాష్ట్ర, అవంతి, ఆభీర, అద్బుద, మాళవ దేశాధిపతులు వ్రాత్యబ్రహ్మణులయి, శూద్రప్రాయులై, యుండగలరు. వారు సింధుతీరంబులఁజంద్రభాగా ప్రాంతంబులఁ గాంచి, కాశ్మీర మండలంబుఁ నేలెదరు. మరియు నత్తఱి శూద్రులను, మ్లేచ్ఛులను, బ్రహ్మతేజో హీను లయిన బ్రహ్మణులను భూభాగంబులం బరిపాలింతురు మరియు, వీరలు రాజరూపులైన మ్లేచ్ఛులై, ధర్మ

**సత్య దయా హీనులై, క్రోధ మాత్సర్యంబుల, స్త్రీ బాల గో ద్విజాతుల వధియింప రోయక, పరధన పరస్త్రీ పరులై, రజస్తమోగుణరతులై, యల్పజీవులై, యల్పబలులై హరిచరణారవింద మకరంద రసాస్వాదులు గాక తమలో నన్యోన్యవైరానుబంధులై సంగ్రామరంగంబుల హతు లయ్యెదరు; ఆ సమయంబునం బ్రజలు తచ్ఛీల వేష భాషాదుల ననుసరించి యుండెదరు; కావున. 8**

**ప్రతి :** మఱియున్= మరల; కణ్వవంశజుండు+అగు= కణ్వవంశం వాడైన; సుశర్ముండు+అను= సుశర్ముడు అనే; రాజు; ఉదయించినన్= పుట్టగా; వానిన్= అతనిని; హింసించి= బాధించి; తద్+భృత్యుండు= అతని సేవకుడు; ఆంధ్రజాతీయుండు+అయిన= ఆంధ్రజాతీయుడైన; వృషలుండు; అధర్మమార్గవర్తి+ఐ= అధర్మమార్గంలో సంచరిస్తూ; వసుమతీ చక్రంబున్= భూవలయాన్ని లేదా భూమండలాన్ని; అవక్రుండు+ఐ= అడ్డులేనివాడై; ఏలునంతన్= పాలిస్తూ ఉండగా; వాని+అనుజుండు= వాని తమ్ముడు; కృష్ణుండు+అనువాఁడు= కృష్ణుడు అనేవాడు; రాజు+ఐ= రాజై; నిలుచున్= నిలబడతాడు; ఆ మహామూర్తికిన్= ఆ మహాత్మునకు; శాంతకర్ణుండును; వానికిన్= శాంతకర్ణునికి; పౌర్ణమాసుండును; వానికిన్= ఆ పౌర్ణమాసుడికి; లంబోదరుండును; వానికిన్= ఆ లంబోదరుడికి; శిబిలకుండును; అతనికిన్= ఆ శిబిలకుడికి; మేఘస్వాతియు; వానికిన్= ఆ మేఘస్వాతికి; దండమానుండును; వానికిన్= ఆ దండమానుడికి; హాలేయుండు+అగు= హాలేయుడైన; అరిష్టకర్మయున్= అరిష్టకర్మ అనువాడు; అతనికిన్= అరిష్టకర్మకు; తిలకుండు; అతనికిన్; పురీషసేతుండును= పురీషసేతుడనువాడు; వానికిన్; సునందుండును= సునందుడనేవాడు; ఆ రాజశేఖరునకున్= ఆ రాజేంద్రునకు; వృకుండును= వృకుడనువాడు; వృకునకున్; జటాపుండును= జటాపుడు అనేవాడు; జటాపునకున్; శివస్వాతియు= శివస్వాతి అనేవాడు; వానికిన్; అరిందముండు= అరిందముడు; ఆ భూమి+ఈశునకున్= ఆ రాజుకు; గోమతియును= గోమతి; వానికిన్= అతనికి; పురీమంతుండు; అతనికిన్= అతనికి; దేవశీర్షుండును= దేవశీర్షుడనేవాడు; వానికిన్; శివస్కందుండును= శివస్కందుడనేవాడు; అతనికిన్; యజ్ఞశీలుడు; ఆ భవ్యునకు= ఆ పూజ్యుడికి; శ్రుతస్కందుండు; వానికిన్; యజ్ఞశత్రుండు= యజ్ఞశత్రుడనేవాడు; వానికిన్; విజయుండు= విజయుడనే వాడు; ఆ+విజయునికిన్= ఆ విజయునికి; చంద్రబీజుండు= చంద్రబీజుడనేవాడు; అతనికిన్; సులోమధియున్= సులోమధి అనేవాడు; ఇట్లు= ఈవిధంగా; పెక్కంద్రు= అనేకులు; ఉదయించి= పుట్టి; నన్నూట+ఏఁబది+ఆరు హాయనంబులు= నాలుగువందల ఏభై ఆరు సంవత్సరాలు; ధాత్రిన్+పాలించెదరు= భూమిని పరిపాలిస్తారు; అంతన్= అటుపిమ్మట; ఆభీరులు; ఏడ్వురు= ఏడుమంది; గర్దభులు; పదుండ్రు= పదిమంది; కంకవంశజులు= కంకవంశీయులు; పది+ఆఱుగురు= పదహారుమంది; మేదినీభరంబున్= భూభారం; తాల్చి= ధరించి; ఉండెదరు= ఉంటారు; అటమీఁదన్= ఆ తరువాత; యవనులు; ఎనమండ్రు= ఎనిమిదిమంది; బర్బరులు; పదునల్గురు= పదునాలుగుమంది; దేశ+అధి+ఈశులు+ఐ= దేశపాలకులై; ఏలెదరు= పాలిస్తారు; మఱియున్= మరల; పదుమువ్వురు= పదమూడుమంది; గురుండులును= గురుండులు అనేవారు; పదునొకండ్రు= పదకొండుమంది; మౌనులును= మౌనవంశంవాళ్లు; వేయిన్+తొమ్మన్నూట తొమ్మిది హాయనంబులు= ఒకవేయి తొమ్మిదివందల తొమ్మిది (1909) సంవత్సరాలు; గర్వాంధులు+అయి= గర్వంతో కన్నులు కనిపించనివారై; ఏలెదరు= పరిపాలిస్తారు; అటమీఁదన్= ఆ పిమ్మట; ఆ మౌనవంశజులు+అగు= మౌనవంశానికి చెందినవారైన; పదునొకండ్రు= పదకొండుమంది; త్రిశతయుతంబు+ఐన+వత్సరంబులు= మూడు వందల సంవత్సరాలు; మత్సరంబునన్= పట్టుదలతో; ఏలెదరు= పరిపాలిస్తారు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; కైలికులు+అను యవనులు= కైలికులు అనే యవనులు; భూపతులు+అగుదురు= రాజులు అవుతారు; అంతన్= తరువాత; భూతనందనుండు; నవభంగిరుండు; శిశునందుండు; తద్+భ్రాత+అగు= అతని సోదరుడైన; యశోనందుండున్; ప్రవీరకుండు; వీరలు=

వీళ్లు; వీరులు+ఐ= వీరత్వం కలవారై; షట్+ఉత్తర శతహాయనంబులు= నూట ఆరు సంవత్సరాలు; ఏలెదరు= పరిపాలిస్తారు; అంతన్= తరువాత; ఆ రాజులకున్; పదుమువ్వురు= పదమూడుమంది; కుమారులు; ఉదయించి= పుట్టి; అందున్= వారిలో; ఆర్గురు= ఆరుమంది; బాహ్లికదేశ+అధిపతులు= బాహ్లికదేశరాజులు; అయ్యెదరు= అవుతారు; కడమ= తక్కిన; ఏడ్వురును= ఏడుమంది; కోసల+అధిపతులు= కోసల దేశరాజులు; అయ్యెదరు= అవుతారు; అంతన్= తరువాత; వైదూర్యపతులు; నిషధ+ అధిపతులు+ఐ= నిషధ దేశపురాజులై; ఉండెదరు= ఉంటారు; పురంజయుండు; మగధదేశ+అధిపతి+ఐ= మగధదేశపు రాజై; పుట్టి= జన్మించి; పుళింద; యదు; మద్ర; దేశవాసులు+అగు= దేశవాసులైన; హీనజాతిజనులు= తక్కువ కులంవాళ్లు; బ్రహ్మజ్ఞానహీనులు+ఐ= బ్రహ్మజ్ఞానశూన్యులై; హరిభక్తివిరహితులు+ఐ= హరిభక్తి లేనివారై; ఉండన్= ఉండగా; వారికిన్= వాళ్లకు; ధర్మ+ఉపదేశంబు+చేసి= ధర్మాన్ని ఉపదేశించి; నారాయణభక్తి; నిత్యంబున్= ఎల్లప్పుడూ; ఉండునట్లు+కాన్+చేసి= ఉండేటట్లుచేసి; బలపరాక్రమవంతులు+ఐన; క్షత్రియవంశంబులన్+అడంచి= క్షత్రియవంశాలను అణగదొక్కి; పద్మావతీనగర పరిపాలకుండు+ఐ; ఆ గంగానది మొదలు ప్రయాగవఱకు గల= గంగానది నుండి ప్రయాగవరకుగల; భూమిని= రాజ్యాన్ని; ఏలన్+కలండు= ఏలగలడు; సౌరాష్ట్ర+అవంతి+ఆభీర+అద్బుద మాళవదేశ+అధిపతులు= సౌరాష్ట్ర, అవంతి, ఆభీర, అద్బుద, మాళవదేశాలకు రాజులు; వ్రాత్య బ్రహ్మణులయి= ఉపనయనం మొదలైన సంస్కారాలు లేని బ్రహ్మణ జాతికి చెందినవారయి; శూద్రప్రాయులు+ఐ= శూద్రులతో సమానమైన ధర్మాలను ఆచరించేవారయి; ఉండగలరు= ఉంటారు; వారు; సింధుతీరంబులన్= సింధునదీ తీరాలలో; చంద్రభాగా ప్రాంతంబులన్= చంద్రభాగానదీ ప్రదేశాలలో; కాంచి కాశ్మీర మండలంబునన్= కాంచి, కాశ్మీర దేశాలను; ఏలుదురు= పాలిస్తారు; మరియున్= ఇంకా; ఆ+తఱిన్= ఆ సమయంలో; శూద్రులును= శూద్రజాతివారూ; మ్లేచ్ఛులును= మ్లేచ్ఛజాతివారూ; బ్రహ్మతేజస్+హీనులు+ఐన= బ్రహ్మతేజస్సు లేని; బ్రహ్మణులును= బ్రహ్మణులూ; భూ భాగంబులన్= రాజ్యాలను; పరిపాలింతురు= పాలిస్తారు; మరియున్= ఇంకా; వీరలు= వీరు; రాజరూపులు+ఐన= రాజుల రూపంలో ఉన్న; మ్లేచ్ఛులు+ఐ= తురుష్కులయి; ధర్మ సత్య దయా హీనులు+ఐ= ధర్మం, సత్యం, దయ లేనివారై; క్రోధమాత్సర్యంబులన్= కోపం, ఈర్ష్యలతో; స్త్రీ బాల గో ద్విజాతులన్= ఆడవాళ్లను, పిల్లలను, ఆవులను, బ్రాహ్మణులను; వధియింపన్+రోయక= చంపడానికి వెనుదీయక; పరధన= ఇతరుల సంపదలకూ; పరస్త్రీ= పరాయి స్త్రీలకూ; పరులు+ఐ= ఆసక్తి చూపేవారై; రజస్+తమస్+గుణరతులు+ఐ= రజోగుణ, తమోగుణాలలో ఇష్టం కలవారై; అల్పజీవులు+ఐ= అల్పాయువులై; అల్పబలులు+ఐ= బలహీనులై; హరిచరణ+అరవింద= శ్రీహరి పాదపద్మాల; మకరంద+రస+ఆస్వాదులు+కాక= మకరందరసం తాగేవారు కాకుండా; తమలోన్= వాళ్లలోనే; అన్యోన్యవైర+అనుబంధులు+ఐ= పరస్పర శత్రుత్వం కలవారై; సంగ్రామరంగంబులన్= యుద్ధరంగాలలో; హతులు+అయ్యెదరు= మరణిస్తారు; ఆ సమయంబునన్= ఆ సమయంలో; ప్రజలు; తద్+శీల వేషభాష+ఆదులన్= వారి స్వభావం, వేషం, భాష మొదలైనవాటిని; అనుసరించి+ఉండెదరు= పాటిస్తూ ఉంటారు; కావునన్= కాబట్టి.

**తా :** కణ్వవంశంలో సుశర్ముడనే రాజు పుడతాడు. అతని భృత్యుడైన వృషలుడు అనే ఆంధ్రజాతీయుడు సుధర్ముడిని వధించి అధర్మమార్గంలో నడుస్తూ ఆ రాజ్యాన్ని నిరాటంకంగా పరిపాలిస్తాడు. అతని తరువాత అతని తమ్ముడు రాజవుతాడు. ఆ తరువాత శాంతకర్ణుడు, పౌర్ణమాసుడు, లంబోదరుడు, శిబిలకుడు, మేఘస్వాతి, దండమానుడు, హాలేయుడైన అరిష్టకర్మ, తిలకుడు, పురీషసేతుడు, సునందనుడు, వృకుడు, జటాపుడు, శివస్వాతి, అరిందముడు, గోమతి, పురీమంతుడు, దేవశీర్షుడు, శివస్కందుడు, యజ్ఞశీలుడు, శ్రుతస్కందుడు, యజ్ఞశత్రుడు, విజయుడు, చంద్రబీజుడు, సులోమధి అనే పేర్లుగల రాజులు పితృక్రమంగా వచ్చిన రాజ్యాన్ని నాలుగు వందల ఏభై సంవత్సరాలు పరిపాలిస్తారు.

ఆ తరువాత ఆభీరవంశజులు ఏడుమంది, గర్దభవంశజులు పదిమంది, కంకవంశజులు పదహారుమంది, భూభారాన్ని ధరించి పాలిస్తారు. తరువాత ఎనిమిదిమంది యవనులు, పదునాలుగుమంది బర్బరులు ప్రభువులవుతారు. వాళ్ల తరువాత పదమూడుమంది గురుండులు, పదకొండుమంది మౌనులు గర్వంతో ఒక వెయ్యితొమ్మిది వందల తొమ్మిది సంవత్సరాలు పాలన సాగిస్తారు. తరువాత మౌనవంశంలో పుట్టిన పదకొండుమంది రాజులు మత్సరంతో మూడువందల సంవత్సరాలు పాలిస్తారు. అదే సమయంలో కైకిలులు అనే యవనులు భూపాలకు లవుతారు. ఆ తరువాత భూతనందుడు, నవభంగిరుడు, శివనందుడు, అతని తమ్ముడైన యశోనందుడు, ప్రవీరకుడు అనేవాళ్లు వీరులై నూటారు సంవత్సరాలు పాలకులవుతారు. ఆ రాజులకు పదమూడు మంది కొడుకులు పుడతారు. వాళ్లలో ఆరుమంది బాహ్లికదేశానికి అధిపతులవుతారు. మిగిలిన ఏడుమంది కోసల దేశానికి అధిపతు లవుతారు.

అప్పుడు వైడూర్యపతులు నిషధదేశానికి అధీశ్వరు లవుతారు. పురంజయుడు మగధ దేశాధీశుడుగా పుట్టి పుళిందులూ, యదువంశస్థులూ, మద్రదేశీయులూ అయిన హీనజాతి జనం బ్రహ్మజ్ఞాన, హరిభక్తి విహీనులు కాగా వారికి ధర్మోపదేశం చేసి శ్రీమన్నారాయణుని మీద భక్తి కలిగేటట్లు చేస్తాడు. బలపరాక్రమాలుగల క్షత్రియవంశాలను అణగదొక్కి పద్మావతీ నగరం రాజధానిగా చేసుకొని గంగనుండి ప్రయాగ వరకు గల భూమిని పరిపాలిస్తాడు.

ఉపనయనాది సంస్కారాలు లేక శూద్రులువలె నడుచుకునే బ్రాహ్మణులు సౌరాష్ట్ర, అవంతి, ఆభీర, అద్బుద, మాళవ అనే దేశాలకు అధిపతులవుతారు. వారు సింధుతీరంలోనూ, చంద్రభాగానదీప్రదేశాలలోనూ, కాశ్మీరదేశాన్ని పాలిస్తారు. శూద్ర, మ్లేచ్ఛజాతి రాజులు, బ్రహ్మతేజస్సు లేని బ్రాహ్మణులు భూపరిపాలన చేస్తారు. తురకలవంటి వీరికి ధర్మం, సత్యం, దయ ఉండవు. క్రోధమాత్సర్యాలతో అతిశయించి స్త్రీలనూ, బాలకులనూ, గోవులనూ, బ్రాహ్మణులనూ వధించడానికి వెనుదీయరు. పరధనాసక్తి, పరవనితాసక్తి కలిగి రజోగుణంలోనూ, తమోగుణంలోనూ మునిగి అల్పాయువులూ, అల్పబలులూ అవుతారు. శ్రీహరి పాదపద్మాల మకరందంలోని రుచి వాళ్లకు తెలియదు. ఒకరిపట్ల ఒకరు వైరం పెంచుకొని యుద్ధాలకు సిద్ధపడి ప్రాణాలు పోగొట్టుకొంటారు. ఆ సమయంలో ప్రజలు కూడా వాళ్ల వేషభాషలను, శీలవృత్తులను అనుసరిస్తారు. కాబట్టి.

**విశే :** పురాణానికున్న పంచలక్షణాల్లో వంశానుచరితం ఒక లక్షణం. వంశానుచరితమంటే కలియుగ రాజవంశాల చరిత్ర. శ్రీకృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైనట్లు పురాణాలు చెపుతున్నాయి.

'యస్మిన్ కృష్ణో దివం యాత స్త స్మిన్ ఏవ తదాహని
ప్రతిపన్నం కలియుగం ఇతి ప్రాహుః పురావిదః'

అనే భాగవతంలోని శ్లోకం పై విషయానికి ఆధారం. యాదవ వంశానికి అలంకారమైన శ్రీకృష్ణుడు తన ధామానికి వెళ్లిన పిదప భూలోకంలో ఏ వంశం ఉండిందో తనకు తెలుపుమని పరీక్షిత్తు శుకమహర్షిని అడిగినట్లు ద్వాదశ స్కంధంలోని మొదటి శ్లోకం –

'స్వధామానుగతే కృష్ణే యదువంశ విభూషణే
కస్య వంశోఽ భవ త్పృథ్వ్యామేత దాచక్ష్వ మే మునే'

అని చెపుతున్నది. ఆ ప్రశ్నకు శుకుడు బార్హద్రథ వంశానికి చెందిన పురంజయుడితో మొదలుపెట్టి కలియుగ రాజవంశాలను వివరించాడు.

భాగవత పురాణంతో పాటు మత్స్య, వాయు, బ్రహ్మాండ, విష్ణు, గరుడ, భవిష్య పురాణాలలో కూడా కలియుగ రాజవంశాలను గురించిన వివరణలున్నాయి. ఏయే వంశపు రాజులు ఎన్నెన్ని సంవత్సరాలు పాలన చేశారనే విషయం కూడా ఉంది. పురాణాల ప్రకారం బార్హద్రథవంశం తరువాత మగధసామ్రాజ్యం ఏర్పడింది. ఈ రెండు రాజ్యాల మధ్యకాలంలో కూడా ప్రద్యోతనులు, శిశునాగులు పాలించినట్లు తెలుస్తున్నది. కలియుగరాజుల పట్టికలు పురాణాలలో క్రీ.శ.నాలుగైదు శతాబ్దాల వరకు పాలించిన రాజులను గురించి చెపుతున్నాయి. ప్రాచీనభారతదేశచరిత్రను నిర్మించిన చరిత్రకారులకు ఇలాంటి పౌరాణిక విషయాలు ఎంతగానో సహాయపడినాయి. వివిధ పురాణాలలో కనిపించే కలియుగ రాజవంశాలను గురించి ఎఫ్.ఇ.పర్‌గిటర్ అనే ఆంగ్ల, చారిత్రక పండితుడు 'పురానిక్ టెక్స్టు ఆఫ్ ది డైనాస్టీస్ ఆఫ్ ది కలి ఏజ్' అనే గ్రంథం రచించాడు. దీన్ని చౌకాంబా సంస్కృత సీరస్, వారణాసి వాళ్లు 1962లో ద్వితీయముద్రణగా ముద్రించారు. 'హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఇండియన్ పీపుల్' అనే పేరుతో భారతీయ విద్యాభవన్, బొంబాయి వాళ్లు 1951లో అనేక సంపుటాలలో భారతదేశచరిత్రను ముద్రించారు. ఆ సంపుటాలలో రెండవ సంపుటం పేరు 'ది ఏజ్ ఆఫ్ ఇంపీరియల్ యూనిటీ'. ఈ సంపుటంలో కలియుగ రాజవంశాలకు చెందిన బోలెడు విషయాలున్నాయి.

**క. దినదినమును ధర్మంబులు, ననయము ధర నడఁగిపోవు నాశ్చర్యముగా**
**విను వర్ణ చతుష్కములో; నెనయఁగ ధనవంతుఁడైన నేలు ధరిత్రిన్. 9**

**ప్రతి :** దినదినమును= ప్రతిరోజూ; ధర్మంబులు; అనయమున్= ఎప్పుడూ; ఆశ్చర్యము+కాన్= అబ్బురం కలిగేవిధంగా; ధరన్= భూమిలో; అడఁగిపోవున్= నశిస్తాయి; విను= వినుము; వర్ణచతుష్కములో= నాలుగు కులాలలో; ఎనయఁగన్= సరిపోలగా; ధనవంతుఁడు+ఐనన్= ధనమున్న వాడయితే; ధరిత్రిన్= భూమిని; ఏలున్= పరిపాలిస్తాడు.

**తా :** రోజురోజుకూ లోకంలో ఆశ్చర్యకరంగా ధర్మాలు నశిస్తాయి. నాలుగు కులాలలో ధనవంతుడైన వాడే భూమికి పరిపాలకుడవుతాడు.

**క. బలవంతుఁడైనవాఁడే, కులహీనుండైన దొడ్డగుణవంతుఁడగుం**
**గలిమియు బలిమియుఁగలిగిన, నిల లోపల రా జతండె; యేమన వచ్చున్? 10**

**ప్రతి :** కులహీనుండు+ఐనన్= కులం తక్కువ వాడైనప్పటికి; బలవంతుడు+ఐనవాఁడు+ఏ= బలం కలవాడే; దొడ్డ= గొప్ప; గుణవంతుడు+అగున్= సద్గుణాలు కలవాడవుతాడు; కలిమియున్= సంపదా; బలిమియున్= బలమూ; కలిగినన్= కలిగిఉంటే; ఇలలోపలన్= భూమిలో (లోకంలో); రాజు+అతండు+ఎ= అతడే ప్రభువు; ఏమి+అనవచ్చున్= చెప్పడానికి ఏముంది?

**తా :** హీనకులంలోని వాడైనా బలమున్నవాడే గొప్ప సద్గుణవంతుడవుతాడు. కలిమీ, బలిమీ అనే రెండూ ఉంటే లోకంలో అతడే రాజు. ఇక చెప్పడానికేముంది?

**విశే :** ప్రస్తుత. దేశకాల పరిస్థితులను బట్టి చూస్తే పై పద్యం చెప్పినవిషయం అక్షరసత్యం.

**వ. అట్లుగాన జనంబులు లోభులై జారత్వ చోరత్వాదులచేత ద్రవ్యహీనులై వన్యశాక మూలఫలంబులను భుజింపుచు, వన దుర్గంబులం గృశీభూతులై దుర్భిక్ష శీత వాతాతప క్షుధా తాపంబులచేత భయపడి, ధైర్యహీనులై యల్పాయుష్కులు, నల్పతర శరీరులునై యుండ రాజులు చోరులై సంచరించుచు, నధర్మ**

**ప్రవర్తనులై వర్ణాశ్రమ ధర్మంబులు వదిలి, శూద్రప్రాయులై యుండెద; రంత నోషధు లల్పఫలదంబులు, మేఘంబులు జలశూన్యంబులు, సస్యంబులు నిస్సారంబులు నగు; నిట్లు ధర్మ మార్గంబు లేక యున్న యెడ ముకుందుండు దుష్టనిగ్రహ శిష్టపరిపాలనంబుల కొఱకు శంబలగ్రామంబున విష్ణుయశుండను విప్రునకుఁ బుత్రత్వంబునొంది, గల్క్యవతారుండై దేవతాబృందంబులు నిరీక్షింప, దేవదత్త ఘోటకారూఢుండై దుష్టమ్లేచ్ఛ జనంబులం దన మండలాగ్రంబున ఖండీభూతులం జేయు; నప్పుడు ధాత్రీమండలంబు విగతక్రూర జనమండలంబై తేజరిల్లు; నంత నరులు విష్ణుధ్యానవందన పూజాదివిధానాసక్తులై నారాయణ పరాయణులై వర్తిల్లెదరు; ఇట్టు లా కల్క్యవతారంబున నిఖిల జనులు ధన్యు లయ్యెదరు; రంతటఁగృతయుగ ధర్మంబై నడచుచుండుఁ జంద్ర భాస్కర శుక్ర గురువు లేకరాశి గతు లయినం, గృతయుగంబై తోఁచు; రాజా! గత వర్తమాన భావికాలంబులు భవజ్జన్మంబు మొదలు పంచదశాధికోత్తర శత సహస్ర హాయనంబు లయి నందాభిషేక పర్యంతంబు నుండు; నంతట నారాయణుం డఖిలదుష్ట రాజధ్వంసంబు గావించి ధర్మంబు నిలిపి వైకుంఠనిలయుం డగు నని చెప్పిన. 11**

**ప్రతి :** అట్లు+కానన్= అందుచేత; జనంబులు= మానవులు; లోభులు+ఐ= పిసినారులై; జారత్వ= వ్యభిచారం; చోరత్వ= దొంగతనం; ఆదులచేతన్= మొదలైనవాటిచేత; ద్రవ్యహీనులు+ఐ= ధనం లేనివారై; వన్య= అడవి; శాక మూల ఫలంబులు= కూరలు, దుంపలు, పండ్లు; భుజించుచున్= తింటూ; వన దుర్గంబులన్= అడవులలో పోరాని ప్రదేశాలలో, కృశీభూతులు+ఐ= బక్కచిక్కిన వాళ్లై; దుర్భిక్ష= కరవుకు; శీత= చలి; వాత+ఆతప= గాలి, ఎండ; క్షుధా= ఆకలి; తాపంబులచేతన్= బాధలతో; భయము+పడి= భీతిచెంది; ధైర్యహీనులు+ఐ= ధైర్యంలేనివాళ్లై; అల్ప+ఆయుష్కులు= స్వల్ప ఆయుర్దాయం కలవారు; అల్పతర= ఇంకా చిన్న; శరీరులున్+ఐ= దేహాలు కలవారై; ఉండన్= ఉండగా; రాజులు= పాలకులు; చోరులు+ఐ= దొంగలై; సంచరించుచున్= తిరుగుతూ; అధర్మ ప్రవర్తనులు+ఐ= ధర్మబద్ధంగా నడవని వారై; వర్ణ+ఆశ్రమ ధర్మంబులున్= నాలుగు వర్ణాల, నాలుగు ఆశ్రమాల వాళ్లకు విహితమైన ధర్మాలను; వదిలి= విడిచిపెట్టి; శూద్రప్రాయులు+ఐ= శూద్రులతో సమానులై; ఉండెదరు= ఉంటారు; అంతన్= పిమ్మట; ఓషధులు= ఔషధ మూలికలు; అల్పఫలదంబులు= తక్కువ ఫలాలనిచ్చేవి; మేఘంబులు= మబ్బులు; జలశూన్యంబులు= నీళ్లు లేనివి; సస్యంబులు= పంటలు; నిస్సారంబులున్+అగున్= సారంలేనివి అవుతాయి; ఇట్లు= ఈ విధంగా; ధర్మమార్గంబులేక= ధర్మమార్గం తప్పి; ఉన్న+ఎడన్= ఉన్నప్పుడు; ముకుందుండు= విష్ణువు; దుష్ట నిగ్రహ= దుర్జన సంహారం; శిష్ట= సజ్జనుల; పరిపాలనంబు కొఱకున్= రక్షణ చేయడానికి; శంబల గ్రామంబునన్= శంబలమనే పల్లెలో; విష్ణుయశుండు+అను= విష్ణుయశుడు అనే; విప్రునకున్= బ్రాహ్మణునకు; పుత్రత్వంబు నొంది= పుత్రునిగా జన్మించి; కల్కి+అవతారుండు+ఐ= కల్కి అనే అవతారం కలవాడై; దేవతాబృందములు= దేవతా సమూహాలు; నిరీక్షింపన్= చూస్తూ ఉండగా; దేవదత్త= దేవదత్తమనే పేరుగల; ఘోటక+ఆరూఢుండు+ఐ= అశ్వాన్ని అధిరోహించి; దుష్ట= దుష్టులైన; మ్లేచ్ఛజనంబులన్= మ్లేచ్ఛజనాన్ని; తన; మండల+అగ్రంబునన్= కత్తివాదరతో; ఖండీభూతులన్+ చేయున్= నరకబడిన వాళ్లనుగా చేస్తాడు (నరుకుతాడు); అప్పుడు; ధాత్రీ మండలంబు= భూవలయం; విగత= తొలగింపబడిన; క్రూరజన మండలంబు+ఐ= దుష్ట జన సమూహం కలిగి; తేజరిల్లున్= ప్రకాశిస్తుంది, అంతన్= అంతట నరులు; విష్ణు ధ్యాన వందన పూజ+ఆది= విష్ణువును ధ్యానించడం; నమస్కరించడం; పూజించడం మొదలైన; విధాన+ఆసక్తులు+ఐ= విధానాలలో శ్రద్ధకలవారై; నారాయణ పరాయణులు+అయి= నారాయణ భక్తిపరులై; వర్తిల్లెదరు= ప్రవర్తిస్తూ ఉంటారు; ఇట్లు= ఈ విధంగా; కల్కి+అవతారంబునన్= కల్కి అవతారంలో; నిఖిలజనులు= జనులందరూ;

ధన్యులు+అయ్యెదరు= కృతార్థులు అవుతారు; అంతటన్= అన్నిచోట్లా; కృతయుగ ధర్మంబు+అయి= కృతయుగం నాటి ధర్మమే ఏర్పడి; నడచుచున్+ఉండున్= ప్రవర్తిస్తూ ఉంటుంది (ఆచరణలో ఉంటుంది); చంద్ర; భాస్కర= సూర్య; శుక్ర; గురువులు= బృహస్పతులు; ఏకరాశి గతులు+అయినన్= ఒకే రాశిలో ప్రవేశించగా; కృతయుగంబు+అయి= కృతయుగమై; తోఁచున్= కనబడుతుంది; రాజా= రాజా!; గత= నడచిన; వర్తమాన= నడుస్తున్న; భావి కాలంబులు= రాగల కాలాలు; భవత్+జన్మంబు మొదలు= నీ పుట్టుక మొదలుకొని; నంద+అభిషేక పర్యంతంబున్= నందుడి పట్టాభిషేకం దాకా; పంచదశ+అధిక శత+ఉత్తర సహస్ర= ఒక వెయ్యి నూటపదిహేను; హాయనంబులు+అయి ఉండున్= సంవత్సరాలు అయి ఉంటుంది; అంతటన్= పిమ్మట; నారాయణుండు= శ్రీమహావిష్ణువు; అఖిలదుష్ట= దుర్మార్గులైన అందరు; రాజ= రాజులను; ధ్వంసంబు+కావించి= నాశనంచేసి; ధర్మంబు నిలిపి= ధర్మాన్ని స్థాపించి; వైకుంఠ నిలయుండు+అగును= వైకుంఠవాసుడవుతాడు (వైకుంఠానికి వెళతాడు) అని చెప్పినన్= అని చెప్పగా....

**తా :** అందుచేత ప్రజలు పిసినారులై వ్యభిచారం, దొంగతనం మొదలైన వాటికి పాల్పడి ధనహీనులవుతారు. అడవులలో దొరికే కూరలు, దుంపలూ, పండ్లూ తింటూ అడవులలో, కొండలలో, దుర్గమ ప్రదేశాలలో తిరుగుతూ బక్కచిక్కి కరవుకు, చలికి, గాలికి, ఎండకు, ఆకలిబాధకు భీతి చెందుతారు. వాళ్ల ఆయుర్దాయం తరిగిపోతుంది. స్వల్ప శరీరాలు గల వాళ్లవుతారు. ఇక రాజులు తామే దొంగలై తిరుగుతూ ఉంటారు. అధర్మంగా సంచరిస్తూ వర్ణాశ్రమధర్మాలను విడిచిపెట్టి శూద్రులతో సమానులై ఉంటారు.

ఆ సమయంలో ఔషధపుమొక్కలు అంత ఫలవంతాలు కావు. మబ్బులు నీళ్లు లేనివై వర్షాలు కురవవు. పండే పంటలు సారహీనమవుతాయి. ఈ విధంగా లోకం ధర్మం తప్పి ఉన్నపుడు విష్ణుమూర్తి దుష్టశిక్షణ కొరకు, శిష్టరక్షణ కొరకు శంబల అనే పల్లెలో విష్ణుయశుడు అనే బ్రాహ్మణునికి కల్కిగా అవతరిస్తాడు. ఆ కల్క్యవతార పురుషుడు దేవతాసమూహాలు చూస్తుండగానే దేవదత్తమనే అశ్వాన్ని అధిరోహించి దుష్టులైన మ్లేచ్ఛులను తన కత్తితో ఖండఖండాలు చేస్తాడు (నరకుతాడు).

అప్పుడు భూమండలం దుర్జనుల గుంపు లేనిదై ప్రకాశిస్తుంది. మానవులు విష్ణువును ధ్యానించడం, నమస్కరించడం, పూజించడం మొదలైన పనులలో శ్రద్ధకలిగి నారాయణ భక్తి పరాయణులై ప్రవర్తిస్తారు. ఈవిధంగా కల్క్యవతార సమయంలో జనులందరూ కృతార్థులవుతారు. అన్నిచోట్లా కృతయుగ ధర్మమే ఆచరణలో ఉంటుంది. చంద్రుడు, సూర్యుడు, శుక్రుడు, బృహస్పతులు ఒకే రాశిలో ప్రవేశించగా అది కృతయుగంగా కనిపిస్తుంది. రాజా! నీ పుట్టుక మొదలుకొని నందుడి పట్టాభిషేకం దాకా నడచిన, నడుస్తున్న, రాగల కాలం ఒక వెయ్యి నూటపదిహేను సంవత్సరాలు అయి ఉంటుంది. తరువాత శ్రీమన్నారాయణుడు దుష్టులైన రాజులందరిని నాశనం చేసి ధర్మాన్ని స్థాపించి వైకుంఠానికి వెళతాడు. అని శుకమహర్షి చెప్పగా

**విశే :** శ్రీకృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైంది. పాండవులు రాజ్యపాలనను వదులుకొన్నారు. అభిమన్యుడి పుత్రుడైన పరీక్షిత్తుకు పట్టంకట్టారు. పరీక్షిత్తు కొడుకు జనమేజయుడు. మహాభారత కథంతా జనమేజయరాజుకు వైశంపాయనుడు (వ్యాసుని శిష్యుడు) చెప్పినట్లు నడుస్తుంది. పరీక్షిత్తు జననం నుండి నందునికి రాజ్యాభిషేకం జరిగినప్పటికి 1115 సంవత్సరాలు జరిగినట్లు భాగవతం చెపుతున్నది. ఈ నందుడు నందవంశానికి చెందిన మహాపద్మనందుడై ఉండాలి. మహాపద్మనందుని వంశంవాళ్లే నవనందులు. నవనందుల తరువాత మౌర్యవంశం ప్రారంభమై మౌర్య చంద్రగుప్తుడు మగధసామ్రాజ్యాధిపతి అయినట్లు చరిత్ర. ఈ భవిష్యవాణికి అనుగుణంగానే భారతదేశ చరిత్రను చూడవచ్చు.

**క. 'మునినాథ! యే విధంబున, ఘనతరముగఁజంద్రసూర్య గ్రహముల జాడల్
సనుఁ? గాలవర్తనక్రమ, మొనరఁగ నెఱిఁగింపవయ్య ముదము దలిర్పన్.'** **12**

**ప్రతి :** మునినాథ= ఓ మునీశ్వరా!; చంద్ర సూర్య గ్రహముల జాడల్= చంద్రుడు, సూర్యుడు అనే గ్రహాల గతులు; ఘనతరముగన్= గొప్పగా; ఏ విధంబునన్= ఏ విధంగా; చనున్= వెళతాయి; ముదము+తలిర్పన్= సంతోషం చిగురించే విధంగా; కాలవర్తన క్రమము= కాలం జరిగే వరుస; ఒనరఁగన్= స్పష్టంగా; ఎఱిఁగింపవయ్య= తెలియజేయవయ్యా!

**తా :** మునీశ్వరా! చంద్ర గ్రహం, సూర్యగ్రహం ఏ విధంగా సంచరిస్తాయో, కాలం ఎలా జరుగుతూ పోతుందో సంతోషంతో నాకు స్పష్టంగా తెలియజెయ్యవయ్యా!

**వ. అనిన నట్లకాక యని చెప్పఁదొడంగె; 'వినుము; సప్తర్షి మండలాంతర్గతంబు లయిన పూర్వ ఋక్షద్వయ సమమధ్యంబునందు నిశాసమయంబున నొక్క నక్షత్రంబు గానుపించిన నా కాలంబు మనుష్యమానంబున శతసంవత్సర పరిమితం బయ్యేనేని, నా సమయంబున జనార్దనుండు నిజపదంబునం బొదలె; నా వేళనె ధాత్రీ మండలంబు గలిసమాక్రాంతం బగు; గృష్ణుం డెంతకాలంబు భూమి యందుఁబ్రవర్తించు, నంతకాలంబు గలి సమాక్రాంతంబు గాదు; మఘానక్షత్రంబందు సప్తర్షులు నే ఘుస్రంబునఁజరియింతు రా ఘుస్రంబునఁ గలి ప్రవేశించి వేయు నిన్నూఱు వర్షంబు లుండు, అంత నా ఋషిసంఘంబు పూర్వాషాఢ కరిగినం గలి ప్రవృద్ధంబు నొందు; నే దివసంబున హరి పరమపదప్రాప్తుడయ్యె; నా దివసంబునందే కలి ప్రవేశించి దివ్యాబ్దసహస్రంబులు చనిన యనంతరంబ నాలుగవపాదంబునఁగృతయుగధర్మంబు ప్రాప్తంబగు.** **13**

**ప్రతి :** అనినన్= అనగా; అట్లు+అ కాక+అని= అలాగేనని; చెప్పన్+తొడంగెన్= చెప్పడం మొదలుపెట్టాడు; వినుము; సప్త+ఋషి మండల+అంతర్గతంబులు+అయిన= ఏడుగురు ఋషుల మండలంలో ఉన్న; పూర్వ= ముందటి; ఋక్షద్వయి= రెండు నక్షత్రాలు; సమమధ్యంబు+అందున్= సమంగా నడుమ; నిశా సమయంబునన్= రాత్రివేళ; ఒక్క నక్షత్రంబు; కానిపించినన్= కనిపించిన; ఆ కాలంబు= ఆ కాలం; మనుష్య మానంబునన్= మానవ గణన ప్రకారం; శతసంవత్సర పరిమితంబు+అయ్యేనేని= నూరు సంవత్సరాల పరిమితి గలదైందో; ఆ సమయంబునన్= ఆ కాలంలో; జనార్దనుండు= జనార్దనుడైన శ్రీకృష్ణుడు; నిజ= తన; పదంబునన్+పొదలెన్= స్థానంలో ఉన్నాడో; ఆ వేళన్+ఎ= ఆ సమయంలోనే; ధాత్రీమండలంబు= భూవలయం; కలి సమాక్రాంతంబు+అగున్= కలిచే ఆక్రమించబడినదైనది; కృష్ణుండు; ఎంతకాలంబు; భూమి+అందున్= భూమిమీద, లోకంలో; ప్రవర్తించు= ఉండినాడో; అంతకాలంబును= అంతకాలం వరకు; కలి సమాక్రాంతంబు+కాదు= కలిచేత ఆక్రమించబడదు; మఘానక్షత్రంబు+అందున్= మఘానక్షత్రంలో; సప్తర్షుల్= సప్తఋషులు; ఏ ఘుస్రంబునన్= ఏ దినాన; చరియింతురు= సంచరిస్తారో; ఆ ఘుస్రంబునన్= ఆ దినాననే; కలి ప్రవేశించి; వేయున్+ఇన్నూఱు వర్షంబులు+అయి+ఉండున్= ఒక వేయి రెండు వందల సంవత్సరాలు అయి ఉంటుంది. ఆ ఋషి సంఘంబు= ఆ సప్తర్షుల సమూహం; పూర్వాషాఢకు+అరిగినన్= పూర్వాషాఢ నక్షత్రంలో ప్రవేశించగా; కలి; ప్రవృద్ధంబున్+ఒందున్= వృద్ధి పొందుతాడు; ఏ దివసంబునన్= ఏ రోజున; హరి; పరమపద ప్రాప్తుడు+అయ్యెన్= వైకుంఠం చేరుకొన్నాడో; ఆ దివసంబునందు+ అ= ఆ రోజుననే; కలి ప్రవేశించి; దివ్య+అబ్ద సహస్రంబులు= వెయ్యి దివ్య సంవత్సరాలు; చనిన+అనంతరంబు= కడచిన తరువాత; నాలుగవ పాదంబునన్= నాలుగవ పాదంలో; కృతయుగ ధర్మంబు= కృతయుగ ధర్మం; ప్రాప్తంబు+అగున్= ప్రాప్తిస్తుంది (నడుస్తుంది).

**తా :** అని పరీక్షిత్తు అడుగగా శుకుడు చెప్పడం మొదలుపెట్టాడు. సప్తర్షి మండలంలో ఉన్న మొదటి నక్షత్రద్వయానికి సమంగా మధ్యగా రాత్రి సమయంలో ఒక నక్షత్రం కనిపిస్తుంది. అది కనిపించి మనుష్యగణనప్రకారం నూరు సంవత్సరాల పరిమితి గలదైనపుడు జనార్దనుడైన శ్రీకృష్ణుడు తన స్థానానికి వెళ్లిపోయాడో ఆ రోజుననే భూలోకం కలిచేత ఆక్రమించ బడింది. శ్రీకృష్ణుడు భూమిమీద ఉన్నంత కాలం కలి భూమిమీద అడుగు మోపలేదు. సప్తర్షులు మఘా నక్షత్రంలో ఏ రోజున ప్రవేశిస్తారో ఆ నాటికి కలి ప్రవేశించి పండ్రెండు వందల సంవత్సరాలు అవుతుంది. ఆ ఋషులు ఏడుగురూ పూర్వాషాఢలో ప్రవేశించినప్పుడు కలి వృద్ధి పొందుతాడు. శ్రీకృష్ణుడు లోకాన్ని విడిచి పరమపదమైన తన లోకాన్ని చేరుకొన్న రోజుననే కలి ప్రవేశించాడు. అప్పటినుండి వెయ్యి దేవ సంవత్సరాలు గడిచిన తరువాత నాలుగో పాదంలో కృతయుగ ధర్మం నడుస్తుంది.

**విశే :** మరీచి, అత్రి, అంగిరుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు – ఈ ఏడుగురు సప్తర్షులు. మరొక క్రమం ప్రకారం – కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వసిష్ఠుడు – సప్తర్షులు. సప్తర్షి మండలంలోని పూర్వనక్షత్ర ద్వయం – పులహుడు, క్రతువు అనే ఋషుల పేర్లతో ఉన్న నక్షత్రాలు. ఈ రెండు నక్షత్రాల మధ్యలో అశ్విని, భరణి, కృత్తిక మొదలైన నక్షత్రాలలో ఒక నక్షత్రం నూరుసంవత్సరాలు ఉన్ననాడు కలియుగం ప్రారంభమైంది. అంటే పరీక్షిత్తు పాలనకాలంలో సప్తఋషులలో తూర్పువైపున రెండు నక్షత్రాల మధ్య మఘానక్షత్రం సమంగా నిలిచి ఉండడానికి ఆరంభమైన కాలం కలియుగ ప్రారంభకాలం.

**చ. నరవర! తొంటి భూపతుల నామగుణంబులు, వృత్తచిహ్నముల్,**
**సిరియును, రూపసంపదలుఁ, జెన్నగురాజ్యము, లాత్మవిత్తముల్.**
**వరుస నడంగెఁగాని, యట వారల కీర్తులు నిర్మలంబులై**
**యురవడి భూమిలో నిలిచి యున్నవి నేఁడును రాజశేఖరా! 14**

**ప్రతి :** నరవరా= ఓ రాజా!; రాజశేఖరా= రాజోత్తమా!; తొంటి భూపతుల= పూర్వ రాజులయొక్క; నామగుణంబులు= పేర్లూ, గుణాలూ; వృత్తచిహ్నముల్= ప్రవర్తనల గుర్తులు; సిరియును= సంపదా; రూప సంపదలున్= ఆకృతుల వైభవాలూ; చెన్ను+అగు రాజ్యము= అందమైన రాజ్యమూ, ఆత్మ విత్తముల్= వారి ఐశ్వర్యాలూ; వరుసన్= క్రమంగా; అడంగెన్+కాని= నశించాయి కాని; అటన్; వారల కీర్తులు= వారి యశస్సులు; నిర్మలంబులు+ఐ= స్వచ్ఛములై; ఉరవడిన్= బాగా; నేఁడును= ఇప్పటికీ; భూమిలోన్= లోకంలో; నిలిచి+ఉన్నవి= నిలిచి శాశ్వతంగా ఉన్నాయి.

**తా :** రాజోత్తమా! పరీక్షిన్మహారాజా! పూర్వరాజుల పేర్లూ, గుణాలూ, వాళ్ల ప్రవర్తనల గుర్తులూ, సిరులూ, సంపదలూ, వాళ్ల అందచందాలూ, రాజ్యాలూ, ఐశ్వర్యాలూ అన్నీ వరుసగా నశించాయి. కాని, వాళ్ల యశస్సులు ఈనాటికీ స్వచ్ఛంగా, శాశ్వతంగా నిలిచి ఉన్నాయి.

**వ. శంతను ననుజుండగు దేవాపియు, నిక్ష్వాకువంశజుండగు మరుత్తును, యోగయుక్తులై కలాపగ్రామనిలయులై కలియుగాంతంబునందు వాసుదేవప్రేరితులై, ప్రజల నాశ్రమాచారంబులు దప్పకుండ నడపుచు, నారాయణ స్మరణంబు నిత్యంబునున్ జేసి, కైవల్యపదప్రాప్తు లగుదురు; ఇ వ్విధంబున నాలుగు యుగంబుల రాజులును నే నెఱింగించిన పూర్వరాజన్యులును, వీ రందఱును సమస్త వస్తుసందోహంబుల యందును మమత నొంది యుత్సాహవంతులై యుండి పిదప నీ భూతలంబు వదలి నిధనంబు నొందుదురు;**

**కావునఁ గాలంబు జాడ యెవ్వరికిం గానరాదు; (కీర్తిసుకృత దుష్కృతంబులు వెంటనంటం గలయవి) అదియునుంగాక మత్పూర్వులు హరిధ్యానపరవశులై దయా సత్య శౌచ శమ దమాదిక ప్రశస్తగుణంబులం బ్రసిద్ధులై నడచిరి; అట్లు గావున. 15**

**ప్రతి :** శంతనుని; అనుజుండు+అగు= తమ్ముడైన; దేవాపియున్= దేవాపి అనేవాడూ; ఇక్ష్వాకువంశజుండు+అగు= ఇక్ష్వాకు వంశంవాడైన; మరుత్తును= మరుత్తు అనేవాడూ; యోగయుక్తులు+ఐ= యోగంతో కూడినవాళ్లై; కలాపగ్రామ నిలయులు+ఐ= కలాప గ్రామంలో నివసిస్తూ ఉండి; కలియుగ+అంతంబునన్= కలియుగం చివర; వాసుదేవ= వాసుదేవుని వల్ల; ప్రేరితులు+ఐ= ప్రేరేపింపబడినవారై; ప్రజలన్= ప్రజలను; ఆశ్రమ+ఆచారంబులు= ఆశ్రమ ధర్మాలు; తప్పకుండన్= తప్పకుండా; నడపుచున్= పాటించేటట్లు చేస్తూ; నారాయణ స్మరణంబు= నారాయణ స్మరణను; నిత్యంబునున్‌జేసి= నిత్యమూ చేసి; కైవల్యపదప్రాప్తులు+అగుదురు= మోక్షం పొందుతారు; ఈ+విధంబునన్= ఈ విధంగా; నాలుగు యుగంబుల రాజులును= నాలుగు యుగాల రాజులూ; నేను+ఎఱింగించిన= నేను తెలిపిన; పూర్వ రాజన్యులును= వెనుకటి రాజులూ; వీరు+అందఱును= వీళ్లందరూ; సమస్త వస్తు సందోహంబుల+అందున్= సమస్త వస్తుసముదాయాల మీద; మమతన్+ఒంది= మమకారం కలవారై; ఉత్సాహవంతులు+ఐ= ఉత్సాహం కలవారై; ఉండి= జీవితాన్ని గడిపి; పిదపన్= తరువాత; ఈ భూతలంబున్= ఈ నేలను; వదలి= వీడి; నిధనంబున్+ఒందిరి= మరణం పొందారు; కావునన్= కాబట్టి; కాలంబుజాడ= కాలగతి; ఎవ్వరికిన్+కానరాదు= ఎవరికీ తెలియదు; కీర్తి సుకృత దుష్కృతంబులు= సంపాదించిన కీర్తి, పాపపుణ్యాలు మాత్రమే; వెంటనంటం గలయవి= వెంట వస్తాయి; అదియునుంగాక= అంతేకాకుండా; మత్+పూర్వులు= నా మునుపటి వాళ్లు (మా పెద్దలు); హరి ధ్యాన పరవశులు+ఐ= విష్ణుధ్యానంలో ఒడలెరుగని వారై; దయా; సత్య; శౌచ; శమ; దమ+ఆది; ప్రశస్త= గొప్ప; గుణంబులన్= గుణాలతో; ప్రసిద్ధులు+ఐ= పేరుపొందిన వారై; నడచిరి= జీవించారు; అట్లు+కావునన్= అందుచేత.

**తా :** శంతనుని తమ్ముడు దేవాపీ, ఇక్ష్వాకువంశంవాడైన మరుత్తూ యోగవిద్యను అవలంబిస్తూ కలాప గ్రామంలో ఉండి కలియుగాంతంలో వాసుదేవునివల్ల ప్రేరితులై, ప్రజలందరూ చక్కగా ఆశ్రమధర్మాలను పాటించేటట్లు నడిపిస్తూ, నిత్యం విష్ణుస్మరణ చేస్తూ కైవల్యం పొందుతారు. ఈ విధంగా నాలుగు యుగాల రాజులూ, నేను చెప్పిన వెనకటి రాజులూ అందరూ లోకంలోని సమస్త వస్తు సముదాయం మీద మమకారం కలిగి, ఉత్సాహంతో జీవితాన్ని గడిపి తరువాత ఈ నేలను వీడి మరణించారు. కాబట్టి కాలగతి ఎవరికీ తెలియదు. మా పూర్వులు (మా పెద్దలు) విష్ణుధ్యానపరాయణులై దయా సత్య శౌచ శమ దమాది గొప్ప గుణాలు పాటించి కీర్తిపొంది జీవించారు. అందుచేత ...

**విశే : దేవాపి –** చంద్రవంశపు రాజు. సునందా ప్రతీపుల కొడుకు. శంతనుడు, బాహ్లికుడు ఇతడి సోదరులు. దేవాపికి చర్మవ్యాధి ఉందని రాజ్యానికి అనర్హుడుగా ప్రకటించి శంతనుని రాజును చేస్తారు. దేవాపి అడవికి వెళ్లి తపస్సు చేసి ముక్తి పొందుతాడు.

**నాలుగు యుగాలు –** కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. 'కాలంబుజాడ యెవ్వరికిం గానరాదు' అనే ఈ వాక్యం భారతం మౌసల పర్వంలోని 'కాలమూలంబు సర్వంబు' (పద్యం 222) అని వ్యాసుడు అర్జునుడికి చెప్పిన విషయాన్ని స్ఫురింపజేస్తున్నది. సృష్టిలో అంతా కాలాధీనంగా ఉంటుంది. అందుకే అందరూ 'కాలాయ తస్మైనమః' అని కాలశక్తికి నమస్కరిస్తారు.

**క. ధర్మము సత్యముఁగీర్తియు, నిర్మలదయ విష్ణుభక్తి నిరుపమ ఘన స**
**త్కర్మ మహింసావ్రతమును, నర్మిలి గలవారె పుణ్యు లవనీనాథా! 16**

**ప్రతి :** అవనీనాథా!= భూభర్తా!; ధర్మమున్= ధర్మం; సత్యమున్= సత్యం; కీర్తియున్= కీర్తి; నిర్మలదయ= అచ్చమైన దయ; విష్ణుభక్తి; నిరుపమ= సాటిలేని; ఘన= గొప్ప; సత్కర్మము= సత్కర్మ; అహింసావ్రతమును= అహింసావ్రతం; అర్మిలిన్= ప్రేమగా; కలవారు+ఎ= ఉన్నవారే; పుణ్యులు= పుణ్యాత్ములు.

**తా :** ఓ రాజా! ధర్మం, సత్యం, కీర్తి, అచ్చమైన దయ, విష్ణుభక్తి, సాటిలేని గొప్ప సత్కర్మ, అహింస అనే గుణాలమీద ప్రేమగల వారే పుణ్యాత్ములు.

**తే. ఈ జగం బేలు తొల్లిటి రాజవరులు, గాలవశమున నాయువుల్ గోలుపోయి**
**నామమాత్రావశిష్టు లైనారు; గాన, సలుపవలవదు మమత నెచ్చట నృపాల! 17**

**ప్రతి :** నృపాల!= ఓ రాజా!; ఈ జగంబు+ఏలు= ఈ లోకాన్ని పాలించే; తొల్లిటి రాజవరులు= పూర్వరాజోత్తములు; కాలవశమునన్= కాలగతి ననుసరించి; ఆయువుల్+కోలుపోయి= ప్రాణాలు పోగొట్టుకొని; నామమాత్ర= పేరుమాత్రమే; అవశిష్టులు= మిగిలినవాళ్లు; ఐనారు= అయ్యారు; కానన్= కాబట్టి; ఎచ్చటన్= ఏ విషయంలోనూ; మమతన్= మమకారాన్ని; సలుపవలదు= పెంచుకోవద్దు (మమకారం పనికిరాదు).

**తా :** ఈ లోకాన్ని పాలించే పూర్వ రాజోత్తములు కాలగతిననుసరించి ప్రాణాలు పోగొట్టుకొని, పేరు మాత్రమే మిగిలిన వారయ్యారు. కాబట్టి ఏ విషయంలోనూ మమకారం పెట్టుకోవద్దు.

**వ. గర్వాంధులైన నరపతులం జూచి భూదేవి హాస్యంబు సేయు; 'శత్రుక్షయంబు సేసి యెవ్వరికి నీక తామే యేలు చుండెద' మనియెడి మోహంబునం బితృపుత్త్రభ్రాతలకు భ్రాంతి గల్పించి, యన్యోన్య వైరానుబంధంబులం గలహంబు సేసి, రణరంగంబులం దృణప్రాయంబులుగా దేహాదులు వర్జించి, నిర్జరలోక ప్రాప్తులైన పృథు యయాతి గాధి నహుష భరతార్జున మాంధాతృ సగర రామ ఖట్వాంగ ధుంధుమార రఘు తృణబిందు పురూరవ శ్శంతను గయ భగీరథ కువలయాశ్వ కకుత్థ్స నిషధాదులగు రాజులును హిరణ్యకశిపు వృత్ర రావణ నముచి శంబర భౌమ హిరణ్యాక్ష తారకాదులైన దైత్యులును ధరణికి మమత్వంబునం జేసి కదా కాలవశంబున నాశంబు నొందిరి? ఇది యంతయు మిథ్య గాన సర్వంబునుం బరిత్యజించి 'జనార్దన, వైకుంఠ, వాసుదేవ, నృసింహాది' హరినామామృత పానంబు నిరంతరంబు సేసి, జరారోగవికృతులం బాసి హరిపదంబు నొందు' మని చెప్పి. 18**

**ప్రతి :** గర్వ+అంధులు+అయిన= గర్వంతో కన్నులు కానని; నరపతులన్= రాజులను; చూచి; భూదేవి; హాస్యంబు+చేయున్= పరిహసిస్తుంది; శత్రుక్షయంబు+చేసి= విరోధులను నశింపజేసి; ఎవ్వరికిన్+ఈక= ఎవరికీ ఇవ్వకుండా; తాము+అ= తామే; ఏలుచున్+ఉండెదము= పాలిస్తూ ఉంటాము; అనియెడి= అనే; మోహంబునన్= అజ్ఞానంతో; పితృ= తండ్రులకు; పుత్త్ర= కొడుకులకు; భ్రాతలకున్= సోదరులకు; భ్రాంతి+కల్పించి= భ్రమ గొలిపి; అన్యోన్య= పరస్పర; వైర+అనుబంధంబులన్= శత్రుత్వాలతో; కలహంబు+చేసి= యుద్ధంచేసి; రణరంగంబులన్= యుద్ధరంగాలలో; తృణప్రాయంబులు+కాన్= గడ్డిపోచలతో

సమానంగా; దేహ+ఆదులు= శరీరం మొదలైనవి; వర్జించి= విడిచి; నిర్జరలోక ప్రాప్తులు+ఐన= దేవలోకానికి పోయిన (మరణించిన); పృథు= పృథుచక్రవర్తి; యయాతి; గాధి (విశ్వామిత్రుడి తండ్రి); నహుష= నహుషుడు; భరత+అర్జున= భరతుడు, అర్జునుడు; మాంధాతృ= మాంధాత; సగర= సగరుడు; రామ= రాముడు; ఖట్వాంగ= ఖట్వాంగుడు; ధుంధుమార= ధుంధుమారుడు; రఘు= రఘుమహారాజు; తృణబిందు= తృణబిందువు; పురూరవస్= పురూరవుడు; శంతను= శంతను మహారాజు; గయ= గయుడు; భగీరథ= భగీరథుడు; కువలయాశ్వ= కువలయాశ్వుడు; కకుత్థ= కకుత్థుడు; నిషధా+ఆదులు+అగు= నిషధుడు మొదలైన; రాజులును= మహారాజులు; హిరణ్యకశిపు= హిరణ్యకశిపుడు; వృత్ర= వృత్రాసురుడు; రావణ= రావణుడు; నముచి; శంబర= శంబరుడు; భౌమ= భౌముడు; హిరణ్యాక్ష= హిరణ్యాక్షుడు; తారక+ఆదులైన= తారకాసురుడు మొదలైన; దైత్యులును= రాక్షసులు కూడా; ధరణికిన్= భూమికి; మమత్వంబునన్+చేసి= 'నాది' అనుకోవడంచేత (మమకారంచేత); కదా; కాలవశంబునన్= కాలగతికి లోబడి; నాశంబున్+ఒందిరి= నాశనమై పోయారు; ఇది+అంతయున్= ఇదంతా; మిథ్య+కానన్= అసత్యం కాబట్టి; సర్వంబునున్= అంతటినీ; పరిత్యజించి= విడిచిపెట్టి; జనార్దన; వైకుంఠ; వాసుదేవ; నృసింహ; ఆది= మొదలైన; హరినామ+అమృత= విష్ణునామము అనే అమృతం; పానంబు నిరంతరంబు+చేసి= నిరంతరము తాగి; జరా= ముసలితనం; రోగ= వ్యాధి అనే; వికృతులన్= వికారాలను; పాసి= విడిచి; హరిపదంబున్+ఒందుము= విష్ణుస్థానం పొందుము; అని చెప్పి....

**తా :** 'గర్వంచేత కన్నులు మూసుకొనిపోయిన రాజులను చూసి భూమాత పరిహసిస్తుంది. శత్రువులను చంపి ఎవరికీ ఇవ్వకుండా తామే పాలిస్తామన్న అజ్ఞానంతో తండ్రులకూ, కొడుకులకూ, సోదరులకూ భ్రమ పుట్టించి, పరస్పర శత్రుత్వాలతో యుద్ధంచేసి, యుద్ధరంగాలలో శరీరాదులను గడ్డిపోచలతో సమానంగా విడిచి దేవలోకం పొందిన (మరణించిన) పృథుచక్రవర్తి, యయాతి, గాధి, నహుషుడు, భరతుడు, అర్జునుడు, మాంధాత, సగరుడు, రాముడు, ఖట్వాంగుడు, ధుంధుమారుడు, రఘుమహారాజు, తృణబిందువు, పురూరవుడు, శంతనుడు, గయుడు, భగీరథుడు, కువలయాశ్వుడు, కకుత్థుడు, నిషధుడు మొదలైన రాజులు. హిరణ్యకశిపుడు, వృత్రాసురుడు, రావణుడు, నముచి, శంబరుడు, భౌముడు (నరకుడు), హిరణ్యాక్షుడు, తారకాసురుడు – మొదలైన రాక్షసులు కూడా 'భూమినాది' అనుకోవడం చేతనే కదా కాలానికి లొంగి నాశనమై పోయారు! ఇదంతా పైకి కనిపించేదేకాని సత్యం కాదు. కాబట్టి అంతటినీ విడిచిపెట్టి 'జనార్దనా! వైకుంఠా! వాసుదేవా! నృసింహా! అని ఎల్లప్పుడూ శ్రీహరి నామము అనే అమృతపానం చేసి ముసలితనం, రోగం అనే వికారాలను దూరం చేసుకొని విష్ణుస్థానం పొందు' అని చెప్పి

**విశే :** భూమి శాశ్వతంగా ఉంటుంది. ఆ భూమిని పాలించే రాజులు పుడుతూ ఉంటారు మరణిస్తూ ఉంటారు. అందువల్ల ఏ రాజుకూ భూమి శాశ్వతం కాదు. ఈ భూమి నాది అని ఒకరినొకరు జయించుకొని తమదిగా చేసుకోవాలనే ప్రయత్నాన్ని చూచి భూదేవి నవ్వుకొంటుంది. 'ఈ రాజులెంత మూర్ఖులు, తాము మృత్యుముఖంలో ఉన్నామని తెలుసుకోలేక మరొకరిని జయించి వాళ్ల భూమిని గ్రహించాలను కొంటున్నారు' అని గేలిచేస్తుంది.

**పృథువు :** వేనుడి భుజాలు మర్దించగా పుట్టినవాడు. ఇతడొక చక్రవర్తి. ఇతని భార్యపేరు అర్చి. వేనుడు ఎంత అధర్మంగా పాలించాడో పృథుచక్రవర్తి అంత ధర్మబద్ధంగా పాలించాడు. ప్రజా సంరక్షణకోసం గోరూపంలో ఉన్న భూమినుండి రత్నాలను, ఓషధులను పితికాడు.

**యయాతి :** నహుషుని కుమారుడు. శుక్రాచార్యుడి కూతురు దేవయానిని, వృషపర్వుడనే రాజు కూతురు శర్మిష్ఠను పెండ్లాడాడు. దేవయానికి యదువు, తుర్వసుడు, శర్మిష్ఠకు ద్రుహ్యువు, అనువు, పూరుడు అనే కొడుకులు పుడతారు.

శుక్రాచార్యుడి శాపం వల్ల యయాతి ముసలివాడవుతాడు. తనకింకా భోగేచ్ఛ ఉన్నదని, తన ముసలితనం తీసుకొని తమ యౌవనం ఇవ్వమని కొడుకులను అడుగుతాడు. కొడుకులందరూ నిరాకరించగా పూరుడు మాత్రం అంగీకరించి తన యౌవనాన్ని ఇస్తాడు. యయాతి చాలకాలం భోగాలనుభవించి మళ్లీ పూరుడినుండి ముసలితనం తీసుకొని అడవికి వెళ్లి తపస్సు చేస్తాడు.

**గాధి :** కుశికుడి కొడుకు. ఇతని పుత్రుడు విశ్వామిత్రుడు.

**నహుషుడు :** ఇతడొక రాజు. అనేక క్రతువులు చేశాడు. దేవతలు నహుషుని ఇంద్రుడుగా ఎన్నుకొన్నారు. ఇతడు గర్వించి దేవతలను, మునులను అవమానించాడు. ఇంద్రుని భార్యయైన శచీదేవిని తనకడకు పంపవలసిందిగా ఆజ్ఞాపించాడు. బృహస్పతి సలహాపై శచీదేవి మునివాహనంపై తనకడకు వస్తే అతడి కోరికను తీరుస్తానంటుంది. నహుషుడు అగస్త్యాది మహర్షులను తన పల్లకిని మోయమంటాడు. వారు మోస్తూ ఉండగా త్వరగా నడవండి అనే అర్థంలో 'సర్ప, సర్ప' అని అదలించాడు. అగస్త్యుడు ఆగ్రహించి సర్పం కమ్మని నహుషుని శపించాడు. వెంటనే అతడు సర్పమయ్యాడు. అతడు వేసిన ప్రశ్నలకు ఎవరైనా సమాధానం చెప్పగలిగితే సర్పరూపం పోతుందని చెపుతాడు అగస్త్యుడు. సర్పరూపంలోని నహుషుడు తనకు దొరికిన వాళ్లందరినీ ప్రశ్నలు వేస్తుంటాడు. పాండవులు అరణ్యవాసం చేసే సందర్భంలో ధర్మరాజు అక్కడికి వచ్చి నహుషుని ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పగా నహుషుడు శాపవిముక్తుడై పుణ్యలోకాలకు వెళతాడు.

**భరతుడు :** భరతుడనే పేరుగల వాళ్లు ఇద్దరున్నారు. కైకేయీ దశరథుల కొడుకైన భరతుడు ఒకరు. మరొకరు శకుంతలా దుష్యంతుల కొడుకు. ఈ భరతుడు మనదేశాన్ని పాలించడం వల్లనే భారతదేశమని పేరు వచ్చిందని కొందరు అంటారు.

**అర్జునుడు :** నరనారాయణ మునులలోని నరుడే అర్జునుడు. ఇతడు కుంతికి ఇంద్రుడి వరం వల్ల జన్మించాడు.

**మాంధాత :** కృతయుగ మహీపతులకు తలమానికంగా ప్రసిద్ధిపొందిన సూర్యవంశ ప్రభు వితడు. ఈ వంశంలో దశరథుని పూర్వులలో మాంధాత ఇరవై అయిదవ తరంవాడు. ఇతడు యువనాశ్వుని కొడుకు. గయుడు, అంబరీషుడు మొదలైన షోడశ మహారాజులలో మాంధాత ఒకడు. ఇతడు కారణాంతరాల వల్ల తల్లిగర్భం నుండికాక తండ్రి కడుపు చీల్చుకొని పుట్టాడు.

**సగరుడు :** అయోధ్యను పాలించిన సూర్యవంశపురాజు. ఇతడు పుట్టకముందే తండ్రి మరణించాడు. తల్లి గర్భవతి. సహగమనం చేయబోగా చ్యవనమహర్షి ఆమెను తన ఆశ్రమానికి తీసుకొని వెళతాడు. అంతకుముందే ఆమె గర్భవతి కావడం సహించలేక సవతులు ఆమెకు గరళం (విషం) పెట్టారు. గర్భంలో గరళమున్నా ఎటువంటి బాధ లేకుండా ఆమె కొడుకును కన్నది. గరసహితుడై (విషంతో) పుట్టడం వల్ల ఆ బిడ్డకు సగరుడని పేరు పెట్టారు. సగరుని భార్య వైదర్భి. వీళ్లకు 60 వేలమంది కొడుకులు కలిగారు. సగరుడు అశ్వమేధయాగంచేసి అశ్వం వెంట తన 60 వేలమంది కొడుకులను పంపాడు. అశ్వం సముద్రతీరంలో సంచరిస్తూ అదృశ్యమైంది. వాళ్లు గుర్రంకోసం సముద్రాన్ని తవ్వి లోపలికి వెళ్లి అక్కడుండిన కపిలమహర్షి కోపానికి బలియై మరణించారు. తరువాత సగరుడు సముద్రాన్ని పుత్రుడుగా భావించి అశ్వాన్ని తెప్పించుకొన్నాడు. అది మొదలు సముద్రం సాగరమైంది. సగరుడు షట్చక్రవర్తులలో ఒకడుగా ప్రసిద్ధికెక్కాడు. హరిశ్చంద్ర, నల, పురుకుత్స, పురూరవ, సగర, కార్తవీర్యార్జునులు షట్చక్రవర్తులు.

**ధుంధుమారుడు :** ఇక్ష్వాకు వంశస్థుడు. అసలుపేరు కువలయాశ్వుడు. ధుంధుడు అనే రాక్షసుని చంపడంచేత ఇతనికి ఈ పేరు వచ్చింది.

**రఘువు :** ఇతడు దిలీపుని కుమారుడు. తల్లి సుదక్షిణాదేవి. సూర్యవంశానికి చెందినవాడు. రఘువు యజ్ఞం నిర్వహించి తన దగ్గర ఉన్న ధనమంతా ఖర్చుపెట్టాడు. ధనం లేని సమయంలో వరతంతుముని శిష్యుడైన కౌత్సుడు రఘువు ఆస్థానానికి వచ్చాడు. తన దగ్గర ఏమీ లేకపోవడం వల్ల అతనికి మట్టి పాత్రతోనే పాద్యం ఇచ్చాడు. కౌత్సుడు గురువుకు ఇవ్వవలసిన దక్షిణను రఘువు వద్ద పొందాలని వచ్చాడు. రఘువు పరిస్థితి చూచి వెళ్లబోగా రఘువు వారించి కుబేరుని నుండి ధనం పొంది కౌత్సునికి ఇచ్చిపంపాడు. రఘువు కుమారుడు అజుడు. ఈ విషయాలు కాళిదాసు రచించిన రఘువంశం కావ్యం లోనివి.

**తృణబిందుడు :** వేదవంతుని కుమారుడైన బంధుని పుత్రుడు. అలంబుస అనే దేవకామిని ఇతనిని మోహిస్తుంది. వీళ్లిద్దరికి ఇలబిల అనే కూతురు పుట్టింది. ఈ ఇలబిలకు విశ్రవసుడికి కుబేరుడు పుట్టాడు.

**పురూరవుడు :** చంద్రవంశపు రాజు. ఇలా బుధుల కుమారుడు. ఇతని భార్య కౌసల్య. పురూరవుడు ఊర్వశిని చూచి మోహించి ఆమెయందు శ్రుతాయువు, సత్యాయువు అనే కొడుకులను పొందాడు.

**శంతనుడు :** ఇతడు ప్రతీపుని కొడుకు. గంగాతీరంలో సంచరిస్తుండగా గంగ స్త్రీ రూపంలో కనిపించింది. శంతనుడు ఆమెను కోరుకొన్నాడు. తాను చేసిన పనులను అంగీకరిస్తూ అడ్డు చెప్పకుండా ఉంటే శంతనుడికి భార్యనవుతా నన్నది. అందుకు శంతనుడు అంగీకరించాడు. వారు భార్యాభర్తలైనారు. గంగ గర్భవతి అయింది. బిడ్డ పుట్టగానే నదిలో పడవేసేది. ఆ విధంగా ఏడుగురు బిడ్డలను నదిలో వదిలేసింది. ఎనిమిదవ బిడ్డ జన్మించగా శంతనుడు నదిలో వేయనీయలేదు. తనమాటకు అడ్డు చెప్పినందుకు గంగ శంతనుని విడిచి వెళ్లిపోయింది. వెళ్లిపోయే ముందు తన ఎనిమిదవ బిడ్డ భీష్ముని  శంతనునికి అప్పగించి పోయింది.

**గయుడు :** ఒక గంధర్వుడు. ఆకాశంలో సంచరిస్తూ తన తాంబూలాన్ని ఉమియగా, అది సూర్యుడికి అర్ఘ్యమిస్తున్న శ్రీకృష్ణుడి దోసిలిలో పడింది. దానికి కారణమైన వాడిని చంపుతానని ప్రతిన చేశాడు కృష్ణుడు. గయుడు అది తెలిసి అర్జునుని శరణువేడాడు. అర్జునుడు గయుడికి అభయమిచ్చాడు. గయుని విషయంగా కృష్ణార్జునులకు యుద్ధం జరిగింది. ఈశ్వరుడు ప్రత్యక్షమై వాళ్లిద్దరిని శాంతపరచాడు. గయుడు రక్షింపబడినాడని ఒక కథ.

**కువలయాశ్వుడు :** శత్రుజిత్తు కొడుకైన ఇతడి అసలుపేరు ఋతధ్వజుడు. గాలవ మునికి కువలయాశ్వాన్ని ఇచ్చినందువల్ల ఇతనికి ఆ పేరు వచ్చింది. ఇతని భార్య మదాలస. విక్రాంతుడు, సుబాహువు, శత్రుమర్దనుడు, అలర్కుడు ఇతని కొడుకులు.

**కకుత్థ్సుడు :** కకుత్ అంటే ఎద్దు మూపురం. ఇంద్రుడు వృషభం కాగా ఇనవంశుజుడైన ఈ రాజు ఆ ఎద్దు మూపురం మీద కూర్చొని రాక్షసులను ఓడించాడు. అందువల్ల ఇతనికి ఆ పేరు వచ్చింది. ఇతని పేరు మీద కకుత్థ్స వంశం ప్రసిద్ధమైంది.

**నిషధుడు :** మాహిష్మతీ పురాధీశుడు. ఇతడు అగ్నిని ప్రార్థించి తన నగరానికి శత్రువులు వస్తే వాళ్లపై నిప్పుల వర్షం కురిసేటట్లు వరం పొందాడు.

**వృత్రుడు :** త్వష్ట సృజించిన విశ్వరూపుని ఇంద్రుడు చంపడం చేత ఇంద్రుని చంపడానికి త్వష్ట వృత్రుని సృజించాడు. వృత్రుడు బ్రహ్మను ప్రార్థించి రాత్రిగాని, పగలుగాని, సజీవ నిర్జీవాల చేతగాని, స్థలంలోగాని, జలంలోగాని తనకు మరణం లేకుండా వరం పొందాడు. శివజ్వరం సోకిన వృత్రుని ఇంద్రుడు వజ్రాయుధం ప్రయోగించి చంపాడు.

**శంబరుడు :** కృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నునిచే తనకు చావు వస్తుందని ఆకాశవాణి మాట విని శంబరుడు ప్రద్యుమ్నుని పురిటిలో ఎనిమిదవ నాడే ఎత్తుకొని పోయి సముద్రంలో పడవేశాడు. ఆ శిశువును ఒక చేప మింగింది. ఆ చేపను ఒక

జాలరివాడు పట్టుకొని తన శంబరునికి ఇచ్చాడు. వంటకై దానిని తరిగినపుడు ప్రద్యుమ్నుడు బయటపడినాడు. శంబరుడు ప్రద్యుమ్నునితో యుద్ధం చేసి మరణించాడు.

**భౌముడు :** భూమి కొడుకు. నరకాసురుడు. శ్రీకృష్ణునిచే సంహరింపబడినాడు.

**హిరణ్యాక్షుడు :** ఒక రాక్షసుడు. భూమిని చాపచుట్టగా జేసి బాధిస్తూ ఉండగా విష్ణువు వరాహరూపంలో వెళ్లి వాడిని సంహరించాడు. భూదేవిని తనకోరలపై పెట్టుకొని రక్షించాడు.

**తారకుడు :** ఒక రాక్షసుడు. ఇతడు బ్రహ్మను గురించి తపస్సు చేసి తనకంటె బలవంతులు లేకుండా వరం పొందాడు. ఆ వరగర్వంతో తారకుడు దేవతలను బాధించడం మొదలుపెట్టాడు. దేవతలు బ్రహ్మతో మొరపెట్టుకోగా బ్రహ్మ శివపార్వతులకు కలిగే కుమారస్వామిచేత వాడు హతుడవుతాడని చెప్పాడు. దేవతలు మన్మథుని సాయంతో పార్వతీ పరమేశ్వరులకు సంయోగం కలిగించారు. కుమారస్వామి జన్మించి తారకాసురుని సంహరించాడు.

రాజులైనా, రాక్షసులైనా మమతానుబంధాలకు చిక్కి కాలవశాన నశిస్తారు. ఎవరూ శాశ్వతం కాదు. ఇదంతా మిథ్య. అందుకే అన్నీ వదలి సర్వేశ్వరుని నామామృతాస్వాదంలో తేలికగా హరిపదాన్ని పొందవచ్చునని వ్యాసహృదయం. పోతన దీనిని సంపూర్ణంగా అనుభవించి మనకందించాడు.

**తే. ఉత్తమశ్లోకుఁడన నెవ్వఁడున్నవాఁడు!, సన్నుతుండగు నెవ్వఁడు సకల దిశల**
**నట్టి పరమేశ్వరునిఁజిత్తమందు నిలిపి, తద్గుణంబులు వర్ణింపు ధరణినాథ! 19**

**ప్రతి :** ధరణినాథ= రాజా!; ఉత్తమ శ్లోకుఁడు= గొప్ప కీర్తి గలవాడు; అనన్+ఎవ్వఁడు+ఉన్నవాఁడు= అని పేర్కొనబడిన వాడు ఎవడైతే ఉంటాడో; సకల దిశలన్= అన్ని దిక్కులలో; ఎవ్వఁడు; సత్+నుతుండు+అగు= సజ్జనులచే పొగడబడిన వాడో; అట్టి= అటువంటి; పరమ+ఈశ్వరునిన్= భగవంతుని; చిత్తము+అందున్= మనస్సులో; నిలిపి; తద్+గుణంబులు= ఆ పరమేశ్వరుని గుణాలను; వర్ణింపు (ము)= వర్ణిస్తూ ఉండు.

**తా :** రాజా! గొప్పవారిచే కీర్తింపబడిన వాడూ, దిక్కులన్నిటా సజ్జనులచే పొగడబడిన వాడూ అయిన పరమేశ్వరుని మనస్సులో నిలుపుకొని, ఆయన గుణాలను వర్ణిస్తూ ఉండు.

## a =యుగధర్మప్రాకృతాది ప్రళయచతుష్టయ వివేచనము a

**వ. అనిన శుకయోగీంద్రునకు రాజేంద్రుం డిట్లనియెఁ; 'గలియుగం బతిపాప సమ్మిళితంబు; గాన దురితంబు లే లాగున నరులొందకుండెదరు? కాలం బే క్రమంబున నడచుఁ? గాల స్వరూపకుండైన హరిప్రభావం బేలాగునం గానఁబడు' నీ జగజ్జాలం బెవ్విధంబున నిలుచు?' నని యడిగిన రాజునకు శుకయోగీంద్రుం డిట్లనియెఁ; 'గృతత్రేతాద్వాపర కలియుగంబులను యుగ చతుష్టయంబును గ్రమముగాఁ బ్రవర్తించు. ధర్మంబునకు సత్య దయా తపో దానంబులు నాలుగు పాదంబులై నడచు; శాంతి దాంతి వర్ణాశ్రమాచారంబులు మొదలైనవి గలిగి ధర్మంబు మొదటి యుగంబున నాలుగు పాదంబులం బరిపూర్ణంబై ప్రవర్తిల్లు; శాంతి దాంతికర్మాచరణాది రూపం బగు ధర్మంబు మూఁడు పాదంబుల రెండవ యుగంబునం బ్రవర్తిల్లు; విప్రార్చనాహింసా వ్రతజపానుష్ఠానాది లక్షణంబులు గలిగి ధర్మంబు రెండు పాదంబుల మూఁ**

**డవ యుగంబునం దేజరిల్లు; మఱియు జనులు గలియుగంబున ధర్మరహితులును; అన్యాయకారులును, క్రోధమాత్సర్య లోభమోహాది దుర్గుణ విశిష్టులును, వర్ణాశ్రమాచారరహితులును, దురాచారులును, దురన్నభక్షకులును, శూద్రసేవారతులును, నిర్దయులును, నిష్కారణవైరులును, దయా సత్య శౌచాది విహీనులును, నసృతవాదులును, మాయోపాయులును, ధనవిహీనులును, దోషైకదృక్కులు నై పాపచరితులగు రాజుల సేవించి, జననీజనక సుతసోదర బంధు దాయాద సుహృజ్జనులం బరిత్యజించి, సురతాపేక్షులై కులంబులం జెఱుచుచుండెదరు; మఱియు క్షామ డామరంబులం బ్రజాక్షయంబగు; బ్రాహ్మణులు దుష్ప్రతిగ్రహవిహారులై యజ్ఞాదికర్మంబులు పరార్థపరులై చేయుచు హీనులై నశించెదరు; అట్లుగాన యీ కలియుగంబున నొక్క ముహూర్తమాత్రం బయిన నారాయణస్మరణ పరాయణులై మనంబున శ్రీనృసింహ వాసుదేవ సంకర్షణాది నామంబుల నచంచలభక్తిం దలంచెడు వారలకుఁగ్రతుశత ఫలంబు గలుగు; అట్లు గావున రాజశేఖరా! నీ మది ననవరతంబు హరిం దలంపుము; కలి యనేకదురితాలయంబు గాన, యొక్క నిమిషమాత్రంబు ధ్యానంబు సేసినం బరమ పావనత్వంబు నొంది కృతార్థుండ వగుదు' వని పలికి మఱియును.**

**20**

**ప్రతి :** అనిన శుకయోగి+ఇంద్రునకున్= అలా అనిన శుకయోగీశ్వరుడికి; రాజ+ఇంద్రుండు= రాజశ్రేష్ఠుడైన పరీక్షిత్తు; ఇట్లు+అనియెన్; కలియుగంబు; అతిపాప సమ్మిళితంబు= మహాపాపాలతో కూడినది; కాన= కావున; దురితంబులు= పాపాలు; ఏలాగునన్= ఏవిధంగా; నరులు= మానవులు; వొందకుండెదరు= పొందకుండ ఉంటారు; కాలంబు; ఏ క్రమంబునన్= ఏ విధంగా; నడచున్= నడుస్తుంది? కాల స్వరూపకుండు+ఐన= కాలస్వరూపుడైన; హరి; ప్రభావంబు= మహిమ; ఏలాగునన్= ఏ విధంగా; కానన్+పడున్= కనిపిస్తుంది (తెలుస్తుంది); ఈ జగత్+జాలంబు= ఈ జగత్తుల సమూహం (ఈ లోకాలన్నీ); ఏ+విధంబునన్= ఏ విధంగా; నిలుచున్= నిలుస్తాయి? అని; అడిగిన; రాజునకున్; శుకయోగి+ఇంద్రుడు; ఇట్లు+అనియెన్; కృత= కృతయుగం; త్రేతా= త్రేతాయుగం; ద్వాపర= ద్వాపరయుగం; కలియుగంబులు+అను= కలియుగాలు అను; యుగచతుష్టయంబును= నాలుగు యుగాలూ; క్రమంబు+కాన్= వరుసగా; ప్రవర్తించున్= ప్రవర్తిస్తాయి; ధర్మంబునకున్= ధర్మానికి; సత్య= సత్యం; దయా= దయ; తపస్+దానంబులు= తపస్సు, దానం; నాలుగు పాదంబులు+ఐ= నాలుగు పాదాలుగా; నడచున్= నడుస్తాయి; శాంతి; దాంతి= నిగ్రహం; వర్ణ+ఆశ్రమ+ఆచారంబులు= చతుర్వర్ణాలకు సంబంధించిన, చతురాశ్రమాలకు సంబంధించిన ఆచారాలు; మొదలగునవి; కలిగి; ధర్మంబు= ధర్మం; మొదటి యుగంబునన్= మొదటిదైన కృతయుగంలో; నాలుగు పాదంబులన్= నాలుగు పాదాలతో; పరిపూర్ణంబు+ఐ= సంపూర్ణత్వం పొంది; ప్రవర్తిల్లున్= నడుస్తుంది; శాంతి; దాంతి; కర్మ+ఆచరణ+ఆది= కర్మను ఆచరించడం మొదలైన; రూపంబు+అగు= రూపంతో; ధర్మంబు; మూఁడు పాదంబులన్= మూడు పాదాలతో; రెండవ యుగంబునన్= రెండవ యుగమైన త్రేతాయుగంలో; ప్రవర్తిల్లున్= నడుస్తుంది; విప్ర+అర్చనా+అహింసావ్రత= బ్రాహ్మణపూజ, అహింసావ్రతం; జప+అనుష్ఠాన+ఆది= జపం, అనుష్ఠానం మొదలైన; లక్షణంబులు+కలిగి= లక్షణాలు కలిగి; ధర్మంబు; రెండు పాదంబులన్= రెండు పాదాలతో; మూఁడవ యుగంబునన్= మూడవ యుగమైన ద్వాపరయుగంలో; తేజరిల్లున్= ప్రకాశిస్తుంది; మఱియున్; జనులు; కలియుగంబునన్= కలియుగంలో; ధర్మరహితులున్= ధర్మం లేనివారు; అన్యాయకారులున్= అన్యాయం చేసేవాళ్లు; క్రోధ= క్రోధం; మాత్సర్య= మాత్సర్యం; లోభ= లోభం; మోహ+ఆది=

మోహం మొదలైన; దుర్గుణ విశిష్టులును= దుర్గుణాలతో కూడిన వాళ్లు; వర్ణ+ఆశ్రమ+ఆచార రహితులును= వర్ణాశ్రమ ధర్మాలను పాటించని వాళ్లు; దురాచారులున్= చెడునడత కలవాళ్లు; దుర్+అన్న భక్షకులున్= దుష్టమైన అన్నం తినేవాళ్లు; శూద్ర సేవారతులున్= శూద్రులను సేవించడానికి ఇష్టపడేవాళ్లు; నిర్దయులున్= దయాహీనులు; నిష్కారుణవైరులున్= కారణం లేకుండా శత్రువులైన వాళ్లు; దయా సత్య శౌచ+ఆది= దయ, సత్యం, శుచిత్వం మొదలైనవి; విహీనులున్= లేనివాళ్లు; అనృతవాదులున్= అసత్యం పలికే వాళ్లు; మాయా+ఉపాయులున్= కపటోపాయం గలవాళ్లు; ధనవిహీనులున్= ధనం లేనివాళ్లు; దోష+ఏక దృక్కులున్+ఐ= గుణం చూడకుండా దోషాన్ని మాత్రమే చూచేవాళ్లు అయి; పాపచరితులు+అగు= పాపపు నడతగల; రాజులన్= రాజులను; సేవించి= కొలిచి; జననీజనక= తల్లిదండ్రులు; సుత= పుత్రులు; సోదర= సోదరులు; బంధు= చుట్టాలు; దాయాద= జ్ఞాతులు; సుహృత్+జనులన్= మిత్రజనాన్ని; పరిత్యజించి= విడిచి; సురత+అపేక్షులు+ఐ= కామక్రీడయందు కోరిక గలవాళ్లై; కులంబులన్= కులాలను; చెఱచుచున్+ఉండెదరు= పాడుచేస్తూ ఉంటారు; మఱియున్; క్షామ= కరువువల్ల; డామరంబులన్= ఉపద్రవాలవల్ల; ప్రజాక్షయంబు+అగున్= జననష్టం కలుగుతుంది; బ్రాహ్మణులు, దుష్+ప్రతిగ్రహ విహారులు+ఐ= స్వీకరించడానికి అయోగ్యమైన వాటిని స్వీకరించడం, విహరించడానికి అనర్హమైన వాటిలో విహరించడం చేసే వారై; యజ్ఞ+ఆది కర్మంబులు= యజ్ఞాలు మొదలైన కర్మలు; పర+అర్థపరులు+ఐ= ఇతరుల ధనం మీద ఆశ కలవారై; చేయుచున్= చేస్తూ; హీనులు+ఐ= నీచులై; నశించెదరు= నశిస్తారు; అట్లు+కానన్= అందుచేత; ఈ కలియుగంబునన్= ఈ కలియుగంలో; ఒక్క; ముహూర్తమాత్రంబు+అయినన్= క్షణకాలం పాటైనా; నారాయణ స్మరణ పరాయణులు+ఐ= విష్ణుభక్తి పరాయణులై; మనంబునన్= మనస్సులో; శ్రీనృసింహ; వాసుదేవ; సంకర్షణ+ఆది= సంకర్షణ మొదలైన; నామంబులన్= నామాలతో (పేర్లతో); అచంచల భక్తిన్= సుస్థిరమైన భక్తితో; తలంచువారలకున్= స్మరించేవాళ్లకు; క్రతుశత= నూరు యజ్ఞాల; ఫలంబు; కలుగున్= కలుగుతుంది; అట్లు+కావునన్= అందుచేత; రాజశేఖరా= రాజ చూడామణీ; నీ మదిన్= నీ మనస్సులో; అనవరతంబు= నిరంతరం; హరిన్+తలంపుము= హరిని స్మరించు; కలి; అనేక; దురిత+ఆలయంబు= పాపాలకు నిలయం; కాన; ఒక్క; నిమిషమాత్రంబు= నిమిషం మాత్రం; ధ్యానంబు+చేసినన్= ధ్యానం చేస్తే; పరమ పావనత్వంబున్+ఒంది= మిక్కిలి పావనత్వం కలిగి; కృత+అర్థుండవు+అగుదువు= కృతార్థుడవవుతావు; అని పలికి= అని చెప్పి; మఱియును= ఇంకా....

**తా :** అలా చెప్పిన యోగిశ్రేష్ఠుడైన శుకమహర్షిని పరీక్షిత్తు ఇలా ప్రశ్నించాడు. "కలియుగం మహాపాతకాలతో కూడినది. కాబట్టి ప్రజలు తమకు పాపాలు ఎలా పొందకుండా ఉంటారు? కాలం ఏ విధంగా నడుస్తుంది? కాలస్వరూపుడైన హరి ప్రభావం ఎలా తెలుస్తుంది?" అని రాజు ప్రశ్నించగా శుకమహర్షి ఇలా చెప్పాడు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని నాలుగు యుగాలు క్రమంగా ప్రవర్తిస్తాయి. ధర్మానికి సత్యం, దయ, తపస్సు, దానం అనేవి నాలుగు పాదాలు. మొదటిదైన కృతయుగంలో శాంతి, దాంతి, వర్ణాశ్రమాచారాలు మొదలైన వాటిని కలిగి ధర్మం నాలుగు పాదాలతో సంపూర్ణత్వం పొంది నడుస్తుంది. రెండవ యుగమైన త్రేతాయుగంలో శాంతి, దాంతి, కర్మాచరణం అనేవాటితో ధర్మం మూడు పాదాలతో నడుస్తుంది. మూడవ యుగమైన ద్వాపరయుగంలో బ్రాహ్మణపూజ, అహింసావ్రతం, జపం, అనుష్ఠానం మొదలైన లక్షణాలు కలిగి ధర్మం రెండు పాదాలతో నడిచి ప్రకాశిస్తుంది.

నాలుగవయుగం కలియుగం. ఈ యుగంలో జనులు అధర్మపరులుగా, అన్యాయపరులుగా; క్రోధం, మాత్సర్యం, మోహం, లోభం మొదలైన దుర్గుణాలతో కూడుకొన్న వాళ్లుగా ఉంటారు. వర్ణాచారాలను, ఆశ్రమాచారాలను వదలిపెట్టేస్తారు. దురాచారాలు అవలంబిస్తారు. తినకూడని అన్నం తింటారు. శూద్రులను సేవించడంలో ఇష్టం కలిగి

ఉంటారు. దయలేనివాళ్లై, నిష్కారణంగా శత్రుత్వం వహించిన వాళ్లవుతారు. దయ, సత్యం, శౌచం మొదలైన గుణాలు లేనివాళ్లై, అబద్ధాలాడుతూ, కపటోపాయాలు పన్నుతూ, ధనం లేనివాళ్లై, దోషం మాత్రమే గ్రహించే వాళ్లై, పాపపరులైన రాజులను సేవిస్తూ ఉంటారు. తండ్రులను, కొడుకులను, సోదరులను, చుట్టాలను, దాయాదులను, స్నేహితులను విడిచిపెట్టి, కేవలం కామకర్మలయందే అపేక్ష గలిగి కులపవిత్రతను నాశనం చేస్తారు. అంతేగాక కరవు, ఉపద్రవాలు వచ్చి ప్రజలు నశిస్తారు. బ్రాహ్మణులు అయోగ్య దానాలను గ్రహిస్తూ, ఇతరుల ధనం మీద ఆసక్తి కలిగి యజ్ఞయాగాది కర్మలు చేస్తూ నీచులు కావడం వల్ల నశిస్తారు.

కావున, ఈ కలియుగంలో ఒక క్షణమైనా విష్ణుభక్తి పరులై 'శ్రీనృసింహా! వాసుదేవా! సంకర్షణా! మొదలైన శ్రీహరి నామాలను సుస్థిరమైన భక్తితో స్మరించే వాళ్లకు వంద యజ్ఞాలు చేస్తే వచ్చినంత ఫలం లభిస్తుంది. అందుచేత ఓ రాజ చూడామణీ! నువ్వు నిరంతరం విష్ణువును స్మరించు. కలియుగం అనేక పాపాలకు నిలయం. కాబట్టి ఒక నిమిష మాత్రం విష్ణువును స్మరించినా పరమ పవిత్రతను పొంది కృతార్థుడ వవుతావు' అని చెప్పి ఇంకా

**క. మూఁడవయుగమున నెంతయు, వేడుక హరికీర్తనంబు వెలయఁగ ధృతిచేఁ**
**బాడుచుఁ 'గృష్ణా;' యనుచుం, గ్రీడింతురు కలిని దలఁచి కృతమతు లగుచున్. 21**

**ప్రతి :** మూఁడవయుగమునన్= ద్వాపరయుగంలో; ఎంతయున్= ఎంతో; వేడుకన్= వేడుకతో (సంతోషంతో); హరికీర్తనంబు= విష్ణుగానం; వెలయఁగన్= ఒప్పేవిధంగా; ధృతిచేన్= స్థైర్యంతో; పాడుచున్= పాడుతూ; కృష్ణా అనుచున్= కృష్ణా అనుకొంటూ; కలిని; తలఁచి; కృతమతులు+అగుచున్= బుద్ధిగలవారవుతూ; క్రీడింతురు= ఆడతారు.

**తా :** మూడవది అయిన ద్వాపరయుగంలో ఎంతో వేడ్కతో హరిని గురించి పాడుతూ కృష్ణా అనుకొంటూ బుద్ధిమంతులై కలిని తలచి భగవంతుని యందు క్రీడిస్తారు.

**వ. అంత 'గల్పప్రళయప్రకారం బె' ట్లనిన నతం డిట్లనియెఁ; 'జతుర్యుగ సహస్రంబులు సనిన నది బ్రహ్మకు నొక్క పగ లగును; అదే క్రమంబున రాత్రియు వర్తిల్లును; నంత బ్రహ్మకు నొక్కదినం బగుటవలన నది నైమిత్తికప్రళయం బనంబడును; నందు విధాత సమస్త లోకంబులం దన యాత్మయందు నిలిపి శయనింపం బ్రకృతి వినష్టంబయిన నది ప్రాకృతప్రళయం బని చెప్పంబడును; ఆ ప్రళయ ప్రకారంబు వినుము; ఇట్లు పవలు నైమిత్తిక ప్రళయంబును, రాత్రి ప్రాకృత ప్రళయంబును అగుట గలిగిన నజునకు నది దినప్రమాణంబు; అట్టి దిన ప్రమాణంబున మున్నూట యఱువది దినంబు లయిన నలువకు నొక్క సంవత్సరంబు పరిపూర్ణంబగును; తద్వత్సరంబులు శతపరిమితంబు లయిన. 22**

**ప్రతి :** అంత= అప్పుడు; కల్ప ప్రళయ ప్రకారంబు= కల్పాంతంలో వచ్చే ప్రళయ విధం; ఎట్లు+అనినన్= ఎలా ఉంటుందో చెప్పుమనగా; అతండు= శుకుండు; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు; చతుర్యుగ సహస్రంబులు= వెయ్యి యుగ చతుష్టయాలు; చనినన్= గడవగా; అది= ఆ కాలం; బ్రహ్మకున్= సృష్టికర్తయైన బ్రహ్మకు; ఒక్క పగలు+అగున్= ఒక పగలు అవుతుంది; అదే క్రమంబునన్= అదే విధంగా; రాత్రియున్= రాత్రికూడా; వర్తిల్లున్= జరుగుతుంది; అంతన్; బ్రహ్మకున్; ఒక్క దినంబు+అగుటవలనన్= ఒకరోజు కావడంచేత; అది; నైమిత్తిక= నిమిత్తంగా వచ్చే; ప్రళయంబు+అనన్+ పడున్= ప్రళయమని పిలువబడుతుంది; అందున్= నైమిత్తిక ప్రళయకాలంలో; విధాత= బ్రహ్మ; సమస్త లోకంబులన్=

లోకాలన్నిటిని; తన; ఆత్మ+అందున్= ఆత్మలో; నిలిపి= ఉంచి; శయనింపన్= నిద్రించగా; ప్రకృతి; వినష్టంబు+అయినన్= నశించగా; అది; ప్రాకృత; ప్రళయంబు+అని; చెప్పన్+పడున్= చెప్పబడుతుంది; ఆ ప్రళయ ప్రకారంబు; వినుము; ఇట్లు; పవలు= పగలు; నైమిత్తిక ప్రళయంబును= నిమిత్తంగా వచ్చే ప్రళయం; రాత్రి= ప్రాకృత ప్రళయంబున్= ప్రాకృత ప్రళయం; అగుటన్= కావడంచే; కలిగిన= కలిగితే; అజునకున్= బ్రహ్మకు; అది; దిన ప్రమాణంబు= ఒకరోజు అవుతుంది; ఇట్టి; దిన ప్రమాణంబునన్= దిన ప్రమాణంతో; మున్నూట+అరువది= మూడువందలా అరవై; దినంబులు+అయినన్= రోజులు అయితే; నలువకున్= బ్రహ్మకు; ఒక్క సంవత్సరంబు= ఒక సంవత్సరం; పరిపూర్ణంబు+అగున్= పూర్తి అవుతుంది; తద్+వత్సరంబులు= ఆ సంవత్సరాలు; శత పరిమితంబులు+అయినన్= వంద అయితే....

**తా :** పరీక్షిత్తు కల్పాంతంలో వచ్చే ప్రళయం ఏ విధంగా జరుగుతుందని అడిగాడు. దానికి శుకుడు ఇలా చెప్పాడు. యుగచతుష్టయాలు ఒక వెయ్యి గడిస్తే బ్రహ్మకు ఒక పగలు అవుతుంది. అట్లే రాత్రికూడా అంత ప్రమాణం కలిగి ఉంటుంది. ఇటువంటి రాత్రింబవళ్లు కలిస్తే బ్రహ్మకు ఒక రోజు అవుతుంది. బ్రహ్మకు అయ్యే ఆ ఒక్కరోజు నైమిత్తిక ప్రళయంగా పిలవబడుతుంది. ఆ సమయంలో బ్రహ్మ లోకాలన్నింటిని తన ఆత్మలో చేర్చుకొని నిద్రిస్తాడు. అప్పుడు ప్రకృతి నశిస్తుంది. అది ప్రాకృత ప్రళయం అనబడుతుంది. ఆ ప్రళయ విషయం విను. పగటి పూట నైమిత్తిక ప్రళయం, రాత్రిపూట ప్రాకృత ప్రళయం అయితే అది బ్రహ్మకు ఒకరోజు అవుతుంది. ఇటువంటి రోజులు మూడు వందల అరవై అయితే బ్రహ్మకు ఒక సంవత్సరం పూర్తి అవుతుంది. అటువంటి సంవత్సరాలు నూరయితే

**సీ. అంత లోకేశున కవసానకాలంబు, వచ్చిన నూఱేండ్లు వసుధలోన**
**వర్షంబు లుడిగిన వడిఁదప్పి మానవుల్ దప్పి నాఁకటఁజిక్కి నొప్పి నొంది**
**యన్యోన్యభక్షులై యా కాలవశమున నాశ మొందెద; రంత నలినసఖుఁడు**
**సాముద్రదైహికక్ష్మాజాత రసములఁజాతురిఁగిరణాళిచేతఁగాల్ప**

**తే. నంతఁగాలాగ్ని సంకర్షణాఖ్య మగుచు, నఖిలదిక్కులు గలయంగ నాక్రమించు**
**నట్టియెడ నూఱు వర్షంబు లాదుకొనఁగ వీఁకతోడుత వాయువుల్ వీచు నపుడు. 23**

**ప్రతి :** అంతన్; లోక+ఈశునకున్= లోక ప్రభువుకు (బ్రహ్మకు); అవసానకాలంబు= అంతిమసమయం; వచ్చినన్= వస్తే; నూఱు+ఏండ్లు; వంద సంవత్సరాలు; వసుధలోనన్= భూమిలో; వర్షంబులు= వానలు; ఉడిగినన్= ఆగిపోతే; వడిన్+తప్పి= ఉత్సాహం పోయి; మానవుల్= మానవులు; దప్పిన్= దప్పిక చేత; ఆఁకటన్= ఆకలిచేత; చిక్కి; నొప్పిన్+ఒంది= బాధపడి; అన్యోన్యభక్షులు+ఐ= ఒకరినొకరు తింటూ; ఆ కాలవశమునన్= ఆ కాలానికి లొంగిపోయి; నాశము+ఒందెదరు= నశిస్తారు; అంతన్= అప్పుడు; నలినసఖుఁడు= కమలమిత్రుడైన సూర్యుడు; సాముద్ర= సముద్ర సంబంధమైన; దైహిక= దేహసంబంధమైన; క్ష్మాజాత= భూమి నుండి పుట్టిన; రసములన్= నీళ్లను; చాతురిన్= నేర్పుతో; కిరణ+ఆళిచేతన్= కిరణ సముదాయంచేత; కాల్పన్= కాల్చగా (ఎండించగా); అంతన్= అప్పుడు; కాల+అగ్ని= ప్రళయాగ్ని; సంకర్షణ+ఆఖ్యము+ అగుచున్= సంకర్షణ అనే పేరు గలదై; అఖిలదిక్కులున్= అన్ని దిక్కులలో; కలయంగన్= కలిసేవిధంగా; ఆక్రమించున్= ఆక్రమిస్తుంది; అట్టి+ఎడన్= అటువంటి సమయంలో; నూఱు వర్షంబులు= వంద సంవత్సరాలు; ఆదుకొనఁగన్= కమ్ముకొని; వీఁక తోడుతన్= విజృంభణతో; అపుడు; వాయువుల్ వీచున్= గాలులు వీస్తాయి.

**తా :** అంతట బ్రహ్మకు అంతిమసమయం వచ్చినపుడు నూరేండ్లు భూమిలో వానలు కురవవు. దానితో మానవులు ఆకలిదప్పులకు తట్టుకోలేక ఒకరినొకరు తినడం మొదలుపెట్టి కాలవశులై నశిస్తారు. అప్పుడు కమలమిత్రుడైన సూర్యుడు సముద్రాలలోను, శరీరాలలోను, భూమిలోను ఉన్న జలాలను తన కిరణ సముదాయంచేత కాల్చి పీల్చివేస్తాడు. అప్పుడు ప్రళయాగ్ని సంకర్షణం అనే పేరుతో అన్ని దిక్కులలో వ్యాపించి ఆక్రమిస్తుంది. అప్పుడు నూరు సంవత్సరాలపాటు బలమైన గాలి వీస్తుంది.

**వ. ఇట్లు వర్షశతంబు వర్షశూన్యంబగును. అంత శతవర్షంబులు ద్వాదశ భాస్కర ప్రచండ కిరణ తాండవం బగును; పిదప శతవర్షంబులు ప్రళయాగ్నిదందహ్యమానం బగును; పిమ్మట సప్తమారుత ఝంఝానిలవేగతాడితం బగును; అందు మీఁద శతహాయనంబులు నవధారాధరంబులు మహాఘోషంబుల తోడం గరికరోపమానంబు లయిన నీరధారల నిఖిలజగంబును శంబరమయంబు చేసిన బ్రహ్మాండం బెల్ల జలమయం బగుటం చేసి, భూమి హృత గంధ గుణంబై కబంధంబున లీనంబగును; అ న్నీరంబును జీర్ణరస గుణంబై తేజంబున నణంగును; ఆ తేజంబు వాయువందు నష్టరూపంబయి కలయును; ఆ పవనుండు గతస్పర్శగుణుండై నభంబున సంక్రమించును; ఆ యాకాశంబు విగతశబ్దంబయి భూతాది ప్రకృతియందు నణంగును; ఆ ప్రకృతి ననాదియై వాఙ్మానస గోచరంబుగాక సత్త్వరజస్తమోగుణ రహితంబయి, మహదాది సన్నివేశంబు లేక స్వప్నాద్యవస్థా రహితంబై, యప్రతర్క్యంబగు; నాత్మయందు లయంబగు అదియే సర్వాధారాభూతంబయిన పదంబని చెప్పంబడు, కాలవిపర్యయంబయి, పురుషావ్యక్తులు లీనంబగును అది ప్రాకృత ప్రళయం బనం బరఁగు' నని చెప్పి 'మఱియు నొక్క విశేషంబు వినుము; బుద్ధీంద్రియార్థ రూపంబులచే జ్ఞానంబు తదాశ్రయం బయి వెలుంగు; దృశ్యత్వావ్యతిరేకంబులచే నది యాద్యంతంబులు గలదై యుండుఁ; దేజంబునకు దీపచక్షుస్స్వరూపంబులకు వేఱుగానియట్లు బుద్ధీంద్రియార్థంబులు పరార్థమూర్తికి నన్యంబులు గావు; జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు బుద్ధి ధర్మంబులగు; ప్రత్యగాత్మయందు నానాప్రకారంబులం దోఁచు, నీ దృష్యప్రపంచంబంతయు మిథ్యయని తెలియును. ఒక్క తేజంబు బహురంధ్రంబులం గానంబడు తెఱంగున నొక్క యాత్మ పెక్కు దేహంబులఁ దోచంబడు; హాటకంబు పెక్కు రూపంబులు గలదై, యనేకంబయిన తెఱుంగునఁబరమాత్మ వివిధ చేతనా శరీరముల యందుఁ బెక్కువిధంబులన్ గనఁబడిన నేకంబుగా భావింపవలయు; నేత్రంబులకు మేఘావరణంబు దలంగినప్పుడు భాస్కరమండలంబు గనుపించు తెఱంగున బంధహేతు వైన యహంకారం బాత్మ జ్ఞానంబునం దిరస్కృతం బైనయప్పుడే పరమాత్మ నిర్మలంబయి తోఁచు; నా పరమాత్మను నిరంతరంబును దలంచుచు, యోగులు తదేకాయత్తచిత్తులై యుందురు; కాలవేగంబున సర్వప్రపంచంబునకు నవస్థాంతరంబులం గల్పించుచుండు; బరమేశ్వరమూర్తి యైన కాలంబు నభంబునం గలుగు తారకంబులు గానరాని కరణిం గానంబడక, కల్పావస్థలం జరించు; నిత్యనైమిత్తిక ప్రాకృతికాత్యంతికంబులను ప్రళయంబులు చతుర్విధంబులై పరఁగు; అందుఁ గల నారాయణు లీలావతారంబులఁగమలభవ భవాదు లయినను వచింప లేరు; నే నెఱింగి నంతయుం జెప్పితి; సంసారసాగరంబు దాట హరికథ యనెడి నావయె సహాయంబు గాని వేఱొకటి లే' దని చెప్పి.** **24**

**ప్రతి :** ఇట్లు= ఈ విధంగా; వర్షశతంబు= నూరు సంవత్సరాలు; వర్షశూన్యంబు+అగును= వానలుండవు; అంతన్= అంతట; శతవర్షంబులు= నూరేండ్లు; ద్వాదశ= పం(డ్రెండుగురు; భాస్కర= సూర్యుల; ప్రచండ= తీవ్రమైన; కిరణ తాండవంబు+ అగును= కిరణాలతో చిందులు తొక్కునది అవుతుంది; పిదపన్= తరువాత; శతవర్షంబులు= నూరేండ్లు; ప్రళయ+అగ్ని= కాలానలంచే; దందహ్యమానంబు+అగును= మిక్కిలిగా దహించబడుతుంది; పిమ్మటన్= ఆ తరువాత; సప్తమారుత= ఏడు విధాలైన గాలులయొక్క; ఝంఝా+అనిలవేగ= సుడిగాలి వేగంతో; తాడితంబు+అగును= కొట్టబడిన దవుతుంది; అందుమీఁదన్= ఆ పైన; శతహాయనంబులు= నూరేండ్లు; నవ= కొత్తవైన; ధారాధరంబులు= మేఘాలు; మహాఘోషంబుల తోడన్= పెద్ద ధ్వనులతో; కరి కర+ఉపమానంబులు+అయిన= ఏనుగు తొండాలతో ఉపమింప దగినవైన; నీరధారలన్= జలధారలతో; నిఖిలజగంబును= సకలభూమిని; శంబరమయంబు+చేసినన్= జలమయం చేయగా; బ్రహ్మాండంబు+ఎల్లన్= బ్రహ్మాండమంతా; జలమయంబు+అగుటన్+చేసి= జలమయం కావడంచేత; భూమి= నేల; హృత= హరింపబడిన; గంధ గుణంబు+అయి= వాసన అనే గుణం కలదై; కబంధంబునన్= నీటియందు; లీనంబు+అగున్= లీనమై పోతుంది; ఆ+నీరంబు= ఆ నీరు; జీర్ణరసగుణంబు+ఐ= జలగుణం ఎండినదై; తేజంబునన్= కాంతిలో; అడంగున్= అణగిపోతుంది; ఆ తేజంబు= ఆ కాంతి; వాయువు+అందున్= గాలిలో; నష్టరూపంబు+అయి= రూపులేనిదై; కలయున్= కలుస్తుంది; ఆ పవనుండు= ఆ వాయువు; గత= పోయిన; స్పర్శగుణుండు+ఐ= స్పర్శగుణం కలవాడై; నభంబునన్= ఆకాశంలో; సంక్రమించున్= కలుస్తుంది; ఆ+ఆకాశంబు; విగతశబ్దంబు+అయి= శబ్దగుణరహితమై; భూత+ఆది= ఆదిభూతం మొదలైన; ప్రకృతి+అందున్= ప్రకృతిలో; అణంగున్; ఆ ప్రకృతి; అనాదియై= మొదలు లేనిదై; అవాక్+మానస గోచరంబున్+ఐ= వాక్కుకు మనస్సుకు కానరానిదై; సత్త్వ రజస్+తమోగుణ రహితంబు+అయి= సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు లేనిదై; మహత్+ఆది= మహత్తు మొదలైన వాటి; సన్నివేశంబు లేక= కలయిక లేనిదై; స్వప్న+ఆది+అవస్థా రహితంబు+అయి= స్వప్నం మొదలైన అవస్థాత్రయం లేనిదై; అప్రతర్క్యంబు+అగు= ఊహింప శక్యం కానిదైన; ఆత్మయందు= ఆత్మలో; లైయంబగు= కలిసిపోతుంది; అదియే= ఆ స్థితిని; సర్వాధారాభూతంబు+అయిన= అన్నిటికి మూలభూతమైన; పదంబు+అని= స్థానమని; చెప్పంబడు= చెపుతూ ఉంటారు; కాల విపర్యయంబు+అయి= కాలం వ్యత్యస్తమై; పురుష+అవ్యక్తులు= పురుషుడు, అవ్యక్తుడు; లీనంబు+అగును= కలసిపోతుంది; అది; ప్రాకృత ప్రళయంబు+అనన్+పరగు= ప్రాకృత ప్రళయం అనబడుతుంది; అని చెప్పి; మఱియున్; ఒక విశేషంబు; వినుము; బుద్ధి+ఇంద్రియ+ఆదిరూపంబులచేన్= బుద్ధి, ఇంద్రియాలు మొదలయినవాటి రూపాలచే; తత్+ఆశ్రయంబయి= ఆ భగవంతుని ఆశ్రయించి; జ్ఞానంబు, వెలుంగున్= పరమాత్మయే ప్రకాశించుచున్నాడు; దృశ్యత+అవ్యతిరేకంబులచే= కంటికి అభిన్నములై; జ్ఞానము, పరమాత్మ; ఆది+అంతంబులు+కలదై+ఉండు= మొదలు తుదికలదై ఉన్నది; ఇవి అవస్తువులు (మిథ్య); దీపచక్షుస్+స్వరూపంబులకు= దీపం, కన్ను, రూపం ఈ మూడింటికి; తేజంబు= తేజస్సు; వేఱుకాని+అట్లు= వేరుకాని విధంగా (ఆ మూడు తేజస్సు యొక్క రూపాలే); పరార్థమూర్తికి= బ్రహ్మమునకు (పరమాత్మకు); బుద్ధి+ఇంద్రియ+అర్థంబులు= బుద్ధి, ఇంద్రియాలు, వాటి విషయాలు; అన్యంబులు+కావు= పరమాత్మ కంటే వేరుకావు; జాగ్రత్+స్వప్న+సుషుప్తి+అవస్థలు= జాగ్రత్, స్వప్న, సుషుప్తి – అవస్థలు; బుద్ధిధర్మంబులు+అగు= బుద్ధికి చెందిన విషయాలే; ప్రత్యక్+ఆత్మయందు= అంతరాత్మయందు; నానాప్రకారంబున్+తోచున్= పలురకాలుగా కనిపిస్తాయి; ఈ దృశ్యప్రపంచంబు+అంతయున్= కంటికి కనిపించే ఈ ప్రపంచం; మిథ్య అని తెలియుము= మాయ అని తెలుసుకో; బుద్ధియుక్తంబు+ఐన= బుద్ధితోకూడిన; యోగంబునన్= యోగంతో; పరిణమించున్= పరిణామం

చెందుతుంది; ప్రాణిజాతంబు= జీవజాలం; ఈశ్వరు+అందున్= ఈశ్వరునిలో; లయ+ఉదయంబులు= నాశం, పుట్టుక; పొందుచున్+ఉండున్= పొందుతూ ఉంటుంది; సర్వంబున్= అన్నీ; అన్యోన్య+అపాశ్రయంబు+ఐ= పరస్పరం ఆశ్రయం లేనివై; ఆది+అంతవంతంబు+అగుటన్= మొదలు, తుది కలది కావడంచేత; అవస్తువు+ఐ= వస్తువు కానిదై; వర్తించున్= ఉంటాయి; ఒక్క తేజంబు= ఒక కాంతి; బహు రంధ్రంబులన్= పెక్కు రంధ్రాలలో; కానన్+పడు వడువునన్= కనిపించే విధంగా; ఒక్క పరమాత్మ; పెక్కు విధంబులన్= అనేక విధాలుగా; భావింపన్+పడున్= తలంప బడుతుంది; హాటకంబు= బంగారం; పెక్కురూపంబులు= అనేక ఆకారాలు; కలది+ఐనన్= కలిగినదైనా; ఏకంబు+అయిన తెఱంగునన్= ఒక్కటి అయిన విధంగా; పరమాత్మన్= పరమాత్మను; ఏకంబుగా= ఒక్కటిగా; భావింపవలయున్= అనుకోవాలి; నేత్రంబులకు= కనులకు; మేఘ+ఆవరణంబు= మబ్బుతెర; తలంగిన+అప్పుడు= తొలగినప్పుడు; భాస్కరమండలంబు= సూర్యబింబం; కనిపించు కరణిన్= కనపడే విధంగా; బంధహేతువు+ఐన= బంధానికి కారణమైన; అహంకారంబు= అహంకారం; ఆత్మజ్ఞానంబునన్= ఆత్మజ్ఞానంచేత; తిరస్కృతంబు+ఐన+అప్పుడే= తిరస్కరింపబడినప్పుడే; పరమాత్మ; నిర్మలంబు+అయి= స్వచ్ఛమై; తోఁచున్= కనిపిస్తుంది; ఆ పరమాత్మను; నిరంతరంబును= ఎల్లప్పుడూ; తలంచుచున్= స్మరిస్తూ; యోగులు; తదేక+ఆయత్తచిత్తులు+ఐ= ఆ పరమాత్మకే వశమైన మనస్సులు గలవారై; ఉందురు= ఉంటారు; కాలవేగంబునన్= కాలంయొక్క వడిచే; సర్వప్రపంచం బునకున్= ఎల్ల జగతికి; అవస్థ+అంతరంబులు= భిన్న దశలు; కల్గుచున్+ఉండున్= కలుగుతూ ఉంటాయి; పరమ+ ఈశ్వరమూర్తి+ఐన కాలంబునన్= పరమేశ్వర స్వరూపమైన కాలంలో; నభంబునన్= ఆకాశంలో; పగలు+అ= పగలే; తారకంబులు= నక్షత్రాలు; కానరాని కరణిన్= కనిపించని విధంగా; కానంబడక= కనిపించకుండా; కల్ప+అవస్థలు= కల్పాంతారాలు; చరించున్= సంచరిస్తాయి; నిత్యనైమిత్తిక ప్రాకృతిక+ఆత్యంతికంబులు+అని= నిత్య, నైమిత్తిక, ప్రాకృతిక, ఆత్యంతికాలు అని; ప్రళయంబులు; చతుర్విధంబులు+ఐ= నాలుగు రకాలై; పరఁగున్= ఉంటాయి; అందులన్= వాటిలో; కలుగు; నారాయణుని; లీల+అవతారంబులన్= విలాసాలైన అవతారాలను; కమలభవ= బ్రహ్మ; భవ+ఆదులు+అయినన్= శివుడు మొదలైన వారైనా; వచింపన్+ఓపరు= చెప్పలేరు; నేను+ఎఱింగిన్+అంతయున్= నేను నాకు తెలిసినంత వరకు; చెప్పితిన్= చెప్పాను; సంసారసాగరంబున్= సంసారమనే సముద్రాన్ని; దాటన్= దాటడానికి; హరికథ+అనెడు= హరికథ అనే; నావ+అ= నావయే; సహాయంబు+కాని= తోడుకాని; వేఱు+ఒకటి= ఇంకొకటి; లేదు+అని= లేదని; చెప్పి.

**తా :** ఈ విధంగా నూరేండ్లపాటు వానలుండవు. తరువాత నూరేండ్లు పంద్రెండుగురు సూర్యుల తీవ్రమైన కిరణాలు తాండవిస్తాయి. పిదప నూరేండ్లు ప్రళయకాలాగ్నిచేత దగ్ధమవుతుంది. తరువాత ఏడు రకాల గాలులు పెనుగాలి వేగంతో వీస్తాయి. ఆపై నూరేండ్లు నూతనమేఘాలు మహాధ్వనులతో ఏనుగుతొండాలవంటి జలధారలను కురిపించి సకల భూమిని జలమయం చేస్తాయి. బ్రహ్మాండమంతా జలమయం కావడంచేత భూమి తన **గంధగుణాన్ని** పోగొట్టుకొని నీటిలో లీనమైపోతుంది. నీరు తన **రసగుణాన్ని** పోగొట్టుకొని కాంతిలో అణగిపోతుంది. కాంతి అనగా తేజస్సు తన **రూపగుణాన్ని** పోగొట్టుకొని వాయువులో కలుస్తుంది. వాయువు తన **స్పర్శగుణాన్ని** పోగొట్టుకొని ఆకాశంలో చేరుతుంది. ఆకాశం తన **శబ్దగుణాన్ని** పోగొట్టుకొని ఆదిభూతంలో ప్రవేశిస్తుంది. అది తేజోమయమైన మహద్రూపంతో అహంకారం కలదై, వికారగుణాలు కలదై ఇంద్రియాలను లీనం చేసుకొంటుంది. అహంకారం సత్త్వాది గుణాలను మింగుతుంది. అది కాల ప్రేరితమై ప్రకృతిలో అణగుతుంది. ఆ ప్రకృతి అనాదిగా ఉంది. అది శాశ్వతమైనది. దానికి నాశం కాని మార్పు కాని లేదు. మాటలకు గాని, మనస్సుకు గాని గోచరం కాక, సత్త్వరజస్తమస్సులనే గుణత్రయం లేనిదై, మహత్తు మొదలైన వానితో కలయిక లేనిదై, స్వప్నావస్థ మొదలైన అవస్థాత్రయం లేనిదై, పృథివి మొదలైన పంచభూతాలు లేనిదై, తర్కానికి

అందనిదై ఉంటుంది. దానిని మూలభూతమైన పదార్థంగా చెపుతారు. కాలం విపరిణామం చెందినపుడు పురుషుడూ, అవ్యక్తుడూ ఒకరిలో ఒకరు లీనం అవుతారు. ఆ స్థితిని 'ప్రాకృత ప్రళయం' అంటారు.

మరొక విశేషం ఉంది. దాన్నికూడా విను. బుద్ధి, ఇంద్రియాలు, ఇంద్రియార్థాలైన విషయాలు అనే మూడింటినీ ఆశ్రయించుకొని జ్ఞానం ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ జ్ఞానం గోచరం కావడం అనే లక్షణం కలిగి, విరుద్ధం కాకపోవడమనే లక్షణం కలిగి, ఆదినీ అంతాన్ని కలదై ఉంటుంది. కాంతికంటె దీపం, నేత్రం, వస్తురూపం వేరుకావు. అదే విధంగా బుద్ధి, ఇంద్రియ, విషయాలు పదార్థమూర్తి అయిన పరమాత్మకంటె భిన్నమైనవి కావు. ప్రధానమనేది బుద్ధియందు పుడుతుంది. మెలకువగా ఉండడమనే జాగ్రదవస్థ, కలలు కనడం అనే స్వప్నావస్థ, నిద్రపోవడం అనే సుషుప్తి అవస్థ అనే మూడు విధాలైన అవస్థలు ఆత్మమయాలై బుద్ధితో కలసినట్లయితే అదే 'యోగం' అనిపించుకొంటుంది.

జీవజాలం ఈశ్వరుడిలో లయించడం, పుట్టడం పొందుతూ ఉంటుంది. అన్నీ పరస్పరం ఆశ్రయం లేనివై, మొదలూ తుదీ కలవి కావడం చేత వస్తువులు కానివై వర్తిస్తాయి. ఒకే కాంతి అనేక రంధ్రాలలో నుండి అనేక కాంతులుగా గోచరించినట్లు, ఒకే పరమాత్మ అనేక విధాలుగా భావింపబడుతున్నాడు. నగల భేదాన్నిబట్టి అనేక రీతులుగా కనిపించినప్పటికీ బంగారాన్ని ఒకే విధంగా భావించినట్లు పరమాత్మను ఒక్కటిగానే భావించాలి. కళ్లకు అడ్డుగా ఉన్న మబ్బుతెర తొలగితే సూర్యబింబం కనిపించినట్లు బంధకారణమైన అహంకారం ఆత్మజ్ఞానం వల్ల తొలగిపోయినప్పుడే పరమాత్మ స్వచ్ఛంగా కనిపిస్తుంది. ఆ పరమాత్మను యోగులు నిరంతరం స్మరిస్తూ అతనియందే లగ్నమైన మనస్సు కలవారై ఉంటారు. కాలవేగం చేత జగత్తుకంతటికీ భిన్నదశలు కలుగుతూ ఉంటాయి. పరమేశ్వర స్వరూపమైన కాలంలో ఆకాశంలో పగలు నక్షత్రాలు కనిపించని విధంగా, కల్పావస్థలు కనిపించకుండా సంచరిస్తూ ఉంటాయి. **నిత్యప్రళయం, నైమిత్తిక ప్రళయం, ప్రాకృతిక ప్రళయం, ఆత్యంతిక ప్రళయం అని ప్రళయాలు నాలుగు విధాలు.** ఆయా కాలాల్లో సంభవించే శ్రీమన్నారాయణుని లీలలైన అవతారాలను బ్రహ్మ, ఈశ్వరుడు మొదలైన వారైనా చెప్పలేరు (వివరించలేరు). నాకు తెలిసినంతవరకూ చెప్పాను. సంసారమనే సముద్రాన్ని దాటడానికి 'విష్ణుకథ' అనే నావ ఒక్కటే సాధనం. మరొక సాధనం లేదు. అని చెప్పి–

**విశే : ద్వాదశభాస్కరులు :** సూర్యులు పండ్రెండుగురుగా ప్రసిద్ధి ఉంది. ద్వాదశాదిత్యులు అనే మాటా ప్రసిద్ధమే. అదితి సంతానం కనుక ఆదిత్యులు. వరుణుడు, సూర్యుడు, సహస్రాంశుడు, ధాత, తపనుడు, సవితృడు, గభస్తి, రవి, పర్జన్యుడు, త్వష్ట, మిత్రుడు, విష్ణువు – ఈ పండ్రెండుగురు సూర్యులు. మరొక అభిప్రాయం ప్రకారం – ఆర్యముడు, మిత్రుడు, అరుణుడు, అర్కుడు, భగుడు, ఇంద్రుడు, వివస్వంతుడు, పూషుడు, పర్జన్యుడు, త్వష్ట, విష్ణువు, అజఘన్యుడు – పండ్రెండుగురు సూర్యులు. వాల్మీకి రామాయణం యుద్ధకాండలోని 'ఆదిత్యహృదయం' స్తోత్రంలో ఈ పేర్లలో చాలా, ఇవిగాక మరికొన్ని కనిపిస్తాయి.

**అహంకారం :** అహమంటే నేను అని అర్థం. నేను అని భావించడమే అహంకారం. నావి అనే దేహాది ఉపాధులతో కలవకుండా భావించగలిగితే అహంకారం ఆత్మస్వరూపం అవుతుంది.

**మహత్ :** సాంఖ్యుల పంచవింశతి తత్త్వాలలో ఒకటి. అవ్యక్తమైన ప్రధానం నుండి వచ్చినదది. గొప్పది, పవిత్రమైనది అనే సామాన్యార్థాలు కూడా ఉన్నాయి. తనయందు ఆరోపితమైన గుణదోషాలను అంటనివ్వకుండా ఉండేది మహత్తు.

**ఉ. ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబులోపలన్**
**మానుము; సంభవంబు గల మానవకోట్లకుఁజావు నిత్యమౌఁ;**

**గాన హరిం దలంపు; మిఁకఁగల్గదు జన్మము నీకు ధాత్రిపై;**
**మానవనాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్.** **25**

**ప్రతి :** మానవనాథ!= నరపతీ!; ఏను= నేను; మృతుండన్+ఔదున్+అని= చనిపోయెదనని; ఇంత భయంబు= ఇంత భయం; మనంబులోపలన్= మనస్సులో; మానుము= విడువుము; సంభవంబు+కల= జన్మం కల (జన్మించిన); మానవకోట్లకున్= మానవసమూహానికి; చావు= మరణం; నిత్యము+ఔన్= తప్పనిదగును; కాన= కావున; హరిన్+తలంపుము= విష్ణువును స్మరించు; ఇఁకన్= ఇకమీద; నీకు; ధాత్రిపైన్= భూమిమీద; జన్మము= పుట్టుక; కల్గదు= కలుగదు; మాధవలోక= విష్ణులోక (వైకుంఠ); నివాస; సౌఖ్యముల్= సుఖాలు; పొందెదవు= పొందుతావు.

**తా :** రాజా! నేను చనిపోతాననే భయాన్ని పూర్తిగా మనస్సునుండి విడిచిపెట్టు. పుట్టిన మానవుల కందరికీ చావు తప్పదు. కాబట్టి శ్రీహరిని ధ్యానించు. దీనివల్ల నీవు మళ్లీ భూమిపై పుట్టడం జరుగదు. మాధవలోకమైన వైకుంఠంలో నివసించి సుఖించేయోగం పొందుతావు.

**విశే :** నిరంతరం విష్ణునామస్మరణచేస్తే ఒక్క పరీక్షిత్తుకే గాక మానవుల కందరకూ వైకుంఠవాససౌఖ్యం కలుగుతుందని ఈ పద్యం చాటుతున్నది. భాగవతసారమంతా ఈ పద్యంలో ఉంది. అందువల్ల ఈ పద్యం అతి ముఖ్యమైంది. శుకమహర్షి పరీక్షిత్తుకు చెప్పిన భాగవతసారం, ఇచ్చిన సందేశం ఇదే. మూలశ్లోకం కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేస్తున్నది.

**'త్వం తు రాజన్ మరిష్యేతి పశుబుద్ధి మిమాం జహి**
**న జాతః ప్రాగభూతోఽద్య దేహవత్త్వం న నంక్ష్యసి' (12-5-2)**

రాజా! మరణించెదననే బుద్ధిని విడిచిపెట్టు. ఈ బుద్ధి దేహమే ఆత్మ అనే అవివేకం నుండి పుట్టింది. నీవు ఇదివరకు పుట్టలేదు. ఇప్పుడు నశించవు. దేహం పుట్టింది. అదిమాత్రమే నశిస్తుంది. 'నీవు' అంటే ఆత్మ అని అర్థం. ఆత్మ శాశ్వతమైనది. దానికి చావు పుట్టుకలు లేవు. చావు పుట్టుకలు శరీరానికే!

## a =పరీక్షిత్తు తక్షకునిచే దష్టుండై మృతి నొంద నతని పుత్త్రుఁడు సర్పయాగము సేయుట a

**వ. జరామరణహేతుకంబయిన శరీరంబున నుండు జీవుండు ఘటంబులలోఁగనంబడెడు నాకాశంబు ఘటనాశంబయిన మహాకాశంబునం జేరు చందంబున, నీశ్వరుం గలయుఁ, దైలనాశనపర్యంతంబు వర్తి తేజంబుతోడ వెలుంగు కరణి దేహకృతంబగు భవంబు రజస్సత్త్వ తమోగుణంబుల చేతం బ్రవర్తించు; నాత్మ నభంబు మాడ్కి ధ్రువంబై యనంతంబై వ్యక్తావ్యక్తంబులకుఁబరంబై యుండు; నిట్లాత్మ స్వరూపునిగా హరిని నిరతరంబు భావించుచుండుట విశేషంబు; నిన్నుఁదక్షకుండు గఱవ సమర్థుండు గాఁడు; హరిం దలంపుము; ధన గృహ దారాపత్య క్షేత్రపశుప్రకరంబుల వర్జించి, సమస్తంబును నారాయణార్పణంబు సేసి, విగతశోకుండవై నిత్యంబును హరిధ్యానంబు 'సేయుము' అని వినిపించిన రాజేంద్రుండును గుశాసనాసీనుండై జనార్దనుం జింతించుచుండె; నంత శుకుండును యథేచ్ఛా విహారుండయి చనియె; నిటఁగ్రుద్ధుండైన బ్రాహ్మణోత్తమునిచేఁబ్రేరితుండైన తక్షకుండు ద్విజరూపంబుఁదాల్చి, పరీక్షిద్వధార్థంబుగా నేతెంచుచుండి మార్గమధ్యంబునఁగాశ్యపుండును సర్పవిషహరణసమర్థుండగు వేఱొక విప్రునిం గని యతని నపరిమిత ధనప్రదానంబునఁదృప్తుం గావించి, పరీక్షిన్నికటంబునకు రాకుండ న ట్లొనర్చి, యంతటఁ**

**బరీక్షిన్మహారాజు చెంతకుంజని కామరూపుండగుటం జేసి యురగంబై, రాజున్ గరచిన నతండు నా క్షణంబ విషాగ్నిచే భస్మీభూతుం డయ్యె; నట్టి యవసరంబున భూమ్యంతరిక్షంబులనుండు నిఖిలప్రాణు లాశ్చర్యకరంబగు తన్మరణంబు గని హాహారవంబులు సేసిరి అంత నీ యర్థంబు నతని తనయుండైన జనమేజయుండు విని క్రోధావేశంబున సర్పప్రళయం బగు నట్లు యజ్ఞంబు సేయుచుండ సహస్ర సంఖ్యలు గల సర్పంబులు హతంబు లయ్యె. నా సమయంబునఁ దక్షకుండు రాకుండుట నెఱింగి "సహేంద్ర తక్షకాయానుబ్రూహి" అను ప్రేషవాక్యంబు నొడువునంతఁ, దక్షకసహితుండయి విమానముతో నింద్రుండు స్థాన భ్రంశంబు నొంది పడుచుండ, నత్తఱి బృహస్పతి యేతెంచి పరీక్షిత్తనయుని గీర్తింప దొణంగె. 26**

**ప్రతి :** రాజ+ఇంద్రా!= నృపవరా!; జరామరణహేతుకంబు+అయిన= ముసలితనం, మరణాలకు కారణమైన; శరీరంబునన్+ ఉండు= శరీరంలో ఉండే; జీవుండు; ఘటంబులలోన్= కుండలలో; కనంబడెడు= కనిపించే; ఆకాశంబు= ఆకాశం; ఘటనాశంబు+అయినన్= కుండ నష్టమైతే; మహా+ఆకాశంబునన్= పంచభూతాల్లో ఒకటైన గొప్ప ఆకాశంలో; చేరు చెందంబున= చేరే విధంగా; ఈశ్వరున్+కలయున్= ఈశ్వరుడిని కలుస్తుంది; తైలనాశపర్యంతంబు= చమురు అయిపోయేదాకా; వర్తి= వత్తి; తేజంబుతోడన్= కాంతితో; వెలుంగు కరణిన్= ఉండేవిధంగా; దేహకృతంబు+అగు= దేహంచేత చేయబడిన; భవంబు= జన్మ; రజస్+సత్త్వ+తమో గుణంబుల చేతన్= రజస్సు, సత్త్వం, తమోగుణాలతో; ప్రవర్తించున్= ప్రవర్తిస్తుంది; ఆత్మ; నభంబుమాడ్కిన్= ఆకాశంవలె; ధ్రువంబు+ఐ= నిశ్చలమై; అనంతంబు+ఐ= అంతంలేనిదై; వ్యక్త+అవ్యక్తంబులకున్= గోచరత్వానికి, అగోచరత్వానికి; పరంబు+ఐ= అతీతమై; ఉండున్= ఉంటుంది; ఇట్లు; ఆత్మస్వరూపునిగా; హరిన్= విష్ణువును; నిరంతరంబు= ఎల్లవేళలా; భావించుచున్+ఉండుట= భావిస్తూ ఉండడం; విశేషంబు= గొప్ప విషయం; నిన్నున్= నిన్ను; తక్షకుండు; కఱవన్= కరవడానికి; సమర్థుండు+కాఁడు= శక్తుడు కాడు; హరిన్+తలంపుము= విష్ణువును స్మరించు; ధన= ధనం; గృహ= ఇల్లు; దార+అపత్య= భార్య; సంతానం; క్షేత్ర= పొలం; పశు= పశువులు; ప్రకరంబులన్= మొదలైన వాటి సమూహాన్ని; వర్జించి= విడిచిపెట్టి; సమస్తంబును= అంతటినీ; నారాయణ+అర్పణంబు+చేసి= నారాయణునికి అర్పించి; విగత శోకుండవు+ఐ= దుఃఖాన్ని వదలి; నిత్యంబును= నిరంతరం; హరిధ్యానంబు+చేయుము= హరిని ధ్యానించు; అని; వినిపించినన్= చెప్పగా; రాజ+ఇంద్రుండును= రాజోత్తముడైన పరీక్షిత్తు కూడా; కుశ+ఆసన+ ఆసీనుండు+ఐ= దర్భాసనం మీద కూర్చున్నవాడై; జనార్దనున్= విష్ణువును; చింతించుచున్+ఉండెన్= ధ్యానిస్తూ ఉన్నాడు; అంతన్; శుకుండును= శుకమహర్షికూడా; యథా+ఇచ్ఛా విహారుండు+అయి= స్వచ్ఛంద సంచారియై; చనియెన్= వెళ్లాడు; ఇటన్= ఇక్కడ; క్రుద్ధుండు+ఐన= కుపితుడైన; బ్రాహ్మణ+ఉత్తమునిచేన్= బ్రాహ్మణశ్రేష్ఠునిచే; ప్రేరితుండు+ఐన= ప్రేరేపింప బడిన; తక్షకుండు; ద్విజరూపంబున్+తాల్చి= బ్రాహ్మణరూపం ధరించి; పరీక్షిత్+వధ+అర్థంబు+కాన్= పరీక్షిత్తును చంపడం కోసం; ఏతెంచుచున్+ఉండి= వస్తూ ఉండి; మార్గమధ్యంబునన్= దారి మధ్యలో; కాశ్యపుండు+అను= కాశ్యపుడు అనే; సర్పవిష= పాము విషం; హరణ+సమర్థుండు+అగు= హరించడంలో శక్తిమంతుడైన; వెఱొక విప్రునిన్+కని= మరో బ్రాహ్మణుని చూచి; అతనిన్= అతనిని; అపరిమిత= లెక్కలేనంత; ధనప్రదానంబునన్= ధనం ఇవ్వడంచేత; తృప్తున్+కావించి= సంతుష్టుని చేసి; పరీక్షిత్+నికటకంబునకున్= పరీక్షిత్తు దగ్గరకు; రాకుండునట్లు+ఒనర్చి= రాకుండేటట్లు చేసి; అంతటన్= తరువాత; పరీక్షిత్+మహారాజు; చెంతన్+ఉన్న= దగ్గర ఉన్న; వారలచేతికిన్= వాళ్లచేతికి; ఒక్క ఫలంబు+ఇచ్చి= ఒక పండు ఇచ్చి; చనినన్= వెళ్లగా; వారు+ఆ ఫలంబున్= వాళ్లు ఆ పండును; రాజునకున్+ఇచ్చినన్= రాజునకివ్వగా; అతండు; ఆ ఫలంబున్= ఆ పండును; ఆస్వాదించినన్= చవి చూడగా; క్రిమిరూపంబునన్= పురుగు రూపంలో;

అందున్+ఉండి= దానిలో నుండి; వెడలి= బయటకువచ్చి; మహా భయంకర రూపంబునన్= మిక్కిలి భయం కలిగించే రూపంతో; కాకోదరంబు+ఐ= పామై; రాజున్+కఱచినన్= రాజును కరవగా; అతండును; ఆ క్షణంబు+అ= ఆ క్షణమే; విష+అగ్నిచే= విషపుటగ్నివల్ల; భస్మీభూతుండు+అయ్యెన్= కాలి బూడిద అయ్యాడు; అట్టి అవసరంబునన్= ఆ సమయంలో; భూమి+అంతరిక్షంబులన్+ఉండు= నేలమీదా, నింగిలోనూ ఉండు; నిఖిలప్రాణులు= సర్వజీవులూ; ఆశ్చర్యకరంబు+అగు= విస్మయాన్ని కలిగించే; తద్+మరణంబు+కని= ఆ రాజు చావును చూచి; హాహారవంబులు= అయ్యయ్యో! అనే రోదన ధ్వనులు; చేసిరి= చేశారు; అంతన్; ఈ+అర్థంబున్= ఈ విషయాన్ని; అతని; తనయుండు+ఐన= కొడుకైన; జనమేజయుండు; విని; క్రోధ+ఆవేశంబునన్= కోపావేశంతో; సర్పప్రళయంబు+అగునట్లు= పాములు నశించేటట్లు; యజ్ఞంబు; చేయుచున్+ఉండన్= చేస్తూ ఉండగా; సహస్ర సంఖ్యలు+కల సర్పంబులు= వేలకొలదీ పాములు; హతంబులు+అయ్యెన్= చంపబడినవైనాయి (చనిపోయాయి); ఆ సమయంబునన్; తక్షకుండు; రాకుండుట; ఎఱింగి= తెలుసుకొని; 'సహ+ఇంద్ర తక్షకాయ అనుబ్రూహి'= ఇంద్రుడితో పాటు తక్షకుడు అగ్నిలో పడునుగాక; అను; ప్రేషవాక్యంబున్= హోమవాక్యాన్ని; నొడవు+అంతన్= పలుకగానే; తక్షకసహితుండు+అయి= తక్షకునితో కూడి; విమానంబుతోన్; ఇంద్రుండు; స్థానభ్రంశంబున్+ ఒంది= తన స్థానమైన స్వర్గం నుండి జారి; పడుచున్+ఉండన్= పడిపోతూ ఉండగా; ఆ+తఱిన్= ఆ సమయంలో; బృహస్పతి+ఏతెంచి= బృహస్పతి వచ్చి; పరీక్షిత్+తనయునిన్= పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుని; బహు భంగులన్= పెక్కువిధాలుగా; కీర్తించి= స్తుతించి....

**తా :** మహారాజా! ముసలితనానికి, మరణానికి కారణమైన శరీరంలో ఉండే జీవుడు కుండలో ఉన్న ఆకాశం కుండ నాశనమైనపుడు పంచభూతాలలో ఒకటైన మహాకాశంలో చేరేవిధంగా, శరీరం నశించిన తరువాత ఈశ్వరునిలో కలసిపోతాడు. నూనె అయిపోయేదాకా వత్తి తేజస్సుతో ఉండే విధంగా శరీరం ధరించి వచ్చిన జన్మ సత్త్వరజస్తమోగుణాల చేత ప్రవృత్తిని కలిగి ఉంటుంది. ఆత్మ ఆకాశంవలె నిశ్చలంగా, అనంతంగా, గోచరత్వానికి అగోచరత్వానికి అతీతంగా ఉంటుంది. ఈ రీతిగా ఆత్మను ఆత్మస్థితుడిగా చేసి విష్ణువుయొక్క ఆకారాన్ని భావిస్తూ ఉండడం విశేషం. నిన్ను కరవడానికి తక్షకుడు శక్తిమంతుడు కాడు. విష్ణువును ధ్యానించు. ధనం, ఇల్లు, భార్య, బిడ్డ, పొలం, పశువులు అనే వాటినన్నిటినీ విడిచి అంతా నారాయణునకు అర్పించి, దుఃఖాన్ని వదలి నిరంతరం విష్ణువును ధ్యానిస్తూ ఉండు; అని చెప్పగా పరీక్షిత్తు దర్భాసనం మీద కూర్చొని జనార్దనుడైన శ్రీహరిని ధ్యానించడం ప్రారంభించాడు. శుకమహర్షి స్వచ్ఛంద సంచారియై వెళ్లిపోయాడు.

కోపం పొందిన విప్రుని (శృంగి) వల్ల ప్రేరేపింపబడినవాడై తక్షకుడు బ్రాహ్మణ వేషం ధరించి పరీక్షిత్తును చంపడం కోసం వస్తూ మార్గమధ్యంలో కాశ్యపుడనే బ్రాహ్మణుని కలుసుకొన్నాడు. ఆ కాశ్యపుడు పాముల విషాన్ని హరించడంలో సమర్థుడు. అందువల్ల అతనికి లెక్కలేనంత ధనం సమర్పించి సంతృప్తిపరచి పరీక్షిత్తు దగ్గరకు వెళ్లకుండా చేశాడు. తరువాత తక్షకుడు పరీక్షిత్తు దగ్గర ఉన్నవాళ్లచేతికి ఒక పండును ఇచ్చి పోయాడు. వాళ్లు ఆ పండును రాజుకు ఇవ్వగా రాజు ఆ పండును చవిచూచినంతలో దాని నుండి తక్షకుడు ఒక పురుగుగా బయటకు వచ్చి మహాభయంకరమైన సర్పంగా మారి రాజును కాటు వేశాడు. ఆ విషాగ్నికి రాజు కాలి బూడిద అయిపోయాడు.

ఆ సమయంలో ఆశ్చర్యకరమైన రాజు మరణంచూచి నేలమీద, ఆకాశంలోనూ ఉండే సర్వజీవులూ హాహాకారాలు చేశాయి. ఈ విషయం పరీక్షిత్తుకొడుకైన జనమేజయుడు విని కోపావేశంతో సర్పాలన్నీ నాశనమయ్యే యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞంలో వేలకొద్దీ పాములు నాశనమయ్యాయి. తక్షకుడు రాకుండా ఇంద్రుని మందిరంలో ఉండడం తెలుసుకొని ఋత్విజుడు 'సహేంద్ర తక్షకాయానుబ్రూహి' అని పలికాడు. వెంటనే తక్షకునితో పాటు ఇంద్రుడు కూడా విమానంతో సహా

తన స్థానం నుండి పడిపోతుండగా, ఆ సమయానికి ఆంగీరసుడు వచ్చి పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుని పెక్కువిధాలుగా స్తుతించి

**చ. 'మృతియును జీవనంబు నివి మేదినిలోపల జీవకోటికిన్**
**సతతము సంభవించు; సహజం బిది; చోరహుతాశసర్ప సం**
**హతులను దప్పి నాఁకటను బంచత నొందెదు నట్టి జీవుఁడున్**
**వెతలను బూర్వకర్మ భవవేదన లొందుచుఁగుందు నెప్పుడున్. 27**

**ప్రతి :** మృతియును= చావూ; జీవనంబున్= బతుకూ; ఇవి= ఈ చావుబతుకులు; మేదినిలోపలన్= భూమియందు; జీవకోటికిన్= జీవులసమూహానికి; సతతమున్= ఎల్లప్పుడూ; సంభవించున్= కలుగుతాయి; ఇది; సహజంబు= సాధారణ విషయం; చోర= దొంగలవల్ల; హుతాశ= అగ్నివల్ల; సర్పసంహతులను= పాములసమూహంచేత; దప్పిన్= దాహంచేత; ఆఁకటన్= ఆకలిచేత; పంచతన్= చావును; ఒందెదు+అట్టి= పొందేటటువంటి; జీవుడున్= మానవుడు; వెతలను= కష్టాలను; పూర్వ= వెనకచేసిన; కర్మభవ= కర్మలవల్ల పుట్టిన; వేదనలు= బాధలు; ఒందుచున్= పొందుతూ; ఎప్పుడున్= ఎప్పుడూ; కుందున్= దుఃఖిస్తాడు.

**తా :** చావు పుట్టుకలు భూమిలోని ప్రాణికోటికి నిరంతరం కలుగుతాయి. ఇది సహజ విషయం. దొంగలవల్ల, అగ్నివల్ల, పాములవల్ల, ఆకలిదప్పుల వల్ల మరణం పొందే జీవుడు కష్టాలను, వెనక జన్మలో చేసిన కర్మల వలన కలిగిన బాధలను ఎప్పుడూ పొందుతూ దుఃఖిస్తాడు.

**విశే :** 'పంచత నొందడం' అంటే మరణించడమని అర్థం. పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాత్మకమైన శరీరం మరణించినపుడు మరల ఆ పంచభూతాల్లోనే కలసిపోతుంది. కనుక పంచత అంటే మరణం.

**వ. అట్లు గావున నసంఖ్యంబులైన దందశూకంబులు హతంబు లయ్యెఁ; శాంత మానసుండవై, క్రోధంబు వర్జింపు మనిన గురూపదిష్ట ప్రకారంబున సర్పయాగంబు మానియుండె; నంత దేవతలు గుసుమవృష్టిఁ గురియించి; రా రాజన్యుండు మంత్రి సమేతుండై నగర ప్రవేశంబు సేసె; బాధ్యబాధక లక్షణంబులు గల విష్ణుమాయా చోదిత గుణవ్యాపారంబుల నాత్మ మోహపడుం గావున, నట్టి మాయావికారంబులం బరిత్యజించి, తదాశ్రయాకృత మానసుండై వర్తించుచు, పరనింద సేయక, వైరంబు వర్జించి, భగవత్పదాంభోజభక్తి సంయుక్తుండై తిరుగు నతండు హరిపదంబుఁజేరు; నని చెప్పి వెండియు సూతుండు పరమహర్ష సమేతుండై శౌనకున కిట్లనియె. 28**

**ప్రతి :** అట్లు+కావునన్= అందుచేత; అసంఖ్యంబులు+ఐన= లెక్కలేనన్ని; దందశూకంబులు= పాములు; హతంబులు+ అయ్యెన్= చనిపోయాయి; శాంతమానసుండవు+ఐ= శాంత చిత్తుడవయి; క్రోధంబున్= కోపాన్ని; వర్జింపుము+అనినన్= విడువుమనగా; గురు+ఉపదిష్ట= గురువుచే ఉపదేశింపబడిన; ప్రకారంబునన్= విధంగా; సర్పయాగంబు; మాని+ఉండెన్= విరమించాడు; అంతన్; దేవతలు; కుసుమవృష్టిన్= పూలవానను; కురియించిరి= కురిపించారు; ఆ రాజన్యుండు= ఆ రాజైన జనమేజయుడు; మంత్రి సమేతుండు+ఐ= మంత్రులతో కూడి; నగర ప్రవేశంబు+చేసెన్= పట్టణంలో ప్రవేశించాడు; బాధ్య= బాధింపబడడం; బాధక= బాధించడం అనే; లక్షణంబులు+కల= లక్షణాలు కల; విష్ణుమాయా= విష్ణుమాయచే;

చోదిత= ప్రేరేపింపబడిన; గుణవ్యాపారంబులన్= గుణాలచేత, ఆ గుణాలు చేసే పనులచేత; ఆత్మ; మోహపడున్+కావునన్= అజ్ఞానంలో పడిపోతుంది కాబట్టి; అట్టి; మాయావికారంబులన్= మాయావికారాలను; పరిత్యజించి= విడిచిపెట్టి; తద్+ఆశ్రయ+అకృత మానసుండు+ఐ= వాటిని ఆశ్రయించని మనస్సుగలవాడై; వర్తించుచున్= ప్రవర్తిస్తూ; పరనింద+చేయక= ఇతరులను నిందించకుండా; వైరంబు= పగ; వర్జించి= విడిచిపెట్టి; భగవత్+పద+అంభోజభక్తి= భగవంతుని పాదపద్మాలయందు భక్తి; సంయుక్తుండు+ఐ= కూడినవాడై (కలిగినవాడై); తిరుగు+అతండు= సంచరించే వాడు; హరిపదంబున్+చేరున్= విష్ణుపదం చేరుకొంటాడు; అని చెప్పి; వెండియున్= మరల; సూతుండు= సూతమహర్షి; పరమ= మిక్కిలి; హర్షసమేతుండు+ఐ= సంతోషంతో కూడినవాడై; శౌనకునకున్= శౌనకునితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** అందుచేత లెక్కలేనన్ని పాములు చనిపోయాయి. శాంతచిత్తుడవై **కోపం విడిచిపెట్టు** అని చెప్పగా గురూపదేశం ప్రకారం జనమేజయుడు సర్పయాగం విరమించాడు. అప్పుడు దేవతలు పూలవాన కురిపించారు. జనమేజయమహారాజు మంత్రులతో కలసి నగరానికి వెళ్లాడు. బాధింపబడడం, బాధించడం అనే లక్షణాలు గల విష్ణుమాయచే ప్రేరేపింపబడిన గుణాలవల్ల, ఆ గుణాలు చేసే పనులవల్ల ఆత్మ అజ్ఞానంలో పడిపోతుంది. కాబట్టి అటువంటి మాయావికారాలను విడిచి, వాటిని మనసా ఆశ్రయించకుండా, ఇతరులను నిందించక పగను పరిత్యజించి, భగవంతుని పాదపద్మాలయందు భక్తి కలవాడై సంచరిస్తూ ఉండేవాడు విష్ణుపదాన్ని చేరుకుంటాడు, అని చెప్పి సూతమహర్షి ఆనందంతో శౌనకునితో మరల ఇలా అన్నాడు.

## a ⸺ శ్రీవేదవ్యాసుండు వేదములను, బురాణములను లోకమందుఁ బ్రవర్తింపఁ జేయుట a

**క. ధారుణిఁబారాశర్యున, కార్యులు పైలుఁడు సుమంతు జైమిని మునులున్**
**ధీరుఁడు వైశంపాయనుఁ, డారయ నలువురును శిష్యులై యుండి రొగిన్. 29**

**ప్రతి :** ధారుణిన్= భూమియందు; పారాశర్యునకున్= వ్యాసుడికి; ఆర్యులు= పూజ్యులైన; పైలుఁడు; సుమంతు= సుమంతుడు; జైమిని; మునులున్= మహర్షులు; ధీరుఁడు= ధైర్యవంతుడైన, వైశంపాయనుఁడు; ఆరయన్= చూడగా; నలువురును= నలుగురూ; ఒగిన్= క్రమంగా; శిష్యులు+ఐ; ఉండిరి.

**తా :** వ్యాసుడికి పూజ్యులైన పైల, సుమంత, జైమిని మునులూ, ధీరుడైన వైశంపాయనుడూ కలసి నలుగురు శిష్యులు ఉండిరి.

**విశే :** పరాశరుని కొడుకు పారాశర్యుడు. అంటే వ్యాసుడు. పరాశర మహర్షికి దాశరాజు కూతురు మత్స్యగంధి (సత్యవతి) కి పుట్టినవాడు వ్యాసుడు. పైలుడు, సుమంతుడు, జైమిని, వైశంపాయనుడు – ఈ నలుగురూ వ్యాసుని శిష్యులు.

**పైలుడు :** ఋగ్వేదాన్ని ధారణ చేసిన వ్యాసమహర్షి శిష్యుడు. పైలుని శిష్యుడు ఉదంకుడు.

**సుమంతుడు :** అథర్వవేదాన్ని పఠించిన వ్యాసుని శిష్యుడు.

**జైమిని :** వ్యాసుని శిష్యుడు. సామవేదాన్ని ధారణ చేసినవాడు. వ్యాసభారతాన్ని ప్రచారం చేసిన వాళ్లలో ఇతడూ ఒకడు.

**వైశంపాయనుడు :** యజుర్వేదాన్ని ధారణ చేసినవాడు. జనమేజయుడికి భారతకథ చెప్పడానికి వ్యాసునిచే నియుక్తుడైన వాడితడు. ఇతని శిష్యుడు యాజ్ఞవల్క్యుడు.

వ. వారలు ఋగ్యజుస్సామాథర్వంబు లనియెడు నాలుగు వేదంబుల వ్యాసోపదిష్టక్రమంబున లోకంబులం బ్రవర్తింపఁజేసి రని చెప్పిన, నా క్రమం బెట్లని శౌనకుం డడిగిన సూతుండు సెప్పం దొడంగె; 'నాదియందుఁ జతుర్ముఖుని హృదయంబున నొక నాదం బుద్భవించె; నది వృత్తి నిరోధంబువలన మూర్తీభవించి వ్యక్తంబుగాఁ గనఁబడె; నట్టి నాదోపాసనవలన యోగిజనంబులు నిష్పాపులై ముక్తి నొందుదురు; రందు నోంకారంబు జనియించె; నదియె సర్వమంత్రోపనిషన్మూలభూత యగు వేదమాత యని చెప్పంబడు; నా యోంకారంబు త్రిగుణాత్మకంబై యకారోకారమకారంబు లనెడు త్రివర్ణరూపంబై ప్రకాశించుచుండె; నంత భగవంతుండగు నజుం డాప్రణవంబువలన స్వరస్పర్శాంతస్థోష్మాది లక్షణ లక్షితంబగు నక్షరసమామ్నాయంబు గల్పించి, తత్సాహాయ్యంబునం దన వదన చతుష్టయంబువలన వేదచతుష్టయంబు గలుగంజేసె; నంత నతని పుత్త్రులగు బ్రహ్మవాదులా వేదంబులం దదుపదిష్టప్రకారంబుగా నభ్యసించి, యా క్రమంబున వారలు దమ శిష్యపరంపరకు నుపదేశించి; రిట్లు వేదంబులు సమగ్రంబుగాఁ బ్రతియుగంబున మహర్షులచే నభ్యసింపం బడియె; నట్టి వేదంబులు సమగ్రంబుగఁ బఠియింప నశక్తులగువారలకు సాహాయ్యంబు సేయుటకై ద్వాపరయుగాదియందు భగవంతుండు సత్యవతీదేవియందుఁబరాశరమహర్షికి సుతుండై యవతరించి, యా వేదరాశిం గ్రమమ్మున ఋగ్యజుస్సామాథర్వంబు లన నాలుగు విధంబులుగ విభజించి, పైల వైశంపాయన జైమిని సుమంతు లనియెడు శిష్యవరులకుఁగ్రమంబుగ నా వేదంబుల నుపదేశించె; నందుఁబైలమహర్షి సేకొన్న ఋగ్వేదం బనంతంబులగు ఋక్కులతోఁజేరి యుండుటంజేసి బహ్వృచశాఖ యని చెప్పంబడు; నంత నా పైలుం డింద్రప్రమితికి బాష్కలునకు నుపదేశించె; బాష్కలుం డా సంహితం జతుర్విధంబులు గావించి శిష్య లగు బోధ్యుండు యాజ్ఞవల్క్యుండుఁ బరాశరుండు నగ్నిమిత్రుండు ననువారికి నుపదేశించె; నింద్రప్రమితి దన సంహిత మాండూకేయున కుపదేశించె; మాండూకేయుండు దేవమిత్రుం డనువానికిం జెప్పె; నతనికి సౌభర్యాదిశిష్యు లనేకులై ప్రవర్తిల్లి; రందు సౌభరిసుతుండు శాకల్యుండు దా నభ్యసించిన శాఖ నైదు విధంబులుగ విభజించి; వాత్స్యుండు మౌద్గల్యుండు శాలీయుండు గోముఖుండు శిశిరుం డనెడు శిష్యుల కుపదేశించె; నంత జాతుకర్ణి యనువానికి వా రుపదేశింప నతండు బలాకుండు పైంగుండు వైతాళుండు విరజుం డనువారి కుపదేశించె; నదియునుం గాక మున్ను వినిపించిన బాష్కలుని కుమారుండైన బాష్కలి వాలఖిల్యాఖ్యసంహితను బాలాయని గార్గ్యుండు కాసారుం డను వారలకుం జెప్పె; ని త్తెఱంగున బహ్వృచసంహిత లనేక ప్రకారంబులం బూర్వోక్త బ్రహ్మర్షులచే ధరియింపంబడె; యజుర్వేదధరుండగు వైశంపాయనుని శిష్యసంఘంబు నిఖిలక్రతువుల నాధ్వర్యవ కృత్యంబుచేఁదేజరిల్లిరి; మఱియు నతని శిష్యుఁడగు యాజ్ఞవల్క్యుండు గుర్వపరాధంబు సేసిన, నా గురువు కుపితుండై 'యధీతవేదంబుల మరలం దన కిచ్చి పొమ్మ'నిన నతండు దాను జదివిన యజుర్గణంబును దదుక్త క్రమంబునఁ గ్రక్క, నవి రుధిరాక్తం బగు రూపంబుఁ దాల్చిన యజుర్గణాధిష్ఠిత శాఖాధి దేవతలు తిత్తిరిపక్షులై వానిని భుజియించిరి; దానంజేసి యా శాఖలు తైత్తిరీయంబు లయ్యె; నంత నిర్వేది యగు నా యాజ్ఞవల్క్యుం డపరిమిత నిర్వేదంబు నొంది, యుగ్రతపంబున సూర్యుని సంతుష్టుం గావింప, నతండు సంతసిల్లి హయరూపంబుఁదాల్చి యజుర్గణంబు

**నతని కుపదేశించెఁ; గావున నది వాజసనేయశాఖ యని వా(క్రువ్వంబడె; నంత నా యజుర్గణంబు కాణ్వ మాధ్యందినాదులచే నభ్యసింపబడె; నిట్లు యజుర్వేదంబు లోకంబునఁ(బవర్తిల్లె; సామవేదాధ్యేత యగు జైమినిమహర్షి దన సుతుండగు సుమంతునికి నుపదేశించె; నతఁడు సుకర్ముండను తన సుతునకుఁ దెలిపె; నతం డావేదమును సహ(స్రశాఖలుగా విభజించి, కోసలుని కుమారుండైన హిరణ్యనాభునికిని, దన కుమారుండగు పౌష్పంజి యనువానికి నుపదేశించె; నంత వారిరువురు (బహ్మవేత్త లగు నావంత్యులు నుదీచ్యులను నేనూర్గురికి నుపదేశించి, వారిని సామవేదపారగులంగాఁజేసి; రిట్లు సామవేదంబు లోకంబున వినుతి నొందె; మఱియు నథర్వవేత్త యగు సుమంతుమహర్షి దానిం దన శిష్యున కుపదేశింప నతండు వేదదర్శుండు పథ్యుండను శిష్యుల కుపదేశించె; నందు వేద దర్శుఁడనువాఁడు శౌల్కాయని (బహ్మబలి నిర్ధోషుండు పిప్పలాయనుం దనువారలకును, బథ్యుం దనువాఁడు కుముదుండు శునకుండు జాబాలి బ(భ్రు వంగిరసుండు సైంధవాయనుం దనువారలకు నుపదేశించి (ప్రకాశంబు నొందించె; నిత్తెఱంగున నథర్వవేదంబు వృద్ధి నొందె; ని ట్లఖిలవేదంబుల యుత్పత్తి (ప్రచార(క్రమం బెఱింగించితి; నింకం బురాణ(క్రమం బెట్టి లనిన వినిపింతు, వినుము; లోకంబునఁబురాణ(ప్రవర్తకు లనం (బసిద్ధులగు (త్రయ్యారుణి కశ్యపుండు సావర్ణి యకృత(వ్రణుండు వైశంపాయనుండు హారీతుం దను నార్గురు మజ్జనకుండును వ్యాస శిష్యుండునగు రోమహర్షణుని వలన (గ్రహించి; రట్టి పురాణంబు సర్గాది దశలక్షణలక్షితంబుగా నుండు; మఱియుఁ గొందఱు పురాణంబు పంచలక్షణలక్షితంబనియుఁబలుకుదు; రట్టి పురాణనామాను(క్రమంబుఁ బురాణవిదు లగు ఋషులు సెప్పెడు తెఱంగున నెఱింగింతు; వినుము; (బ్రాహ్మంబు పాద్మంబు వైష్ణవంబు శైవంబు భాగవతంబు భవిష్యోత్తరంబు నారదీయంబు మార్కండేయం బాగ్నేయంబు (బహ్మవైవర్తంబు లైంగంబు వారాహంబు స్కాందంబు వామనంబు కౌర్మంబు మాత్స్యంబు (బహ్మాండంబు గారుడంబు నని పదునెనిమిది మహాపురాణంబులు మఱియు నుపపురాణంబులుం గలవు; వీని లిఖించినం జదివిన వినిన దురితంబు లడంగునని సూతుండు శౌనకాదులకుం జెప్పిన వారు 'నారాయణుగుణవర్ణనంబును దత్కథలును జెప్పితి; వింక దోషకారులుఁబాపమతులు నెవ్విధంబున భవాబ్ధిం దరింతు, రా(క్రమంబు వక్కాణింపవే!' యని యడిగిన నెఱింగింపం దలంచి యిట్లనియె.** **30**

(ప్రతి : వారలు= వ్యాస శిష్యులైన పైలాదులు; ఋగ్యజుస్సామ+అథర్వంబులు+అనియెడు= ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం అనబడే; నాలుగు వేదంబులన్= నాలుగు వేదాలను; వ్యాస+ఉపదిష్ట (క్రమంబునన్= వ్యాసుడిచే ఉపదేశింపబడిన విధంగా; లోకంబులన్= లోకాలలో; (ప్రవర్తింపన్+చేసిరి= వ్యాపింపజేశారు; అని చెప్పినన్; ఆ (క్రమంబు+ ఎట్లు+అని= ఆ (క్రమం ఎలా అని; అడిగినన్; సూతుండు; చెప్పన్+తొడంగెన్= చెప్పనారంభించాడు; ఆది+అందున్= మొదట; చతుర్ముఖుని హృదయంబునన్= (బహ్మ మనస్సులో; ఒక నాదంబు= ఒక ధ్వని; ఉద్భవించెన్= పుట్టింది; అది; వృత్తి నిరోధంబు వలనన్= చిత్త వ్యాపారాన్ని నిరోధించినందువల్ల; మూర్తీభవించి= రూపుదాల్చి; వ్యక్తంబు+కాన్= స్పష్టంగా; కనఁబడె= కనిపించింది; అట్టి= అటువంటి; నాద+ఉపాసన వలనన్= ధ్వనిని ఉపాసించడం వల్ల; యోగిజనంబులు= యోగుల సమూహాలు; నిష్పాపులు+ఐ= పాపరహితులై; ముక్తిన్+ఒందుదురు= మోక్షం పొందుతారు; అందున్=

ఆ నాదంలోనే; ఓంకారంబు= ఓంకారం; జనియించెన్= పుట్టింది; అది+ఎ= అదియే; సర్వమంత్ర= అన్నిమంత్రాలకు; ఉపనిషత్+మూలభూత+అగు= ఉపనిషత్తులకు మూలమైన; వేదమాత+అని; చెప్పన్+పడున్= చెప్పబడుతుంది; ఆ+ఓంకారంబు= ఆ ఓంకారం; త్రిగుణ+ఆత్మకంబు+ఐ= సత్త్వరజస్తమోగుణాలతో కూడి; అకార+ఉకార+మకారంబులు+ అనెడు= అకారం, ఉకారం, మకారం అనే; త్రివర్ణరూపంబు+ఐ= మూడు వర్ణాల రూపమై; ప్రకాశించుచున్+ఉండెన్= ప్రకాశిస్తూ ఉంది; అంతన్; భగవంతుండు+అగు= భగవంతుడైన; అజుండు= బ్రహ్మ; ఆ ప్రణవంబు వలనన్= ఆ ఓంకారం నుండి; స్వర= స్వరాలు; స్పర్శ= స్పర్శాలు; అంతస్థ= అంతస్థాలు; ఊష్మ+ఆది= ఊష్మాలు మొదలైన; లక్షణ= లక్షణాలకు; లక్షితంబు+అగు= లక్ష్యంగా; అక్షరసమామ్నాయంబున్= వర్ణసముదాయాన్ని; కల్పించి= ఏర్పరచి; తద్+సాహాయ్యంబున్= వాటి తోడ్పాటుతో; తన వదనచతుష్టయంబువలనన్= తన నాలుగు ముఖాల నుండి; వేదచతుష్టయంబులు= నాలుగువేదాలు; కలుగన్+చేసెన్= కలుగజేశాడు; అంతన్; అతని పుత్రులు+అగు= అతని కొడుకులైన; బ్రహ్మవాదులు= వేదాంతులు; ఆ వేదంబులన్= ఆ వేదాలను; తద్+ఉపదిష్ట ప్రకారంబు+కాన్= అతడు ఉపదేశించిన విధంగా; అభ్యసించి; ఆక్రమంబునన్= ఆ వరుసలో; వారలు= వాళ్ళు; తమ శిష్య పరంపరకున్= తమ శిష్యులకు; ఉపదేశించిరి; ఇట్లు; వేదంబులు= వేదాలు; సమగ్రంబు+కాన్= సంపూర్ణంగా; ప్రతియుగంబునన్= ప్రతియుగంలోనూ; మహర్షులచేన్= మహర్షులచే; అభ్యసింపన్+పడియెన్= అభ్యాసం చేయబడినాయి; అట్టి వేదంబులు; సమగ్రంబుగన్= సంపూర్ణంగా; పఠియింపన్= చదవడానికి; అశక్తులు+అగు వారలకున్= అసమర్థులైన వాళ్లకు; సాహాయ్యంబు+చేయుటకు+ ఐ= తోడ్పడడానికి ; ద్వాపరయుగ+ఆది+అందున్= ద్వాపరయుగం మొదట; భగవంతుడు; సత్యవతీదేవి+అందున్= సత్యవతీదేవిలో; పరాశర మహా+ఋషికిన్= పరాశరుడనే మహర్షికి; సుతుండు+ఐ= కుమారుడై; అవతరించి= పుట్టి; ఆ వేదరాశిన్= ఆ వేదాల సమూహాన్ని; క్రమమ్మునన్= క్రమంగా; ఋక్+యజుస్+సామ+అథర్వంబులు+అనన్= ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం అని; నాలుగు విధంబులు+కన్= నాలుగు విధాలుగా; విభజించి= ఏర్పరచి; పైల, వైశంపాయన, జైమిని, సుమంతులు; అనియెడు= అనబడే; శిష్యవరులకున్= శిష్యశ్రేష్ఠులకు; క్రమంబునన్= క్రమంగా; ఆ వేదంబులన్; ఉపదేశించెన్= ఉపదేశించాడు; అందున్= ఆ వేదాలలో; పైలమహర్షి+చేకొన్న= పైలమహర్షి చేపట్టిన; ఋగ్వేదంబు; అనంతంబులు+అగు= అసంఖ్యాకమైన; ఋక్కులతోన్= మంత్రాలతో; చేరి ఉండుటన్+చేసి= కూడి ఉండడంచేత; బహు+ఋచశాఖ+అని= పెక్కు ఋక్కులతో కూడిన వేదభాగమని; చెప్పన్+పడున్= చెప్పబడింది;

అంతన్= తరువాత; ఆ పైలుండు; ఇంద్రప్రమితికిన్= ఇంద్ర ప్రమితికి; బాష్కలునకున్= బాష్కలునికి; ఉపదేశించెన్= ఉపదేశించాడు; బాష్కలుండు; ఆ సంహితన్= ఆ వేదాన్ని; చతుర్విధంబులు+కావించి= నాలుగు భాగాలు చేసి; శిష్యులు+అగు= శిష్యులైన; బోధ్యుండు; యాజ్ఞవల్క్యుండున్; పరాశరుండున్; అగ్నిమిత్రుండున్; అనువారికిన్= అనే వాళ్లకు; ఉపదేశించెన్; ఇంద్రప్రమితి; తన సంహితన్= తన వేదాన్ని; మాండూకేయునకున్; ఉపదేశించెన్; మాండూకేయుండు; దేవమిత్రుండు+ అను వానికిన్; చెప్పెన్= చెప్పాడు; అతనికి= దేవమిత్రునికి; సౌభరి+ఆది శిష్యులు= సౌభరి మొదలైన శిష్యులు; అనేకులు+ఐ= పెక్కుంద్రయి; ప్రవర్తిల్లిరి= వర్ధిల్లారు; అందున్= ఆ శిష్యులలో; సౌభరిసుతుండు= సౌభరి కొడుకైన; శాకల్యుండు; తాన్; అభ్యసించిన శాఖను; ఐదు విధంబులు+కాన్= ఐదు విధాలుగా విభజించి; వాత్స్యుండు; మౌద్గల్యుండు; శాలీయుండు; గోముఖుండు; శిశిరుండు; అనెడు= అనే; శిష్యులకున్; ఉపదేశించెన్; అంతన్; జాతుకర్ణి; అనువానికిన్= అనేవాడికి; వారు= వాళ్లు; ఉపదేశింపన్= ఉపదేశించగా; అతండు= జాతుకర్ణి; బలాకుండు; పైంగుండు; వైతాళుండు; విరజుండు; అనువారికిన్; ఉపదేశించెన్; అదియున్+కాక= అదీగాక; మున్ను= ముందు; వినిపించిన; బాష్కలుని; కుమారుండు+ఐన=

కొడుకైన; బాష్కలి; వాలఖిల్య+ఆఖ్య సంహితను= వాలఖిల్యమనే పేరుగల వేదభాగాన్ని; బాలాయని; గార్గ్యుండు; కాసారుండు; అనువారలకున్= అనే వాళ్లకు; చెప్పెన్= చెప్పాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; బహు+ఋచ+సంహితలు; అనేక ప్రకారంబులన్= పలువిధాలుగా; పూర్వ+ఉక్త= ముందు చెప్పబడిన; బ్రహ్మ+ఋషులచేన్= బ్రహ్మర్షులచే; ధరియింపన్+పడెన్= నిలుపబడింది;

యజుర్వేదధరుండు+అగు= యజుర్వేదధరుడైన; వైశంపాయనుని; శిష్య సంఘంబు= శిష్యుల సమూహం; నిఖిల క్రతువులన్= ఎల్ల యజ్ఞాలలో; ఆధ్వర్యవ కృత్యంబుచేన్= యజ్ఞతంత్రాన్ని నడిపే పనిచేత; తేజరిల్లిరి= ప్రకాశించారు; మఱియున్; అతని శిష్యుడు+అగు= వైశంపాయనుని శిష్యుడైన; యాజ్ఞవల్క్యుండు; గురు+అపరాధంబు+చేసినన్= గురువు విషయంలో నేరం చేయగా; ఆ గురువు; కుపితుండు+ఐ= కోపపడిన వాడై; అధీత వేదంబులన్= చదివిన వేదాలను; మరలన్= మళ్లీ; తనకున్; ఇచ్చి; పొమ్ము+అనినన్= పొమ్మనగా; అతండు= యాజ్ఞవల్క్యుడు; తాను+చదివిన; యజుర్గణంబును= యజుర్వేదసముదాయాన్ని; తద్+ఉక్త క్రమంబునన్= అతనిచే చెప్పబడిన విధంగా; క్రక్కన్= వమనంచేయగా; అవి= ఆ వేదభాగాలు; రుధిర+అక్తంబు+అగు= రక్తసిక్తమైన; రూపంబున్= రూపాన్ని; తాల్చినన్= తాల్చగా; యజుర్గణ+అధిష్ఠిత శాఖా+అధి దేవతలు= యజుర్వేద భాగాలను అధిష్ఠించిన శాఖ యొక్క దేవతలు; తిత్తిరిపక్షులు+ఐ= తీతువుపిట్టలై; వానిని= ఆ వేదభాగాలను; భుజియించిరి= తిన్నారు; దానన్+చేసి= అందువల్ల; ఆ శాఖలు; తైత్తిరీయంబులు+ అయ్యెన్= తైత్తిరీయ శాఖలయ్యాయి; అంతన్; నిర్వేది+అగు= వేద రహితుడైన; ఆ యాజ్ఞవల్క్యుండు; అపరిమిత= అంతులేని; నిర్వేదంబున్+ఒంది= దుఃఖం పొంది; ఉగ్రతపంబునన్= తీవ్రమైన తపస్సుచే; సూర్యునిన్= సూర్యుని; సంతుష్టన్+కావింపన్= సంతోషపరచగా; అతండు= సూర్యుడు; సంతసిల్లి= సంతోషించి; హయరూపంబున్+తాల్చి= గుర్రం రూపు ధరించి; యజుస్+గణంబున్= యజుర్మంత్ర సంహితలను; అతనికిన్= అతనికి; ఉపదేశించెన్= ఉపదేశించాడు; కావునన్; అది; వాజసనేయశాఖ+అని; వాక్రువ్వన్+పడెన్= చెప్పబడింది; అంతన్; ఆయజుర్గణంబు= ఆ యజుస్సంహితలు; కాణ్వ మాధ్యందిన+ఆదులచేన్= కాణ్వుడు, మాధ్యందినుడు మొదలైన వాళ్లచే; అభ్యసింపన్+పడెన్= చదువబడింది; ఇట్లు; యజుర్వేదంబు; లోకంబునన్= లోకంలో; ప్రవర్తిల్లెన్= వ్యాపించింది;

సామవేద+అధ్యేత+అగు= సామవేదాన్ని అభ్యసించిన; జైమిని మహర్షి; తన; సుతుండు+అగు= కుమారుడైన; సుమంతునికిన్; ఉపదేశించెన్; అతఁడు= సుమంతుడు; సుకర్ముండు+అను= సుకర్ముడనే; తన; సుతునకున్= కుమారుడికి; తెలిపెన్= తెలిపాడు; అతండు+ఆవేదంబును= అతడా వేదాన్ని; సహస్రశాఖలుగా= వేయి శాఖలుగా; విభజించి= వేరుచేసి; కోసలుని; కుమారుండు+ఐన= కుమారుడైన హిరణ్యనాభునికిన్; తన కుమారుండు+అగు= తన కొడుకైన; పౌష్పంజి+ అనువానికిన్= పౌష్పంజి అనే వాడికి; ఉపదేశించెన్; అంతన్; వారిరువురు= వాళ్లిద్దరూ; బ్రహ్మవేత్తలు+అగు= వేదాంతులైన; ఆవంత్యులు; ఉదీచ్యులు; అను; ఏనూర్గురికిన్= ఐదువందల మందికి; ఉపదేశించి; వారిని; సామవేదపారగులన్+కాన్= సామవేద పారంగతులనుగా; చేసిరి= చేశారు; ఇట్లు; సామవేదంబు; లోకంబునన్= లోకంలో; వినుతిన్+ఒందెన్= ప్రశంసను పొందింది; మఱియున్; అథర్వవేత్త+అగు= అథర్వవేత్త అయిన; సుమంతుమహర్షి; దానిన్= అథర్వవేదాన్ని; తన శిష్యునకున్= తన శిష్యునికి; ఉపదేశింపన్= ఉపదేశించగా; అతండు= ఆ శిష్యుడు; వేదదర్శుండు; పథ్యుండు; అను; శిష్యులకున్; ఉపదేశించెన్; అందున్= వాళ్లలో; వేదదర్శుఁడు+ అనువాఁడు= వేదదర్శుడనే వాడు; శౌల్కాయని; బ్రహ్మబలి; నిర్ధోషుండు; పిప్పలాయనుండు; అనువారలకును= అనేవాళ్లకు; పథ్యుండు+అనువాఁడు= పథ్యుడు అనేవాడు; కుముదుండు; శునకుండు; జాబాలి; బభ్రువు; అంగిరసుండు; సైంధవాయనుండు; అనువారలకున్= అనేవాళ్లకు; ఉపదేశించి;

ప్రకాశంబున్+ఒందించెన్= వ్యాపింపజేశాడు; ఈ+తెఱంగునన్= ఈ విధంగా; అథర్వవేదంబు; వృద్ధిన్+ఒందెన్= వృద్ధిపొందింది;

ఇట్లు; అఖిల వేదంబుల; ఉత్పత్తి= పుట్టుక; ప్రచార క్రమంబు= వ్యాప్తి క్రమం; ఎఱింగించితిన్= తెలియజేశాను; ఇంకన్= ఇప్పుడు; పురాణక్రమంబు= పురాణాల క్రమం; ఎట్టులు+అనినన్= ఎలా అంటే; వినిపింతున్= చెపుతాను; వినుము; లోకంబునన్= లోకంలో; పురాణప్రవర్తకులు+అనన్= పురాణాలను ప్రచారంచేసిన వాళ్లుగా; ప్రసిద్ధులు+అగు= ప్రసిద్ధులైన; త్రయ్యారుణి; కశ్యపుండు; సావర్ణి; అకృతవ్రణుండు; వైశంపాయనుండు; హారీతుండు; అను; ఆర్గురు= ఆరుగురూ; మత్+జనకుండును= నా తండ్రి; వ్యాసశిష్యుండును+అగు= వ్యాస శిష్యుడైన; రోమహర్షణునివలనన్= రోమహర్షణుని దగ్గర; గ్రహించిరి= నేర్చుకొన్నారు; అట్టి పురాణంబు; సర్గ+ఆది= సర్గ మొదలైన; దశలక్షణ= పది లక్షణాలకు; లక్షితంబు+కాన్= లక్ష్యప్రాయంగా; ఉండున్= ఉంటుంది; మఱియున్= ఇంకా; కొందఱు; ఆ పురాణంబు; పంచ లక్షణ లక్షితంబు+అనియున్= సర్గ మొదలైన ఐదు లక్షణాలకు లక్ష్యమైనదని; పలుకుదురు= చెపుతారు; అట్టి; పురాణ; నామ+అనుక్రమంబున్= పేర్ల వరుసను; పురాణ విదులు+అగు= పురాణాలను ఎరిగిన వారైన; ఋషులు= మహర్షులు; చెప్పెడు తెఱంగునన్= చెప్పే విధంగా; ఎఱింగింతున్= తెలుపుతాను; వినుము; బ్రాహ్మంబు= బ్రహ్మపురాణం; పాద్మంబు= పద్మపురాణం; వైష్ణవంబు= విష్ణుపురాణం; శైవంబు= శివపురాణం; భాగవతంబు= భాగవత పురాణం; భవిష్య+ఉత్తరంబు= భవిష్యోత్తరపురాణం; నారదీయంబు= నారదపురాణం; మార్కండేయంబు= మార్కండేయపురాణం; ఆగ్నేయంబు= అగ్నిపురాణం; బ్రహ్మవైవర్తంబు= బ్రహ్మవైవర్తపురాణం, లైంగంబు= లింగపురాణం; వారాహంబు= వరాహపురాణం; స్కాందంబు= స్కాందపురాణం; వామనంబు= వామన పురాణం; కౌర్మంబు= కూర్మపురాణం; మాత్స్యంబు= మత్స్యపురాణం; బ్రహ్మాండంబు= బ్రహ్మాండ పురాణం; గారుడంబు= గరుడపురాణం; అని; పదునెనిమిది; మహాపురాణంబులు; మఱియున్= ఇంకా; ఉపపురాణంబులున్+కలవు= ఉప పురాణాలూ ఉన్నాయి; వీనిన్= ఈ పురాణాలను; లిఖించినన్= రాసినా; చదివినన్= పఠించినా; వినినన్= విన్నా; దురితంబులు+అడంగున్= పాపాలు నశిస్తాయి; అని; సూతుండు; శౌనక+ ఆదులకున్= శౌనకుడు మొదలైన వాళ్లకు; చెప్పినన్= చెప్పగా; వారు; నారాయణ గుణ వర్ణనంబును= నారాయణుని గుణ వర్ణనను; తద్+కథలును= ఆయన కథలను; చెప్పితివి; ఇంకన్= ఇంకా; దోషకారులున్= తప్పులు చేసిన వాళ్లు; పాపమతులున్= పాపబుద్ధి కలవాళ్లు; ఏ+విధంబునన్= ఏ విధంగా; భవ+అబ్ధిన్= సంసార సాగరాన్ని; తరింతురు= దాటుతారు; ఆ క్రమంబున్= ఆ మార్గాన్ని; వక్కాణింపవే= చెప్పవా; అని+అడిగినన్; ఎఱింగింపన్+తలంచి= చెప్పాలనుకొని; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

**తా :** ఆ నలుగురూ తమ గురువైన వ్యాసుడు బోధించిన క్రమంలో ఋగ్వేదాన్ని, యజుర్వేదాన్ని, సామవేదాన్ని, అథర్వవేదాన్ని లోకంలో ప్రచారం చేశారు. ఆ మాట విని శౌనకుడు ఆ క్రమ మేమిటని ప్రశ్నించగా సూతుడిలా చెప్పనారంభించాడు. మొట్టమొదట బ్రహ్మ హృదయంలో ఒక నాదం పుట్టింది. చిత్తవ్యాపారాన్ని నిరోధించడం వల్ల ఆ నాదం రూపుదాల్చి స్పష్టంగా కనిపించింది. అటువంటి ధ్వనిని ఉపాసించడం వల్ల యోగులు పాపరహితులై ముక్తి నొందుతారు. ఆ నాదంలోనే ఓంకారం జనించింది. ఓంకారం అన్ని మంత్రాలకు; ఉపనిషత్తులకు మూలం కావడం వల్ల వేదమాత అని ఖ్యాతి పొందింది. ఓంకారం అకార, ఉకార, మకారాలనే మూడు వర్ణాలతో, సత్త్వరజస్తమోగుణాలతో ప్రకాశిస్తూ ఉంది. భగవంతుడైన బ్రహ్మ ఆ ఓంకారం నుండి స్వరాలు, స్పర్శాలు, అంతస్థాలు, ఊష్మాలు మొదలైన లక్షణాలతో కూడిన వర్ణ (అక్షర) సముదాయాన్ని కల్పించాడు. ఆ అక్షర సముదాయం తోడ్పాటుతో తన నాలుగు ముఖాల నుండి నాలుగు వేదాలను

కలుగజేశాడు. తన పుత్రులైన బ్రహ్మావాదులకు (వేదాంతులకు) ఆ వేదాలను ఒక క్రమంలో ఉపదేశించాడు. వాళ్లు ఆ వేదాలను తండ్రి బోధించిన క్రమంలోనే తమ శిష్యులకు ఉపదేశించారు. ఈ విధంగా వేదాలు ప్రతియుగంలోనూ ఋషులచే సమగ్రంగా అభ్యాసం చేయబడుతూ వచ్చాయి.

అలాంటి వేదాలను సమగ్రంగా చదువలేని అశక్తులకు సహాయం చేయడం కోసం భగవంతుడు ద్వాపరయుగ ప్రారంభంలో సత్యవతీదేవి పరాశరమహర్షులకు కొడుకుగా పుట్టి సమగ్రవేదరాశిని ఋక్, యజుస్, సామ, అథర్వ వేదాలుగా విడదీసి క్రమంగా వాటిని పైలుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు అనే తన నలుగురు శిష్యులకు బోధించాడు. ఆ వరుసలో పైలుడు నేర్చుకొన్న ఋగ్వేదం అసంఖ్యాకమైన ఋక్కులతో కూడి ఉండడం వల్ల 'బహ్వృచశాఖ' అని ప్రసిద్ధి పొందింది. పైలుడు తాను నేర్చుకొన్న వేదాన్ని ఇంద్రప్రమితికి, బాష్కలునికి ఉపదేశించాడు. బాష్కలుడు తాను నేర్చుకొన్న భాగాన్ని నాలుగు విభాగాలు చేసి బోధ్యుడు, యాజ్ఞవల్క్యుడు, పరాశరుడు, అగ్నిమిత్రుడు అనే తన శిష్యులకు ఉపదేశించాడు. ఇంద్రప్రమితి తాను నేర్చుకొన్న భాగాన్ని మాండూకేయుడు అనే వాడికి ఉపదేశించాడు. మాండూకేయుడు దేవమిత్రుడు అనేవాడికి ఉపదేశించాడు. దేవమిత్రునికి సౌభర్యుడు మొదలైన శిష్యులు అనేకులు ఉన్నారు. వాళ్లలో సౌభరి కొడుకైన శాకల్యుడు తాను నేర్చుకొన్న వేదశాఖను ఐదుభాగాలుగా విభజించి వాత్స్యుడు, మౌద్గల్యుడు, శాలీయుడు, గోముఖుడు, శిశిరుడు అనే తన ఐదుగురు శిష్యులకు ఉపదేశించాడు. ఈ ఐదుగురు శిష్యులు జాతుకర్ణి అనే వాడికి ఉపదేశించారు. జాతుకర్ణి ఆ భాగాలను బలాకుడు, పైంగుడు, వైతాళుడు, విరజుడు అనే నలుగురికి చెప్పాడు. ముందు చెప్పిన బాష్కలునికి బాష్కలి అనే కొడుకున్నాడు. ఆ బాష్కలి వాలఖిల్య సంహితను బాలాయని, గార్గ్యుడు, కాసారుడు అనే వాళ్లకు బోధించాడు. ఈ విధంగా బహ్వృచ సంహితలు (ఋగ్వేద భాగాలు) అనేక విధాలుగా ముందు చెప్పిన బ్రహ్మర్షుల చేత ధరింపబడి నిలిచి ఉన్నాయి.

యజుర్వేదాన్ని ఉపదేశం పొందిన వైశంపాయనమహర్షి శిష్యులందరూ యజ్ఞాలన్నిటిలో పాల్గొని ఆధ్వర్యవ కృత్యాలలో ప్రసిద్ధి పొందారు. యాజ్ఞవల్క్యుడు కూడా వైశంపాయనుని శిష్యుడే. యాజ్ఞవల్క్యుడు గురువుపట్ల అపరాధం చేయగా వైశంపాయనుడు తన దగ్గర నేర్చుకొన్న వేదాలను మళ్లీ తనకిచ్చి వెళ్లిపొమ్మన్నాడు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు తాను నేర్చుకొన్న యజుస్సంహితలను నేర్చుకొన్న క్రమంలోనే వమనం (వాంతి) చేశాడు. వమనం ద్వారా బయటకు వచ్చిన ఆ సంహితలు రక్తసిక్తమై ఉండగా యజుర్మంత్ర గణాల అధిష్ఠాన దేవతలు తిత్తిరిపక్షుల రూపంలో వచ్చి వాటిని తినేశారు. అందువల్ల ఆ భాగాలకు తైత్తిరీయ శాఖలని పేరు వచ్చింది. తాను నేర్చుకొన్న వేదశాఖలు పోవడంవల్ల యాజ్ఞవల్క్యుడు నిర్వేది (వేదాలు లేనివాడు) అయ్యాడు. దుఃఖంతో తీవ్రమైన తపస్సుచేసి సూర్యదేవుని సంతృప్తి పరచాడు. సూర్యుడు సంతసించి గుర్రం రూపం ధరించి యజుర్మంత్ర సంహితలను యాజ్ఞవల్క్యునికి ఉపదేశించాడు. అందువల్ల వాటికి 'వాజసనేయశాఖ' అనే పేరు కలిగింది. ఈ శాఖలో ఉండే యజుస్సంహితలను కాణువుడు, మాధ్యందినుడు మొదలైన వాళ్లు అభ్యసించారు. ఈ విధంగా యజుర్వేదం లోకంలో వ్యాప్తి చెందింది.

సామవేదాన్ని అభ్యసించిన జైమిని దానిని తన కుమారుడైన సుమంతుడికి ఉపదేశించాడు. సుమంతుడు దానిని తన కొడుకైన సుకర్ముడికి చెప్పాడు. సుకర్ముడు ఆ వేదాన్ని వెయ్యిశాఖలుగా విభజించి కోసలుని పుత్రుడైన హిరణ్యానాభుడికి, తన కుమారుడైన పౌష్పంజికి ఉపదేశించాడు. వాళ్లిద్దరు బ్రహ్మవేత్తలైన అవంత్యులు, ఉదీచ్యులు అనే ఐదువందల మందికి ఉపదేశించి సామవేదపారగులుగా చేశారు. ఈ విధంగా సామవేదం లోకంలో ప్రశస్తి పొందింది.

అథర్వవేదం అభ్యసించిన సుమంతుడు దాన్ని తన శిష్యునికి బోధించాడు. ఆ శిష్యుడు తన శిష్యులైన వేదదర్శుడు, పథ్యుడు అనే వాళ్లకు ఉపదేశించాడు. వేదదర్శుడు శౌల్కాయని, బ్రహ్మబలి, నిర్దోషుడు, పిప్పలాయనుడు అనే నలుగురికి బోధించగా, పథ్యుడు కుముదుడు, శునకుడు, జాబాలి, బభ్రువు, అంగిరసుడు, సైంధవాయనుడు అనే ఆరుగురికి బోధించాడు. ఈ విధంగా అథర్వవేదం వృద్ధి పొందింది.

ఇలా నాలుగు వేదాల ఉత్పత్తిని, వ్యాప్తిని తెలిపాను. ఇప్పుడు పురాణాల క్రమాన్ని గురించి చెపుతాను విను. లోకంలో పురాణాలను ప్రచారం చేసిన వాళ్లుగా త్రయ్యారుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు అనే ఆర్గురు ప్రసిద్ధులు. వ్యాసుని శిష్యుడు, నా తండ్రి అయిన రోమహర్షణుని దగ్గరే ఈ ఆరుగురు పురాణాలను నేర్చుకొన్నారు. పురాణం సర్గ మొదలైన పది లక్షణాలకు లక్ష్యంగా ఉంటుంది. కొందరు పురాణానికి సర్గ మొదలైన ఐదు లక్షణాలు ఉంటాయని చెపుతారు. పురాణవిదులైన మహర్షులు చెప్పిన పద్ధతి ననుసరించి పురాణాలను క్రమంగా చెపుతాను విను. బ్రహ్మపురాణం, పద్మపురాణం, విష్ణుపురాణం, శివపురాణం, భాగవతపురాణం, భవిష్యోత్తర పురాణం, నారదపురాణం, మార్కండేయపురాణం, అగ్నిపురాణం, బ్రహ్మవైవర్తపురాణం, లింగపురాణం, వరాహపురాణం, స్కాంద పురాణం, వామనపురాణం, కూర్మపురాణం, మత్స్యపురాణం, బ్రహ్మాండపురాణం, గరుడ పురాణం – ఈ పద్దెనిమిదీ మహాపురాణాలు. ఇవిగాక ఇంకా ఉపపురాణాలున్నాయి. ఈ పురాణాలను రాసినా, చదివినా, విన్నా పాపాలు నశించిపోతాయి అని సూతుడు శౌనకాదిమునులకు చెప్పాడు. 'నీవు నారాయణుని గుణాలను, ఆయన కథలను చెప్పావు. ఇక తప్పుచేసినవాళ్లు, పాపబుద్ధి కలవాళ్లు సంసారసాగరాన్ని ఎలా దాటుతారో కూడా చెప్పవా!' అని మునులు అడిగారు. అప్పుడా విషయం చెప్పదలచి సూతుడు ఇలా అన్నాడు.

**విశే :** వేదమంటే జ్ఞానం. వేదరాశిని నాలుగు వేదాలుగా విభజించడం వల్ల వ్యాసుడు వేదవ్యాసుడయ్యాడు. వ్యాసుడు సత్యవతీ పరాశరులకు కృష్ణద్వీపంలో జన్మించడం వల్ల కృష్ణద్వైపాయనుడయ్యాడు. శ్రీమన్నారాయణుని ఏకవింశతి అవతారాలలో వ్యాసావతారం కూడా ఒకటి. శ్రీమన్నారాయణుని పదిహేడవ అవతారం వ్యాసుడని భాగవతమే పేర్కొన్నది. (ప్రథమస్కంధం. 63 వ వచనం). ప్రతి మహాయుగంలోనూ విష్ణువే వ్యాసుడిరూపంలో అవతరిస్తుంటాడని, వైవస్వత మన్వంతరంలో 27 మహాయుగాలు గడచి 28 వ మహాయుగంలో కలియుగం జరుగుతూ ఉందని, ద్వాపరయుగంలో వ్యాసుడు కృష్ణద్వైపాయనుడుగా అవతరించాడని చెపుతారు. వ్యాసుడి కొడుకు శుకుడు. వ్యాసుడు భాగవతపురాణం రాసి శుకుడిచేత చదివించాడు.

వేదాలకు ఒక రకంగా వ్యాఖ్యానాలు పురాణాలు. పురాణశబ్దానికి 'పురా అపి నవం పురాణం' అని వ్యుత్పత్త్యర్థం. పాతదైనా కొత్తగా కనిపించేదే పురాణమని అర్థం. పురాణానికి ఐదు లక్షణాలున్నట్లు కింది శ్లోకం చెపుతుంది.

**'సర్గ శ్చ ప్రతిసర్గ శ్చ వంశో మన్వంతరాణి చ**
**వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్'**

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అనేవి ఆ ఐదు లక్షణాలు. కొందరు పురాణం 'దశలక్షణ లక్షితంగా' ఉంటుందన్నారు. ఆ పది లక్షణాలు సర్గం, విసర్గం, వృత్తి, రక్ష, మన్వంతరం, వంశం, వంశానుచరితం, ప్రళయం, హేతువు, అపాశ్రయం.

పద్దెనిమిది పురాణాలతో పాటు పద్దెనిమిది ఉపపురాణాలు కూడా ఉన్నాయి. సనత్కుమార, నారసింహ, నారదీయ, శివ, దౌర్వాస, కాపిల, మానవ, ఉశన, ఆరుణ, కాలిక, సాంబ, సౌర, ఆదిత్య, మహేశ్వర, దేవీభాగవత,

వాశిష్ఠ, విష్ణుధర్మోత్తర, నీలమత పురాణాలు ఉపపురాణాలు. అష్టాదశ పురాణాలను తెలుసుకోవడానికి ఉపయోగపడే శ్లోకమిది –

'భద్వయం మద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయమ్
అనాపలింగ కూస్కాని పురాణాని పృథక్ పృథక్.'

భ ద్వయం – భాగవత భవిష్యపురాణాలు

మ ద్వయం – మత్స్యమార్కండేయపురాణాలు.

బ్రత్రయం – బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండపురాణాలు.

వ చతుష్టయం – విష్ణు, వరాహ, వామన, వాయుపురాణాలు

అ – అగ్నిపురాణం; నా – నారదపురాణం; ప – పద్మపురాణం; లిం – లింగపురాణం; గ – గరుడపురాణం; కూ – కూర్మపురాణం; స్క – స్కాందపురాణం

**ఓంకారం :** సోహం అనే మాటలో సకార హకారాలు లోపిస్తే ఓం అయిందంటారు. సః అహం సోహం. వాడే నేను అంటే ఈశ్వరుడే నేను, నాకూ వాడికీ తేడా లేదని భావం, దీన్ని అనుభవానికి తెచ్చుకోడానికి 'ఓం' ను అ+ఉ+మ అనే మూడు వర్ణాలుగా విభజించారు. 'అ' అనేది జాగ్రదవస్థకూ, అందులో ఉన్న విశ్వుడనే జీవుడికీ సంకేతం. 'ఉ' అనేది స్వప్నానికీ తైజసుడికీ సంకేతం. 'మ' అనేది సుషుప్తికీ అందులోని ప్రాజ్ఞుడికీ సంకేతం. సంకేతాన్ని ఉచ్చరించేటప్పుడు ఈ అవస్థాత్రయాన్ని, అందులో బందీ అయిన జీవుడిని భావన చేసి కడపట మకారమనే నాదం ఆగిపోకుండా దాన్ని తురీయావస్థగా గుర్తించగలిగితే అప్పుడు ఈ జీవభావమంతా ఎగిరిపోయి 'జీవుడు ఈశ్వరుడే' అనే ఏకాత్మభావం అనుభవానికి వస్తుంది. కనుకనే 'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్, యః ప్రయాతి త్యజన్దేహం సయాతి పరమాం గతిమ్' (ఎవడు 'ఓం' అనే ఒకే అక్షరాన్ని ఉచ్చరిస్తూ నన్ను ఎడతెగకుండా స్మరిస్తూ శరీరాన్ని వదలుతాడో అతడు సర్వోత్తమస్థానం పొందుతాడు) అని భగవద్గీత (అక్షరపరబ్రహ్మయోగం. 13 వ శ్లోకం) బోధించింది. కాబట్టి 'ఓం' అనేది సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపమైన బీజాక్షరం. దీనికి 'ప్రణవం' అని కూడా పేరు.

**స్వరాలు** : అ కారం మొదలు ఔ కారం వరకు గల వర్ణాలు.
**స్పర్శాలు** : కవర్గ, చవర్గ, టవర్గ, తవర్గ, ప వర్గాలలోని వర్ణాలు.
**అంతస్థాలు:** య, వ, ర, ల అనే వర్ణాలు.
**ఊష్మాలు** : శ, ష, స, హ అనే వర్ణాలు

## a ≡ మార్కండేయోపాఖ్యానము a

**క. తొల్లిటి యుగమునఁదపములఁ, బల్లిదులగు ఋషుల మహిమ భాషింపఁగ రం**
**జిల్లెడు మార్కండేయుం, డుల్లంబున హరిని నిలిపి యుడుగక బ్రదికెన్. 31**

**ప్రతి :** తొల్లిటి యుగమునన్= పూర్వయుగంలో; తపములన్= తపస్సులలో; బల్లిదులు+అగు= ఉద్దండులైన; ఋషుల మహిమన్= మునుల మహిమను; భాషింపఁగన్= నుడువగా; రంజిల్లెడు= సంతోషించే; మార్కండేయుండు; ఉల్లంబునన్=

మనస్సులో; హరిని= శ్రీహరిని; నిలిపి= ఉంచి; ఉడుగక= మానక (హరిని మనస్సునందు నిలపడం మానుకోకుండా); బ్రదికెన్= జీవించాడు.

**తా :** పూర్వయుగంలో తపస్సులో ఉద్దండులైన మునుల మహిమను చెపితే సంతోషించే మార్కండేయుడు మనస్సులో ఎల్లప్పుడూ హరిని నిలుపుకొని జీవించాడు.

**వ. లోకంబులు గల్పాంతసమయంబునం గబంధమయంబులయి, యంధకారబంధురంబులయి యున్నయెడ నేకాకి యయి చరించుచు బాలార్కకోటితేజుండయిన బాలుని హృదయంబునం బ్రవేశించి యనేకసహస్రవత్సరంబులు దిరిగి వటపత్త్రశాయి యయిన య బ్బాలునిఁ గ్రమ్మఱం గనియె'నని చెప్పిన శౌనకాదులు సూతునిం గనుకొని, 'యా మునీంద్రునకు నీ ప్రభావం బెట్లు గలిగె?' నని యడిగిన నతం డిట్లనియె. 32**

**ప్రతి :** లోకంబులు= లోకాలు; కల్ప+అంత సమయంబునన్= ప్రళయకాలంలో; కబంధమయంబులు+అయి= జలమయములై; అంధకారబంధురంబులు+అయి= చీకట్లతో నిండినవై; ఉన్న+ఎడన్= ఉన్నప్పుడు; ఏకాకి+అయి= ఒంటరియై; చరించుచున్= తిరుగుతూ; బాల+అర్కకోటి= కోటి బాలసూర్యుల; తేజుండు+అయిన= తేజస్సు గలవాడైన; బాలుని= బాలకుని; హృదయంబునన్= హృదయంలో; ప్రవేశించి; అనేక సహస్ర= ఎన్నో వేల; వత్సరంబులు= సంవత్సరాలు; తిరిగి= సంచరించి; వటపత్రశాయి+అయిన= మఱ్ఱి ఆకుమీద పవళించిన; ఆ+బాలుని= ఆ పిల్లవానిని; క్రమ్మఱన్= మరల; కనియెన్+అని= చూచినాడని; చెప్పినన్= చెప్పగా; శౌనక+ఆదులు= శౌనకుడు మొదలైన మునులు; సూతునిన్+ కనుగొని= సూతమహర్షిని చూచి; ఆ ముని+ఇంద్రునకున్= ఆ మునివర్యునికి; ఈ ప్రభావంబు= ఈ మహిమ; ఎట్లు+కలిగెన్= ఎలా కలిగింది; అని+అడిగినన్= అని అడుగగా; అతండు= ఆ సూతుడు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

**తా :** కల్పం అంతమయ్యే సమయంలో అంటే ప్రళయకాలంలో లోకాలన్నీ జలమయమైపోయాయి. చీకట్లతో నిండిపోయాయి. అటువంటి సమయంలో ఒంటరివాడై తిరుగుతూ కోటి బాలసూర్యుల తేజస్సుతో ప్రకాశించే ఒక బాలుని హృదయంలో ప్రవేశించి ఎన్నో వేల సంవత్సరాలు అక్కడే సంచరించి మఱ్ఱి ఆకుమీద పవళించిన ఆ బాలుని తిరిగి చూశాడని చెప్పగా శౌనకాదిమునులు సూతమహర్షిని చూచి 'ఆ మునివర్యుడికి ఈ మహిమ ఎలా కలిగింది?' అని అడిగారు. దానికి సమాధానంగా సూతుడిలా అన్నాడు.

**విశే :** మూలంలో శౌనకాదులకు కలిగిన సందేహం స్పష్టంగా ఉంది. మార్కండేయుడు దీర్ఘాయువు గల ఋషి అని, జగత్తంతా ప్రళయంలో లయమైనప్పుడు కూడా అతడు ఉన్నాడని చెపుతారు. ఆ మహర్షి ఈ కల్పంలోనే జన్మించాడా? అలా జన్మిస్తే కల్పాంతంలో ప్రళయం జరుగుతుంది కాబట్టి ప్రళయంలో తాను మిగిలి ఉండి విశ్వాన్ని గ్రసించిన భగవానుని చెప్పడం ఎలా కుదురుతుంది? ప్రళయ సముద్రంలో సర్వేశ్వరుడు ఒక్కడే మిగిలి బాలుడుగా వటపత్రం మీద శయనించి ఉండగా మార్కండేయుడు దర్శించినట్లు చెపుతారు. ఈ కల్పంలో మార్కండేయుడు జన్మించి ఉంటే అది ఎలా సంభవిస్తుంది? ఈ ప్రశ్నలన్నీ శౌనకాదులవి (12-8-2 నుండి 5 వరకు గల శ్లోకాలు).

**క. 'భూవినుత, బ్రహ్మచర్యము, దా వదలక నిష్ఠచేతఁదథ్యము గాఁగన్**
**భావించి హరిఁదలంచుచుఁ, గోవిదనుతుఁడై మృకండు గుణముల వెలసెన్. 33**

**ప్రతి :** భూవినుత= భూజనులచేత పొగడబడేవాడా!; తాన్= తాను; బ్రహ్మచర్యము; వదలక= విడువకుండా; నిష్ఠచేతన్= నియమంతో; తథ్యము కాఁగన్= సత్యంగా; భావించి= తలపోస్తూ; హరిన్= శ్రీహరిని; తలంచుచున్= స్మరిస్తూ; మృకండు= మృకండుడు అనే ముని; కోవిదనుతుఁడు+ఐ= పండితులచే కొనియాడబడుతూ; గుణములన్= సుగుణాలతో; వెలసెన్= ప్రకాశించాడు.

**తా :** భూజనులచే కొనియాడబడే వాడా! మృకండుడు అనే ముని బ్రహ్మచర్యాన్ని విడిచిపెట్టకుండా నిజమైన నిష్ఠతో హరిని స్మరిస్తూ, పండిత స్తుతికి పాత్రం కాదగిన సుగుణాలు కలిగి ప్రకాశించాడు.

**వ. ఇట్లు దపంబు సేయ నతనికి హరిహరులు ప్రత్యక్షంబయి 'వరంబడుగు' మనిన గుణగణాఢ్యుం డయిన కుమారు నడిగిన 'నట్లకాక' యని యతండు గోరిన వరం బిచ్చి యంతర్ధానంబు నొంది; రనంతరంబ య మ్మునికి మార్కండేయుం డుదయించి నియమనిష్ఠా గరిష్ఠుడయి యుండ; మృత్యువు వానిం బాశబద్ధుంజేసిన నెదిర్చి మిత్తిని ధిక్కరించి, పదివేల హాయనంబులు తపంబు సలుప, నింద్రుండు భయంపడి య మ్మునివరుని యుగ్రతపంబు భంగపఱచుటకు దేవతాంగనలం బంప, వా రేతెంచు నెడఁబుష్పఫల భరితంబును, మత్తమధుకర శుకపికాది శకుంతారవ నిరంతర దిగంతరంబును; జాతివైర రహిత మృగపక్షికుల సంకులంబును, సారసచక్రవాక బకక్రౌంచ కారండవ కోయష్టికాది జలవిహంగమాకులిత సరోవర సహస్ర సందర్శనీయంబును నగు నా తపోవనంబున జటావల్కలధారియై హవ్యవాహనుండునుంబోలెఁదపంబు సేయు మునీంద్రునిం గని య య్యంగనలు వీణావేణు వినోదగానంబుల నలవరింప మెచ్చక ధీరోదాత్తుం డగు న మ్మునీంద్రుని గెల్వనోపక యింద్రుని కడకుం జని; రంత హరి యతని తపంబునకుఁబ్రసన్నుండై యావిర్భవించినం గనుగొని 'దేవా, నీ దివ్యనామ స్మరణంబునంజేసి యీ శరీరంబుతోడన యనేక యుగంబులు బ్రదుకునట్లుగాఁజేయవే?' యనినం గరుణించి యిచ్చుటయును. 34**

**ప్రతి :** ఇట్లు; తపంబు+చేయన్= తపస్సు చేయగా; అతనికిన్= మృకండుడికి; హరిహరులు= విష్ణువూ, శివుడూ; ప్రత్యక్షంబు+అయి= ప్రత్యక్షమై; వరంబు+అడుగుము+అనినన్= వరం కోరుకొమ్మనగా; గుణగణ+ఆఢ్యుండు+అయిన= గుణగణాల్లో గొప్పవాడైన; కుమారున్= కొడుకును; అడిగినన్= కోరగా; అట్లు+కాక+అని= అట్లే అగుగాక అని; అతండు= మృకండుడు; కోరిన; వరంబున్+ఇచ్చి= వరమిచ్చి; అంతర్ధానంబున్+ఒందిరి= అదృశ్యమయ్యారు; అనంతరంబు+అ= తరువాత; ఆ+మునికిన్= ఆ మృకండు మహర్షికి; మార్కండేయుండు; ఉదయించి= జన్మించి; నియమనిష్ఠా= నియమ నిష్ఠలలో; గరిష్ఠుండు+అయి= గొప్పవాడై; ఉండన్= ఉండగా; మృత్యువు= చావు; వానిన్= మార్కండేయుని; పాశబద్ధున్+ చేసినన్= పాశంతో కట్టివేయగా; ఎదిర్చి= ఎదిరించి; మిత్తిని= మృత్యువును; ధిక్కరించి= తృణీకరించి; పదివేల; హాయనంబులు= సంవత్సరాలు; తపంబు= తపస్సు; సలుపన్= చేయగా; ఇంద్రుండు; భయము+పడి= భీతిచెంది; ఆ+మునివరుని= ఆ మహర్షి శ్రేష్ఠుని; ఉగ్రతపంబున్= తీవ్రమైన తపస్సును; భంగపఱచుటకున్= చెడగొట్టడానికి; దేవత+అంగనలన్= దేవతా స్త్రీలను; పంపన్= పంపగా; వారు+ఏతెంచు+ఎడన్= వాళ్లు వచ్చేటప్పుడు; పుష్పఫల భరితంబును= పూలతోను, పండ్లతోను నిండినది; మత్తమధుకర= మదించిన తుమ్మెదలు; శుక పిక+ఆది= చిలుకలు, కోకిలలు మొదలైన; శకుంత+ఆరవ= పక్షుల రొదలచే; నిరంతర= ఎడతెగని; దిక్+అంతరంబును= దిక్కుల మధ్యభాగాలు

కలది; జాతివైర రహిత= పుట్టుకతో ఏర్పడే విరోధంలేని; మృగ పక్షికుల= జంతువుల పక్షుల గుంపులచే; సంకులంబును= కూడినది; సారస= హంసలు; చక్రవాక= జక్కవలు; బక= కొంగలు; క్రౌంచ= క్రౌంచాలు (ఒక జాతి కొంగలు); కారండవ= కన్నెలేడి పిట్టలు; కోయష్టిక+ఆది= చీకుకొక్కెరలు మొదలైన; జలవిహంగమ+ఆకులిత= నీటి పక్షులతో కల్లోలపరచబడిన; సరోవరసహస్ర= వేల సరస్సులచే; సందర్శనీయంబును+అగు= చూడముచ్చట గొలిపేది అయిన; ఆ తపోవనంబునన్= ఆ తపోవనంలో; జటావల్కలధారి+ఐ= జడలు, నారచీరలు ధరించినవాడై; హవ్యవాహనుండున్+ పోలెన్= అగ్నిదేవుడా అన్నట్లు; తపంబున్+చేయు= తపస్సు చేసే; ముని+ఇంద్రున్+కని= మునీశ్వరుడిని చూచి; ఆ+అంగనలు= ఆ దేవతాస్త్రీలు (అప్సరసలు); వీణావేణువినోదగానంబులన్= వీణావాదనం, వేణుగానాలతో కూడిన వినోదాన్ని కలిగించే పాటలతో; అలవరింపన్= వశపరచుకొనే ప్రయత్నం చేయగా; మెచ్చక= అంగీకరించక; ధీరోదాత్తుండు+అగు= ధీరోదాత్తుడైన; ఆ+ముని+ఇంద్రుని; గెల్వన్+ఓపక= జయించలేక; ఇంద్రుని కడకున్= ఇంద్రుని చెంతకు; చనిరి= వెళ్లారు; అంతన్= తరువాత; హరి= శ్రీహరి; అతని తపంబునకున్= అతని తపస్సుకు; ప్రసన్నుండు+ఐ= ప్రసన్నుడై; ఆవిర్భవించినన్= ప్రత్యక్షంకాగా; కనుగొని= చూచి; దేవా!; నీ దివ్యనామస్మరణంబునన్+చేసి= పవిత్రమైన నీ నామాన్ని స్మరించడం చేత; ఈ శరీరంబు తోడన్+అ= ఈ శరీరంతోనే; అనేక యుగంబులు; బ్రదుకునట్లు+కాన్= బతికేటట్లు; చేయవు+ఏ= చేయుము; అనినన్= అనగా; కరుణించి= దయతో చూచి; ఇచ్చుటయును= ఇవ్వగా....

**తా :** ఇలా తపస్సుచేసే మృకండుమహర్షికి హరిహరులు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నారు. మహర్షి సద్గుణసంపన్నుడైన కొడుకును కోరుకొన్నాడు. హరిహరులు కోరిన వరం ప్రసాదించి అదృశ్యమయ్యారు. తరువాత ఆ మహర్షికి మార్కండేయుడు జన్మించి నియమనిష్ఠలు పాటిస్తూ గరిష్ఠుడై ఉండగా మృత్యువు అతనిని పాశంతో కట్టివేసింది. మార్కండేయుడు మృత్యువును తిరస్కరించి పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఇంద్రుడు భయపడి అతని తపస్సును చెడగొట్టడానికి దేవతాస్త్రీలను (అప్సరసలను) పంపాడు. వాళ్లు మార్కండేయుడు తపస్సు చేస్తున్న తపోవనానికి వచ్చునప్పటికి ఆ వనం పూలతోను, పండ్లతోనూ నిండి ఉంది. మదించిన తుమ్మెదలు, చిలుకలు, గోరువంకలు మొదలైన పక్షుల రొదలతో ఆ వనంలోని దిక్కుల మధ్యభాగాలు నిండిపోయాయి. జాతివైరం విడిచి అన్యోన్య సామరస్యంతో మృగాలు, పక్షులు సందడి చేస్తున్నాయి. హంసలు, జక్కవలు, కొంగలు, క్రౌంచాలు, కన్నెలేడి పిట్టలు, చీకు కొక్కెరలు మొదలైన నీటి పక్షులతో నిండిన వేలకొలది సరస్సులతో ఆ వనం చూడముచ్చటగా ఉంది. అలాంటి తపోవనంలో మార్కండేయమహర్షి జడలు, నారచీరలు ధరించి అగ్నిదేవుడో అన్నట్లు తపస్సు చేస్తున్నాడు. ఆ మహర్షిని చూచి ఆ దేవకాంతలు (అప్సరసలు) వీణానాదంతోను, వేణుగానంతోను వినోదంగా పాటలు పాడి అతనిని వశపరచుకొనే ప్రయత్నం చేశారు. కాని వాటికి ధీరోదాత్తుడైన మహర్షి లొంగలేదు. ఆయనను గెలువలేక వాళ్లు ఇంద్రునికడకు వెళ్లిపోయారు. తరువాత శ్రీహరి అతని తపస్సుకు మెచ్చి ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యాడు. “దేవా! నీ దివ్యనామస్మరణంతో ఈ శరీరంతోనే అనేక యుగాలు జీవించి ఉండేటట్లు వరం ప్రసాదించవా” అని మహర్షి ప్రార్థించాడు. విష్ణువు దయతో ఆ వరం ప్రసాదించాడు.

**విశే :** ధీరోదాత్తుడు= ధీరత్వం, ఉదాత్తత్వం గల నాయకుడు. కావ్యనాయకులు ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీరశాంతుడు అని నాలుగు రకాలవారున్నారు. మార్కండేయమహర్షి ఈ రకం వాడు కాదు. తపో విషయంలో ధీరత్వాన్ని ప్రదర్శించినవాడు. ‘ధీర’ అనే శబ్దానికి మంచిబుద్ధిని నిగ్రహించువాడని (ప్రశస్తాం ధియం రాతీతి ధీరః) అర్థం. తపస్సు చేయాలనే తన బుద్ధిని అప్సర స్త్రీల విలాసాలకు కూడా చలించనీయకుండా దృఢంగా ఉండడం వల్లనే శ్రీహరి నుండి వరం పొందగలిగాడు. కాబట్టి మహర్షి విషయంలో మనస్సును చలనానికి లోనుకానీకుండా స్థిరంగా ఉంచుకోవడమే ధీరత్వం.

**తే. జగము రక్షింప జీవులcజంప మనుపc, గర్తవై సర్వమయుcడవై కానిపింతు**
**వెచట నీ మాయcదెలియంగ నెవ్వcడోపు?, విశ్వసన్నుత! విశ్వేశ! వేదరూప! 35**

**ప్రతి :** విశ్వసన్నుత= జగద్వినుతా! విశ్వ+ఈశ= జగన్నాథా!; వేదరూప= మూర్తీభవించిన వేదమా!; జగమున్= జగత్తును; రక్షింపన్= కాపాడడానికి; చంపన్= నశింపజేయడానికి; మనుపన్= పోషించడానికి; కర్తవు+ఐ= చేసేవాడవై; సర్వమయుc డవు+ఐ= సర్వాత్ముడవై; కానిపింతువు= కనిపిస్తావు; ఎచటన్= ఎక్కడా; నీ మాయన్= నీ మాయను; తెలియంగన్= తెలుసుకోడానికి; ఎవ్వcడు+ఓపున్= ఎవడికి సాధ్యమవుతుంది?

**తా :** జగద్వినుతా! జగత్పతీ! వేదరూపా! లోకాన్ని (లోకంలోని ప్రాణులను) రక్షించడానికి, చంపడానికి, పోషించడానికి కర్తవై సర్వాత్ముడవై కనిపిస్తావు. నీ మాయను తెలుసుకోవడం ఎక్కడా ఎవరికీ సాధ్యం కాదు.

**మ. బలభిన్ముఖ్య దిశాధినాథవరులున్ ఫాలాక్షబ్రహ్మాదులున్**
**జలజాతాక్ష పురందరాది సురులుం జర్చించి నీ మాయలం**
**దెలియన్ లేరcట ! నా వశంబె తెలియన్? దీనార్తి నిర్మూల! యు**
**జ్జ్వల పంకేరుహపత్ర లోచన! గదాచక్రాంబుజాద్యంకితా!' 36**

**ప్రతి :** దీన+ఆర్తి= దీనుల దుఃఖాన్ని; నిర్మూల= పోగొట్టేవాడా!; ఉజ్జ్వల= ప్రకాశమానమైన; పంకేరుహపత్రలోచన= తామర రేకులవంటి నేత్రాలు కలవాడా!; గదా చక్ర అంబుజ+ఆది+అంకితా!= గద, చక్రం, పద్మం మొదలైన చిహ్నాలు కలవాడా!; బలభిత్+ముఖ్య= ఇంద్రాది ముఖ్యులైన; దిశా+అధినాథ వరులున్= దిక్పతి శ్రేష్ఠులు; ఫాల+అక్ష= ముక్కంటి; బ్రహ్మ+ఆదులున్= బ్రహ్మ మొదలైన వాళ్లు; జలజాత+అక్ష= కమలనేత్రా!; పురందర+ఆది సురులున్= ఇంద్రాదులైన దేవతలు; చర్చించి= విచారణచేసి; నీ మాయలన్= నీ మాయలను; తెలియన్ లేరు+అcట= తెలుసుకోజాలరట; తెలియన్= తెలుసుకోవడం; నా వశంబె= నా తరమా?

**తా :** దీనుల దుఃఖాన్ని నిర్మూలించేవాడా! ప్రకాశవంతమైన తామరరేకులవంటి కన్నులు కలవాడా! గద (కౌమోదకి), చక్రం (సుదర్శనం), పద్మం మొదలైన వాటిని ధరించిన వాడా! ఇంద్రాది ప్రముఖ దిక్పతులూ, ముక్కంటి, బ్రహ్మాదులూ, ఇంద్రాది దేవతలు విచారణచేసి నీ మాయలను తెలుసుకోలేరట. జలజాతాక్షా! ఇక తెలుసుకోవడం నాకు సాధ్యమా?

**విశే :** బలభిత్ – బలుడనే రాక్షసుని సంహరించినవాడు – ఇంద్రుడు. దిక్కులు ఎనిమిది. ఈ ఎనిమిది దిక్కులకు అధిపతులున్నారు. వాళ్లే దిక్పాలకులు. తూర్పుకు ఇంద్రుడు; ఆగ్నేయానికి అగ్ని; దక్షిణానికి యముడు; నైఋతికి నిఋతి; పడమరకు వరుణుడు; వాయవ్యానికి వాయుదేవుడు; ఉత్తరానికి కుబేరుడు; ఈశాన్యానికి ఈశానుడు దిక్పాలకులు. పురందరుడు అంటే ఇంద్రుడు. శత్రువులపురాలను నశింపజేసినవాడని వ్యుత్పత్త్యర్థం (పురాణి అరీణాం దారయతీతి పురందరః). అంబుజం అంటే పద్మం. శ్రీమన్నారాయణుడు ఒకచేతిలో పద్మం కూడా ధరించి ఉంటాడు.

**వ. అని వినుతించి 'దేవా, నీ మాయం జేసి జగంబు భ్రాంతంబై యున్న యది! యిది దెలియ నానతీ వలయు' నని యడిగిన నతండు నెఱింగించి చనియె, మునియును శివపూజ సేయుచు హరిస్మరణంబు సేయ మఱచి శతవర్షంబులు ధారాధరంబులు ధారావర్షంబుచే ధరాతలంబు నింప, జలమయంబై యంధకార బంధురంబైన, నంత నా తిమిరంబునం గన్ను గానక భయంపడి యున్నయెడ నా జలమధ్యంబున నొక**

**వటపత్త్రంబునం బద్మరాగకిరణపుంజంబులు రంజిల్లు పాదపద్మంబులు గల బాలునిం గని, మ్రొక్కి యతని శరీరంబు ప్రవేశించి, యనేకకాలం బనంతంబగు జఠరాంతరంబునం దిరిగి; యతని చరణారవింద సంస్మరణంబు సేసి, వెలువడి కౌఁగిలింపం బోయిన మాయఁగైకొని యంతర్ధానంబు నొంద;మునియు నెప్పటియట్ల స్వాశ్రమంబు సేరి తపంబు సేయుచున్న సమయంబున. 37**

**ప్రతి :** అని; వినుతించి= స్తుతించి; దేవా! నీమాయన్+చేసి= నీమాయచేత; జగంబు= లోకం; భ్రాంతంబు+ఐ= భ్రాంతిపొంది; ఉన్న+అది= ఉంది; ఇది; తెలియన్+ఆనతి+ఈన్+వలయున్= తెలిసేటట్లు చెప్పాలి. అని; అడిగినన్= అడుగగా; అతండున్= శ్రీమన్నారాయణుడు; ఎఱింగించి= తెలిపి; చనియెన్= వెళ్లాడు; మునియును= మార్కండేయమహర్షికూడా; శివపూజ+చేయుచున్= శివపూజ చేస్తూ; హరిస్మరణంబు+చేయన్= హరినామస్మరణ చేయడం; మఱచి= మరచిపోయి; శతవర్షంబు= నూరేండ్లు; ధారాధరంబులు= మేఘాలు; ధారావర్షంబుచేన్= ధారాపాత వర్షంతో; ధరాతలంబున్= ధాత్రిని; నింపన్= నింపివేయగా; జలమయంబు+ఐ= నీటితో నిండినదై; అంధకారబంధురంబు+ఐనన్= దట్టమైన చీకటి వ్యాపించగా; అంతన్; ఆ తిమిరంబునన్= ఆ చీకటిలో; కన్ను+కానక= కండ్లు కనిపించక; భయము+పడి= భయపడి; ఉన్న+ఎడన్= ఉన్నప్పుడు; ఆ జలమధ్యంబునన్= ఆ నీటిమధ్యలో; ఒక; వటపత్త్రంబునన్= మఱ్ఱి ఆకుమీద; పద్మరాగ= పద్మరాగమణి (కెంపు); కిరణ పుంజంబులు= కిరణ సమూహాలు; రంజిల్లు= భాసించే; పాదపద్మంబులు= పాదపద్మాలు; కల; బాలునిన్+కని= బాలకుని చూచి; మ్రొక్కి= నమస్కరించి; అతని శరీరంబు ప్రవేశించి= ఆ బాలకుని శరీరంలో చొచ్చుకొని పోయి; అనేక కాలంబు= ఎంతోకాలం; అనంతంబు+అగు= అంతు తెలియనిదైన; జఠర+అంతరంబునన్= కడుపులోపలే; తిరిగి= సంచరించి; అతని= ఆ బాలకుని; చరణ+అరవింద= పాదపద్మాలను; సంస్మరణంబు+చేసి= స్మరణం చేసి; వెలువడి= బయటకు వచ్చి; కౌఁగిలింపన్+పోయినన్= కౌగలించుకోబోగా; మాయన్+కైకొని= మాయను ధరించి; అంతర్ధానంబున్+ ఒందన్= అదృశ్యం కాగా; మునియున్= మునికూడా; ఎప్పటి+అట్లు+అ= యథాపూర్వంగానే; స్వ+ఆశ్రమంబు= తన ఆశ్రమం; చేరి= ప్రవేశించి; తపంబున్= తపస్సును; చేయుచున్+ఉన్న= చేస్తూ ఉన్న; సమయంబునన్= సమయంలో.

**తా :** అని (మార్కండేయమహర్షి) స్తుతించి 'దేవా! నీ మాయ చేతనే లోకం భ్రాంతి పొంది ఉన్నది. దీనిని గురించి స్పష్టంగా నాకు తెలియజేయి' అని అడిగాడు. విష్ణువు ఆ విషయం తెలియజేసి వెళ్లిపోయాడు. మార్కండేయమహర్షి కూడా శివపూజ చేస్తూ హరిని స్మరించడం మరచిపోయాడు. నూరు సంవత్సరాలు మేఘాలు ధారాపాతంగా వర్షం కురిసి ధాత్రిని నింపివేశాయి. ధాత్రి జలమయం కావడమే కాక దట్టమైన చీకటితో నిండిపోయింది. ఆ చీకటిలో కళ్లు కనిపించక భయపడి ఉన్న సమయంలో ఆ జలమధ్యంలో మఱ్ఱి ఆకుమీద పద్మరాగమణి కిరణాలతో ప్రకాశించే పాదపద్మాలు గల ఒక బాలకుని చూచి నమస్కరించి, అతని శరీరంలో దూరి ఎంతోకాలం అంతు తెలియని అతని కడుపులోనే సంచరించి, అతని పాదపద్మాలను స్మరిస్తూ బయటకు వచ్చి, కౌగిలించుకోబోగా అతడు అదృశ్యమయ్యాడు. మార్కండేయమహర్షి యథాపూర్వకంగానే తన ఆశ్రమంలో ప్రవేశించి తపస్సు చేస్తున్న సమయంలో

**చ. నిలిచిన శంకరుం గనియు నిత్యసుఖంబుల నిచ్చు గౌరి యి**
**మ్ముల 'హర, భూతిభూషణ సముజ్జ్వలగాత్రునిఁ గంటె, యెంతయున్**
**వలనుగ వానితోడ నొక వాటపు మాటను బల్కఁగాఁ దగున్**
**సలలితమైన యీ తపసి జాడ వినం గడు వేడ్క యయ్యెడిన్. 38**

**ప్రతి :** నిత్య సుఖంబులన్= శాశ్వత సౌఖ్యాలను; ఇచ్చుగౌరి= ఇచ్చేపార్వతి; నిలిచిన= ఆగిన; శంకరున్= శివుని; కనియున్= చూచి; ఇమ్ములన్= సంతోషంతో; హర= ఈశ్వరా!; భూతిభూషణ= విబూది అలంకారంగా గల; సముజ్జ్వల= మిక్కిలి ప్రకాశించే; గాత్రునిన్= శరీరం కలవానిని; కంటె= చూచితివా? ఎంతయున్ వలను గన్= మిక్కిలి నేర్పుతో; వానితోడన్= ఆ మహర్షితో; ఒక వాటపు మాటను= ఒక చక్కని మాటను; పల్కన్+కాన్+తగున్= పలకడం బాగుంటుంది; సలలితము+ఐన= మనోహరమైన; ఈ తపసి జాడ= ఈ మునిచందం; వినన్= వినడానికి; కడున్= మిక్కిలి, వేడ్క+ అయ్యెడిన్= కుతూహలం కలుగుతూ ఉంది.

**తా :** శాశ్వత సౌఖ్యాలను ప్రసాదించే పార్వతి ఆగిన ఈశ్వరుడిని చూచి సంతోషంతో 'పరమేశ్వరా! విబూదిచే అలంకరింపబడి ప్రకాశించే శరీరం కల ఇతనిని చూచితివా? అతనితో ఒక మంచి మాటను పలకడం బాగుంటుంది. ఈ మహర్షి చందం వినాలని కుతూహలం కలుగుతూ ఉంది.

**వ. అనిన శంకరుండును శాంకరీసమేతుండయి నభంబున నుండి ధరణీతలంబునకు నేతెంచి యితరంబు గానక యేకాగ్రచిత్తుండగు నమ్మునిం గని తన దివ్యయోగమాయా ప్రభావంబుచేత నతని హృదయంబునం బ్రవేశించి చతుర్బాహుండును, విభూతి రుద్రాక్ష మాలికాధరుండును, త్రిశూల దమరుకాది దివ్య సాధన సమేతుండును, వృషభవాహనారూఢుండును, నుమాసమేతుండునై తన స్వరూపంబు గనంబఱిచిన విస్మయంబు నొంది యమ్ముని యా పరమేశ్వరు ననేక ప్రకారంబుల స్తుతియించిన నప్పు డమ్ముని తపః ప్రభావంబునకు మెచ్చి 'మహాత్మా' పరమశైవుండ' వని పరమేశ్వరుం డానతిచ్చిన మార్కండేయుండును శంకరు నిరీక్షించి, దేవా హరిమాయాప్రభావంబు దుర్లభం; బయ్యది భవత్సందర్శనంబునం గంటి; నింతియ చాలు; నైన నొక్క వరంబు గోరెద; నారాయణ చరణాంబుజధ్యానంబును, మృత్యుంజయంబునుం గలుగునట్లుగాఁగృపసేయవే?" యని ప్రార్థించినఁ గృపాసముద్రుండై 'యట్లకాక' యని జరారోగవికృతులు లేక కల్పకోటి పర్యంతంబు నాయువుం, బురుషోత్తముని యనుగ్రహంబుఁ గలుగు'నని యానతిచ్చి య మ్మహాదేవుం డంతర్ధానంబు నొందె' నని చెప్పి యీ మార్కండేయోపాఖ్యానంబు వ్రాసిన వినినం జదివినను మృత్యువు దొలంగు నని మఱియు నిట్లనియె; హరిపరాయణుండగు భాగవతుండు దేవతాంతర మంత్రాంతర సాధనాంతరంబులు వర్జించి, దుర్జనులం గూడక నిరంతరము నారాయణ గోవిందాది నామస్మరణంబు సేయుచు నుండెనేని నట్టి పుణ్యపురుషుండు వైకుంఠంబున వసియించు; మఱియు హరి విశ్వరూపంబును జతుర్విధ వ్యూహభేదంబును, జతుర్మూర్తులును, లీలావతారంబులును జెప్పు నగోచరంబు లనిన శౌనకుం డిట్లనియె. 39**

**ప్రతి :** అనినన్; శంకరుండును= శివుడును; శాంకరీ సమేతుండు+అయి= పార్వతీ సహితుడై; నభంబుననుండి= ఆకాశం నుండి; ధరణీతలంబునకున్= భూమి మీదికి; ఏతెంచి= వచ్చి; ఇతరంబు+కానక= దేనినీ చూడకుండా; ఏక+అగ్ర చిత్తుండు+అగు= ఒకదానియందే లగ్నమైన మనస్సు కలవాడగు; ఆ+మునిన్+కని= ఆ మార్కండేయమహర్షిని చూచి; తన= తనయొక్క; దివ్యయోగమాయా= దివ్యమైన యోగమాయ; ప్రభావంబు చేతన్= మహిమచేత; అతని= ఆ మహర్షి; హృదయంబునన్= మనస్సులో; ప్రవేశించి= చొచ్చి; చతుర్ బాహుండును= నాలుగుచేతులు కలవాడును; విభూతి రుద్రాక్ష మాలికా ధరుండును= విబూది, రుద్రాక్షమాల ధరించిన వాడును; త్రిశూల; దమరుక+ఆది= దమరుకం మొదలైన;

దివ్య= దివ్యమైన; సాధన సమేతుండును= సాధనాలతో కూడినవాడును; వృషభవాహన+ఆరూఢుండును= ఎద్దు వాహనాన్ని ఎక్కిన వాడును; ఉమాసమేతుండును+ఐ= పార్వతీ సహితుడును అయి; తన స్వరూపంబు= తన రూపం; కనన్+పఱచినన్= చూపించగా; విస్మయంబున్+ఒంది= ఆశ్చర్యం పొంది; ఆ+ముని; ఆ పరమ+ఈశ్వరున్= ఆ మహేశ్వరుని; అనేక ప్రకారంబులన్= బహువిధాలుగా; స్తుతియించినన్= స్తోత్రం చేయగా; అప్పుడు; ఆ+ముని= ఆ మహర్షి; తపస్+ప్రభావంబునకున్= తపోమహిమకు; మెచ్చి= సంతసించి; మహాత్మా; పరమశైవుండవు+అని= గొప్ప శైవుడవని; పరమ+ఈశ్వరుండు; ఆనతి+ఇచ్చినన్= పలుకగా; మార్కండేయుండును; శంకరున్= ఈశ్వరుని; నిరీక్షించి= చూచి; దేవా; హరిమాయా ప్రభావంబు= విష్ణుమాయా మహిమ; దుర్లభంబు= లభించేదికాదు; ఆ+అది= ఆ మహిమ; భవత్+సందర్శనంబునన్= నీ దర్శనం చేత; కంటిన్= చూశాను (తెలుసుకోగలిగాను); ఇంతి+అ చాలున్= ఇదియే చాలు; ఐనన్= అయినా; ఒక్క వరంబు+కోరెదన్= ఒక వరం కోరుతాను; నారాయణ; చరణ+అంబుజ= పాదపద్మాల; ధ్యానంబును= ధ్యానమూ; మృత్యుంజయంబునున్= మృత్యువును గెలవడమూ; కలుగునట్లు+కాన్= కలిగేటట్లు; కృప+చేయవు+ఏ= అనుగ్రహింపవా; అని; ప్రార్థించినన్= ప్రార్థించగా; కృపాసముద్రుండు+ఐ= దయాసముద్రుడై; అట్లు+ఆ కాక= అట్లే అగుగాక; అని; జరారోగ వికృతులు= ముసలితనం, వ్యాధి అనే వికారాలు; లేక= లేకుండా; కల్పకోటి పర్యంతంబు= కోటి కల్పాలదాకా; ఆయువున్= ఆయుష్షును; పురుష+ఉత్తముని= విష్ణువుయొక్క; అనుగ్రహంబును= అనుగ్రహం; కలుగున్+అని= కలుగుతాయని; ఆనతిచ్చి= చెప్పి; ఆ+మహాదేవుండు= ఆ పరమేశ్వరుడు; అంతర్ధానంబున్+ఒందెన్= అదృశ్యమయ్యాడు; అనిచెప్పి; ఆ మార్కండేయ+ ఉపాఖ్యానంబు; వ్రాసినన్= రాసిన; వినినన్= వినినా; చదివినను= చదివినా; మృత్యువు= చావు; తొలంగును+అని= తొలగి పోతుందని; మఱియున్; ఇట్లు+అనియెన్; హరిపరాయణుండు+అగు= విష్ణుపరుడైన; భాగవతుండు; దేవతా+అంతర= ఇతర దేవతలను గాని; మంత్ర+అంతర= ఇతర మంత్రాలనుగాని; సాధన+అంతరంబులు= ఇతరసాధనాలనుగాని; వర్జించి= విడిచి; దుర్జనులన్+ కూడక= దుష్టులను కలవకుండా; నిరంతరము= ఎప్పుడూ; నారాయణ; గోవింద+ఆది= గోవింద మొదలైన; నామస్మరణంబు; చేయుచున్= చేస్తూ; ఉండెన్+ఏనిన్= ఉన్నవాడయితే; అట్టి; పుణ్యపురుషుండు= పుణ్యాత్ముడు; వైకుంఠంబునన్= వైకుంఠంలో; వసియించున్= నివసిస్తాడు; మఱియున్; హరి విశ్వరూపంబును= విష్ణువు విశ్వరూపాన్నీ; చతుర్విధ= నాలుగు విధాలైన; వ్యూహభేదంబును= వ్యూహ భేదాలను; చతుస్+మూర్తులను= నాలుగు విధాలైన మూర్తులను; లీలా+అవతారంబులును= లీలలతో కూడిన అవతారాలను; చెప్పన్= చెప్పడానికి; అగోచరంబులు= సాధ్యం కావు; అనినన్; శౌనకుండు; ఇట్లు= అనియెన్.

**తా :** పార్వతి చెప్పిన మాట విని ఈశ్వరుడు పార్వతితో పాటు ఆకాశం నుండి భూమి మీదికి వచ్చాడు. ఏకాగ్రచిత్తంతో దేని మీదా ధ్యాసలేకుండా ఉన్న మార్కండేయమహర్షిని చూచి ఈశ్వరుడు తన దివ్యమైన యోగమాయామహిమతో అతని హృదయంలో ప్రవేశించాడు. నాలుగుచేతులు కలిగి, విబూది రుద్రాక్షమాల ధరించి, త్రిశూలం, డమరుకం మొదలైన దివ్యసాధనాలతో కూడుకొని పార్వతితోపాటుగా వృషభవాహనాన్ని అధిరోహించి ఆ ముని ముందు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడా ముని ఆశ్చర్యపోయి శివుని అనేకవిధాలుగా స్తుతించాడు. ఆ ముని తపోమహిమను మెచ్చుకొని శివుడు 'మహాత్మా! నీవు పరమశైవుడవు' అని ప్రశంసించాడు. మార్కండేయుడు శివుని చూచి 'దేవా! విష్ణుమాయా ప్రభావం దుర్లభమైంది. కాని నీ దర్శనంచేత దానిని తెలుసుకొన్నాను. ఇది చాలు. ఐనా ఒక వరం కోరుకొంటాను. విష్ణుపాదపద్మాల ధ్యానం, మృత్యువును జయించడం కలిగేటట్లు అనుగ్రహించు' అని ప్రార్థించాడు. శివుడు దయాసముద్రుడు కాబట్టి అట్లేనని వృద్ధాప్యం, వ్యాధి మొదలైన వికారాలు లేకుండా కోటి కల్పాలదాకా ఆయుర్దాయం, విష్ణ్వనుగ్రహం కలుగుతాయని చెప్పి అదృశ్యమయ్యాడు. ఈ మార్కండేయోపాఖ్యానం రాసినా, విన్నా, చదివినా మృత్యువు తొలగిపోతుందని చెప్పి ఇంకా

ఇలా అన్నాడు. విష్ణుభక్తుడైన భాగవతుడు ఇతర దేవతలనుగాని, ఇతర మంత్రాలనుగాని, ఇతర సాధనలనుగాని పూర్తిగా విడిచిపెట్టి, దుష్టులతో కలవకుండా, ఎల్లప్పుడూ నారాయణ, గోవింద మొదలైన భగవన్నామాలను స్మరిస్తూ ఉన్నట్లయితే అట్టి పుణ్యాత్ముడు వైకుంఠంలో నివసిస్తాడు. హరి విశ్వరూపాన్ని, నాలుగు విధాలైన వ్యూహాలను, నాలుగు మూర్తులను, లీలావతారాలను గురించి చెప్పడం సాధ్యం కాదు" అని సూతుడు చెప్పగా శౌనకుడు ఇలా అన్నాడు.

**విశే : యోగమాయ :** యోగులకు మాత్రమే వశమైన మాయ. కామరూపాది మహిమలు ప్రదర్శించగల మాయ. శ్రీకృష్ణావతార ఘట్టంలో కంసుడు దేవకి చేతులనుండి లాక్కొని నేలమీదికి విసరి కొట్టినపుడు కింద పడకుండా ఆకాశంలోకి ఎగిరి ఎనిమిది చేతులతో దర్శనం ఇచ్చింది యోగమాయ.

**విశ్వరూపం :** శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రకారం సమస్త విశ్వం (జగత్తు) శ్రీమన్నారాయణుని శరీరం. విశ్వమంతా ఆయన శరీరం కాబట్టి ఆయన విశ్వరూపుడు. ఆయనది విశ్వరూపం. భగవానుడు అర్జునుడికి తన విశ్వరూపాన్ని చూపించాడు. ఆ విషయం భగవద్గీత విశ్వరూపసందర్శనయోగంలో విస్తరంగా ఉంది.

**'పశ్య మే పార్థ రూపాణి శతశో ఽథ సహస్రశః**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ' (11-5)**

'అర్జునా! అనేక విధాలుగా ఉన్నవి. అలౌకికమైనవి, వివిధ వర్ణాలు ఆకారాలు కలవి, అసంఖ్యాకంగా వర్తించేవి అయిన నా రూపాలను చూడు' అన్నాడు భగవానుడు. అంటే సమస్త సృష్టి తనలోనే ఉన్నదని చెపుతూ ఆ సృష్టి విస్తృతిని ప్రదర్శించాడని భావం. అదే విశ్వరూపమంటే.

**వ్యూహభేదాలు :** జగదుత్పత్తి స్థితి ప్రళయార్థం ఏర్పడిన సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, వాసుదేవ రూపాలు చతుర్విధ వ్యూహాలు.

**చతుర్మూర్తులు :** ఇవి అర్చా విగ్రహాలు. ఇవి నాలుగు. స్వయం వ్యక్త విగ్రహం, దేవతలు ప్రతిష్ఠించిన శిలాదారు లోహాది విగ్రహం, మహర్షులు ప్రతిష్ఠించిన శిలాదారు లోహాది విగ్రహం, మానవులు ప్రతిష్ఠించిన శిలాదారు లోహాది విగ్రహం **లీలావతారం.** భగవంతుడు చేసే సృష్టి ఆయనకొక లీల. లీల అంటే క్రీడ లేక వినోదం. తాను సృష్టించిన జగత్తులో తానూ సాక్షీభూతుడుగా ఉంటూ వినోదించేది లీలావతారం.

**క. హరికథలు హరిచరిత్రము, హరిలీలావర్తనములు నంచితరీతిం**
**బరువడి నెఱిఁగితి మంతయుఁ, సురనుత! యనుమాన మొకటి సొప్పడెడి మదిన్. 40**

**ప్రతి :** సురనుత!= దేవతలచేత పొగడబడేవాడా!; హరికథలున్= విష్ణువు కథలూ; హరిచరిత్రము= విష్ణువుచరిత్రా; హరి లీలావర్తనములున్= విష్ణువులీలలూ, నడవడులూ; అంచితరీతిన్= తగిన విధంగా; పరువడిన్= క్రమంగా; అంతయున్= పూర్తిగా; ఎఱిఁగితిమి= తెలుసుకున్నాము; అనుమానము+ఒకటి= ఒక అనుమానం; మదిన్= మనస్సులో; చొప్పడెడిన్= కలిగింది.

**తా :** దేవతలచే స్తుతింపబడేవాడా! సూతా! విష్ణుకథలు, విష్ణుచరిత్ర, విష్ణులీలలూ, నడవడులూ చక్కగా పూర్తిగా తెలుసుకున్నాము. ఒక అనుమానం మాత్రం మనస్సులో మెదలుతూ ఉంది.

## a ─ చైత్రాదిమాసంబుల సంచరించెడు ద్వాదశాదిత్యుల క్రమంబును దెలుపుట a

**వ. అది యెయ్యది యనిన లోకచక్షువు చైత్రమాసంబు మొదలుగా నేయే మాసంబున నేయే నామంబునం బ్రవర్తించుం; జెప్పవే?" యని యడిగినఁ 'జైత్రంబుననుండి చైత్రాది ద్వాదశమాసంబుల సౌరగణసప్తకం బీశ్వర నియుక్తంబై నానాప్రకారంబుల సంచరించు; నా క్రమంబు దొల్లి శుకుండు విష్ణురాతునికిఁదెలిపిన చందంబునం జెప్పెద'నని సూతుం డిట్లనియె. 'శ్రీమన్నారాయణస్వరూపుండగు మార్తాండుం డేకస్వరూపుం డైన, నతనిం గాల దేశ క్రియాది గుణములంబట్టి ఋషు లనేకక్రమంబుల నభివర్ణించి భావించు చున్నవా రా ప్రకారం బెట్లనినఁ జైత్రంబున సూర్యుండు ధాత యను నామంబు దాల్చి కృతస్థలి హేతి వాసుకి రథకృత్తు పులస్త్యుండు తుంబురుండు ననెడు పరిజనులతోఁ జేరికొని సంచరించు; వైశాఖంబున నర్యముం డను పేరు వహించి పులహుం డోజుండు ప్రహేతి పుంజికస్థలి నారదుండు కంజనీరుం డను ననుచర సహితుండై కాలంబు గడుపుచుండు; జ్యేష్ఠంబున మిత్రాభిధానంబున నత్రి పౌరుషేయుండు; తక్షకుండు మేనక హాహా రథస్వనుం డను పరిజనులతోడం జేరి వర్తించుచుండు; నాషాఢంబున వరుణుం డను నాహ్వాయంబు నొంది వసిష్ఠుండు రంభ సహజన్యుండు హూహువు శుక్రుండు చిత్రస్వనుండను సహచర సహితుండై కాలక్షేపణంబు సేయుచుండు; శ్రావణంబున నింద్రుండను నామంబుచే వ్యవహృతుండై విశ్వావసువు శ్రోత యేలాపుత్త్రుం డంగిరసుండు ప్రమ్లోచ చర్యుండను సభ్యులతోఁజేరి కాలంబు గడుపుచుండు; భాద్రపదంబున వివస్వంతుండను నామంబు దాల్చి యుగ్రసేనుండు వ్యాఘ్రుం డాసారణుండు భృగు వనుమ్లోచ శంఖపాలుండు లోనుగాఁగల పరిజనులతో నావృతుండై కాలయాపనంబు సేయుచునుండు.** **41**

**ప్రతి :** అది; ఏ+అది+అనినన్= ఏమిటంటే; లోకచక్షువు= జగానికి కన్ను అయిన సూర్యుడు; చైత్రమాసంబు; మొదలు+కాన్= మొదలుకొని; ఏ+ఏ మాసంబునన్= ఏయే నెలలో; ఏ+ఏ నామమంబునన్= ఏయే పేరుతో; ప్రవర్తించున్= సంచరిస్తాడు; చెప్పవు+ఏ= చెప్పవా; అని అడిగినన్; చైత్రంబున నుండి= చైత్రమాసం నుండి; చైత్ర+ఆది ద్వాదశ మాసంబులన్= చైత్రం మొదలుకొని పన్నెండు నెలలలో; సౌరగణ సప్తకంబు= ఏడు సూర్యగణాలు (సూర్యసంబంధమైన ఏడు సమూహాలు); ఈశ్వర నియుక్తంబు+ఐ= భగవంతునిచే నియోగింపబడి; నానాప్రకారంబులన్= అనేక విధాలుగా; సంచరించున్= సంచరిస్తాయి; ఆ క్రమంబున్= ఆ వరుసను; తొల్లి= మొదట; శుకుండు; విష్ణురాతునికిన్= విష్ణురాతునికి; తెలిపిన చందంబునన్= చెప్పిన విధంగా; చెప్పెదన్+అని= చెప్పెదనని; సూతుండు; ఇట్లు+అనియెన్; శ్రీమత్+నారాయణ స్వరూపుండు+అగు= శ్రీమన్నారాయణ స్వరూపుడైన; మార్తాండుండు= సూర్యుడు; ఏకస్వరూపుండు+ఐనన్= ఒకే రూపం కలవాడైనప్పటికి; అతనిన్= ఆ సూర్యుని; కాలదేశ క్రియ+ఆది= కాలం దేశం, క్రియ మొదలైన వాటి; గుణములన్+ పట్టి= గుణాలను అనుసరించి; ఋషులు; అనేక క్రమంబులన్= పెక్కు విధాలుగా; అభివర్ణించి= వివరించి; భావించుచున్+ఉన్నవారు= భావిస్తూ ఉన్నారు; ఆ ప్రకారంబు+ఎట్లు+అనినన్= ఆ విధం ఎలా అంటే; చైత్రంబునన్= చైత్రమాసంలో; సూర్యుండు; ధాత+అను; నామంబు+తాల్చి= పేరును ధరించి; కృతస్థలి; హేతి; వాసుకి; రథకృత్తు; పులస్త్యుండు; తుంబురుండున్= తుంబురుడు; అనెడు= అనే; పరిజనులతోన్= పరివారంతో; చేరికొని= చేరి; సంచరించున్=

సంచరిస్తాడు; వైశాఖంబునన్= వైశాఖ మాసంలో; అర్యముండు+అనుపేరు= అర్యముడు అనేపేరు; వహించి; పులహుండు; ఓజుండు; ప్రహేతి; పుంజికస్థలి; నారదుండు; కంజనీరుండు; అను; అనుచర సహితుండు+ఐ= పరివారంతో కూడినవాడై; కాలంబు= కాలం; కదుపుచున్+ఉందున్= గడుపుతూ ఉంటాడు; జ్యేష్ఠంబునన్= జ్యేష్ఠమాసంలో; మిత్ర+అభిధానంబునన్= మిత్రుడనే పేరుతో; అత్రి; పౌరుషేయుండు; తక్షకుండు; మేనక; హాహా= హాహా అనే గంధర్వుడు; రథస్వనుండు= రథస్వనుడనే యక్షుడు; అను; పరిజనుల తోడన్= పరిజనులతో; చేరి= కలసి; వర్తించుచున్+ఉందున్= ప్రవర్తిస్తూ ఉంటాడు; ఆషాఢంబునన్= ఆషాఢమాసంలో; వరుణుండు+అను= వరుణుడు అనే; ఆహ్వయంబున్+ఒంది= పేరు వహించి; వసిష్ఠుండు; రంభ; సహజన్యుండు; హూహువు; శుక్రుండు; చిత్రస్వనుండు; అను; సహచర సహితుండు+ఐ= అనుచరులతో కూడినవాడై; కాలక్షేపణంబు= కాలక్షేపం; చేయుచున్+ఉందున్= చేస్తూ ఉంటాడు; శ్రావణంబునన్= శ్రావణమాసంలో; ఇంద్రుండు+అను= ఇంద్రుడు అనే; నామంబుచేన్= పేరుతో; వ్యవహృతుండు+ఐ= పిలువబడినవాడై; విశ్వావసువు; శ్రోత; ఏలాపుత్రుండు; అంగిరసుండు; ప్రమ్లోచ; చర్యుండు; అను; సభ్యులతోన్+చేరి= సభ్యులతోచేరి; కాలంబు; గడుపుచున్+ఉందున్= గడుపుతూ ఉంటాడు; భాద్రపదంబునన్= భాద్రపదమాసంలో; వివస్వంతుండు+అను= వివస్వంతుడు అనే; నామంబు+తాల్చి= పేరు వహించి; ఉగ్రసేనుండు; వ్యాఘ్రుండు; ఆసారణుండు; భృగువు; అనుమ్లోచ; శంఖపాలుండు; లోనుగాన్+కల= మొదలైన; పరిజనులతోన్; ఆవృతుండు+ఐ= పరివేష్టింపబడినవాడై; కాలాయాపనంబు= కాలపాలనం; చేయుచున్+ఉందున్= చేస్తూ ఉంటాడు.

**తా :** అదేమిటంటే – లోకానికి కన్నువంటివాడైన సూర్యుడు చైత్రమాసం మొదలుకొని ఏయే నెలలలో ఏయే పేర్లతో సంచరిస్తాడో ఆ విషయం చెప్పు. అని శౌనకుడు అడుగగా సూతుడు చెప్పసాగాడు. చైత్రమాసం నుండి పన్నెండు మాసాలలోనూ సౌరగణ సప్తకం అంటే సూర్య సంబంధమైన ఏడు సమూహాలు భగవంతునిచే నియుక్తులై అనేక విధాలుగా సంచరిస్తాయి. ఈ విషయాన్ని ఇంతకుముందు శుకమహర్షి విష్ణురాతుడికి చెప్పాడు. ఆ క్రమంలోనే నేను మీకు చెపుతాను. శ్రీమన్నారాయణస్వరూపుడైన సూర్యుడు ఒకే రూపం కలవాడైనప్పటికి అతడిని కాలదేశ క్రియాదుల గుణాలను బట్టి మహర్షులు పెక్కువిధాలుగా భావిస్తూ ఉన్నారు. ఆ పెక్కు విధాలు ఎలా అంటే

చైత్రమాసంలో సూర్యుడు ధాత అనే పేరు ధరిస్తాడు. కృతస్థలి, హేతి, వాసుకి, రథకృత్తు, పులస్త్యుడు, తుంబురుడు అనే పరివారంతో సంచరిస్తాడు. వైశాఖమాసంలో సూర్యుడు అర్యముడు అనేపేరు వహించి పులహుడు, ఓజుడు, ప్రహేతి, పుంజికస్థలి, నారదుడు, కంజనీరుడు అనే అనుచరులతో కలసి కాలం గడుపుతూ ఉంటాడు. జ్యేష్ఠమాసంలో సూర్యుడు మిత్రుడు అనే పేరుతో అత్రి, పౌరుషేయుడు, తక్షకుడు, మేనక, హాహా అనే గంధర్వుడు, రథస్వనుడు అనే యక్షుడు – అనే పరిజనులతో కలసి ప్రవర్తిస్తూ ఉంటాడు. ఆషాఢమాసంలో సూర్యుడు వరుణుడు అనే పేరు పొందుతాడు. వసిష్ఠుడు, రంభ, సహజన్యుడు, హూహువు, శుక్రుడు, చిత్రస్వనుడు అనే వాళ్ళు పరివారం కాగా కాలం గడుపుతూ ఉంటాడు. శ్రావణమాసంలో సూర్యుడు ఇంద్రుడనే పేరుతో ప్రసిద్ధుడై విశ్వావసువు, శ్రోత, ఏలాపుత్రుడు అంగిరసుడు, ప్రమ్లోచ, చర్యుడు అనే సభ్యులతో కలసి కాలం గడుపుతూ ఉంటాడు. భాద్రపదమాసంలో సూర్యుడు వివస్వంతుడు అనే పేరుతో ఉగ్రసేనుడు, వ్యాఘ్రుడు, ఆసారణుడు, భృగువు, అనుమ్లోచ, శంఖపాలుడు అనే వాళ్ళు పరివేష్టించి ఉండగా సమయపాలనం చేస్తూ ఉంటాడు.

**విశే :** చైత్రాది మాసాల్లో వివిధ నామాలతో సూర్యుడు పరివారాలతో సంచరిస్తూ ఉంటాడని చెప్పబడినప్పటికి, ఆయనతో కలసి సంచరిస్తూ ఉన్నవాళ్లంతా మహర్షులు, గంధర్వులు, నాగరాజులు, అప్సరసలుగా కనిపిస్తున్నారు. సూర్యుడు, శ్రీమన్నారాయణ స్వరూపుడేనని మూలంలోని కింది శ్లోకం చెపుతున్నది.

**'ఏక ఏవ హి లోకానాం సూర్య ఆత్మాఽఽధికృద్ధరిః**
**సర్వవేద క్రియామూలమృషిభి ర్బహుధోదితః' (12-11-30)**

ప్రాణులలోని ప్రత్యగాత్మ (అంతరతమమగు స్వరూపం), సృష్టికర్త అయిన శ్రీహరీ, సూర్యుడూ నిశ్చయంగా ఒక్కటే. కాని మహర్షులు ఆయనను పలువిధాలుగా వర్ణించారు. ఆయనే సకల వైదిక కర్మలకు మూలం.

**క. ధరలోఁద్వష్టాహ్వయమును, నిరవుగ ధరియించి ధాత్రి కింపు దలిర్పం**
**జరియించుచు నభమందున్, సరసిజహితుఁడాశ్వయుజము సయ్యనఁగడపున్. 42**

**ప్రతి :** సరసిజహితుఁడు= పద్మమిత్రుడు-సూర్యుడు; ధరలోన్= భూమియందు; త్వష్టృ+ఆహ్వయమును= త్వష్ట అనే పేరును; ఇరవుగన్= స్థిరంగా; ధరియించి= వహించి; ధాత్రికిన్= భూమికి; ఇంపు= సంతోషం; తలిర్పన్= కలిగేటట్లు; నభము+అందున్= ఆకాశంలో; చరియించుచున్= సంచరిస్తూ; ఆశ్వయుజమున్= ఆశ్వయుజ మాసాన్ని; చయ్యనన్= శీఘ్రంగా; కడపున్= గడుపుతాడు.

**తా :** ఆశ్వయుజ మాసంలో సూర్యుడు త్వష్ట అనే పేరుతో భూమికి సంతోషం కలిగేటట్లు ఆకాశంలో వేగంగా సంచరిస్తూ గడుపుతాడు.

**వ. ఈ మాసంబున ఋచీకతనయుండు కంబళాశ్వుండు తిలోత్తమ బ్రహ్మోపేతుండు శతచిత్తు ధృతరాష్ట్రం డిషంభరు లను సభ్యులతోడఁగూడి కాలంబు గడుపుచుండుఁ; గార్తికమాసంబున విష్ణువని వ్యవహరింపఁ బడి యశ్వతరుండు రంభ సూర్యవర్చసుఁడు సత్యజిత్తు విశ్వామిత్త్రుండు మఘాపేతుఁడను పరిజనవర్గంబుతోఁ గూడి కాలంబు నడపుచుండు; మార్గశిరంబునం దర్యమనామ వ్యవహృతుండై కశ్యపుండు తార్క్ష్యుండు ఋతసేనుం డూర్వశి విద్యుచ్ఛత్రుండు మహాశంఖుం డనెడు ననుచరులం గూడి చరించుచుండుఁ; బుష్యమాసంబున భగుం డను నామంబు దాల్చి స్ఫూర్జుం దరిష్టనేమి యూర్ణుం డాయువు కర్కోటకుండు పూర్వచిత్తి యనెడు సభ్యజనపరివృతుండై కాలక్షేపణంబు సేయుచునుండు; మాఘమాసంబునఁ బూషాహ్వయంబు వహించి ధనంజయుండు వాతుండు సుషేణుండు సురుచి ఘృతాచి గౌతముం డను పరిజనపరివృతుండై చరియించుచునుండు. 43**

**ప్రతి :** ఈ మాసంబునన్= ఈ ఆశ్వయుజమాసంలో; ఋచీకతనయుండు= ఋచీకునికొడుకు (జమదగ్ని); కంబళాశ్వుండు; తిలోత్తమ; బ్రహ్మోపేతుండు; శతచిత్తు; ధృతరాష్ట్రుండు; ఇషంభరులు+అను= ఇషంభరుడు అనే; సభ్యులతోడన్+కూడి= సభ్యులతో కలసి; కాలంబు; కడపుచున్+ఉండున్= గడుపుతూ ఉంటాడు; కార్తికమాసంబునన్= కార్తికమాసంలో; విష్ణువు+అని; వ్యవహరింపన్+పడి= పిలువబడి; అశ్వతరుండు; రంభ, సూర్యవర్చసుఁడు; సత్యజిత్తు; విశ్వామిత్రుండు; మఘాపేతుఁడు+ అను; పరిజనవర్గంబుతోన్+కూడి= పరిజనవర్గంతో కలసి; కాలంబు; నడుపుచున్+ఉండున్= నడపుతూ ఉంటాడు; మార్గశిరంబు+అందున్= మార్గశిరమాసంలో; అర్యమనామ వ్యవహృతుండు+ఐ= అర్యముడు అనే పేరుతో వ్యవహరింపబడిన

వాడై; కశ్యపుండు; తార్క్ష్యుండు; ఋతసేనుండు; ఊర్వశి; విద్యుచ్ఛత్రుండు; మహాశంఖుండు+అనెడు= మహాశంఖుడు అనే; అనుచరులన్+గూడి= అనుచరులతో కలసి; చరించుచున్+ఉండున్= సంచరిస్తూ ఉంటాడు; పుష్యమాసంబునన్; భగుండు+అను= భగుడు అనే; నామంబు+తాల్చి; స్ఫూర్జుండు; అరిష్టనేమి; ఊర్ణుండు; ఆయువు; కర్కోటకుండు; పూర్వచిత్తి; అనెడు= అనే; సభ్యజన పరివృతుండు+ఐ= సభ్యజనులతో పరివేష్టింపబడినవాడై; కాలక్షేపణంబు= కాలం గడపడం; చేయుచున్+ఉండున్= చేస్తూ ఉంటాడు; మాఘమాసంబునన్= మాఘమాసంలో; పూష+ఆహ్వయంబు= పూషుడు అనే పేరు; వహించి; ధనంజయుండు; వాతుండు; సుషేణుండు; సురుచి; ఘృతాచి; గౌతముండు; అను; పరిజనవృతుండు+ఐ; చరియించుచున్+ఉండున్= సంచరిస్తూ ఉంటాడు.

**తా :** ఆశ్వయుజమాసంలో సూర్యుడు ఋచీకుని పుత్రుడైన జమదగ్ని, కంబళాశ్వుడు, తిలోత్తమ, బ్రహ్మోపేతుడు, శతచిత్తు, ధృతరాష్ట్రుడు, ఇషంభరుడు అనే సభ్యులతో కలసి కాలం గడుపుతూ ఉంటాడు. కార్తికమాసంలో సూర్యుడు విష్ణువు అనే పేరుతో వ్యవహరింపబడతాడు. అశ్వతరుడు, రంభ, సూర్యవర్చసుడు, విశ్వామిత్రుడు, మఘాపేతుడు అనే పరిజనంతో కాలం గడుపుతూ ఉంటాడు. మార్గశిరమాసంలో సూర్యుడు అర్యముడు అనేపేరుతో పిలవబడి కశ్యపుడు, తార్క్ష్యుడు, ఋతసేనుడు, ఊర్వశి, విద్యుచ్ఛత్రుడు, మహాశంఖుడు అనే అనుచరులతో కలసి సంచరిస్తూ ఉంటాడు. పుష్యమాసంలో సూర్యుడు భగుడు అనే పేరు ధరించి స్ఫూర్జుడు, అరిష్టనేమి, ఊర్ణుడు, ఆయువు, కర్కోటకుడు, పూర్వచిత్తి అనే సభ్యజనులతో కలసి సమయపాలన చేస్తూ ఉంటాడు. మాఘమాసంలో సూర్యుడు పూషుడు అనే పేరుతో వ్యవహరింపబడుతూ ధనంజయుడు, వాతుడు, సుషేణుడు, సురుచి, ఘృతాచి, గౌతముడు అనే పరిజనులతో కలసి సంచరిస్తూ ఉంటాడు.

**క. క్రతునామంబు ధరించియుఁ, జతురతఁబాలించుచుండుఁజాతుర్య కళా**
**రతుఁడై సహస్రకిరణుఁడు, మతియుతు లౌననఁదపస్యమాసము లీలన్.** **44**

**ప్రతి :** సహస్రకిరణుడు= వేయి కిరణాలుగల సూర్యుడు (వే వెలుగు); క్రతు నామంబున్= క్రతువు అనే పేరును; ధరించియున్= తాల్చి; చాతుర్యకళారతుఁడు+ఐ= నేర్పు అనే విద్యలో ఆసక్తి గలవాడై; మతియుతులు= బుద్ధిమంతులు; ఔను+అనన్= సమ్మతింపగా; తపస్యమాసమున్= ఫాల్గుణమాసాన్ని; లీలన్= విలాసంతో; చతురతన్= నేర్పుతో; పాలించుచున్+ఉండున్= పాలిస్తూ ఉంటాడు.

**తా :** సూర్యుడు క్రతువు అనే పేరుతో నేర్పు అనే కళలో ఆసక్తి గలవాడై బుద్ధిమంతులు ఔననేటట్లు ఫాల్గుణమాసాన్ని విలాసంగా పరిపాలిస్తూ ఉంటాడు.

**వ. అందు వర్చసుండు భరద్వాజుండు పర్జన్యుండు సేనజిత్తు విశ్వుం డైరావతుం డనువారలతో నెనసి కాలయాపనంబు సేయుచుండు; నిట్లు ద్వాదశమాసంబుల నపరిమేయవిభూతులచేఁదేజరిల్లుచు నుభయసంధ్యల నుపాసించు జనుల పాపసంఘంబుల నున్మూలనంబు సేయుచుఁ, బ్రతిమాసంబును బూర్వోక్త పరిజన షట్కంబు వెంట నంట నుభయలోక నివాసులగు జనంబుల కైహికాముష్మిక ఫలంబుల నొసంగుచు ఋగ్యజుస్సామాథర్వణ మంత్రంబులఁబఠియించుచు, ఋషిసంఘంబులు స్తుతియింపఁ బురోభాగంబున నప్సరస లాడ, గంధర్వులు పాడ, బ్రహ్మవేత్తలగు నఱువది వేవురు వాలఖిల్యమహర్షు లభిముఖులై నుతించుచు నరుగ, నధికబల వేగవిరాజ మానంబులగు నాగరాజంబులు రథోన్నయనంబు**

**సలుప, బాహాబల ప్రతిష్ఠాగరిష్ఠులగు నైరృతశ్రేష్ఠులు రథపృష్ఠభాగంబు మోచి త్రోయుచుండ ననాదినిధనుం డగు నాదిత్యుండు ప్రతికల్పంబున నిట్లు కాలయాపనంబు సేయుచుఁదేజరిల్లుచుండు; నట్లుగావున నివి యన్నియు వాసుదేవమయంబులుగాఁదెలియు' మని పౌరాణి కోత్తముండగు సూతుండు శుకయోగీంద్రుండు ప్రాయోపవిష్టుం డగు పరీక్షిన్నరపాలున కుపదేశించిన తెఱంగున నైమిశారణ్య వాసులగు శౌనకాది ఋషిశ్రేష్ఠులకుఁదెలిపె; నిట్టి పురాణరత్నంబగు భాగవతంబు వినువారును బఠియించువారును లిఖియించు వారును నాయురారోగ్యైశ్వర్యంబులు గలిగి విష్ణుసాయుజ్యంబు నొందుదు; రదియునుం గాక. 45**

**ప్రతి :** అందున్= ఫాల్గుణమాసంలో; వర్చసుండు; భరద్వాజుండు; పర్జన్యుండు; సేనజిత్తు, విశ్వుడు, ఐరావతుడు; అనువారలతోన్= అనే వారితో; ఎనసి= కూడి; కాలయాపనంబున్= కాలం గడపడం; చేయుచున్+ఉండున్= చేస్తూ ఉంటాడు; ఇట్లు; ద్వాదశ మాసంబులన్= పన్నెండు నెలలలో; అపరిమేయ= చెప్పడానికి సాధ్యంకాని; విభూతులచేన్= విభవాలతో; తేజరిల్లుచున్= ప్రకాశిస్తూ; ఉభయ సంధ్యలన్= ప్రాతః సంధ్య, సాయం సంధ్యలలో; ఉపాసించు= నమస్కరించే; జనుల; పాప సంఘంబులన్= పాపావళులను; ఉన్మూలనంబు+చేయుచున్= నిర్మూలిస్తూ; ప్రతిమాసంబును= ప్రతినెలా; పూర్వ+ఉక్త= ముందు చెప్పబడిన; పరిజనషట్కంబు= ఆరుగురు పరిజనులు; వెంటన్+అంటన్= తోడురాగా; ఉభయలోక= రెండు లోకాలలో; నివాసులు+అగు= నివసించే; జనంబులకున్= జనులకు; ఐహిక+ఆముష్మిక= ఇహపరాల; ఫలంబులన్= ఫలాలను; ఒసంగుచున్= ప్రసాదిస్తూ; ఋక్+యజుస్+సామ+అథర్వణ మంత్రంబులన్= ఋగాదులైన నాలుగు వేదాల మంత్రాలను; పఠియించుచున్= చదువుతూ; ఋషిసంఘంబులు= మునులసమూహాలు; స్తుతియింపన్= స్తోత్రం చేయగా; పురస్+భాగంబునన్= ముందరిభాగంలో; అప్సరసలు+ఆడన్= అచ్చరలు నాట్యం చేస్తుండగా; గంధర్వులు పాడన్= గంధర్వులు గానం చేస్తుండగా; బ్రహ్మవేత్తలు+అగు= వేదాంతులైన; అఱువది వేవురు= అరవై వేలమంది; వాలఖిల్య మహా+ఋషులు= వాలఖిల్య మహామునులు; అభిముఖులు+ఐ= ఎదురుగా నిల్చి; నుతించుచున్+అరుగన్= స్తుతిస్తూ నడవగా; అధికబల= ఎక్కువ బలం; వేగ విరాజమానంబులు+అగు= వేగాలతో ఒప్పుతూ ఉండే; నాగరాజంబులు= శ్రేష్ఠమైన నాగరాజులు; రథ+ఉన్నయనంబు+సలుపన్= రథాన్ని ఎత్తగా (రథాన్ని లాగుతుండగా); బాహాబల= భుజబలం యొక్క; ప్రతిష్ఠా గరిష్ఠులు+అగు= సంపన్నతలో గొప్పవారైన; నైరృత శ్రేష్ఠులు= శ్రేష్ఠులైన నిరృతి కొడుకులు; రథ పృష్ఠభాగంబు= రథం వెనుకభాగాన్ని; మోచి= తాల్చి; త్రోయుచున్+ఉండన్= ముందుకు నెట్టుతూ ఉండగా; అనాది నిధనుండు+అగు= ఆదీ, అంతమూ లేనివాడైన; ఆదిత్యుండు= సూర్యుడు; ప్రతికల్పంబునన్= ప్రతికల్పంలోనూ; ఇట్లు; కాలయాపనంబు= కాలాన్ని గడపడం; చేయుచున్= చేస్తూ; తేజరిల్లుచున్+ఉండున్= ప్రకాశిస్తూ ఉంటాడు; అట్లు+కావునన్= అందుచేత; ఇవి+అన్నియున్= ఇవన్నీ; వాసుదేవమయంబులు+కాన్= వాసుదేవమయాలుగా; తెలియుము+అని= తెలుసుకొమ్మని; పౌరాణిక+ఉత్తముండు+అగు= పురాణవేత్తలలో ఉత్తముడైన; సూతుండు; శుకయోగి+ఇంద్రుండు= శుకమహర్షి శ్రేష్ఠుడు; ప్రాయోపవిష్టుండు+అగు= ప్రాయోపవేశం పూనినవాడైన; పరీక్షిత్+నరపాలునకున్= పరీక్షిత్తు అనే రాజుకు; ఉపదేశించినన్= బోధించిన; తెఱంగునన్= విధంగా; నైమిశ+అరణ్యవాసులు+అగు= నైమిశం అనే పేరుగల అడవిలో నివసించే వారైన; శౌనక+ఆది= శౌనకుడు మొదలైన; ఋషి శ్రేష్ఠులకున్= మునీంద్రులకు; తెలిపెన్= తెలిపాడు, చెప్పాడు; ఇట్టి, పురాణ రత్నంబు+అగు= పురాణాలలో రత్నం వంటిదైన; భాగవతంబున్= భాగవతాన్ని; వినువారును= వినేవారూ; పఠియించు వారును= చదివే వారూ; లిఖియించు వారును= రాసేవారూ; ఆయుస్+ఆరోగ్య+ఐశ్వర్యంబులు= ఆయువూ, ఆరోగ్యం,

ఐశ్వర్యం; కలిగి= పొంది; విష్ణుసాయుజ్యంబున్= విష్ణువులో లయాన్ని; ఒందుదురు= పొందుతారు; అదియునున్+కాక= అదీగాక....

**తా :** "ఫాల్గుణ మాసంలో సూర్యుడు వర్చసుడు, భరద్వాజుడు, పర్జన్యుడు, సేనజిత్తు, విశ్వుడు, ఐరావతుడు, అనే వాళ్లతో కూడి కాలం గడుపుతూ ఉంటాడు. ఈ విధంగా పన్నెండు మాసాలలోనూ చెప్పడానికి సాధ్యంకాని విభవాల (వైభవాల) తో ప్రకాశిస్తూ, ప్రాతఃసంధ్య, సాయం సంధ్యలలో పూజించేవారి పాపపుంజాలను నిర్మూలిస్తూ, ప్రతినెలలోనూ ముందు చెప్పబడిన ఆరుగురు పరిజనులు వెంటరాగా, రెండు లోకాలలోనూ ఉండే వారికి ఇహపర ఫలాలను ప్రదానం చేస్తూ, ఋగ్యజుస్సామాథర్వ వేదమంత్రాలను చదువుతూ ఋషిసంఘాలు ప్రస్తుతించగా, ముందు అచ్చరలు నాట్యం చేస్తుండగా గంధర్వులు గానం చేస్తుండగా, వేదాంతులైన అరవైవేలమంది, వాలఖిల్య మహర్షులు ఎదురుగా నిల్చి స్తోత్రం చేస్తుండగా, మిక్కిలి బలం, వేగం కల నాగరాజులు రథాన్ని లాగుతుండగా, భుజబల సంపన్నతలో శ్రేష్ఠులైన నైరృతులు రథం వెనుకభాగాన్ని మోస్తూ ముందుకు నెట్టుతుండగా, ఆద్యంతాలు లేని సూర్యుడు ప్రతికల్పంలోనూ ఈ విధంగా కాలాన్ని నడిపిస్తూ ప్రకాశిస్తూ ఉంటాడు. అందుచేత వీటి నన్నిటినీ వాసుదేవమయాలని తెలుసుకో" అని పౌరాణికశ్రేష్ఠుడైన సూతుడు శుకుడు ప్రాయోపవేశం పొందిన పరీక్షిత్తుకు చెప్పిన విధంగా నైమిశారణ్యవాసులైన శౌనకుడు మొదలైన ఋషులకు చెప్పాడు.

ఇలాంటి పురాణాలలో రత్నం వంటి భాగవతాన్ని వినేవాళ్లు, చదివేవాళ్లు, రాసేవాళ్లు ఆయువూ, ఆరోగ్యం, ఐశ్వర్యం కలిగి విష్ణుసాయుజ్యమోక్షం పొందుతారు. అదీగాక

**విశే : ఉభయ సంధ్యలు –** ప్రాతః సంధ్య, సాయంసంధ్య అని రెండు సంధ్యాకాలాలు ప్రసిద్ధంగా ఉన్నా మధ్యాహ్న సంధ్య అని మూడవ సంధ్యకూడా ఉంది. 'త్రిసంధ్యలు' అనే మాట కూడా ప్రసిద్ధమే. సంధ్య ధ్యాన సమయం. రెండు పూటలకు మధ్యభాగం సంధ్య. రాత్రికి పగలుకు; పగటికి రాత్రికి; ఉదయానికి సాయంకాలానికి మధ్య భాగాన్ని సంధ్య అంటారు.

**ఉభయలోకాలు :** మర్త్యలోకం, ఊర్ధ్వలోకం.

**వాలఖిల్యులు :** ప్రజాపతి (బ్రహ్మ) రోమాలనుండి జన్మించిన ఋషి గణమని, అంగుష్ఠ మాత్ర దేహులని, తలకిందులుగా వేలాడుతూ తపస్సు చేస్తుంటారని, సూర్యరథంతో పాటు తిరుగుతూ ఉంటారని కథలున్నాయి.

**తే. పుష్కరంబందు ద్వారకాపురమునందు, మథురయందును రవిదినమందు నెవఁడు**
**పఠన సేయును రమణతో భాగవతము, వాఁడు తరియించు సంసారవార్ధి నపుడ. 46**

**ప్రతి :** పుష్కరంబు+అందున్= పుష్కరక్షేత్రంలోనూ; ద్వారకాపురము+అందున్= ద్వారకా పట్టణంలోనూ; మథుర+ అందును = మథురా నగరంలోనూ; రవిదినము+అందున్= ఆదివారంనాడూ; ఎవఁడు; భాగవతమున్= భాగవత పురాణాన్ని; రమణతోన్= ఆసక్తితో; పఠన+చేయును= చదువుతాడో; వాఁడు; సంసారవార్ధిన్= సంసార సముద్రాన్ని; అపుడు+అ= వెంటనే; తరియించున్= దాటుతాడు.

**తా :** పుష్కరక్షేత్రంలో గాని, ద్వారకా పట్టణంలోగాని, మథురా నగరంలోగాని, ఆదివారంగాని, ఎవడు భాగవతపురాణాన్ని ఆసక్తితో పఠిస్తాడో అప్పుడే వాడు సంసారసముద్రాన్ని దాటుతాడు.

**విశే :** పుష్కర క్షేత్రం, ద్వారక, మథుర ఈ మూడూ ఉత్తర భారతదేశంలోనే ఉన్నాయి. శ్రీకృష్ణుడు అక్కడే పుట్టడం వల్ల, భాగవతపురాణం అక్కడే ఆవిర్భవించడం వల్ల ఆ మూడు ప్రాంతాలే పవిత్రమైనవిగా చెప్పబడినాయి. రవిదినమంటే= సూర్యదినమని అర్థం. అదే భానువాసరం (ఆదివారం) పవిత్రదినం.

**క. శ్రీరమణీరమణకథా, పారాయణచిత్తునకును బతికిఁ బరీక్షి**
**ద్భూరమణున కెఱిఁగించెను, సారమతిన్ శుకుఁడు ద్వాదశస్కంధములన్. 47**

**ప్రతి :** శ్రీరమణీ= లక్ష్మీదేవికి; రమణ= పతియైన విష్ణుదేవుని; కథా పారాయణ చిత్తునకును= కథను పారాయణం చేసే మనస్సు కలవాడైన; పతికిన్= రాజుకు; పరీక్షిత్+భూరమణుకున్= పరీక్షిత్తు అనే పేరుగల భూకాంతునికి; శుకుఁడు; సారమతిన్= నిపుణబుద్ధితో; ద్వాదశస్కంధములన్= పన్నెండు స్కంధాలను; ఎఱిఁగించెను= తెలిసేటట్లు వినిపించాడు.

**తా :** లక్ష్మీరమణుడైన విష్ణుదేవుని కథను పారాయణం చేసే మనస్సు గలవాడైన పరీక్షిత్తు అనే పేరుగల భూకాంతునికి శుకమహర్షి నిపుణబుద్ధితో పన్నెండు స్కంధాలను తెలిసేటట్లు వినిపించాడు.

**వ. మఱియు నష్టాదశపురాణంబులందలి గ్రంథసంఖ్య లెట్లనిన బ్రాహ్మపురాణంబు దశసహస్రగ్రంథంబు; పాద్మం బేఁబదియైదు వేలు; విష్ణుపురాణం బిరువదిమూఁడు సహస్రంబులు; శైవంబు చతుర్వింశతి సహస్రంబులు; శ్రీభాగవతం బష్టాదశ సహస్రంబులు; నారదంబు పంచవింశతి సహస్రంబులు; మార్కండేయంబు నవసహస్రంబు; లాగ్నేయంబు పదియేనువేల నన్నూఱు; భవిష్యోత్తరంబు పంచశతాధిక చతుర్దశ సహస్రంబులు; బ్రహ్మకైవర్తం బష్టాదశ సహస్రంబులు; లైంగం బేకాదశసహస్రంబులు; వారాహంబు చతుర్వింశతి సహస్రంబులు; స్కాందం బెనుబది యొక్క వేలనూఱు; వామనంబు దశసహస్రంబులు; కౌర్మంబు సప్తదశ సహస్రంబులు;మాత్స్యంబు చతుర్దశ సహస్రంబులు; గారుడంబు పందొమ్మిది సహస్రంబులు; బ్రహ్మాండంబు ద్వాదశసహస్రంబు లిట్లు చతుర్లక్ష గ్రంథసంఖ్యాప్రమాణంబులం బ్రవర్తిల్లు నీ పదునెనిమిది పురాణంబుల మధ్యంబున నదులయందు భాగీరథివిధంబున, దేవతల యందుఁ బద్మగర్భుమాడ్కిఁ, దారకలందుఁ గళానిధిగరిమ, సాగరంబులందు దుగ్ధార్ణవంబు చందంబున, నగంబులను హేమనగంబు భాతి, గ్రహంబుల విభావసుకరణి, దైత్యులందుఁబ్రహ్లాదునిభంగి, మణులయందుఁ బద్మరాగంబు రేఖ, వృక్షంబులందు హరిచందనతరువు రీతి, ఋషులందు నారదు మాడ్కి, ధేనువులందు గామధేనువు పోల్కి, సూక్ష్మంబులందు జీవుని తెఱంగున, దుర్జయంబులందు మనంబు చొప్పన, వసువులందు హవ్యవాహనుని పోఁడిమి, నాదిత్యులందు విష్ణువు కరణి, రుద్రుల యందు నీలలోహితుని రీతిని, బ్రహ్మలందు భృగువు సొబగున, సిద్ధులయందుఁ గపిలుని లీల, నశ్వంబులందు నుచ్చైశ్శ్రవంబులాగున, దర్వీకరంబులందు వాసుకి రూపమున, మృగములందుఁగేసరిచెలువున, నాశ్రమంబు లందు గృహస్థాశ్రమంబు క్రియ, వర్ణంబులలో నోంకారంబు నిరవున, నాయుధంబులఁగార్ముకంబు సోయగంబున, యజ్ఞంబుల జపయజ్ఞంబు చాడ్పున, వ్రతంబులం దహింస కరణి, యోగంబులం దాత్మయోగంబురమణ, నోషధులయందు యవల సొబగున, భాషణంబు లందు సత్యంబు తేవ, ఋతువులందు వసంతంబు ప్రౌఢి, మాసంబులందు**

**మార్గశీర్షంబు మహిమ, యుగంబులందుఁగృతయుగంబు నోజఁ దేజరిల్లు; నిట్టి భాగవత పురాణంబు పఠియించి విష్ణుసాయుజ్యంబుఁ జెందుదు రని మఱియు నిట్లనియె. 48**

**ప్రతి :** మఱియున్; అష్టాదశ= పదునెనిమిది; పురాణంబులు+అందలి= పురాణాలలోని; గ్రంథసంఖ్యలు+ఎట్లు+అనినన్= గ్రంథాలు సంఖ్యల ఎలాగంటే; బ్రహ్మపురాణంబు; దశ సహస్ర గ్రంథంబు= పదివేల శ్లోకాలు గల గ్రంథం; పాద్మంబు= పద్మపురాణం; ఏఁబదియైదువేలు; విష్ణుపురాణంబు; ఇరువదిమూఁడు సహస్రంబులు= ఇరవై మూడువేలు; శైవంబు= శివపురాణం; చతుర్వింశతి సహస్రంబులు= ఇరవై నాలుగువేలు; శ్రీభాగవతంబు; అష్టాదశ సహస్రంబులు= పదునెనిమిదివేలు; నారదంబు= నారదపురాణం; పంచవింశతి సహస్రంబులు= ఇరవై అయిదువేలు; మార్కండేయంబు= మార్కండేయ పురాణం; నవ సహస్రంబులు= తొమ్మిదివేలు; ఆగ్నేయంబు= అగ్నిపురాణం; పదియేనువేల నన్నూఱు= పదిహేనువేల నాలుగు వందలు; భవిష్యోత్తరంబు= భవిష్యోత్తర పురాణం; పంచశత+అధిక చతుర్దశ సహస్రంబులు= పదునాలుగువేల అయిదు వందలు; బ్రహ్మవైవర్తంబు; అష్టాదశసహస్రంబులు= పదునెనిమిది వేలు; లైంగంబు= లింగపురాణం; ఏకాదశ సహస్రంబులు= పదకొండువేలు; వారాహంబు= వరాహపురాణం; చతుర్వింశతి సహస్రంబులు= ఇరవై నాలుగువేలు; స్కాందంబు= స్కందపురాణం; ఎనుబదియొక్క వేల నూఱు= ఎనబై ఒక్క వేల నూఱు; వామనంబు; దశసహస్రంబులు= పదివేలు; కౌర్మంబు= కూర్మపురాణం; సప్తదశ సహస్రంబులు= పదిహేడువేలు; మత్స్యంబు= మత్స్యపురాణం; చతుర్దశ సహస్రంబులు= పదునాలుగువేలు; గారుడంబు= గరుడపురాణం; పందొమ్మిది సహస్రంబులు= పందొమ్మిదివేలు; బ్రహ్మాండంబు= బ్రహ్మాండపురాణం; ద్వాదశ సహస్రంబులు= పన్నెండువేలు; ఇట్లు; చతుర్లక్ష గ్రంథ సంఖ్యా ప్రమాణం బులన్= నాలుగు లక్షల గ్రంథ (శ్లోక) సంఖ్యలు పరిమాణంగా; ప్రవర్తిల్లు= ఉండే; ఈ పదునెనిమిది పురాణంబుల; మధ్యంబునన్= మధ్యలో (పురాణాలన్నిటిలో); నదుల+అందున్= నదులలో; భాగీరథి విధంబునన్= గంగానది వలె; దేవతల+అందున్= దేవతలలో; పద్మగర్భుమాడ్కిన్= బ్రహ్మవలె; తారకల+అందున్= నక్షత్రాలలో; కళానిధిగరిమన్= చంద్రునిభంగి; సాగరంబులు+అందున్= సముద్రాలలో; దుగ్ధ+అర్ణవంబు చందంబునన్= పాల కడలివలె; నగంబులను= పర్వతాలలో; హేమనగంబు భాతిన్= మేరు పర్వతం వలె; గ్రహంబులన్= గ్రహాలలో; విభావసుకరణిన్= సూర్యునివలె; దైత్యులు+అందున్= రాక్షసులలో; ప్రహ్లాదుని భంగిన్= ప్రహ్లాదునివలె; మణుల+అందున్= మణులలో; పద్మరాగంబురేఖన్= పద్మరాగ (కెంపు) మణి వలె; వృక్షంబులు+అందున్= చెట్లలో; హరి చందన తరువు రీతిన్= హరిచందన వృక్షం వలె; ఋషులు+అందున్= ఋషులలో; నారదుమాడ్కిన్= నారదుని వలె; ధేనువులు+అందున్= గోవులలో; కామధేనువు పోల్కిన్= కామధేనువు వలె; సూక్ష్మంబులు+అందున్= సూక్ష్మమైన (మిక్కిలి చిన్నవైన) వాటిలో; జీవుని తెఱంగునన్= జీవుడివలె; దుర్జయంబులు+అందున్= జయింపరాని వాటిలో; మనంబు చొప్పునన్= మనస్సువలె; వసువులు+అందున్= వసువులలో; హవ్యవాహనుని పోఁడిమిన్= అగ్నివలె; ఆదిత్యులు+అందున్= ఆదిత్యులలో; విష్ణువు కరణిన్= విష్ణువువలె; రుద్రుల+అందున్= రుద్రులలో; నీలలోహితుని రీతిని= నీలలోహితుని వలె; బ్రహ్మలు+అందున్= బ్రహ్మలలో; భృగువు సొబగునన్= భృగుమహర్షివలె; సిద్ధుల+అందున్= సిద్ధులలో; కపిలుని లీలన్= కపిల మహర్షివలె; అశ్వంబులు+అందున్= గుర్రాలలో; ఉచ్చైశ్రవంబు లాగునన్= ఉచ్చైశ్రవము వలె; దర్వీకరములు+అందున్= పాములలో; వాసుకి రూపమునన్= వాసుకి రూపం వలె; మృగములు+అందున్= జంతువులలో; కేసరి చెలువునన్= సింహం వలె; ఆశ్రమంబులు+అందున్= ఆశ్రమాలలో; గృహస్థాశ్రమంబు క్రియన్= గృహస్థాశ్రమం వలె; వర్ణంబులలోన్= వర్ణాలలో; ఓంకారంబు నిరవునన్=

ఓంకారం వడువున; ఆయుధంబులన్= శస్త్రాలలో; కార్ముకంబు సోయగంబునన్= ధనుస్సు చెలువున; యజ్ఞంబులన్; జపయజ్ఞంబు చాడ్పునన్= జపయజ్ఞంవలె; వ్రతంబులు+అందున్= వ్రతాలలో; అహింస కరణిన్= అహింసవలె; యోగంబులన్= యోగాలలో; ఆత్మయోగంబు రమణన్= ఆత్మయోగం విధాన; ఓషధులు+అందున్= ఔషధ మూలికలలో; యవల సొబగునన్= యవల వలె; భాషణంబులు+అందున్= వాక్కులలో; సత్యంబుతేవన్= సత్యవాక్కు వలె; ఋతువులు+అందున్= ఋతువులలో; వసంతంబు ప్రౌఢిన్= వసంత ఋతువువలె; మాసంబులు+అందున్= మాసాలలో; మార్గశీర్షంబు మహిమన్= మార్గశిరం విధంగా; యుగంబులు+అందున్= యుగాలలో; కృతయుగంబు+ఓజన్= కృతయుగంవలె; తేజరిల్లున్= ప్రకాశిస్తుంది; ఇట్టి భాగవత పురాణంబున్; పఠియించి; విష్ణుసాయుజ్యంబున్= విష్ణైక్యమనే ముక్తిని; చెందుదురు= పొందుతారు; అని; మఱియున్; ఇట్లు+అనియెన్.

**తా :** పదునెనిమిది పురాణాలలోని శ్లోక సంఖ్యా పరిమాణాలు ఎలాగంటే – బ్రహ్మపురాణం పదివేల శ్లోకాలు గల గ్రంథం. పద్మపురాణం శ్లోక సంఖ్య ఏబది అయిదు వేలు. విష్ణుపురాణం ఇరవై మూడు వేలు. శివపురాణం ఇరవై నాలుగు వేలు. భాగవతం పదునెనిమిది వేలు. నారదపురాణం ఇరవై అయిదు వేలు. మార్కండేయ పురాణం తొమ్మిదివేలు. అగ్నిపురాణం పదిహేనువేల నాలుగు వందలు. భవిష్యోత్తర పురాణం పదునాలుగు వేల అయిదు వందలు. బ్రహ్మవైవర్త పురాణం పదునెనిమిది వేలు. లింగపురాణం పదకొండువేలు. వరాహపురాణం ఇరవైనాలుగు వేలు. స్కాందపురాణం ఎనభై ఒక్కవేల నూరు. వామనపురాణం పదివేలు. కూర్మపురాణం పదిహేడువేలు. మత్స్యపురాణం పదునాలుగు వేలు. గరుడపురాణం పందొమ్మిదివేలు. బ్రహ్మాండపురాణం పంద్రెండు వేలు.

ఈ విధంగా నాలుగు లక్షల శ్లోక పరిమాణం గల పదునెనిమిది పురాణాలలో నదులలో గంగానదివలె, దేవతలలో బ్రహ్మవలె, నక్షత్రాలలో చంద్రునివలె, సముద్రాలలో పాలకడలివలె, పర్వతాలలో మేరు పర్వతంవలె, గ్రహాలలో సూర్యునివలె, రాక్షసులలో ప్రహ్లాదునివలె, రత్నాలలో పద్మరాగమణివలె, చెట్లలో హరిచందన తరువువలె, ఋషులలో నారదునివలె, గోవులలో కామధేనువువలె, సూక్ష్మాలలో జీవునివలె, జయింపరాని వాటిలో మనస్సువలె,వసువులలో అగ్నిదేవునివలె, ఆదిత్యులలో విష్ణువువలె, రుద్రులలో నీలలోహితునివలె, బ్రహ్మలలో భృగువువలె, సిద్ధులలో కపిలునివలె; గుర్రాలలో ఉచ్చైశ్శ్రవమువలె, పాములలో వాసుకివలె, మృగాలలో సింహంవలె, ఆశ్రమాలలో గృహస్థాశ్రమంవలె, వర్ణాలలో ఓంకారంవలె, శస్త్రాలలో ధనుస్సువలె, యజ్ఞాలలో జపయజ్ఞం వలె, వ్రతాలలో అహింసవలె, యోగాలలో ఆత్మయోగం వలె, ఔషధ మూలికలలో యవలవలె, వాక్కులలో సత్యవాక్కువలె, ఋతువులలో వసంత ఋతువువలె, మాసాలలో మార్గశిరమాసంవలె, యుగాలలో కృతయుగంవలె, భాగవతం ప్రకాశిస్తుంది. ఈ భాగవతపురాణం చదివిన వారు విష్ణుసాయుజ్యం పొందుతారు అని చెప్పి మళ్లీ ఇలా అన్నాడు.

**విశే :** పదునెనిమిది పురాణాలు నాలుగు లక్షల శ్లోక పరిమాణం కలిగి ఉన్నాయి.

1. బ్రహ్మపురాణం - 10,000 శ్లోకాలు
2. పద్మపురాణం - 55,000 శ్లోకాలు
3. విష్ణుపురాణం - 23,000 శ్లోకాలు
4. శివపురాణం - 24,000 శ్లోకాలు

| | | |
|---|---|---|
| 5. శ్రీభాగవతపురాణం | - | 18,000 శ్లోకాలు |
| 6. నారదపురాణం | - | 25,000 శ్లోకాలు |
| 7. మార్కండేయ పురాణం | - | 9,000 శ్లోకాలు |
| 8. అగ్నిపురాణం | - | 15,400 శ్లోకాలు |
| 9. భవిష్యోత్తర పురాణం | - | 14,500 శ్లోకాలు |
| 10. బ్రహ్మవైవర్తపురాణం | - | 18,000 శ్లోకాలు |
| 11. లింగపురాణం | - | 11,000 శ్లోకాలు |
| 12. వరాహపురాణం | - | 24,000 శ్లోకాలు |
| 13. స్కాందపురాణం | - | 81,100 శ్లోకాలు |
| 14. వామనపురాణం | - | 10,000 శ్లోకాలు |
| 15. కూర్మపురాణం | - | 17,000 శ్లోకాలు |
| 16. మత్స్యపురాణం | - | 14,000 శ్లోకాలు |
| 17. గరుడపురాణం | - | 19,000 శ్లోకాలు |
| 18. బ్రహ్మాండపురాణం | - | 12,000 శ్లోకాలు |
| మొత్తం | - | 4,00,000 శ్లోకాలు |

**కళానిధి :** కళలకు నిధి చంద్రుడు (కళానాం నిధిః). చంద్రుడికి పదహారు కళలున్నట్లు ప్రసిద్ధి.

**భాగీరథి :** గంగానది. భగీరథుని ప్రయత్నఫలంగా భూమికి తీసుకొని రాబడినది కాబట్టి భాగీరథి అనే పేరుతో ప్రసిద్ధం.

**హరిచందన తరువు :** ఇది దేవ వృక్షం. దేవ వృక్షాలు ఐదున్నాయి. మందారం, పారిజాతం, సంతానం, కల్పవృక్షం, హరిచందనం - అనేవి దేవ వృక్షాలు. ఇంద్రుని సంతోషింపజేసేది హరిచందనం.

**హవ్యవాహనుడు :** హోమ ద్రవ్యాలను తీసుకొనిపోయి దేవతలకు ఇచ్చేవాడు - హుతవహుడు అని కూడా పేరు.

**రుద్రులు :** రుద్రులు పదకొండుమంది ఉన్నారు. వాళ్లు - అజుడు, ఏకపాదుడు, అహిర్బుధ్న్యుడు, హరుడు, శంభుడు, త్ర్యంబకుడు, అపరాజితుడు, ఈశానుడు, త్రిభువనుడు, త్వష్ట, రుద్రుడు.

**నీలలోహితుడు :** శివుడికి మరోపేరు. బ్రహ్మ హోమం చేసేటప్పుడు లలాట స్వేదం వల్ల కలిగిన తేజం అగ్నిలో పడి నీలవర్ణమై పిమ్మట రక్తవర్ణమైంది. అందులో పుట్టినవాడు కనుక నీలలోహితుడు. కంఠం నీలంగాను, వెంద్రుకలు ఎరుపుగాను ఉన్నవాడు.

**ఉచ్చైశ్శ్రవం :** ఉన్నతాలైన చెవులు గలది. ఇది ఇంద్రుని అశ్వం. శరీరమంతా తెల్లగా ఉంటుంది.

**దర్వీకరం :** పాము పడగ తెడ్డు (దర్వీ) వలె ఉంటుంది. ఆ పడగ హస్తంగా కలది దర్వీకరం. అంటే సర్పం.

**క. సకలాగమార్థపారగుఁ, దకలంక గుణాభిరాముఁడంచిత బృందా**
**రక వంద్య పాదయుగుఁడగు, శుకయోగికి వందనంబు సొరిది నొనర్తున్.** **49**

**ప్రతి :** సకల+ఆగమ+అర్థ పారగుఁడు= సకల వేదార్థాలను పూర్తిగా తెలిసినవాడు; అకలంక= మచ్చలేని; గుణ+ అభిరాముఁడు= గుణాలతో మనోహరమైనవాడు; అంచిత= పూజింపదగిన; బృందారక= దేవతలచే; వంద్య= నమస్కరింప దగిన; పాదయుగుఁడు+అగు= పాద ద్వంద్వం కలవాడైన; శుకయోగికి; సొరిదిన్= క్రమంగా; వందనంబు= నమస్కారం; ఒనర్తున్= చేస్తాను (చేస్తున్నాను).

**తా :** సకల వేదార్థాలను పూర్తిగా తెలిసినవాడు, కళంకం లేని గుణాలతో మనోహరమైనవాడు, పూజింపదగిన దేవతలచేత సైతం నమస్కరింపబడే పాదద్వంద్వం కల శుకయోగికి నేను నమస్కారం చేస్తున్నాను.

**సీ. సకలగుణాతీతు సర్వజ్ఞు సర్వేశు నఖిలలోకాధారు, నాదిదేవుఁ**
**బరమదయారసోద్భాసితుఁ ద్రిదశాభివందితపాదాబ్జు వనధిశయను**
**నాశ్రితమందారు నాద్యంతశూన్యుని వేదాంతవేద్యుని విశ్వమయునిఁ**
**గౌస్తుభ శ్రీవత్స కమనీయవక్షుని శంఖచక్రగదాసిశార్ఙ్గధరుని**

**తే. శోభనాకారుఁబీతాంబరాభిరాము, రత్నరాజితమకుటవిభ్రాజమానుఁ**
**బుండరీకాక్షు మహనీయపుణ్యదేహుఁదలఁతు నుతియింతు దేవకీతనయు నెపుదు.' 50**

**ప్రతి :** సకలగుణ+అతీతున్= గుణాలన్నింటికి అతీతమైనవాడు; సర్వజ్ఞున్= సర్వమూ తెలిసినవాడు; సర్వ+ఈశున్= అన్నింటికి ప్రభువైనవాడు; అఖిలలోక+ఆధారున్= సర్వలోకాలకూ ఆధారమైనవాడు; ఆదిదేవున్= మొదటివేల్పు; పరమ= మిక్కిలి; దయారస+ఉద్భాసితున్= కృపారసంతో ప్రకాశించేవాడు; త్రిదశ+అభివందిత= దేవతలచే నమస్కరింపబడే; పాద+అబ్జున్= పాదపద్మాలు గలవాడు; వనధిశయనున్= సముద్రంలో శయనించే వాడు; ఆశ్రితమందారున్= ఆశ్రయించిన వాళ్లకు కల్పవృక్షం వంటి వాడు; ఆది+అంతశూన్యునిన్= ఆదీ, అంతం లేనివాడు; వేదాంతవేద్యునిన్= వేదాంతం చేత తెలియదగినవాడు; విశ్వమయునిన్= జగమంతా నిండి ఉన్నవాడు; కౌస్తుభ= కౌస్తుభమణిచేత; శ్రీవత్స= శ్రీవత్సమనే పేరుగల మచ్చచేత; కమనీయ= అందమైన; వక్షునిన్= వక్షః స్థలం కలవాడు; శంఖ చక్ర గద అసి శార్ఙ్గ ధరునిన్= శంఖం, చక్రం, గద, ఖడ్గం, శార్ఙ్గం ధరించినవాడు; శోభన+ఆకారున్= మంగళకరమైన రూపం కలవాడు; పీత+అంబర+అభిరామున్= పచ్చని వస్త్రంచే అందమైనవాడు; రత్నరాజిత= మణులచే ప్రకాశించే; మకుట= కిరీటంతో; విభ్రాజమానున్= ప్రకాశించువాడు; పుండరీక+అక్షున్= పద్మాలవంటి నేత్రాలు కలవాడు; మహనీయ= గొప్పదైన; పుణ్య= పుణ్యవంతమైన; దేహున్= శరీరం కలవాడు; (అగు) దేవకీ తనయున్= దేవకి కొడుకైన శ్రీకృష్ణుని; ఎపుడున్= ఎల్లప్పుడూ; తలఁతున్= స్మరిస్తాను; నుతియింతున్= స్తుతిస్తాను;

**తా :** గుణాలకన్నింటికీ అతీతమైనవాడూ; సర్వమూ తెలిసినవాడూ; అన్నింటికీ ప్రభువూ; సర్వలోకాలకూ ఆధారమైనవాడూ; ఆదిదేవుడూ; అమిత కృపారసంచే ప్రకాశించేవాడూ; దేవతల నమస్కారాలను గ్రహించే పాదపద్మాలు గలవాడూ; సముద్రంలో శయనించేవాడూ; ఆశ్రితులపాలిటి కల్పవృక్షం వంటి వాడు; ఆదీ అంతం లేనివాడూ; వేదాంతం చేత తెలియదగిన వాడూ; విశ్వమంతటా నిండి ఉన్నవాడూ; కౌస్తుభమణిచేత, శ్రీవత్సమనే మచ్చచేత మనోహరమైన వక్షఃస్థలం కలవాడూ; పాంచజన్యమనే శంఖం, సుదర్శనమనే చక్రం, కౌమోదకి అనే గద, నందకమనే ఖడ్గం, శార్ఙ్గం అనే విల్లు ధరించినవాడూ; మంగళాకారుడూ; పీతాంబరంచే అందమైనవాడూ; మణులచేత ప్రకాశించే కిరీటంతో వెలుగులు నింపేవాడూ; తెల్లతామరలవంటి కనులు కలవాడూ; గొప్ప పుణ్యవంతమైన శరీరం కలవాడూ అయిన దేవకీనందనుని ఎప్పుడూ స్మరిస్తూ, స్తుతిస్తూ ఉంటాను.

**మ. అని యీరీతి నుతించి భాగవత మాద్యంతంబు సూతుండు సె**
**ప్పిన సంతుష్టమనస్కులై విని మునుల్ ప్రేమంబునం బద్మనా**
**భునిఁజిత్తంబున నిల్పి తద్గుణములన్ భూషించుచున్ ధన్యులై**
**చని రాత్మీయనికేతనంబులకు నుత్సాహంబు వర్ధిల్లఁగన్. 51**

**ప్రతి :** అని; ఈ రీతిన్= ఈ విధంగా; సూతుండు= సూతమహర్షి; నుతించి= స్తుతించి; భాగవతమున్= భాగవతాన్ని; ఆది+అంతంబు= మొదటినుండి తుదివరకు, (సంపూర్ణంగా); చెప్పినన్= చెప్పగా; మునుల్= శౌనకాది మునులు; విని; సంతుష్టమనస్కులు+ఐ= సంతోషించిన మనస్సులు కలవారై; ప్రేమంబునన్= ప్రీతితో; పద్మనాభునిన్= కమలనాభుని (విష్ణుదేవుని); చిత్తంబునన్= మనస్సులో; నిల్పి= నిలుపుకొని; తద్+గుణములన్= ఆ విష్ణుదేవుని గుణాలను; భూషించుచున్= కొనియాడుతూ; ధన్యులు+ఐ= కృతకృత్యులై; ఆత్మీయ= తమ; నికేతనంబులకున్= నివాసస్థానాలకు; ఉత్సాహంబు; వర్ధిల్లఁగన్= ఉప్పొంగుతుండగా; చనిరి= వెళ్లారు.

**తా :** ఈ విధంగా సూతమహర్షి (శ్రీకృష్ణుని) స్తుతించి భాగవతాన్ని సంపూర్ణంగా చెప్పగా విని శౌనకాదిమునులు ఎంతో సంతోషించి ప్రీతితో కమలనాభుని (విష్ణుదేవుని) మనస్సులలో నిలుపుకొని ఆ దేవుని గుణాలను కొనియాడుతూ ధన్యాత్ములై ఉత్సాహం ఉప్పొంగుతుండగా తమ నివాసస్థానాలకు వెళ్లారు.

**క. జనకసుతాహృచ్చోరా!, జనకవచోలబ్ధ విపినశైల విహారా!**
**జనకామిత మందారా!, జననాదిక నిత్యదుఃఖచయ సంహారా! 52**

**ప్రతి :** జనకసుతా= జనకరాజ కూతురైన సీతయొక్క; హృత్+చోరా= హృదయాన్ని దోచుకొన్నవాడా!; జనక వచస్+లబ్ధ= తండ్రిమాటవల్ల లభించిన; విపినశైల= అటవీ పర్వత; విహారా= సంచారం కలవాడా!; జన కామిత= ప్రజల కోర్కెలను తీర్చే; మందారా= మందార వృక్షమైనవాడా; జనన+ఆదిక= పుట్టుక మొదలైన; నిత్యదుఃఖచయ= శాశ్వతమైన దుఃఖ సమూహాన్ని; సంహారా= సంహరించేవాడా!.

**తా :** జనకరాజ కూతురైన సీతాదేవి హృదయాన్ని దోచుకొన్నవాడా! తండ్రియైన దశరథుని మాటవల్ల లభించిన అటవీ పర్వత సంచారం కలవాడా! ప్రజల కోరికలను తీర్చే మందార వృక్షమా! పుట్టుక మొదలైన శాశ్వత దుఃఖ సమూహాన్ని సంహరించేవాడా! శ్రీరామా!

**విశే :** మందారం దేవతరువులలో ఒకటి. కల్పవృక్షం వలె మందారం కూడా వాంఛిత ఫలాలను ప్రసాదిస్తుంది.

**మాలిని. జగదవనవిహారీ, శత్రులోక ప్రహారీ!**
**సుగుణవనవిహారీ, సుందరీమానహారీ!**
**విగతకలుషపోషీ! వీరవర్యాభిలాషీ!**
**స్వగురుహృదయతోషీ! సర్వదా సత్యభాషీ! 53**

**ప్రతి :** జగత్+అవన విహారీ!= లోక రక్షణలో విహరించేవాడా!; శత్రులోక= శత్రువులమూకలను; ప్రహారీ!= సంహరించేవాడా!; సుగుణవన= సుగుణాలనే వనాలలో విహరించేవాడా!; సుందరీమాన= అందమైన స్త్రీల అభిమానాన్ని; హారీ!=

లోగొనువాడా!; విగతకలుష= పాపం పోగొట్టుకొన్న వాళ్లను; పోషీ!= పోషించేవాడా!; వీరవర్య= వీరవరులను; అభిలాషీ= ఇష్టపడేవాడా!; స్వగురు= స్వీయగురువుయొక్క; హృదయ= మనస్సుకు; తోషీ= సంతోషం కలిగించేవాడా!; సర్వదా= ఎల్లప్పుడూ; సత్యభాషీ!= సత్యమే పలికేవాడా.

**తా :** లోకరక్షణలో విహరించేవాడా! శత్రుమూకలను సంహరించేవాడా! సుగుణాలనే వనాలలో విహరించేవాడా! అందమైన స్త్రీల అభిమానాన్ని హరించేవాడా! పాపం లేనివాళ్లను పోషించేవాడా! వీరవరులను ఇష్టపడేవాడా! స్వీయ గురువుయొక్క మనస్సుకు సంతోషం కలిగించేవాడా! ఎల్లప్పుడూ సత్యమే పలికే వాడా! శ్రీరామా!

**విశే :** పద్యంలోని నాలుగు పాదాల్లో ఎనిమిది విషయాలున్నాయి. ఈ ఎనిమిది విషయాలూ శ్రీరాముని గుణగణాలను ఆదర్శ ప్రాయంగా చూపుతున్నాయి.

**జగదవన విహారీ** – రావణాది రాక్షసులను సంహరించి లోక కల్యాణ కారకుడైనవాడు శ్రీరాముడు. రామావతార ప్రయోజనం ఇదే.

**శత్రులోక ప్రహారీ** – ఈ విషయం కూడా రాక్షస సంహారానికి సంబంధించిందే.

**సుగుణవనవిహారీ** – ఎలాంటి గుణాలుండాలంటే శ్రీరామచంద్రుని గుణాలవంటి గుణాలుండాలని సర్వులూ ఆదర్శంగా చెప్పుకొనే విషయమిది.

**సుందరీమానహారీ –** సీతాసుందరీ మనస్సును లోగొన్నవాడు.

**సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా ।**
**సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనమ్ ॥**

**విగత కలుషపోషీ –** పాపరహితులను పోషించేవాడనడానికి విభీషణుని చేరదీయడం నిదర్శనం.

**వీరవర్యాభిలాషీ –** శ్రేష్ఠులైన వీరుల పరాక్రమం సుగుణాలను మెచ్చుకొనే సహృదయం శ్రీరాముడిది. రావణుని పరాక్రమాన్ని కూడా మెచ్చుకోవడం దీనికి నిదర్శనం.

**స్వగురు హృదయతోషీ –** శ్రీరాముడు వసిష్ఠ విశ్వామిత్ర ఋషులను సంతోషపెట్టిన విషయం దీనికి దృష్టాంతం.

**సర్వదాసత్యభాషీ –** శ్రీరామునిది ఒకేమాట. అదే సత్యవాక్కు.

**గద్యము: ఇది శ్రీ పరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్త్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారయ నామధేయ ప్రణీతంబైన శ్రీ మహాభాగవతం బను మహాపురాణంబునందు రాజుల యుత్పత్తియు, వాసుదేవ లీలావతార ప్రకారంబును, గలియుగధర్మప్రకారంబును, బ్రహ్మప్రళయ ప్రకారంబును, బ్రళయవిశేషంబులును, దక్షకునిచే దష్టుండై పరీక్షిన్మహారాజు మృతినొందుటయు, సర్పయాగంబును, వేదవిభాగక్రమంబును, బురాణానుక్రమణికయు, మార్కండేయోపాఖ్యానంబును, సూర్యుండు ప్రతిమాసంబును వేర్వేఱు నామంబుల వేర్వేఱు పరిజనంబులతో జేరుకొని సంచరించు క్రమంబును తత్తత్పురాణ గ్రంథసంఖ్యలు నను కథలు గల ద్వాదశస్కంధము. 54**

**ప్రతి :** ఇది= ఈ గ్రంథం; శ్రీ పరమ+ఈశ్వర= ఉత్కృష్టుడైన భగవంతునియొక్క; కరుణాకలిత= కరుణచేత కలిగిన; కవితావిచిత్ర= కవిత్వ వైచిత్రికల; కేసనమంత్రి పుత్ర; సహజపాండిత్య= స్వభావ సిద్ధమైన పాండిత్యం కలవాడును (అగు); పోతన+అమాత్య= పోతన అనే మంత్రియొక్క; ప్రియశిష్య= ప్రియశిష్యుడైన; వెలిగందలనారయ; నామధేయ= పేరు గలవాడిచే; ప్రణీతంబు+ఐన= రచింపబడినదైన; శ్రీమహాభాగవతంబు+అను; మహాపురాణంబు+అందున్= మహాపురాణంలో; రాజుల+ఉత్పత్తియున్= రాజుల పుట్టుక; వాసుదేవ= శ్రీకృష్ణునియొక్క; లీల+అవతార ప్రకారంబును= లీలావతార విధమునూ; కలియుగ ధర్మ ప్రకారంబును; బ్రహ్మ ప్రళయ ప్రకారంబును= బ్రహ్మ ప్రళయం జరిగిన విధమూ; ప్రళయ విశేషంబులును= ప్రళయ విశేషాలూ; తక్షకునిచేన్= తక్షకుడనే సర్పంచే; దష్టుండు+ఐ= కాటువేయబడినవాడై; పరీక్షిత్+మహారాజు; మృతిన్+ ఒందుటయున్= మరణించడమూ; సర్పయాగంబును; వేదవిభాగ క్రమంబును= వేద విభజన పద్ధతీ; పురాణ+ అనుక్రమణికయును= పురాణాల వరుసా; మార్కండేయ+ఉప+ఆఖ్యానంబును= మార్కండేయోపాఖ్యానమూ; సూర్యుండు; ప్రతిమాసంబును= ప్రతినెలలో; వేఱు+వేఱు నామంబులన్= వేరువేరు పేర్లతో; వేఱు+వేఱు పరిజనంబులతోన్= వేరువేరు పరిజనులతో; చేరుకొని= కూడి; సంచరించు= సంచారం చేసే; క్రమంబును= విధమూ; తత్+తత్+పురాణ= ఆయా పురాణాల; గ్రంథ సంఖ్యలు= గ్రంథాల (శ్లోకాల) సంఖ్యలూ (పరిమాణాలూ); అను; కథలు+కల= కథలు కలిగిన; ద్వాదశ= పంద్రెండవ; స్కంధము= స్కంధం.

**తా :** ఇది శ్రీ పరమేశ్వరుని కరుణచేత కలిగిన కవితావైచిత్రి కలవాడు, కేసన మంత్రి పుత్రుడు, సహజ పండితుడు అయిన పోతనామాత్యుని ప్రియశిష్యుడైన వెలిగందలనారయనామధేయునిచేత రచింపబడిన శ్రీమహాభాగవతం అనే మహాపురాణంలో రాజులపుట్టుకా, శ్రీకృష్ణుని లీలావతారవిధమూ, కలియుగధర్మప్రకారమూ, బ్రహ్మప్రళయం జరిగే విధమూ, ప్రళయ విశేషాలూ, తక్షకుడిచే కాటువేయబడి పరీక్షిన్మహారాజు మరణించడమూ, సర్పయాగమూ, వేద విభజన పద్ధతీ, పురాణాల వరుసా, మార్కండేయోపాఖ్యానమూ, సూర్యుడు ప్రతినెలా వేరువేరు పేర్లతో వేరువేరు పరిజనులతో కూడి సంచారం చేసే విధమూ, ఆయా పురాణాల శ్లోక సంఖ్యలూ (పరిమాణమూ) అనే కథలు గల ద్వాదశస్కంధం.

**విశే : 'శ్రీమద్భాగవతం పురాణమమలం యద్వైష్ణవానాం ప్రియమ్**
**యస్మిన్ పారమహంస్యమేక మమలం జ్ఞానం పరం గీయతే ।**
**తత్ర జ్ఞాన విరాగ భక్తి సహితం నైష్కర్మ్య మావిష్కృతం**
**తచ్ఛృణ్వన్ విపఠన్ విచారణపరో భక్త్యా విముచ్యే న్నరః ॥'**

శ్రీమద్భాగవతం నిర్దుష్టమైన పురాణం. ఈ పురాణం విష్ణుభక్తులకు ఎంతో ప్రీతికరం. ఇందులో పరమహంసలకు హితం, అద్వితీయం, నిర్మలం, చైతన్య స్వరూపం అయిన పరబ్రహ్మ గానం చేయబడతాడు. దీనిలో ఆత్మజ్ఞానం, వైరాగ్యం, భక్తి అనే వాటితో కూడిన ఆత్యంతిక కర్మనివృత్తి ఆవిష్కరించబడింది. భాగవతాన్ని భక్తితో విని పారాయణ చేసి నిష్ఠగా మననం చేసేవాడు భవబంధాలనుండి విముక్తుడవుతాడు.

**నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్**
**ప్రణామో దుఃఖ శమనః తం నమామి హరిం పరమ్.**

*శ్రీమహాభాగవతము సంపూర్ణం.*

*ఓం తత్సత్.*

# పద్యగద్యసూచి

## ఏకాదశస్కంధము


| | |
|---|---|
| ఆ మ్మునీశ్వరుండు పరమాశ్చర్యనిధానంబుగా | 11-69 |
| అంత | 11-4 |
| అంత | 11-89 |
| అంత యదుప్రవరుండు 'దేహి | 11-94 |
| అంతటను గృష్ణుఁ డేమయ్యె? | 11-117 |
| అఖిలలోకేశ! సర్వేశ! యభవ! | 11-85 |
| అట్టి నారాయణాహ్వయుండైన మౌని, | 11-64 |
| అట్టి పరమేశ్వరుని లీలాగృహీతంబు | 11-71 |
| అట్లు గావున గృహ | 11-75 |
| అట్లు గావున జనుండు | 11-111 |
| అట్లు గావున నాత్మసృష్టంబైన | 11-62 |
| అట్లు గావున లోకరక్షణార్థంబు | 11-82 |
| అట్లు గావునఁ బరమేశ్వరభక్తి | 11-33 |
| అట్లు దేవముని కృష్ణసందర్శనార్థం | 11-30 |
| అతిపాపకర్ము లైనను, సతతము | 11-32 |
| అది గావున యతి | 11-26 |
| అని యడిగిన న | 11-105 |
| అని యడిగిన రాజునకు | 11-28 |
| అని యనేకవిధంబులం బ్రస్తుతించిన | 11-18 |
| అని యుద్ధవుం డడగినం | 11-109 |
| అని యుద్ధవుం డడిగిన | 11-115 |
| అని వితర్కించి జగదీశ్వరుం | 11-8 |
| అనిన జనపాలునకు ని, | 11-10 |
| అనిన రాజునకు శుకుం | 11-118 |
| అనిన రాజేంద్రుండు వారల | 11-56 |
| అనిన విదేహభూపాలుడు 'భాగవతధర్మం | 11-45 |
| అనిన విని యం | 11-60 |
| అనిన విని యంతరిక్షుం | 11-50 |

| | |
|---|---|
| అనిన విని యందుఁ | 11-77 |
| అనినఁ గమలభవ భవ | 11-86 |
| అనినం గృష్ణుండు నాలుగు | 11-107 |
| అనుచు నా దారుకుండు | 11-122 |
| అనుటయు హరి యుద్ధవునకుం | 11-113 |
| అయ్యా! దేవ! జనార్దన!, | 11-112 |
| అర్ఘ్యపాద్యాదివిధులను నర్థితోడఁ, బూజ | 11-38 |
| అవధూత వల్కె నంతటఁ, | 11-93 |
| అవ్యక్త నిర్గుణ పరబ్రహ్మంబునందుఁ | 11-52 |
| ఆ యాగ్నీధ్రునకు నాభి | 11-35 |
| ఇ వ్విధంబున భూమివలన | 11-99 |
| ఇ వ్విధంబునఁ బ్రశంసింపఁదగిన | 11-79 |
| ఇ వ్విధంబునం బ్రవర్తిల్లిన | 11-73 |
| ఇందుల కొక్క యితిహాసంబు | 11-97 |
| ఇందులకుఁ బురాతన వృత్తాంతంబు | 11-101 |
| ఇట్లు నుతియించి 'దేవా! | 11-91 |
| ఇట్లు సర్వసంగపరిత్యక్తుండై నిఖిలాంతరాత్ముండై | 11-48 |
| ఇది శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర | 11-127 |
| 'ఇవి తెలియవలయు నాకును, | 11-98 |
| ఈ కథ విన్నను | 11-123 |
| ఈ రీతి శ్రీకృష్ణుఁ | 11-7 |
| ఊహింపఁ బుణ్యుఁ డైన | 11-37 |
| ఋషభునకు నాత్మయోగ మీ | 11-70 |
| ఏ యుగంబునందు నే | 11-76 |
| ఏ రీతిఁ గడప | 11-40 |
| ఒక్క వేళను సూక్ష్మరూపము | 11-16 |
| కని పరమేశుని యాదవ, | 11-84 |
| కని యత్యంతభయభక్తి తాత్పర్యంబుల | 11-120 |
| 'కమలాక్షపదభక్తి కథనముల్ వసుదేవ! | 11-80 |
| కరణత్రయంబు చేతను, నరుఁ | 11-42 |
| కాక ఘూకంబులు గనకసౌధములలోఁ | 11-87 |
| గజరాజవరదు గుణములు, త్రిజగత్పావనము | 11-49 |

| | |
|---|---|
| 'గర్భమునఁ బరిజ్ఞానము, నిర్భరమై | 11-110 |
| ఘనుని శ్రీకృష్ణునిఁ గౌస్తుభాభరణునిఁ | 11-12 |
| చిత్తం బే క్రియ | 11-27 |
| చెప్పిన విని రాజేంద్రుఁడు, | 11-116 |
| 'జంభారిపంపుననను మీ, రంభోరుహవదనలార! | 11-67 |
| జగదేకనాథు గుణములు, మిగులఁగ | 11-36 |
| జనములు నిను సేవింపని, | 11-14 |
| జ్ఞానమున నుద్ధవుఁడు దన, | 11-90 |
| 'జ్ఞానవిహీనులైన నరసంఘముఁ గానఁగరాని | 11-53 |
| జ్ఞానాజ్ఞానంబులందు సంకలితుండైన స్మృతివిపర్యయంబు | 11-43 |
| తరణంబులు భవజలధికి, హరణంబులు | 11-15 |
| తారల నెన్నఁగ వచ్చును;, | 11-61 |
| 'తెలియనివి కొన్ని సెప్పితి;, | 11-108 |
| దర్పించి యాదవులు తమ, | 11-19 |
| దారలయందు, బుత్త్రధన ధాన్యములందు | 11-96 |
| దారుకుఁడు గనియె నంతటఁ, | 11-119 |
| దీనికిం బెక్కైనది పరమాత్మగా | 11-58 |
| దుష్టజన నిగ్రహంబును, శిష్టప్రతిపాలనంబు | 11-81 |
| 'దేవమునీంద్ర! నీ దివ్యచారిత్రంబు | 11-68 |
| దేహము నిత్యముగా దని, | 11-102 |
| ద్రవిడ దేశంబునందులఁ దామ్రపర్ణి, | 11-78 |
| ధరణి దుహితృరంతా! ధర్మమార్గానుగంతా | 11-126 |
| ధరణీసురశాపమునకు, హరిహరబ్రహ్మాదులైన నడ్డము | 11-25 |
| ధర్ముండు దక్షపుత్త్రిక, నిర్మలమతిఁ | 11-63 |
| 'ధ్యానం బేక్రియ నిలుచును?, | 11-104 |
| నగుమొగమున్ సుమధ్యమును నల్లని | 11-124 |
| 'నను నీవు సేయు | 11-31 |
| నరవర! విను జగన్నాథుని | 11-57 |
| నవ వికచ సరసిరుహ | 11-72 |
| నారాయణు వచనముల క, | 11-88 |
| 'నిన్నుఁ జూడని కన్నులు | 11-121 |
| నిరుపమసుందరం బయిన శరీరంబు | 11-11 |

| | |
|---|---|
| పంకజనాభుఁ డుద్ధవునిపైఁ గల | 11-92 |
| పరధన పరదార పరదూషణాదులఁ | 11-95 |
| పరమబ్రహ్మ మనంగాఁ, బరతత్త్వ | 11-51 |
| 'పురుషుం డేయే కర్మము, | 11-59 |
| బలవత్సైన్యముతోడఁ గృష్ణుఁడు మహాబాహా | 11-3 |
| మదనుని బాణజాలముల మగ్నతఁ | 11-66 |
| 'మది సెడి కన్నులు | 11-24 |
| మదోద్రేకులైన యాదవబాలకులు మునిశాపభీతులై | 11-23 |
| మఱియు నొక్కవిశేషం బయిన | 11-103 |
| మఱియు సకలజంతుసంతానంబుకంటె మానుషాకారంబు | 11-41 |
| మహనీయగుణగరిష్ఠులగు న మ్మునిశ్రేష్ఠులకు | 11-2 |
| మునివరులు సంతసిల్లిరి, యనయము | 11-5 |
| మూఁకలు గూడి యాదవులు | 11-20 |
| మోహితుఁడై వసుకాంక్షా, వాహినిలోఁ | 11-100 |
| యదుడింభకులను గనుఁగొని, 'మదయుతులై | 11-21 |
| రాజీవసదృశనయన! వి, రాజితసుగుణా! | 11-125 |
| 'రూపు లేని నీకు | 11-114 |
| వచ్చిన మునిసంఘములకు, విచ్చలవిడి | 11-13 |
| 'వర్ణాశ్రమధర్మంబుల, నిర్ణయకర్ములఁ జెడక | 11-47 |
| "వర్ణాశ్రమధర్మంబులు, నిర్ణయముగ నానతిమ్ము | 11-106 |
| వారల కిట్లను 'మీరలు, | 11-39 |
| వారు నారాయణాశ్రమంబునకు నతని | 11-65 |
| 'వాలాయము యదుకుల ని, | 11-22 |
| విదితుండై సకలామరుల్ గొలువ | 11-6 |
| వినుము నృపాలక! సెప్పెద, | 11-29 |
| 'వినుము స్వాయంభువుండను మనువునకును, | 11-34 |
| శ్రీనాయక! నీ నామము, | 11-17 |
| సంతతంబును గృష్ణ సంకీర్తనంబులు | 11-44 |
| సర్వభూతమయుండైన సరసిజాక్షుఁ డతండె | 11-46 |
| సీతాపతి! లంకే | 11-1 |
| సుర గరుడ ఖచర | 11-83 |
| సూర్యోదయాస్తమయంబులం బ్రతిదినంబు నాయువు | 11-54 |

'హరిదాసుల మిత్రత్వము, మురరిపుకథ 11-55
'హరిపాదకమల సేవా, పరులగు 11-9
హరిముఖ బాహూరు వరపదాబ్జములందు 11-74


## ద్వాదశస్కంధము


అంత లోకేశున కవసానకాలంబు, 12-23
అందు రాజులప్రకారం బెఱింగించెద; 12-4
అందు వర్చసుండు భరద్వాజుండు 12-45
అట్లు గావున నసంఖ్యంబులైన 12-28
అట్లుగాన జనంబులు లోభులై 12-11
అది యెయ్యది యనిన 12-41
అని యీరీతి నుతించి 12-51
అని వినుతించి 'దేవా, 12-37
అనిన నట్లకాక యని 12-13
అనిన శంకరుండును శాంకరీసమేతుండయి 12-39
అనిన శుకయోగీంద్రునకు రాజేంద్రుం 12-20
అనినఁ 'గల్పప్రళయప్రకారం బె' 12-22
ఇట్లు దపంబు సేయ 12-34
ఇట్లు వర్షశతంబు వర్ష 12-24
ఇది శ్రీ పరమేశ్వరకరుణా 12-54
ఈ జగం బేలు 12-17
ఈ మాసంబున ఋచీకతనయుండు 12-43
ఉత్తమశ్లోకుఁ డన నెవ్వఁ 12-19
ఏను మృతుండ నౌదునని 12-25
క్రతునామంబు ధరించియుఁ, జతురతఁబాలించుచుండుఁ 12-44
గజతురగాదిశ్రీ లను, నిజ 12-7
గర్వాంధు లయిన నరపతులం 12-18
చతురత నీ క్షితి 12-5
జగదవనవిహారీ, శత్రులోక ప్రహారీ 12-53
జగము రక్షింప జీవులఁ 12-35
జనకసుతాహృచ్చోరా!, జనకవచోలబ్ధ విపినశైల 12-52
తొల్లిటి యుగమునఁ దపములఁ, 12-31

| | |
|---|---|
| దినదినమును ధర్మంబులు, ననయము | 12-9 |
| ధరలోఁ ద్వష్టృహ్వాయమును, నిరవుగ | 12-42 |
| ధర్మము సత్యముఁ గీర్తియు, | 12-16 |
| ధారుణిఁ బారాశర్యున, కార్యులు | 12-29 |
| నరపతులమహిమ నంతయు, నురగాధిపుఁడైన | 12-6 |
| నరవర! తొంటి భూపతుల | 12-14 |
| నరవర! యీ ప్రశ్నములకు, | 12-3 |
| నిలిచిన శంకరుం గనియు | 12-38 |
| పుష్కరంబందు ద్వారకాపురమునందు, మథురయందును | 12-46 |
| బలవంతుఁ డైనవాఁడే, కులహీనుండైన | 12-10 |
| బలిభిన్ముఖ్య దిశాధినాథవరులున్ ఫాలాక్షబ్రహ్మాదులున్ | 12-36 |
| 'భూవినుత, బ్రహ్మచర్యము, దా | 12-33 |
| మరుదశనపతిశయన | 12-1 |
| మఱియు నష్టాదశపురాణంబులందలి గ్రంథసంఖ్య | 12-48 |
| మఱియుఁ గణ్వవంశజుండగు సుశర్ముండను | 12-8 |
| మహనీయ గుణగరిష్ఠులగు న | 12-2 |
| 'మునినాథ! యే విధంబున, | 12-12 |
| మూఁడవ యుగమున నెంతయు, | 12-21 |
| 'మృతియును జీవనంబు నివి | 12-27 |
| రాజేంద్రా! జరామరణ హేతుకంబయిన | 12-26 |
| లోకంబులు గల్పాంతసమయంబునం గబంధమయంబు | 12-32 |
| వారలు ఋగ్యజుస్సామాథర్వంబు లనియెడు | 12-30 |
| శంతనుని యనుజుం డగు | 12-15 |
| శ్రీరమణీరమణకథా, పారాయణచిత్తునకును బతికిఁ | 12-47 |
| సకలగుణాతీతు సర్వజ్ఞు సర్వేశు | 12-50 |
| సకలాగమార్థపారగుఁ, డకలంక గుణాభిరాముఁ | 12-49 |
| హరికథలు హరిచరిత్రము, హరిలీలావర్తనములు | 12-40 |


❊ ❊ ❊